# ప్రభుత్వ అర్థశాస్త్రము

## బి.ఎ. ఆర్థిక శాస్త్రము - మూడవ సంవత్సరము, పేపరు - 3, Opt. (A)


రచయితలు

**డా॥ డి. కైలాసరావు,** ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
రీడరు మరియు శాఖాధ్యక్షులు
ఆర్థిక శాస్త్ర విభాగము
శారదా కళాశాల, విజయవాడ

**డా॥ ఎ. రాజశేఖర్,** ఎం.ఎ., యం.ఫిల్., పిహెచ్.డి.
రీడరు మరియు శాఖాధ్యక్షులు
ఆర్థికశాస్త్ర విభాగము
హిందూ కళాశాల, గుంటూరు

**డా॥ యం. రాజశేఖరబాబు,** ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
రీడరు, ఆర్థిక శాస్త్ర విభాగము
వి.టి.జె.యం. అండ్ ఐ.వి.టి.ఆర్. డిగ్రీ కళాశాల,
మంగళగిరి

**శ్రీ బి. కోటేశ్వరరావు,** ఎం.ఎ., యం.ఫిల్.,
ఉపన్యాసకులు, ఆర్థికశాస్త్ర విభాగము
శారదా కళాశాల,
విజయవాడ

సంపాదకులు

**డా॥ డి. కైలాసరావు,** ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
రీడరు మరియు శాఖాధ్యక్షులు
ఆర్థిక శాస్త్ర విభాగము
శారదా కళాశాల, విజయవాడ ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సమన్వయకర్త

**ఆచార్య ఎమ్. వి. ఎన్. శర్మ,** LL.B., MPS., M.A., M.A., Ph.D.,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ & అప్లైడ్ ఎకనామిక్స్,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

Director

**Dr. Nagaraju Battu**
MBA, MHRM, LLM, M.Sc. (Psy), MA(Soc.)., M.Ed., M.Phil., Ph.D.
Dept. of HRM



**దూరవిద్యా కేంద్రము**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జుననగర్ - 522 510

Ph : 0863 - 2293299, (08645) 211023, 211024, Cell : 98482 85518
E-mail : anucde@yahoo.com
Website : www.nagarjunauniversity.ac.in

# B.A. Public Economics

First Edition : 2005

New Impressions : 2021

No. of Copies : 11657

(C) **Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of UG., Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by :
**Dr. Nagaraju Battu,**
*Director,*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

*Printed at :*
**M/s Sri Sainadh Printers,**
Vijayawada

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేనివారికి, వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయసాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, ఎకడమిక్ కోఆర్డినేటర్లకు, ఎకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్,** *M.A., M.Phil., Ph.D.*
కులపతి (FAC)
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

B.A. Final Year Economics

# PAPER - III (A) OPTIONAL : PUBLIC ECONOMICS

## SYLLABUS

**Module 1 : Role of Government :**

Principle of Maximum social advantage - changing perspective about role of Government - Public Vs. Private Sector-Budget as a means of operationalising the planning process.

**Module 2 : Public Revenue - Taxation :**

Revenue sources and classification - Direct and Indirect Theory of incidence of Taxation, Economic efforts of taxation proportional & progressive taxes.

**Module 3 : Public Expenditure :**

Social and economic objectives and effects - theories of Public expenditure - Wagner's law and Peacock - Wisemen Hypothesis.

**Module 4 : Public Dept :**

Internal and External Dept. - Economic and Social effects - methods of redemption.

**Module 5 : Public Enterprises :**

Problems of organization and management - Pricing policies.

**Module 6 : Indian Public Finance**

Budget - components of Budget and its role.

Structure and growth of tax system - personal income and corporate income taxation - Modified value - Added Tax - Trends in the Non-tax revenue in India Generation of Indian Public expenditure problems Indian Public Dept. Import of External dept. on Indian Economy.

**BOOKS RECOMMENDED :**


| | | | |
|---|---|---|---|
| 1. | R.A. Musgrave | : | Public Finance |
| 2. | Palton | : | Public Finance |
| 3. | R.N. Bhrgav | : | Indian Public Economy |
| 4. | Andley & Sundaram | : | Public Economy |
| 5. | U.K. Hicks | : | Public Finance |
| 6. | J.M. Buchanan | : | The Public Finance |
| 7. | R. Chellaiah | : | Fiscal Policy in under developed countries. |

B.A./B.Com. Degree Examination May 2006
(Examination at the end of Final Year)

Paper - II - Economics

## PAPER III - PUBLIC ECONOMICS

Time : Three Hours

Maximum : 100 marks

### PART - A - (2 x 20 = 40 marks)

***Answer any TWO of the following***

1. Critically analyse the principle of maximum social advantage and explain the tests or advantage.
   గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతమును నిశితంగా విశ్లేషించి ప్రయోజన పరీక్షలను వివరింపుము.
2. Explain the meaning of incidence and discuss the theory of tax incidence.
   అంతిమభార మనగానేమో వివరించి, పన్ను అంతిమభార సిద్ధాంతమును చర్చించుము.
3. Discuss various methods of public debt redemption.
   ప్రభుత్వ ఋణ విమోచన వివిధ పద్ధతులను చర్చించుము.

### PART - B (3 x 15 = 45 marks)

Answer any THREE of the following

4. Analyse the changing perspective of the role of government.
   ప్రభుత్వ పాత్ర యొక్క మారుచున్న దృక్పథమును విశ్లేషించుము.
5. Explain the 'Displacement effect' with regard to growth of public expenditure.
   ప్రభుత్వ వ్యయము పెరుగుదలకు సంబంధించి తొలగింపు ఫలితమును వివరింపుము.
6. Discuss about privatisation of public enterprises.
   ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ గూర్చి చర్చించుము.
7. Explain elaborately the marginal pricing policy of public enterprises.
   ప్రభుత్వరంగ సంస్థల యొక్క ఉపాంతధర సిద్ధాంతమును గూర్చి విపులంగా వివరింపుము.
8. Discuss the applicability of zero Base Budget in the developing nations.
   అభివృద్ధి చెందుతున్న దేశములలో పునరావృత బడ్జెటు అమలు గురించి చర్చించుము.
9. Analyse the important defects in the Indian tax system.
   భారత పన్ను వ్యవస్థలోనున్న ముఖ్యమైన లోపాలను విశ్లేషించుము.
10. Explain the role of Central Finance Commission in reducing inter-state revenue inequalities.
    రాష్ట్రాల మధ్య రాబడి అసమానతలను తగ్గించుటలో కేంద్ర ఆర్థిక సంఘం పాత్రను వివరింపుము.

PART - C (3 x 5 = 15 marks)

Answer any THREE of the following

11. Planned Development.

    ప్రణాళికాబద్ధ అభివృద్ధి.

12. Progressive tax system.

    పురోగమన పన్ను విధానము.

13. Sinking fund.

    ఋణ విమోచన నిధి.

14. Performance Budget.

    పనితీరు బడ్జెటు.

15. Value Added Tax.

    విలువ ఆధారిత పన్ను.

16. Non-plan Grants.

    ప్రణాళికేతర సహాయనిధులు.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రభుత్వ అర్థ శాస్త్ర నిర్వచనము పరిధి.... | 1.1 - 1.7 |
| 2. | గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతము | 2.1 - 2.8 |
| 3. | ప్రభుత్వ ఆదాయ వనరులు | 3.1 - 3.12 |
| 4. | పన్ను విధింపు న్యాయం | 4.1 - 4.19 |
| 5. | పన్నుల భారం | 5.1 - 5.9 |
| 6. | పన్నుల ప్రభావము | 6.1 - 6.14 |
| 7. | భారతదేశ పన్నుల వ్యవస్థ | 71. - 7.27 |
| 8. | ప్రభుత్వ వ్యయం - వర్గీకరణ - నియమాలు | 8.1 - 8.9 |
| 9. | ప్రభుత్వ వ్యయ సిద్ధాంతాలు | 9.1 - 9.8 |
| 10. | ప్రభుత్వ వ్యయ ప్రభావాలు | 10.1 - 10.7 |
| 11. | భారత దేశంలో ప్రభుత్వ వ్యయం | 11.1 - 11.5 |
| 12. | ప్రభుత్వ ఋణము | 12.1 - 12.10 |
| 13. | కోశ విధానం | 13.1 - 13.14 |
| 14. | ఫెడరల్ విత్త విధానం | 14.1 - 14.8 |
| 15. | కేంద్ర, రాష్ట్ర విత్త సంబంధాలు | 15.1 - 15.14 |
| 16. | ప్రభుత్వ రంగం | 16.1 - 16.12 |

పాఠం:1

# ప్రభుత్వ అర్థశాస్త్ర నిర్వచనాలు, పరిధి ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం

## 1.0. లక్ష్యం:

ఈ భాగంలో ప్రభుత్వ అర్థశాస్త్ర నిర్వచనాలు, పరిధి, ప్రభుత్వ విత్తం, ప్రైవేటు విత్తం గురించి వివరించడం జరిగింది. ఈ భాగం పూర్తయ్యేసరికి విద్యార్థులు ఈ క్రింది పాఠ్యాంశాలను అవగాహన చేసుకొంటారు.

* వివిధ ప్రభుత్వ అర్థశాస్త్ర నిర్వచనాలు
* ప్రభుత్వ అర్థశాస్త్ర పరిధి
* ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం పోలికలు
* ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం తేడాలు

## విషయసూచిక


1.1. విషయ పరిచయము (Introduction)
1.2. నిర్వచనం - ఆవశ్యకత
1.3. ప్రభుత్వ అర్థశాస్త్ర పరిధి.
1.4. ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం పోలికలు
1.5. ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం తేడాలు.
1.6. సారాంశము
1.7. గుర్తుంచుకోవలసిన విషయములు
1.8. కఠిన పదాలు
1.9. నమూనా ప్రశ్నలు
1.10. చదువదగిన గ్రంథాలు.


## 1.1. విషయ పరిచయము:

ప్రతిశాస్త్రానికి నిర్వచనాలుంటాయి. ఆ నిర్వచనాల ద్వారా ఆ శాస్త్ర స్వభావం తెలుస్తుంది. సాధారణంగా ప్రతి శాస్త్ర సిద్ధాంతాన్ని కొన్ని భాగాలుగా విభజించి అధ్యయనం చేస్తారు. కొన్ని ప్రత్యేక అవసరాల దృష్ట్యా ప్రభుత్వ అర్థశాస్త్రాన్ని ప్రభుత్వ విత్తం, ప్రైవేటు విత్తంగా విభజించటం జరిగింది. ప్రస్తుతం ప్రభుత్వ అర్థశాస్త్రం నిర్వచనాలు, ప్రభుత్వ అర్థశాస్త్ర స్వభావం, పరిధి, ప్రభుత్వ విత్తం, ప్రైవేటు విత్తం గురించి పరిశీలిద్దాం.

## 1.2. నిర్వచనం - ఆవశ్యకత:

ఒక శాస్త్ర నిర్వచనాన్ని బట్టి దాని హద్దులు నిర్ణయించబడతాయి. నిర్వచనం ద్వారా ఆ శాస్త్రంలో పరిశీలించే సమస్యల స్వభావం తెలుస్తుంది. నిర్వచనమనేది లేకపోతే ఆ శాస్త్ర పరిధిలో లేని విషయాలు కూడా పరిశీలించవలసి వస్తుంది. అందువలన ఏ శాస్త్రానికైనా ఒక నిర్దిష్టమైన లేదా ఒక స్పష్టమైన నిర్వచనం అవసరం. ప్రభుత్వ అర్థశాస్త్రంలోని నిర్వచనాలను పరిశీలిస్తే దాని ప్రాధాన్యత తెలుస్తుంది.

సంప్రదాయపరంగా వాడుతున్న "ప్రభుత్వ విత్త శాస్త్రం" అనే పదాన్ని అర్థశాస్త్రవేత్తలు అనేక రకాలుగా నిర్వచించిరి. డాల్టన్ (Dalton) ఉద్దేశ్యంతో "ప్రభుత్వాల ఆదాయ వ్యయాలను గురించి, వీటి మధ్య సమతూకం సాధించుట గురించి అధ్యయనం చేసేదే ప్రభుత్వ విత్తశాస్త్రం".

షిరాస్ (Shirras) ఉద్దేశ్యంలో "ప్రభుత్వాలు ఆదాయాలను సమకూర్చుకోవటంలో దానిని వ్యయం చేయటంలో ఇమిడి ఉన్న సూత్రాల అధ్యయనమే ప్రభుత్వ విత్త శాస్త్రం".

శ్రీయులు హిక్స్ ప్రకారం "ప్రభుత్వం ప్రజల సమిష్టి కోర్కెలను తీర్చుటకు అవసరమైన వనరులను సమకూర్చుకునే పద్ధతుల పరిశీలనే ప్రభుత్వ విత్తశాస్త్రం".

## 1.3. ప్రభుత్వ అర్థశాస్త్ర పరిధి:

ప్రభుత్వ అర్థశాస్త్ర పరిధిని నిర్దిష్టంగా తెలియజేయుట కష్టసాధ్యమయినది. కాని ప్రభుత్వ విత్తశాస్త్ర పరిధి లేదా విషయ వస్తువును నాలుగు భాగాలుగా విభజించవచ్చును. అవి (1) ప్రభుత్వ ఆదాయం (2) ప్రభుత్వ వ్యయం (3) ప్రభుత్వ ఋణం (4) విత్త పరిపాలన. మొదటి భాగంలో ప్రభుత్వ ఆదాయ మార్గాల గురించి తెలుసుకుంటాము. ప్రభుత్వానికి ముఖ్య ఆదాయమార్గం పన్నులు. అందువలన పన్నుల సిద్ధాంతాలు, మంచి పన్నుల లక్షణాలు పన్ను నియమాలు ఉత్పత్తి, ఉద్యోగిత, ఆదాయపంపిణీలపై పన్నుల ప్రభావం ఈ భాగంలో తెలుసుకుంటాము. రెండో విభాగంలో ప్రభుత్వ వ్యయ స్వభావాన్ని, దాని నియమాలను సిద్ధాంతాలను, ఉత్పత్తి ఉద్యోగిత ఆదాయ పంపిణీలపై వ్యయప్రభావం తెలుసుకుంటాం. మూడవ విభాగంలో ఋణసేకరణ మార్గాలను, వాటి స్వభావ స్వరూపాలను, ఋణ విమోచనా పద్ధతులను, ఆర్థిక వ్యవస్థపై ఋణప్రభావాన్ని తెలుసుకోవచ్చు. నాలుగో విభాగంలో బడ్జెట్ తయారీకి సంబంధించిన విషయాలను పరిశీలిస్తాం.

ఇటీవల కాలంలో ప్రభుత్వ విత్తశాస్త్రం అనే పేరు ఎక్కువ ప్రచారంలో ఉంది. ప్రభుత్వ విత్తశాస్త్రాన్నే పబ్లిక్ అర్థశాస్త్రంగా పరిగణించడం జరుగుతుంది. ఈ రెండింటిని పర్యాయపదాలుగా వాడుతున్నప్పటికి వీటి మధ్య తేడా లేకపోలేదు. పబ్లిక్ అనే పదం ప్రజల లేదా ప్రజలకు సంబంధించినది. విస్తృతార్థంలో పబ్లిక్ అంటే ప్రభుత్వం అని కూడా అంటాము. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య విడదీయలేని సంబంధం ఉంది. విత్తం అంటే ద్రవ్యం, పరపతికి సంబంధించినది. కనుక ప్రభుత్వ విత్తశాస్త్రాన్ని ప్రభుత్వ ద్రవ్య, పరపతి వనరులకు సంబంధించినదిగా భావిస్తాము. ప్రభుత్వ విత్తశాస్త్రం ఆదాయ వ్యయవనరులను విశ్లేషించటమే కాక ప్రభుత్వ లక్ష్యాలను, విధానాలను పరిగణలోనికి తీసుకోవలసి ఉంటుంది.

ఆధునిక ప్రభుత్వ లక్ష్యాలలో, వాటి పాత్రలో గణనీయమైన మార్పులు సంభవించటం వలన ప్రభుత్వ విత్తశాస్త్రం కంటే పబ్లిక్ అర్థశాస్త్రం లేదా ప్రభుత్వ అర్థశాస్త్రం అనే పేరు వాడటం సమంజసంగా ఉంటుంది. ప్రతి ఆర్థికవ్యవస్థ కూడా ప్రజా సంక్షేమమే తన ధ్యేయంగా ప్రకటించుకొంటుంది. ప్రైవేటురంగాని కంటే ప్రభుత్వ రంగానికి అధిక ప్రాధాన్యత కల్పించటం, ప్రైవేటు రంగ కార్యకలాపాలను ప్రభుత్వ పర్యవేక్షణలోనికి తీసుకొని రావటం, బడ్జెట్ ద్వారా వివిధ తరగతుల ప్రజల జీవితాలను ప్రభావితం చేయటం, త్వరితగతిన ఆర్థికాభివృద్ధి సాధించటానికి అభివృద్ధి చెందుతున్న దేశాలు నడుం కట్టటం, ఆర్థికవృద్ధిని నిలబెట్టడానికి అభివృద్ధి చెందిన దేశాలు తపన పడటం, ఆర్థిక సంక్షోభాల నుంచి బయటపడటానికి వివిధ దేశాలు ఆరాటపడటం, దారిద్ర్యం, నిరుద్యోగం, సాంఘిక, ఆర్థిక అసమానతలు తొలగించటానికి ప్రభుత్వం చేసే కృషి మొదలగున్నవి ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నవి. ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలను అధ్యయనం చేసే శాస్త్రంగా పబ్లిక్ అర్థశాస్త్ర స్వభావాన్ని కూడా ఈ పై విషయాలు విశదపరుస్తున్నాయి.

## 1.4. పబ్లిక్ అర్థశాస్త్రం - పబ్లిక్ రంగం నిర్వహించవలసిన పనులు:

ప్రభుత్వ రంగం నిర్వహించవలసిన పనులను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చును. (1) మార్కెట్ సూత్రం ప్రకారం చేయటానికి వీలుకానివి (2) మార్కెట్ సూత్రం వలన ఏర్పడే అవకతవకలను సరిచేయటానికి అవసరమైనవి.

మొదటి సూత్రాన్ని అనుసరించి ప్రభుత్వ రంగం ప్రైవేటు రంగానికి అనుబంధంగా ఉండటం. రండవ సూత్రాన్ని అనుసరించి ప్రైవేటురంగం వలన ఆచరణలో ఏర్పడే అవాంఛనీయ పరిస్థితులను సరిదిద్దటం.

ప్రభుత్వం నిర్వహించే పనులను ఆచార్య మస్‌గ్రేవ్ నాలుగు రకాలుగా విభజించినాడు. అవి (1, కేటాయింపు విధులు (2) వాణిజ్య విధులు (3) పంపిణీ విధులు (4) స్థిరీకరణ విధులు.

**1) కేటాయింపు విధులు:** మార్కెట్ విధానంలో వనరుల కేటాయింపు లాభోద్దేశాన్ని అనుసరించి జరుగుతుంది. ఉదా॥ ఒక సంస్థ ఉపాంత రాబడి ఉపాంత వ్యయానికి సమానమయినపుడు గరిష్ట లాభాన్ని పొందుతుంది. ఈ నియమాన్ని పాటించక పోతే వనరుల కేటాయింపు ఆశించిన విధంగా జరగదు. కనుక వనరుల కేటాయింపును మార్పు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ప్రభుత్వం సామాజిక కోర్కెలను సంతృప్తి పరచటానికి పూనుకొన్నప్పుడు దీనివలన చేకూరే ప్రయోజనం సమాజం మొత్తానికి చెందుతుంది. సాంఘిక కోర్కెలను తృప్తిపరిచే వస్తువులను పబ్లిక్ వస్తువులందరు వీటికి ధర చెల్లించినా చెల్లించకపోయినా వ్యక్తులు వాటిని అనుభవించటాన్ని అరికట్టలేము.

i) దేశ రక్షణ, శాంతి భద్రతలను కాపాడటం, న్యాయస్థానాల నిర్వహణ వంటి విధులు ప్రభుత్వమే నిర్వహించగలదు. ఇవి ప్రైవేటు రంగానికి సాధ్యపడేవి కావు.

ii) శ్రేష్టమైన కోర్కెలను తృప్తిపరచటం వలన సమాజానంతటకి లాభం చేకూరటమే కాకుండా వ్యక్తులకు కూడా కొంత ప్రత్యేక ప్రయోజనం చేకూరుతుంది.

ఉదా॥ ప్రభుత్వం విద్య, వైద్య, ఆరోగ్య సౌకర్యాలపై చేసే వ్యయం వలన సమాజం అభివృద్ధి చెందుతుంది.

iii) సమాజానికి హాని కలిగించే వస్తువులయిన సారాయి, మరి ఇతర మత్తుపదార్థాల ఉత్పత్తులను తగ్గించటం లేదా వాటిని నిషేధించటం ప్రభుత్వమే చేయవలసి ఉంటుంది.

iv) లాభాపేక్షతో వ్యాపారం చేసేటప్పుడు ఉత్పత్తి తక్కువగా ఉండవచ్చు. ఇటువంటి వస్తువుల ఉత్పత్తిని ప్రభుత్వమే చేపట్టవలసి వస్తుంది.

v) పరిపూర్ణ పోటి పరిస్థితులు లోపించినపుడు వనరుల కేటాయింపు ఆదాయ పంపిణీ సక్రమంగా ఉండవు. కనుక ప్రభుత్వమే ఏకస్వామ్యాలను అరికట్టవలసి వస్తుంది.

**2) వాణిజ్య విధులు:** ప్రభుత్వం కొన్ని వస్తుసేవలను ఉత్పత్తి చేసి విక్రయించే బదులు ప్రభుత్వమే వాటిని ఉచితంగా సరఫరా చేసి వాటికయ్యే ఖర్చులను పన్నుల ద్వారా రాబట్టటం మంచిది. ఉదా॥ రోడ్డు నిర్మాణం. దీర్ఘ ఫలన కాలం కలిగిన పరిశ్రమలను నెలకొల్పటానికి ప్రైవేటు వ్యక్తులు ముందుకు రారు. కనుక వీటిని ప్రభుత్వమె నిర్వహించటం మంచిది.

**3) పంపిణీ విధులు:** సమాజంలో వెనుకబడిన వర్గాల వారి సంక్షేమాన్ని పెంపొందించటానికి ప్రభుత్వం అనేక చర్యలను చేపడుతుంది. ఆదాయ సంపదల పంపిణీలోని అసమానతలను తగ్గించటానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది.

**4) స్థిరీకరణ విధులు:** మార్కెట్ విధానంలో వనరులు కేటాయింపు అభిలషణీయంగా ఉంటుందని, ధరలను స్థిరీకరిస్తుందని, ఆర్థికవ్యవస్థలో స్థిరీకరణ నెలకొల్పుతుందని చెప్పలేము. కానీ ప్రభుత్వం స్థిరత్వంతో కూడిన వృద్ధిని సాధించగలదు.

## 1.5. ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం:

ప్రభుత్వ ఆర్థికకార్యకలాపాలు అధ్యయనాన్ని పబ్లిక్ అర్థశాస్త్రం అందురు. ప్రైవేటు వ్యక్తులు ఆర్థికకార్యకలాపాల అధ్యయనాన్ని ప్రైవేటు అర్థశాస్త్రం అంటారు వ్యక్తులకైనా, ప్రైవేటు సంస్థలకైనా, ప్రభుత్వానికైనా తమతమ ఆర్థికకార్యకలాపాల నిర్వహణకు విత్తం ఎంతో అవసరము. పబ్లిక్ విత్తానికి, ప్రైవేటు విత్తానికి మధ్య పోలికలు, తేడాలు ఉన్నాయి.

**1. ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం మధ్య పోలికలు:**

**1) కోరికలను తృప్తి పరచటం:** ప్రభుత్వ విత్తం ప్రైవేటు విత్తం లక్ష్యాలు కోరికలను సంతృప్తి పరచుట. ప్రైవేటు విత్తం వ్యక్తుల కోరికలను తృప్తి పరచటానికి, పబ్లిక్ విత్తం సాంఘిక లేదా సామాజిక కోర్కెలను సంతృప్తి పరచటానికి ప్రయత్నిస్తుంది.

**2) ఋణం:** వ్యక్తులైనా, ప్రభుత్వం అయినా తమ వ్యయం ఆదాయం కంటే ఎక్కువగా ఉంటే ఋణాన్ని చేయవలసి ఉంటుంది. ఆదాయం తక్కువగా ఉండి, పెరుగుచున్న ఖర్చులను తీర్చుకోవాలంటే వ్యక్తులకు, ప్రభుత్వానికి ఋణం చేయటం తప్పనిసరి అవుతుంది.

**3) ఆదాయ పరిమాణం:** పబ్లిక్, ప్రైవేటు విత్తవిషయాలకు సంబంధించి ఆదాయ పరిమాణం స్థిరంగా ఉండదు. ఆదాయం పెరగటం గాని లేదా తగ్గటం గాని జరుగుతుంది. పబ్లిక్, ప్రైవేటు విత్తాలను గురించి ప్రత్యేక అధ్యయనం చేయవలసిన అవసరం ఉండదు. కాని వాస్తవంగా ఈ రెండింటికి మధ్య పోలికల కంటె తేడాలే అధికంగా ఉన్నాయి.

**2. ప్రభుత్వ విత్తం - ప్రైవేటు విత్తం మధ్య తేడాలు:**

ప్రభుత్వ విత్తం, ప్రైవేటు విత్తాల మధ్య ఈ క్రింద తెలియజేసిన వ్యత్యాసాలు కలవు.

**1) ఆదాయ వ్యయాల సర్దుబాటు:** ప్రభుత్వం ముందుగా తాను చేయవలసిన వ్యయాన్ని నిర్ణయించుకొని ఆ తరువాత వ్యయానికి తగిన ఆదాయాన్ని రాబట్టుకోవటానికి ప్రయత్నిస్తుంది. అనగా ప్రభుత్వ విత్త విషయంలో ప్రభుత్వ వ్యయం ఆదాయపరిమాణాన్ని నిర్ణయిస్తుంది. ప్రభుత్వం తన ఆదాయాన్ని వ్యయానికి సరిపోయే విధంగా సర్దుబాటు చేస్తుంది. కాని ప్రైవేటు వ్యక్తులు ముందుగా తమ ఆదాయం ఎంతో చూసుకొని దాన్నిబట్టి వ్యయాన్ని సర్దుబాటు చేసుకొంటారు. వ్యక్తి తన వ్యయాన్ని ఆదాయానికి సరిపోయే విధంగా సర్దుబాటు చేసుకొంటాడు. ఈ రెండింటికి మధ్యగల తేడా అన్ని సమయాల్లో నిజం కాదు. వ్యక్తులు కూడా ఒక్కొక్కసారి తమ ఆదాయాన్ని వ్యయానికి సరిపోయేటట్లు సర్దుబాటు చేసుకోవలసి ఉంటుంది. ఉదా॥ నిత్యావసరాలపై చేసే ఖర్చును తగ్గించుకోవటం సాధారణంగా వీలుపడదు. ఇటువంటి పరిస్థితులలో వ్యక్తులు తమ ఖర్చులకు సరిపోయేటట్లు ఆదాయాన్ని పెంచుకోవలసి ఉంటుంది. అదేవిధంగా ప్రభుత్వం కూడా కొన్ని సమయాలలో వ్యయాన్ని తన ఆదాయానికి సరిపోయేటట్లు సర్దుబాటు చేసుకొంటుంది.

**2) వ్యయస్వభావం:** ప్రభుత్వ వ్యయం యొక్క ముఖ్య లక్షణం "తప్పనిసరి వ్యయం" అని షిరాస్ అభిప్రాయపడెను. ప్రభుత్వం కొన్ని వ్యయాలను తప్పనిసరిగా చేయవలసి ఉంటుంది. ఉదా॥ దేశరక్షణ, సాధారణ పరిపాలన మొదలగు వాటిపై చేసే వ్యయం. కనుక ప్రభుత్వ విత్తం విషయంలో ప్రభుత్వ వ్యయం తప్పనిసరి. కాని ప్రైవేటు వ్యక్తుల విషయంలో ఇటువంటి నిర్బంధ వ్యయాలు ఉండవు. కాని వ్యక్తులకు కూడా కొన్ని వ్యయాలు తప్పనిసరి అవుతాయి, ఉదా॥ ప్రతివ్యక్తి కూడా ఆహారం, వస్త్రం, నివాసం మొదలగు వాటిపై కొంత కనీస మొత్తాన్ని వెచ్చించవలసి ఉంటుంది. కనుక అన్ని వ్యయాలు అన్నివేళలా తప్పనిసరి కావు.

**3) సమోపాంత ప్రయోజన సిద్ధాంతము:** ఒక వ్యక్తి గరిష్ఠ ప్రయోజనాన్ని పొందుటకు వీలుగా అనేక వస్తుసేవలపై తాను వ్యయం చేస్తూ, ఆ వ్యయాలనుంచి వచ్చే ఉపాంత ప్రయోజనాలన్నీ సమానంగా ఉండేటట్లు చూసుకొంటాడు. వ్యక్తి తాను ఖర్చు చేసే ఆఖరి రూపాయి వలన వచ్చే ఉపాంత ప్రయోజనాలు సమానమయ్యే వరకు ఖర్చు చేస్తాడు. ఇటువంటి పరిస్థితులలో మొత్తం ప్రయోజనం గరిష్ఠమవుతుంది. కాని ప్రభుత్వం కూడా గరిష్ఠ సాంఘిక ప్రయోజనాన్ని పొందాలనుకొంటుంది. కాని ప్రభుత్వానికి ఇది సాధ్యపడదు. ఉదా॥ ప్రభుత్వం రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, విద్య వైద్య ఆరోగ్య సదుపాయాలపై చేసే ఖర్చునుంచి ఎవరెవరికి ఎంతెంత ప్రయోజనం లభించిందో అంచనా వేయుట కష్టసాధ్యమవుతుంది. కనుక ప్రైవేటు వ్యక్తులు సమోపాంత ప్రయోజన సూత్రాన్ని పాటించటానికి ఎక్కువగా అవకాశం ఉంటుంది. ఈ అవకాశం ప్రభుత్వానికి

ఉండదు.

**4) బడ్జెట్ స్వభావం:** సాధారణంగా వ్యక్తులు తమ ఆదాయంలో సాధ్యమయినంతవరకు తక్కువ వ్యయం చేయటానికి ప్రయత్నిస్తారు. అనగా వ్యక్తుల విషయంలో మిగులు బడ్జెట్ మంచిది. కాని ప్రభుత్వ విషయంలో ఎల్లవేళలా మిగులు బడ్జెట్‌ను అనుసరించటం వీలుపడదు. ఉదా॥ ఆర్థికాభివృద్ధి, యుద్ధం మొదలగు సమయాలలో లోటు బడ్జెట్ విధానాన్ని పాటించక తప్పదు. ఒకవేళ ప్రభుత్వం మిగులు బడ్జెట్‌ను పాటించాలనుకొంటే ప్రజలపై అధికంగా పన్నులు విధించి, తక్కువ మొత్తంలో వ్యయం చేయవలసి ఉంటుంది. దీనివలన ప్రజా సంక్షేమము కుంటుపడే ప్రమాదమున్నది. కాని ప్రభుత్వం కూడా సాధారణ పరిస్థితులలో సంతులిత బడ్జెట్ విధానాన్ని పాటించటం మంచిది.

**5) వనరుల స్వభావం:** వ్యక్తుల విషయంలో ద్రవ్య వనరులు పరిమితంగా ఉంటాయి. ప్రభుత్వ విషయంలో ద్రవ్య వనరుల లభ్యత అపరిమితంగా ఉంటుంది. ప్రభుత్వం దేశంలోని ప్రజల నుంచి ఋణాలను చేసి, ఇతర దేశాల నుంచి ఋణాలను తీసుకొనుట ద్వారా అవసరమైన మేర ద్రవ్య వనరులను సమకూర్చుకొనగలుగుతుంది. కాని వ్యక్తుల విషయంలో ఇది సాధ్యపడదు. అవసరమైతే వ్యక్తుల విషయంలో ఇది సాధ్యపడదు. అవసరమైతే ప్రభుత్వం లోటు ద్రవ్య విధానాన్ని అనుసరించి అనగా ద్రవ్యాన్ని ముద్రించి ద్రవ్య వనరులను పెంచుకోగలుగుతుంది. కాని వ్యక్తులకు ఏ విధంగాను కూడా ద్రవ్యాన్ని ముద్రించే హక్కు లేదు. ప్రభుత్వం నిర్బంధ పద్ధతులను అనుసరించి ప్రజల నుంచి ద్రవ్యాన్ని రాబట్టుకొనవచ్చును. కాని ప్రజలకు ఇటువంటి అవకాశం లేదు. కనుకనే ప్రైవేటు వ్యక్తుల విషయంలో ద్రవ్య వనరులు పరిమితంగా ఉంటాయి. ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో వనరులను సమీకరించుకొనగలుగుతుంది.

**6) వ్యయం యొక్క ఉద్దేశంలో తేడా:** సాధారణంగా వ్యక్తులు లాభాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తారు. కనుక ప్రైవేటు వ్యక్తుల ముఖ్య ఉద్దేశం లాభార్జన. కాని ప్రభుత్వ ముఖ్యోద్దేశం ప్రజాసంక్షేమమే గాని, లాభాపేక్ష కాదు. ఉదా॥ ప్రజారోగ్యం, వైద్యసదుపాయాలు, విద్య, సాంఘిక సంక్షేమం, మంచినీటి సరఫరా మొదలగు వాటిపై చేసే వ్యయం వలన ఎటువంటి లాభం రాదు. కాని ఈ సేవలు ప్రజలశ్రేయస్సును ఎంతగానో పెంపొందిస్తాయి. కనుక ఇటువంటి సేవలపై ప్రభుత్వం చేసే వ్యయం లాభోద్దేశంతో కాకుండా ప్రజాసంక్షేమం దృష్ట్యా చేస్తుంది.

**7) భావి అవసరాలకు ప్రాధాన్యత:** ప్రైవేటు వ్యక్తులు భావి అవసరాలకంటే ప్రస్తుత అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. వ్యక్తులు తమకు వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ప్రస్తుత అవసరాలకు కేటాయించి, అతి తక్కువ మొత్తాన్ని భవిష్యత్ అవసరాలకు కేటాయిస్తారు. కాని ప్రభుత్వం ప్రస్తుత అవసరాలకే కాకుండా భవిష్యత్ అవసరాలకు కూడా అధిక ప్రాధాన్యతనిస్తుంది. ఉదా॥ ప్రభుత్వం విద్య, వైద్య, ఆరోగ్య సదుపాయాలు మరియు ప్రాజెక్టుల నిర్మాణం మొదలగు వాటిపై చేసే వ్యయం భావితరాల వారికి కూడా ఎంతగానో దోహదపడుతుంది. కనుక వ్యక్తులు ప్రస్తుత అవసరాలకు ప్రభుత్వం భావి అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు.

**8) నిర్బంధత్వం:** ప్రభుత్వం నిర్బంద పద్ధతుల ద్వారా తనకు రావలసిన ఆదాయాన్ని రాబట్టుకొంటుంది. ఉదా॥ ప్రభుత్వం ప్రజలపై పన్ను విధిస్తుంది. ఏ వ్యక్తి అయినా పన్ను చెల్లించటానికి నిరాకరిస్తే అతనినుండి నిర్బంధంగానైనా (అనగా న్యాయస్థానం ద్వారా) అతను చెల్లించవలసిన పన్ను మొత్తమును వసూలు చేస్తుంది. కాని వ్యక్తుల విషయంలో ఈ నిర్బంద పద్ధతిని పాటించటానికి వీలుపడదు. ఉదా॥ ఒక వ్యక్తి మరొక వ్యక్తి నుండి నిర్బంద వసూళ్ళకు పూనుకొనుట చట్టరీత్యా నేరమవుతుంది.

**9) ప్రచారం మరియు ఆడిట్:** సాధారణంగా వ్యక్తి తన ఆదాయ,వ్యయాలకు సంబంధించిన సమాచారాన్ని రహస్యంగా ఉంచుతాడు. కాని ప్రభుత్వం తన బడ్జెట్‌కు సంబంధించిన అంశాలను మరియు పంచవర్ష ప్రణాళికలలో వివిధ రంగాలకు కేటాయించిన వనరులకు సంబంధించిన సమాచారాన్ని బహిరంగపరుస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వ ఆదాయం, వ్యయాలకు

సంబంధించిన లెక్కలను ఆడిట్ చేయటం జరుగుతుంది. కాని ఇదంతా ప్రైవేటు వ్యక్తుల విషయంలో అవసరం లేదు.

**10) ధర - వ్యయం :** ప్రైవేటు వ్యాపార సంస్థలు వస్తువులను ఉత్పత్తి చేసి అధిక ధరలకు విక్రయించి లాభాన్ని పొందటానికి ప్రయత్నిస్తాయి. ప్రైవేటు రంగంలో వస్తువుల ధరలు ఉత్పత్తి వ్యయం కంటే ఎక్కువగా ఉంటాయి. కాని ప్రభుత్వం సరఫరా చేసే వస్తుసేవల ధరలు ఉత్పత్తి వ్యయానికి సమానంగా ఉండవచ్చును. ఉదా॥ తపాలా, రైల్వే మొదలగు ప్రైవేటు సంస్థల ప్రధానోద్దేశం లాభం. పబ్లిక్ సంస్థల ప్రధానోద్దేశం ప్రజాశ్రేయస్సు.

**11) ఉద్దేశపూర్వక మార్పులు:** ప్రభుత్వ విత్తవిషయంలో ఆదాయవ్యయాలను ఉద్దేశపూర్వకంగా మార్పు చేయవచ్చు. ప్రైవేటు విత్తవిషయంలో ఇది సాధ్యపడదు. ప్రభుత్వ ఆదాయమార్గాలు వ్యాకోచమైనవి. వ్యయాలు భిన్నంగా ఉంటాయి. కాని వ్యక్తి విషయంలో ఆదాయ,వ్యయాలు కొంతమేరకు అవ్యాకోచంగా ఉంటాయి.

**12) ఇచ్చిపుచ్చుకొనే స్వభావం:** ప్రైవేటు విత్త విషయంలో ఇచ్చిపుచ్చుకొనే స్వభావం ఉంటుంది. కాని ప్రభుత్వ విత్తవిషయంలో ఇటువంటి అవకాశం ఉండదు. ఉదా॥ ప్రతివ్యక్తి, ప్రభుత్వానికి చెల్లించిన పన్నుల మేరకు సమాన ప్రతిఫలాన్ని ప్రభుత్వం నుంచి పొందే వీలులేదు.

## 1.6 సారాంశము:

ప్రభుత్వం అర్థశాస్త్ర నిర్వచనం ద్వారా శాస్త్ర విషయాన్ని పరిధిని తెలుసుకొనవచ్చును. ప్రభుత్వ అర్థశాస్త్రానికి వివిధ అర్థవేత్తలు వివిధ నిర్వచనాలను ఇచ్చినారు. ప్రభుత్వ కార్యకలాపాల సంఖ్య నానాటికి పెరుగుతూ ఉన్నది. ప్రభుత్వ విత్తం, ప్రైవేటు విత్తానికి మధ్య పోలికలు ఉన్నప్పటికి ఆ రెండింటికి మధ్య తేడాలే ఎక్కువగా ఉన్నవి. ప్రభుత్వ అర్థశాస్త్రంలో ప్రభుత్వ ఆదాయం, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఋణాలు, విత్త నిర్వహణను గురించి పరిశీలిస్తే ప్రైవేటు విత్తశాస్త్రంలో వ్యక్తులు ఆదాయ వ్యయాలు మరియు వ్యక్తుల ఋణాలను గురించి పరిశీలించటం జరుగుతుంది.

## 1.7. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1) ప్రభుత్వ విత్తం ప్రభుత్వ ఆదాయ వ్యయాలను గురించి, ప్రభుత్వ రుణాలు మరియు విత్త నిర్వహణ గురించి పరిశీలిస్తుంది.

2) ప్రైవేటు విత్తం వ్యక్తుల ఆదాయ వ్యయాలను మరియు వ్యక్తులు తీసుకొనే రుణాలను గురించి పరిశీలిస్తుంది.

3) పబ్లిక్ రంగం నిర్వహించే పనులను రెండు రకాలుగా వర్గీకరించటం జరిగింది. (ఎ) మార్కెట్ సూత్రం ప్రకారం చేయటానికి వీలుకానివి. (బి) మార్కెట్ సూత్రం వలన ఏర్పడే అవకతవకలను సరిచేయటానికి అవసరమైనవి.

4) ప్రభుత్వ విధులను ఆచార్య మస్‌గ్రేవ్ నాలుగు రకాలుగా విభజించినాడు. (ఎ) కేటాయింపు విధులు (బి) వాణిజ్య విధులు (సి) పంపిణీ విధులు (డి) స్థిరీకరణ విధులు

5) ప్రభుత్వ అర్థశాస్త్రానికి, ప్రైవేటు అర్థశాస్త్రానికి ప్రధానమైన పోలికలు (ఎ) కోరికలను తృప్తి పరచటం (బి) ఋణం (సి) ఆదాయ పరిమాణం.

6) ప్రభుత్వ విత్తం, ప్రైవేటు విత్తానికి మధ్య తేడాలు (ఎ) ఆదాయ వ్యయాల సర్దుబాటు (బి) వ్యయస్వభావం (సి) సమోపాంత ప్రయోజన సిద్ధాంత (డి) బడ్జెట్ స్వభావం (ఇ) వ్యయం యొక్క ఉద్దేశ్యం తేడా (యఫ్) భావి అవసరాలకు ప్రాధాన్యత (జి) నిర్బంధత్వం (హెచ్) ప్రచారం మరియు ఆడిట్ (ఐ) ధర - వ్యయం (జె) ఉద్దేశపూర్వక మార్పులు (కె) ఇచ్చిపుచ్చుకునే స్వభావ

## 1.8. కఠినపదాలు:

1) ప్రభుత్వ అర్థశాస్త్రం: ప్రభుత్వ ఆదాయ వ్యయాలను, ప్రభుత్వ ఋణాలను మరియు విత్తనిర్వహణ గురించి పరిశీలించే శాస్త్రం. దీనిని "ప్రభుత్వ విత్తశాస్త్రం" అని కూడా అంటారు.

2) ప్రైవేటు విత్తశాస్త్రం: వ్యక్తుల ఆదాయ వ్యయాలను గురించి మరియు వారి ఋణాలకు సంబంధించిన అంశాలను గురించి ప్రైవేటు విత్తశాస్త్రం పరిశీలిస్తుంది.

## 1.9. నమూనా ప్రశ్నలు:

**1) వ్యాసరూపప్రశ్నలు**

1. ప్రభుత్వ అర్థశాస్త్ర స్వభావం మరియు పరిధిని పరిశీలించుము.
2. ప్రభుత్వ ప్రైవేటు విత్తాల మధ్య వ్యత్యాసాన్ని తేడాలను తెలియజేయండి.

**2) సంక్షిప్త ప్రశ్నలు:**

1. పబ్లిక్ రంగం నిర్వహించే పనులను వివరించండి.
2. ప్రభుత్వ విత్తానికి, ప్రైవేటు విత్తానికి మధ్య గల పోలికలను గూర్చి వ్రాయుము.

## 1.10. చదువవదగిన గ్రంథాలు:


1) Dr. B.P. TYAGI : Public Finance

2) R.K.LEKHI : Public Finance

3) తెలుగు అకాడమీ : ప్రభుత్వ అర్థశాస్త్రం.


- శ్రీ జి. కోటేశ్వరరావు.

పాఠం : 2

# గరిష్ఠ సాంఘిక ప్రయోజన సిద్ధాంతము

## (Principle of Maximum Social Advantage)

### 2.0. లక్ష్యం:

ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించేటప్పుడు ప్రభుత్వ లక్ష్యం ఏమై ఉండాలి? అనే ప్రశ్నకు సమాధానంగా గరిష్ఠ సాంఘిక ప్రయోజన సిద్ధాంతాన్ని ప్రతిపాదించటం జరిగింది. ప్రభుత్వం విధించే పన్నులు ప్రజలపై భారాన్ని మోపితే ప్రభుత్వం చేసే వ్యయం ప్రజలకు ప్రయోజనాన్ని చేకూర్చి ఏవిధంగా సంక్షేమాన్ని పెంపొందిస్తుందనే విషయాన్ని విశ్లేషించటం జరిగింది. ఈ పాఠం పూర్తి అయ్యేసరికి విద్యార్థులు ఈ క్రింది విషయాలను అవగాహన చేసుకుంటారు.

- గరిష్ఠ సాంఘిక ప్రయోజనం.
- డాల్టన్ మరియు ఆచార్య మస్‌గ్రేవ్ వివరణ.
- గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రానికి పరీక్షలు మరియు పరిమితులు.

### విషయసూచిక


**2.1.** విషయ పరిచయము
**2.2.** గరిష్ఠ సాంఘిక ప్రయోజన సిద్ధాంతం
**2.3.** డాల్టన్ (Dalton) వివరణ
**2.4.** ఆచార్య మస్‌గ్రేవ్ వివరణ
**2.5.** గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రానికి పరీక్షలు
**2.6.** గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రానికి పరిమితులు
**2.7.** సారాంశము
**2.8.** గుర్తుంచుకోవలసిన విషయాలు
**2.9.** కఠిన పదాలు
**2.10.** నమూనా ప్రశ్నలు
**2.11.** చదువదగిన గ్రంథాలు.


### 2.1. విషయ పరిచయము:

ముందు భాగంలో ప్రభుత్వ మరియు ప్రైవేటు విత్తశాస్త్రాల గురించి మరియు వాటి మధ్య ఉన్న పోలికలు మరియు తేడాలను గురించి వివరించటం జరిగింది. ప్రభుత్వ విత్తం యొక్క ధ్యేయం ప్రజాసంక్షేమంగా పేర్కొనటం జరిగింది. ప్రైవేటు సంస్థలు మరియు వ్యక్తుల లక్ష్యం లాభార్జనగా తెలియజేయటం జరిగింది. ప్రభుత్వం నిర్వహించే కార్యకలాపాలన్నింటిని కూడా సాధ్యమయినంత వరకు ప్రజలకు ప్రయోజనాన్ని కలిగించే విధంగా రూపొందించటం జరిగింది. ప్రభుత్వవ్యయాన్ని సాంఘిక ప్రయోజనానికి తోడ్పడే విధంగా రూపొందించవలయును. Prof. Pigon మరియు Prof. Dalton అనే ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రభుత్వ విత్త శాస్త్రానికి సంబంధించి ఒక ప్రాథమిక సిద్ధాంతానికి రూపకల్పన చేసినారు.

ఈ సిద్ధాంతాన్ని అనుసరించి ప్రభుత్వం ప్రజలనుంచి తక్కువ ఆదాయాన్ని వసూలు చేసి, ప్రజలకు చేకూరే ప్రయోజనం గరిష్ఠ స్థాయిలో ఉండే విధంగా ఖర్చు చేయవలయునని సారాంశము. ప్రభుత్వం ప్రజలపై పన్ను విధించినపుడు ప్రజలకు కొంత అప్రయోజనం చేకూరుతుంది. అదేవిధంగా ప్రభుత్వం వ్యయం చేయుట వలన ప్రజలకు కొంత ప్రయోజనం

చేకూరుతుంది. ప్రభుత్వం ప్రజలపై పన్నులు విధించుట ద్వారా ప్రజలు పొందే అప్రయోజనం కనిష్టస్థాయిలో ఉండేటట్లు మరియు ప్రభుత్వం వ్యయం చేయుట ద్వారా ప్రజలకు చేకూరే ప్రయోజనం గరిష్ట స్థాయిలో ఉండేటట్లు తన విధానాన్ని రూపొందించుకొంటుంది. కాని ప్రజలందరి ప్రయోజనాలు గరిష్ట స్థాయిలో ఉండకపోవచ్చును. కొంతమంది వ్యక్తుల ప్రయోజనం తగ్గవచ్చును. కాని అత్యధిక శాతం మంది ప్రజల శ్రేయస్సు పెరగవలయును. Prof. Dalton ఉద్దేశంలో ప్రభుత్వం నిర్వహించే కార్యకలాపాల వలన సమాజంలో ప్రజలందరికి సంపద సమానంగా పంపిణీ చేయబడితే ప్రభుత్వ కార్యకలాపాలు మంచివిగా పేర్కొన వచ్చును. అనగా ప్రభుత్వ కార్యకలాపాల వలన గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని పొందే విధంగా ఉండవలయును. Prof. Dalton దీనినే "గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతమని" వివరించెను.

## 2.2. గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం:

గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతాన్ని అనుసరించి ప్రభుత్వం చేసే వ్యయం వలన సమాజంలో ప్రజలకు చేకూరే ప్రయోజనం గరిష్ట స్థాయిలో ఉండవలయును. ప్రభుత్వం తన కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన ఆదాయం కొరకు ప్రజలపై పన్నులను విధిస్తుంది. ప్రజలపై విధించిన పన్నుల వలన ప్రజల వాటిని చెల్లించుటలో కొంత త్యాగాలు చేస్తారు. ఈ విధంగా ప్రజలు పన్ను చెల్లించుట ద్వారా చేసే త్యాగాలు కనిష్టంగా ఉండవలయును. అదేవిధంగా ప్రభుత్వం ప్రజల నుండి పన్నుల ద్వారా సేకరించిన ఆదాయం వ్యయంచేయుట ద్వారా ప్రజలకు కొంత ప్రయోజనం చేకూరుతుంది. ఎక్కడయితే ప్రజలు పన్నులు ద్వారా చేసే త్యాగాలు కనిష్టంగా ఉండి, ప్రభుత్వ వ్యయం వలన ప్రజలకు చేకూరే ప్రయోజనం గరిష్ట స్థాయిలో ఉంటుందో అక్కడ గరిష్ట సాంఘిక ప్రయోజనం సమకూరుతుంది.


## 2.3. డాల్టన్ (Dalton) వివరణ:

డాల్టన్ సాంప్రదాయ ఆర్థికవేత్తల అభిప్రాయాన్ని ఖండించినాడు. సాంప్రదేయవాదుల ఉద్దేశంతో రాజ్యం పరిమితమైన కార్యకలాపాలను మాత్రమే నిర్వహించవలెనని అందువలన ప్రభుత్వం కనిష్ట పరిమాణంలో పన్నులను విధించవలయుననీ అభిప్రాయపడిరి. అంతేకాకుండా ప్రభుత్వ వ్యయం అంతా అనుత్పాదకమయినదని సాంప్రదాయవాదులు అభిప్రాయపడిరి.

డాల్టన్ ఉద్దేశంలో ప్రభుత్వం చేసే వ్యయం అంతా అనుత్పాదక వ్యయం కాదని, అదే విధంగా ప్రభుత్వం విధించే పన్నులు కూడా కొంత ప్రయోజనాన్ని చేకూరుస్తాయని అభిప్రాయపడినాడు. ఉదా॥ మత్తుపానీయాల మీద పన్ను విధించుట ద్వారా వాటి వినియోగం తగ్గిపోయి ప్రజల ఆదాయం పెరుగుతుంది. ఇటువంటి వాటిపై పన్నులను విధించుట తప్పనిసరి. ప్రభుత్వ వ్యయాన్ని కూడా డాల్టన్ సమర్థించినాడు. ఉదా॥ వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, విద్య మొదలగు వాటిపై ప్రభుత్వం చేసే వ్యయం వలన ప్రజల ఆర్థిక సాంఘిక సంక్షేమం పెరుగుతుంది. ప్రభుత్వం చేసే అన్ని రకాల వ్యయాలు కూడా ఉత్పాదకమని చెప్పలేము. ఉదా॥ యుద్ధంపై చేసే వ్యయం అనుత్పాదతక వ్యయం. డాల్టన్ ఉద్దేశంలో ప్రభుత్వం చేసే వ్యయం వలన ప్రజల సంక్షేమం పెరిగితే అటువంటి వ్యయం ఉత్పాదక వ్యయమని డాల్టన్ అభిప్రాయపడెను. సమాజం యొక్క ఆర్థిక సంక్షేమం గరిష్ట స్థాయిలో ఉండే విధంగా ప్రభుత్వ విత్త కార్యకలాపాలను నిర్వహించుట వలన గరిష్ట సాంఘిక ప్రయోజనం సమకూరుతుంది. ప్రభుత్వం తన విధులను నిర్వహించుటకు అవసరమయిన ఆదాయం కొరకు ప్రజలపై పన్నులు విధిస్తున్నది. ఈ పన్నులను చెల్లించుట ద్వారా ప్రజలు త్యాగం చేస్తారు. అదేవిధంగా ప్రభుత్వం వ్యయం చేయుట వలన ప్రజలు కొంత ప్రయోజనాన్ని పొందుతారు. గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని పొందుటకు అనుసరించవలసిన పద్ధతులను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

వ్యయ - ప్రయోజన విశ్లేషణ: ప్రభుత్వం ప్రజలపై పన్నులు విధించుట వలన ప్రజలు పన్నులు చెల్లించుట ద్వారా కొంత ఉపాంత త్యాగాన్ని చేస్తారు. అదేవిధంగా ప్రభుత్వం వ్యయం చేయుట వలన ప్రజలు కొంత ఉపాంత ప్రయోజనాన్ని పొందుతారు. పన్నులు చెల్లించుట ద్వారా ప్రజలు చేసే ఉపాంత త్యాగం, ప్రభుత్వ వ్యయం ద్వారా ప్రజలు పొందే ఉపాంత ప్రయోజనం సమానంగా ఉండేటట్లు ప్రభుత్వం తన ఆదాయ, వ్యయాలను రూపొందించుకొంటుంది. దీనివలన

గరిష్ఠ సాంఘిక ప్రయోజనం సమకూరుతుంది. ప్రభుత్వం అదనంగా విధించే పన్నుల వలన ప్రజలు చేసే త్యాగాలు పెరుగుతాయి. కాని ప్రభుత్వం చేసే అదనపు వ్యయం వలన ప్రజలకు చేకూరే ఉపాంత ప్రయోజనం క్షీణిస్తూ ఉంటుంది. ఈ గరిష్ఠ సాంఘిక ప్రయోజన సిద్ధాంతాన్ని క్రింది రేఖాపటం ద్వారా వివరించవచ్చును.




పై రేఖా పటంలో X-అక్షంపై ద్రవ్య యూనిట్లు, Y-అక్షంపై త్యాగం, ప్రయోజన పరిమాణాలను గుర్తించటం జరిగింది. SS రేఖ ఉపాంత త్యాగరేఖ. $BB_1$ ఉపాంత ప్రయోజనపురేఖ. $SS_1$ పన్నుల వలన కలిగే ఉపాంత త్యాగాన్ని తెలియజేసే రేఖ. పన్నులు పెరిగే కొలది ఉపాంతభారం పెరుగుతుంది. కనుక SS1 రేఖ ఎడమనుండి కుడికి పైకి గీయబడినది. BB1 రేఖ ప్రభుత్వం చేసే వ్యయం వలన ప్రజలు పొందే అదనపు ప్రయోజనాన్ని తెలియజేసే రేఖ. అదనపు ప్రయోజనం క్షీణిస్తూ ఉంటుంది, కనుక $BB_1$ రేఖ ఎడమ నుండి కుడికి క్రిందికి గీయబడినది. SS1 రేఖ మరియు BB1 రేఖలు రెండూ కూడా పరస్పరం P బిందువు వద్ద ఖండించుకొన్నవి. ప్రజల నుంచి పరిమాణంలో పన్నుల రూపంలో ద్రవ్యాన్ని సేకరించి, ప్రజల ప్రయోజనం కొరకు ఖర్చు చేయుట వలన ఉపాంత త్యాగం మరియు ఉపాంత ప్రయోజనం సమానమ:ునవి. ఒకవేళ ప్రభుత్వం OM1 పరిమాణంలో ప్రజల నుంచి పన్నుల రూపంలో ద్రవ్యాన్ని సేకరించి ఖర్చు చేసినట్లయితే పన్నులు చెల్లించుట ద్వారా ప్రజలు చేసిన త్యాగం (KM1) తక్కువగాను, ప్రభుత్వ వ్యయం వలన ప్రజలు పొందిన ప్రయోజనం(DM1) ఎక్కువగాను ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం ఇంకా ఎక్కువ మొత్తంలో పన్నుల ద్వారా ఆదాయాన్ని సేకరించి ఖర్చు చేయవచ్చును. అదేవిధంగా ప్రభుత్వం ప్రజల నుంచి $OM_2$ పరిమాణంలో పన్నుల ద్వారా ఆదాయాన్ని సేకరించి ఖర్చు చేసినట్లయితే పన్నులు చెల్లించుట ద్వారా ప్రజలు చేసే త్యాగం (S1M2) ఎక్కువగాను ప్రభుత్వ వ్యయం వలన ప్రజలు పొందే ప్రయోజనం (K1M2) ఎక్కువ తక్కువగాను ఉన్నది. కనుక ప్రభుత్వం పన్నుల రూపంలో ప్రజలనుంచి సేకరించే ఆదాయాన్ని తగ్గించుకొనవలసి ఉంటుంది.

**వనరుల పంపిణీ - గరిష్ఠ సాంఘిక ప్రయోజనం:** ప్రభుత్వ వనరులను పంపిణీ చేసే విధానాన్ని బట్టి గరిష్ఠ సాంఘిక ప్రయోజనాన్ని అంచనా వేయవచ్చును. ప్రభుత్వం వనరులను వివిధ రంగాల మధ్య కేటాయించేటప్పుడు అన్ని రంగాలపై ప్రభుత్వం చేసే ద్రవ్య వ్యయం వలన కలిగే ఉపాంత ప్రయోజనాలు సమానంగా ఉండవలయును. ఉదా॥ ప్రభుత్వం వ్యవసాయం మరియు దేశరక్షణపై వ్యయం చేస్తున్నప్పుడు వ్యవసాయంపై చేసే వ్యయం వలన కలిగే ఉపాంత ప్రయోజనం

అధికంగా ఉండి, దేశరక్షణపై చేసే వ్యయం వలన కలిగే ఉపాంత ప్రయోజనం తక్కువగా ఉన్నప్పుడు దేశరక్షణకు కొన్ని వనరులను అదనంగా కేటాయించినట్లయితే, వ్యవసాయం రంగంపై చేసే వ్యయం వలన కలిగే ఉపాంత ప్రయోజనం, దేశరక్షణపై చేసే వ్యయం వలన కలిగే ఉపాంత ప్రయోజనానికి సమానంగా ఉంటుంది. ఇటువంటప్పుడు గరిష్ట సాంఘిక ప్రయోజనం సమకూరినట్లవుతుంది.

పన్నుల భారం పంపిణీ - గరిష్ట సాంఘిక ప్రయోజనం: పన్నుల భారాన్ని సమానంగా పంపిణీ చేయుట ద్వారా గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని సాధించవచ్చును. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పన్నులు చెల్లించుట ద్వారా చేసే ఉపాంత త్యాగాలు సమానంగా ఉంటే గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని సాధించినట్లవుతుంది. ఉదా॥ A మరియు B అనే వ్యక్తులు ఉన్నారనుకొందాము. A అనే వ్యక్తి అధిక ఆదాయ వర్గానికి చెందిన వ్యక్తి మరియు B అనే వ్యక్తి తక్కువ ఆదాయానికి చెందిన వ్యక్తిగా పరిగణించినట్లయితే A అనే వ్యక్తి ప్రభుత్వానికి ఎక్కువ పన్ను చెల్లించుట ద్వారా చేసే ఉపాంత త్యాగం B అనే వ్యక్తి తక్కువ పన్నును చెల్లించుట ద్వారా చేసే ఉపాంత త్యాగానికి సమానంగా ఉండవలయును.


## 4. గరిష్ట సాంఘిక ప్రయోజనం - మస్‌గ్రేవ్ వివరణ:

డాల్టన్ మరియు A.C.Pigoo రూపొందించిన రెండు సూత్రాలను మస్‌గ్రేవ్ ఆమోదించెను. బడ్జెట్ విధానానికి సంబంధించి డాల్టన్ & A.C.Pigoo రూపొందించిన సూత్రాలు ఈ క్రింది విధంగా ఉన్నవి.

1) వివిధ కార్యకలాపాలపై ప్రభుత్వం తన ద్రవ్య వనరులను ఏ విధంగా పంపిణీ చేయాలంటే ప్రతి కార్యకలాపాలపై ప్రభుత్వం చేసే వ్యయం యొక్క ఉపాంత ప్రయోజనం సమానంగా ఉండవలయును.

2) పన్నుల రూపంలో ప్రజలనుంచి సేకరించిన ద్రవ్యం వలన ప్రజలు చేసే ఉపాంత త్యాగాలు ప్రభుత్వం చేసిన వ్యయం వలన ప్రజలు పొందిన ఉపాంత ప్రయోజనాలు సమానంగా ఉండేటట్లు ప్రభుత్వం వ్యయం చేయవలయును.

పై రెండు సూత్రాలను మస్‌గ్రేవ్ ఆమోదించినాడు. రెండవ సూత్రాన్ని ఈ క్రింది రేఖాపటంలో వివరించినాడు.



పై రేఖాపటంలో X-అక్షంపై ద్రవ్య వ్యయం Y-అక్షంపై ఉపాంత ప్రయోజనం మరియు ఉపాంత త్యాగాన్ని గుర్తించటం జరిగింది. 'ee' ఉపాంత ప్రయోజన రేఖ, 'tt' ఉపాంత త్యాగరేఖ NN నికర ప్రయోజనపు రేఖ. NN అనే నికర ప్రయోజనపు రేఖ X-అక్షాన్ని M అనే బిందువు వద్ద ఖండించినది. OM పరిమాణంలో ప్రజలనుండి పన్నుల రూపంలో సేకరించిన ద్రవ్యం, ప్రజల ప్రయోజనం కొరకు ఖర్చు చేసినప్పుడు - ప్రజలు పన్నులు చెల్లించుట ద్వారా చేసిన ఉపాంత త్యాగాలు, ప్రభుత్వం వ్యయం చేయుట ద్వారా ప్రజలు పొందిన ఉపాంత ప్రయోజనానికి సమానంగా ఉన్నది. MK=MD ఒకవేళ ప్రభుత్వం OM1 పరిమాణంలో పన్నుల రూపంలో ప్రజలనుండి ద్రవ్యాన్ని సేకరించి దానిని ఖర్చు చేస్తే, పన్నులు చెల్లించుట ద్వారా ప్రజలు చేసిన ఉపాంత త్యాగాలు (M1D1) తక్కువగాను ప్రజలు పొందే ఉపాంత ప్రయోజనం (M1K1) ఎక్కువగాను ఉన్నది. కనుక ప్రభుత్వం ఇంకా ప్రజల నుండి పన్నుల రూపంలో ద్రవ్యాన్ని సేకరించి ఖర్చు చేయవచ్చును. అదేవిధంగా ప్రభుత్వం ప్రజల నుండి పరిమాణంలో పన్నుల రూపంలో ద్రవ్యాన్ని సేకరించి ఖర్చుచేసినట్లయితే ప్రభుత్వ వ్యయం వలన ప్రజలు పొందే ఉపాంత ప్రయోజనం K2M2 తక్కువగాను, ప్రభుత్వానికి పన్నులు చెల్లించుట ద్వారా ప్రజలు చేసే ఉపాంత త్యాగము $M_2D_2$ ఎక్కువగాను ఉన్నది. కనుక ప్రభుత్వం ప్రజలనుండి పన్నుల రూపంలో వసూలు చేసే మొత్తాన్ని తగ్గించడంతోపాటు తాను చేసే వ్యయాన్ని కూడా తగ్గించవలసి వస్తుంది.

## 2.5. గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రానికి పరీక్షలు:

గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రాన్ని అనుసరించుట కష్టసాధ్యమయిన విషయం కనుక, ప్రభుత్వం ఎంతవరకు ఈ సూత్రాన్ని బట్టి నడుచుకొంటుందనే దానికి సంబంధించి కొన్ని పరీక్షలను నిర్వహించవలసి ఉంటుంది. డాల్టన్ అనే ఆర్థిక శాస్త్రవేత్త గరిష్ఠ సాంఘిక ప్రయోజన సూత్రానికి సంబంధించి ఈ క్రింది పరీక్షలను సూచించినాడు.

**1) దేశరక్షణ లేదా సామాజిక భద్రత:** ప్రతి ప్రభుత్వం యొక్క ముఖ్య ధ్యేయం ఇతర దేశాల దాడుల నుంచి దేశాన్ని పరిరక్షించుట మరియు దేశంలో శాంతిభద్రతలను కాపాడుట. దీనివలన ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరిగి ఆర్థిక భద్రత మరియు సాంఘిక ప్రయోజనం పెరుగుతుంది. దేశరక్షణ మరియు శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం సైన్యాన్ని, పోలీస్ మరియు న్యాయవ్యవస్థను పటిష్టం చేయవలయును. ప్రభుత్వం శాంతిస్థాపనకు కృషి చేసినట్లయితే యుద్ధంపై అవసరమైన వ్యయాన్ని చేయవలసిన పని ఉండదు.

**2) ఉత్పత్తి పెరుగుదల:** గరిష్ఠ సాంఘిక ప్రయోజనం సమకూరాలంటే ఉత్పత్తి పరిమాణాన్ని పెంచవలసి ఉంటుంది. వస్తూత్పత్తి పెరగాలంటే శ్రామికుల ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచవలయును. ఆర్థిక వనరుల వినియోగంలో దుబారా లేకుండా ఉండవలయును. ఉత్పాదకాలను సరైన పాళ్ళలో మిళితం చేయుట ద్వారా వస్తూత్పత్తి పెరుగుతుంది.

**3) పంపిణీని మెరుగు పరచుట:** గరిష్ఠ సాంఘిక ప్రయోజనం సమకూరినదో లేదో తెలుసుకోవటానికి మూడవ పరీక్ష పంపిణీని మెరుగుపరచుట. ఉత్పత్తి చేసిన వస్తువుల పంపిణీ సమాజంలో వివిధ వర్గాల ప్రజల మధ్య సక్రమంగా పంపిణీ జరగవలయును. ఆదాయ సంపదల పంపిణీలో ఉండే అసమానతలు తగ్గినప్పుడే గరిష్ఠ సాంఘిక ప్రయోజనం సమకూరినట్లవుతుంది. ఆదాయ, సంపదల పంపిణీ సక్రమంగా ఉన్నప్పుడే ప్రజల ఆర్థిక శ్రేయస్సు మెరుగవుతుంది.

**4) స్థిరత్వం మరియు సంపూర్ణ ఉద్యోగిత:** స్వేచ్ఛ ఆర్థిక వ్యవస్థ ముఖ్య లక్షణం "ఆర్థిక అస్థిరత్వం" కలిగియుండుట. దీనివలన నిరుద్యోగిత, అత్యుత్పత్తి మొదలగునవి ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉన్నది. ఏ ఆర్థిక వ్యవస్థలో అయితే స్థిరత్వం మరియు సంపూర్ణ ఉద్యోగితను సాధించుటకు అవకాశం ఉంటుందో అటువంటి ఆర్థిక వ్యవస్థలో గరిష్ఠ సాంఘిక ప్రయోజనం సమకూరినట్లవుతుంది. ఆర్థికమాంద్య కాలంలో ప్రభుత్వ వ్యయాన్ని పెంచుట ద్వారా ఉద్యోగితను మరియు సమిష్టి డిమాండ్‌ను పెంచవచ్చును. అదేవిధంగా ద్రవ్యోల్బణ కాలంలో ధరల స్థాయిని తగ్గించటానికి ప్రభుత్వం ప్రజల నుండి ఎక్కువ మొత్తంలో ఋణాలను సేకరించటంతోపాటు, అధిక పన్నులను విధించవలసి ఉంటుంది.

5) భవిష్యత్తుకు ప్రాధాన్యత: ప్రైవేటు వ్యక్తులు భవిష్యత్తు కంటే ప్రస్తుత అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. కాని ప్రభుత్వం ప్రస్తుత అవసరాలకే కాకుండా భవిష్యత్తుకు కూడా అధిక ప్రాధాన్యతను ఇస్తుంది. సాధారణంగా ప్రభుత్వం ప్రస్తుత తరాల ప్రయోజనాలకంటే భావితరాల వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వివిధ కార్యకలాపాలను రూపొందించుకొంటుంది. డాల్టన్ ఉద్దేశంలో "వ్యక్తులు మరణిస్తూ ఉంటారు, కాని సమాజం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని అభిప్రాయపడెను".

## పరిమితులు:

గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం ప్రభుత్వ విత్తశాస్త్రంలో ప్రాథమిక సూత్రం. ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలన్నీ ఈ సూత్రాన్ని అనుసరించి కొనసాగుతాయి. కాని ఈ సిద్ధాంత ఆచరణలో కొన్ని ఇబ్బందులు లేదా ఈ సిద్ధాంతానికి కొన్ని పరిమితులు కలవు.

1) ప్రభుత్వ వ్యయం ద్వారా లభించే ప్రయోజనాన్ని గాని, పన్నుల వలన ఏర్పడే భారాన్ని కాని లేదా త్యాగాన్ని గాని కొలుచుట సాధ్యపడదు. దీనికి ప్రధాన కారణం ప్రయోజనం, త్యాగం అనే మానసిక భావనలు.

2) ప్రభుత్వం విధించే ప్రతి పన్ను కూడా ప్రజలపై భారాన్ని మోపుతుంది. కాని ప్రభుత్వం చేసే ప్రతి వ్యయం ప్రయోజనకరమని చెప్పలేము.

3) ప్రభుత్వ వ్యయం యొక్క స్వల్పకాలిక ప్రయోజనాలను అంచనా వేయలేము. కొన్ని వ్యయాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలుంటాయి.

4) గరిష్ట సాంఘిక ప్రయోజన సూత్రంలో కేవలం పన్నుల ద్వారా లభించే ఆదాయాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవటం జరిగింది కాని ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణలోనికి తీసుకొనలేదు. ఉదా॥ వాణిజ్య ఆదాయాలు, పరిపాలనా సంబంధమైన ఆదాయాలు, ఋణాలు మొదలగునవి.

5) ప్రభుత్వ వ్యయాన్ని చిన్నచిన్న మొత్తాలుగా విభజించే వీలులేదు. కనుక ప్రభుత్వ వ్యయ ఉపాంత ప్రయోజనాన్ని గురించి తెలుసుకొనలేము.

6) ప్రభుత్వం లోటు బడ్జెట్ ద్వారా వనరులను సమకూర్చుకొంటే ప్రజలపై పన్నుల భారం ఉండదు. కాని లోటు బడ్జెట్ ద్రవ్యోల్బణానికి దారితీసి ప్రజల మీద భారం పెరుగుతుంది.

## 7. సారాంశము:

ప్రభుత్వం వివిధ కార్యకలాపాలను నిర్వహించేటప్పుడు అంతిమ లక్షణం గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని సాధించుట. ప్రభుత్వం ప్రజలపై పన్నులు విధించుట వలన వారు పన్నులు చెల్లించుటలో చేసే ఉపాంత త్యాగం, ప్రభుత్వం వ్యయం చేసేటప్పుడు ప్రజలకు లభించే ఉపాంత ప్రయోజనం సమానంగా ఉంటే గరిష్ట సాంఘిక ప్రయోజనం సమకూరినట్లవుతుంది. దీనికి డాల్టన్ మరియు మస్‌గ్రేవ్ రూపొందించిన వ్యయ-ప్రయోజన విశ్లేషణలే తార్కాణం. అంతే కాకుండా ఏ ప్రభుత్వమయితే గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని సమకూర్చగలుగుతుందో ఆ ప్రభుత్వం మంచిదని అర్థం.

## 2.8. గుర్తించుకోవలసిన విషయాలు:

1) ప్రభుత్వం వివిధ కార్యకలాపాలను నిర్వహించేటప్పుడు దాని లక్ష్యం గరిష్ఠ సాంఘిక ప్రయోజనం అయి ఉండవలయును.

2) ప్రజలపై ప్రభుత్వం విధించే పన్నుల వలన కలిగే ఉపాంత త్యాగాలు కనిష్ఠంగా ఉండవలయును.

3) ప్రభుత్వం వివిధ కార్యకలాపాలపై వ్యయం చేయుట వలన ప్రజలకు చేకూరే ఉపాంత ప్రయోజనం గరిష్ఠ స్థాయిలో ఉండవలయును.

4) ఎక్కడయితే ప్రభుత్వానికి పన్నులు చెల్లించుట ద్వారా ప్రజలు చేసే ఉపాంత త్యాగాలు, ప్రభుత్వ వ్యయం చేయుట ద్వారా ప్రజలకు చేకూరే ఉపాంత ప్రయోజనం సమానంగా ఉంటే గరిష్ఠ సాంఘిక ప్రయోజనం సమకూరినట్లవుతుంది.

5) డాల్టన్ మరియు మస్‌గ్రేవ్ అనే ఆర్థికవేత్తలు గరిష్ఠ సాంఘిక ప్రయోజనాన్ని సాధించటానికి అవలంబించిన పద్ధతులను మరచిపోరాదు.

6) గరిష్ఠ సాంఘిక ప్రయోజనం సమకూరినదో లేదో తెలుసుకోవటానికి కొన్ని ముఖ్యమైన పరీక్షలను నిర్వహించవలయును. అవి దేశరక్షణ లేదా సామాజిక భద్రతను సమకూర్చేదిగాను, ఉత్పత్తిని పెంచేదిగాను, పంపిణీ మెరుగు పరిచేదిగా, సంపూర్ణోద్యోగితను సాధించేదిగా, భవిష్యత్తుకు ప్రాధాన్యతను ఇచ్చేదిగా ఉండవలయును.

## 2.9. కఠిన పదాలు:

1) **గరిష్ఠ సాంఘిక ప్రయోజనం :** పన్నులు చెల్లించుట ద్వారా ప్రజలు చేసే ఉపాంత త్యాగాలు ప్రభుత్వం వ్యయం చేయుట ద్వారా ప్రజలకు చేకూరే ఉపాంత ప్రయోజనం సమానంగా ఉండవలయును.

2) **వ్యయ-ప్రయోజన విశ్లేషణ:** పన్నులు చెల్లించుట ద్వారా ప్రజలు చేసే ఉపాంత త్యాగాలు, ప్రభుత్వ వ్యయం ద్వారా ప్రజలు పొందే ఉపాంత ప్రయోజనాలు సమానంగా ఉండేటట్లు ప్రభుత్వం తన ఆదాయ-వ్యయాలను రూపొందించు కొనవలయును.

3) **వనరుల పంపిణీ-గరిష్ఠ సాంఘిక ప్రయోజనం:** ప్రభుత్వం వనరులను వివిధ రంగాల మధ్య కేటాయించేటప్పుడు అన్ని రంగాలపై ప్రభుత్వం చేసే ద్రవ్య వ్యయం వలన కలిగే ఉపాంత ప్రయోజనాలు సమానంగా ఉండవలయును.

4) **పన్నుల భారం పంపిణీ - గరిష్ఠ సాంఘిక ప్రయోజనం:** వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ప్రభుత్వానికి పన్నులు చెల్లించుట ద్వారా చేసే ఉపాంత త్యాగాలు సమానంగా ఉండేటట్లు ప్రభుత్వం పన్నుల విధానాన్ని రూపొందిస్తే గరిష్ఠ సాంఘిక ప్రయోజనం సమకూరుతుంది.

## 2.10. నమూనా ప్రశ్నలు:

1. వ్యాసరూప ప్రశ్నలు:

1) గరిష్ఠ సాంఘిక ప్రయోజన సిద్ధాంతాన్ని వివరింపుము.

2) గరిష్ఠ సాంఘిక ప్రయోజనాన్ని సాధించుటలో డాల్టన్ మరియు మస్‌గ్రేవ్ అభిప్రాయాలను తెలియచేయండి.

3) గరిష్ఠ సాంఘిక ప్రయోజనాన్ని వివరించి దానిని సాధించటానికి అవసరమైన పరీక్షలను వివరించండి.

4) గరిష్ఠ సాంఘిక ప్రయోజన సిద్ధాంతాన్ని వివరించి దాని పరిమితులను తెలియజేయండి.

2. సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు:

1) గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని సాధించుటలో వ్యయ ప్రయోజనాల విశ్లేషణ.

2) గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం - డాల్టన్ వివరణ.

3) గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం - మస్‌గ్రేవ్ వివరణ.

4) గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని సాధించటానికి నిర్వహించవలసిన పరీక్షలు.

## 1. చదువదగిన గ్రంథాలు:


1) Public Finance - Dr. B.P. Tyagi

2) Public Finance - Dalton

3) Public Finance in Theory and Practice - Musgrave & Musgrave

4) పబ్లిక్ అర్థశాస్త్రం - తెలుగు అకాడమీ.


- శ్రీ జి. కోటేశ్వరరావు.

పాఠం : 3

# ప్రభుత్వ ఆదాయ వనరులు

## 3.0. లక్ష్యం:

ఈ భాగంలో ప్రభుత్వ ఆదాయ మార్గాలు, ఆదాయ వనరుల వర్గీకరణ పన్నుల వర్గీకరణ మొదలగు వాటిని గురించి వివరించటం జరిగింది. ఈ భాగాన్ని పూర్తి చేసేసరికి ఈ క్రింది విషయాలను గురించి అవగాహన చేసుకుంటారు.

- ప్రభుత్వ ఆదాయ వనరులు.
- పన్నుల వర్గీకరణ
- ప్రత్యక్ష, పరోక్ష పన్నులు
- భారత పన్నుల వ్యవస్థలో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ప్రాముఖ్యత.

## విషయసూచిక


3.1. విషయ పరిచయము
3.2. ప్రభుత్వ ఆదాయ వనరులు
3.3. ప్రభుత్వ ఆదాయ వనరుల వర్గీకరణ
3.4. పన్నుల వర్గీకరణ
3.5. ప్రభుత్వ పన్నులు.
3.6. పరోక్ష పన్నులు
3.7. సారాంశము
3.8. గుర్తుంచుకోవలసిన విషయాలు
3.9. కఠిన పదాలు
3.10. నమూనా ప్రశ్నలు
3.11. చదువదగిన గ్రంథాలు


## 3.1. విషయ పరిచయము:

ఆధునిక ప్రభుత్వాలు అనేక రకాల విధులను నిర్వహిస్తూ ఉంటాయి. ప్రభుత్వ కార్యకలాపాల సంఖ్య నానాటికి పెరిగి పోతున్నాయి. ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పెంపొందించటానికి అనేక కార్యకలాపాలను నిర్వహించుట వలన ప్రభుత్వం వ్యయం పెరుగుచున్నది. ప్రభుత్వం తన వ్యయానికి కావలసిన ఆదాయాన్ని రాబట్టుకొనుటకు అనేక మార్గాలను అన్వేషిస్తుంది ప్రభుత్వానికి వివిధ మార్గాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఆదాయం అందురు.

అర్థశాస్త్రం ఉత్పత్తికి ఎంత ప్రాధాన్యతను ఇస్తుందో, ప్రభుత్వ విత్తశాస్త్రంలో ప్రభుత్వ రాబడికి అంతే ప్రాధాన్యతను ఇవ్వటం జరుగుతుంది. ప్రైవేటు సంస్థలు వస్తువులను ఇవ్వటం జరుగుతుంది. ప్రైవేటు సంస్థలు వస్తువులను విక్రయించుట ద్వారా ఆదాయాన్ని పొందుతుంటాయి. కాని ప్రభుత్వం ప్రతి వస్తు, సేవకు ధరను నిర్ణయించి విక్రయించలేదు. ఉదా॥ ఉచిత విద్య, వైద్య సదుపాయాలు, దేశరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ వలన దేశంలోని పౌరులందరికి ప్రయోజనం చేకూరుతుంది. కాని ఆ సేవలకు ధరను నిర్ణయించి ప్రజల నుంచి వసూలు చేయరాదు. పన్నులు, ఫీజులు, ప్రత్యేక విధింపులు, గ్రాంట్లు వాణిజ్య ఆదాయాలు, రుణాలు, కరెన్సీని ముద్రించుట మొదలగు మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటుంది.

## 2. ప్రభుత్వ ఆదాయ వనరులు:

ప్రభుత్వానికి వివిధ మార్గాల ద్వారా లభించే ఆదాయ వనరులను గురించి వివరించాల్సి ఉన్నది. పన్నులు, వాణిజ్య ఆదాయాలు, పరిపాలనా నిర్వహణా ఆదాయాలు గ్రాంట్లు మరియు కానుకల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

1) పన్నులు: ప్రభుత్వ ఆదాయ వర్గాలలో అతి ముఖ్యమైనది పన్నులు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం పన్నుల ద్వారానే సమకూరుతుంది. పన్నులు కేవలం ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే సాధనంగానే కాకుండా ఆర్థిక కార్యకలాపాల నియంత్రణకు మత్తుపానీయాల, వంట వస్తువుల వినియోగాన్ని తగ్గించటానికి ఉపయోగించటం జరుగుతుంది.

ప్రత్యక్షంగా తాను పొందే ప్రయోజనంతో నిమిత్తం లేకుండా, దేశ ప్రజలందరి ప్రయోజనం కొరకు ప్రభుత్వం చేసే వ్యయానికి గాను పౌరులు ప్రభుత్వానికి నిర్బంధంగా చెల్లించే మొత్తాన్ని పన్ను అందురు. పన్నుల గురించి వివిధ ఆర్థిక వేత్తలు విభిన్న నిర్వచనాలను ఇచ్చినారు.

సెలిగ్‌మాన్ (Seligman) ఉద్దేశంలో "తనకు సంక్రమించే ప్రత్యేక సదుపాయాలు లేదా ప్రయోజనాలతో సంబంధం లేకుండా, ప్రజలందరి ప్రయోజనం కొరకు ప్రభుత్వం చేసే వ్యయానికి ప్రతి పౌరుడు నిర్బంధంగా చెల్లించేది పన్ను".

బాస్టబుల్ (Bastable) ఉద్దేశంలో "ప్రభుత్వం అందించే సేవల కోసం అయ్యే వ్యయానికి వ్యక్తిగాని, వ్యక్తుల సముదాయంగాని తమ సంపద నుండి నిర్బంధంగా చెల్లించేది పన్ను".

ప్లేన్ (Plehn) ఉద్దేశంలో "ప్రజలందరి శ్రేయస్సు కొరకు ప్రభుత్వం చేసే వ్యయానికి ప్రజలంధరి దగ్గర నుండి నిర్బంధంగా వసూలు చేసిన ద్రవ్య మొత్తాన్ని పన్ను అందురు".

డాల్టన్ (Dalton) ఉద్దేశంలో "పన్ను చెల్లించే వ్యక్తికి ప్రభుత్వం వాస్తవంగా అందించే సేవలతో నిమిత్తం లేకుండా, నిర్బంధంగా విధించేది పన్ను అంతే గాని చట్ట ఉల్లంఘనకు విధించే జరిమానా కాదు".

ఆడమ్ స్మిత్ (Adam Smith) ఉద్దేశంలో " ప్రభుత్వానికి ఆసరాగా ఉండటానికి పౌరులు చెల్లించే మొత్తాన్ని పన్ను అందురు".

**పన్నుల లక్షణాలు:**

1) పన్నులు నిర్బంధంగా చెల్లించవలసిన మొత్తాలు.
2) పన్నుల చెల్లింపు విషయంలో ప్రజల ఇష్టాయిష్టాలతో నిమిత్తం ఉండదు.
3) పన్నులను ప్రజలందరి సామాన్య ప్రయోజనం కోసం విధించటం జరుగుతుంది. పన్నుల ద్వారా వసూలయిన మొత్తాన్ని ప్రజలందరి సంక్షేమానికి ఉపయోగించటం జరుగుతుంది.
4) పన్నుల విషయంలో ఇచ్చి పుచ్చుకునే సంబంధం ఉండదు. అనగా పన్ను చెల్లించిన వారికి పన్ను మొత్తానికి సమానమైన ప్రత్యక్ష ప్రతిఫలం ఉండదు.
5) పన్నుల చెల్లింపుల విషయంలో త్యాగం ఇమిడి ఉంటుంది.
6) ఆస్తులపై గాని, వస్తువుల పైగాని పన్నుల విధించినపుడు వాటిని చెల్లించవలసిన బాధ్యత వ్యక్తులపై ఉంటుంది.
7) పన్నులు ప్రభుత్వ సేవలకు చెల్లించే ధరగాని లేదా ప్రతిఫలం గాని కాదు.
8) పన్నుపరిధి, పన్ను మొత్తం చట్టం ద్వారా నిర్వహించటం జరుగుతుంది.

2) **ఫీజు (Fees) :** ప్రభుత్వం సామాన్య ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని అందించే సేవల వలన ఎవరయితే ప్రయోజన పొందుతారో వారి నుండి ఆ సేవలకయ్యే వ్యయంలో కొంతభాగాన్ని ఫీజుల రూపంలో వసూలు చేస్తుంది. ప్రజలంద సామాన్య ప్రయోజనాన్ని కలిగిస్తూ దానితో పాటు ప్రత్యేక ప్రయోజనాన్ని కూడా కలిగించే ప్రభుత్వ సేవలకయ్యే వ్యయా గాను వసూలు చేసే నిర్బంధ చెల్లింపులు ఫీజు అని ప్లెన్ అభిప్రాయం. "ప్రజా సంక్షేమాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచు చేపట్టిన సేవలయినప్పటికి చెల్లించేవారికి ప్రత్యేక ప్రయోజనాన్ని చేకూర్చే సేవల వ్యయం కోసం ప్రభుత్వం వసూలు మొత్తమే ఫీజు" అని సెలిగ్‌మన్ (Seligman) నిర్వచించినాడు.

పై నిర్వచనాలను బట్టి ప్రభుత్వ సేవల ద్వారా ప్రత్యేక ప్రయోజనం పొందేవారు నిర్బంధంగా చెల్లించవలసిన మొత్త ఫీజు. ఉదా॥ కోర్టుఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, విద్య ఫీజు మొదలగునవి.

**ఫీజు - లక్షణాలు:**

1) పరిపాలనా పరమైన లేదా న్యాయపరమైన సేవలకు వసూలు చేయబడేది ఫీజు.

2) ఆ సేవనందించటానికయ్యే వ్యయం లేదా స్వభావాన్ని బట్టి ఫీజు మొత్తం ఆధారపడి ఉంటుంది.

3) ఫీజు చెల్లించే వారికి దానికి సమాన ప్రతిఫలాన్ని అందించటం జరుగుతుంది.

**పన్నులకు - ఫీజుకు గల వ్యత్యాసాలు:**పన్నులకు-ఫీజులకు మధ్యగల వ్యత్యాసాలను సెలిగ్‌మన్ ఈ క్రింది విధంగా వివరించిన

(a) పన్నులు ప్రజలందరిపై విధించే సామాన్య భారం. ప్రత్యేక ప్రయోజనాన్ని పొందినందుకు చెల్లించేవి ఫీజులు.

(b) చెల్లింపు సామర్థ్యం ఆధారంగా పన్ను విధించటం జరుగుతుంది. కాని వ్యక్తి పొందే ప్రత్యేక ప్రయోజనం ఆధారంగా ఫీ వసూలు చేయడం జరుగుతుంది.

(c) పన్నుల విషయంలో ప్రభుత్వ సేవల ద్వారా పొందిన ప్రయోజనాన్ని ప్రత్యక్షంగా కొలవటానికి వీలులేదు. కాని ఫీ విషయంలో ప్రయోజనాన్ని కొలవవచ్చును.

(d) ఫీజు వలన వచ్చే ఆదాయం ఆ ప్రత్యేక సేవకు అయిన ఖర్చును మించి ఉండదు. కాని పన్నుల విషయంలో ఇ జరగదు.

(e) పన్నుల విషయంలో ఇచ్చిపుచ్చుకునే సంబంధం ఉండదు. కాని ఫీజుల విషయంలో ఇచ్చిపుచ్చుకునే సంబంధం ఉంటుం

3. **ప్రత్యేక విధింపులు (Special Asessments) :**

ప్రభుత్వం తలపెట్టిన పనుల వలన ప్రైవేటు వ్యక్తుల ఆస్తుల విలువ పెరిగినప్పుడు దాని వలన లాభం పొందిన ఆ యజమానులు వారు పొందిన లాభం అనుపాతంలో ఆ పనులకయ్యే ఖర్చును రాబట్టటానికి ప్రభుత్వం ఒక్కసారి మాత్రే వసూలు చేసే మొత్తాన్ని ప్రత్యేక విధింపులు" అని సెలిగ్‌మన్ (Seligman) అభిప్రాయపడెను. ఉదా॥ ప్రభుత్వం నీటిపారుద ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టినప్పుడు ఆ ప్రాంతంలో భూముల విలువ పెరుగుతుంది. లాభం పొందిన భూమి యజమాను నుంచి వారు పొందిన ప్రయోజనం అనుపాతంలో ప్రభుత్వం ప్రత్యేక విధింపు ద్వారా ఆ ప్రాజెక్టు నిర్మాణానికి అయే వ్యయాన్ని పూర్తిగా గాని లేదా కొంతమేరకు గాని రాబట్టుకొంటుంది.

ప్రత్యేక విధింపు లక్షణాలు:

1) వీటి చెల్లింపులలో ప్రత్యేక ప్రయోజనం ఉంటుంది.

2) ప్రత్యేక ప్రయోజనాన్ని కొలవవచ్చు.

3) ప్రత్యేక విధింపు పొందిన ప్రయోజనం అనుపాతంలో ఉంటుంది.

4) ప్రత్యేక విధింపులు స్థానికమైన ప్రత్యేకాభివృద్ధి పనులకు విధించటం జరుగుతుంది.

5) సమాజానికి శాశ్వత ఉత్పత్తి సాధనాల పెంపుదలకు అవసరమైన మూలధనాన్ని ఏర్పాటు చేయటానికి ప్రత్యేక విధింపులు తోడ్పడతాయి.

6) ప్రత్యేక విధింపులను స్థిరాస్తులపై విధిస్తారు.

7) వీటిని విధించిన చోట మినహాయింపులు ఉండవు.

8) ప్రభుత్వం చేపట్టిన పనికి అయిన వ్యయం కంటె గాని దాని నుండి లభించిన ప్రయోజనం కంటె దాని ప్రత్యేక విధింపు ఎక్కువగా ఉండరాదు.

9) ఇవి ఒక ప్రాంతానికే పరిమితమై ఉంటాయి.

పన్నులకు ప్రత్యేక విధింపులకు గల వ్యత్యాసాలు:

1) పన్నులను దేశవ్యాప్తంగా విధిస్తే, ప్రత్యేక విధింపులు ఒక ప్రాంతానికే పరిమితమై ఉంటాయి.

2) పన్నులు పురోగామి, అనుపాతపు మరియు తిరోగామి పద్ధతులలో విధించవచ్చును. కాని ప్రత్యేక విధింపులు అనుపాత పన్నులలో మాత్రమే విధించటం జరుగుతుంది.

3) పన్ను చెల్లింపులో ప్రత్యేక ప్రయోజనం ఉండదు కాని ప్రత్యేక ప్రయోజనం పొందినపుడు మాత్రమే ప్రత్యేక విధింపులుంటాయి.

**4. జరిమానాలు, పెనాల్టీలు (Fines & Penalties):**

ప్రభుత్వ చట్టాలను అతిక్రమించిన వారిపై జరిమానాలు, పెనాల్టీలు విధించటం జరుగుతుంది. వీటిని విధించుటలో ప్రభుత్వ ముఖ్యోద్దేశం ఆదాయం కాదు. కేవలం నేరాలను అదుపుచేయటమే వీటి ఉద్దేశం.

**5. జప్తులు, డిపాజిట్ మొత్తాలను తీసుకోవటం (Forfeitures):**

ప్రభుత్వానికి, ప్రైవేటు వ్యక్తులకు మధ్య కుదిరిన ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఆ వ్యక్తి డిపాజిట్ చేసిన మొత్తాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందో అదేవిధంగా ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు ఇతర చెల్లింపులను చేయకపోతే వారి ఆస్తులను ప్రభుత్వం జప్తు చేస్తుంది.

**6. ఏచ్చీట్లు (Essheats):**

ఏ వ్యక్తి అయినా వారసులు లేకుండా గాని లేదా తన ఆస్తి ఎవరికి చెందాలో వీలునామా వ్రాయకుండా మరణిస్తే అతని ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. దీనినే ఏచ్చీట్లు అందురు.

7. వాణిజ్య ఆదాయాలు లేదా ధరలు (Commercial Revenues or Prices) :

ప్రభుత్వ సంస్థలలో ఉత్పత్తి అయిన వస్తుసేవలను విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని వాణిజ్య ఆదాయాలంటారు. ఈ వస్తుసేవల వలన ప్రయోజనం చేకూరుతుంది కనుక ప్రభుత్వం వాటికి ధరలు నిర్ణయించి వసూలు చేస్తుంది. కాని ప్రభుత్వం ఉత్పత్తి చేసే వస్తుసేవలకు నిర్ణయించే ధరలు లాభాపేక్ష కాకుండా తక్కువగా కాని లేదా ఉత్పత్తి వ్యయానికి సమానమయిన ధరలు గాని నిర్ణయించివచ్చును.

8. గ్రాంట్లు, కానుకలు (Grants & Gifts) :

ఒక ప్రభుత్వం మరొక ప్రభుత్వానికి ఉదారంగా ఇచ్చే ద్రవ్యాన్ని గ్రాంటు అందురు. ఉదా॥ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు గ్రాంటును అందిస్తాయి. సాధారణంగా గ్రాంట్లను ఒక ప్రత్యేకమైన పనికి ఇస్తారు. ఉదా॥ విద్య, వైద్య, ఆరోగ్య, ప్రజా సంక్షేమ కార్యకలాపాలకు గ్రాంట్లను ఇస్తారు.

ఒక ప్రభుత్వం మరొక ప్రభుత్వానికి, ప్రజలు ప్రభుత్వానికి, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వానికి స్వచ్ఛందంగా చెల్లించేవాటిని కానుకలు అందురు. వరదలు, భూకంపాలు, అతివృష్టి, అనావృష్టి మొదలగు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు యుద్ధసమయాలలో ప్రజలు ప్రభుత్వానికి ధనాన్ని కానుకగా ఇస్తారు. సాధారణ పరిస్థితులలో కూడా ఆసుపత్రులు, విద్యాలయాల నిర్మాణానికి ప్రజలు ప్రభుత్వానికి విరాళాలు ఇస్తారు.

9. ప్రభుత్వ ఆస్తుల నుండి వచ్చే ఆదాయం:

గనులు, అడవులు, నదులు, పర్వతాలు మొదలగు సహజవనరులను కౌలుకు ఇవ్వటం ద్వారా లేదా విక్రయించటం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.

10. కరెన్సీ నోట్లను ముద్రించుట:

ప్రభుత్వం కరెన్సీ నోట్లను అచ్చు వేయటం ద్వారా కూడా ఆదాయాన్ని సమకూర్చుకొనగలుగుతుంది. కాని కరెన్సీ నోట్లను అధికంగా ముద్రించుట వలన ద్రవ్య సప్లై పెరిగి, ద్రవ్యం విలువ తగ్గిపోయి, ధరలు పెరుగుతాయి.

## 3.3. ప్రభుత్వ ఆదాయం వనరుల వర్గీకరణ:

ప్రభుత్వ ఆదాయ వనరుల ప్రభావం, వాటి భారంలో వ్యత్యాసాలు, ఆదాయ వనరుల ప్రాముఖ్యతను తెలుసుకొనుటకు ప్రభుత్వ ఆదాయ వనరుల వర్గీకరణ ఎంతగానో అవసరమవుతుంది. ఆర్థికవేత్తలు ప్రభుత్వ ఆదాయాన్ని అనేక రకాలుగా వర్గీకరించినారు.

1) ఆడమ్‌స్మిత్ వర్గీకరణ: ఆడమ్‌స్మిత్ ప్రభుత్వ ఆదాయాన్ని రెండు రకాలుగా వర్గీకరించినాడు.

(a) ప్రజల నుండి లభించే ఆదాయం.

(b) ప్రభుత్వ ఆస్తి నుండి లభించే ఆదాయం.

పన్నులు మొదలగు మార్గాల ద్వారా ప్రభుత్వం సమకూర్చుకునే ఆదాయం మొదట తరగతికి చెందినది. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ ఆస్తుల నుండి లభించే ఆదాయం రెండవ తరగతికి చెందినది.

2) సెలిగ్‌మన్ (Seligman) వర్గీకరణ: ప్రభుత్వ ఆదాయాన్ని సెలిగ్‌మన్ మూడు తరగతులుగా వర్గీకరించినాడు.

(a) ఉచితంగా వచ్చే ఆదాయం: ప్రభుత్వానికి ప్రజలు, ఇతర దేశాల ప్రభుత్వాలు ఉచితంగా ఇచ్చే గ్రాంట్లు, కానుకలు, చందాలు మొదలగున్నవి ఈ తరగతికి చెందినవి.

**(బి) ఒప్పందపు ఆదాయం:** ప్రజలకు ప్రభుత్వానికి మధ్య కుదిరిన ఒప్పందం వలన ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని ఒప్పందపు ఆదాయం అందురు. ఉదా॥ ప్రభుత్వ భూములు, గనులు మొదలగు వాటిని కౌలుకు ఇవ్వటం వలన ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. రైల్వేలు, తంతితపాలా, ప్రభుత్వ రంగ సంస్థల నుండి వచ్చే ఆదాయం ఈ తరగతికి చెందినవి.

**(సి) లుట్జ్ వర్గీకరణ (Lutz's Classification):** లుట్జ్ ప్రభుత్వ ఆదాయాన్ని ఈ క్రింది విధంగా వర్గీకరించినాడు.

- వాణిజ్య ఆదాయాలు
- పరిపాలనా సంబంధమైన ఆదాయాలు
- పన్నులు
- ప్రభుత్వ ఋణాలు
- గ్రాంట్లు
- బదిలీ ఆదాయాలు

**4) ఆడమ్స్ వర్గీకరణ:** ఆడమ్స్ ప్రభుత్వ ఆదాయాన్ని 3 విధాలుగా వర్గీకరించెను.

**(i) ప్రత్యక్ష ఆదాయం:** ప్రభుత్వ ఆస్థులు, ప్రభుత్వ రంగ సంస్థలు, బహుమానాల ద్వారా లభించే ఆదాయం ప్రభుత్వ ఆదాయం.

**(ii) ఉత్పన్న ఆదాయం:** పన్నులు, ఫీజులు, ప్రత్యేక విధింపులు, జరిమానాలు మొదలగు వాటి ద్వారా లభించే ఆదాయం ఉత్పన్న ఆదాయం.

**(iii) నిరీక్షణ ఆదాయం:** బాండ్లు, సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లులు మొదలగు వాటి విక్రయం ద్వారా ప్రభుత్వానికి లభించే ఆదాయాన్ని నిరీక్షణ ఆదాయం అందురు.

**5) షిరాస్ వర్గీకరణ:** షిరాస్ ప్రభుత్వ ఆదాయాన్ని రెండు రకాలుగా విభజించెను.

**(i) పన్నుల ద్వారా లభించే ఆదాయం:** పన్నులు, ఫీజులు, ప్రత్యేక విధింపుల ద్వారా లభించే ఆదాయం.

**(ii) ఇతర ఆదాయం:** ప్రభుత్వ పరిశ్రమల నుండి లభించే ఆదాయం. విద్య, వైద్య సేవల వలన లభించే ఆదాయం, ప్రభుత్వ ఋణం ద్వారా సమకూర్చుకునే ఆదాయం ఈ తరగతికి చెందినది.

**6) డాల్టన్ వర్గీకరణ:** డాల్టన్ ప్రభుత్వ ఆదాయాన్ని 12 రకాలుగా వర్గీకరించినాడు.

(a) పన్నులు

(b) కప్పములు, నష్టపరిహారాలు

(c) నిర్బంధ ఋణాలు

(d) జరిమానాలు

(e) ప్రభుత్వ ఆస్థుల నుండి వచ్చే ఆదాయం.

(f) ప్రభుత్వ సేవలకు వసూలు చేసే ఫీజు

(g) ప్రభుత్వ రంగ సంస్థల లాభాలు

(h) స్వచ్ఛంద ఋణాలు

(i) ప్రత్యేక విధింపులు

(j) ప్రభుత్వ ఏకస్వామ్య సంస్థల నుండి లభించే ఆదాయం

(k) స్వచ్ఛంద కానుకలు

7) టేలర్ వర్గీకరణ: టేలర్ ప్రభుత్వ ఆదాయాన్ని నాలుగు వర్గాలుగా విభజించెను.

**(a) గ్రాంట్లు, కానుకలు:** ఒక ప్రభుత్వం మరొక ప్రభుత్వానికి గ్రాంట్లు ఇస్తుంది. ఉదా॥ కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు, రాష్ట్రాలు స్థానిక సంస్థలకు గ్రాంట్లను మంజూరు చేస్తారు. గ్రాంట్లు రెండు రకములు.

(ఎ) సాధారణ గ్రాంట్లు

(బి) ప్రత్యేక గ్రాంట్లు

ఆదాయంలోని లోటును భర్తీ చేసుకొనుటకు ఇచ్చే గ్రాంట్లను సాధారణ గ్రాంట్లు అందురు. రహదారుల నిర్మాణం, విద్య సదుపాయాల కల్పనకు ఇచ్చే గ్రాంట్లు సాధారణ గ్రాంట్లు.

ప్రజలు, సంస్థలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి చెల్లించే మొత్తాలను కానుకలు అందురు. యుద్ధాలు, వరదలు, భూకంపాలు సంభవించినపుడు ప్రజలు ప్రభుత్వానికి కానుకలు ఇస్తారు.

**(b) పరిపాలనా నిర్వహణ ఆదాయాలు:** ప్రత్యేక విధింపులు, అభివృద్ధి విధింపులు, ఫీజులు, లైసెన్సులు, జరిమానాలు, ఏచ్చీట్లు, జప్తులు మొదలగు పరిపాలనా నిర్వహణ ద్వారా లభించే ఆదాయాలు.

**(c) వాణిజ్య ఆదాయాలు:** ప్రభుత్వం ఉత్పత్తి చేసి సప్లయి చేసే వస్తువులకు ప్రజల ధరలు చెల్లించుట ద్వారా ప్రభుత్వానికి లభించే ఆదాయాన్ని వాణిజ్య ఆదాయం అందురు.

ప్రైవేటు పెట్టుబడిదారులు ఉత్పత్తి చేయటానికి ఆసక్తి చూపని వస్తువులను ఉత్పత్తి చేయటం, సహజ ఏకస్వామ్యాలు మొదలగు వాటి నుండి ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వాణిజ్య ఆదాయం అందురు.

**(d) పన్నులు:** వ్యక్తులు పొందే ప్రయోజనంలో సంబంధం లేకుండా ప్రజలందరి ప్రయోజనం కొరకు ప్రభుత్వం చేసే వ్యయానికి ప్రతి పౌరుడు నిర్బంధంగా చెల్లించే మొత్తాన్ని పన్ను అందురు.

ప్రభుత్వ ఆదాయంలో ఎక్కువ భాగం పన్నుల ద్వారానే సమకూరుతుంది. పన్నుల ముఖ్య లక్ష్యం ఆదాయాన్ని సమకూర్చుకోవటమే కాకుండా కొన్ని ఆర్థిక కార్యకలాపాల నియంత్రణ లేదా క్రమబద్ధీకరణ, సాంఘిక న్యాయాన్ని చేకూర్చటానికి కూడా పన్నులు తోడ్పడతాయి.

8) కె.కె. మెహతా వర్గీకరణ: కె.కె. మెహతా ప్రభుత్వ ఆదాయాన్ని పన్ను, ఫీజు డ్యూటీలు అని 3 విధాలుగా వర్గీకరించినాడు.

ప్రభుత్వ సేవలందించటానికి కావలసిన ద్రవ్యాన్ని సమకూర్చుకునే ఆశయంలో ప్రభుత్వం వసూలు చేసే మొత్తాన్ని పన్ను అని, వస్తుసేవల వినియోగాన్ని ఆశయంతో వసూలు చేసేది ఫీజు అని, ప్రైవేటు సంస్థలు అందించే సేవలను ప్రోత్సహించటం లేదా వాటి వినియోగాన్ని నిరుత్సాహపరచటానికి ప్రభుత్వం వసూలు చేసే మొత్తాన్ని "డ్యూటీ" అంటారు.

## 3.4. పన్నుల వర్గీకరణ:

తాను పొందే ప్రత్యేక, ప్రత్యక్ష ప్రయోజనంతో నిమిత్తం లేకుండా ప్రజలందరి ప్రయోజనం కొరకు ప్రభుత్వం చేసే వ్యయానికై ప్రతివ్యక్తి నిర్బంధంగా ప్రభుత్వానికి చెల్లించేది పన్ను.

**తాత్కాలిక పన్ను - శాశ్వత పన్ను:** దేశం క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు ప్రభుత్వం తాత్కాలిక పన్నులు విధిస్తుంది. ఉదా॥ యుద్ధం, కరువుకాటకాలు మొదలగునవి ఎదుర్కొనటానికి, శాశ్వత ప్రాతిపదికపై విధించే పన్నులను శాశ్వత పన్నులు అందురు. ఉదా॥ ఆదాయం పన్ను, అమ్మకం పన్ను మొదలగున్నవి.

**ఆస్తిపై పన్ను - వస్తువులపై పన్ను:** ఒక నిర్ణీత గడువులో ఒకేసారి చెల్లించేది ఆస్తిపై పన్ను. ఉదా॥ మరణసుంకాలు, ఇంటి పన్ను మొదలగున్నవి.

ఉత్పత్తి లేదా అమ్మకంపై విధించే పన్ను వస్తువులపై పన్నులు. ఉదా॥ అమ్మకం పన్ను, ఎక్సైజు డ్యూటీలు.

**మూల్యానుగత పన్నులు - నిర్దిష్ట పన్నులు:** వస్తువు విలువను బట్టి పన్ను విధిస్తే దాని విలువను బట్టి విధించే పన్ను లేదా మూల్యానుగత పన్ను అందురు. వస్తువు యొక్క బరువు, ఘన పరిమాణాన్ని బట్టి విధించే పన్నునూ నిర్దిష్ట ప్రత్యేక పన్ను అందురు.

**ఉత్పత్తిపై పన్ను-వినియోగంపై పన్ను:** వస్తువులపై విధించే పన్నులు ఉత్పత్తిని బట్టి, వాటి అమ్మకాలను బట్టి కూడా విధించవచ్చును. వస్తువు ఉత్పత్తి జరిగే స్థానంలో పన్ను విధిస్తే దాన్ని ఎక్సైజు సుంకం అందురు. వస్తువు అమ్మకం జరిగేటప్పుడు పన్నువిధిస్తే దానిని అమ్మకం పన్ను అందురు.

**ఆదాయంపై పన్ను-మూలధనంపై పన్ను:** ఆస్తి నుండి వచ్చే ఆదాయంపై పన్ను విధిస్తే దానిని ఆదాయం పన్ను అని, ఆస్తి విలువను బట్టి విధించే పన్నును మూలధనంపై పన్ను అందురు.

**ప్రత్యక్ష పన్ను-పరోక్ష పన్ను:** ఎవరిమీదనయితే పన్నువిధించటం జరుగుతుందో వారే ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తే దానిని ప్రత్యక్ష పన్ను అందురు. ఒకరిమీద విధించబడిన పన్నును మరొకరికి బదిలీ చేస్తే దానిని పరోక్ష పన్ను అందురు.

## 3.5. ప్రత్యక్ష పన్నులు:

ప్రభుత్వం ఎవరిమీదయితే పన్ను విధిస్తుందో వారే పన్ను భారాన్ని భరిస్తే దానిని ప్రత్యక్ష పన్ను అందురు. చట్ట ప్రకారం ఎవరిపైన పన్ను విధించటం జరుగుతుందో వారే ఆ పన్నును వాస్తవంగా చెల్లించి భరిస్తే దాన్ని ప్రత్యక్ష పన్ను అందురు. పన్ను తొలి ప్రభావం, అంతిమ ప్రభావం ఒకే వ్యక్తిపై ఉంటే దానిని ప్రత్యక్ష పన్ను అంటారు.

**ప్రత్యక్ష పన్నులు-సుగుణాలు:** ప్రత్యక్ష పన్నుల సుగుణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

**1) చెల్లింపు సామర్థ్యం:** ప్రత్యక్ష పన్నులను చెల్లింపు సామర్థ్య ప్రాతిపదికగా విధించటం జరుగుతుంది. ఈ పన్నులను ఆదాయంపైనా, సంపదపైనా విధించటం జరుగుతుంది. ఆదాయ, సంపదల పరిమాణం పెరిగితే ఎక్కువ రేటులో పన్నును విధించటం జరుగుతుంది.

**2) పురోగామి లక్షణం:** ప్రత్యక్ష పన్నులు పురోగామి లక్షణాన్ని కలిగి ఉంటాయి. ఆదాయం పెరిగే కొలది పన్నురేటు కూడా పెరుగుతూ ఉంటే దానిని పురోగామి పన్ను అంటారు. ఆదాయ, సంపదల పంపిణీలోని అసమానతల తొలగింపుకు ఈ పన్నులు దోహదపడతాయి.

**3) ఉత్పాదకత:** ప్రత్యక్ష పన్నులు ఉత్పాదకత లక్షణాన్ని కలిగి ఉంటాయి. ప్రత్యక్షపన్నుల ద్వారా ప్రభుత్వానికి రాబడి ఎక్కువగా ఉంటుంది. ప్రజల ఆదాయం పెరిగితే ఈ పన్నుల ద్వారా వచ్చే రాబడి కూడా పెరుగుతుంది.

**4) వ్యాకోచత్వం:** ప్రత్యక్ష పన్నులు వ్యాకోచ లక్షణాన్ని కలిగి ఉంటాయి. ఉదా॥ ఆదాయపు పన్ను రేటును స్వల్పంగా పెంచితే ప్రభుత్వానికి వచ్చే రాబడి కూడా అనేక రెట్లు పెరుగుతుంది.

**5) నిశ్చయితా నియమము:** ప్రత్యక్ష పన్నులు నిశ్చయితా నియమాన్ని కలిగి ఉంటాయి. పన్ను చెల్లించే వారు ఎంత పన్ను చెల్లించాలనేది ఖచ్చితంగా తెలుస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వానికి కూడా ప్రత్యక్ష పన్నుల నుండి ఎంత ఆదాయం వస్తుందో కూడా తెలుస్తుంది.

**6) మిత వ్యయం:** ప్రత్యక్ష పన్నులు మితవ్యయ నియమాన్ని అనుసరించి ఉంటాయి. అనగా ప్రత్యక్ష పన్నుల వసూలుకు ఎక్కువ మంది సిబ్బందిని నియమించవలసిన అవసరం లేదు. కనుక పన్ను వసూలుకు ప్రభుత్వం ఎక్కువగా ఖర్చు చేయవలసిన అవసరం లేదు.

**7) పౌర జాగృతి:** ప్రత్యక్ష పన్నులు పౌరజాగృతిని పెంచుతాయి. సాధారణంగా ప్రత్యక్షపన్నులను చెల్లించేవారు ఎక్కువ మొత్తంలో పన్నును చెల్లిస్తారు. కనుక ప్రభుత్వ వ్యయ విధానాన్ని నిశితంగా పరిశీలిస్తూ ఉంటారు.

**8) ద్రవ్యోల్బణ నియంత్రణ:** ప్రత్యక్ష పన్నుల ద్వారా ద్రవ్యోల్బణాన్ని అరికట్టవచ్చును. ద్రవ్యోల్బణాన్ని అరికట్టటానికి ప్రభుత్వం పన్నురేటును పెంచి ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది.

**9) ఆర్థిక అసమానతల తగ్గుదల:** ప్రత్యక్ష పన్నుల విధానంలో పురోగామి విధానాన్ని అనుసరించటానికి అవకాశం ఉంటుంది. ఆదాయం పెరిగే కొలది పన్నురేటును పెంచి ధనికులపై పన్నుభారాన్ని పెంచి, పేదవారిపై పన్నుల భారాన్ని తగ్గించుట ద్వారా ఆర్థిక అసమానతలను తొలగించవచ్చును.

**ప్రత్యక్ష పన్నులు - లోపాలు:** ప్రత్యక్ష పన్నులలో ఈ క్రింద పేర్కొన్న లోపాలు కలవు.

**1) ప్రాతికూల్యం:** ప్రత్యక్ష పన్నులను చెల్లించే వారు ఎక్కువ మొత్తంలో ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తారు. తాము కష్టపడి సంపాదించిన ఆదాయంలో ఎక్కువ భాగాన్ని పన్నులను చెల్లించటం వలన పన్ను చెల్లింపుదారులకు ఈ పన్నులను చెల్లించుట కొంత వరకు ప్రాతికూల్యతను తెలియజేస్తారు.

**2) అసౌకర్యం:** ప్రత్యక్ష పన్నుల చెల్లింపు కొంత అసౌకర్యంగా కూడా ఉంటుంది. ఈ పన్ను చెల్లించేటప్పుడు మొత్తం ఆదాయం, ఆదాయ మార్గాలు మొదలగు విషయాలను పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వానికి తెలియజేయవలసి ఉంటుంది. కనుక ఇది పన్ను చెల్లింపుదారులకు కొంత అసౌకర్యంగా ఉంటుంది.

**3) పన్ను ఎగవేతకు అవకాశం:** ప్రత్యక్ష పన్నులకు చెల్లించే వారు తమ ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది. కనుక పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వానికి సరిఅయిన లెక్కలు చూపించకుండా పన్ను ఎగవేయటానికి ప్రయత్నిస్తారు.

**4) అవినీతి-లంచగొండితనం:** ప్రత్యక్ష పన్నులను విధించే ముందు అధికారులు, పన్ను చెల్లింపుదారుల ఆదాయ పరిమాణాన్ని విలువను నిర్ణయిస్తారు. కొంతమంది అధికారులు అవినీతి, లంచగొండితనానికి లోనై పన్ను చెల్లింపుదారుల ఆదాయ పరిమాణాన్ని, ఆస్తి విలువను తక్కువగా అంచనా వేస్తారు. దీనివలన ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోతుంది.

**5) పొదుపు-పెట్టుబడులపై ప్రభావం:** ప్రత్యక్ష పన్నుల వలన ప్రజలు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించుట వలన వారి పొదుపు తగ్గిపోతుంది. పొదుపు చేసే శక్తి తగ్గిపోవుట వలన పెట్టుబడుల పరిమాణం కూడా తగ్గిపోతుంది.

**6) అందరిపై పన్ను విధించబడదు:** ప్రత్యక్షపన్నులు సమాజంలో అన్ని వర్గాల ప్రజలపై విధించటం జరగదు. చట్టం దృష్టిలో అందరూ సమానులే కనుక ప్రజలందరి పైన పన్నును సమానంగా విధించాలని కొందరి అభిప్రాయం. ఈ పన్నును అధిక ఆదాయ వర్గాల మీద మాత్రమే విధించబడి అల్పాదాయ వర్గాలను పన్ను పరిధి నుంచి మినహాయించటం జరుగుతుంది.

## 3.6. పరోక్ష పన్నులు:

ప్రభుత్వం ఒకరిపై విధించిన పన్నును మరొకరికి బదిలీ చేయటానికి అవకాశం ఉంటే దానిని పరోక్ష పన్ను అందురు. పన్ను తొలి ప్రభావం ఒకరి పైన, అంతిమ ప్రభావం మరొకరిపై ఉంటే దానిని పరోక్ష పన్ను అందురు. పరోక్ష పన్నుకు ఉదాహరణగా అమ్మకం పన్నును పేర్కొనవచ్చును.

**పరోక్ష పన్నులు-సుగుణాలు:** పరోక్ష పన్నుల వలన ఈ క్రింది ప్రయోజనాలు కలవు.

**1) సౌకర్యం:** పరోక్ష పన్నులు చెల్లింపు సౌకర్య నియమాన్ని పాటిస్తాయి. సాధారణంగా పరోక్ష పన్నులు ఎక్కువ పరిమాణంలో ఉంటాయి. పైగా ఈ పన్నులు వస్తువు ధరతో కలసి ఉంటాయి. పైగా ఈ పన్నులు వస్తువు ధరలో కలిసి ఉంటాయి.

**2) వ్యాకోచము:** పరోక్ష పన్నులు వ్యాకోచ నియమాన్ని కలిగి ఉంటాయి. ఈ పన్నుల ద్వారా ప్రభుత్వ రాబడిని పెంచుకొనవచ్చును. పరోక్ష పన్ను రేటను కొద్దిగా పెంచినందువలన ప్రభుత్వానికి వచ్చే రాబడి అనేక రేట్లు ఎక్కువగా ఉంటుంది. ఉదా॥ అమ్మకం పన్ను.

**3) పొదుపు-పెట్టుబడి తగ్గింపు:** సాధారణంగా పరోక్ష పన్నులను ప్రజలను తాము వ్యయం చేసేటప్పుడే చెల్లిస్తారు. కనుక పరోక్ష పన్ను పొదుపు మరియు పెట్టుబడులను తగ్గించవు.

**4) వ్యతిరేకత ఉండదు:** పరోక్ష పన్నులను చిన్నచిన్న మొత్తాలలో చెల్లించటం జరుగుతుంది. ఈ పన్నులు వస్తువు ధరతో కలసి ఉంటాయి. కనుక ఇటువంటి పన్నులను చెల్లించుటలో ప్రజల నుండి ఎటువంటి వ్యతిరేకత ఉండదు.

**5) పన్ను ఎగవేత ఉండదు:** పరోక్ష పన్నులను ఎగవేయుట సాధ్యం కాదు. వస్తువును కొనుగోలు చేసేటప్పుడు ఈ పన్నును చెల్లించవలసి వస్తుంది. కనుక ఎటువంటి పరిస్థితులలో కూడా ఈ పన్నును ఎగవేయుట సాధ్యపడదు.

**6) అన్ని వర్గాలపై పన్ను విధింపు:** పరోక్ష పన్నులను సమాజంలో అన్ని వర్గాల ప్రజలపై విధించటం జరుగుతుంది. ధనిక, పేద వర్గాలకు చెందిన ప్రజలందరిపైన ఈ పన్నును విధించటం జరుగుతుంది. దీనికి కారణం అన్ని వర్గాల ప్రజలు వస్తువులను కొనుగోలు చేస్తారు కనుక.

**7) హానికర వస్తువుల వినియోగాన్ని తగ్గించుట:** హానికర వస్తువుల వినియోగాన్ని తగ్గించటానికి ఈ పన్నులు ఎంతగానో దోహదపడతాయి. ఉదా॥ మత్తుపానీయాలు, నల్లమందు, గంజాయి, సిగరెట్లు మొదలగు వాటి వినియోగాన్ని తగ్గించటానికి వీటిపై ఎక్కువగా పన్ను విధించటం జరుగుతుంది.

**8) పురోగామి రేటులో విధించవచ్చును:** కొన్న వస్తువులపై పరోక్ష పన్నులను పురోగామి రేటులో కూడా విధించవచ్చును. ఉదా॥ ధనవంతులు వినియోగించే విలాస వస్తువులపై ప్రభుత్వం ఎక్కువరేటులో పన్ను విధిస్తుంది.

**పరోక్షపన్నులు-లోపాలు:** పరోక్షపన్నులలో కూడా కొన్ని లోపాలు లేకపోలేదు.

**1) తిరోగామి స్వభావం:** పరోక్షపన్నుల చెల్లింపు సామర్థ్యం ఆధారంగా విధించటం జరగదు. ధనికులు, పేదవారు అనే విచక్షణ లేకుండా అందరిపై ఒకే రేటులో పన్ను విధించటం జరుగుతుంది దీని ఫలితంగా పేదవారిపై పన్నుల భారం

ఎక్కువగా ఉంటుంది.

**2) పన్ను వసూలుకు అధిక వ్యయం:** పరోక్ష పన్నులు మితవ్యయ నియమాన్ని పాటించటం జరగదు. పరోక్షపన్నుల వసూలుకు ఎక్కువ మంది ప్రభుత్వ సిబ్బందిని నియమించవలసి ఉంటుంది. కనుక సిబ్బంది జీతభత్యాలపై అయ్యే వ్యయం ఎక్కువగా ఉంటుంది.

**3) అనిశ్చిత:** పరోక్ష పన్నుల నుండి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం అనిశ్చితంగా ఉండవచ్చును. ఉదా॥ ఆర్థిక మాంద్య పరిస్థితులలో వస్తువుల కొనుగోలు తక్కువగా ఉంటుంది. దీని ఫలితంగా పరోక్ష పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తక్కువగా ఉంటుంది.

**4) పారిశ్రామికాభివృద్ధికి ఆటంకం:** పరోక్ష పన్నులయిన ఎగుమతులు, దిగుమతులు, సుంకాలు, ఎక్సైజు సుంకాలు మొదలగు వాటివలన పారిశ్రామికాభివృద్ధి కుంటుపడే ప్రమాదమున్నది.

**5) పౌరజాగృతి పెంచవు:** పరోక్షపన్నులు పౌరజాగృతిని పెంచవు. ప్రజలు చిన్నచిన్న మొత్తాలలో పరోక్ష పన్నులను చెల్లిస్తారు. కనుక ప్రభుత్వ వ్యయ విధానాన్ని ప్రజలు పరిశీలించటం జరగదు.

**6) వినియోగదారుని మిగులు తగ్గుట:** ఒక వస్తువుకు చెల్లించటానికి ఇష్టపడిన ధరకు, వాస్తవంగా చెల్లించిన ధరకు మధ్యగల వ్యత్యాసాన్ని వినియోగదారుని మిగులు అందురు. పరోక్షపన్నుల వలన వస్తువుల ధరలు పెరిగి వినియోగదారుని మిగులు తగ్గుతుంది.

## 3.7. సారాంశము:

పై వివరణను బట్టి ప్రత్యక్ష, పరోక్ష పన్ను రెండునూ లాభనష్టములను కలిగియున్నవని తెలియుచున్నది. ఈ రెండు రకాల పన్నులు అవసరమే. గ్లాడ్ స్టోన్ అను ఆర్థికశాస్త్రవేత్త ప్రకారము ప్రత్యక్ష, పరోక్ష పన్నులు రెండునూ సమాన అందంగల అక్కాచెల్లెళ్ళ వంటివి. అభివృద్ధి చెందిన దేశాలలో ప్రత్యక్ష పన్నులు ప్రాముఖ్యం వహించగా భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశములలో పరోక్ష పన్నుల ప్రాముఖ్యము ఎక్కువగా ఉండును.

## 3.8. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1) పెరుగుతున్న ప్రభుత్వ వ్యయానికి అనుగుణంగా ఆదాయాన్ని ప్రభుత్వం సమకూర్చుకోవాలి.

2) ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకొంటున్నది. పన్నులు, ఫీజులు, ప్రత్యేక విధింపులు మొదలగు వాటిద్వారా ప్రభుత్వం ఆదాయ వనరులను సమకూర్చుకొంటున్నది.

3) ప్రభుత్వ ఆదాయవనరులను వివిధ ఆర్థిక శాస్త్రవేత్తలు వివిధ రకాలుగా వర్గీకరించారు.

4) పన్నులను ముఖ్యంగా ప్రత్యక్షపన్నులు, పరోక్షపన్నులుగా వర్గీకరించవచ్చు.

5) ప్రత్యక్ష పన్నుల వలన కొన్ని ప్రయోజనాలు, కొన్ని లోపాలు ఉన్నాయి.

6) పరోక్ష పన్నులలో కొన్ని సుగుణాలు, కొన్ని లోపాలు కలవు.

## 3.9. కఠిన పదాలు:

**1) ఫీజు:** ప్రభుత్వం కొన్ని సేవలను ప్రజలకు అందించేటప్పుడు వాటివలన లాభం పొందే వారి నుండి వాటికి అయ్యే ఖర్చులో

కొంత భాగాన్ని వసూలు చేసే దానిని ఫీజు అని అందురు.

2) ప్రత్యేక విధింపులు: ప్రజాశ్రేయస్సుకు గాను ప్రభుత్వం తలపెట్టిన పనుల వలన ఆస్తుల విలువ పెరిగినపుడు లాభం పొందిన ఆస్థి యజమానుల నుండి వారు పొందిన లాభానికి అనుపాతంలో ఆ పనులకయ్యే ఖర్చును రాబట్టడానికి గాను ఒక్కసారి మాత్రమే వసూలు చేసే మొత్తాలను ప్రత్యేక విధింపులు అని అందురు.

3) ఏచ్చీట్స్: ఒక వ్యక్తి మరణించినపుడు ఆ వ్యక్తికి వారసులు లేనపుడు మరియు వీలునామా వ్రాయనపుడు ఆ వ్యక్తికి సంబంధించిన ఆస్థులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే హక్కు కలిగి ఉండును. దీనినే ఏచ్చీట్స్ అని అందురు.

4) ప్రత్యక్ష పన్నులు: ఏ పన్నుల విషయంలో అయితే పన్నుల భారాన్ని బదిలి చేయడానికి అవకాశం ఉండదో అటువంటి పన్నులను ప్రత్యక్ష పన్నులు అని అందురు.

5) పరోక్ష పన్నులు: ఏ పన్నుల విషయంలో అయితే పన్నుల భారాన్ని ఇతరులకు బదిలీ చేయడానికి వీలుండునో అటువంటి పన్నులను పరోక్షపన్నులని అందురు.

## 3.10. నమూనా ప్రశ్నలు:

I. వ్యాసరూప ప్రశ్నలు:

1) ప్రభుత్వ ఆదాయ వనరులను వివరింపుము.

2) ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నుల సుగుణాలను, లోపాలను వివరింపుము.

II. సంక్షిప్త ప్రశ్నలు:

1) పన్నుల లక్షణాలను తెలుపుము?

2) పన్నులకు, ఫీజులకు గల వ్యత్యాసాలను తెలుపుము?

3) ప్రత్యేక విధింపుల లక్షణాలను తెలుపుము?

4) ప్రభుత్వ ఆదాయ వనరుల వర్గీకరణ గురించి వ్రాయుము?

5) పన్నుల వర్గీకరణ గురించి తెలుపుము?

## 3.11. చదువదగిన గ్రంథాలు :


1) Public Finance - R.K.Lekhi

2) Theory of Public Finance - R.A.Musgrave

3) Public Finance - B.P.Tyagi

4) పబ్లిక్ అర్థశాస్త్రం - తెలుగు అకాడమీ.


- శ్రీ బి. కోటేశ్వరరావు.

పాఠం : 4

# పన్ను విధింపు న్యాయం

## 4.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశంలో మీరు ముఖ్యంగా పన్నువిధింపు సిద్ధాంతాలు, పన్నులు, నియమాలు, ఆశయాలు, అనుపాతపు పన్నులు, పురోగామి పన్నులు గూర్చి పరిశీలించడమైనది. ఈ భాగం పూర్తయ్యే సరికి విద్యార్థులు క్రింది అంశాలను గురించి అవగాహన చేసుకుంటారు.

- పన్ను విధింపు సిద్ధాంతాలు.
- పన్ను విధింపు నియమాలు.
- పన్నుల ఆశయాలు.
- అనుపాతపు పన్నులు-పురోగామి పన్నులు.

## విషయసూచిక


**4.1.** విషయ పరిచయము
**4.2.** పన్ను విధింపు లాభసిద్ధాంతం
**4.3.** సేవా వ్యయాల సిద్ధాంతం
**4.4.** పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం
**4.5.** పన్ను విధింపు నియమాలు లేదా సూత్రాలు
**4.6.** ఉత్తమ పన్నుల విధానం యొక్క లక్షణాలు
**4.7.** పన్నుల ఆశయాలు
**4.8.** అనుపాతపు పన్నులు-పురోగామి పన్నులు
**4.9.** సారాంశము
**4.10.** గుర్తుంచుకోవలసిన విషయములు
**4.11.** కఠిన పదాలు
**4.12.** నమూనా ప్రశ్నలు
**4.13.** చదువదగిన గ్రంథాలు.


## 4.1. విషయ పరిచయము:

దేశంలో ప్రతి పౌరుడు ప్రభుత్వానికి సమాన ప్రత్యక్ష ప్రతిఫలము ఆశించకుండా నిర్బంధంగా చెల్లించే దానినే పన్ను అని అందురు. ప్రజలపై పన్ను విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది. అదేవిధంగా పౌరులు పన్నులు చెల్లించటం తమ బాధ్యతగా గుర్తించాలి. ప్రజలు ప్రభుత్వానికి పన్ను చెల్లించినప్పుడు వారు కొంత భారాన్ని భరిస్తారు. పన్నుల ద్వారా ప్రజల నుండి ప్రభుత్వానికి బదిలీ అయిన ద్రవ్యాన్ని పన్నుల ద్రవ్య భారమని లేదా ప్రత్యక్ష ద్రవ్య భారమని అందురు. పన్ను చెల్లింపుదారుడు పన్ను చెల్లించుట వలన కోల్పోయిన ఆర్థికశ్రేయస్సును పన్నుల వాస్తవిక భారం అందురు. మొదట పన్ను చెల్లించిన వ్యక్తి దాన్ని బదిలీ చేయడానికి కొంతకాలం పడుతుంది. అటువంటి పరిస్థితిలో పన్ను మొత్తమే కాక, బదిలీ చేయుటానికి పట్టిన కాలానికి వడ్డీని కూడా కలిపి వస్తువు ధరను పెంచడం జరుగుతుంది. దీనినే పరోక్ష ద్రవ్య భారం అందురు. పన్ను విధింపువలన ధర పెరిగి వస్తువినియోగం తగ్గిపోతుంది. దీనివలన వినియోగదారులు కోల్పోయిన ప్రయోజనాన్ని పరోక్ష వాస్తవిక భారం అని చెప్పవచ్చు.

పన్నుల భారం సమాజంలోని వివిధ వర్గాల ప్రజలపై న్యాయబద్ధంగా పంపిణీ చేయబడాలి. పన్నుల భారము వివిధ వ్యక్తుల మధ్య ఏ విధంగా పంపిణీ చేయాలి, ఎవరిపై పన్నుల భారము ఎంత ఉండాలి అనే విషయాన్ని హేతుబద్ధంగానూ, జాగ్రత్తగాను పరిశీలించి సమానత్వాన్ని, న్యాయాన్ని సాధించటానికి ఆర్థికశాస్త్రవేత్తలు వివిధ పన్ను సూత్రాలను ప్రతిపాదించారు. పన్ను విధింపు సూత్రాలలో ముఖ్యంగా పన్ను విధింపు లాభసిద్ధాంతం, సేవా వ్యయాల సిద్ధాంతం, పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతం ముఖ్యమైనవి. ఈ సిద్ధాంతాల గురించి విపులంగా పరిశీలిద్దాం.

## 4.2. పన్ను విధింపు లాభసిద్ధాంతం (Benefit Theory of Taxation):

పన్ను విధింపు లాభసిద్ధాంతాన్ని మొదటిసారిగా 17వ శతాబ్దంలో కొంతమంది శాస్త్రజ్ఞులు అభివృద్ధి పరిచారు. హాబ్స్, లాక్, రూసో మొదలగు తత్వవేత్తలు, ఫ్రాన్స్ దేశానికి చెందిన ప్రకృతి ధర్మవాదులు పన్ను విధింపు లాభసిద్ధాంతాన్ని విధించారు. ఆడమ్‌స్మిత్ కూడా ఈ సిద్ధాంతం యొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించడమైనది. పన్ను విధింపు సిద్ధాంతాలలో ఒక పురాతనమైన సిద్ధాంతం పన్ను విధింపు లాభ సిద్ధాంతం.

ప్రభుత్వము ప్రజల కోసం వస్తుసేవలను సరఫరా చేయును. ప్రజలు వీటిని వినియోగించుకొనుట వలన కొంత ప్రయోజనాన్ని పొందుతారు. ప్రజలు పొందే లాభాన్ని బట్టి పన్నులను ప్రభుత్వానికి చెల్లించవలెనని లాభసిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వము నుండి ఎక్కువ లాభం పొందినవారు ఎక్కువ పన్నులను, తక్కువ లాభం పొందిన వారు తక్కువ పన్నులను ప్రభుత్వానికి చెల్లించాలి. ప్రభుత్వ కార్యకలాపాలవలన వివిధ వస్తుసేవలు పొందుతున్న ప్రజలు తాము పొందుతున్న ప్రయోజనాలకు అనుపాతంలో ప్రభుత్వానికి సహాయం చేయుట వారి బాధ్యత అని లాభసిద్ధాంతం చెపుతుంది. ప్రభుత్వం వలన కలిగే మొత్తం ప్రయోజనంలో ఒక వ్యక్తి ఏ మేరకు ప్రయోజనం పొందుతాడో అదే అనుపాతంలో ప్రజలు పన్నుల రూపంలో భరించాలని లాభసిద్ధాంతం యొక్క సారాంశము.

పన్ను విధింపు లాభసిద్ధాంతమును సమర్థించిన వారి అభిప్రాయం ప్రకారం పన్నులను ధరతో పోల్చవచ్చును. ఎక్కువ ప్రయోజనం గల వస్తువులకు ఏవిధంగా ఎక్కువ ధరను చెల్లిస్తామో అదేవిధంగా ప్రభుత్వం నుండి ఎక్కువ ప్రయోజనంను పొందినవారు ఎక్కువ పన్నులను చెల్లించాలి. ఉపాంత ప్రయోజన విశ్లేషణ ఆధారంగా కూడా పన్ను విధింపు లాభసిద్ధాంతన్ని సమర్థించడమైనది. సాధారణంగా ప్రైవేటు రంగంలో ఉత్పత్తి అయిన వస్తుసేవలకు ధరలను వాటి ఉపాంత ప్రయోజనాలకు అనుపాతంగా చెల్లించటం జరుగుతుంది. ఇదే సూత్రాన్ని ప్రభుత్వము పన్నులు విధించునప్పుడు కూడా అనుసరించవచ్చును. ప్రభుత్వం వలన ప్రజలకు ప్రయోజనం ఉన్నది కాబట్టి వారు పన్ను చెల్లించాలి. ఎక్కువ ప్రయోజనం ఉన్న వస్తువుకు ఎక్కువ ధరను చెల్లించునట్లుగానే, ప్రభుత్వ వ్యయం నుండి ఎక్కువ ప్రయోజనం పొందినవారు ఎక్కువ పరిమాణంలో పన్ను చెల్లించాలి.

ప్రయోజనాలు: పన్ను విధింపు లాభసిద్ధాంతంలో కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి.

1) ప్రభుత్వం సమకూర్చే సేవల వలన పొందిన లాభాన్ని బట్టి ప్రజలపై పన్ను విధించటం న్యాయబద్ధమనే అంశంపై లాభసిద్ధాంతం ఆధారపడింది.

2) ప్రభుత్వ ఆదాయ, వ్యయాల రెండింటికి లాభసిద్ధాంతములో ప్రాముఖ్యం ఇవ్వడమైనది. పన్నుల విధింపులో ప్రభుత్వ వ్యయంతో ముడిపెట్టి వీటిని గురించి ఏకసమయంలో ఆలోచించేటట్లు చేయడం లాభ సిద్ధాంతంలోని ఒక ముఖ్య ప్రయోజనము.

3) దేశంలో ఉన్న పరిమితమైన వనరులను సమర్థవంతంగా కేటాయించడానికి ప్రజలు చెల్లించే పన్నులు వారు ప్రభుత్వము నుండి పొందే లాభాలకు అనుగుణంగా ఉండాలని ఈ సిద్ధాంతం యొక్క అభిప్రాయం.

4) జాతీయస్థాయిలో కానీ, స్థానికంగా కానీ ప్రభుత్వము కొన్ని వర్గాల వారి ప్రయోజనం కోసం సేవలు అందించేటప్పుడు

ఆ వర్గ ప్రజలు పొందే లాభానికి అనుగుణంగా పన్నులు ఉండాలని ఈ సిద్ధాంతం చెపుతుంది.

విమర్శలు:

**1) సాంఘిక ప్రయోజనాన్ని విడదీయలేము:** పన్ను విధింపు లాభసిద్ధాంతము ప్రకారము ప్రభుత్వం ద్వారా పొందే ప్రయోజనాన్ని బట్టి ప్రజలు పన్నులను చెల్లించాలి. కాని ప్రభుత్వము ద్వారా పొందే సాంఘిక ప్రయోజనాన్ని వ్యక్తిగతంగా విభజించుట కష్టం. ఉదా॥ దేశరక్షణ, శాంతిభద్రతలు మొదలగు వాటివలన పొందే సాంఘిక ప్రయోజనాన్ని వ్యక్తిగతంగా విభజించుట కష్టము.

**2) ప్రయోజనాన్ని కొలవలేము:** లాభసిద్ధాంతం ప్రకారం ప్రభుత్వం నుండి పొందే ప్రయోజనాన్ని బట్టి ప్రజలు పన్ను చెల్లించాలి. ప్రజలు పొందే ప్రయోజనం ఆత్మాశ్రయాంశము అందువలన ప్రయాజనాన్ని కొలవలేము.

**3) అభిలషనీయమైన లాభాలు:** అభిలషనీయమైన వస్తువుల ద్వారా పొందే లాభాలు చాలా ఎక్కువగా ఉండును. ఈ లాభాలకు అనుగుణంగా, అనుపాతంగా పన్నులను చెల్లించడం కష్టం. ఉదాహరణకు విద్య, ఆరోగ్యము, గృహవసతి మొదలగు ప్రభుత్వ సౌకర్యాలవలన ప్రజలు పొందే ప్రయోజనము ఎక్కువగా ఉంటుంది. వీటికి అనుపాతంగా పన్నులను చెల్లించటం కష్టము.

**4) ఆదాయ అసమానతలు:** పన్ను విధింపు లాభసిద్ధాంతం ప్రకారం ప్రభుత్వం నుండి ప్రయోజనం పొందే ప్రతి వ్యక్తి తాను పొందే ప్రయోజనానికి అనుపాతంగా పన్ను చెల్లించాలి. సాధారణంగా పేదప్రజలు ప్రభుత్వం నుండి ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతారు. కనుక పేదప్రజలు ఎక్కువ పరిమాణంలో ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. అందువలన ఆదాయఅసమానతలు పెరుగుతాయి.

**5) శ్రేయోరాజ్యాలకు అన్వయించబడదు:** ప్రస్తుత రాజ్యాలు (శ్రేయోరాజ్యాలు ప్రజాశ్రేయస్సు) కొరకు ప్రభుత్వం అనేక సౌకర్యాలను కలుగజేయును. దీనివలన ప్రజలు అధిక ప్రయోజనాన్ని పొందుతారు. ఈ ప్రయోజనానికి అనుగుణంగా పన్నులను చెల్లించవలెనన్న సాధ్యం కాదు. కనుక శ్రేయోరాజ్యాలకు పన్ను విధింపు లాభసిద్ధాంతం అన్వయించబడదు.

**6) వ్యాపార సరళి:** పన్ను విధింపు లాభసిద్ధాంతంలో వ్యాపార సరిళి కనిపిస్తుంది. ప్రభుత్వం తన ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించేటప్పుడు పూర్తిగా వ్యాపార సరళితోను, లాభాపేక్షతోను నిర్వహించకూడదు.

## 4.3. సేవా వ్యయాల సిద్ధాంతము (The cost of service Theory):

సేవావ్యయాల సిద్ధాంతము కూడా లాభసిద్ధాంతం వలె అతి పురాతనమైన సిద్ధాంతము. సేవావ్యయాల సిద్ధాంతానికి, లాభసిద్ధాంతానికి దగ్గర సంబంధమున్నది. ప్రభుత్వం పన్ను చెల్లించే వారికి వస్తుసేవలను సరఫరా చేయును. ఇందువలన ప్రభుత్వానికి కొంత వ్యయం అవుతుంది. ప్రభుత్వం సరఫరా చేసే వస్తుసేవలకు అయ్యే వ్యయానికి సమానంగా ప్రజలు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. ప్రభుత్వానికి అయ్యే వ్యయమే పన్ను విధింపునకు మూలాధారమని సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశము. ఈ సిద్ధాంతాన్ని ముఖ్యంగా వాన్‌హాక్ అనే వ్యక్తి మొదటిసారిగా ప్రతిపాదించెను. ప్రభుత్వం నుండి ప్రజలు ప్రయోజనం పొందితే వారు వాటి వ్యయానికి అనుపాతంగా ప్రభుత్వానికి ద్రవ్యాన్ని చెల్లించాలి. ఈ సిద్ధాంతం ప్రజలకు ప్రభుత్వం కల్పించిన రక్షణ, సంక్షేమ కార్యకలాపాలు మొదలగు వాటికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈ సిద్ధాంతాన్ని అమలుపరచినట్లయిన అనేక వాటికి పన్నుల విధింపులో స్థానం ఉండదు. సేవావ్యయాల సిద్ధాంతం సంతులిత బడ్జెట్ విధానాన్ని సమర్థించినది.

సేవావ్యయాల సిద్ధాంతం ముఖ్యంగా హాబ్స్, లాక్, రూసో మొదలగువారి సాంఘిక ఒడంబడిక సిద్ధాంతంపై ఆధారపడి ఉన్నది. ఈ సిద్ధాంతము అన్ని విధాల ప్రభుత్వ సంక్షేమ కార్యకలాపాలకు ప్రాముఖ్యాన్ని ఇవ్వలేదు. మొత్తంమీద పన్నులు

చెల్లించేవారి నుండి ప్రభుత్వం సరఫరా చేసే వస్తుసేవలకు అయ్యే వ్యయానికి సమానంగా పన్నులను వసూలు చేయాలి.

విమర్శలు: పన్ను చెల్లింపు లాభసిద్ధాంతం వలనే సేవావ్యయాల సిద్ధాంతము కూడా ఆచరణ యోగ్యమైనది కాదు. ఈ సిద్ధాంతం కూడా అనేక విమర్శలకు గురి అయినది.

**1) ప్రభుత్వ వ్యయాన్ని విభజించుట కష్టము:** ప్రభుత్వము కొన్ని పథకాలపైన వ్యయము చేసేటప్పుడు ఆ వ్యయాన్ని ప్రజలకు ఒక్కొక్కరికి ఎంత పంచవలయునో నిర్ణయించుట కష్టము. ఉదా॥ దేశరక్షణ, శాంతిభద్రతలు మొదలగు వాటిపై చేసే వ్యయమును ఒక్కొక్కరి వద్ద నుండి ఎంత వసూలు చేయవలెనో నిర్ణయించుట కష్టము.

**2) పరోక్షప్రయోజనాలను వివరించలేదు:** సేవా వ్యయ సిద్ధాంతము ప్రకారము ప్రభుత్వ వ్యయమునకు సమానముగా ప్రజలు పన్నులు చెల్లించవలెను. ప్రభుత్వ వ్యయము వలన ప్రత్యక్షముగా లాభము పొందే ప్రజలు పన్నులను చెల్లించవలెను. కాని కొంత మంది ప్రజలు పరోక్షముగా ప్రయోజనంను పొందుదురు. అటువంటి వారివద్ద నుండి పన్నులను ఏ విధంగా వసూలు చేయవలెనో ఈ సిద్ధాంతము వివరించలేదు.

**3) పన్నులు నిర్బంధ చెల్లింపులు:** పన్నులను నిర్బంధపు చెల్లింపులుగా పరిగణించవచ్చును. అందువలన ప్రభుత్వ వ్యయానికి పన్నులకు ముడిపెట్టకూడదు. ప్రభుత్వ వ్యయానికి సమానంగా పన్నులను వసూలు చేయవలెనని చెప్పుట సరియైనది కాదు.

**4) కొన్ని సేవలకు అన్వయించబడదు:** సేవా వ్యయ సిద్ధాంతము కొన్ని ప్రభుత్వ వ్యయాలకు అన్వయించబడదు. ఉదాహరణకు ప్రభుత్వము కొంత మంది వ్యక్తులకు పెన్షన్‌లు చెల్లించును. ప్రభుత్వమునకు అయ్యే పెన్షన్‌లపై వ్యయమునకు సమానంగా పన్ను విధించవలెనన్నా పెన్షన్ మొత్తాన్ని ప్రజలు ప్రభుత్వానికి తిరిగి చెల్లించవలెను. పెన్షన్ ఇచ్చిన మొత్తమే ప్రభుత్వానికి వ్యయం కాబట్టి ఇచ్చిన పెన్షన్ తిరిగి పన్నుగా తీసుకొనవలెను. కనుక ఈసిద్ధాంతము కొన్ని సందర్భాలలో ఆచరించుట హాస్యాస్పదంగా ఉండును.

**5) ఆధునిక శ్రేయోరాజ్యాలకు అన్వయించబడదు:** ఆధునిక శ్రేయోరాజ్యాలు ప్రజాసంక్షేమము కొరకు అనేక పథకాలపై వ్యయాలను చేయుచున్నవి. ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం కంటే ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉండును. కనుక ఆధునిక శ్రేయోరాజ్యాలలో ఈ సూత్రము అన్వయించబడదు.

**6) పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని పరిగణింపలేదు:** సాధారణంగా వివిధ వ్యక్తులపై పన్నులను విధించినప్పుడు ఆ వ్యక్తుల పన్ను చెల్లింపు సామర్థ్యం లెక్కలోనికి తీసుకొనవలెను. పన్ను చెల్లింపు వలన చేసే త్యాగము సమానంగా ఉండవలెనని ఆధునిక శాస్త్రజ్ఞుల అభిప్రాయం. కాని ఈ అభిప్రాయమునకు సేవావ్యయ సిద్ధాంతము భిన్నముగా ఉన్నది.

పై విధముగా సేవావ్యయ సిద్ధాంతము కొన్ని విమర్శలకు గురైనప్పటికి కొన్ని సందర్భాలలో ఈ సిద్ధాంతమును అనుసరించుట జరుగుచున్నది. ఉదాహరణకు విద్యుచ్ఛక్తి, నీటిపారుదల సౌకర్యములు మొదలగు వాటికయ్యే వ్యయాన్ని బట్టి ప్రజల నుండి పన్నులను వసూలు చేయుటం జరుగును. మొత్తం మీద పరిశీలించిన ఈ సిద్ధాంతము ఆధునిక పరిస్థితులకు ఎక్కువగా అన్వయించబడదు. ప్రభుత్వం కల్పించే సాంఘిక వస్తుసేవల విషయంలో సేవా వ్యయాల సిద్ధాంతాన్ని అమలు పరచలేము.

## 4.4. పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము (Ability to Pay Theory of Taxation):

ప్రభుత్వము ప్రజలపై పన్నులను విధించినపుడు ప్రజలపై పన్నుల భారము ఏర్పడును. ఈ పన్నుల భారము వ్యక్తుల మధ్య ఏ విధముగా పంపిణీ చేయవలెనో అనే విషయంలో వివిధ అభిప్రాయాలు మరియు సిద్ధాంతాలు కలవు. పన్నుల విధింపు న్యాయంగాను మరియు నిష్పక్షపాతంగాను ఉండవలెను. పన్ను విధింపు సిద్ధాంతాలలో లాభ సిద్ధాంతము,

సేవావ్యాయసిద్ధాంతము, పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము మొదలగునవి ప్రధానమైనవి. ప్రభుత్వము నుండి పొందే ప్రయోజనాన్ని బట్టి ప్రజలు పన్నులను చెల్లింపవలయునని లాభసిద్ధాంతము యొక్క అభిప్రాయము. ప్రభుత్వ వ్యయాన్ని బట్టి పన్నులు విధించవలయునని సేవావ్యయసిద్ధాంతము యొక్క అభిప్రాయము. కాని ఈ రెండు సిద్ధాంతములను అమలుపరచుట సాధ్యముకాదు.

పన్ను చెల్లింపు సామర్థ్యములను బట్టి పన్నులను విధించవలయునని సామర్థ్య సిద్ధాంతము యొక్క అభిప్రాయము. ఈ సిద్ధాంతమును అనేక మంది ఆర్థిక శాస్త్రవేత్తలు సమర్థించిరి. పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతమును మొట్టమొదటి సారిగా జాన్‌బోడిన్ అను ఆర్థికశాస్త్రవేత్త 16వ శతాబ్దంలో వివరించెను. ఆడమ్‌స్మిత్, పిగు, ఎడ్జ్‌వర్త్ మొదలగు ఆర్థికశాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతమును సమర్థించిరి. జె.యస్.మిల్ పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతమును బహుళ ప్రజాదరణ పొందునట్లు అభివృద్ధి పరచెను.

**క్షితిజ సమాంతర న్యాయము - క్షితజలంబన్యాయము:**

సమాన స్థాయిలో ఉన్న వారందరూ ప్రభుత్వమునకు సమానంగా పన్ను చెల్లించవలయును. చట్టరీత్యా అందరూ సమానులే కనుక సమానముగా ఉన్న వారంతా సమానంగా పన్నులను ప్రభుత్వానికి చెల్లించవలెననే భావమును క్షితిజ సమాంతర న్యాయమందురు. భిన్నస్థాయిలో ఉన్నవారిని భిన్నముగా చూడవలెననే దానిని క్షితిజలంబ న్యాయమందరు.

**ప్రమేయాలు:** పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము ఈ క్రింది ప్రమేయములపై ఆధారపడినది.

1) ఆదాయ పరిమాణము ప్రజల పన్ను చెల్లింపు సామర్థ్యమును సూచించును.

2) ఆదాయము యొక్క ప్రాముఖ్యము ఆ ఆదాయము నుండి పొందగలిగే తృప్తిపై ఆధారపడి ఉండును.

3) ఆదాయ, సంపదలకు కూడా క్షీణోపాంత ప్రయోజన సూత్రము అన్వయించబడును.

4) పన్నులను చెల్లించుట వలన వివిధ వ్యక్తులు చేసే త్యాగము సమానంగా ఉండవలయును.

5) క్షీణోపాంత ప్రయోజన రేఖ వ్యక్తులందరికీ ఒకే విధంగా ఉంటుంది.

పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము ప్రకారం ప్రజల పన్ను చెల్లింపు సామర్థ్యం ఆధారంగా చేసుకొని ప్రభుత్వము పన్నులను విధించవలెను. పన్ను చెల్లింపు సామర్థ్యం తెలుసుకొనుటకు రెండు సూత్రములు కలవు.

(1) ఆత్మాశ్రయ సిద్ధాంతము

(2) పరాశ్రయ సిద్ధాంతము

**1) ఆత్మాశ్రయ సిద్ధాంతము లేదా సమత్యాగ సిద్ధాంతము:** ప్రజలు ప్రభుత్వానికి పన్నులు చెల్లించుట వలన కొంత ప్రయోజనాన్ని కోల్పోవుదురు. పన్ను చెల్లించుట వలన కొంత త్యాగమును ప్రజలు చేయుదురు. ప్రజలు చేసే ఈ త్యాగము సమానంగా ఉండే విధంగా పన్నులను విధించవలయునని ఈ సిద్ధాంతము యొక్క సారాంశము. కనుక దీనిని సమత్యాగ సిద్ధాంతమందురు. ప్రజలు చేసే త్యాగము ఆత్మకు సంబంధించినది. కనుక ఈ సిద్ధాంతమును ఆత్మాశ్రయ సిద్ధాంతం అని కూడా అందురు. సమత్యాగమును గురించి మూడు అభిప్రాయములు కలవు.

(ఎ) సమనిరపేక్షత్యాగము

(బి) సమ అనుపాత త్యాగము

(సి) సమోపాంత త్యాగము.

**(ఎ) సమనిరపేక్షత్యాగము:** ప్రజలు ప్రభుత్వమునకు పన్ను చెల్లించుటవలన వారు చేసే మొత్తం త్యాగం సమానంగా ఉండవలయునని దీని అర్థము. ప్రజలు చేసే త్యాగము సమానంగా ఉండవలెనన్న ధనవంతులు ఎక్కువ పన్నులను పేదవారు తక్కువ పన్నులను చెల్లించవలెను. ఆదాయ పరిమాణం పెరిగే కొలది ద్రవ్య ప్రయోజనం క్షీణించును. కనుక ధనవంతులు ఎక్కువ పరిమాణంలో పన్నులను పేదవారు తక్కువ పరిమాణంలో పన్నులను చెల్లించుట వలన వారు చేసే త్యాగము సమానంగా ఉండును.

**(బి) సమ అనుపాత త్యాగము:** ప్రజలు ప్రభుత్వమునకు పన్ను చెల్లించునపుడు వారు చేసే త్యాగము వారి ఆదాయాలకు అనుపాతంగా ఉండవలయునని ఈ సూత్రము యొక్క ముఖ్యోద్దేశము. కనుకనే డాల్టన్ ప్రకారం పన్ను చెల్లింపుదారుల మీద పడే భారము అతని ఆదాయం వలన వచ్చే ప్రయోజనానికి అనుపాతంగా ఉండవలయును. ఉదాహరణకు **A** మరియు **B** అను ఇద్దరు వ్యక్తులపై పన్నుల భారము ఈ క్రింది విధంగా ఉండవలయును.

$$\frac{\text{A పన్ను చెల్లించుట వలన చేసే త్యాగం}}{\text{A ఆదాయం}} = \frac{\text{B పన్ను చెల్లించుట వలన చేసే త్యాగం}}{\text{B ఆదాయం}}$$

**(సి) సమోపాంత త్యాగము:** ఈ సూత్రము ప్రకారము పన్ను చెల్లింపు వలన ప్రజలు చేసే ఉపాంత త్యాగము సమానంగా ఉండే విధంగా పన్నులను విధించవలెను. మరొక విధంగా చెప్పవలెనన్న పన్ను చెల్లించిన తరువాత మిగిలిన ఆదాయం ద్వారా పొందే ఉపాంత ప్రయోజనం అందరి వ్యక్తుల విషయంలో సమానంగా ఉండవలయును. ఈ విషయమును ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

పన్ను చెల్లించిన తరువాత **A** యొక్క ద్రవ్య ఉపాంత ప్రయోజనం =పన్ను చెల్లించిన తరువాత **B** యొక్క ద్రవ్య ఉపాంత ప్రయోజనం.

విమర్శలు: ఆత్మాశ్రయ సిద్ధాంతము ఈ క్రింది విమర్శలకు గురియైనది.

1) ఆత్మాశ్రయ సిద్ధాంతములో తీసుకొన్న ప్రమేయములు కొన్ని వాస్తవమైనవి కావు.

2) ఈ సిద్ధాంతము ప్రకారము ప్రయోజనాన్ని కొలవవచ్చును. కాని ప్రయోజనం మానసిక భావన కనుక దీనిని కొలవలేము.

3) కొంత మంది ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం క్షీణోపాంత ప్రయోజన సూత్రము ద్రవ్యమునకు అన్వయించబడదు.

4) ఆదాయము వలన వివిధ వ్యక్తులు పొందే ప్రయోజనము ఒకే విధంగా ఉండదు.

**5) పరాశ్రయ సిద్ధాంతము:** ఆత్మాశ్రయ సిద్ధాంతము ప్రకారము వివిధ వ్యక్తులు పన్ను చెల్లింపుల వలన చేసే త్యాగమును ఆధారంగా చేసుకొని పన్నులను విధించవలెను. కాని త్యాగము అనేది మానసిక భావన కనుక దీనిని కొలవలేము. అందువలన మానవునికి బహిర్గతంగా ఉండే అంశములను బట్టి అనగా పరాశ్రయాంశములను బట్టి పన్ను చెల్లింపు సామర్థ్యము నిర్ణయించవలయునని కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయము.

పరాశ్రయ సూచికలు: పరాశ్రయ అంశాలను మూడు విధాలుగా పరిశీలించవచ్చును.

(1) ఆస్థి

(2) వ్యయము

(3) ఆదాయము.

**1) ఆస్థి:** వ్యక్తులు పన్ను చెల్లింపు సామర్థ్యము వ్యక్తుల ఆస్థులపై ఆధారపడి ఉంటుందని ఈ అంశము యొక్క ముఖ్య ఉద్దేశము. ఆస్థిని ప్రాతిపదికగా తీసుకొని పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని నిర్ణయించుటలో కొన్ని లోపాలు కలవు.

(ఎ) ఆస్థి విలువను కొన్ని సమయాలలో తెలుసుకొనుట కష్టము. లంచగొండితనం, అవినీతి మొదలగు కారణముల వలన ఆస్థి గురించి సరియైన అంచనాలు వేయుట కష్టము.

(బి) ఒకే విధమయిన ఆస్థులు వేరువేరు ప్రాంతాలలో వేరువేరు విలువలను కలిగి యుండును. ఉదాహరణకు ఇళ్ళ స్థలాలు గ్రామీణ ప్రాంతాలలో తక్కువ విలువను, పట్టణ ప్రాంతాలలో ఎక్కువ విలువను కలిగియుండును.

**2) వ్యయము:** వివిధ వ్యక్తులు తాము చేసే వ్యయాలను ఆధారంగా చేసుకొని పన్ను చెల్లించే సామర్థ్యము నిర్ణయించి పన్నులను విధించవలయును. వ్యయమును ఆధారంగా చేసుకొని పన్ను విధించుట వలన కొన్ని ప్రయోజనాలు కలవు.

(ఎ) వ్యయాన్ని అదుపు చేసి పొదుపు పరిమాణమును పెంచవచ్చును.

(బి) హానికరమయిన వస్తువుల వినియోగంపై అధికంగా పన్నులను విధించుట ద్వారా వాటి వినియోగాన్ని నిరుత్సాహపరచవచ్చును.

**లోపాలు:**

(ఎ) ఈ అభిప్రాయం ప్రకారము అన్ని వర్గాల వారు ఒకే విధంగా పన్ను చెల్లించవలెను. ఇది క్షితిజ సమాంతర న్యాయమునకు విరుద్ధముగా ఉండును.

(బి) పన్నులు విధించుటలోను, వసూలు చేయుటలోను అనేక విధములైన పరిపాలనా సంబంధమైన ఇబ్బందులుండును.

**3) ఆదాయము:** ఈ అంశము ప్రకారము వ్యక్తులకు వచ్చే ఆదాయములను బట్టి పన్ను చెల్లించే సామర్థ్యము ఆధారపడి యుండును. కనుక ఆదాయము పన్ను చెల్లింపు సామర్థ్యంను తెలిపే సరియైన సూచిక అని పలువురి అభిప్రాయము. ఆదాయాన్ని నిర్వచించడంలో కొన్ని ఇబ్బందులు ఉన్ననూ ఆదాయ ప్రాతిపదికగా పన్ను విధించుట వలన అనేక ప్రయోజనాలు కలవు. ముఖ్యంగా సమాజంలో గల ఆదాయ సంపదలలో గల అసమానతలను తగ్గించుటకు ఈ సూత్రం ఉపయోగపడును.

## 4.5. పన్ను విధింపు నియమాలు లేదా సూత్రాలు:

ప్రస్తుత రాజ్యాలు సంక్షేమ రాజ్యాలు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం అనేక విధులను నిర్వహిస్తుంది. వీటిని నిర్వహించడానికి ప్రభుత్వానికి ద్రవ్య వనరుల అవసరం ఉంది. ప్రభుత్వానికి ద్రవ్య వనరులను సమకూర్చే విషయంలో పన్నులు ఎక్కువ ప్రాముఖ్యాన్ని వహిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థకు నష్టము కలుగకుండా న్యాయము చేకూర్చడానికి పన్నుల విధింపు పద్ధతి సక్రమముగా ఉండవలయును. పన్ను విధించు పద్ధతి కొన్ని మంచి లక్షణాలను కలిగియుండవలయును. ప్రభుత్వము ప్రజలపై పన్నులను విధించుట వలన ఇవి ప్రజలపై భారమును కలిగించును. అంతేకాక పన్ను భారము ఉత్పత్తి, ఆదాయ పంపిణీపై కూడా ఉండును. అందువలన పన్నులను విధించేటప్పుడు కొన్ని నియమాలను పాటించవలయును వీటినే పన్ను విధింపు నియమాలు లేదా సూత్రాలు అని అందురు.

**పన్ను నియమాలు:** ప్రాచీన ఆర్థికశాస్త్రవేత్త అయిన ఆడమ్‌స్మిత్ పన్ను విధింపు నియమాలను సూచించినాడు.

**1) సమతా నియమము (Canon of Equity on Equality):** ప్రభుత్వ పాలన క్రింద ఉన్న ప్రజలు ప్రభుత్వ వ్యయానికై తమ సామర్థ్యానికి అనుగుణంగా పన్నులను చెల్లించవలెను. అనగా ప్రభుత్వము కల్పించిన రక్షణ క్రింద ప్రజలు సంపాదించుకున్న ఆదాయంలో అనువైన నిష్పత్తిలో కొంత విత్తాన్ని చెల్లించవలెనని ఆడమ్‌స్మిత్ అభిప్రాయం. పన్నులు

విధించటంలో న్యాయముండవలెననే భావనను ఈ సూత్రము వివరింపుము. ప్రజల ఆదాయాలను బట్టి అనగా పన్ను చెల్లించగల శక్తిని బట్టి పన్నులను విధించవలెనని ఈ నియమము చెపుతుంది.

ఆడమ్‌స్మిత్ అనుపాత విధింపు పద్ధతిని సూచించాడా లేదా పురోగామి పద్ధతిని సూచించాడా అనే విషయంలో భిన్నాభిప్రాయములు కలవు. ప్రభుత్వ రక్షణ క్రింద సంపాదించే ఆదాయానికి అనుపాతంలో పన్ను చెల్లించవలెనని ఆడమ్‌స్మిత్ అభిప్రాయము. కనుక ఇతడు అనుపాత పన్నుల పద్ధతిని సమర్థించినాడని కొందరి అభిప్రాయము. కాని మరియొక సదర్భంలో ఇతడు భాగ్యవంతులు ఎక్కువ రేటులో పన్నులు చెల్లించటం మంచిదని భావించాడు. కనుక పురోగామి పన్నుల విధానాన్ని ఈయన సూచించినాడని కొందరి అభిప్రాయము.

**2) నిశ్చయతా నియమము (Canon of Certainity):** ప్రతి వ్యక్తి చెల్లించవలసిన పన్ను నిశ్చయంగా ఉండవలెనేగాని నిరంకుశముగా ఉండరాదు. పన్ను మొత్తము పన్ను చెల్లించే వారికి మరియు మిగిలిన వారికి స్పష్టంగా తెలియవలెను. ఇలా కాని యెడలా పన్ను వసూలు చేసే వారు నిరంకుశంగా అధిక పన్నులు వేయగలరు , లేదా లంచగొండులై పన్నులను తగ్గించనూగలరు.

పన్నులను విధించేటప్పుడు నిశ్చయతా నియమమును పాటించుట వలన ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి కూడా లాభదాయకంగా ఉండును. పన్నులు చెల్లించే వారికి ఎంత చెల్లించవలెనో ముందుగా తెలియును గనుక పన్నులు చెల్లింపుకు అలవాటుపడి వారికి అంతభారముగా అనిపించదు. అంతేకాకుండా ప్రభుత్వము తన బడ్జెట్‌ను రూపొందించుటకు పన్నుల ద్వారా ఎంత ఆదాయము వచ్చునో తెలుసుకొనవలెను. ఇందుకు నిశ్చయతా నియమము ఉపయోగపడును.

**3)సౌకర్య నియమము (Canon of convenience):** పన్నులు చెల్లించే వారికి అనుకూలమయిన సమయంలో మరియు అనుకూలమయిన రీతిలో పన్నులను విధించవలెను. ఉదాహరణకు భూమిపై శిస్తును పంటలు వచ్చిన తరువాత విధించినా ఈ భూమి శిస్తును వ్యవసాయదారులు సులభముగా చెల్లించగలరు. అదే విధముగా కట్టవలసిన పన్ను మొత్తము అధికముగా ఉన్నా వాయిదాలలో చెల్లించే సౌకర్యమును కలిగించవలెను. పన్నువిధింపులో ఈ నియమమును పాటించుట వలన పన్నుల వసూళ్లు సులభమగును.

**4)మితవ్యయ నియమము (Canon of Economy) :** పన్ను వసూలుకు అయ్యే వ్యయము సాధ్యమయినంత తక్కువగా ఉండవలెను. పన్నుల రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి ప్రజల దగ్గర వసూలు చేసే మొత్తానికి తేడా అతి తక్కువగా ఉండవలెను. పన్నుల సేకరణ చేసే ఉద్యోగుల జీతభత్యాల క్రిందనే వసూలు చేసే పన్ను మొత్తంలో అధిక భాగము ఖర్చు అయినా అందువలన పన్నుల లక్ష్యము దెబ్బతినును. ఇందువలన ప్రభుత్వానికి ప్రయోజనముండదు, ప్రజలకు ప్రయోజనముండదు. పన్నుల సేకరణకు అయ్యే వ్యయము తక్కువగా ఉండేటట్లు చూడటమే కాక పన్నుల విధింపు పొదుపు, పెట్టుబడులను తగ్గకుండా ఉండేటట్లు చూడవలెను.

పై నాలుగు నియమాలను ఆడమ్‌స్మిత్ సూచించినాడు. ఆడమ్‌స్మిత్ తరువాత ప్రభుత్వ విత్త శాస్త్రములో, పన్ను నియమాలలో అనేక మార్పులు వచ్చినవి. అందువలన ఇతర ఆర్థిక శాస్త్రవేత్తలు నిర్దేశించిన పన్ను విధించు నియమాలను కూడా పరిశీలించవలెను.

**5) ఉత్పాదకతా నిర్ణయము (Canon of Productivity):** ప్రభుత్వము విధించే పన్నుల నుండి వచ్చే ఆదాయము ప్రభుత్వ వ్యయానికి సరిపోయినంతగా ఉండవలయును. ప్రస్తుత అవసరాలను తీర్చడానికే గాక పెరుగుతున్న ప్రభుత్వ బాధ్యతలకు కావలసిన ద్రవ్య వనరులను తీర్చే విధంగా పన్నుల విధానము ఉండవలయును. ప్రస్తుతము ప్రభుత్వ కార్యకలాపములు రోజురోజుకు పెరుగుచున్నాయి. కనుక పన్నులను విధించేటప్పుడు ఉత్పాదకతానియమమును కూడా పాటించవలయును. స్వల్ప ఆదాయాన్ని ఇచ్చే పన్నులను తక్కువ సంఖ్యలో విధించుట మంచిది. ఇందువలన ప్రజలకు

పన్ను చెల్లించుటలో మరియు వాటికి సంబంధించిన లెక్కలను ప్రభుత్వానికి సమర్పించుట సులభముగా ఉండును. రాబడిని ఎక్కువగా పొందాలనే ఉద్దేశముతో పన్నులను మరీ ఎక్కువగా విధించరాదు. పన్నులరేటు మరీ ఎక్కువగా ఉన్నా పొదుపు మరియు పెట్టుబడి పెట్టాలనే కోరిక తగ్గి ఉత్పత్తి కుంటుపడవచ్చును.

**6) వ్యాకోచనియమాలు (Canon of Elasticity):** పెరిగే ప్రభుత్వ అవసరాలను బట్టి ఆదాయము కూడా పెరుగుతూ ఉండవలయును. యుద్ధకాలంలో గాని మరి ఏ విధమైన అవసరాలలో గాని ప్రభుత్వము ఆదాయాన్ని పెంచుకొనగలిగి ఉండవలయును. ఇందుకు పన్ను విధించేటప్పుడు వ్యాకోచత్వనియమమును పాటించవలయును. కొన్ని పన్నులు ముఖ్యంగా ఆదాయపుపన్ను, అమ్మకపుపన్ను మొదలగు వాటి విషయంలో వ్యాకోచత్వము ఎక్కువగా ఉండును. ఈ పన్నుల రేటులలో కొంచెముగా మార్పు చేసినా వాటివలన వచ్చే ఆదాయము చాలా ఎక్కువగా పెరుగుతుంది.

**7) పరిణామావకాశ నియమము (Canon of Flexibility):** మారుచున్న పరిస్థితులను బట్టి పన్నులను మార్చుటకు వీలుండవలెను. సాధారణంగా పరిణామావకాశం ఉంటేగాని వ్యాకోచత్వము ఉండదు. ఉదాహరణకు 1793వ సం॥లో బెంగాల్‌లో ప్రవేశపెట్టిన శాశ్వత శిస్తు విధానము ఈ నియమానికి విరుద్ధము. ఈ విధానమునందు పన్ను శాశ్వతముగా నిర్ణయించబడినది. కనుక ఇందు మార్పులను ప్రవేశపెట్టుటకు వీలులేదు. బెంగాల్‌లో ఏర్పడిన ఆర్థికపరమయిన చిక్కులకు ఈ శిస్తు విధానమే ప్రధాన కారణము.

**8) సౌలభ్య నియమము(Canon of Simplicity):** పన్నుల పద్ధతి సామాన్యులకు సహితము సులభముగా తెలిసే విధంగా ఉండవలయును. ఈ విధంగా లేనియెడల పన్ను చెల్లింపుదారులు అనేక విధములయిన ఇబ్బందులకు గురియగుదురు. పన్ను చెల్లించవలసిన రీతి, ప్రభుత్వమునకు అందజేయవలసిన సమాచారం మొదలయినవి తేలికగా అర్థమయ్యే విధంగా ఉండవలయును.

**9) భిన్నతా నియమము(Canon of diversity):** పరస్పరము సమన్వయంగా ఉన్న వివిధ రకాలయిన పన్నులను విధించవలయునని ఈ నియమము యొక్క ముఖ్య ఉద్దేశము. సామర్థ్యము కలిగిన వారందరూ పన్నులను చెల్లించవలెనన్నా వివిధ రకాలయిన పన్నులను విధించవలయును. ఇలా చేసిన యెడల ప్రభుత్వానికి కావలసిన రాబడి లభిస్తుంది. అలా అని పన్నుల రకాలు మరీ ఎక్కువగా ఉండరాదు.

**10) ఆచరణ సాధ్య నియమము (Canon of Enforcibility):** ప్రభుత్వము అమలు జరపటానికి వీలున్న పన్నులను విధించవలెను. అంతేకాకుండా పన్నుల చెల్లింపు ఆచరణ సాధ్యముగా ఉండవలయును. వెనుకబడిన దేశాలలో అనేకమంది నిరక్షరాస్యులు గనుక వీరు తమ ఆదాయ,వ్యయ లెక్కలను నిర్వహించరు. కనుక వివిధ రకాలయిన పన్నులను వారివద్ద నుండి వసూలు చేయడం కష్టము.

**11) ఆమోదయోగ్యతా నియమము (Canon of Acceptability):** పన్నుల పద్ధతి ప్రజలకు న్యాయమైనదిగా ఆమోదయోగ్యమైనదిగా ఉండవలెను. పన్నులు విశ్వజనీనంగా ఉండవలయును. పన్నులు ఆమోదయోగ్యంగా లేనిచో ప్రజలు వ్యతిరేకిస్తారు. అటువంటి పన్నులను అమలు చేయుట కష్టము.

పైన పేర్కొనిన అన్ని నియమాలను ఏ దేశంలోను అమలుపరచుట కష్టము. కొన్ని నియమాలను పాటించడానికి వీలులేక పోవచ్చును. కాని పన్నులను విధించే విధానములో పైన పేర్కొన్న నియమాలను స్థూలముగా పాటించవలయును. సమాజం నిర్ణయించుకున్న ఆర్థిక, సాంఘిక లక్ష్యాలకు అనుగుణంగా పన్నుల వ్యవస్థ, పన్నుల విధానము, పన్నుల నియమాలు ఉండవలయును.

## 4.6. ఉత్తమ పన్నుల విధానం యొక్క లక్షణాలు:

ఆర్థికవ్యవస్థకు నష్టము కలుగకుండా న్యాయము చేకూర్చే విధముగా పన్నుల విధింపు సక్రమముగా ఉండవలయును. పన్నుల విధింపు పద్ధతి కొన్ని మంచి లక్షణములను కలిగియుండవలయును. మంచి పన్నుల వ్యవస్థ వీలైనన్ని ఎక్కువ నియమాలను తృప్తి పరిచేదిగా ఉండాలి. పన్నుల వ్యవస్థ వలన మంచి ఫలితాలు గరిష్ఠంగాను, చెడు ఫలితాలు కనిష్ఠంగాను ఉన్నా దానిని మంచి పన్నుల వ్యవస్థగా పరిగణించవచ్చు.

**ఉత్తమ పన్నుల లక్షణములు:**

**1) సమానత్వము (Equity):** ప్రజలు తమ సామర్థ్యానికి అనుగుణంగా పన్నులను ప్రభుత్వమునకు చెల్లించవలయును. మంచి పన్నుల విధానంలో పన్నుల భారము కనిష్ఠముగా ఉండుటతో పాటు పన్నుల భారాన్ని దేశంలోని వివిధ వర్గాల మధ్య న్యాయపరంగా సమానంగా పంపిణీ చేయాలి. ప్రజల ఆదాయములను బట్టి అనగా పన్ను చెల్లించు శక్తిని బట్టి పన్నులను విధించవలెను. ధనవంతులు అధిక పన్నుల భారాన్ని భరించాలి. పన్ను విధింపులో సమానత్వమును సాధించుటకు ప్రత్యక్ష పరోక్ష పన్నులను సరియైన విధముగా ఉపయోగించాలి.

**2) ఉత్పాదకత (Productivity):** ఉత్తమ పన్నుల విధానము యొక్క మరియొక లక్షణము ఉత్పాదకత కలిగియుండుట. ఇచ్చట ఉత్పాదకత అనే పదాన్ని రెండు విధములుగా చెప్పవచ్చును.

(ఎ) ప్రభుత్వము విధించే పన్నుల నుండి వచ్చే ఆదాయము ప్రభుత్వ వ్యయానికి సరిపోయినంతగా ఉండవలయును.

(బి) దేశము యొక్క ఉత్పాదకతపై ఎటువంటి వ్యతిరేక ప్రభావము పన్నుల విధింపు వలన కలుగరాదు.

**3) వ్యాకోచము (Elasticity):** పెరిగే ప్రభుత్వ అవసరాలను బట్టి ప్రభుత్వ ఆదాయము కూడా పెరుగుతూ ఉండవలెను. ఇందుకు పన్ను విధింపులో వ్యాకోచ లక్షణము కలిగి యుండవలెను. యుద్ధకాలంలో కాని, ఆర్థిక సంక్షోభము ఏర్పడినప్పుడు గాని ప్రభుత్వము తన ఆదాయాన్ని పెంచుకొనగలిగి ఉండవలయును. కొన్ని పన్నులు ముఖ్యంగా ఆదాయపు పన్ను, అమ్మకపు పన్నులో వ్యాకోచము ఎక్కువగా ఉండును. పన్నుల రేటులో కొంచెముగా మార్పు చేసిన వాటి వలన వచ్చే ఆదాయము చాలా ఎక్కువగా పెరుగుతుంది.

**4) సౌలభ్యము (Convenience):** దేశంలో పన్నుల విధానాన్ని రూపొందించేటప్పుడు పన్ను చెల్లింపుదారుల సౌకర్యాన్ని, సౌలభ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకొనవలయును. పన్నుల పద్ధతి సామాన్యునికి సహితము సులభముగా తెలిసే విధముగా ఉండవలయును. ఈ విధంగా లేనియెడల పన్ను చెల్లింపుదారులు అనేక విధములయిన ఇబ్బందులకు గురియగుదురు. పన్ను చెల్లించవలసిన రీతి ప్రభుత్వానికి అందజేయవలసిన సమాచారము మొదలగున్నవి తేలికగా అర్థమయ్యే విధంగా ఉండవలయును.

**5) పన్ను ఎగవేతకు అవకాశముండరాదు (No scope for tax evansion):** పన్నులు చెల్లించవలసిన వారు ఏ విధముగాను ఎగవేయుటకు వీలులేని విధంగా పన్నులను ప్రభుత్వము రూపొందించవలెను. ఈ లక్ష్యాన్ని సాధించుటకు ప్రత్యక్ష, పరోక్ష పన్నులను సరియైన సమ్మేళనంతో ఉపయోగించాలి. పన్నుల ఎగవేతను కనిష్ఠ పరిమాణమునకు తగ్గించుటకు తగిన విధంగా పన్నుల విధింపు, పన్నుల రూపకల్పన జరగవలెను.

**6) ఆర్థికాభివృద్ధికి వనరుల సమీకరణ (Accumulation of resources for economic development):** పన్నుల విధానము ఆర్థికాభివృద్ధిని పెంచేదిగాను, అందుకు అవసరమయిన వనరుల సమీకరణకు ఉపయోగపడేదిగాను ఉండవలయును. పన్నుల విధానము ఆరోగ్యకరమైన పెట్టుబడి వాతావరణాన్ని కల్పించి ఉద్యమదారులకు ప్రోత్సాహాన్ని కల్పించవలెను.

పన్నుల రేటు పొదుపు పరిమాణాన్ని పెట్టుబడిని మూలధన కల్పనను తగ్గించే విధముగా ఉండరాదు. వ్యాపార కార్యకలాపములను పన్నుల విధానము నిరుత్సాహపరచరాదు.

**7) ద్రవ్యోల్బణాన్ని అరికట్టుట (Control of Inflation) :** అభివృద్ధి చెందుతున్న దేశాలలో ద్రవ్యోల్బణము అధికముగా ఉండును. ఈ దేశాలలో ప్రణాళికా పెట్టుబడులు అధికముగా పెరుగుట వలన ధరల పెరుగుదల రేటు ఎక్కువగా ఉండును. ద్రవ్యోల్బణము వలన ప్రజల వాస్తవిక ఆదాయము తగ్గును. అంతేకాకుండా ఆదాయ, సంపదలలో అసమానతలను కూడా పెంచును. కనుక ప్రభుత్వము విధించే పన్నులు ద్రవ్యోల్బణాన్ని తగ్గించే విధంగా ఉండవలెను.

**8) గరిష్ట సాంఘిక ప్రయోజనము (Maximum Social Advantage):** డాల్టన్ ప్రకారము పన్నుల విధానమనేది గరిష్ట సాంఘిక ప్రయోజనం మీద ఆధారపడి ఉండాలి. పన్నుల విధానము యొక్క లక్ష్యము అత్యధిక ప్రజల యొక్క అత్యధిక సంక్షేమమును పెంపొందింపచేయుటయే. దేశము యొక్క ఉత్పాదక శక్తిని ఏ విధముగాను దెబ్బతీయకుండా ప్రజల సాంఘిక ప్రయోజనము గరిష్ట స్థాయికి చేరేవిధముగా పన్నుల విధానము ఉండవలెను.

మంచి పన్నుల వ్యవస్థ ప్రధాన జాతీయ లక్ష్యాలతో సమన్వయం కలిగి ఉండాలి. అనేక మంది ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం మంచి పన్నుల విధానం పురోగామి సూత్రాన్ని కలిగి ఉండాలి. ధనవంతులపై పన్నుల భారం అధికంగాను, పేదవారిపై తక్కువగాను ఉండాలి. ప్రత్యక్ష, పరోక్ష పన్నులను అభిలషనీయ పద్ధతిలో సమ్మిళితం చేయాలి. మంచి పన్నుల వ్యవస్థలో పన్నుల వలన ప్రజలు తక్కువ అసౌకర్యాన్ని మరియు తక్కువ త్యాగాన్ని కలగజేయాలి. పన్నుల వ్యవస్థ వలన ఆర్థిక వ్యవస్థలో ఒడిదుడుకులను తగ్గించి జాతీయోత్పత్తిని పెంచి, ఉద్యోగావకాశాలను పెంచి, ఆర్థిక వ్యత్యాసాలను తొలగించే విధంగా మంచి పన్నుల వ్యవస్థ విధానాన్ని రూపొందించాలి. ప్రభుత్వ కార్యకలాపాల వలనే పన్నుల విధానం వలన కూడా గరిష్ట సాంఘిక ప్రయోజనాన్ని పొందాలి. పన్నుల వ్యవస్థ మూలధన కల్పనకు తోడ్పడి ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉండాలి. మంచిపన్నుల విధానం ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచటానికి తోడ్పడాలి.

## 4.7. పన్నుల ఆశయాలు (Objectives of Taxation):

సెలిగ్‌మన్ అను ఆర్థిక శాస్త్రవేత్త ప్రకారం పన్ను విధింపు ప్రధాన ఆశయం. ప్రభుత్వ అవసరానికి సరిపడే ఆదాయాన్ని సమకూర్చుకోవడం. వాగ్నర్, ఎడ్జ్‌వర్త్ మొదలగు వారి అభిప్రాయం ప్రకారం సాంఘిక, ఆర్థిక, రాజకీయ సంస్కరణల కోసం పన్నులను న్యాయమైన సాధనంగా ఉపయోగపడాలి. సాంఘిక శ్రేయస్సు కోసం ద్రవ్యవనరులను ధనవంతుల నుండి పేదవారికి తరలించాలి. కీన్స్ అభిప్రాయం ప్రకారం పన్నుల విధానాన్ని ఆర్థికవ్యస్థలోని ఒడిదుడుకులను సర్దుబాటు చేయడానికి ఉపయోగించాలి. పన్నుల ఆశయాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

**1) ఆదాయాన్ని సమకూర్చటం:** ప్రభుత్వం వివిధ కార్యకలాపాలను చేపట్టటం జరుగుతుంది. ఈ కార్యకలాపాలను చేపట్టటానికి ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. ఆదాయం సమకూర్చుకోలేకపోతే ప్రభుత్వ కార్యకలాపాలు నిలచిపోతాయి. అందువల్లనే ప్రభుత్వము ఆదాయాన్ని సమకూర్చుకొనట పన్నుల ముఖ్య ఉద్దేశమని ప్రాచీన కాలం నుండి ఒక అభిప్రాయం ఉంది. ఆదాయాన్ని సమకూర్చుకోవడంతో పాటు ఇతర లక్ష్యాలను సాధించటానికి ప్రాముఖ్యము ఇచ్చినప్పటికీ ఆదాయాన్ని సమకూర్చుకోవటమే పన్నుల ముఖ్య లక్ష్యమని సెలిగ్‌మన్ ముఖ్య అభిప్రాయం.

**2) వినియోగాన్ని క్రమబద్ధీకరణ:** ఆధునిక కాలంలో పన్నుల ముఖ్య ఉద్దేశ్యము కేవలం ఆదాయాన్ని సమకూర్చుకోవడమే కాకుండా ఇతర ఆశయాలను సాధించడం కూడా. కొన్ని వస్తువుల వినియోగాన్ని అదుపుచేయుటకు పన్నులు విధించటం జరుగుతుంది. ఉదాహరణకు మత్తుపానీయాలు, సిగరెట్లు మొదలగు వస్తువుల వినియోగం ప్రజల ఆరోగ్యానికి హానికరంగా ఉండును. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ఇటువంటి వస్తువుల వినియోగాన్ని క్రమబద్ధం చేయడం పన్నుల ఆశయంగా ఉంటుంది.

**3) జాతీయ ఆదాయాన్ని క్రమబద్ధం చేయుట:** ఆధునిక ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం పన్నుల విధానం ద్వారా జాతీయ ఆదాయాన్ని క్రమబద్ధం చేయవచ్చును. ద్రవ్యోల్బణ పరిస్థితులు ఉన్నప్పుడు ప్రత్యక్ష పన్నులను పెంచి ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుట ద్వారా దీనిని నియంత్రించవచ్చు. ఆర్థికమాన్య పరిస్థితులు ఉన్నప్పుడు పన్నులను తగ్గించటం, ప్రభుత్వ వ్యయాన్ని పెంచటం ద్వారా ఈ పరిస్థితులను క్రమబద్ధం చేయవచ్చు. సరియైన బడ్జెట్ విధానాన్ని అనుసరించుట ద్వారా కూడా జాతీయ ఆదాయాన్ని క్రమబద్ధీకరించవచ్చు. కొంత మంది అభిప్రాయం ప్రకారం ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే కన్నా జాతీయ ఆదాయాన్ని స్థిరీకరించటమే పన్నుల ఆశయంగా ఉండాలి.

**4) ఎగుమతులను ప్రోత్సహించుట, దిగుమతులను అదుపు చేయుట:** ఎగుమతులను పెంచి, దిగుమతులను అదుపు చేయడం కూడా పన్నుల ఆశయాలలో ముఖ్యమైనది. ఎగుమతులను ప్రోత్సహించడానికి ఎగుమతి సుంకాలను తక్కువ స్థాయిలో విధించాలి. ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువులను నియంత్రణ చేయడానికి, దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించి ప్రోత్సహించటానికి దిగుమతి వస్తువులపై పన్నులను విధించటం జరుగుతుంది.

**5) ఆర్థిక అసమానతల తగ్గింపు:** పన్నుల విధానం యొక్క ముఖ్య ఆశయం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య ఉన్న ఆర్థిక వ్యత్యాసాలను తగ్గించి సాంఘిక న్యాయాన్ని కల్పించడం. సంపద పన్ను, ఆదాయపు పన్ను మొదలగు వాటిని ధనవంతులపై ఎక్కువగా విధించుట ద్వారా వెనుకబడిన దేశాలలో కల ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు.

**6) ఉత్పత్తిని ప్రోత్సహించుట:** అవసరమైన, ఆశించిన వస్తువుల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఆ వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలకు పన్ను మినహాయింపు ఇవ్వవలెను లేదా పన్ను రేటును తగ్గించవలెను. కొన్ని వస్తువుల ఉత్పత్తి అంతగా అవసరం లేదని భావించినప్పుడు అటువంటి వస్తువులపై అధిక పన్నులను విధించాలి. ఈ విధంగా వివిధ వస్తువుల ఉత్పత్తిని క్రమబద్ధీకరించటానికి పన్నుల విధానం తోడ్పడుతుంది.

**7) విధులను అనుసరించిన విత్తము:** ప్రభుత్వ విత్తం విధులను అనుసరించిన విత్తంగా ఉండాలని లెర్నర్ అభిప్రాయం. ప్రభుత్వ పన్నుల విధానం, ప్రభుత్వ వ్యయ విధానం రుణ సేకరణ మొదలైన ప్రభుత్వ విత్త కార్యకలాపాలు ఆర్థికవ్యవస్థపై ఏర్పడే ఫలితాలను దృష్టిలో ఉంచుకొని నిర్వహించాలని ఈ విధానం యొక్క ముఖ్య ఉద్దేశం. కేవలం రాబడి కోసం మాత్రమే ప్రభుత్వం పన్నులను విధించరాదని లెర్నర్ యొక్క అభిప్రాయం.

**8) స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధి:** దేశంలో ఆర్థిక స్థిరత్వాన్ని సాధించి ఆర్థికాభివృద్ధిని పెంపొందింపచేయుట పన్నుల ఆశయంగా భావించడమగుచున్నది. వ్యాపార చక్రాల వల్ల ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక ఒడుదుడుకులు ఏర్పడతాయి. ఈ ఆర్థిక ఒడుదుడుకులను నివారించి స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించడం పన్నుల ఆశయంగా భావించాలి.

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్నుల విధానం కొన్ని ప్రత్యేకమైన ఆశయాలను కలిగి ఉంది. ఆడంబర వినియోగాన్ని నియంత్రణ చేసి అభిలషణీయమైన పెట్టుబడి రేటును పెంచుట పన్నుల ఆశయంగా భావించడం జరుగుతుంది. సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని పెట్టుబడులను అభిలషణీయమైన మార్గాలకు మళ్ళించాలి. ప్రణాళికా లక్ష్యాలకు అనుగుణంగా ద్రవ్య వనరుల తరలింపు జరగాలి. ఆర్థికవ్యత్యాసాలను తగ్గించి దీర్ఘకాలిక సాంఘిక ప్రయోజనాలకు ప్రాముఖ్యం ఇవ్వాలి. స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధి, సమసమాజ స్థాపన భారతదేశ పన్నుల ఆశయంగా భావించడం జరుగుతుంది. అంతేకాకుండా ఉత్పత్తిలో క్రమాభివృద్ధి సాధించడం, న్యాయమైన పంపిణీ, సంపూర్ణ ఉద్యోగితను సాధించుట, ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచుట మొదలగు ఆశయాలను కూడా భారతదేశ పన్నుల వ్యవస్థ కలిగియున్నది.

## 4.8. అనుపాతపు పన్నులు-పురోగామి పన్నులు(Proportional Taxes - Progressive Taxes):


సాధారణంగా పన్నులు చెల్లించే సామర్థ్యాన్ని ఆదాయము లేదా సంపదను ఆధారంగా తెలుసుకోవడం జరుగుతుంది. కాని వీటిని ఆధారంగా పన్ను విధించిన పన్ను చెల్లింపు దారులందరికీ న్యాయం జరుగుతుందని చెప్పలేము. కనుక పన్నులను

ఏ ప్రాతిపదికగా విధించాలనే విషయం ఎంత ముఖ్యమో, పన్నులను ఏ రేటులో విధించాలనేది కూడా అంతే ముఖ్యము. పన్నుల చెల్లింపు రేటును బట్టి పన్నులను ముఖ్యంగా మూడు విధాలుగా విభజింపవచ్చు. (1) అనుపాతపు పన్నులు (2) పురోగామి పన్నులు (3) తిరోగామి పన్నులు. పన్ను చెల్లింపు సామర్థ్యంతో నిమిత్తం లేకుండా ఆదాయం మారినను పన్ను రేటు ఒకే విధంగా ఉండినా దానిని అనుపాతపు పన్ను అని అందురు. ఉదా॥ ఆదాయపుపన్ను రేటు అందరిపై 10% విధించినా రూ.10,000/-లు ఆదాయం ఉన్న వ్యక్తి రూ.1000/-లను, రూ.1,00,000/-లు ఆదాయము ఉన్న వ్యక్తి రూ.10,000/-లును పన్ను చెల్లించవలెను. ఇందు వ్యక్తి ఆదాయము పెరిగిననూ పన్ను రేటు పెరుగుటలేదు.

ఆదాయము పెరిగేకొలది లేదా పన్ను చెల్లింపు సామర్థ్యము పెరిగే కొలది పన్ను రేటు కూడా పెరిగినా దానిని పురోగామి పన్ను అందురు. ఉదాహరణకు రూ.10,000/-లు ఆదాయము ఉన్న వ్యక్తిపై 10% పన్నును, రూ.1,00,000/-లు ఆదాయము ఉన్న వ్యక్తిపై 50% పన్నును విధించినా మొదటి వ్యక్తి రూ.1,000/-లు రెండవ వ్యక్తి రూ.50,000/- పన్నును చెల్లించవలయును.

పన్ను చెల్లింపు సామర్థ్యము లేదా ఆదాయము పెరిగే కొలది పన్ను రేటు తగ్గిన యెడల దానిని తిరోగామి పన్ను అందురు. ఈ విధానం అందు తక్కువ ఆదాయమున్న వ్యక్తి హెచ్చురేటులోను, ఎక్కువ ఆదాయమున్న వ్యక్తి తక్కువ రేటులోను పన్ను చెల్లిస్తారు.

కొంతమంది ఆర్థికవేత్తల ప్రకారం పన్నుల రకాలలో డిగ్రెసివ్ పన్నుల విధానం కూడా ఒకటి. పన్ను ఆధారం పెరిగే కొలది పురోగామిత్వం క్షీణిస్తున్నట్లు అయిన దానిని డిగ్రెసివ్ పన్నుల విధానం అంటారు. ఈ విధానంలో ఎక్కువ ఆదాయం ఉన్న వ్యక్తి తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తి కంటే ఎక్కువ రేటులో పన్ను చెల్లిస్తున్నప్పటికీ, ఎక్కువ ఆదాయమున్న వ్యక్తి చేసే త్యాగం కంటే తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తి చేసే త్యాగం తక్కువ నిష్పత్తిలో ఉంటుంది. పన్ను విధింపు ఆధారం విస్తృతమైన కొద్దీ, పన్ను రేట్లలలో వచ్చే మార్పును అనుసరించి పన్నులను ముఖ్యంగా అనుపాత, పురోగామి, తిరోగామి పన్నులుగా వర్గీకరించుట జరిగినది. ఈ పన్నుల స్వభావాన్ని ఈ క్రింది రేఖా పటాల ద్వారా చూపవచ్చును.




అనుపాతపు పన్నుల విషయంలో పన్ను విధింపు ఆధారం పెరుగుతున్నప్పటికీ పన్నురేటు మారకుండా స్థిరంగా ఉన్నది. పురోగామి పన్నుల విషయంలో పన్ను ప్రాతిపదిక అనగా పన్ను చెల్లించే సామర్థ్యం కొలది పన్ను రేటు పెరుగుతున్నది. తిరోగామి పన్నుల విషయంలో పన్ను ప్రాతిపదిక పెరిగే కొలది పన్నురేటు తగ్గుచున్నది.

కొంతమంది ఆర్థికశాస్త్రవేత్తల అనుపాతపు పన్ను విధానాన్ని సమర్థించగా మరికొంత మంది పురోగామి పన్ను విధానాన్ని సమర్థించారు. అనుపాతపు పన్నులు మరియు పురోగామి పన్నుల ప్రయోజనాలను, లోపాలను పరిశీలించెదము.

అనుపాతపు పన్నులు-ప్రయోజనాలు:

పన్ను విధింపునకు ఆధారమైన ఆదాయము లేదా సంపదతో సంబంధము లేకుండా ఒకే రేటులో పన్నును విధించిన దానిని అనుపాతపు పన్ను అందురు. ఇందు ఆదాయము లేదా సంపద పెరిగినప్పటికీ పన్ను రేటులో మార్పు ఉండదు. అనుపాతపు పన్నులను ముఖ్యంగా జె.యస్.మిల్, మెక్‌లాక్ మొదలగు ఆర్థికశాస్త్రవేత్తలు సమర్థించారు. మిల్ అభిప్రాయం ప్రకారం పురోగామి పన్నులను పురోగామి దోపిడిగా చెప్పవచ్చు. పురోగామి పన్నులలో ఈ క్రింది ప్రయోజనాలు కలవు.

**1) సులభమయినది:** అనుపాతపు పన్నులు చాలా సులభమయిన పద్ధతి. వ్యక్తుల ఆదాయాలపై అనుపాతపు పద్ధతిలో పన్ను విధించినా అది ప్రతి వ్యక్తికి అర్థం కాగలదు. పన్నుల ద్వారా రావలసిన మొత్తం రాబడి, వ్యక్తుల మొత్తము ఆదాయము తెలిసినా పన్ను రేటును సులభంగా నిర్ణయించవచ్చు.

**2) నిరంకుశమయినది కాదు:** అనుపాతపు పన్ను విధానంలో పక్షపాతానికి విచక్షణకు అవకాశము లేదు. నిరంకుశముగా ఈ పన్ను విధించబడదు. ఒకే రేటులో పన్ను నిర్ణయించుట వలన ఈ విధానము శాస్త్రీయమైనదిగా ఉండును. పురోగామి పన్ను విధానంలో ఆదాయము పెరిగే కొలది పన్ను రేటును ఏ విధంగా నిర్ణయించవలెనో తెలుసుకొనుట కష్టము.

**3) ఆదాయ పంపిణీలో మార్పులు తీసుకురావు:** సమాజంలో ఉండే ఆదాయ పంపిణీ అదేవిధంగా కొనసాగించదలచుకుంటే అనుపాతపు పన్నులను ప్రవేశపెట్టవలయునని ఒక అభిప్రాయము కలదు. ఈ పన్నుల పద్ధతి వ్యక్తుల ఆదాయము మధ్యగల నిష్పత్తిని మార్చకుండా ఉంచును.

**4) పొదుపు, వస్తూత్పత్తి తగ్గవు:** పురోగామి పన్నుల విధానంలో ఆదాయం పెరిగే కొలది పన్నురేటు పెరుగును. కనుక ప్రజలలో పొదుపు చేయాలనే కోరిక, శక్తి తగ్గి మూలధన సంచయనము, పెట్టుబడి తగ్గి వస్తూత్పత్తి తగ్గిపోవును. అనుపాతపు పన్నులలో ఈ భయము ఉండదు. అనుపాతపు పన్నులు పొదుపును, ఉత్పత్తిని నిరుత్సాహ పరచవు.

**5) మెక్‌లాక్ వాదము:** మెక్‌లాక్ అను ఆర్థికశాస్త్రవేత్త ప్రకారము ప్రజల ఆర్థికస్థితికి అనుపాతంగా పన్నులు ఉండవలయును. భీమా సంస్థలలో సభ్యులు చెల్లించే రుసుము వారు భీమా చేసిన మొత్తానికి ఏవిధంగా అనుపాతంలో ఉండునో ఆ విధంగానే చెల్లించే పన్ను పరిమాణము ప్రజల ఆర్థికస్థితికి అనుపాతంలో ఉండవలయునని మెక్‌లాక్ వాదము.

**6) వ్యతిరేకత ఉండదు:** అనుపాతపు పన్నుల విధానాన్ని ప్రజలు వ్యతిరేకించరు. ఆదాయము పెరిగే కొలది దానికి అనుపాతంగా పన్ను పరిమాణం మారుట వలన అనుపాతపు పన్నుల విధానాన్ని ప్రజలు ఎక్కువగా వ్యతిరేకించరు.

**7) ఉపాంత ప్రయోజనాన్ని అంచనా వేయుట కష్టము:** ఉపాంత ప్రయోజనాన్ని అంచనా వేయటం కష్టం. కనుక అనుపాతపు పన్ను విధానం సమర్థనీయమని కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయము. వివిధ వ్యక్తుల ఆదాయముల నుండి పొందే ఉపాంత ప్రయోజనాలను పోల్చడం సాధ్యం కాదు. కనుక వేరువేరు ఆదాయ స్థాయిల వద్ద వివిధ పన్నుల రేట్లను నిర్ణయించవలసిన అవసరం లేకుండా అనుపాతపు పన్ను విధానాన్ని అనుసరించుట మంచిది.

అనుపాతపు పన్నులు-లోపాలు:

**1) పేదవారిపై అధిక భారము:** అనుపాతపు పన్నులు పన్నుల భారాన్ని న్యాయముగాను, సమానముగాను పంచడం జరుగదు. ఈ పన్నుల విధానం వలన పేదవారిపై పన్నుల భారము ఎక్కువగా ఉండును.

**2) తక్కువ రాబడి:** అనుపాతపు పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే రాబడి తక్కువగా ఉండును. అందరిపైన ఒకే రేటులో పన్నులను విధించుట వలన ధనవంతుల ద్వారా అధిక రేటులో పన్నులను వసూలు చేయుటకు ఈ విధానము

ఉపయోగపడదు.

**3) తక్కువ వ్యాకోచము:** అనుపాతపు పన్నులలో వ్యాకోచత కూడా తక్కువగా ఉండును. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా అనుపాతపు పన్నుల ద్వారా ఆదాయాన్ని ప్రభుత్వం పొందలేదు.

**4) ఆదాయ అసమానతలు తగ్గవు:** ఆదాయ అసమానతలను తగ్గించుటకు అనుపాతపు పన్నులు ఉపయోగపడవు. ఈ పన్నుల విధానము వలన ఆదాయ పంపిణీలో ఎటువంటి మార్పులు రావు. కనుక ఆర్థిక స్థోమత కేంద్రీకరణ ధోరణులను అనుపాతపు పన్నులు తగ్గించవు.

**5) పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని పరిగణించదు:** ఆధునిక అభిప్రాయం ప్రకారం పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి పన్నులను విధించాలి. కనుక ధనవంతులపై అధిక పన్నుల రేటును, పేదవారిపై తక్కువ పన్నుల రేటును విధించాలి. కాని అనుపాతపు పన్ను విధానం ఈ సూత్రాన్ని పాటించదు.

**పురోగామి పన్నులు-ప్రయోజనాలు:**

పన్ను ప్రాతిపదికగా పెరిగేకొలది పన్ను రేటు కూడా పెరిగిన దానిని పురోగామి పన్ను అందురు. ప్రపంచములో అనేక దేశాలు పురోగామి పన్నుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. పురోగామి పన్నుల విధానం వలన ఈ క్రింది ప్రయోజనాలు కలవు.

**1) రాబడి ఉత్పాదకత:** పురోగామి పన్నుల విధానము అనుపాతపు పన్నులకంటే ఆదాయము ఎక్కువగా కల్పించును. ఇందుకు కొన్ని కారణములు కలవు. సమాజంలో పేదప్రజలు ఎక్కువగా ఉందురు. కనుక వారిద్వారా అనుపాతపు పన్నులను విధించి ఎక్కువ రాబడిని పొందుట కష్టము. ధనవంతులపై పన్నురేటును పెంచుట ద్వారా ప్రభుత్వము అధిక ఆదాయమును పొందవచ్చును. పురోగామి పన్నుల విధానానికి పేదప్రజల ప్రతిఘటన ఉండదు. అందువలన పురోగామి పన్నుల విధానం ద్వారా రాబడిని ఎక్కువగా పొందవచ్చును.

**2) క్షీణోపాంత ప్రయోజన సిద్ధాంతము:** క్షీణోపాంత ప్రయోజన సూత్రము ఆధారంగా చేసుకొని పురోగామి పన్నుల విధానాన్ని సమర్థించవచ్చును. ద్రవ్య పరిమాణము పెరుగుతూ ఉన్న యెడల అదనంగా పొందే ద్రవ్య ఉపాంత ప్రయోజనం క్షీణించును. ఉదాహరణకు ధనవంతుని విషయంలో చివరి రూపాయి పోగొట్టుకున్నా కోల్పోయే ఉపాంత ప్రయోజనము తక్కువగాను పేదవాని విషయంలో చివరి రూపాయి పోగొట్టుకున్నా కోల్పోయే ఉపాంత ప్రయోజనము ఎక్కువగాను ఉండును. కనుక ధనవంతుని పైన ఎక్కువ రేటులో పన్నును పేదవానిపై తక్కువరేటులో పన్నును విధించవలెను.

**3) పన్ను చెల్లింపు సామర్థ్యముపై ఆధారపడుట:** పురోగామి పన్నుల విధానం పన్ను చెల్లింపు సామర్థ్యం అనే సూత్రముపై ఆధారపడి ఉన్నది. ఆదాయం పెరిగేకొలది పన్ను చెల్లింపు సామర్థ్యము కూడా పెరుగును. కనుక ఆదాయం పెరిగేకొలది పన్నురేటు కూడా పెరగవలెను. పన్ను చెల్లింపు సామర్థ్యం అనే సూత్రముపై ఈ పన్ను విధానం ఆధారపడి ఉన్నది. కనుక పన్ను చెల్లింపుదారుల నుండి ఎటువంటి వ్యతిరేకతను ఎదుర్కొనవలసిన అవసరం ఉండదు.

**4) ఆదాయ అసమానతలను తగ్గించుట:** ఆదాయ అసమానతలను పురోగామి పన్నుల ద్వారా తగ్గించవచ్చును. వాగ్నర్ అనే ఆర్థికశాస్త్రవేత్త ప్రకారం ఆదాయం, సంపదలలో గల అసమానతలను తగ్గించడానికి పురోగామి పన్నులు ఒక సాధనంగా ఉపయోగపడతాయి. ఆదాయము పెరిగేకొలది పన్నురేటు కూడా పెరుగుట వలన ధనవంతుల ఆదాయాన్ని తగ్గించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని పేదప్రజల ఆదాయాన్ని పెంచుటకు ఉపయోగించిన ఆదాయ అసమానతలను తగ్గించవచ్చును.

**5) పురోగామి పన్ను ప్రతి చక్రీయ సాధనము:** పురోగామి పన్ను ప్రతి చక్రీయ సాధనంగా ఉపయోగపడును. వ్యాపార చక్రాలను నివారించి ఆర్థిక స్థిరత్వాన్ని సాధించుట ఆధునిక ఆర్థిక వ్యవస్థల ముఖ్య ఉద్దేశము. ద్రవ్యోల్బణమును లేదా ఆర్థిక

మాంద్య పరిస్థితులను తొలగించుటకు పురోగామి పన్నులు ఉపయోగపడతాయి. ద్రవ్యోల్బణమును తగ్గించుటకు సమిష్టి డిమాండ్, పెట్టుబడిని తగ్గించవలెను. ఇందుకు పురోగామి పన్నులు ఉపయోగపడును. అదేవిధంగా ఆర్థికమాంద్యాన్ని తగ్గించుట పురోగామి పన్ను ద్వారా సాధ్యపడును. పురోగామి పన్నుల ద్వారా పేద ప్రజల వినియోగ ప్రవృత్తిని పెంచి ఆర్థికమాంద్యాన్ని నివారించవచ్చును. కనుక వ్యాపార చక్రాలను నివారించుటకు పురోగామి పన్నుల విధానము ఉపయోగపడును.

**6) వ్యయ భాగము-మిగులు భాగము (హాబ్సన్ వాదము):** హాబ్సన్ అను ఆర్థిక వేత్త ప్రకారము ఆదాయమును రెండు భాగములుగా విభజింపవచ్చును. (1) వ్యయభాగము (2) మిగులు భాగము. పేదప్రజల విషయంలో వ్యయభాగము ఎక్కువగా ఉండగా, ధనవంతుల విషయంలో మిగులు భాగము ఎక్కువగా ఉండును. పన్నులను మిగులు భాగముపై విధించుట మంచిది. కనుక ఆదాయము పెరిగేకొలది పన్నురేటును కూడా పెంచవలెనని హాబ్సన్ అభిప్రాయము.

**7) శక్తి సిద్ధాంతము (సెలిగ్‌మన్ అభిప్రాయము):** సెలిగ్‌మన్ అను ఆర్థిక శాస్త్రవేత్త ప్రకారము ఆదాయము పెరిగేకొలది అదనంగా సంపాదించే శక్తి, అవకాశము పెరుగును. కనుక పురోగామి పన్నుల విధానమును ప్రవేశపెట్టవలయును. పేదవారికంటే ధనవంతుల విషయంలో అదనంగా సంపాదించే శక్తి ఎక్కువగా ఉండును. కనుక ధనవంతులపై పన్నురేటు ఎక్కువగా ఉండవలయునని సెలిగ్‌మన్ అభిప్రాయము.

**8) సంపూర్ణ ఉద్యోగితను సాధించుట:** కీన్స్ అను ఆర్థిక శాస్త్రవేత్త ప్రకారం సంపూర్ణ ఉద్యోగితను సాధించుటకు వినియోగప్రవృత్తి పెంచుట ద్వారా సమిష్టి డిమాండ్‌ను పెంచవలయును. పురోగామి పన్నుల ద్వారా పేద ప్రజల ఆదాయమును పెంచవచ్చును. కనుక వీరి వినియోగ ప్రవృత్తి పెరుగును. కనుక వినియోగప్రవృత్తిని పెంచుట ద్వారా సంపూర్ణ ఉద్యోగితను సాధించుటకు పురోగామి పన్నుల విధానము ఉపయోగపడును.

**9) మితవ్యయము:** పురోగామి పన్నుల సేకరణకు వ్యయము ఎక్కువ కాదు. పురోగామి పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయమునకు పురోగామి పన్నుల వసూలుకు అయ్యే వ్యయమునకు చాలా వ్యత్యాసము ఉండును. కనుక ప్రభుత్వమునకు ఈ పన్నుల ద్వారా మిగులు ఎక్కువగా ఉండును.

**10) నీతిపరమయినది:** పురోగామి పన్నులు నీతిపరంగా కూడా సమర్థనీయమే. ప్రభుత్వ విత్త ప్రాథమిక సూత్రము ప్రకారము ధనవంతులు అధిక పన్నుల భారమును భరించాలి. కనుక పురోగామి పన్నుల విధానంలో ఈ ప్రాథమిక సూత్రాన్ని పాటించడమగును.

**11) సైమన్స్ వాదన:** జె.సి.సైమన్స్ అభిప్రాయము ప్రకారము నీతిశాస్త్ర సూత్రాల ప్రకారం కూడా పురోగామి పన్నుల విధానాన్ని సమర్థించవచ్చు. సమాజంలో ఉన్న ఆదాయ సంపదలలో గల వ్యత్యాసాలు నీతిశాస్త్ర రీత్యా కూడా సమర్థనీయం కావు. పురోగామి పన్నుల ద్వారా ఆదాయ సంపదలలో గల వ్యత్యాసాలను తగ్గించవచ్చు. కనుక పురోగామి పన్నులను నీతిశాస్త్ర రీత్యా కూడా సమర్థించవచ్చును.

**12) మిగులు వనరుల సక్రమ వినియోగము:** పురోగామి పన్నుల ద్వారా సంపన్నుల మిగులు ఆదాయాన్ని సక్రమంగా వినియోగించుకోవచ్చును. పురోగామి పన్నులు ఆడంబర వినియోగాన్ని, విలాసవస్తువుల వినియోగం నుంచి ధనవంతుల దృష్టి మళ్ళించడానికి ఉపయోగపడతాయి. దీనివలన సమాజంలోని పరిమిత ఉత్పత్తి వనరులు వృధా కాకుండా సక్రమ మార్గాలలో ఉపయోగించడానికి వీలుకలుగును.

**పురోగామి పన్నులు-లోపాలు:**

**1) ఉత్పత్తి స్థాయి తగ్గవచ్చు:** పురోగామి పన్నుల విధానంలో ఆదాయం పెరిగే కొలది పన్ను రేటు పెరుగును. కనుక ప్రజలలో పొదుపు చేసే శక్తి, కోరిక తగ్గిపోయి ఉత్పత్తిని పెంచవలెననే భావము తగ్గిపోవును. కనుక వస్తూత్పత్తి పెరగదు.

ఈ విధానం వలన పెట్టుబడి మరియు మూలధన కల్పన తగ్గిపోయే అవకాశం ఉండును.

2) ద్రవ్యానికి క్షీణోపాంత ప్రయోజన సూత్రము అన్వయించబడదు: ద్రవ్య పరిమాణము పెరిగేకొలది ద్రవ్య ఉపాంత ప్రయోజనము క్షీణించిపోవును. కనుక ధనవంతులపై అధిక పన్నులను విధించవలెనని పురోగామి పన్నుల ముఖ్య ఉద్దేశము కాని కొందరి అభిప్రాయం ప్రకారము ద్రవ్య ఉపాంత ప్రయోజనము క్షీణించదు. కనుక పై భావన సరియైనది కాదు.

3) దీర్ఘకాలం అమలుపరచబడదు: పురోగామి పన్నుల పద్ధతిని ఎక్కువ కాలం అమలు పరచటానికి వీలుండదని కొందరి అభిప్రాయం. పురోగామి పన్నుల విధానం వలన ఆదాయ అసమానతలు తొలగిపోయి పురోగామి పన్నుల విధానానికి ప్రాముఖ్యము తగ్గిపోవును.

4) శాస్త్రబద్ధమయినది కాదు: ఆదాయం పెరిగేకొలది పన్నురేటు కూడా పెంచవలయునని పురోగామి పన్నుల విధానం యొక్క అభిప్రాయం. కాని పన్నురేటును ఏ విధముగా ఎంత వరకు పెంచవలయునో అనే విషయంలో శాస్త్రబద్ధమయిన సూత్రము ఏదీ లేదు. కనుక పన్నురేటును ఏకపక్షంగా నిర్ణయించే అవకాశము ఉండును.

5) పన్ను ఎగవేతకు అవకాశము: కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తల ప్రకారము పురోగామి పన్నుల విధానం వలన పన్ను ఎగవేతకు అవకాశము ఏర్పడును. ఆదాయము పెరిగే కొలది పన్నురేటు కూడా పెరుగును. కనుక పన్నులను ఎగవేయుటకు ధనవంతులు ప్రయత్నిస్తారు.

6) పెట్టుబడి ఇతర దేశాలకు తరలివెళ్ళుట: పురోగామి పన్నుల వలన పన్నుల రేటు ఎక్కువగా ఉండుట వలన ధనవంతులు తమ పెట్టుబడులను ఇతర దేశాలకు తరలించుటకు ప్రయత్నిస్తారు. ఇతర దేశాలలో పెట్టుబడులను లాభసాటిగా ఉన్నా ఈ విధంగా జరుగును.

7) కష్టపడి పనిచేయాలనే కోరిక తగ్గిపోవును: పురోగామి పన్నులు ప్రజలలో కష్టపడి పనిచేయాలనే కోరికను తగ్గించును. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న ఆదాయములపై ప్రభుత్వము అధిక పరిమాణములో పన్నులను విధించుట వలన వారిలో కష్టపడి పనిచేయాలనే కోరిక తగ్గిపోవును.

8) పురోగామి దోపిడి: జె.యస్.మిల్. అభిప్రాయం ప్రకారం పురోగామి పన్నును పురోగామి దోపిడిగా వర్ణింపవచ్చును. పన్నురేటు విపరీతంగా పెరగటం వలన కష్టపడి పనిచేయాలనే భావం ప్రజలలో తగ్గిపోయి పనిచేసే శక్తి, కోరిక, పొదుపు చేసే శక్తి, కోరిక బాగా తగ్గిపోవును. పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించాలనే అభిప్రాయం ఉన్నప్పుడు మాత్రమే పురోగామి పన్నుల విధానాన్ని అవలంభించవలెనని లూట్జ్ అభిప్రాయం.

## 4.9. సారాంశము:

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలలో పన్నుల విధానం ముఖ్యంగా పురోగామి పన్నుల విధానం యొక్క ప్రాధాన్యత ఎంతో ఉంది. ఆర్థికాభివృద్ధికి అవసరమైన వనరుల సమీకరణ, ఆర్థిక అసమానతల తగ్గుదల, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించుట మొదలగు విషయాలలో పన్నుల విధానము ప్రాముఖ్యాన్ని వహిస్తున్నది. ఈ లక్ష్యాలను సాధించుటలో ముఖ్యంగా పురోగామి పన్నుల విధానం కీలక స్థానాన్ని ఆక్రమిస్తున్నది. మన దేశంలో ముఖ్యంగా ఆదాయపు పన్ను విషయంలో పురోగామి పన్నుల విధానాన్ని అమలు పరచడం జరుగుతున్నది. పురోగామి పన్నుల ద్వారా అనేక సాంఘిక, ఆర్థిక, నైతిక లక్ష్యాలను సాధించవచ్చును.

## 4.10. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1) పన్నుల భారాన్ని సమాజంలోని వివిధ వర్గాల ప్రజలపై న్యాయబద్ధంగా పంపిణీ చేయబడాలి.

2) ప్రభుత్వము వలన ప్రజలు పొందే లాభాన్ని బట్టి పన్నులను ప్రభుత్వానికి చెల్లించవలెనని పన్ను చెల్లింపు లాభసిద్ధాంతము యొక్క ముఖ్య అభిప్రాయం.

3) ప్రజలకు ప్రభుత్వము సరఫరా చేసే వస్తు, సేవలకు అయ్యే వ్యయానికి సమానంగా ప్రజలు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలని సేవా వ్యయ సిద్ధాంతము యొక్క ముఖ్య అభిప్రాయము.

4) పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి ప్రజలపై పన్నులను విధించాలనే పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతము యొక్క అభిప్రాయము.

5) ప్రభుత్వము పన్నులను విధించేటప్పుడు కొన్ని సూత్రాలను పాటించాలి. ఆ సూత్రాలనే పన్ను విధింపు నియమాలు లేదా పన్ను విధింపు సూత్రాలు అని అందురు.

6) పన్నుల వ్యవస్థ వలన మంచి ఫలితాలు గరిష్టంగా ఉండి, చెడు ఫలితాలు కనిష్టంగా ఉన్నా దానిని మంచి పన్నుల వ్యవస్థగా పరిగణింపవచ్చు.

7) పన్ను విధింపులో కొన్ని ఆశయాలుంటాయి.

8) పన్ను చెల్లింపు సామర్థ్యంతో నిమిత్తం లేకుండా ఆదాయం మారిననూ పన్నురేటు ఒకే విధంగా ఉండినా దానిని అనుపాతపు పన్ను అందురు.

9) ఆదాయం పెరిగే కొలది పన్ను రేటు కూడా పెరిగినా దానిని పురోగామి పన్ను అని అందురు.

10) పన్ను చెల్లింపు సామర్థ్యం లేదా ఆదాయం పెరిగే కొలది పన్ను రేటు తగ్గిన యెడల దానిని తిరోగామి పన్ను అని అందురు.

11) పన్ను ఆధారం పెరిగే కొలది పురోగామిత్వం క్షీణిస్తున్నట్లయినా దానిని డిగ్రెసివ్ పన్నుల విధానం అని అందురు.

12) అనుపాతపు పన్నుల విధానంలో కొన్ని లాభాలు, నష్టాలు ఉన్నాయి.

13) పురోగామి పన్నుల విధానంలో కొన్ని ప్రయోజనాలు, నష్టాలు ఉన్నాయి.

## 4.11. కఠిన పదాలు:

1) **క్షితిజ సమాంతర న్యాయం:** సమాన స్థాయిలో ఉన్న వారందరూ ప్రభుత్వానికి సమానంగా పన్ను చెల్లించడాన్ని క్షితిజ సమాంతర న్యాయమందురు.

2) **క్షితిజ లంబ న్యాయం:** భిన్నస్థాయిలో ఉన్నవారు భిన్నంగా పన్ను చెల్లించాలని చెప్పే దానిని క్షితిజ లంబన్యామందురు.

3) **సమనిరపేక్ష త్యాగం:** ప్రజలు ప్రభుత్వానికి పన్ను చెల్లించుట వలన వారు చేసే మొత్తం త్యాగం సమానంగా ఉండాలనే దానిని సమ నిరపేక్ష త్యాగం అని అందురు.

4) **సమ అనుపాత త్యాగం:** ప్రజలు ప్రభుత్వానికి పన్ను చెల్లించినపుడు వారు చేసే త్యాగం వారి ఆదాయాలకు అనుపాతంగా ఉండాలని ఈ సూత్రం యొక్క ముఖ్య ఉద్దేశం.

5) **సమ ఉపాంత త్యాగము:** ప్రజలు పన్ను చెల్లించుట వలన ప్రజలు చేసే ఉపాంత త్యాగం సమానంగా ఉండాలని ఈ భావన యొక్క ముఖ్య ఉద్దేశము.

6) అనుపాతపు పన్ను: పన్ను చెల్లింపు సామర్థ్యంతో నిమిత్తం లేకుండా ఆదాయం మారిననూ పన్ను రేటు ఒకేవిధంగా ఉన్నా దానిని అనుపాతపు పన్ను అందురు.

7) పురోగామి పన్ను: ఆదాయం పెరిగే కొలది పన్ను రేటు పెరిగినా దానిని పురోగామి పన్ను అని అందురు.

8) తిరోగామి పన్ను: ఆదాయం లేదా పన్ను చెల్లింపు సామర్థ్యం పెరిగే కొలది పన్ను రేటు తగ్గినా దానిని తిరోగామి పన్ను అందురు.

9) డిగ్రెసివ్ పన్ను: పన్ను ఆధారం పెరిగే కొలది పురోగామి ద్రవ్యం క్షీణిస్తున్నా దానిని డిగ్రెసివ్ పన్ను అని అందురు.

## 4.12. నమూనా ప్రశ్నలు:

వ్యాసరూప ప్రశ్నలు:

1) పన్ను విధింపు లాభసిద్ధాంతాన్ని గూర్చి వ్రాయుము.
2) సేవా వ్యయాల సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలింపుము.
3) పన్ను చెల్లింపు సామర్థ్య సిద్ధాంతాన్ని గూర్చి వ్రాయుము.
4) పన్ను విధింపు నియమాలను గూర్చి తెలుపుము.
5) ఉత్తమ పన్నుల లక్షణాలను గూర్చి వ్రాయుము.
6) పన్నుల ఆశయాలను పరిశీలింపుము.
7) అనుపాతపు, పురోగామి పన్నుల ప్రయోజనాలను గూర్చి వివరింపుము.

సంక్షిప్త ప్రశ్నలు

1) పన్ను చెల్లింపు సమత్యాగ సిద్ధాంతము గూర్చి వ్రాయుము.
2) ఆడమ్‌స్మిత్ ప్రతిపాదించిన పన్నుల నియమాలను గూర్చి తెలుపుము.
3) అనుపాత, పురోగామి, తిరోగామి పన్నుల అర్థాలను గూర్చి వ్రాయుము.

## 4.13. చదువదగిన గ్రంథాలు:


1) Theory of Public Finance - R.A.Musgrave
2) Public Finance - R.K.Lekhi
3) Public Finance - B.P.Tyagi
4) పబ్లిక్ అర్థశాస్త్రము - తెలుగు అకాడమీ.


- శ్రీ బి. కోటేశ్వరరావు.

ట:5

# పన్నుల భారము

**లక్ష్యం:**

ఈ పాఠంలో మీరు (1) పన్నుల వత్తిడి, బదిలీ, పన్నుల భారం-బదిలీ సూత్రాలు, సాంప్రదాయ సిద్ధాంతాలు, పన్నుల భారం తెలుసుకుంటారు. (2) మార్కెట్ స్వభావం, పన్నుల బదిలీ, కొన్ని పన్నుల భారం తెలుసుకుంటారు. (3) కొన్ని పన్నులలో వృష్టి ఆదాయం, మరణ సుంకాలు, అమ్మకం పన్ను, దిగుమతి-ఎగుమతి పన్నులు పన్నుల భారం గురించి అవగాహన చేసుకొంటారు.

## సూచిక


5.1. విషయ పరిచయము

5.2. పన్నుల వత్తిడి

5.3. పన్నుల బదిలి

5.4. పన్నుల భావం

5.5. పన్నుల ప్రభావం

5.6. పన్నుల భారం-బదిలీ సూత్రాలు, సాంప్రదాయ సిద్ధాంతాలు, కేంద్రీకరణ సిద్ధాంతం-వ్యాప్తసిద్ధాంతము.

5.7. ఆధునిక సిద్ధాంతము
- పూర్తి వ్యాకోచ డిమాండ్-పన్నుల భారం బదిలీ
- పూర్తి అవ్యాకోచ డిమాండ్-పన్నుల భారం బదిలీ
- పూర్తి వ్యాకోచ సప్లై-పన్నుల భారం బదిలీ
- పూర్తి అవ్యాకోచ సప్లై-పన్నుల భారం బదిలీ
- వ్యయ స్వభావం-పన్నుల భారం

5.8. మార్కెట్ స్వభావం-పన్నుల బదిలీ
- పరిపూర్ణ పోటీ మార్కెట్
- ఏకస్వామ్య మార్కెట్

5.9. పన్నుల రకాలు-పన్నుల బదిలీ

5.10. కొన్ని పన్నుల భారం
- వృష్టి ఆదాయం పన్ను
- మరణ సుంకాలు-పన్నుల భారం బదిలీ
- అమ్మకం పన్ను-పన్నుల భారం బదిలీ
- దిగుమతి, ఎగుమతి పన్నుల-పన్నుల భారం బదిలీ

5.11. సారాంశము.

5.12. గుర్తుంచుకోవలసిన విషయములు

5.13. కఠిన పదాలు

5.14. నమూనా ప్రశ్నలు

5.15. చదువదగిన గ్రంథాలు

## 5.1. విషయ పరిచయము:

పన్నులు విధించేటప్పుడు పన్ను భారం పడుతుంది. అయితే ఎవరి మీద అయితే పన్ను విధిస్తామో ఆ వ్యక్తి భరిస్తా లేక ఆ భావాన్ని ఇతరులకు బదలీ చేస్తాడా అనే విషయం గమనించాలి. పన్నులు విధించక ముందు ఈ విషయా గ్రహించాలి. పన్ను విధించినప్పుడు దానిని వెంటనే ఎవరు భరిస్తారు, చివరకు ఎవరు భరిస్తారు అని తెలుసుకోవడమే పా మొక్క ముఖ్యలక్ష్యం.

పన్నులను విధించినప్పుడు కలిగే ఫలితాలను విశ్లేషణ చేసేటప్పుడు పన్నుల ఒత్తిడి, పన్నుల బదిలీ, పన్నుల ప్రభావ పన్నుల భారం అనే మూడు అంశాలను పరిశీలించాలి.

## 5.2. పన్నుల వత్తిడి:

పన్ను విధించినప్పుడు మొదటి సారిగా ఆ పన్నును ఎవరైతే చెల్లించడం జరుగుతుందో ఆ వ్యక్తిపై పన్నుల ఒత్తి ఉందని చెప్పవచ్చు. ఉదాహరణకు ప్రభుత్వం మోటారు సైకిల్ తయారీపై పన్ను విధించిందని అనుకుంటే వెంటనే ఆ కంపె యజమాని పన్ను చెల్లిస్తాడు. పన్ను విధించిన వెంటనే మొదటిసారి పన్ను చెల్లించిన వ్యక్తిపై పన్నుల ఒత్తిడి ఉంటుంది.

## 5.3. పన్నుల బదిలీ:

పన్నులను విధించినప్పుడు పన్నుల ద్రవ్య భారాన్ని ఒక వ్యక్తి నుండి వేరొక వ్యక్తికి బదిలీ చేయడాన్నే పన్నుల బది అందురు. ఉదాహరణకు ప్రభుత్వం మోటారు సైకిళ్ళపై ఉత్పత్తి పన్ను విధించిందనుకుందాము. మొదట ఆ పన్నున మోటారు సైకిళ్ళు తయారు చేసే యజమాని చెల్లించి తరువాత ఆ పన్ను భారాన్ని కార్ల కొనుగోలుదార్లకు బదిలీ చేస్తాడ దీనినే పన్నుల బదిలీ అందురు.

## 5.4. పన్నుల భారము:

పన్ను యొక్క అంతిమ ప్రభావాన్ని పన్నుల భారం అంటారు. పన్ను విధించినప్పుడు దాని తొలి ప్రభావం ఒకరి ఉండగా ఆ పన్ను ఇతరులకు బదిలీ చేస్తే తుది ప్రభావం వేరొకరిపై ఉంటుంది. ఉదాహరణకు మోటారు సైకిళ్ళు తయార చేసే కంపెనీపై ప్రభుత్వం పన్ను విధించినప్పుడు ముందుగా కంపెనీ యజమాని ఆ పన్ను చెల్లిస్తాడు. ఆ తర్వాత ఆ పన్నున టోకు వర్తకునికి, తరువాత చిల్లర వర్తకునికి చివరకు కొనుగోలుదారునికి బదిలీ చేస్తారు. కాబట్టి పన్ను భారాన్ని చివరక కొ[illegible]రుడు భరిస్తాడు. ఇతరులకు పన్నును బదిలీ చేయడానికి వీలులేకపోతే పన్నుల భారం ఆ వ్యక్తిపై మాత్రమే ఉంటు[illegible] [illegible]ల భారాన్ని చివరకు భరించే వారిని కనుక్కోవడమే పన్నుల భారము విశ్లేషణ ముఖ్య ఉద్దేశము అని హిక్ అభిప్రాయము.

## 5.5. పన్నుల [illegible]ము:

పన్నుల భారం కం[illegible] పన్నుల ప్రభావం విస్తృతమైనది. డాల్టన్ అనే ఆర్థిక శాస్త్రవేత్త ప్రకారం పన్నుల భారం ప్రత్య ద్రవ్య భారాన్ని సూచించగా పన్నుల ప్రభావం పరోక్ష ద్రవ్య భారాన్ని తర్వాత ఏర్పడే ఇతర ఫలితాలను గూర్చి వివరిస్తుంది ఉదాహరణకు కాఫీ పౌడర్‌పై ప్రభుత్వం పన్ను విధించిందనుకుందాము. ఇందువలన చివరకు ఆ పన్ను భారాన్ని వినియోగదారు భరిస్తాడు. ఈ చర్య వలన ఈ వస్తువుకు ధర పెరిగి వినియోగం తగ్గవచ్చు. దీని మూలంగా కాఫీ పౌడర్ ప్రత్యామ్నాయ వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. దానినే పన్నుల ప్రభావం అందురు.

## 5.6. పన్నుల భారం- బదిలీ సూత్రాలు:

**సాంప్రదాయ సిదాంతాలు:**


**కేంద్రీకరణ సిద్ధాంతము:** దీనిని ఆర్థిక మిగులు సిద్ధాంతము అని కూడా అందురు. ఈ సిద్ధాంతాన్ని ముఖ్యంగా ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫిజియోక్రాట్స్ ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతము ప్రకారము ఎవరి ఆదాయం మిగులు ఉంటుందో కాక చివరకు పన్నుల భారాన్ని భరించాలి. ఫిజియోక్రాట్స్ అభిప్రాయం ప్రకారం భూస్వాముల ఆదాయంలో మిగులు ఉంటుంది.

కాబట్టి చివరకు పన్ను భారాన్నిన భూస్వాములే భరించాలి. ... ఆర్థిక ... లు తెలుసుకోవడం కష్టము. మిగులు ఆదాయం కేవలం వ్యవసాయ కార్యకలాపాలలోనే ఏర్పడుతుంది అనే భావం పూర్తి నిజం కాదు.

**వ్యాప్త సిద్ధాంతము:** దీనిని ఫ్రాన్స్ దేశానికి చెందిన మేన్స్ ఫీల్డ్, కనార్డ్‌లు అభివృద్ధి పరిచారు. ఈ సిద్ధాంతము ప్రకారము పన్నులు విధిస్తే దానిభారం తాత్కాలికంగా మాత్రమే కొందరి వ్యక్తులపై మాత్రమే ఉంటుంది. వినిమయ కార్యకలాపాలలో భాగంగా ఒకరి నుండి మరొకరికి బదిలీ అవుతూ ఆ పన్నుల భారం అందరిపై వ్యాప్తి చెందుతుంది. మేన్స్‌ఫీల్డ్ అభిప్రాయంలో కొలనులో రాయి విసిరితే ఆ స్థలం నుండి అలలు క్రమక్రమంగా చెఱువు అంతటా ఎలా వ్యాపిస్తాయో పన్నుల భారం కూడా సమాజం అంతా వ్యాప్తి చెందుతుంది. అయితే వాకర్ అభిప్రాయంలో సంపూర్ణ పోటీ ఉంటుంది అనే ప్రమేయంపై వ్యాప్తి సిద్ధాంతము ఆధారపడి ఉంది కాని అలాంటి పోటీ వాస్తవంగా ఉండదు.


**ఆధునిక సిద్ధాంతము:** ఇ.ఆర్.ఎ.సెలిగ్ మన్, ఎఫ్.వై.ఎడ్జివర్త్‌లు ఆధునిక పన్నుల భారం బదిలీని విశ్లేషించారు. పన్ను విధింపు ఫలి... పెరి... ఉత్పత్తి వ్యయభారాన్ని ధరలను పెంచడం ద్వారా అమ్మకందారుడు వినియోగదారులకు బదిలీ చేయునచ్చును. వినియోగదారులు, వస్తువుల సరఫరాలను తగ్గించి వినియోగదారులపై పన్ను భారాన్ని బదిలీ చేయడానికి ప్రయత్నించవచ్చు. అయితే పన్ను భారం ఏ మేరకు బదిలీ అవుతుంది అక్కడి డిమాండ్, సప్లైల వ్యాకోచాలపై ఆధారపడి ఉంటుంది.

**పూర్తి వ్యాకోచ డిమాండ్-పన్నుల భారం బదిలీ:** పూర్తి వ్యాకోచ డిమాండ్ గల వస్తువులపై పన్ను విధించినప్పుడు ఆ పన్ను భారాన్ని పూర్తిగా అమ్మకందారుడు భరించాలి. ధరను పెంచి పన్ను భారాన్ని బదిలీ చేయడానికి ప్రయత్నిస్తే డిమాండ్ పూర్తిగా తగ్గిపోతుంది. ఎందుకంటే ధరలో చిన్న మార్పులకు డిమాండ్‌లో ఎంతైనా మార్పు వస్తుంది. అంటే ధర పెంచితే డిమాండ్ పూర్తిగా పడిపోతుంది అంటే కొనుగోలుదారుడు ఉండడు, కాబట్టి పన్ను భారాన్ని బదిలీ చేయడానికి అవకాశం లేదు. ఈ విషయాన్ని క్రింది రేఖా చిత్రము ద్వారా చూడవచ్చు.





రేఖా చిత్రములో DD పూర్తి వ్యాకోచ డిమాండ్ రేఖ. SS పన్ను విధించక ముందు సప్లై రేఖ కాబట్టి PM పన్ను విధించక ముందు సమతుల్యధర. పన్ను విధించిన తర్వాత సప్లై STకి మారింది. కాబట్టి $P_1M_1$ పన్ను విధించిన తర్వాత సమతుల్యధర. పన్ను విధించక ముందు ఉన్న సప్లైకి పన్ను విధించిన తర్వాత సప్లైకి గల తేడాను పన్నుల భారంగా పరిగణించవచ్చును. కాబట్టి P1 Q పన్నుల భారము. ఈ పన్నుల భారాన్ని వినియోగదారునికి తరలించడానికి ధరను పెంచాలి. కాని పన్ను విధించిన తర్వాత కూడా ధర అదేవిధంగా ఉన్నది. (PM=P1 M) కాబట్టి పన్నుల భారాన్ని అంతా అమ్మకందారుడు భరిస్తాడు.

**పూర్తి అవ్యాకోచ డిమాండ్-పన్నుల భారం బదిలీ:** పూర్తి అవ్యాకోచ డిమాండ్ ఉన్న వస్తువులపై విధించే పన్ను భార పూర్తిగా కొనుగోలుదారుడు భరిస్తాడు. దీనిలో పన్నుల ధర ఎంత పెంచినా డిమాండ్ తగ్గదు. అందుచేత పన్నుల భార కొనుగోలుదారునికి పూర్తిగా బదిలీ చేయవచ్చు. ఈ క్రింది రేఖా పటం ద్వారా దీనిని వివరించవచ్చును.





పై పటంలో DD పూర్తిగా అవ్యాకోచ డిమాండ్ రేఖ. పన్ను విధించిన తర్వాత సప్లై రేఖ SS నుండి STకి మారిం అంటే పన్ను భారం PQ. అందువలన ధర OA నుండి OBకి మారింది. దీనిలో పన్నులభారం, ధరల పెరుగుదల సమాన (PQ=AB). ధర పెంచడం ద్వారా పన్ను భారాన్ని పూర్తిగా కొనుగోలుదారునికి బదిలీ చేయవచ్చు.

**పూర్తి వ్యాకోచ సప్లై-పన్నుల భారం బదిలీ:** వస్తువుల సప్లై పూర్తి వ్యాకోచంగా ఉంటే పన్నుల భారాన్ని కొనుగోలుదారు భరిస్తారు. సప్లైని తగ్గించటం ద్వారా ధరలను పెంచి పన్నుల భారాన్ని కొనుగోలుదారులకు తరలించవచ్చు. ఈ విషయా: క్రింది రేఖా చిత్రము ద్వారా తెలియచేయవచ్చును.




పై చిత్రములో పన్ను విధించక ముందు SS సప్లై రేఖ DD డిమాండ్ రేఖ. P బిందువు వద్ద రెండూ సమానమైనవి. కనుక ధర OA పన్ను విధించిన తరువాత సప్లై SS నుండి STకి మారింది. కాబట్టి సమతౌల్య బిందువు P నుండి Qకు మారింది. అందువల్ల ధర OA నుండి OBకి మారింది. ఇందులో పన్నుల భారం QR కాగా ధర AB పరిమాణంలో మారింది. కాబట్టి పన్నులభారం ధరల పెరుగుదల సమానంగా ఉంది. ఇక్కడ RQ=AB కాబట్టి పన్నుల భారాన్ని ధరను పెంచటం ద్వారా కొనుగోలుదారునకు బదిలీ చేయవచ్చు.

**పూర్తి అవ్యాకోచ సప్లై-పన్నుల భారము బదిలీ:** వస్తువుల సప్లై పూర్తి అవ్యాకోచంగా ఉంటే పన్ను విధించేటప్పుడు పన్నుల భారాన్ని పూర్తిగా అమ్మకందారుడే భరిస్తాడు. సప్లైలో మార్పు అసలుండదు కాబట్టి ధరను పెంచటానికి వీలుండదు. కాబట్టి పన్నుల భారాన్ని అమ్మకందారుడే భరిస్తాడు. ఈ విషయాన్ని క్రింది పటం ద్వారా చూపవచ్చును.




పై పటంలో పన్ను విధించక ముందున్న సప్లై రేఖ SS. డిమాండ్ రేఖ DD. రెండూ P బిందువు వద్ద సమానంగా ఉన్నాయి. ధర OS పన్ను విధించిన తరువాత కూడా సప్లై రేఖ ST. S, ST ఒకేవిధంగా ఉన్నాయి. సప్లైలో మార్పు లేదు. కాబట్టి ధర గానే ఉంది. ధరను పెంచడానికి అవకాశం లేదు. కాబట్టి ఈ భారాన్ని అమ్మకందారుడే భరించాలి.


సాధారణంగా పూర్తి వ్యాకోచ డిమాండ్, పూర్తి అవ్యాకోచ డిమాండ్, పూర్తి వ్యాకోచ సప్లై, పూర్తి అవ్యాకోచ సప్లై వాస్తవానికి దూరంగా ఉంటాయి. కాబట్టి సాపేక్ష వ్యాకోచ డిమాండ్ సప్లైలను పరిశీలించటం ద్వారా పన్నుల భారాన్ని పరిశీలించాలి. సప్లై వ్యాకోచం కన్నా డిమాండ్ వ్యాకోచం ఎక్కువగా ఉంటే పన్నుల భారంలో ఎక్కువ భాగం అమ్మకందారుడు, తక్కువ భారాన్ని కొనుగోలుదారుడు భరిస్తాడు. అలా కాకుండా సప్లై వ్యాకోచం ఎక్కువగా ఉండి డిమాండ్ వ్యాకోచం తక్కువగా ఉంటే పన్నుల భారాన్ని ఎక్కువగా కొనుగోలుదారుడు, తక్కువ భారాన్ని అమ్మకందారుడు భరిస్తాడు. సప్లై వ్యాకోచం, డిమాండ్ వ్యాకోచం సమానంగా ఉంటే పన్నుల భారాన్ని అమ్మకందారుడు, కొనుగోలుదారుడు సమానంగా భరిస్తారు. దీనిని క్రింది రేఖాపటం ద్వారా వివరించవచ్చు.




పై పటంలో డిమాండ్, సప్లై వ్యాకోచాలు సమానంగా ఉన్నాయి. పన్ను విధించక ముందు ఏర్పడిన సమతౌల్య బిందువు 'P' పన్ను విధించిన తరువాత సప్లై STకు మారింది. పన్ను విధించటం వలన పన్నుల భారం $P_1R$ కాగా ధరను AB పరిమాణంలో ($P_1T$) పెంచటం వలన మొత్తం పన్నుల భారం $P_1T$ పరిమాణం పన్నుల భారాన్ని కొనుగోలుదారులకు బదిలీ చేయటమైనది. మిగిలిన TR పన్నులభారం అమ్మకందారుడే భరిస్తాడు. కొనుగోలుదారుడు, అమ్మకందారుడు భరించిన పన్నుల భారం సమానంగా ఉన్నది ($P_1T = TR$).

**వ్యయ స్వభావం-పన్నుల భారము:**

వ్యయస్వభావం కూడా పన్నుల భారాన్ని ప్రభావితం చేస్తుంది. పెరిగే వ్యయాలు ఉన్నప్పుడు పన్నుల భారాన్ని కొంత కొనుగోలుదారుడు, కొంత అమ్మకందారుడు భరిస్తాడు. స్థిరవ్యయాలు ఉన్నప్పుడు పన్ను భారాన్ని అంతా వినియోగదారుడే భరించాలి. తగ్గుతున్న వ్యయాలు ఏర్పడినప్పుడు పన్నుల భారం కంటే అదనంగా కొనుగోలుదారుడు ధరను చెల్లించాలి. ఈ విషయాలను క్రింది రేఖాపటాల ద్వారా చూపవచ్చు.



పెరిగే వ్యయాల విషయంలో పన్ను విధించటం వల్ల $P_1R$ పరిమాణంలో పన్నుల భారం ఏర్పడింది. ధర OA నుండి OBకి అంటే అదనంగా AB పరిమాణంలో ధరను పెంచటం ద్వారా $P_1Q$ పన్ను భారాన్ని కొనుగోలుదారుడు భరించగా మిగిలిన QR పన్ను భారాన్ని అమ్మకందారుడు భరిస్తాడు. స్థిరవ్యయాల విషయంలో పన్ను విధింపు వల్ల పన్నులభారం $P_1R$ కాగా ఈ పన్నుల భారాన్ని ధరను OA నుండి OBకి అంటే AB పరిమాణంలో పెంచటం ద్వారా ఈ భారాన్ని పూర్తిగా కొనుగోలుదారునికి తరలించవచ్చు. తగ్గుతున్న వ్యయాల విషయంలో పన్ను విధించటం వలన పన్నుల భారం $P_1R$ కాగా కొనుగోలుదారుడు అధికంగా ధరను AB పరిమాణంలో చెల్లిస్తాడు. కాబట్టి పన్నుల భారం కంటే $P_1R$ కొనుగోలుదారుడు అదనంగా చెల్లించే ధర ($ABP_1T$) ఎక్కువగా ఉంది.

## 8. మార్కెట్ స్వభావం పన్నుల బదిలీ:

పన్నులభారం బదిలీ, సప్లై, డిమాండ్, వ్యయం వంటి అంశాలపైనే కాక కొంత వరకు మార్కెట్ స్వభావంపై కూడా ఆధారపడి ఉంటుంది. స్వభావ రీత్యా పరిపూర్ణపోటీ మార్కెట్, ఏకస్వామ్య మార్కెట్ ఉన్నప్పుడు పన్నులభారం బదిలీ ఎలా ఉంటుందో తెలుసుకుందాము.

**పరిపూర్ణ పోటీ మార్కెట్:** పరిపూర్ణ పోటీలో వివిధ సంస్థల, వస్తువుల ధరలు ఒకేవిధంగా ఉంటాయి. అందుచేత వస్తువుల డిమాండ్ రేఖ పూర్తి వ్యాకోచంగా ఉంటుంది. ఇలాంటి మార్కెట్‌లో ధరను పెంచే అవకాశం ఉండదు. అందుచేత ఉత్పత్తిదారుడు పన్నుల భారాన్ని కొనుగోలుదారులకు బదిలీ చేసే వీలుండదు. అయితే ఇది స్వల్పకాలానికి మాత్రమే పరిమితం. వస్తువుల సప్లైని తగ్గించి తద్వారా దీర్ఘకాలంలో ధరను పెంచడం ద్వారా అమ్మకందారుడు పన్నులభారాన్ని కొనుగోలుదారునికి బదిలీ చేయవచ్చు.

**ఏకస్వామ్య మార్కెట్:** పన్ను లాభాలపై విధించారా లేదా ఉత్పత్తిపై విధించారా అనేది కీలకమైన అంశం. వస్తువుల అమ్మకం జరిగిన తర్వాత లాభాలు వస్తాయి. కాబట్టి లాభాలపై పన్ను విధించినా ధరను పెంచే వీలుండదు. ఆ భారాన్ని ఏకస్వామ్యదారుడే భరించాలి. అలాకాక వస్తువుపై పన్ను విధిస్తే దాని ధరను పెంచడం ద్వారా ఆ భారాన్ని కొనుగోలుదారునికి బదిలీ చేయవచ్చు.

## 9. పన్నుల రకాలు-పన్నుల బదిలీ:

పన్నుల బదిలీ మార్కెట్ నిర్మాణం పైనే గాక పన్నుల రకాలు వాటి స్వభావంపై కూడా ఆధారపడి ఉంటుంది. ప్రత్యక్ష పన్నుల భారాన్ని ఒకరి నుండి మరొకరికి బదిలీచేయడానికి అవకాశం ఉండదు. కాని పరోక్షపన్నుల విషయంలో పన్నుల భారం బదిలీకి వీలుండదు. ఉదాహరణకు కేంద్ర ఎక్సైజు సుంకాలు ఉత్పత్తిదారునిపై విధిస్తే వాటిని ఉత్పత్తిదారులు అమ్మకందారులకు, కొనుగోలుదారులకు బదిలీ అవుతుంది. ప్రత్యామ్నాయ వస్తువుల విషయంలో ఒక వస్తువుకు పన్ను విధిస్తే ఆ వస్తువుకు డిమాండ్ తగ్గి, పన్ను భారాన్ని బదిలీ చేయలేదు. అందుచేత అన్ని వస్తువులపై పన్నులు విధిస్తేనే పన్నుల భారం బదిలీకి అవకాశం ఉంటుంది.

## 10. కొన్ని పన్నుల భారం:

**(ఎ) వ్యష్టి ఆదాయపు పన్ను:** వ్యష్టి ఆదాయంపై విధించే ఆదాయం పన్నును బదిలీ చేయడానికి అవకాశం ఉండదు. ఎందుకంటే ఈ పన్ను వస్తువుల అమ్మకం తర్వాత వచ్చే ఆదాయంపై విధించబడుతుంది. ఇది ఉత్పత్తి వ్యయంతో కలసి ఉండదు. అందుచేత ఈ పన్ను భారాన్ని బదిలీ చేసే అవకాశం లేదని డాల్టన్ భావన. అయితే కొందరి అభిప్రాయంలో వ్యాపారసంస్థలు తాము చెల్లించవలసిన ఆదాయం పన్నును ముందుగానే ఊహించి దానిని కూడా ధరలో చేర్చడం ద్వారా పన్ను భారాన్ని బదిలీ చేయవచ్చును.

శ్రామికులు పొందే వేతనాలపై ఆదాయం పన్ను విధించినప్పుడు శ్రమ, సప్లై తగ్గవచ్చు. అందువల్ల పన్నులభారాన్ని యజమానికి బదిలీ చేయవచ్చు. ఈ బదిలీని పన్నుల భారం వెనుకకు బదిలీ అని అనవచ్చు. కాని స్వల్పకాలంలో ఆదాయం మీద విధించిన పన్నుల భారాన్ని బదిలీ చేసే వీలుండదు.

**మరణ సుంకాలు-పన్నుల భారం బదిలీ:** మరణ సుంకాల భారం బదిలీ విషయంలో శాస్త్రవేత్తల మ భిన్నాభిప్రాయాలున్నాయి. ఒక వ్యక్తి మరణానంతరం అతని ఆస్తిపై విధించే పన్నును మరణ సుంకంగా చెప్పవచ్చు. హక్కుదారులను ఎస్టేట్‌దారులందురు. కొందరి అభిప్రాయంలో ఈ పన్ను భారం ఎస్టేట్‌దారుల వారసులపై పడుతుం చెబుతారు. ఎందుకంటే వ్యక్తి మరణానంతరం వెళ్ళే పన్ను కాబట్టి వారసుడే చెల్లిస్తాడు. అందువలన పన్నుభారం బ చేయవచ్చునని కొందరి భావన ఒక్కొక్కసారి ఎస్టేట్‌దారుడు తన వారసుడు మరణసుంకాన్ని చెల్లించవలసి ఉంటుం ఊహించి తానే ఈ సుంకాన్ని చెల్లించడానికి ఎక్కువ శ్రమపడి పనిచేయవచ్చు లేదా మరణ భీమా చేసి ఉండవచ కాబట్టి మరణ సుంకాన్ని చెల్లించడానికి ఎస్టేట్ వారసుడే చెల్లిస్తాడు. ఇందుకోసం ద్రవ్యాన్ని కూడబెడతాడు. అందు ఇక్కడ పన్నుభారం బదలాయించడం జరగదు అని కొందరి అభిప్రాయం.

**అమ్మకం పన్ను-పన్నుల భారం బదిలీ:** అమ్మకం పన్ను భారాన్ని బదిలీ చేసే విషయంలో ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయా భిన్నంగా ఉన్నాయి. ఆ పన్ను భారాన్ని ముందుకు బదిలీ చేయవచ్చునని కొందరు వెనుకకు బదిలీ చేయవచ్చున కొందరంటున్నారు.

అమ్మకం పన్నును ధరలో కలుపుతారు కాబట్టి దీని భారాన్ని కొనుగోలుదారులకు బదిలీ చేయవచ్చు. స్వల్పకాలం ధరల పెరగడం వల్ల డిమాండు తగ్గి లాభాలు తగ్గి ఉత్పత్తి తగ్గుతుంది. అయితే దీర్ఘకాలంలో ఈ పన్ను భారాన్ని బది చేయవచ్చును. అమ్మకం పన్ను భారాన్ని ఇతరులకు ఎంతవరకు బదిలీ చేయవచ్చు అనేది ప్రధానంగా వస్తువులకు స డిమాండుల వ్యాకోచాలపై ఆధారపడి ఉంటుంది. డిమాండ్ పూర్తి వ్యాకోచంగా ఉంటే పన్నుభారాన్ని అమ్మకందారు భరిస్తాడు. అలాకాక డిమాండ్ పూర్తి అవ్యాకోచంగా ఉంటే ఆ మొత్తాన్ని వినియోగదారునికి బదిలీ చేయవచ్చు. కా వాస్తవంలో డిమాండ్ వ్యాకోచం, సప్లై వ్యాకోచం సాపేక్షంగా ఉంటాయి, కాబట్టి ఈ భారాన్ని అమ్మకందారు కొనుగోలుదారులు కలిసి భరిస్తారు.

రాల్ఫ్, బైన్ అనే అమెరికన్ శాస్త్రవేత్తల ప్రకారం అమ్మకం భారాన్ని వెనుకకు బదిలీ చేయవచ్చు. అమ్మకం పన విధించడం వలన ఉత్పత్తి తగ్గి ఉత్పత్తి కారకాలకు డిమాండ్ తగ్గుతుంది. అందువలన ఉత్పత్తి కారకాల ఆదాయ తగ్గుతుంది. ఉత్పత్తి కారకాల సొంతదారులు వినియోగదారులే కాబట్టి వారు తగ్గిన ఆదాయం వద్ద కొనుగోలు చేయాలి అందువల్ల ఈ పన్ను భారం ఉత్పత్తి కారకాల సొంతదారులు వెనుకకు బదిలీ చేస్తారు.

**దిగుమతి, ఎగుమతి పన్నులు - పన్నుల భారం బదిలీ:**

దిగుమతి, ఎగుమతి పన్నుల భారం బదిలీ ప్రధానంగా ఆయా వస్తువుల డిమాండ్, సప్లై వ్యాకోచాలపై ఆధారప ఉంటుంది. దిగుమతి చేసుకొనే వస్తువుల డిమాండ్ పూర్తి అవ్యాకోచంగా ఉంటే ఎగుమతిదారుడు పన్నుభారాన్ని దిగుమతిదారునికి బదిలీ చేయవచ్చు. డిమాండ్ పూర్తి వ్యాకోచంగా ఉంటే భారాన్ని పూర్తిగా ఎగుమతిదారుడే భరించాలి వాస్తవానికి డిమాండ్, సప్లై వ్యాకోచాలు సాపేక్షికంగా ఉంటాయి కాబట్టి ఈ పన్నుభారాన్ని ఎగుమతిదారుడు, దిగుమతిదారుడ కలిసి భరిస్తారు.

## 5.11. సారాంశము:

పన్నులు విధించేటప్పుడు పన్నుభారం పడుతుంది. అయితే ఎవరు ఆ పన్నుభారం భరిస్తారు అనే విషయం గమనించాలి పన్నులను విధించినప్పుడు కలిగే ఫలితాలను విశ్లేషణ చేసేటప్పుడు పన్నుల వత్తిడి, పన్నుల బదిలీ, పన్నుల ప్రభావం, పన్నుల భారం అనే ముఖ్య అంశాలను పరిశీలించాలి. పన్నుల భారం-బదిలీ సూత్రాలలో సంప్రదాయ సిద్ధాంతాలు. ఆధునిక సిద్ధాంతాలు ముఖ్యమైనవి. సాంప్రదాయ సిద్ధాంతంలో కేంద్రీకరణ సిద్ధాంతంలో, కేంద్రికరణ సిద్ధాంతం, వ్యాప్తి సిద్ధాంతం ఉన్నాయి. ఆధునిక సిద్ధాంతాన్ని ఇ.ఆర్.ఎ.సెలిగ్‌మన్, ఎఫ్.వై ఎడ్జ్‌వర్త్‌లు విశ్లేషించారు. అయితే పన్నుభారం ఏ మేరకు బదిలీ అవుతుంది అనే విషయం డిమాండ్, సప్లైల వ్యాకోచాలపై ఆధారపడి ఉంటుంది. పన్నుల బదిలీ మార్కెట్ స్వభావంపైన కూడా ఆధారపడి ఉంటుంది. వ్యష్టి పన్ను, మరణ సుంకాలు, అమ్మకం పన్ను, దిగుమతి, ఎగుమతి పన్ను లాంటి కొన్ని పన్నుల భావం బదిలీ గురించి తెలుసుకున్నాము.

## 5.12. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1) పన్నుల భారం బదిలీకి సంబంధించి కొన్ని సిద్ధాంతాలు కలవు.
2) పన్నుల భారం బదిలీకి సంబంధించి కేంద్రీకరణ సిద్ధాంతము, వ్యాప్త సిద్ధాంతము, ఆధునిక సిద్ధాంతము కలదు.
3) ఆధునిక సిద్ధాంతము ప్రకారము పన్నుల భారము బదిలీ డిమాండ్ మరియు సప్లై వ్యాకోచాలపై ఆధారపడి ఉండును.
4) వ్యయ స్వభావం కూడా పన్నుల భారం బదిలీని నిర్ణయించును.
5) మార్కెట్‌ల స్వభావం కూడా పన్నుల భారం బదిలీని నిర్ణయించును.
6) పన్నుల బదిలీ పన్నుల రకాలపై కూడా ఆధారపడును.
7) వివిధ పన్నుల విషయంలో పన్నుల భారం బదిలీ వేరువేరుగా ఉండును.

## 5.13. కఠిన పదాలు:

1) పన్నుల ఒత్తిడి: పన్ను విధించినప్పుడు మొదటిసారిగా ఆ పన్నును ఏవరైతే చెల్లించడం జరుగుతుందో ఆ వ్యక్తిపై పన్నుల ఒత్తిడి ఉండును.
2) పన్నుల భారం: పన్ను యొక్క అంతిమ ప్రభావాన్ని పన్నుల భారం అందురు.
3) పన్నుల ప్రభావం: పన్నుల ప్రభావం పరోక్ష ద్రవ్య భారాన్ని మరియు తరువాత ఏర్పడిన ఇతర ఫలితాలను ఏ సూచిస్తుంది.
4) మరణ సుంకాలు: ఒక వ్యక్తి మరణానంతరం అతని ఆస్థిపై విధించబడిన పన్నునే మరణ సుంకాలు అంటారు.

## 5.14. నమూనా ప్రశ్నలు:

**వ్యాసరూప ప్రశ్నలు:**

1) పన్నుల భారం - బదిలీ సిద్ధాంతాల గురించి వ్రాయుము?
2) వ్యష్టి ఆదాయం, మరణ సుంకాలు వంటి కొన్ని పన్నుల భారం బదిలీ గురించి వ్రాయుము?

**సంక్షిప్త సమాధాన ప్రశ్నలు:**

1) పన్నుల బదిలీ
2) పన్నుల భారం
3) పన్నుల ప్రభావం
4) పరిపూర్ణమైన పోటీ పన్నుల భారం-బదిలీ
5) ఏకస్వామ్యం-పన్నుభారం బదిలీ.

## 5.15. చదువదగిన గ్రంథాలు:


1) B.P.Tyagi - Public Finance
2) H.K.Bhatia - Public Finance
3) Andley & Sundaram - Public Economics & Public Finance
4) ప్రభుత్వ అర్థశాస్త్రం - తెలుగు అకాడమీ.


- డా॥ ఎ. రాజశేఖర్

# పన్నుల ప్రభావము

## 6.0. లక్ష్యం :

ఈ పాఠం అధ్యయనం చేశాక మీరు క్రింది విషయాలు అవగాహన చేసుకోగల్గుతారు.

- పన్నుల విధింపు వల్ల మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో వచ్చే మార్పులు.
- ఉత్తమ పన్ను విధానం
- పని, పొదుపు పెట్టుబడుల సామర్థ్యంపై పన్ను ప్రభావం
- పన్నుల ద్వారా ఆర్థిక వనరుల మళ్ళింపు
- ప్రజలపై పన్ను భారం - సమానత్వం
- అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో పన్నుల ప్రభావం
- పన్నుల ప్రభావం - వర్గీకరణ
- పన్ను చెల్లింపు సామర్థ్య నిర్ణాయకాలు
- పన్ను విధింపు పై పరిమితులు
- భారతదేశంలో పన్ను చెల్లింపు సామర్థ్యం

## విషయసూచిక


6.1. విషయ పరిచయము (Introduction)

6.2. వనరుల పంపిణీ - ఉత్పత్తి

6.3. మార్కెట్ వ్యవస్థ - లోపాలు

6.4. ఉత్తమ పన్నుల విధానం

6.5. ఆర్థిక వ్యవస్థపై పన్ను ప్రభావం

6.6. ఉత్పత్తి పై పన్ను ప్రభావం

పని పొదుపు, పెట్టుబడుల సామర్థ్యంపై ప్రభావం

పని, పొదుపు, పెట్టుబడి, కోరికలపై పన్ను ప్రభావం

పెట్టుబడిపై పన్నులు - విచక్షణ

ఆర్థిక వనరుల మళ్ళింపు

పంపిణీపై పన్నుల ప్రభావం

సమానత్వం

ఆర్థిక సుస్థిరత

6.7. ప్రభుత్వ విధానం

6.8. పన్నులు ఇతర ప్రభావాలు

6.9. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు - పన్నుల భారం

6.10. పన్నుల బదిలీ

6.11. పన్నుల ప్రభావం వర్గీకరణ

ఆదాయ ప్రభావం

తరలింపు ప్రభావం

ధర ప్రభావం
పంపిణీ ప్రభావం
6.12. పన్నులు - ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణ
6.13. పన్ను చెల్లింపు సామర్థ్యం
నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం
సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం
6.14. పన్ను చెల్లింపు సామర్థ్యం నిర్ణాయకాలు
జాతీయాదాయం
ఆదాయ పంపిణీ
పన్నుల విధానం
ప్రభుత్వ వ్యయ స్వభావం
జనాభా
ప్రజల మానసిక స్థితి
స్థిరత్వం
స్వచ్ఛమైన పరిపాలన
6.15. పన్ను విధింపుపై పరిమితులు
6.16. భారతదేశంలో పన్ను చెల్లింపు సామర్థ్యం
6.17. సారాంశం
6.18. గుర్తుంచుకోవలసిన విషయాలు
6.19. కఠిన పదాలు
6.20. నమూనా ప్రశ్నలు
6.21. చదువదగిన గ్రంథాలు.

## 6.1. పరిచయం:

పన్ను విధింపు వల్ల ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు వస్తాయని మనకు తెలుసు. పన్నులు లేకుండా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, వినియోగం, పెట్టుబడి, ఉద్యోగిత తదితర అంశాలు చోటుచేసుకుంటాయని కొంతమంది భావిస్తారు. పన్నుల విధింపు వల్ల పై అంశాలలో మంచి గాని, చెడుగాని జరుగుతుంటాయి. ఇటువంటి మార్పులు సామూహికంగా కలిపి మాట్లాడితే అవి పన్నుల ప్రభావాలు అనవచ్చు.

## 6.2. వనరుల పంపిణీ - ఉత్పత్తి:

వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతం అమలులో ఉన్న కాలంలో పన్నులు, విధానం తటస్థ వైఖరి కలిగి ఉండాలని భావించారు. రాజ్యం కొన్ని విధులను నిర్వహించడానికి అవసరమయ్యే నిధులు లేదా రాబడి సేకరించడానికి మార్కెట్ శక్తుల చేత ఏర్పాటైన ఆర్థిక కొలమానాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాబడి రావాలని ఆశించారు. ప్రభుత్వం యొక్క కోశ విధానం ఆర్థిక వ్యవస్థలో వనరుల కేటాయింపుకు ఎటువంటి ఆటంకం రాకుండా ఉండాలని సూచించారు. అంటే వివిధ రంగాల మధ్య సమతౌల్యం ఉండాలని ఇబ్బందులు ఉంటే కనీస స్థాయిలో మాత్రమే ఉండాలని భావించారు. మరో మాటలో చెప్పాలంటే మార్కెట్‌లో వనరుల పంపిణీ మరియు ఉత్పత్తి వివిధ వస్తువులు సేవల మధ్య సాంఘిక ఉపాంత రేట్ల ప్రత్యామ్నాయాలకు అనుగుణంగా ఉండాలి.

పై సిద్ధాంతం రెండు ప్రాథమిక ప్రమేయాలపై ఆధారపడి ఉంది.

1. మార్కెట్ తానే ఆర్థిక సూచికలను అభిలషణీయమైన పద్ధతిలో తయారుచేసుకునే సమర్థత కలిగి ఉంటుంది.

2. రాజ్యం వసూలు చేసే రాబడి ఆర్థిక వ్యవస్థ ముందుకు నడవడానికి ఎటువంటి ఆటంకం కలిగించదు.

## 6.3. మార్కెట్ వ్యవస్థ - లోపాలు:

కాని పై రెండు ప్రమేయాలు వాస్తవిక దూరమైనవి. తరువాత కాలంలో మార్కెట్ శక్తులు ఆర్థిక వ్యవస్థలో కావలసిన ఆశించిన ఫలితాలను సాధించజాలవని గుర్తించారు. మార్కెట్ యంత్రాంగం స్వేచ్ఛగా పనిచేయడం వల్ల వ్యాపార చక్రాలు ఆదాయ సంపదల మధ్య వ్యత్యాసాలు, వృద్ధిలో అసమానత్వం వంటివి జరిగాయి. మార్కెట్ వ్యవస్థ మంచి ఫలితాలు సాధిస్తుంది అనడానికి పరిపూర్ణ పోటీ ఒక లక్షణము. అంతేగాక అనేక అసంపూర్ణతలు ఈ వ్యవస్థలో చోటు చేసుకున్నాయి. వాటికి కారణం వినియోగదారుని హేతుబద్ధం కాని ప్రవర్తన, ఏకస్వామ్య పోటీ తత్వం, సాంకేతిక జడత్వాలు, మార్కెట్ సమాచారం లేకపోవడం మొదలగునవి. ఇక్కడ పబ్లిక్ గూడ్స్ విషయానికొస్తే వాటి ఉత్పత్తి, పంపిణీలతో తృప్తి చెందడం లేదు. అదే విధంగా మరో కఠినమైన లక్షణం ఏమనగా అన్ని వస్తువులకు మినహాయింపు సూత్రం వర్తింప చేయడం.

## 6.4. ఉత్తమ పన్నుల విధానం:

రెండో అంశం ఏమంటే ఈ రోజుల్లో ఆధునిక రాజ్యాలకు జాతీయాదాయంలో కనీస దామాషాలో రాబడి రావాలి. ఈ రాబడి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపడంలో తటస్థంగా ఉండాలని లేదు. అంతేకాక ఆర్థిక వ్యవస్థలో మార్కెట్ యంత్రాంగం సృష్టించిన లోపాలను సరిచేసే విధంగా పన్నుల విధానం ఉండాలి. అందువల్ల పన్నుల వ్యవస్థ ఆర్థిక వ్యవస్థలో చివరిదాకా వెలుతూ లోపాలను సరిచేసే ముఖ్యసాధనంగా ఉంటుంది. అలాంటి లోపాల సవరణా మార్గాలు వినియోగం, పెట్టుబడి, తదితర రంగాలలో మార్కెట్ నిర్ణయాలను పనిగట్టుకొని వక్రమార్గం పట్టించేవిగా ఉంటాయి. అందుచేత పన్నుల విధానం తటస్థంగా ఉండాలని అనడం కంటే ఆర్థిక వ్యవస్థ నుంచి సాధ్యమైనంత గరిష్ట స్థాయి సామాజిక ప్రయోజనాలను పొందడానికి పన్నుల వ్యవస్థను ఎలా ఉపయోగించాలన్నది ప్రధాన అంశం. ఇదే అభిప్రాయాన్ని మొత్తం ఆర్థిక వ్యవస్థ కంతటికి పబ్లిక్ వస్తువులు, ప్రైవేట్ వస్తువుల మధ్య విభజన ప్రాతిపదికన సాధారణీకరించవచ్చును. ఆధునిక ప్రభుత్వాల కార్యకలాపాలు విస్తృతమైనవి. ఇందుకు తగిన ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి ప్రభుత్వం అనేక పన్నులు విధిస్తున్నది. అయితే అన్ని సందర్భాలలో కేవలం ఆదాయం కోసమే పన్నులు విధించదు. కొన్ని సందర్భాలలో వస్తు వినియోగాన్ని తగ్గించే ఉద్దేశ్యంతో పన్ను విధించవచ్చు. దీనిని సంచురీ పన్నుల విధానం అంటారు.

డాల్టన్ అభిప్రాయంలో ఆర్థిక దృష్టి కోణం నుంచి చూసినప్పుడు అత్యుత్తమమైన లేక అతినష్టదాయకమైన ఆర్థిక ప్రభావాన్ని కలిగించనిదే ఉత్తమమైన పన్నుల వ్యవస్థ. పన్నుల వల్ల వినియోగదారుని, ఉత్పత్తిదారునికి గాని కలిగే అదనపు నష్టాన్ని జడభార నష్టం అంటారు. మంచి పన్నుల వ్యవస్థలో జడ భార నష్టం ఉండరాదు. పన్నుల జడభార నష్టం ఎక్కువగా ఉంటే వనరుల కేటాయింపు ఆర్థికాభివృద్ధికి ఉపకరించే రీతిలో ఉండదు.

## 6.5. ఆర్థిక వ్యవస్థపై పన్ను ప్రభావం:

పన్నులు ఆర్థిక వ్యవస్థపై (ఎ) కొనుగోలు శక్తి ప్రభావం (బి) ప్రకటన ప్రభావం అనే రెండు రకాల ప్రభావాలను కలిగిస్తాయి అని పిగూ అభిప్రాయం. వినియోగానికి, పొదుపుకు కేటాయించిన ఆదాయంకు పన్ను తగ్గిస్తుంది. పన్ను ...సం ఫలితంగా ఆర్థిక వ్యవస్థలో వినియోగం, పొదుపు నిష్పత్తులు మారిపోతాయి. పెట్టుబడి లాభసాటి కాదనే భావన ...ట్టుబడిదారులలో కలుగుతుంది. ఆదాయం పన్ను కారణంగా వ్యక్తి కొనుగోలు శక్తికి సంబంధించిన ఆదాయం

తగ్గుతుంది. ఆదాయంపన్ను వల్ల తమకు సంభవించే లోటును భర్తీ చేయడానికి - కంపెనీలు వస్తువుల ధరలు పెంచి ఆదాయాన్ని వినియోగదారులపై బదిలీ చేయడానికి ప్రయత్నిస్తాయి. అప్పుడు అమ్మకం పన్ను విధించినప్పుడు కలిగిన ప్రభావమే కల్గుతుంది.

పన్నుకు ప్రకటన ప్రభావం కూడా ఉంది. అది వ్యక్తి ప్రవర్తనలో మార్పు తీసుకురావచ్చు. వివిధ ఆర్థిక ప్రక్రియలకు అవసరమైన ప్రోత్సాహం తగ్గవచ్చు. ఉదాహరణకు వ్యక్తిగత ఆదాయపు పన్ను ఫలితంగా పనిచేయాలనే కోరిక తగ్గవచ్చు. ఎక్సైజు సుంకం అమ్మకపు పన్ను వంటివి ఉత్పాదక రీతులను ప్రభావం చేస్తాయి.

## 6.6. ఉత్పత్తి పై పన్నుల ప్రభావం:

జాతీయాదాయం ఉద్యోగితా స్థాయిలపై పన్నుల ప్రభావాన్ని డాల్టన్ మూడురకాలుగా విశ్లేషించాడు. అవి (ఎ) పని పొదుపు పెట్టుబడుల సామర్థ్యంపై ప్రభావం. (బి) పని, పొదుపు, పెట్టుబడులకు సంబంధించిన కోర్కెలపై ప్రభావం (సి) ప్రాంతాలు పరిశ్రమల మధ్య వనరుల మళ్ళింపు పై ప్రభావం.

**(ఎ) పని, పొదుపు, పెట్టుబడుల సామర్థ్యంపై ప్రభావం:** ప్రజల పని సమర్థత వారు తీసుకొనే ఆహారం, ఆరోగ్యం, విద్య లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. ఏ పన్నులు ఈ విధమైన పని సామర్థ్యాన్ని పెంచుతాయో, తగ్గిస్తాయో తెలుసుకోవాలి. అనుపాత పన్నులు పేద ప్రజానీకంపై ఎక్కువ భారాన్ని వేస్తాయి. పరోక్ష పన్నులు పేదల వినియోగాన్ని తగ్గించి వారి పని సమర్థతను కుంటుపరుస్తాయి. ప్రజల పని సమర్థత కుంటుపడకుండా ఉండాలంటే సంపన్నులపై అధిక భారం మోపే పురోగామి పన్నుల విధానమే మేలు. వారు తమ పొదుపును పన్నులు చెల్లించి సామర్థ్యం దెబ్బతినకుండా జాగ్రత్తపడుతారు. దీని అర్థం పరోక్ష పన్నులను పూర్తిగా నిరాకరించాలని కాదు. అయితే సామాన్య ప్రజల వినియోగ వస్తువులపై కాక విలాస వస్తువులపై ఎక్కువ పన్నులు విధిస్తే ప్రజల పని సమర్థతకు భంగం కలగదు.

సాధారణంగా పొదుపు చేసే అవకాశం ధనవంతులకే ఉంటుంది. పేదలకు పొదుపు చేయాలనే కోరిక ఉన్నా దానికి తగిన ఆదాయం ఉండదు. ప్రత్యక్ష పన్నులు ధనవంతుల పొదుపు సమర్థతను దెబ్బతీస్తాయి. పరోక్ష పన్నులు సాధారణ ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీయడమే గాక ఆర్థిక అసమానతల్ని అధికం చేస్తాయి. ప్రజల పనిచేసే శక్తిని దెబ్బతీస్తాయి. ప్రభుత్వం తన లక్ష్యాన్ని స్పష్టంగా ఎంచుకోవాలి. పొదుపును ప్రోత్సహించదల్చుకుంటే ప్రత్యక్ష పన్నులపై తక్కువగా ఆధారపడాలి. అలాంటప్పుడు ఆదాయం కోసం పరోక్ష పన్నులపై ఎక్కువ ఆధారపడాల్సి ఉంటుంది. ఇది సాంఘిక న్యాయానికి విఘాతం కల్గిస్తుంది. అందుచేత ఈ అంశాలన్నింటిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన పన్నుల విధానాన్ని ప్రభుత్వం అనుసరించాలి.

**పెట్టుబడులు:** ప్రజల పెట్టుబడి సామర్థ్యం కేవలం పొదుపు సామర్థ్యంపై ఆధారపడి ఉండదు. పెట్టుబడికి అనువైన వాతావరణం ఉండి ఆశించిన లాభాలు వస్తూ ఉంటే బ్యాంకుల నుంచి రుణాలు సేకరించి కూడా పెట్టుబడులు పెట్టవచ్చును. అయితే బ్యాంకులిచ్చే రుణాలపై అనేక పరిమితులు ఉన్నాయి. తగినన్ని డిపాజిట్లు లేకుండా బ్యాంకులు పెద్ద మొత్తాలలో రుణాలు ఇవ్వలేవు. ఆర్థిక వ్యవస్థ స్థితిని మించి బ్యాంకులు సృష్టించే రుణం ద్రవ్యోల్బణానికి దారితీసి ఫలితంగా పేదల పని సమర్థత కుంటుపడుతుంది. పరిస్థితులు అనుకూలంగా లేకపోతే పెట్టుబడి పెట్టగల సమర్థత కార్యరూపం దాల్చదు. పన్నుల రేటు పన్ను చెల్లించే పద్ధతి మొదలైనవి కూడా పెట్టుబడి సమర్థతను ప్రభావితం చేస్తాయి. దేశ ఆర్థికాభివృద్ధికి పెట్టుబడులు ఎంతైనా అవసరం. అందుకోసం ప్రభుత్వం ప్రైవేటు పొదుపును ప్రోత్సహించి దానిని పెట్టుబడిగా ఉపయోగించాలి లేదా పురోగామి పన్నులను తక్కువ రేటులో విధించి ప్రైవేటు పెట్టుబడి సామర్థ్యాన్ని ప్రోత్సహించాలి.

**(బి) పని, పొదుపు, పెట్టుబడి కోరికలపై పన్నుల ప్రభావం:** పన్నుల విధానం ప్రజల పని, పొదుపు, పెట్టుబడులు పెట్టాలనే కోరికలను ప్రోత్సహించడానికి అవసరమైన ప్రోత్సాహకాలను అందించేదిగా ఉండాలి.

పని చెయ్యాలనే కోరిక వ్యక్తి కుండే మనస్తత్వం పైన పన్నుల రేటు పైన, పన్నుల స్వభావం పైన ఆధారపడి ఉంటుంది. ఎక్కువ ఆదాయం పొందడానికి వ్యక్తి ఎక్కువ పని చేయాలని కోరుకుంటాడు. పన్నులు చెల్లించే వారి వ్యయార్హ ఆదాయం తగ్గుతుంది. కాబట్టి ఎక్కువ రేటులో పురోగామి పన్నులు విధించడం వలన వ్యక్తులకు పనిచేయాలనే కోరిక సన్నగిల్లుతుంది. ఎందుకంటే ఎక్కువ పనిచేసి ఆదాయం పెంచుకున్నా ప్రత్యక్ష పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలనే భయం ఉంటుంది. కాబట్టి ప్రత్యక్ష పన్నులు పనిచేయాలనే కోరికను తగ్గిస్తుంది. అయితే ఆకస్మిక లాభాలపై విధించే పన్నులు పనిచేయాలనే కోరికను ఏమాత్రం ప్రభావితం చేయవు. కొన్నిసార్లు పన్ను చెల్లించటం వల్ల తగ్గిపోయిన ఆదాయాన్ని భర్తీ చేసుకోవడానికి ఎక్కువగా పనిచేయాలని కొందరు కోరుకుంటారు. పేదవారు ఉపయోగించే వస్తువులపై విధించిన పరోక్ష పన్నులు వారి ప్రస్తుత వినియోగాన్ని తగ్గిస్తాయి. తమ వినియోగ స్థాయి నిలుపుకోవడానికి వీరు ఎక్కువగా పనిచేయాలి. ఈ విధంగా చూస్తే పనిచేయాలనే కోరికను పన్నులు పెంచుతాయనిపిస్తుంది. అందువల్ల పన్నుల ప్రభావం అందరిపై ఒకే విధంగా ఉండదు.

పొదుపు చేయగల సమర్థత ఉన్నప్పటికీ పొదుపు చేయాలనే కోరిక లేకపోతే పొదుపు మొత్తం ఉండవలసిన దాని కన్నా తక్కువగా ఉంటుంది. అన్ని ప్రత్యక్ష పన్నులు పురోగామి పన్నులు వ్యక్తుల పొదుపు చేసే కోరికను నిరుత్సాహపరుస్తాయని తలచరాదు. ఉదాహరణకు ఆదాయపు పన్ను బదులుగా వ్యయంపై పురోగామి పద్ధతిలో పన్ను విధించనప్పటికీ పొదుపు ప్రోత్సహిస్తుంది. పొదుపు చేయాలనే కోరిక ప్రోత్సహించడానికి ఆదాయం పన్ను కంటే వ్యయంపై పన్ను విధించడం మంచిదని నికొలన్ అభిప్రాయపడ్డాడు. పొదుపు పెంచడానికి అవసరమైన ప్రోత్సాహాలను ప్రభుత్వం కల్పిస్తే ప్రజలకు పొదుపు చేయాలనే కోరిక పెరుగుతుంది. లేకపోతే పన్నుల వల్ల పొదుపు చేయాలనే కోరికతోపాటు పనిచేయాలనే కోరిక కూడా నశిస్తుంది. పొదుపు తగ్గిపోతే పెట్టుబడి తగ్గి మూలధనకల్పన క్షీణించి ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుంది. బ్యాంకులు చెల్లించే వడ్డీ రేట్లు ఆకర్షణీయంగా ఉంటే ప్రజలలో పొదుపు చేయాలనే కోరిక పెరుగుతుందని మనం గుర్తుంచుకోవాలి. ప్రభుత్వ బాండ్లు, సెక్యూరిటీల రూపంలో కూడా పొదుపు చేయడానికి ప్రజలు ఆశక్తి చూపుతారు. అంతేకాక పొదుపు మొత్తం ఆదాయంపైన, పెట్టుబడి నుంచి లభించే లాభం రేటు పైన కూడా ఆధారపడి ఉంటుందనే విషయాన్ని మనం మరచిపోరాదు.

**పెట్టుబడిపై పన్నుల విచక్షణ:** పెట్టుబడి పెట్టాలనే కోరికను పన్నులు ప్రత్యక్షంగా తగ్గించి వేస్తాయి. ఉత్పత్తి సాధనాలపై హెచ్చుపన్నులు విధించినట్లయితే వాటి ధరలు పెరిగి ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఈ పరిస్థితిలో వస్తువు ధరలలో మార్పు లేకపోతే పెట్టుబడిదారుల పెట్టుబడి పెట్టాలనే కోరికలు దెబ్బతింటాయి. వివిధ పెట్టుబడుల నుంచి వచ్చే ఆదాయాల్లను వేరువేరుగా పరిగణించాలి. ఆర్థిక సాంఘిక ప్రయోజనాల దృష్ట్యా అవాంఛనీయ పెట్టుబడుల నుంచి వచ్చే ఆదాయంపై అధిక పన్నును విధించాలి. అంతేగాక ఏదైనా ఒక పరిశ్రమను ప్రోత్సహించడానికి ఆ పరిశ్రమలలో పెట్టే పెట్టుబడులపైన, పెట్టుబడుల నుంచి లభించే ఆదాయంపైన ప్రభుత్వం తక్కువగా పన్నులు విధించాలి. పన్నుల స్థాయి ఏవిధంగా ఉన్నా వ్యాపార సంస్థకు వచ్చే లాభాలు తగ్గకుండా ఉంటే పెట్టుబడి [illegible]. పెట్టుబడి ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాల పైనే కాక [illegible] పెట్టుబడి వాతావరణాన్ని బట్టి, భవిష్యత్‌లో వచ్చే [illegible] అవకాశాలను బట్టి కూడా ఆధారపడి ఉంటుంది.

**ఆర్థిక వనరుల మళ్ళింపు:** ఒకానొక ప్రత్యేకమైన ఉద్యోగిపై పన్ను విధించినప్పుడు వనరులు పన్నులు లేని ఉద్యోగిత వైపు మళ్ళుతాయి. మూలధనం, శ్రమలు స్థిరంగా ఉంటే వాటి మధ్య వనరుల మళ్ళింపు సాధ్యం కాదు. కొత్తగా ప్రవేశపెట్టిన మూలధన, శ్రామిక వనరుల విషయంలో మళ్ళింపు సాధ్యమౌతుంది. ఒక శ్రామికుడు ఒక పరిశ్రమలో చాలా సంవత్సరాల నుంచి పనిచేస్తూ ఉంటే అతను వేరే పరిశ్రమకు వెళ్ళడానికి ఇష్టపడడు. కాని శ్రామికుడు ఆ పరిశ్రమలోకి కొత్తగా పనిచేయడానికి నియమించబడితే వేరేచోటికి వెళ్ళాల్సివస్తే వెంటనే అంగీకరిస్తాడు. ఒక ఉత్పత్తిదారుడు ఒక సంస్థలో స్థిరపడితే పన్నుల ప్రభావం వల్ల అతను ఆ సంస్థను వీడిపోడు. అదే ఒక కొత్త ఉత్పత్తిదారుడు పన్నుల భారం పడ్డ పరిశ్రమ నుంచి పన్నుల భారం పడని పరిశ్రమకు బదిలీ అవడానికి ఇష్టపడతాడు. వనరుల బదిలీ ఒక ఉద్యోగిత నుంచి మరో ఉద్యోగితకు బదిలీ చేయటం ప్రధానంగా మూడు అంశాలలో సమర్థనీయం.

(1) సారాయి వినియోగాన్ని నిరుత్సాహపరచటానికి పన్ను విధించినపుడు

(2) ఏకస్వామ్యాల ఉత్పత్తిస్థాయిని తగ్గించటానికి మరియు

(3) స్వదేశీ ఉత్పత్తులను కాపాడటానికి విదేశీ వస్తువుల మీద పన్ను విధించిన వ్యాపార లాభాలపై, గృహాలపై పన్నులు అధికమయ్యే సందర్భంలో పైన పేర్కొన్న వనరుల బదలాయింపులు సమర్ధనీయం కాదు. కాబట్టి వనరుల బదిలీ కొన్ని ఉద్యోగితా స్థాయిలలో అనుకూలంగానూ, మరికొన్నింటిలో హానికరంగాను ఉంటాయి. పన్ను విధింపు వల్ల వనరుల బదిలీ ప్రాంతాల మధ్య కూడా చోటు చేసుకుంటుంది. వనరులు సామాన్యంగా పన్నులు ఎక్కువ వేసిన ప్రాంతం నుంచి తక్కువ వేసిన ప్రాంతాలకు బదిలీ అవుతాయి.

**పంపిణీపై పన్నుల ప్రభావం:** జర్మనీ దేశపు ఆర్థిక వేత్త వాగ్నార్ ప్రకారం పన్నుల యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటైన ఆదాయ సంపదల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించటం. దీని అర్థం అందరికీ సమానంగా సంపద పంచాలని కాదు. అవసరాలకు అనుగుణంగా మరియు సామర్థ్యానికి అనుగుణంగా ఈ పంపిణీ జరగాలి. పంపిణీపై పన్నుల ప్రభావం క్రింది విధంగా ఉంటుంది.

**(ఎ) ఆదాయ, సంపదల మధ్య వ్యత్యాసాలు:** సంక్షేమ రాజ్యంలో ఆదాయ సంపదల మధ్య వ్యత్యాసాలు ఉండరాదు. ప్రత్యక్ష పన్నులు ఈ అసమానతలను తగ్గించటానికి సరైన ఆయుధంగా పేర్కొనవచ్చు. పురోగామి పన్నుల విధానం ఆదాయ, సంపదల మధ్య వ్యత్యాసాన్ని తగ్గిస్తుంది. ఈ పన్నులు వ్యాకోచత్వాన్ని కలిగి ఉంటాయి. మరొకవైపు తిరోగామి పన్నుల విధానం అసమానతలను పెంచుతుంది. పన్నుల్లో పురోగామి తత్వం ఎక్కువగా ఉంటే పన్నుల ప్రభావం ధనికుల పై ఎక్కువగా ఉండి పొదుపు పెట్టుబడులు, తగ్గి ఉత్పత్తి కుంటుపడే అవకాశం ఉంది. అదేవిధంగా పరోక్ష పన్నులు కూడా ప్రజల పని, పొదుపు చేయాలనే కోరికలను నిరుత్సాహపరిచి ఆర్థిక వ్యత్యాసాలు పెరగటానికి తోడ్పడతాయి. అనుపాత పన్నులు ఆదాయ పంపిణీని యధాతథంగా ఉంచటానికి తోడ్పడతయ్యే కాని పంపిణీని మెరుగుపరచలేవు.

**సమానత్వం:** పన్నులు సమానత్వ సూత్రాన్ని లేక న్యాయాన్ని పాటించాలి. ఈ సూత్రం ఏం చెపుతుందంటే ప్రజలందరిపై తక్కువగానీ, ఎక్కువగానీ పన్నుభారం సమానంగా ఉండేటట్లు చూడాలి. పన్ను చెల్లించేటపుడు వారు చేసే త్యాగాలు సమానంగా ఉండాలి. ఈ విషయంలో పురోగామి పన్ను విధానం చక్కగా సరిపోతుంది.

ఆదాయ పునః పంపిణీని స్వల్పకాలిక దృష్టితోను దీర్ఘ కాల దృష్టితోనూ కూడా పరిశీలించాలి. ఆదాయ పునః పంపిణీ సాధనగా పన్నులను విధించినట్లయితే స్వల్పకాలంలో ఉత్పత్తి దెబ్బతినకపోవచ్చు. అయితే దీర్ఘకాలంలో ప్రజల ఆదాయం పొదుపులలో మార్పు రావచ్చు. అందువల్ల ఈ లక్ష్యాన్ని పన్నుల ద్వారా స్వల్పకాలంలో సాధించలేము. కేవలం పన్నుల ద్వారా పంపిణీ లక్ష్య సాధన ఎంతో కాలం పట్టచ్చు. మరో రకంగా చెప్పాలంటే స్వల్పకాలంలో ఆదాయ పంపిణీపై పన్నుల ప్రభావం తక్కువ ప్రాముఖ్యత కలిగి ఉంటుంది. ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ఏర్పడే మిగుళ్ళను గుర్తించి, ఆ మిగుళ్ళపై పన్నులు విధించాలి. లేకపోతే ఆర్థిక అసమానతలు పెరిగిపోతాయి. పురోగామి పన్నులు చాలా వరకు ఈ లక్ష్యసాధనకు ఉద్దేశించినవే. అయితే ఆదాయ పునఃపంపిణీకి పన్నుల విధానం కంటే ప్రభుత్వ వ్యయ విధానం బాగా తోడ్పడుతుందనే అభిప్రాయాన్ని కొంతమంది వెలిబుచ్చారు. కాని సరియైన ఆదాయ పంపిణీకి పన్నులు, వ్యయవిధానాలు రెండింటిని సమన్వయపరచాలి.

**ఆర్థిక సుస్థిరత :** ఆర్థిక సుస్థిరత సాధనకు కూడా పన్నులు తోడ్పడతాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసి ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేయడానికి పన్నులు తోడ్పడతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వివిధ ఆర్థిక పథకాలపై ప్రభుత్వం చేసే వ్యయం ద్రవ్యోల్బణానికి కారణమవుతుంది. ద్రవ్యోల్బణం ఉత్పత్తిదారులకు లాభం కల్గించగా, అల్పాదాయ వర్గాల ప్రజలను దెబ్బతీస్తుంది. ఈవిధంగా అసమానతలు ఏర్పడటానికి ద్రవ్యోల్బణం కారణమౌతున్నది. అందువల్ల ద్రవ్యోల్బణ పోకడను అరికట్టి ఆర్థిక సుస్థిరతను చేకూర్చడానికి పన్నులు తోడ్పడతాయి.

## 6.7. ప్రభుత్వ విధానం:

మంచి పన్నుల విధానంతో పాటు మంచి వ్యయ విధానం కూడా ఉండాలి. మంచి వ్యయ విధానం ధనికులతో పాటు పేదవారు కూడా ప్రయోజనం పొందేటట్లు ఉండాలి. అప్పుడే సంపద సరైన పద్ధతిలో పన్నుల ద్వారా పంపిణీ అవుతుంది.

## 6.8. పన్నులు - ఇతర ప్రభావాలు:

పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే వాటి వసూళ్ళకు అయ్యే వ్యయం అధికంగా ఉంటే పన్ను వసూళ్ళ లక్ష్యం దెబ్బతింటుంది. అంతేకాక పన్ను చెల్లింపుదారులకు కూడా పన్ను చెల్లించటానికి అయ్యే ఖర్చు తక్కువగా ఉండాలి. పన్నులు శ్రామికుల డిమాండ్‌ను స్థిరపరచి నిరుద్యోగితను తగ్గించాలి. అయితే ఇది పన్నుల విధానంపైనే కాక ప్రభుత్వ వ్యయ విధానంపై కూడా ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం ఆకస్మికంగా పన్నుల పద్ధతిలో మార్పులు తీసికొస్తే నిరుద్యోగం ప్రబలే అవకాశం ఉంది. పన్నులు మూలధన సంచయనాన్ని, పెట్టుబడులను తగ్గించి ఉత్పత్తి స్థాయిని తగ్గించినట్లయితే జాతీయ సంక్షేమంపై పన్నులు హానికరమైన ప్రభావాన్ని కల్గిస్తాయి.

ఈ విధంగా పన్నులు జాతీయోత్పత్తి ఉద్యోగితలపై అనుకూల, ప్రతికూల ప్రభావాలను కలిగి ఉంటాయి. మంచి పన్నుల విధానం ప్రతికూల ప్రభావాలను తగ్గించి ఉత్పత్తిని పెంచేదిగానూ, ప్రభుత్వానికి గరిష్ట ఆదాయాన్ని సమకూర్చాలి. అంతేకాక పన్నులు చెల్లించేవారికి కనిష్ట భారం ఉండేటట్లు చూడాలి.

## 6.9. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు - పన్నుల ప్రభావం :

వెనుకబడిన దేశాల్లో అభివృద్ధి సాధన కోసం పరోక్ష పన్నులు మూడు లక్ష్యాల సాధనకు తోడ్పడాలి. ఈ పన్నుల ప్రభావాలను రాజా. జె.చెల్లయ్య విశ్లేషణ చేసాడు. అవి (1) ప్రభుత్వ పెట్టుబడికి అవసరమైన వనరులను సమీకరించడం (2) విలాస వస్తువుల వినియోగాన్ని తగ్గించి ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి రేటును అధికం చేయటం, (3) ఉపాంత పొదుపు రేటును పెంచటం. ఈ లక్ష్యాలను సాధించటం కోసం వనరులను, పన్నులను అభిలషణీయమైన మార్గాలకు తరలించాలి. దీనిని సాధించాలంటే

(1) ప్రైవేటు రంగం నుంచి వనరులను ప్రభుత్వ రంగానికి మళ్ళించటం.

(2) వనరులను ప్రైవేటు రంగంలోని వినియోగ వస్తు పరిశ్రమ నుంచి ఉత్పాదక వస్తు పరిశ్రమలను మళ్ళించడం.

(3) దిగుమతి చేసుకొనే వస్తువుల డిమాండును దేశీయ ఉత్పత్తులకు మళ్ళించటం చేయాలి.

## 6.10. పన్నుల బదిలీ:

పన్నులు విధించడం వల్ల వనరులు ప్రైవేటు రంగం నుంచి ప్రభుత్వ రంగానికి బదిలీ అవుతాయి. వనరులు ఒక పరిశ్రమ నుంచి మరొక పరిశ్రమకు తరలించడానికి విచక్షణాత్మక పన్నుల విధానం బాగా తోడ్పడుతుంది. మరొక రకం తరలింపులో విదేశీ పోటీ నుంచి స్వదేశీ పరిశ్రమలను రక్షించి ప్రోత్సహించడానికి అవసరమైన చర్యలు తీసుకొంటారు. ఉదా : దిగుమతి సుంకాలు, దిగుమతి అయ్యే విలాస వస్తువుల వినియోగాన్ని తగ్గించడానికి ఈ సుంకాలు తోడ్పడతాయి. చెల్లింపుల శేషంలో సమస్యలు ఎదుర్కొనే సమయంలో ఈ సుంకాలు దిగుమతులను తగ్గించి ద్రవ్యోల్బణ ధోరణులను అరికడతాయి. దిగుమతి సుంకాల ప్రభావం ఒక దేశం అనుసరిస్తున్న పన్ను విధానానికు మిగిలిన దేశాలు ఏవిధంగా స్పందిస్తున్నాయనే దానిపై ఆధారపడి ఉంటుంది.

వనరుల బదిలీలో రెండు పద్ధతులు ఉన్నాయి. వ్యక్తుల నుంచి కొనుగోలు శక్తిని ప్రభుత్వానికి బదిలీ చేయడం మొదటి పద్ధతి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ఇది కొంతమేరకు తోడ్పడుతుంది. వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన వస్తుసేవలను ప్రభుత్వం కొనుగోలు చేయడం రెండవ పద్ధతి. ఈవిధంగా ప్రైవేటు రంగం నుంచి సమీకరించిన వనరులు ప్రభుత్వ వ్యాగు యంత్రాంగం ద్వారా తిరిగి ఉపయోగిస్తారు. అపుడు కొనుగోలు శక్తి ప్రభుత్వం నుంచి మళ్ళీ వ్యక్తులకు బదిలీ అవుతుంది. ఈ బదిలీ ద్రవ్యోల్బణం ఒత్తిడులకు దారితీయవచ్చు. అయితే పన్నుల ద్వారా వచ్చిన ఆధాయాన్ని ఉత్పత్తి కార్యకలాపాలకు ఉపయోగించినట్లు అయితే ఉత్పత్తి పెరుగుతుంది. అటువంటి అపుడు ఉత్పత్తిపై పన్నుల ప్రభావం ధనాత్మకంగా ఉంటుంది. వివరంగా చెప్పాలంటే పన్నుల తుది ఫలితాలు పన్నుల స్వభావంపైనే గాక పన్నుల ద్వారా వచ్చిన రాబడి ఏవిధంగా ఖర్చు చేయడం అనే దానిపై ఆధారపడి ఉంటుంది. దీనిని వివరించడానికి పన్నుల ప్రభావాన్ని నాలుగు విధాలుగా వర్గీకరించవచ్చును.

## 6.11. పన్నుల ప్రభావం - వర్గీకరణ :

1. ఆదాయ ప్రభావం
2. తరలింపు ప్రభావం
3. ధర ప్రభావం
4. పంపిణీ ప్రభావం

### 1. ఆదాయ ప్రభావం:

అమ్మకపు పన్ను, ఎక్సైజు సుంకం లాంటి పరోక్ష పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని మనకు తెలుసు. కాని ఒక్కొక్కసారి వస్తువుపై పన్ను విధించినప్పటికీ ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం రాదు. అయితే ఇక్కడ ముఖ్య లక్ష్యం విదేశీ పోటీ నుండి స్వదేశీ పరిశ్రమలకు రక్షణ కల్పించటమే అయి వుంటుంది. వస్తువుకు ధర డిమాండ్ వ్యాకోచత్వం ఎక్కువగా ఉంటే దానిపై పన్ను విధిస్తే ఆ వస్తువు నుంచి వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉంటుంది. పన్ను విధించేటపుడు ధర డిమాండ్ వ్యాకోచత్వంతో పాటు ఆదాయ డిమాండ్ వ్యాకోచత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక వస్తువు ధర డిమాండ్ వ్యాకోచత్వం వివిధ ఆదాయ వర్గాలకు వేరు వేరుగా ఉంటుంది. అందువల్ల ఆదాయం డిమాండ్ వ్యాకోచత్వం ఎక్కువగా ఉన్న వస్తువులపై పన్నులు విధించటం మంచిది. ఆదాయపన్ను లాంటి ప్రత్యక్ష పన్నుల విషయంలో ఆదాయ ప్రభావం పన్ను రేట్లపైనా, తారతమ్యతపైనా ఆధారపడి ఉంటుంది. మినహాయింపులు అధికంగా ఉంటే ప్రత్యక్ష పన్ను భారం సంపన్నులపైనే ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి పన్నులవల్ల పని, పొదుపు, పెట్టుబడి సామర్థ్యం దెబ్బతింటాయి. ఒక్కొక్కప్పుడు ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ప్రత్యక్ష పన్నులపై గల అధిక ఉపాంత పన్ను రేట్ల వల్ల దెబ్బతింటాయి. సరైన రేట్ల తారతమ్యతను ఎంచుకుంటే ఆదాయ ప్రభావం గుర్తించదగినదిగా ఉంటుంది.

### 2. తరలింపు ప్రభావం :

వనరులను ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలించవచ్చు. అయితే ఎంతవరకు తరలించవచ్చుననే విషయం డిమాండ్, సప్లయిల సాపేక్ష వ్యాకోచత్వంపై ఆధారపడి ఉంటుంది. డిమాండ్, సప్లయిలు ఎక్కువ అవ్యాకోచత్వం కలిగి ఉంటే పన్ను విధింపు ద్వారా వనరుల తరలింపుకు తక్కువ అవకాశం ఉంటుంది. వనరుల తరలింపు ఉద్యోగితపై కూడా ప్రభావం కలిగి ఉంటుంది. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం పన్ను విధించిన వస్తువులకు అదనపు డిమాండ్‌ను కల్పించడానికి ఉపయోగించే కార్యక్రమాలపై ఖర్చు చేసినట్లయితే నికరమైన వనరుల తరలింపు ఉండదు. అంటే పన్నుల ప్రభావాలను పరిశీలించేటపుడు ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

సప్లయి, డిమాండ్ వ్యాకోచత్వాల ద్వారా వనరుల బదిలీ గురించి అర్థం చేసుకోవచ్చు. డిమాండ్, సప్లయిలు రెండూ అవ్యాకోచంగా ఉన్న వస్తువులపై పన్నును విధించినట్లు అయితే వనరుల బదిలీపై ప్రభావం తక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని సాధించదలచుకున్న లక్ష్యం ఆధారంగా పన్నులు విధించడానికి వస్తువులను ఎంపిక చేసుకోవాలి.

3. ధర ప్రభావం : పన్ను విధించినందువల్ల వస్తువు ధర పెరుగుతుంది. ధర పెరుగుదల వస్తువు డిమాండ్, సప్లయిల స్థితిని ప్రభావితం చేస్తుంది. వస్తూత్పత్తిలోని తగ్గుదల వస్తువు ధరను పెంచడంలోనూ ఉత్పత్తి సాధనాల ఆదాయాలను మార్చటంలో ఎంతవరకు ప్రభావం కలిగి ఉంటుందనేది డిమాండ్, సప్లయిల వ్యాకోచత్వాలను బట్టి ఉంటుంది.

ప్రజలవద్ద అధికంగా ఉన్న కొనుగోలుశక్తిని తగ్గించటమే ప్రభుత్వ ఆశయమైతే సాంఘిక, ఆర్థిక అంశాల దృష్ట్యా ధర ప్రభావం అభిలషణీయమైందే. అయితే కొన్ని సందర్భాలలో ధర ప్రభావం వనరుల కేటాయింపును తారుమారు చేయవచ్చు. అంతేగాక ద్రవ్యోల్బణం చేసే ప్రభావాలు ప్రజలపై ఉండొచ్చు. కాబట్టి దారిద్ర్య రేఖకు దిగువన ఎక్కువ మంది ప్రజలు జీవించే వెనుకబడిన దేశాలలో ధర ప్రభావాన్ని నిశితంగా పరిశీలించాలి. వస్తువుల రకాలు మార్కెట్‌లో పోటీ స్థాయి, పన్ను రాబడి, ప్రభుత్వ వ్యయ విధానం మొదలగునవన్నీ పన్ను ధర ప్రభావాన్ని విశ్లేషించడానికి ఉపయోగపడతాయి.

4. పంపిణీ ప్రభావం : వస్తువుపై పన్ను విధించినపుడు, దాని ధర పెరుగుతుంది. ఆదాయ డిమాండ్ ఎక్కువగా ఉన్న వస్తువులపై పన్ను విధించినట్లు అయితే ఆర్థిక వ్యత్యాసాలను తగ్గించడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందనే వాదన ఉన్నది. ప్రత్యక్ష పరోక్ష పన్నులు రెండూ కూడా ఈ లక్ష్య సాధనకు ఉపయోగపడతాయి.

అయితే పన్నుల భారాన్ని సంపన్న వర్గానికి చెందిన వారెక్కువగా భరిస్తారన్నమాట. పన్ను వాస్తవ భారాన్ని ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను గాని ఇక్కడ పరిగణనలోకి తీసుకోలేదు. అందువల్ల పన్నుల ద్వారా ఆదాయాన్ని పునఃపంపిణీ చేయాలనుకున్నపుడు పన్ను ద్రవ్య భారాన్ని, నిజభారాన్ని ఎవరు భరించాలనే విషయాన్ని పరిశీలించాలి. ప్రభుత్వ వ్యయం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాన్ని పరిశీలించాలి. కేవలం ధనవంతులపైనే పన్ను విధించినంత మాత్రాన ఆర్థిక అసమానతలు తగ్గవు. ఆదాయ, సంపదల పంపిణీలో మార్పులు తీసుకురావడానికి పన్నుల విధింపుతో పాటు కొన్ని పరిపాలనా సంబంధమైన చర్యలు కూడా తీసుకోవాలి. ఏమైనప్పటికీ, పన్ను విధింపు చర్యలను జాగ్రత్తగా ఎంపిక చేసుకొని ఉపయోగించినట్లయితే కొంతవరకు ఆర్థిక వ్యత్యాసాలను తొలగించవచ్చు.

## 6.12. పన్నులు - ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణ:

ఈ విధంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పన్నులు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంతోపాటు ఆర్థిక కార్యకలాపాలను క్రమబద్ధం చేసే సాధనంగా కూడా ఉపయోగపడాలి. పన్నులు విలాస వస్తువుల వినియోగాన్ని తగ్గించి వనరులను ఉత్పాదక వస్తువుల ఉత్పత్తికి మళ్ళించడానికి, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి, ఆర్థిక అసమానతలు తగ్గించడం మొదలైన ఆశయాల సాధనకు తోడ్పడాలి. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధింపును జాగ్రత్తగా నిర్ణయించుకోవాలి. నిజానికి పన్నుల ప్రభావాలను విడిగా విశ్లేషించడం సాధ్యం కాదు. ఆత్మాశ్రయమైన ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలను అంచనా వేయడం సాధ్యకానప్పటికీ పన్నుల ప్రభావాలను ప్రభుత్వ వ్యయ ప్రయోజనాలతో సమన్వయపరచి మాత్రమే విశ్లేషించాలి.

## 6.13. పన్ను చెల్లింపు సామర్థ్యం:

పన్నుల విధానంలో పన్ను చెల్లింపు సామర్థ్యం అనే భావనే అత్యంత ప్రధానమైనది. ప్రభుత్వం పన్ను విధించేటప్పుడు దానిని చెల్లించగల సామర్థ్యం ప్రజలకున్నదీ లేనిదీ తెలుసుకోవాలి. సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు తమ ఉత్పాదకత సామర్థ్యం దెబ్బతినకుండా ఏమేరకు పన్ను చెల్లించగలరో దానినే పన్ను చెల్లించు సామర్థ్యం అంటారు. ఇది సాపేక్షికమైనది.

ఈ సామర్థ్యాన్ని అంచనా వేయడం కష్టమైనది. డాల్టన్ షిరాస్ తదితర ఆర్థిక వేత్తలు పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని రెండు రకాలుగా వర్గీకరించారు. అవి (ఎ) నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం (బి) సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం.

**(ఎ) నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం :** ఈ భావనను 20వ శతాబ్దం ప్రారంభంలో సర్ జోసెఫ్ స్టాంప్ ఇంగ్లాండులో ప్రచారంలోకి తెచ్చారు. ప్రజలు తమ జీవితాన్ని దుర్భరం చేసుకోకుండా, ఆర్థిక వ్యవస్థకు ఆటంకం కల్గించకుండా ప్రభుత్వానికి చెల్లించగల అత్యధిక మొత్తాన్ని పన్ను చెల్లింపు సామర్థ్యం అంటారని స్టాంప్ నిర్వచించారు. ఎటువంటి హానికర ప్రభావాలు లేకుండా ఒక సమాజంపై ఎంతమేరకు పన్ను విధించవచ్చునో వివరించేదే నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం. "ప్రజల జీవన ప్రమాణాన్ని అదే స్థాయిలో ఉంచడానికి అవసరమైన వస్తూత్పత్తిని జరపడానికి అవసరమైన కనీసపు వినియోగపు మొత్తం కంటే మిగులుగా ఉన్న ఉత్పత్తి" పన్ను చెల్లింపు సామర్థ్యమని షిరాస్ నిర్వచించాడు.

డ్యూమండ్ ఫ్రేజర్ అభిప్రాయంలో పన్నుల చెల్లింపు కోసం ప్రజలు బ్యాంకు రుణాలపై ఆధారపడవలసి వస్తే ప్రజల సామర్థ్యం మేరకు పూర్తిగా పన్నులు విధించినట్లు భావించవచ్చును. పన్ను చెల్లించిన తర్వాత పౌరుని వద్ద తన కనీస అవసరాలకు కావాల్సిన మొత్తం తప్ప ఇంకేవి ఉండనప్పుడు నిరపేక్ష పన్ను విధించినట్లు అర్థం.

ఈ భావన సిద్ధాంత రీత్యా సరి అయినదే అయినప్పటికి నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని అంచనా వేయడం కష్టం. పౌరులు తమ కనీస జీవన ప్రమాణ స్థాయినైనా నిలుపుకోవడానికి ఎంత కనీస మొత్తం అవసరమో తెలుసుకోవడం కష్టం. సరయిన అంచనా లేకుండా పన్ను విధిస్తే పన్ను చెల్లించిన తర్వాత ప్రజల వద్ద ఏమీ మిగలక పని, పట్ల పొదుపు పట్ల వారిలో ఆసక్తి తగ్గుతుంది. అందుచేత నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్య భావన ఆచరణాత్మకమైనది కాదని దీనిని పూర్తిగా విస్మరించాలని డాల్టన్ వివరించాడు. ఆయన అభిప్రాయంలో సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యమే విశ్వసనీయమైనది.

**(బి)సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం :** ఒక సమాజంలో ఒక ప్రజా సమూహం పన్ను చెల్లించగల సామర్థ్యాన్ని మరో సమూహంతో పోల్చి చూడటాన్ని సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం అంటారు. సమాజంలో వివిధ వర్గాల ప్రజల పన్ను చెల్లింపు సామర్థ్యం ఒకే విధంగా ఉండదు. అది ప్రజల జీవన ప్రమాణం, ఆదాయం పెరుగుదల రేటు, ఆదాయ పంపిణీ, జనాభా వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్య సూత్రం ప్రకారం పేద వర్గంపై కంటే ధనిక వర్గంపై ప్రభుత్వం అధిక పన్ను విధించాలి.

## 6.14. పన్ను విధింపు సామర్థ్య నిర్ణాయకాలు:

పన్ను విధింపు సామర్థ్యం ప్రపంచమంతటా ఒకే విధంగా ఉండదు. ఆయా సమాజాల నిర్దిష్ట పరిస్థితులపై ఇది ఆధారపడి ఉంటుంది. ఒక సమాజపు పన్ను చెల్లింపు శక్తిని అంచనా వేయడానికి క్రింది కారకాలను దృష్టిలో ఉంచుకోవాలి.

**(1) జాతీయాదాయం:** ఒక దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన సూచిక జాతీయాదాయం. జాతీయాదాయం ఎక్కువగా ఉంటే ప్రజల పన్ను చెల్లింపు సామర్థ్యం కూడా ఎక్కువగా ఉంటుంది. అందుచేత వెనుకబడిన దేశాలలో కంటే అభివృద్ధి చెందిన దేశాలలో పన్ను చెల్లింపు సామర్థ్యం అధికం.

**(2) ఆదాయ పంపిణీ:** కేవలం జాతీయాదాయాన్ని బట్టి పన్ను చెల్లింపు సామర్థ్యం ఉండదు. ఆ ఆదాయం వివిధ వర్గాల మధ్య ఏవిధంగా పంపిణీ అయిందనేది కూడా ప్రధానాంశమే. జాతీయాదాయ పంపిణీలో అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాలలో పన్ను చెల్లింపు సామర్థ్యం కూడా ఎక్కువ.

**(3) పన్నుల విధానం:** పన్నులు విధించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటే పన్ను విధింపు సామర్థ్యం కూడా ఎక్కువగా ఉంటుంది. ఒకే ఆదాయ వనరుపై పన్ను విధించవలసి వచ్చిన ఒక వస్తువుపై ఎక్కువగా పన్ను విధించినా ప్రజల పన్ను సామర్థ్యం తగ్గిపోతుంది. అందుచేత పన్ను విధింపు విస్తృతమైతేనే పన్ను విధింపు సామర్థ్యం కూడా పెరుగుతుంది.

**(4) ప్రభుత్వ వ్యయ స్వభావం:** ప్రభుత్వం చేసే వ్యయ స్వభావంపై కూడా పన్ను చెల్లింపు సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. పన్నుల రాబడిని ప్రభుత్వం పెట్టుబడులకు వినియోగించి ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడానికి వ్యయం చేస్తే పన్ను చెల్లింపు సామర్థ్యం పెరుగుతుంది. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సాంఘిక సంక్షేమ కార్యక్రమాలపై వ్యయం చేసిన పన్ను చెల్లింపు సామర్థ్యం పెరుగుతుంది. అలాకాక అనుత్పాదక వ్యయానికి పాల్పడితే ఈ సామర్థ్యం తగ్గుతుంది.

**(5) జనాభా :** ఒక దశ జనాభా దాని పెరుగుదల రేటుపై కూడా పన్ను విధింపు సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. పన్ను చెల్లింపు సామర్థ్యం వాస్తవిక తలసరి ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. జాతీయాదాయం పెరుగుదల రేటు కంటే జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉంటే పన్ను చెల్లింపు సామర్థ్యం తగ్గిపోతుంది.

**(6) ప్రజల మానసిక స్థితి:** ప్రత్యక్ష పన్నులు పరోక్ష పన్నులకంటే ఎక్కువ భారమనిపిస్తాయి. అందుచేత వాటిని ఎగవేయడానికి మానసికంగా సిద్ధులౌతారు. పన్ను చెల్లింపు సామర్థ్యం కంటే అధిక భారం మోపబడిందని ప్రజలు భావించినప్పుడు కూడా ఇలాంటి స్థితే ఏర్పడుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను చెల్లించడం తమ నైతిక విధి అనే భావన ప్రజలలో తక్కువగా ఉంటుంది. అందుచేత ఇలాంటి దేశంలో పన్ను విధింపు సామర్థ్యం తక్కువగా ఉంటుంది.

**(7) స్థిరత్వం :** రాజకీయ స్థిరత్వం ఉండి ఆర్థికాభివృద్ధి ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నప్పుడు ప్రజలకు ప్రభుత్వం పట్ల నమ్మకం ఏర్పడి పన్నులు చెల్లిస్తారు. అదేవిధంగా జాతీయాదాయం హెచ్చుతగ్గులు లేకుండా నిలకడగా ఉండే దేశాలలో పన్ను చెల్లించే శక్తి ఎక్కువగా ఉంటుంది.

**(8) స్వచ్ఛమైన పరిపాలన :** పాలనా యంత్రాంగంలో అవినీతి, అసమర్థత చోటు చేసుకుంటే ప్రజలు పన్నులను ఎగవేస్తారు.

## 6.15. పన్ను విధింపుపై పరిమితులు:

ఏ దేశంలోనైనా పన్ను విధింపు గరిష్ఠ పరిమితి జాతీయాదాయంలో ఒక శాతంగా ఉండాలని అంతకు మించి పన్ను విధిస్తే, పని పట్ల పొదుపు పట్ల పెట్టుబడి పట్ల ఆశక్తి దెబ్బతింటుందని కోలిన్‌క్లార్క్ వివరించాడు. అధిక పన్నుల వల్ల ధరలు, వేతనాలు పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీస్తాయని మూలధనం పెరుగుదల తగ్గి జాతీయోత్పత్తి కుంటుపడుతోందని క్లార్క్ అభిప్రాయం. అయితే ఈ భావనకు డాల్టన్ వ్యతిరేకించాడు. జాతీయాదాయంలో పన్ను ఎంత శాతం ఉండాలనేది దేశానికి దేశానికి మారుతుంది. పన్ను విధింపుకు సార్వజనీనమైన పరిమితి ఉండదు. అన్ని దేశాలకు ఒకే మొత్తాన్ని నిర్ణయించడం సాధ్యం కాదని డాల్టన్ భావించాడు.

జాతీయాదాయంలో పన్నుల ద్వారా ప్రభుత్వానికి వసూలు అయ్యే మొత్తాన్ని శాతంగా తీసుకుంటే పేద దేశాలలో కంటే ధనిక దేశాలలో ఎక్కువగా ఉంటుంది. వెనుకబడిన దేశాలలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయం స్వల్ప జాతీయాదాయంలో 8 నుంచి 15 శాతం ఉంటుంది. అదే అభివృద్ధి చెందిన దేశాలలో అయితే ఒకటి నుంచి 30 శాతం వరకు ఉంటుంది. వెనుకబడిన దేశాలలో పన్నుల ద్వారా లభించే ఆదాయ శాతం తక్కువగా ఉండటానికి పేదరికం మాత్రమే కారణం కాదు. ఆ దేశ ప్రజల పన్నుల సంభావ్యత సక్రమంగా ఉపయోగంలోకి వచ్చిందా లేదా అనేది కూడా ఒక కారణమే. సంపన్న దేశాలకు వర్తించే పన్ను పరిమితి పేద దేశాలకు వర్తించదు.

## 6.16. భారతదేశంలో పన్ను చెల్లింపు సామర్థ్యం :

భారతదేశంలో పన్ను చెల్లింపు సామర్థ్యం పరిమితిని దాటిందా లేదా అనే అంశంపై ఆర్థిక వేత్తలలో భిన్నాభిప్రాయం ఉంది. చాలా సంవత్సరాల పాటు పన్నుల రాబడి జాతీయాదాయంలో 11 నుంచి 14 శాతం వరకు మాత్రమే ఉంది. ఇటీవల ఇది పెరుగుతున్నది 18 నుంచి 20 శాతానికి చేరింది. అందుచేత భారతదేశపు పన్ను చెల్లింపు సామర్థ్యం గరిష్టస్థాయికి చేరిందనేది కొందరి అభిప్రాయం. అయితే ఇది పూర్తి వాస్తవం కాదు. పన్ను చెల్లింపు సామర్థ్యం ఒక స్థిరమైన భావన కాదు. ఇది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఒకానొక సమయంలో నిర్ణయించిన పన్ను చెల్లింపు సామర్థ్యం తదనంతర కాలంలో పెరగనూవచ్చు తగ్గనూ వచ్చు.

భారతదేశంలో దాదాపు 25 శాతం పైగా ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నారు. వీరు ఇంక ఏమాత్రం అదనపు పన్నుల భారాన్ని భరించలేరు. అందుచేత కొత్తగా పన్నులు విధించేటప్పుడు పేదవారు ఉపయోగించే వినియోగ వస్తువులపై పన్నులు విధించేటప్పుడు జాగ్రత్త పడాలి.

భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలపై ఎంతో వ్యయం చేస్తున్నాయి. దీని మూలంగా ఆర్థికాభివృద్ధి ఫలితాలు అన్ని వర్గాలకు పూర్తిగా చేరకపోయినా మొత్తం మీద ప్రజల ఆదాయం పెరుగుతుంది. దీనిని బట్టి కూడా పన్ను విధింపునకు గల అవకాశాలు తెలుసుకోవచ్చు.

మొత్తంమీద పన్నుల ద్వారా రాబడిని పెంచుకొనే అవకాశాలను ప్రభుత్వం ఇప్పటికీ పూర్తిగా ఉపయోగించుకోలేదు. పన్నులు జాతీయాదాయ నిష్పత్తి కనీసం 20 శాతం వరకూ ఉంటేనే మన పన్నుల విధానం ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని ఆర్థికవేత్తల భావన.

## 6.17. సారాంశము:

పన్నుల విధింపు వల్ల ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, వినియోగం, పెట్టుబడి, ఉద్యోగిత తదితర అంశాలలో మార్పులు చోటు చేసుకుంటాయి. మార్కెట్ యంత్రాంగం సృష్టించిన లోపాలను పన్నుల వ్యవస్థ సరిచేయాలి. ఆర్థిక వ్యవస్థ గరిష్ట సామాజిక ప్రయోజనం పొందే విధంగా పన్నుల వ్యవస్థ ఉండాలి. పని పొదుపు పెట్టుబడుల సామర్థ్యంపై పన్ను ప్రభావం ఉంటుంది. కొన్ని పన్నులు అనుకూలంగాను, మరికొన్ని పన్నులు ప్రతికూలంగానూ ప్రభావితం చేస్తాయి. పనిచెయ్యాలనే కోరిక పై కూడా పన్ను ప్రభావం ఉంటుంది. ఉదాహరణకు పురోగామి పన్ను వల్ల వ్యక్తులకు పని చేయాలనే కోరిక సన్నగిల్లుతుంది. ఒకానొక ప్రత్యేకమైన ఉద్యోగితపై పన్ను విధించినప్పుడు వనరులు పన్నులు లేని ఉద్యోగితపై మళ్ళుతాయి. అంటే ఆర్థిక వనరుల మళ్ళింపు జరుగుతుంది.

జర్మనీ శాస్త్రవేత్త వాగ్నార్ ప్రకారం పన్నుల యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటైన ఆదాయ సంపదల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించడం. పన్నులు సమానత్వ సూత్రాన్ని పాటించాలి. ఇవి ఆర్థిక సుస్థిరతకు దోహదపడుతాయి. పన్నుల వల్ల ఇతర ప్రభావాలూ ఉంటాయి. పన్నుల వసూళ్ళ వల్ల వచ్చే ఆదాయం కంటే ఒక్కొక్కసారి అందుకయ్యే వ్యయం ఎక్కువగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్నులు అభివృద్ధి సాధనకు ఉపయోగపడాలి. పన్నుల ప్రభావాన్ని నాలుగు దశలుగా వర్గీకరించవచ్చును. అవి (1) ఆదాయ ప్రభావం (2) తరలింపు ప్రభావం (3) ధర ప్రభావం (4) పంపిణీ ప్రభావం పన్నులు ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణకు తోడ్పడాలి. ప్రభుత్వం పన్ను విధించేటప్పుడు దానిని చెల్లించగల సామర్థ్యం ప్రజలకు ఉందో లేదో తెలుసుకోవాలి. దీనిని పన్ను చెల్లింపు సామర్థ్యం అంటారు. ఎటువంటి హానికర

ప్రభావాలు లేకుండా ఒక సమాజంపై ఎంతమేరకు పన్ను విధించవచ్చునో వివరించేదే నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం. ఒక సమాజంలో ఒక ప్రజాసమూహం పన్ను చెల్లించగల సామర్థ్యాన్ని మరో సమాజంతో పోల్చి చూడటాన్ని సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం అంటారు. పన్ను విధింపు సామర్థ్యం ప్రపంచమంతటా ఒకే విధంగా ఉండదు. ఆయా సమాజాల నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఈ సామర్థ్యాన్ని నిర్ధారించే అంశాలు జాతీయాదాయం, ఆదాయ పంపిణీ, పన్నుల విధానం, ప్రభుత్వ వ్యయ స్వభావం, జనాభా, ప్రజల మానసిక స్థితి, స్థిరత్వం, స్వచ్ఛమైన పరిపాలనగా చెప్పవచ్చును. పన్ను విధింపుపై గల పరిమితులపై డాల్టన్, క్లార్క్ వారి అభిప్రాయాలను తెలిపాడు. భారతదేశంలో పన్ను చెల్లింపు సామర్థ్యం క్రమంగా పెరిగింది. పన్నుల రాబడి జాతీయాదాయంలో 18 నుంచి 20 శాతానికి చేరిందని కొందరి అభిప్రాయం.

## 6.18. గుర్తుంచుకోవలసిన విషయాలు :

1. పన్నుల ప్రభావం వివిధ అంశాలపై ఉండును.
2. ఉత్పత్తిపై పన్నుల ప్రభావం ఉండును.
3. ఆర్థిక వనరుల తరలింపుపై పన్నుల ప్రభావం ఉండును
4. పన్నుల ప్రభావము పంపిణీపై కూడా ఉండును.
5. ఆర్థిక స్థిరత్వాన్ని సాధించే విషయంలో పన్నుల ప్రభావం కలదు.
6. పన్నుల ప్రభావాన్ని అనేక రకాలుగా వర్గీకరించవచ్చును.
7. పన్ను చెల్లింపు సామర్థ్యంపై పన్నులను విధించవలెను.
8. పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని వివిధ అంశాలు నిర్ణయించును.

## 6.19. కఠిన పదాలు :

1. నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యము : ఎటువంటి హానికర ప్రభావాలు లేకుండా ఒక సమాజంపై ఎంతమేరకు పన్ను విధించవచ్చునో వివరించేదే నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం అని అందురు.

2. **సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యము :** ఒక సమాజంలో ఒక ప్రజాసమూహం పన్ను చెల్లించగల సామర్థ్యంను మరో సమూహంతో పోల్చి చూడటాన్ని సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం అని అందురు.

## 6.20. నమూనా ప్రశ్నలు

I. వ్యాసరూప ప్రశ్నలు

1. అభిలషణీయమైన వనరుల పంపిణీ గూర్చి వివరించి, ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలపై పన్ను ప్రభావాన్ని వివరింపుము.
2. పన్ను ప్రభావ వర్గీకరణను వివరించి, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలపై పన్నుల భావాన్ని పరిశీలించుము.
3. ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణలో పన్నుల పాత్రను వివరించుతూ, పన్ను చెల్లింపు సామర్థ్యం గూర్చి వివరింపుము.
4. భారదేశం పన్ను చెల్లింపు సామర్థ్యంనకు చేరినదా? వివరింపుము.

II. సంక్షిప్త ప్రశ్నలు :

1. మార్కెట్ వ్యవస్థ లోపాలు
2. మంచి పన్నుల విధానం
3. ఉత్పత్తిపై పన్ను ప్రభావం

4. పని, పొదుపు, పెట్టుబడుల సామర్థ్యంపై ప్రభావం
5. పంపిణీపై పన్నుల ప్రభావం
6. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు పన్నుల భారం
7. పన్నులు - ఆర్థిక వ్యవస్థ క్రమబద్ధీకరణ
8. పన్ను చెల్లింపు సామర్థ్యం
9. నిరపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం
10. సాపేక్ష పన్ను చెల్లింపు సామర్థ్యం
11. పన్ను చెల్లింపు సామర్థ్యం నిర్ణాయకాలు
12. పన్ను విధింపుపై పరిమితులు.

## 6.21. చదువదగిన గ్రంథాలు:


1. R.A. Musgrave : The Theory of Public Finance
2. R.A. Musgrave & Reggy B.Musgrave : Public Finance in Theory and Practice
3. R.J. Chelliah : FISCAC Policy in Under Developed Countries.
4. T. Divakara Rao : Tax Burden in Indian Economy.
5. తెలుగు అకాడమి : ప్రభుత్వ అర్థశాస్త్రం


- డా॥ ఎ.రాజశేఖర్

పాఠం : 7

# భారతదేశ పన్నుల వ్యవస్థ

## 7.0. లక్ష్యం:

ఈ పాఠం చదివిన తరువాత విద్యార్థులు క్రింది అంశాలను అవగాహన చేసుకొగల్గుతారు.

(1) పన్నుల వ్యవస్థ-జాబితా-లక్ష్యాలు

(2) కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరులు

(3) రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు

(4) స్థానిక ప్రభుత్వ ఆదాయ వనరులు

(5) భారత దేశ పన్నుల వ్యవస్థ-ప్రత్యక్ష-పరోక్ష పన్నులు

(6) స్వాతంత్ర్యానంతరం పన్నుల వ్యవస్థలో మార్పులు

(7) కేంద్ర ప్రభుత్వం నియమించిన వివిధ కమిటీలు.

## విషయసూచిక


7.1. విషయ పరిచయము (Introduction)

7.2. పన్నుల వ్యవస్థ జాబితాలు

7.3. భారతదేశంలో పన్నుల వ్యవస్థ లక్ష్యాలు

7.4. కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరులు

7.5. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు

7.6. స్థానిక సంస్థల ఆదాయ వనరులు

7.7. భారత దేశ పన్నుల వ్యవస్థ
ప్రత్యక్ష పన్నులు
పరోక్ష పన్నులు

7.8. భారత దేశ పన్నుల వ్యవస్థ - స్వరూప స్వభావాలు

7.9. స్వాతంత్ర్యానంతరం పన్నుల వ్యవస్థలో మార్పులు

7.10. భారత దేశంలో ప్రత్యక్ష పన్నులు
వ్యష్టి ఆదాయపు పన్ను
స్లాబ్, సమతుల పద్ధతులు
వ్యష్టి ఆదాయం పన్ను రేట్లు
పన్ను లెక్కింపు
చెల్లింపు

7.11. కార్పొరేషన్ పన్ను
మినహాయింపు

7.12. మూలధన పన్ను

మూల ధన ఆదాయంపై పన్ను

సంపద పన్ను

బహుమతి పన్ను

మరణసుంకాలు-వారసత్వపు సుంకాలు

7.13. వ్యయంపై పన్ను

7.14. పరోక్ష పన్నులు

కేంద్ర ఎక్సైజు సుంకాలు

కష్టమ్స్ సుంకాలు

7.15. రాష్ట్ర ప్రభుత్వ పన్నులు

భూమి శిస్తు

వ్యవసాయ ఆదాయంపై పన్ను

7.16. అమ్మకం పన్ను

సాధారణ అమ్మకం పన్ను

నిర్ణయించిన వస్తువులపై పన్ను

అమ్మకం పన్ను లేదా టర్నోవర్ పన్ను

టోకు వర్తకులు, చిల్లర వర్తకుల అమ్మకాలపై పన్ను

ఏకస్థాన, బహుళ స్థానాల అమ్మకం పన్ను

విలువ పెరుగుదలపై పన్ను

వాడకం పై పన్ను

అమ్మకం పన్ను రాబడి

7.17. విలువ ఆధారిత పన్ను

7.18. రాష్ట్ర ఎక్సైజు సుంకాలు

అదనపు ఎక్సైజు సుంకం

7.19. వినోదపు పన్ను

7.20. స్టాంపులు, రిజిస్ట్రేషన్

7.21. పందాలపై పన్ను

7.22. విద్యుత్‌చ్ఛక్తి సుంకము

7.23. పట్టణ ఆస్తులపై పన్ను

7.24. అభివృద్ధి పన్ను

7.25. స్థానిక సంస్థల పన్నులు

స్థానిక సంస్థలు విధించే పన్నులు

రాష్ట్ర ప్రభుత్వ పన్నులలో వాటాలు

గ్రాంట్లు

పన్నేతర ఆదాయాలు

7.26. స్థానిక సంస్థల ప్రధాన పన్నులు

భూములు భవనాలపై విధించే పన్నులు

భూమి సెస్సు, ఆక్ట్రాయ్ మరియు టెర్మినల్ టాక్సులు

అభివృద్ధి పన్ను

వృత్తి పన్ను

వాహనాలు, పడవలు, పశువులపై పన్ను

టోల్‌టాక్సు, ప్రకటనలపై పన్ను

7.27. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు

కె.యన్. రాజ్ కమిటీ.

కె.ఎన్.వాంఛూ కమిటి

ఎల్.కె.ఝా కమిటి

భూతలింగం కమిటి

రాజా.జె.చెల్లయ్య కమిటి

విజయ కేల్కర్ కమిటి

7.28. సారాంశము

7.29. గుర్తుంచుకోవలసిన విషయాలు

7.30. కఠిన పదాలు

7.31. నమూనా ప్రశ్నలు

7.32. చదువదగిన గ్రంథాలు.

## 7.1. విషయ పరిచయము:

భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు స్వేచ్ఛా వ్యాపారంతోపాటు పౌరులకు ఆర్థిక, సాంఘిక న్యాయాన్ని కల్పించాలని సహజ వనరులు వినియోగం పంపిణీ ప్రజా సంక్షేమానికి అనుగుణంగా ఉండాలని నిర్దేశించాయి. అన్ని స్వతంత్ర దేశాల వలెనే భారతదేశం కూడా స్వాతంత్ర్యానంతరం ఒక హేతుబద్ధమైన పన్నుల వ్యవస్థను నిర్మాణం చేసుకున్నది. పన్నుల వ్యవస్థలో పన్నుల విధింపు, వసూలు, వినియోగం అనేవి మూడు ప్రధానాంశాలు. ఈ అంశాలన్నింటిని భారత రాజ్యాంగంలోని పదవ షెడ్యూలులోగల 268 నుంచి 300 వరకు ఉన్న అధికరణాలు వివరిస్తున్నాయి.

## 7.2 పన్నుల వ్యవస్థ - జాబితాలు:

వీటి ఆధారంగా పన్నుల వ్యవస్థ మూడు జాబితాలుగా రూపొందించారు. అవి ఎ)కేంద్ర జాబితా, బి)రాష్ట్ర జాబితా, సి)ఉమ్మడి జాబితా. ఈ మూడు రకాల పన్నులలో కొన్నింటిని కేంద్రం విధించి, వసూలు చేసి వచ్చిన ఆదాయాన్ని రాష్ట్రాలతో కలిసి పంచుకుంటుంది. కొన్నింటిని విధించేది కేంద్రమే అయినను రాష్ట్రాలు వసూలు చేసుకొని జమ చేసుకుంటాయి. మరికొన్నింటిని పూర్తిగా రాష్ట్రాలే విధించి వసూలు చేసి ఉపయోగించుకుంటాయి.

## 7.3. భారత దేశంలో పన్నుల వ్యవస్థ లక్ష్యాలు:

(ఎ) పెట్టుబడులకు అవసరమైన వనరులను సమకూర్చుకోవడం

(బి) ఆర్థిక అసమానతల్ని తొలగించడం

(సి) ద్రవ్యోల్బణాన్ని నివారించడం.

భారత దేశంలో విధించబడుతున్న పన్నులు ప్రధానంగా మూడు రకాలు

1) ఆదాయ వ్యయాలపై పన్ను

2) ఆస్థి పై మూలధన లావాదేవీల పన్ను

3) వస్తు సేవలపై పన్ను

వీటిలో మొదటి రెండు ప్రత్యక్ష పన్ను, మూడోది పరోక్ష పన్ను.

## 7.4. కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరులు:

భారత రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులు నాలుగు రకాలు. అవి

(ఎ) కేంద్ర ప్రభుత్వం విధించి వసూలు చేసి మొత్తం ఆదాయాన్ని తానే ఉంచుకునే పన్నులు. ఉదాహరణకు కార్పొరేషన్ పన్నులు, కష్టమ్స్ సుంకాలు.

(బి) కేంద్రం విధించి వసూలు చేసి వచ్చిన ఆదాయాన్ని రాష్ట్రాలతో కలిసి పంచుకునే పన్నులు. ఆదాయం పన్ను, కేంద్ర ఎక్సైజ్ సుంకాలు.

(సి) కేంద్ర ప్రభుత్వం విధించి వసూలు చేసి ఆదాయం మొత్తాన్ని రాష్ట్రాలకిచ్చే పన్నులు టెర్మినల్ సుంకాలు, ఎస్టేట్ డ్యూటీ.

(డి) కొన్ని పన్నులను కేంద్రం విధించగా రాష్ట్రాలు వసూలు చేసుకొని తామే ఆదాయాన్ని అనుభవిస్తాయి. ఉదాహరణకు స్టాంపు డ్యూటీ, కాస్మొటిక్స్ పైన, అల్కహాల్ కలిపిన మందులపైన విధించిన ఎక్సైజు సుంకాలు.

పైన పేర్కొన్న పన్నుల ద్వారానే కాకుండా కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన వాణిజ్య సంస్థల నుంచి వచ్చే లాభాలు డివిడెండ్ల రూపంలో కూడా రాబడి వస్తుంది.

కేంద్ర ప్రభుత్వానికి వివిధ పన్నుల ద్వారా ఎంత ఆదాయం సమకూరింది క్రింది పట్టిక ద్వారా తెలుస్తుంది.

| పన్ను వివరాలు | సమకూరిన ఆదాయం |
|---|---|
| 1. వ్యష్టి ఆదాయపు పన్ను | 6.81 |
| 2. కార్పొరేట్ పన్ను | 11.70 |
| 3. కేంద్ర ఎక్సైజు సుంకాలు | 47.22 |
| 4. కష్టమ్స్ సుంకాలు | 31.10 |
| 5. సంపద పన్ను | 0.40 |
| 6. మరణ సుంకాలు | 0.09 |

పై వివరణను బట్టి కేంద్ర ప్రభుత్వ మొత్తం రాబడిలో దాదాపు 78 శాతం ఆదాయం ఎక్సైజు, కష్టమ్స్ సుంకాల ద్వారానే లభిస్తున్నది. ఆ తర్వాత కార్పొరేట్ పన్ను వ్యష్టి ఆదాయపు పన్నుకు ప్రాధాన్యత ఉంది.

## 7.5. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు:

భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు క్రింద పన్నుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. అవి

1) అమ్మకం పన్ను
2) రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు
3) స్టాంపు డ్యూటీ
4) భూమి శిస్తు
5) వినోదపు పన్ను
6) నీటి తీరువా
7) మోటారు వాహనాలపై పన్ను మొదలైనవి.

రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో అన్నిటికంటే ప్రధానమైనది అమ్మకం పన్ను ద్వారా వచ్చే ఆదాయం. ఇది దాదాపు 50 శాతం పైగా ఉంది. ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం VAT విలువ ఆధారిత పన్నును ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. దేశంలోని మొత్తం రాష్ట్రాలలో VAT పన్ను పద్ధతిని 21 రాష్ట్రాలు 2005 ఏప్రిల్ ఒకటి నుండి అమలు పరచడం ప్రారంభించాయి. విలువ ఆధారిత పన్ను (VAT) ప్రవేశపెట్టడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇక ముందు అమ్మకం పన్ను ద్వారా వచ్చే ఆదాయం రాదు. కాని ఆ లోటును భర్తీ చేయడానికి కేంద్రం అంగీకరించింది. రాష్ట్ర ఎక్సైజు సుంకం ద్వారా 22 శాతం ఆదాయం, మోటారు వాహనాల పన్ను, స్టాంపులు రిజిస్ట్రేషన్‌ల ద్వారా ఆరు శాతం, భూమి శిస్తు ద్వారా ఐదు శాతం ఆదాయం లభిస్తున్నది.

పై పన్నుల ద్వారానే కాకుండా కేంద్రం విధించే పన్నుల నుంచి రాష్ట్రాలకు ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు వాటా లభిస్తుంది. అంతే కాక కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ల రూపంలో సహాయం లభిస్తుంది.

## 7.6. స్థానిక సంస్థల ఆదాయ వనరులు:

స్థానిక సంస్థల ఆదాయ వనరుల గురించి ప్రస్తావన రాజ్యాంగంలో లేదు. అయితే రాష్ట్రాలు తమకు కేటాయించిన కొన్ని పన్నులను స్థానిక సంస్థలకు బదిలీ చేసింది. ఉదాహరణకు వృత్తి పన్ను, ఆక్ట్రాయ్ పన్ను, ఆస్తి పన్ను, రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజు, వినోదపు పన్ను వంటి వాటి ద్వారా తనకు లభించే ఆదాయంలో కొంత మొత్తాన్ని స్థానిక సంస్థలకు ఇస్తుంది. ఇది కాక లైసెన్స్ ఫీజు మొదలైన వాటి ద్వారా, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్ల ద్వారా కూడా స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరుతుంది.

## 7.7. భారతదేశ పన్నుల వ్యవస్థ - ప్రత్యక్ష, పరోక్ష పన్నులు - ఒక పరిశీలన:

భారత దేశంలో ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్ష పన్నులకే ఎక్కువ ప్రాధాన్యత ఉన్నది. 1950-51 ఆర్థిక సం॥లో పన్నుల ద్వారా కేంద్రానికి వచ్చిన ఆదాయంలో 22 శాతం మాత్రమే ప్రత్యక్ష పన్నుల ద్వారా రాగా, పరోక్ష పన్నుల ద్వారా మిగిలిన 78 శాతం సమకూరింది. ప్రస్తుతం ప్రత్యక్ష పన్నుల ఆదాయం 38.8 శాతం ఉండగా, పరోక్ష పన్నుల ఆదాయం 60.5 శాతంగా ఉంది.

**ప్రత్యక్ష పన్నులు:** G.D.P.లో ప్రత్యక్ష పన్నుల వాటా 3.7% కాగా, పరోక్ష పన్నుల వాటా 5.8%. ప్రత్యక్ష పన్నుల వాటా ఎక్కువగా ఉండటానికి పేదరికము ఒక కారణముకాగా, మన ప్రజలలో చాలా మంది ప్రత్యక్ష పన్నుల పరిధికి వెలుపల ఉండుట రెండవ కారణము. ప్రత్యక్ష పన్నుల రేట్లు ఇప్పటికే ఎక్కువగా ఉండడం చేత వాటిని ఇంకా పెంచే అవకాశం

లేకపోవడం. అధిక పన్ను రేటు కారణంగానే పన్నుల ఎగవేత జరిగి ఫలితంగా మన దేశంలో నల్ల ధనం పరిమాణం పెరిగిపోతోందని 1971లో వాంఛూ కమిటీ పేర్కొంది. మన దేశ వ్యక్తిగత ఆదాయపు పన్ను పద్ధతిలో ఉపాంత పన్ను రేటు ఎక్కువగా ఉంది. అందుచేత ఒక పరిమితి దాటి ఆదాయాన్ని సంపాదించేదానికంటే పన్ను ఎగవేయటమే లాభదాయకంగా ఉంది. దీనిమూలంగా కూడా జాతీయ ఆదాయంతో పాటు ప్రత్యక్ష పన్నుల రాబడి పెరుగుటలేదు. దీనిని నివారించడానికే రాజా చెల్లయ్య కమిటీ సూచనలమేరకు ప్రభుత్వం పన్ను ఉపాంత రేటును 40 శాతానికి తగ్గించింది. అయినప్పటికీ ఆదాయం మాత్రము గణనీయంగా పెరుగలేదు.

పరోక్ష పన్నులు: పరోక్ష పన్నుల ద్వారా లభించే ఆదాయం 1950-51 లో రూ.227.5 కోట్లు ఉండగా ఆ మొత్తం 2002-03 నాటికి రూ.1,42,652 కోట్లుకు పెరిగింది. ఈ ఆదాయం పెరగడానికి ప్రధాన కారణం పరోక్ష పన్నుల పరిధిలోకి తీసుకు రాబడిన వస్తువుల సంఖ్య పెరగడం. అంతేగాక ధరలు పెరగడం, విలువ ఆధారంగా ఎక్సైజ్ పన్నులు, కస్టమ్స్ సుంకాలను విధించడం వల్ల కూడా పరోక్ష పన్నుల ద్వారా ఆదాయం పెరిగింది. అమ్మకంపన్ను రాష్ట్రాల పాలిట కల్పవృక్షంగా మారింది. పరోక్ష పన్నులను విధించడం, వసూలు చేయడం సులభం కనుక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిమీదనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి.

కాని పరోక్ష పన్నుల వలన ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తున్నప్పటికీ వాటివల్ల పేదవారిపై పన్నుల భారం పెరుగుతుంది. పరోక్ష పన్నులు సాంఘిక న్యాయాన్ని చేకూర్చడానికి, ఆర్థిక అసమానతలు తగ్గించడానికి ఉపయోగపడవు.

## 7.8 భారత దేశ పన్నుల వ్యవస్థ, స్వరూప, స్వభావాలు - ఒక పరిశీలన:

(1) ప్రభుత్వానికి పన్నుల ద్వారా సమకూరే ఆదాయం క్రమక్రమంగా పెరుగుతోంది. ఆ రాబడి 1950-51లో రూ.627 కోట్లు ఉండగా 2002-03 నాటికి రూ.2,35,800 కోట్లకు పెరిగింది. ప్రభుత్వ రాబడిలో పన్నుల ద్వారా సమకూరే ఆదాయం 70 - 80% వరకు ఉంది.

(2) మన పన్నుల వ్యవస్థలో ఇప్పటికీ పరోక్ష పన్నులకే ఎక్కువ ప్రాధాన్యత. మొత్తం పన్ను రాబడిలో ప్రత్యక్ష పన్నుల ద్వారా 35.8% ఆదాయం రాగా పరోక్ష పన్నుల ద్వారా 60.5% ఆదాయం సమకూరుతుంది.

(3) పరోక్ష పన్నులకు ప్రాధాన్యత ఎక్కువగా ఉన్న కారణంగా పేదవారిపై భారం ఎక్కువగా ఉండి ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి.

(4) అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో పన్నుల రాబడి జాతీయ ఆదాయంలో పెరుగుదలకు అనుగుణంగా లేదు. జాతీయ ఆదాయంలో 9.6% మాత్రమే పన్నుల ద్వారా సమకూరుతోంది.

(5) మన దేశంలో పన్నుల వసూలు సామర్థ్యం, పన్నుల ఎగవేత మరియు పన్నుల పరిధి నుండి తప్పించుకోవడం ఎక్కువగా ఉంది.

(6) వ్యవసాయరంగంలోని మిగులు ఆదాయాన్ని పన్నుల ద్వారా రాబట్టుకునే ప్రయత్నం జరగటం లేదు.

(7) ప్రత్యక్ష పన్నులలో ఉన్న మినహాయింపుల కారణంగా ఆచరణలో ఆశించిన పురోగామిత్వం ఉండటం లేదు.

(8) పరోక్ష పన్నులపై ఎక్కువగా ఆధారపడుతున్న కారణంగా మన పన్నుల వ్యవస్థ ద్రవ్యోల్బణానికి అనుకూలంగా ఉంది.

(9) పన్నుల విధానం ఉపాధి అవకాశాలను పెంచటం లేదు.

(10) ఆర్థికాభివృద్ధికి అవసరమైనంత వనరులను పన్నుల ద్వారా రాబట్టే ప్రయత్నం జరుగుట లేదు.

## 7.9. స్వాతంత్ర్యానంతరం పన్నుల వ్యవస్థలో మార్పులు:

1956లో ఆచార్య కాల్డర్, 1967లో భూతలింగం కమిటి, 1970లో వాంఛూ కమిటి, 1972లొ కె.యన్.రాజ్ కమిటి, రాజా చెల్లయ్య కమిటిలు పన్నుల సంస్కరణలకు సంబంధించి చేసిన సూచనలలో కొన్నింటిని ప్రభుత్వం ఆమోదించి పన్నుల వ్యవస్థలో మార్పులు చేసింది. రాజా చెల్లయ్య కమిటి పన్నుల వ్యవస్థను సరళతరంగా రూపొందించాలని ప్రభుత్వానికి నివేదించింది. దీనికి అనుగుణమైన చర్యలను ప్రభుత్వం తీసుకున్నది. పన్ను రేట్లను సరళతరం చేయడమేగాక కొన్ని పన్ను రేట్లను తగ్గించడం కూడా జరిగింది. వివిధ వస్తువులపై దిగుమతి సుంకాల రేట్లు కూడా గణనీయంగా తగ్గించారు.

## 7.10. భారత దేశంలో ప్రత్యక్ష పన్నులు:

**వ్యష్టి ఆదాయపు పన్ను** : భారత ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే ప్రత్యక్ష పన్నులలో ఆదాయపు పన్ను ప్రముఖ పాత్ర వహిస్తుంది.

ఆదాయం పన్నును మొట్టమొదట 1798లో ఇంగ్లాండ్‌లోనూ 1864లో అమెరికాలోనూ ప్రవేశ పెట్టారు. మన దేశంలో 1866 నుండి ఆదాయం పన్ను విధిస్తున్నారు. ఆదాయం పన్ను రేటు క్రమక్రమంగా పెరుగుతూ 1870 నాటికి రూ.500 కంటే ఎక్కువగా ఉన్న ఆస్తి ఆదాయాలపై రూపాయికి ఆరు పైసలు చొప్పున పన్ను విధించారు. 1872లో కనీస ఆదాయాన్ని రూ.700 పెంచి పన్ను రేటును 2 పైసలకు తగ్గించారు. 1916-17లో అదనపు ఆదాయం కొసం రూ.20,000 పైగల ఆదాయంపై 6.5% పన్ను విధించారు. రూ.50,000 మించిన ఆదాయంపై సూపర్‌టాక్స్ విధించబడింది. 1922లో "భారతదేశ ఆదాయపన్ను చట్టం" తయారయ్యింది. 1939లో సోపానపద్ధతిలో పన్నులను సమతల పద్ధతికి మార్చారు. సూపర్‌టాక్స్ రద్దు అయింది. గరిష్ట ఆదాయ పరిమితి 1953లో రూ.8,400కు పెంచబడింది. 1955 వరకు మొదటి రూ.25,000 వరకు సూపర్‌టాక్స్ విధించలేదు. 1983-84లో రూ.15000 గా పన్ను మినహాయింపు పరిమితి 1995-96 నాటికి 40,000 కి పెరిగింది. 1998-99 బడ్జెట్ ప్రకారం రూ.50,000 లోపు ఆదాయంపై ఏ విధమైన ఆదాయ పన్ను ఉండదు. రూ.50,000 - 60,000 కలవారిపై 10% పన్ను విధించారు.

పై అంశాలను బట్టి ఆదాయం పన్నుకు క్రింది లక్షణాలు ఉన్నాయని చెప్పవచ్చు.

1) కనీస ఆదాయ స్థాయి వరకు పన్ను ఉండదు.

2) కనీస స్థాయి తరువాత పురోగమిపద్ధతిలో పన్ను విధించబడుతుంది.

3) ఆర్జిత ఆదాయానికి, అనార్జిత ఆదాయానికి పన్ను విధింపులో తేడా ఉంటుంది.

4) నిర్దిష్టమైన స్థితిగతులనుబట్టి పన్ను భారం నుండి వివిధ రకాల ప్రామాణిక మినహాయింపులు లభిస్తాయి.

**స్లాబ్ సమతల పద్ధతులు:** మన దేశంలో 1939 వరకు పన్నులు సోపాన పద్ధతుల ప్రకారం ఆదాయం పెరిగేకొద్ది పన్ను పెరుగుతుంది. ఉదాహరణకు రూ.500 - 1000 వరకు 2% చొప్పున, రూ.999 ఆదాయం ఉన్నవారు 2%, 1001 ఆదాయం ఉన్నవారు 4% చెల్లించాల్సి వస్తుంది. దీని ప్రకారం ఉపాంత పన్ను భారం, సగటు పన్ను భారం కంటే ఎక్కువగా ఉంటుంది. సమతల పద్ధతిలో మాత్రం ఎంత ఆదాయం ఉన్నవారు అయినా నిర్ణీత ఆదాయస్థాయిల మధ్య చెల్లించవలసిన పన్ను రేటు ఒకేరకంగా ఉంటుంది. రూ.500 - 1000 వరకు ఆదాయం ఉన్నవారికి పన్ను రేటు 2% అనుకుంటే అందరికీ అదే రేటు వర్తిస్తుంది.

**వ్యష్టి ఆదాయం పన్ను రేట్లు:** 1998-99 పన్ను లెక్కింపు సంవత్సరంలో వ్యష్టి ఆదాయపు పన్ను రేటు ఈ విధంగా ఉన్నది.

| ఆదాయ శ్లాబ్ | పన్ను రేటు |
|---|---|
| రూ.50,000 | లేదు |
| రూ.50,001 - 60,000 | 10% |
| రూ.60,001 - 1,50,000 | 20% |
| రూ.1,50,000 కంటే ఎక్కువ | 30% |

1999-2000 సం॥లో రూ.60,000 కన్నా అధిక ఆదాయం కలవారిపై 10% సర్‌చార్జి విధించారు. పొదుపు ప్రోత్సహించడానికి 88వ సెక్షన్ క్రింద పొదుపు మొత్తాలకు ఉపశమనం కల్పించారు. జీవిత భీమా, ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపులు, జాతీయ పొదుపు సర్టిఫికెట్ల కొనుగోలు వంటివి దీని క్రిందకు వస్తాయి. ప్రస్తుతం రూ.50,000 వరకు 20% ఉపశమనం లభిస్తుంది.

**పన్ను లెక్కింపు:** పన్ను లెక్కించడానికి ఆదాయాన్ని 2 రకాలుగా వర్గీకరిస్తారు.

1) స్థూల ఆదాయం  2) నికర ఆదాయం

స్థూల ఆదాయాన్ని 5 ప్రధాన శీర్షికలుగా వర్గీకరించారు. అవి

(ఎ) జీతాలు

(బి) గృహ ఆస్తులపై ఆదాయాలు

(సి) వృత్తి లేదా వ్యాపారం నుంచి ఆదాయాలు

(డి) మూలధన ఆదాయాలు

(ఇ) ఇతర వనరు[illegible] ఆదాయాలు

అవిభక్త [illegible]లోని సభ్యులకు విడివిడి ఆదాయాలు ఉంటే వాటిపై విడివిడిగా పన్ను విధిస్తారు. అయితే ఈ కుటుంబాల [illegible]లో కనీస మినహాయింపు వ్యక్తులకన్నా 2 రెట్లు ఎక్కువ. భార్యా, భర్తలకు జీతాల నుండి వచ్చే ఆదాయంపై పన్ను విడివిడిగానే ఉంటుంది.

పొదుపును ప్రోత్సహించడానికి పన్నులో మినహాయింపు ఇచ్చినట్లే, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించడానికి కొన్ని ప్రత్యేక పన్ను రాయితీలను కల్పించారు. 1955కు పూర్వం ఉన్న తరుగుదల ఎలవెన్స్ బదులుగా అభివృద్ధి రిబేట్‌ను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం కొత్తగా కొన్న సామగ్రి విలువలో 25% లాభాల నుంచి మినహాయిస్తారు. దీనిని రద్దుచేసి 1976-77లో పెట్టుబడి ఎలవెన్స్‌ను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం ఖర్చులో 25% న్ని లాభంనుండి మినహాయిస్తారు. కొన్ని రకాల పరిశ్రమలకు ప్రారంభదశలో ఆదాయపన్ను నుండి మినహాయింపు ఇస్తున్నారు. దీనిని పన్ను విరామము అంటారు. 1972 నుండి లాటరీలు, గుర్రపు పందేలు, జూదాలు వంటి యాదృచ్ఛిక ఆదాయాలపై రూ.5,000 మించిన ఆదాయం ఉంటే పన్ను విధిస్తున్నారు. స్థూల, నికర ఆదాయాల వర్గీకరణ 1991-92 నుంచి రద్దు అయింది.

**చెల్లింపు:** మామూలుగా ఒక సంవత్సర ఆదాయం తరువాత సంవత్సరం పన్ను చెల్లిస్తారు. కాని రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుండి ఉద్యోగులకు జీతం చెల్లించేటపుడే పన్ను మినహాయించే పద్ధతిని ప్రవేశపెట్టారు. మినహాయించకపోతే చెల్లింపు బాధ్యత యజమానిపై పడుతుంది. దీనిని "ఆర్జించేటపుడే పన్ను చెల్లింపు" అంటారు.

**మన దేశంలో ఆదాయం పన్ను రాబడి**

| సం॥ | | రాబడి రూ॥ కోట్లలో |
|---|---|---|
| 1940-41 | .. | 21.7[illegible] |
| 1950-51 | .. | 1[illegible]2.73 |

| | | |
|---|---|---|
| 1960-61 | .. | 167.40 |
| 1970-71 | .. | 473.20 |
| 1980-81 | .. | 1,506.40 |
| 1985-86 | .. | 2,509.60 |
| 1989-90 | .. | 4,244.80 |
| 1993-94 | .. | 9,500.00 |
| 2001-02 | .. | 32,000.00 |
| 2003-04 | .. | 44,070.00 |

## 7.11. కార్పొరేషన్ పన్ను:

కార్పొరేషన్ పన్ను పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి చెందినది. జాయింట్ స్టాక్ కంపెనీల ఆదాయంపై విధించే పన్నును కార్పొరేషన్ పన్ను అంటారు. కార్పొరేషన్లకు చట్టబద్ధమైన అస్థిత్వాన్ని కలిగించబట్టి కార్పొరేషన్ పన్ను సమంజసమైనదేనని కొందరి అభిప్రాయం.

ప్రారంభంలో కంపెనీల ఆదాయంతో నిమిత్తం లేకుండా నికర లాభాలపై ఈ పన్ను విధించడం జరిగింది. కంపెనీలు తమ నికర ఆదాయంపై విధించిన పన్నును ముందుగా చెల్లించి ఆ తరువాత మాత్రమే వాటాదారులకు ఆదాయం పంచాలి. అయితే వాటాదారుల ఆదాయంపై పన్ను కూడా పంపకానికి ముందు కంపెనీయే చెల్లించాలి. 1965లో సూపర్‌టాక్సు ఆదాయం పన్నులు కలిపి వేయడంవల్ల ఒకే రేటులో కార్పొరేషన్ పన్ను విధించడం జరుగుతుంది. 1971 నుండి కార్పోరేషన్ పన్నుపై సర్‌చార్జి విధించారు. భూతలింగం కమిటీ వాంచూ కమిటి సిఫార్సు మేరకు 1986-87లో సర్‌చార్జిని రద్దు చేశారు. 1989-90 బడ్జెట్‌లో దేశీయ సంస్థల విషయంలో 40 శాతానికి ఇతర లాభాలపై 40 శాతం పన్ను విధిస్తారు. 1990-91లో ఆర్థిక మంత్రి కొన్ని మార్పులు ప్రవేశపెట్టారు. వివిధ కారణాల వల్ల కంపెనీలు పన్నుల ఎగవేతకు పాల్పడుతుండటంతో పన్నులు రాబట్టడానికి ద్విసూత్ర వ్యూహాన్ని రూపొందించారు. ఈ వ్యూహంలోని అంశాలు :

(1) పెట్టుబడి అలవెన్స్, పెట్టుబడి డిపాజిట్ల వంటి భారీ మినహాయింపులను రద్దు చేసి స్వదేశీ కంపెనీలకు పన్ను రేటును 40 శాతంగా నిర్ణయించారు. విదేశీ మారకాన్ని ఆర్జించే సంస్థలకు నూతనంగా నెలకొల్పే పరిశ్రమలకు మాత్రం పై భారీ మినహాయింపులు వర్తిస్తాయి.

(2) ఇప్పటి వరకు స్వదేశీ కంపెనీకి ఇతర కంపెనిల నుంచి పొందే డివిడెండ్లలో 60 శాతం పన్ను మినహాయింపు ఇస్తున్నారు. దీనివల్ల తల ఎత్తుతున్న అసమానతల్ని నివారించడానికి వాస్తవిక పెట్టుబడిని ప్రోత్సహించడానికి మినహాయింపును రద్దు చేశారు.

(3) చిన్న భాగస్వామ్య పరిశ్రమలకు పన్ను మినహాయింపుకు పరిమితిని పెంచారు.

(4) వాతావరణ సమతుల్యతను పెంచడానికి ఉద్యోగ పథకాలను విస్తరింపచేయడానికి చేయూతనిచ్చే ఆదాయాలకు పన్ను మినహాయింపు ఉంటుంది.

5) 75 వేల రూపాయలు దాటిన వారిపై ఆదాయం పన్ను సర్‌చార్జి 8 శాతం యధావిధిగా ఉంటుంది.

మినహాయింపు: పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కార్పొరేషన్ పన్నులో కొన్ని రాయితీలు కల్పించింది. ఆదాయం పన్నుకు వర్తించే పెట్టుబడి అలవెన్సు పన్ను విరామం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికిచ్చే అన్ని మినహాయింపులు ఈ పన్నుకు కూడా వర్తిస్తాయి.

కార్పొరేషన్ పన్ను ద్వారా రాబడి

| సంవత్సరం | | రాబడి రూ॥ కోట్లలో | |
|---|---|---|---|
| 1940-41 | .. | 4.28 | |
| 1950-51 | .. | 40.50 | |
| 1960-61 | .. | 111.00 | |
| 1970-71 | .. | 371.00 | |
| 1980-81 | .. | 1,310.80 | |
| 1985-86 | .. | 2,865.10 | |
| 1989-90 | .. | 4,755.00 | |
| 1993-94 | .. | 10,500.00 | |
| 2001-02 | .. | 36,610.00 | (వాస్తవిక అంచనా) |
| 2003-04 | .. | 51,500.00 | (బడ్జెట్ అంచనా) |

## 7.12. మూలధన పన్నులు:

అసాధారణ ఆదాయాలపైన విధించే పన్నును మూలధన పన్ను అంటారు. ఇది ఆదాయం పన్నుకు అనుబంధం వంటిది. మూలధనంపై వచ్చే ఆదాయం సాధారణ ఆదాయంకన్నా ఎక్కువ కాబట్టి ఈ పన్ను తప్పనిసరి. మూలధనం పన్నులలో ప్రధానమైనవి నాలుగు.

1) మూలధన ఆదాయంపై పన్ను

2) సంపదపై పన్ను

3) బహుమతిపై పన్ను

4) ఎస్టేట్ డ్యూటీ

**మూలధన ఆదాయంపై పన్ను:** మూలధన ఆదాయంపై పన్నును మొదటిసారిగా 1946 మార్చి 31 తర్వాత వచ్చే లాభాలపై విధించారు. 1947 బడ్జెట్ ప్రతిపాదనలో అప్పటి ఆర్థిక మంత్రి లియాఖత్ ఆలీఖాన్ ప్రతిపాదించాడు. రెండవ ప్రపంచ యుద్ధ ఫలితంగా ద్రవ్యోల్బణం తీవ్రమై కొందరు అకస్మాత్తుగా ధనవంతులు కావడం, ఆర్థిక వ్యత్యాసాలు పెరగడం జరిగింది. ఆర్థిక వ్యత్యాసాలను తగ్గించడంకోసం అంచనా వ్యాపారాన్ని అరికట్టడంకోసం ఈ పన్ను విధించారు. ఆస్తిని సంపాదించినప్పుడు కంటే దానిని విక్రయించినప్పుడు దాని విలువ అధికమౌతుంది. అదే మూలధన ఆదాయం. మూలధన ఆదాయంపై మూడో వంతు పన్నుగా నిర్ణయించారు. కంపెనీలు తమకు వర్తించే ఆదాయం పన్ను రేట్లలో మాత్రమే మొత్తం మూలధన ఆదాయంపై పన్ను చెల్లించాల్సి ఉండేది. మూలధన ఆదాయ నష్టాలను ఎనిమిది సంవత్సరాలలోగా ఎప్పుడైనా భర్తీ చేసుకొనే అవకాశం కల్పించారు. 1987-88 సంవత్సరం నుంచి పదివేల రూపాయల వరకు మూలధన ఆదాయాన్ని పన్ను నుంచి పూర్తిగా మినహాయించారు.

**సంపద పన్ను:** సంపద పన్నును కేంద్రం విధించి వసూలు చేస్తుంది. నికొలస్, కాల్డార్ సిఫార్సులకు అనుగుణంగా సంపద పన్నును తొలిసారి 1955లో విధించారు. సంపద పన్ను వివిధ రూపాలలో ఉండవచ్చును. (ఎ) నికర సంపదపై పన్ను, (బి) భవనాలు మొదలగు రూపాలలో ఆస్తులపై ఉండే పన్ను, (సి) కానుకలపై పన్ను, (డి) ఒక వ్యక్తి మరణించినందువల్ల అతని సంపద ఇతరులకు మారేటప్పుడు వేసే పన్ను. ఆర్థిక, సాంఘిక సమానత్వాన్ని పెంపొందించడానికి సంపదపై పన్ను

ఒక ముఖ్యమైన సాధనం. దీని మూలంగా సంపద గలవారు తమ సంపదను ఉత్పాదక రంగాలలో వినియోగించుకొవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ పన్నును మొత్తం సంపదపై కాక నికర సంపదపై మాత్రమే విధిస్తారు. మదింపు తేదీనాటికి అప్పులను మినహాయించగా మిగిలిన సంపదను నికర సంపద అంటారు.

అన్ని రకాల స్థిర, చరాస్తులను సంపద పన్ను విధింపుకు ప్రాతిపదికగా తీసుకోవచ్చును. ఉదాహరణకు బ్యాంకులో గల నగదు నిల్వలు, కంపెనీలలో వాటాలు, ఆభరణాలు. అయితే కొన్ని ఆస్తులకు సంపద పన్ను పరిధి నుంచి తొలగించారు. అవి పశువులు, వ్యవసాయ భూములు. అందులోని పంటలు, వ్యవసాయదారుడు నివసించే భవనం, మొదలైనవి.

సంపద పన్ను పురోగామి రేటుతో శ్లాబ్ పద్ధతిలో విధిస్తున్నారు. 1992-93 సంవత్సరం నుంచి సంపద పన్ను మినహాయింపు పరిమితిని 15 లక్షల రూపాయలకు పెంచారు. ఒకానొక సమయంలో సంపద పన్ను రేటు అత్యధికంగా 15 శాతంగా ఉండేది. అది పన్ను ఎగవేతకు దారి తీసింది. ఇప్పుడు సంపద పన్ను రేటు 0.5 శాతం నుంచి రెండు శాతం దాకా ఉంది. 1992-93 బడ్జెట్‌లో ఉత్పాదక ఆస్తులపై సంపద పన్నును తొలగించారు. గెస్ట్ హౌస్‌లు, నివాస భవనాలు, నగలు వంటి అనుత్పాదక ఆస్తులకు మాత్రమే ఈ పన్నును పరిమితం చేశారు. వీటన్నింటి కారణంగా సంపద పన్ను రాబడి క్రమక్రమంగా తగ్గింది.

| సంవత్సరం | | రాబడి కోట్ల రూపాయలలో |
|---|---|---|
| 1960-61 | .. | 8.15 |
| 1970-71 | .. | 15.30 |
| 1980-81 | .. | 67.40 |
| 1985-86 | .. | 153.40 |
| 1988-89 | .. | 310.00 |
| 1990-91 | .. | 240.00 |
| 1993-94 | .. | 200.00 |
| 2003-04 | .. | 170.00 |

బహుమతి పన్ను: మూలధనంపై విధించే పన్నులలో బహుమతి పన్ను ఒకటి. దీనిని 1958 ఏప్రిల్‌లో ప్రవేశపెట్టారు. దీనిని కేంద్రం విధించి వసూలు చేస్తుంది. ఎస్టేట్ డ్యూటీ, సంపద పన్ను, వ్యయం పన్నుల ఎగవేతను అరికట్టడానికి ఈ పన్నును విధించారు. వ్యక్తులు హిందూ అవిభక్త కుటుంబారు, సంస్థలు ఇచ్చే బహుమతులపై ఈ పన్ను విధిస్తారు. క్రిందటి సంవత్సరం ఇచ్చిన బహుమతులపై ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూలు చేస్తారు. అయితే బహుమతి పన్నులో ఒక లోపం ఉంది. ఇది బహుమతి ఇచ్చే దాతపై విధించబడుతుంది. అంతేకాక బహుమతి విలువకనుగుణంగా ఈ పన్ను రేటు అధిక పురోగామి లక్షణం కలిగి ఉండటం. వీటి మూలంగా పన్ను ఎగవేత ఎక్కువ అయింది. దానిని అరికట్టడానికి 1990-91 బడ్జెట్‌లో బహుమతి పన్నులో కొన్ని మార్పులు చేశారు. పన్ను బహుమతినిచ్చే దాతపై గాక బహుమతి గ్రహీతపై విధించ బడుతుంది. పన్ను మినహాయింపు పరిమితిని పెంచారు, పన్ను రేటు తగ్గించారు. అయితే ఇవేమి అమలుకు నోచుకోలేదు.

ఈ బహుమతి పన్నువల్ల కేంద్ర ప్రభుత్వానికి వార్షిక ఆదాయం 10 కోట్ల రూపాయలకు మించి రాకపోవడం హాస్యాస్పదం. ఈ కారణంగా 1998-99లో ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా ఈ పన్నును రద్దు చేశారు.

మరణ సుంకాలు - వారసత్వపు సుంకాలు: (ఎస్టేట్ డ్యూటీ) ఈ పన్నును కేంద్ర ప్రభుత్వం విధించి వసూలు చేస్తుంది. ఈ ఆదాయాన్ని రాష్ట్రాలకు పంచుతుంది. ఒక వ్యక్తి నుంచి అతని వారసులకు సంక్రమించే ఆస్తులపై విధించే సుంకాన్ని ఎస్టేట్ సుంకం అంటారు.

ఎస్టేట్ పన్ను రేటు ఆస్థి విలువలో 4 నుంచి 40 శాతం వరకు ఉంటుంది. ఈ పన్ను కూడా అధిక పురోగామి పన్ను. వారసత్వం ద్వారా పెద్ద మొత్తం ఆస్తుల సంక్రమణను తగ్గించడానికి ఈ పన్నును విధిస్తారు. ఈ పన్ను ద్వారా కూడా ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం నామమాత్రమైనది. పన్ను ద్వారా వస్తున్న ఆదాయంకంటే దాని నిర్వహణ ఖర్చులు అధికంగా ఉన్నాయి. అందుచేత వి.పి.సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్న కాలంలో 1985 మార్చిలో దీనిని రద్దు చేశారు.

## 13. వ్యయంపై పన్ను:

ఈ పన్నును మొట్టమొదట జె.ఎస్.మిల్ ప్రతిపాదించారు. వ్యయంపై పన్నును మనదేశంలో 1957లో ప్రారంభించారు. ఇది ఆదాయం పన్నుకు అనుబంధమైనది. ఆదాయాన్ని నిర్వచించడం కన్నా వ్యయాన్ని నిర్ణయించడం సులభం. ఆడంబర వినియోగాన్ని అదుపు చేయడంకోసం దీనిని విధించడమైనది. ఈ పన్నును వ్యక్తులపైన, హిందూ అవిభక్త కుటుంబాలపై విధిస్తారు. వారు చేసే పెట్టుబడులు మినహాయించి కేవలం వినియోగపు వ్యయంపై మాత్రమే దీనిని విధిస్తారు. అయితే ఈ పన్ను వసూలులో ప్రభుత్వం వైఫల్యం చెందిన కారణంగా దీనిని రద్దు చేశారు. తిరిగి 1987 నవంబర్ నుంచి వ్యయంపై పన్ను ప్రారంభించబడింది. విలాసవంతమైన హోటళ్ళలో లభించే వసతులపైన ఆహారం, పానీయాలు ఇతర సేవలు మొదలగు వ్యయాలపైన 20 శాతం పన్ను విధిస్తారు. 1993-94 అంచనాల ప్రకారం వ్యయం పన్ను ద్వారా ప్రభుత్వానికి 150 కోట్ల రూపాయలుగా ఉంది.

## 14 పరోక్ష పన్నులు:

పరోక్ష పన్నులు 4 రకాలు. అవి

(ఎ) కేంద్ర ఎక్సైజ్ సుంకాలు

(బి) కష్టమ్స్ సుంకాలు

(సి) అమ్మకపు పన్ను

(డి) స్టేట్ ఎక్సైజ్ సుంకాలు.

వీటిలో మొదటి రెండింటిని కేంద్ర ప్రభుత్వం విధించి వసూలు చేస్తుంది. ఎక్సైజ్ సుంకంలో కొంత భాగాన్ని ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రాష్ట్రాలకు పంచిపెడుతుంది. అమ్మకపు పన్ను, స్టేట్ ఎక్సైజ్ సుంకాలను రాష్ట్ర ప్రభుత్వాలు విధించి వసూలు చేసుకొని అనుభవిస్తాయి.

(ఎ) కేంద్ర ఎక్సైజ్ సుంకాలు: స్వాతంత్ర్యానంతరం కేంద్రం అదనపు ఆదాయం కోసం ఎక్సైజ్ సుంకాన్ని విధించడం ప్రారంభించింది. దేశంలోపల తయారయ్యే వస్తువులపై మాత్రమే ఈ పన్ను విధిస్తారు. లిక్కరు, మందుల వంటి ఉత్పత్తులపై రాష్ట్ర ప్రభుత్వాలు సుంకాన్ని విధిస్తాయి. కాబట్టి వాటిని కేంద్ర ఎక్సైజ్ సుంకం నుండి మినహాయించారు. పంచదార, పత్తి, మిల్లు వస్త్రాల, పొగాకు, సిమెంటు, అగ్గిపెట్టెలు వంటి వస్తువుల ద్వారా ఎక్కువ ఎక్సైజ్ సుంకం లభిస్తుంది. ఈ మధ్యకాలంలో ఇంకా అనేక ఇతర వస్తువులపై ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 150 వస్తువులు ఎక్సైజ్ సుంకం పరిధిలో ఉన్నాయి. ఎక్సైజ్ సుంకాన్ని రెండు రకాలుగా విధిస్తారు.

(1) వస్తువు విలువనుబట్టి విలువలో కొంత భాగం పన్ను విధించడం

(2) విలువతో నిమిత్తం లేకుండా నిర్దిష్టమైన రేటు ప్రకారం పన్ను విధించడం.

పరిపాలనా సౌలభ్యం కోసం, పన్ను ఎగవేతను అరికట్టడానికి రెండవ పద్ధతినే ఎక్కువగా పాటిస్తున్నారు. దీని మూలంగా సంపన్న వర్గాలు వినియోగించే వస్తువులమీద పన్ను ఎక్కువగానూ, అల్ప ఆదాయ వర్గాలవారు వినియోగించే వస్తువుల మీద పన్ను తక్కువగానూ ఉంటుంది.

**కేంద్ర ఎక్సైజ్ సుంకం ద్వారా ఆదాయం**

| సంవత్సరం | | రాబడి (కోట్లలో) |
|---|---|---|
| 1950-51 | .. | 67.54 |
| 1960-61 | .. | 416.35 |
| 1970-71 | .. | 1758.60 |
| 1980-81 | .. | 6500.00 |
| 1989-90 | .. | 21910.00 |
| 1993-94 | .. | 35000.00 |
| 2003-04 | .. | 96780.00 (అంచనా) |

ఎక్సైజ్ సుంకం నుండి లభించే ఆదాయంలో కేంద్రం ఆర్థిక సంఘం సూచనల మేరకు కొంత భాగాన్ని రాష్ట్రాలకు కేటాయించాలి. 10వ ఆర్థిక సంఘం దానిని 47.5%గా నిర్ణయించింది. 11వ ఆర్థిక సంఘం ఈ అంశంపై నిర్దిష్టమైన ప్రతిపాదన ఏదీ చేయలేదు.

**(బి) కస్టమ్స్ సుంకాలు (ఎగుమతి, దిగుమతి సుంకాలు):** భారతదేశం నుండి ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే వస్తువులపై వేసే పన్ను, ఎగుమతి సుంకం, విదేశాలనుండి మన దేశానికి దిగుమతి అయే వస్తువులపై వేసే పన్ను దిగుమతి సుంకం, ఈ రెండింటిని కలిపి-'కస్టమ్స్ సుంకాలు' అంటారు. ప్రభుత్వ రాబడిని పెంపొందించుకోవడం కోసం ఎగుమతి మార్కెట్‌లలో పోటీని తట్టుకోవడం కోసం ఎగుమతి సుంకాన్ని విధించేవారు. అంతేగాక ఈ సుంకం ద్రవ్యోల్బణాన్ని నివారించడంలోనూ ధరలను స్థిరీకరించడంలోనూ ఉపయోగపడుతుందనే భావన ఉంది. ఏ వస్తువులు అమ్మకంలో భారతదేశానికి ఏకసామ్యం ఉందో వాటిపై మాత్రమే ఎగుమతి సుంకాన్ని పరిమితంగా విధించాలని ఫిస్కల్ కమీషన్ సూచించింది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని భారతీయ వస్తు ఉత్పత్తులు తట్టుకునే వీలు కల్పించడం కోసం ప్రభుత్వం ఎగుమతి సుంకాన్ని రద్దు చేసింది.

విదేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే సుంకాన్ని దిగుమతి సుంకం అంటారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరగడమేగాక దేశీయ పరిశ్రమలకు రక్షణకూడా లభిస్తుంది.

దిగుమతి సుంకం అన్ని వస్తువులపై ఒకే విధంగా ఉండదు. ఆహార ధాన్యాలవంటి నిత్యావసర వస్తువులపై దిగుమతి సుంకం లేకపోవడంగాని లేక తక్కువ శాతం ఉండడంగాని జరుగుతుంది. విలాసవస్తువులపై ఈ పన్ను ఎక్కువ శాతం ఉంటుంది. దిగుమతి సుంకాల కారణంగా విదేశీవస్తువుల ధరలు పెరుగుతాయి. స్వదేశీ మార్కెట్‌లో దేశీయ వస్తువుల అమ్మకాలు పెరుగుతాయి. దిగుమతి సుంకాలను బాగా తగ్గించాలని దానివల్ల దిగుమతులు అధికమైతే ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడానికి ఉపయోగపడుతుంది అని 'షా కమిటి' పేర్కొన్నది. మన ఆర్థిక వ్యవస్థలో కస్టమ్స్ సుంకాలు అధిక ప్రాధాన్యత వహిస్తాయి. 1980-81లో కేంద్రానికి కస్టమ్స్ సుంకాల ద్వారా 3410 కోట్ల రూపాయల ఆదాయం చేకూరింది.

2003-04 బడ్జెట్ అంచనాల ప్రకారం ఇది 49350 కోట్ల రూపాయలకు పెరుగుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి సంవత్సరాలలో ఎక్సైజ్ సుంకానికి ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. గత కొద్ది సంవత్సరాలుగా భారత ప్రభుత్వం దిగుమతి సుంకాలను క్రమక్రమంగా తగ్గిస్తూ క్రమబద్ధీకరించింది. అయినప్పటికీ భారతదేశ పన్నుల వ్యవస్థలో మూడవ అతి పెద్ద ఆదాయ వనరుగా కస్టమ్స్ సుంకం ఉంది.

## 7.15. రాష్ట్ర ప్రభుత్వ పన్నులు:

భారత దేశం ఒక సమాఖ్య దేశం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగబద్ధమైన అధికారాలు విభజన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వాలకు స్వతంత్ర ప్రతిపత్తి లభించింది. అయితే అవి తమ వనరుల కోసం కేంద్రం మీద ఎక్కువగా ఆధారపడితే స్వయంప్రతిపత్తిని కోల్పోయే ప్రమాదం ఉన్నది. అందుకోసమే భారత రాజ్యాంగం రాష్ట్రాలకు కొన్ని పన్నులను విధించి, వసూలు చేసుకొని, అనుభవించే అవకాశాన్ని ఇచ్చింది. ఆ ఆదాయ మార్గాలు (1)భూమి శిస్తు, (2) వ్యవసాయ ఆదాయంపై పన్నులు, (3) మద్యపానంపై, మత్తు పదార్థాలపై పన్నులు, (4) వార్తా పత్రికకు మినహా మిగతా వస్తువుల అమ్మకము కొనుగోలులపై పన్ను, (5) మోటారు వాహనాలపై పన్ను, (6) విద్యుత్‌ఛక్తి అమ్మకం, వినియోగంపై పన్ను, (7) విలాసవస్తువులు వినోదాలపై పన్ను.

ఈ పన్నుల ద్వారానేగాక రాష్ట్రాలకు ఇతరత్రా కూడా ఆదాయం లభిస్తుంది. అవి: కేంద్ర ప్రభుత్వ పన్నుల ఆదాయం నుండి వాటా, కేంద్రం నుండి అందే గ్రాంటులు మరియు పన్నేతర ఆదాయాలు.

రాష్ట్రప్రభుత్వాల ఆదాయాలు గణ[illegible]ంగా పెరుగుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం

| సంవత్సరం | | ఆదాయం కోట్ల రూపాయలలో |
|---|---|---|
| 1950-51 | .. | 396 |
| 1971-72 | .. | 3,505 |
| 1980-81 | .. | 15,640 |
| 1985-86 | .. | 32,199 |
| 1990-91 | .. | 91,160 |
| 2002-03 | .. | 4,25,755 |

భూమి శిస్తు: మన దేశంలో ప్రాచీన కాలం నుండి భూమిశిస్తు విధించే పద్ధతి ఉన్నది. ఆయా రాజుల పాలనా కాలంలో పంట దిగుబడిలో కొంత భాగాన్ని భూమిశిస్తుగా నిర్ణయించేవారు. 1793లో కారన్‌వాలీస్ శాశ్వత శిస్తు పద్ధతిని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం శిస్తు వసూలుచేసే అధికారం జమిందారులకు లభించింది. స్వాతంత్ర్యానంతరం ఈ జమిందారీ పద్ధతి రద్దై ప్రభుత్వమే నేరుగా భూమి శిస్తును వసూలు చేస్తుంది.

భూమి శిస్తును నిర్ణయించడానికి భూసారాన్ని భూముల స్వభావాన్ని బట్టి భూములను అనేక రకాలుగా విభజించారు. అవి (ఎ) శ్రేష్ఠమైనది, (బి) మంచిది, (సి) సాధారణమైనది, (డి) తక్కువ రకమైనది, (ఇ) నాసి రకమైనది. ప్రారంభంలో కొంతకాలం రాష్ట్రప్రభుత్వ ఆదాయంలో భూమిశిస్తు ప్రధానపాత్ర వహించింది. అయితే ప్రస్తుతం ఆ స్థితి లేదు. భూమి శిస్తును నిర్ణయించడానికి ప్రాతిపదికలు, రేట్లు రాష్ట్రానికి, రాష్ట్రానికి మారుతుంటాయి. భూమి శిస్తును సాధారణంగా 3 అంశాల ఆధారంగా నిర్ణయిస్తారు.

(ఎ) భూమి నికర విలువ (బి) దిగుబడి విలువ (సి) స్థూల దిగుబడి

భూమి శిస్తు రేటు నికర ఉత్పత్తిలో 25.50 శాతంగా ఉంటుంది.

భూమిశిస్తును పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా రాబడి ఆశించినంతగా పెరుగుట లేదు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా అనేక సంవత్సరాల పాటు భూమిశిస్తును రద్దు చేయవలసి వస్తుంది. శిస్తు రేటు పురోగామి స్వభావం కలది కాదు. దీని మూలంగా చిన్న, సన్నకారు రైతులపై అధిక భారం పడుతుంది. అందుచేత భూమిశిస్తులో పురోగామి పన్నును ప్రవేశపెట్టాలని, వ్యవసాయ రంగంపై అదనపు పన్ను విధించాలని ప్రణాళికాసంఘం సలహా ఇచ్చింది. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలు భూమిశిస్తును పెంచాయి. కాని వ్యవసాయేతర రంగంతో పోల్చుకుంటే వ్యవసాయ రంగం నుంచి పన్నుల ద్వారా అధిక మొత్తాన్ని రాబట్టడానికి కె.ఎన్.రాజ్ కొన్ని సిఫార్సులు చేసింది. అవి

1) వ్యవసాయంపై పురోగామి పన్నును విధించడం

2) వ్యవసాయ అనుబంధ రంగాలపై కూడా పన్ను విధించాలి, ఉదా: పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం.

3) వ్యవసాయ ఆస్థిపై పన్ను విధించాలి.

4) వ్యవసాయ భూములు క్రయ విక్రయాల మూలంగా ఏర్పడే మూలధన లాభాలపై పన్ను విధించాలి.

భూమి శిస్తు ద్వారా మన రాష్ట్రానికి రాబడి

| సంవత్సరం | | రాబడి కోట్ల రూపాయలలో |
|---|---|---|
| 1951-52 | .. | 48.00 |
| 1960-61 | .. | 97.20 |
| 1970-71 | .. | 112.06 |
| 1980-81 | .. | 156.05 |
| 1988-89 | .. | 520.05 |
| 1992-93 | .. | 670.00 |

**వ్యవసాయ ఆదాయంపై పన్ను:** భారత రాజ్యాంగము ప్రకారం వ్యవసాయ ఆదాయంపై పన్ను విధించే అధికారము రాష్ట్రాలకు మాత్రమే ఉంది. వ్యవసాయ ఆదాయంపై పన్ను విధించడంలో పరిపాలనా సంబంధమైన, భావనా పరమైన ఇబ్బందులున్నాయి.

ఈ పన్నును మొదటగా విధించినది బీహార్ రాష్ట్రం. ప్రస్తుతం అస్సాం, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో వ్యవసాయ పన్ను విధానం ఉంది. అయితే కేంద్రం విధించే ఆదాయం పన్ను కన్నా వ్యవసాయ ఆదాయ పన్ను రేటు తక్కువ. 1997-98లో వివిధ రాష్ట్రాల పన్ను రాబడిలో వ్యవసాయ ఆదాయ పన్ను శాతం 0.1 మాత్రమే.

**అమ్మకం పన్ను:** ఈ పన్ను కొత్తదేమి కాదు. మొట్టమొదట అమ్మకం పన్నును 1916లో జర్మనీలో ప్రవేశ పెట్టారు. మన దేశంలో అన్ని రాష్ట్రాలలో అమ్మకం పన్ను ఉంది. రాష్ట్ర ఆదాయ వనరులలో దీనిదే ప్రథమ స్థానం. వార్తా పత్రికలు మినహా మిగిలిన అన్ని వస్తువులు అమ్మకాలు, కొనుగోళ్లపై రాష్ట్రాలు ఈ పన్ను విధించవచ్చు. అమ్మకపు పన్నును వివిధ రకాలుగా విధించవచ్చు.

- **సాధారణ అమ్మకపు పన్ను:** అనగా అన్ని వస్తువుల అమ్మకాలపై విధించే పన్ను.
- **నిర్ణయించిన వస్తువులపై పన్ను:** విలాస వస్తువులు, మత్తు పానీయాల వంటి వాటి వాడకాన్ని అరికట్టే ఉద్దేశంతో విధించే పన్ను.
- **అమ్మకం పన్ను లేదా టర్నోవర్ పన్ను:** మొత్తం అమ్మకాలు, సేవలపై విధించే పన్నును టర్నోవర్ పన్ను అంటారు.

- టోకు వర్తకులు, చిల్లర వర్తకుల అమ్మకాలపై పన్ను: ఉత్పత్తి దారుల వద్దకాని టోకు, చిల్లర వర్తకుల అమ్మకాలపై గాని విధించబడే పన్ను.
- ఏకస్థాన, బహుళ స్థానాల అమ్మకం పన్ను: వస్తువు ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారునకు చేరేలోపల వివిధ దశలకు కలిపి ఒకసారి పన్ను విధిస్తే, అది ఏకస్థాన అమ్మకపు పన్ను. దీనిలో పన్ను రేటు ఎక్కువ స్థాయిలో ఉంటుంది. ప్రతి స్థాయిలోను విధించబడే పన్ను బహుళ స్థానాల అమ్మకపు పన్ను, దీనిలో పన్ను రేటు తక్కువ. కాని పన్ను భారం పెరుగుతుంటుంది.
- విలువ పెరుగుదలపై పన్ను: వస్తువుయొక్క విలువ పెరిగే ప్రతి దశలోను ఆ పెరిగిన విలువ ఆధారంగా పన్ను అంటారు. దీనిని 2005 సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి చాలా రాష్ట్రాలు అమలులోకి తీసుకొచ్చాయి.
- వాడకంపై పన్ను: ఒక రాష్ట్రంలో ఒక వస్తువుపై అమ్మకం పన్ను చెల్లించి, ఆ వస్తువును మరొక రాష్ట్రానికి తీసుకెళ్లినప్పుడు ఆ రాష్ట్రంలో విధించే పన్నును వాడకంపై పన్ను అంటారు.

**అమ్మకం పన్ను రాబడి:** అమ్మకం పన్ను రేటు అన్ని రాష్ట్రాలలో అన్ని వస్తువులపై ఒకే విధంగా లేదు. పన్ను రేటు ఒక శాతం కంటే తక్కువ నుంచి 14 శాతం కంటే ఎక్కువగా ఉంది. 1951 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ఆదాయ వనరులలో అతి పెద్ద వనరు అమ్మకం పన్ను.

అమ్మకం పన్ను రాబడి

| సంవత్సరం | | రాబడి కోట్ల రూపాయలలో | |
|---|---|---|---|
| 1951-52 | .. | 59 | |
| 1960-61 | .. | 120 | |
| 1971-72 | .. | 5,61.6 | |
| 1980-81 | .. | 3,890 | |
| 1988-89 | .. | 1,19,98.4 | |
| 2002-03 | .. | 93,070 | (బడ్జెట్ అంచనా) |

అమ్మకం పన్ను వసూలు చేయడానికి ఎక్కువ వ్యయం కాదు. పైగా వస్తువు ధరలో పన్ను కలిపి ఉండటంవల్ల ప్రజలకు భారం అనిపించదు. అన్ని ఆదాయ వర్గాలపై భారం సమానంగా పడుతుంది. దీని మూలంగా పేద ప్రజల పని సామర్థ్యం దెబ్బ తింటుంది.

వివిధ రాష్ట్రాల మధ్య అమ్మకం పన్ను రేట్లలో వ్యత్యాసం ఉండటం ఇబ్బందికరంగా ఉన్నది. వ్యాపారస్థులు సరైన బిల్లులు లేకుండా వస్తువుల కొనుగోళ్ళు, అమ్మకం జరపడం ద్వారా పన్ను ఎగవేస్తున్నారు. ఈ లోపాలను సరిదిద్దడానికి కేంద్రం అమ్మకపు స్థానంలో విలువ ఆధారిత పన్ను ప్రవేశ పెట్టింది.

## 7.17. విలువ ఆధారిత పన్ను (VAT) :

అమ్మకపు పన్ను స్థానంలో కేంద్రం విలువ ఆధారిత పన్నును ప్రతిపాదించింది. మార్చి 2001 నాటికి ఈ పన్నును ప్రవేశ పెట్టాలని తీసుకున్న నిర్ణయం అమలు కాలేదు. చివరకు ఎనిమిది రాష్ట్రాలు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు అంగీకరించడంతో విలువ ఆధారిత పన్నును 2005 ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభించారు.

దీని ప్రకారం వస్తువు యొక్క విలువ పెరిగిన ప్రతి దశలోనూ ఆ పెరిగిన విలువపై పన్ను విధిస్తారు. ఈ పన్ను విధించడం మూలంగా రాష్ట్రాలు ఎదుర్కొనే అమ్మకం పన్ను లోటును కేంద్రం భర్తీ చేస్తుంది. మొదటి సంవత్సరం

వందశాతం నష్టాన్ని రెండవ సంవత్సరం 75 శాతం నష్టాన్ని, మూడో సంవత్సరం 50 శాతం నష్టాన్ని కేంద్రం భర్తీ చేస్తుంది. దీనివల్ల అన్ని రాష్ట్రాలలోనూ వస్తువులపై, ఒకే పన్ను రేటు ఉంటుంది. అంతేగాక వినియోగదారునిపై పన్ను భారం తగ్గుతుంది.

## 7.18. రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు:

రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్ని వస్తువులపై ఎక్సైజ్ సుంకాన్ని విధించే అధికారం ఉన్నది. సాధారణంగా ఎక్సైజ్ సుంకాన్ని హానికరమైన వస్తువుల యొక్క వినియోగాన్ని తగ్గించుట కొరకు విధిస్తారు. ఉదా: బీరు, నల్లమందు, కల్లు, సారాయి తదితర మత్తు పానీయాలు. రాష్ట్రాలలో తయారయ్యే వస్తువులపైన లేక ఇతర రాష్ట్రాలలో తయారై ఆ రాష్ట్రాలలోకి వచ్చే వస్తువులపైన ఈ పన్నును విధిస్తారు.

మత్తు పదార్థాలపై ఎక్సైజ్ సుంకం అత్యధిక శాతంగా ఉంటుంది. దీని నుండి వచ్చే రాబడి గణనీయంగా ఉండడం వల్ల చాలా రాష్ట్రాలు మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసినాయి.

| సంవత్సరం | | రాబడి కోట్ల రూపాయలలో | |
|---|---|---|---|
| 1950-51 | .. | 44.41 | |
| 1960-61 | .. | 53.10 | |
| 1970-71 | .. | 139.09 | |
| 1980-81 | .. | 824.08 | |
| 1992-93 | .. | 6,050.00 | |
| 2000-01 | .. | 16,040.00 | |
| 2002-03 | .. | 20,220.00 | (బడ్జెట్ అంచనా) |

**అదనపు ఎక్సైజ్ సుంకము:** పంచదార, పొగాకు, మిల్లు వస్త్రాల వంటి వస్తువులపై కేంద్రం అదనపు సుంకాన్ని విధిస్తుంది. అందుచేత వీటిపై రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మకపు పన్నును విధించవు. అయితే ఈ పన్ను రాబడిలో కేంద్రం రాష్ట్రాలకు కొంత శాతాన్ని కేటాయిస్తుంది. ఈ పన్ను శాతం 20 - 45కు పెరిగింది. 1999-2000 సంవత్సరంలో కేంద్ర ఎక్సైజ్ సుంకంలో రాష్ట్రాల వాటా రూ.26,960 కోట్లు. అయితే 11వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం ఈ సుంకంలో రాష్ట్రాలకు వాటా ఉండదు. దాని బదులు కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మొత్తం పన్ను రాబడిలో 29.5 శాతం రాష్ట్రాలకు లభిస్తుంది.

## 7.19. వినోదపు పన్ను:

వినోదపు పన్ను వ్యయం పై వేసే పరోక్ష పన్ను. ఇది తిరోగామి స్వభావం కలది. అయితే వినోదం విలాసం దీని మీద పన్ను విధిస్తున్నారు. అన్ని రాష్ట్రాలలోనూ వినోదపు పన్ను అమలులో ఉంది.

ప్రజలు వినోదాన్ని తిలకించడానికి చెల్లించే ధరనుబట్టి పన్ను నిర్ణయించబడుతుంది. సినిమా హాళ్లు, సర్కస్ కంపెనీలు, ప్రవేశ రుసుంతోపాటు వినోదపు పన్నును కూడా వసూలు చేస్తాయి. కొన్ని ప్రత్యేకమైన వినోద కార్యకలాపాలపై వినోదపు పన్ను మినహాయింపు ఇవ్వవచ్చును. వినోదపుపన్ను నుండి వచ్చిన ఆదాయంలో రాష్ట్రాలు కొంత భాగాన్ని స్థానిక సంస్థలకు కేటాయిస్తాయి. ప్రజలలో సినిమా, టి.వి. ప్రసారాలపై మోజు పెరుగుతుండటంతో వినోదపుపన్ను వల్ల వచ్చే రాబడికూడా పెరుగుతుంది.

| సంవత్సరం | | రాబడి కోట్ల రూపాయలలో |
|---|---|---|
| 1950-51 | .. | 6.0 |
| 1960-61 | .. | 13.1 |
| 1985-86 | .. | 430.0 |
| 1990-91 | .. | |
| 2000-01 | .. | |

## 7.20. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌లు:

భారత రాజ్యాంగం ప్రకారం హుండీలు, డిబెంచర్లు మొదలైన వాటిపై స్టాంపు డ్యూటీలను కేంద్రం విధిస్తుంది. అయితే రాష్ట్రాలు వాటిని వసూలు చేసి అనుభవిస్తాయి. మిగిలిన వివిధ రకాల డాక్యుమెంట్‌లపై స్టాంపు డ్యూటీ విధించే అధికారం రాష్ట్రాలది. స్టాంపులు 2 రకాలు. 1) జుడీషియల్ స్టాంపులు, 2) నాన్ జుడీషియల్ స్టాంపులు. ఆస్తుల యాజమాన్యపు బదిలీలు, భాగస్వామ్య ఒప్పందాలపై విధించే రిజిస్ట్రేషన్ పన్నులను నాన్‌జుడీషియల్ స్టాంప్స్ ంటారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఆస్తి విలువను బట్టి నిర్ణయించబడతాయి.

రిజిస్ట్రేషన్ ద్వారా రాబడి

| సంవత్సరం | | రాబడి రూ. కోట్లు |
|---|---|---|
| 1950 - 51 | .. | 16.0 |
| 1960 - 61 | .. | 43.3 |
| 1970 - 71 | .. | 121.8 |
| 1980 - 81 | .. | 426.9 |
| 1992 - 93 | ... | 2960.0 |
| 2001 - 02 | .. | ----- |

## 7.21. పందాలపై పన్ను:

గుఱ్ఱపు పందాలు మొదలైనవాటిపై రాష్ట్రాలు పన్నులు విధిస్తాయి. కొన్ని రాష్ట్రాలలో గుఱ్ఱపు పందాలలోకి ప్రవేశ రుసుముపై పన్ను విధిస్తారు. కొన్ని రాష్ట్రాలలో పందెం గెలిచినవారికి చెల్లించే డబ్బుపై పన్ను విధిస్తారు. దీనివల్ల వచ్చే ఆదాయం నామమాత్రమైనది.

విద్యుత్‌చ్ఛక్తి సుంకం: రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ వినియోగదారుల నుండి సుంకం వసూలు చేస్తాయి. గృహసంబంధమైన వినియోగం, పారిశ్రామిక రంగ వినియోగం, వ్యవసాయ రంగ వినియోగాలపై విద్యుత్‌చ్ఛక్తి సుంకం వేరువేరుగా ఉంటుంది. కొన్ని రాష్ట్రాల వ్యవసాయదారుల విద్యుత్ వినియోగంపై సుంకాన్ని రద్దు చేశాయి. ఇటీవలి కాలంలో విద్యుత్ వినియోగం ఎక్కువ కావడంతో దాని నుండి ప్రభుత్వానికి రాబడి కూడా పెరుగుతోంది.

విద్యుత్ పన్ను ద్వారా ప్రభుత్వ రాబడి

| సంవత్సరం | | రాబడి కోట్ల రూపాయలలో |
|---|---|---|
| 1950-51 | .. | 1.96 |
| 1970-71 | .. | 69.8 |
| 1989-90 | .. | 90.0 |
| 2001-02 | .. | ---- |

## 7.23. పట్టణ ఆస్తులపై పన్ను:

పట్టణాలు, నగరాలలోని భవనాలు, నివేశన స్థలాలపై స్థానిక సంస్థలు పన్ను వసూలు చేస్తాయి. అందులో సేకరణ ఖర్చులు మినహాయించి మిగిలిన ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేస్తాయి. కొన్ని ప్రాంతాలలో భవన వైశాల్యంపై, కొన్ని ప్రాంతాలలో భవనాల నుండి భాటకం రూపంలో వచ్చే ఆదాయంపై ఈ పన్ను విధిస్తారు.

## 7.24. అభివృద్ధి పన్ను:

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాల నిమిత్తం చేపట్టే పథకాలపై లబ్ధిదారుల నుండి పన్ను వసూలు చేస్తాయి. ఉదా: నీటిపారుదల పథకాలు, బహుళార్థకసాగర్ ప్రాజెక్టుల నిర్మాణం, వంతెనల నిర్మాణం, రహదారుల అభివృద్ధి. ఈ పన్ను వసూలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా పథకాల వ్యయంలో కొంత శాతాన్ని రాబట్టుకోగలుగుతాయి.

## 7.25. స్థానిక సంస్థల పన్నులు:

మన దేశంలో మూడు అంచెల గ్రామీణ స్థానిక సంస్థల వ్యవస్థ ఉన్నది. వాటన్నిటిని కలిపి పంచాయితీ వ్యవస్థ అంటున్నాము. అవి (1) గ్రామ పంచాయితి, (2) మండల పరిషత్, (3) జిల్లా పరిషత్. ఇవికాక పట్టణ ప్రాంతాలలో మూడు రకాలైన స్థానిక సంస్థలున్నాయి. అవి (1) కార్పొరేషన్లు, (2) మున్సిపాలిటీలు, (3) కంటోన్మెంట్ బోర్డులు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్థానిక సంస్థల నిర్మాణం అన్ని రాష్ట్రాలలోనూ ఒకే విధంగా లేదు. అంతేగాక స్థానిక సంస్థలు బలోపేతం కావడానికి అవసరమైన స్వతంత్ర ఆదాయ వనరులు కూడా లేవు. ఈ లోపాలను సరిదిద్దే ఉద్దేశ్యంతో పార్లమెంటు 1992లో 1973-74 రాజ్యాంగ సవరణలు చేసింది. ఈ రాజ్యాంగ సవరణలు స్థానిక సంస్థలు వ్యవస్థాగత నిర్మాణంలోనేగాక వాటి ఆర్థిక వనరుల అంశంలో కూడా మౌలికమైన మార్పులు తీసుకు వచ్చాయి. అవి తమ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన స్వతంత్ర ఆర్థిక వనరులను కేటాయించాయి. రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక సంస్థలకు మధ్య ఉండే ఆర్థిక సంబంధాలను పర్యవేక్షించడానికి, స్థానిక సంస్థల ఆదాయ వనరులను మెరుగుపర్చడానికి రాష్ట్ర స్థాయిలో ఆర్థిక సంఘాల నియామకం చేయాలని ఈ బిల్లులు సూచించాయి.

స్థానిక సంస్థలకు వచ్చే ఆదాయ వనరులను ప్రధానంగా 4 భాగాలుగా విభజింపవచ్చును. అవి (1) ఈ సంస్థలు విధించే పన్నులు, (2) రాష్ట్ర ప్రభుత్వ పన్నులలో వాటాలు, (3) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లు, (4) పన్నేతర ఆదాయాలు.

**(1) స్థానిక సంస్థలు విధించే పన్నులు:** కొన్ని రకాల పన్నులను స్థానిక సంస్థలే విధించి వసూలు చేసుకుంటాయి. ఇవి అన్ని రాష్ట్రాలలోను ఒకే విధంగా లేవు. కొన్ని రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారానికి అనుగుణంగానే పన్ను రేట్ల విధింపు ఉంటుంది. సాధారణంగా స్థానిక సంస్థలు క్రింది రకాల పన్నుల నుంచి నేరుగా ఆదాయాన్ని పొందుతాయి.

(ఎ) భూమిమీద భవనాల మీద పన్ను

(బి) వాహనాల మీద పన్ను

(సి) వస్తువులపై పడవలపై పన్ను

(డి) లే అవుట్ పన్ను

(ఇ) వాహనాలపై పన్ను

(ఎఫ్) వినోదాలపై పన్ను

(జి) ప్రకటనలపై పన్ను

(హెచ్) ఆక్ట్రాయ్ పన్ను

(ఐ) ప్రయాణీకులపైన, సరుకులపై పన్ను

(జె) వృత్తి పన్ను

(కె) లైసెన్స్ ఫీజులు, జరిమానాలు

**(2) రాష్ట్ర ప్రభుత్వ పన్నులలో వాటాలు:** రాష్ట్ర ప్రభుత్వాలు విధించి వసూలు చేసే పన్నులలో కొంత ఆదాయం స్థానిక సంస్థలకు లభిస్తుంది. ఉదాహరణకు భూమి పన్ను, స్టాంపు డ్యూటీపై సర్‌ఛార్జి, భూమి సెస్సు, వినోదపు పన్ను మొదలైనవి.

**(3) గ్రాంట్లు:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా స్థానిక సంస్థలకు వివిధ అభివృద్ధి కార్యకలాపాల కోసం గ్రాంట్లు లభిస్తాయి. అవి (1) మంచి నీటి పథకాలకు, మురికి నీటి పథకాలకు అవసరమైన మూల ధనం, (2) ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల నిర్వహణ, (3) ఆరోగ్య పథకాల నిర్వహణ, (4) ఆరోగ్య సంస్థలు, స్త్రీ శిశు సంక్షేమ పథకాల నిర్వహణ మొదలైనవి.

**(4) పన్నేతర ఆదాయాలు:** పైన పేర్కొన్న మూడు రకాలైన వనరులేకాక స్థానిక సంస్థలు ఫీజులు అపరాధ రుసుములు వంటి పన్నేతర వనరుల నుండి కూడా ఆదాయాలు పొందుతాయి.

## 7.26. స్థానిక సంస్థలు విధించే కొన్ని ప్రధానమైన పన్నులు:

**(ఎ) భూములు భవనాలపై విధించే పన్నులు :** స్థానిక సంస్థల భూములు భవనాలపై పన్నులు విధిస్తాయి. ఆస్తి విలువ ఆధారంగా గాని లేక ఆస్తి వల్ల వచ్చే సాంవత్సరిక ఆదాయాన్నిబట్టిగాని ఈ పన్నును విధిస్తారు. ఈ పన్నులో భాగంగా కొన్ని అభివృద్ధి కార్యకలాపాలకోసం సెస్సులను కూడా విధిస్తారు. ఉదాహరణకు లైబ్రరీ సెస్సు, విద్యా సెస్సు, వైద్య సెస్సు. ఈ పన్ను రేట్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

**(బి) భూమి సెస్సు, ఆక్ట్రాయ్ మరియు టెర్మినల్ టాక్సులు :** ఈ సెస్సులను రాష్ట్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి ఆదాయాన్ని స్థానిక సంస్థలకు బదిలీ చేస్తాయి. కొన్ని రాష్ట్రాలలో ఆయా స్థానిక సంస్థలే సెస్సును విధించి వసూలు చేసుకుంటున్నాయి.

ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వినియోగంకోసం గాని, అమ్మకం కోసంగాని ప్రవేశించే వస్తువులపై విధించే పన్నును ఆక్ట్రాయ్ పన్ను అంటారు. దీనిని వస్తువులపై మాత్రమే విధిస్తారు. ఏదైనా ఒక ప్రాంతంలోకి ప్రవేశించే ప్రయాణీకులపై గాని లేక ఆప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకులపై గాని విధించే పన్నును టెర్మినల్ టాక్సు అంటారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లతోపాటు పంచాయితీలు కూడా ఈ పన్నును వసూలు చేస్తున్నాయి.

**(సి) అభివృద్ధి పన్ను :** స్థానిక సంస్థలు అమలు పరిచే వివిధ అభివృద్ధి పథకాల కారణంగా ఆయా ప్రాంతాలలో నివేశన స్థలాలకు విలువ పెరిగి వాటి సొంతదారులకు లాభం చేకూరుతుంది. ఈ కారణంగా స్థానిక సంస్థలు లబ్దిదారుల నుంచి పథకాల అమలుకై వసూలు చేసే పన్నును అభివృద్ధి పన్ను అంటారు.

**(డి) వృత్తి పన్ను :** వృత్తి పన్నును రాష్ట్ర ప్రభుత్వాలు విధించి వసూలు చేస్తాయి. కొన్ని రాష్ట్రాలలో వృత్తి పన్ను రేటు పురోగామి పద్ధతిలో ఉండగా మరికొన్ని రాష్ట్రాలలో ఒకే రేటు పద్ధతి ఉన్నది. వృత్తి పన్ను గరిష్ట పరిమితిని 250 రూపాయల నుంచి 2500 రూపాయలకు పెంచుతూ కేంద్రం శాసనం చేసింది. అయితే ఆ గరిష్ట పరిమితికి లోబడి ఎంత పన్ను వసూలు చేయాలో నిర్ణయించుకొనే అధికారం రాష్ట్రానిదే. ఈ వృత్తి పన్నులో స్థానిక సంస్థలకు వాటా ఉంది.

**(ఇ) వాహనాలు, పడవలు, పశువులపై పన్ను :** మోటారు వాహనాలు మినహా ఇతర వాహనాలపై పన్ను విధించే అధికారం స్థానిక సంస్థలకున్నది. అయితే వీటి ద్వారా వచ్చే ఆదాయం నామమాత్రమే.

**(ఎఫ్) టోల్ టాక్సు, ప్రకటనలపై పన్ను :** స్థానిక సంస్థలు రోడ్లు, వంతెనలువంటి వాటిని నిర్మించినప్పుడు వాటి నిర్మాణపు ఖర్చును లబ్దిదారుల నుంచి పొందడానికి విధించే పన్నును టోల్ టాక్సు అంటారు. అదే విధంగా వార్తా పత్రికలు మినహా మిగిలిన వాణిజ్య ప్రకటనలపై కూడా స్థానిక సంస్థలు పన్నులు వసూలు చేస్తున్నాయి.

## 7.27. పన్నుల గురించి కేంద్ర ప్రభుత్వం నియమించిన వివిధ కమిటీల సిఫార్సులు:

**కె.ఎన్.రాజ్ కమిటి :** కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఆదాయం సంపదలకు సంబంధించిన పన్ను విధింపును పరిశీలించడానికి **కె.ఎన్.రాజ్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది.** ఈ కమిటీ 1972 అక్టోబర్‌లో ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో క్రింది సిఫార్సులు చేసింది. (1) పన్ను విధించేటప్పుడు ప్రభుత్వం భూమి ఉత్పాదకతలో తేడాలను ఆయా ప్రాంతాలలో పండించే పంటలను పరిగణనలోనికి తీసుకోవాలి. పన్నులు ఉత్పాదకతను పెంచడానికి తోడ్పడేటట్లు ఉండాలి. (2) పన్ను రేటు విషయంలో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం మరీ ఎక్కువ కాకుండా సారూప్యతను కల్గి ఉండాలి. (3) ఈ కమిటీ భూమి యాజమాన్యంపై పన్నును విధించాలని సిఫారసు చేసింది. దానికి సంబంధించి

(ఎ) దేశంలోని భూములన్నీ ప్రాంతాలుగా, జిల్లాలుగా విభజించాలి.

(బి) గడిచిన 10 సంవత్సరాల ఉత్పాదకతను, గడిచిన మూడు సంవత్సరాల పంటల సగటు ధరలను పరిగణనలోనికి తీసుకొని ఉత్పత్తి విలువను ద్రవ్య రూపంలో నిర్ణయించాలి.

(సి) ఈ విధంగా నిర్ణయించిన విలువ నుంచి వ్యవసాయ ఖర్చులు తీసివేయగా వచ్చే నికర ఉత్పత్తినిబట్టి భూమి విలువను నిర్ణయించాలి.

(డి) ఏ సంవత్సరంలోనైనా ప్రస్తుత సంవత్సర ఉత్పత్తి గడచిన 10 సంవత్సరాల ఉత్పత్తిలో సగంకన్నా తక్కువైతే ఆ భూమి విలువ '0' గా పరిగణించాలి.

(ఇ) దేశం మొత్తానికి ఒకే రకమైన పద్ధతి ఏర్పాటు చేయాలని దాని అమలును పర్యవేక్షించడానికి కమిటీలను ఏర్పాటు చేయాలి.

**కె.ఎన్. వాంఛూ కమిటి:** ప్రత్యక్ష పన్నుల వ్యవస్థలోగల పరిపాలనా సంబంధమైన అంశాలను పరిశీలించి పన్ను ఎగవేతను అరికట్టడానికి అవసరమైన సూచనలివ్వడం కోసం భారత ప్రభుత్వం 1970లో కె.ఎన్.వాంఛూ కమిటీని నియమించింది. ఈ కమిటి 1971లో క్రింద సిఫార్సులను చేసింది.

(1) దేశంలో నల్లధనం పరిమాణం పెరిగిపోవడానికి ప్రత్యక్ష పన్నుల రేట్లు అధికంగా ఉండటం, లైసెన్స్‌లు కంట్రోళ్లపై ప్రభుత్వానికి తగిన సామర్థ్యం లేకపోవడం, రాజకీయ పార్టీల జోక్యం, కారణాలను ఈ కమిటి పేర్కొంది.

(2) స్వచ్ఛందంగా వ్యక్తులే తెలిపే పద్ధతి వల్ల లాభం లేదు. పన్ను కట్టనివారు తమపై చర్య తీసుకోవడానికి పూర్వం ఏ దశలోనైనా పన్ను చెల్లించే అవకాశం కల్పించాలి.

(3) వ్యక్తులకు ఆదాయపు పన్ను శాఖకు వచ్చే వివాదాలను స్వతంత్రంగా పరిష్కరించడానికి ఒక ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి.

(4) బేరర్ బాండు స్కీం ద్వారా దీర్ఘకాలిక బాండ్లను ప్రభుత్వం ప్రవేశ పెట్టాలి. దీని మూలంగా ప్రభుత్వానికి దీర్ఘకాలిక పథకాలకు పెట్టుబడి లభిస్తుంది. అంతేకాక ప్రజలు నల్ల ధనాన్ని ఈ పథకం ద్వారా పొదుపు చేస్తారు.

(5) వ్యక్తుల ఇండ్లను సోదా చేయడానికి ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన అధికారాలను ఆదాయపు శాఖకు ఇవ్వాలి.

(6) పన్ను రేటు ఎక్కువగా ఉండటం పన్ను ఎగవేతకు దారి తీస్తుందని, ఉత్పాదకతను తగ్గిస్తుందని అందచేత పన్ను రేటు తగ్గించాలని సూచించింది.

(7) అనవసరమైన కంట్రోళ్ళను రద్దు చేయడం ద్వారా పన్నుల ఎగవేతను అరికట్ట వచ్చును.

(8) పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

(9) వ్యయంపై పన్నును తిరిగి విధించాలి.

(10) వాణిజ్య సంస్థలు రాజకీయ పార్టీలకిచ్చే విరాళాలు 10 వేల రూపాయలకు గాని, ఆదాయంలో 10 శాతానికి గాని మించరాదు.

(11) ఆదాయపు పన్ను పరిధి విస్తరించాలి.

ఎల్.కె.ఝా కమిటి సిఫార్సులు: ఆర్థిక వ్యవస్థలో పరోక్ష పన్నుల ప్రాధాన్యతలకు సంబంధించిన అంశాలను పరిశీలించడానికి కేంద్రం 1976లో ఎల్.కె.ఝా అధ్యక్షుడుగా ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది.

సూచనలు: ఈ కమిటీ పన్నుల వ్యవస్థ హేతుబద్ధంగా లేదని ప్రత్యక్ష పరోక్ష పన్నుల మధ్య సమన్వయం లేదని రాష్ట్రాల మధ్య పన్ను భారం సమానంగా పంపిణీ కాలేదని భావించి క్రింది సూచనలు చేసింది.

(1) పన్ను విధింపు విధానాన్ని ఆధునీకరించి పురోగామిత్వాన్ని ప్రవేశ పెట్టాలి.

(2) ఉత్పాదక వ్యయాలు తగ్గించడానికి ఎక్సైజు సుంకాలలో పన్ను రేట్లు తగ్గించాలి.

(3) ఉత్పత్తిదారుని వద్దనే విలువ ఆధారిత పన్నును ప్రవేశ పెట్టాలి.

(4) యంత్ర పరికరాలు, ముడి పదార్థాల దిగుమతులపై పన్ను రేటు తగ్గించాలి.

(5) దిగుమతి పన్ను రేటు తగ్గించడం ద్వారా పరిశ్రమలకు రక్షణ కల్పించాలి.

(6) అమ్మకం పన్ను ఉత్పత్తి వ్యయంలో కలిసిపోకుండా వినియోగదారునిపై మాత్రమే విధించాలి.

(7) వివిధ రాష్ట్రాలకు సంబంధించి ఒకే విధమైన అమ్మకపు విధానాన్ని రూపొందించాలి.

(8) అంత రాష్ట్ర పన్నును క్రమంగా నాలుగు శాతం నుంచి ఒక శాతానికి తగ్గించాలి.

(9) దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య వస్తువులపై విధించే అమ్మకం పన్ను లేదా అక్ట్రాయ్‌ని పూర్తిగా రద్దు చేయాలి.

భూత లింగం కమిటి సిఫార్సులు: పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయడానికి ఆధునీకరించడానికి అవసరమైన సూచనలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 1967లో ఎన్.భూత లింగం అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది.

సూచనలు:

(1) ప్రస్తుతం ఉన్న ఎక్సైజ్ చట్టాల స్థానంలో సాధారణ ఎక్సైజ్ సుంకాల పద్ధతిని ప్రవేశ పెట్టాలి. ఈ చట్టాలు దేశ, మొత్తం మీద ఒకే రకంగా ఉండాలి. సుంకం రేటు సాపేక్షికంగా ఉండాలి తక్కువగా ఉండాలి.

(2) 1965లో ఏర్పాటు అయిన చట్టాన్ని ఆధునికీకరించి కస్టమ్స్ సుంకాలలో ఉన్న పలు రేట్లను తీసివేసి నాలుగు లేక ఐదు రేట్లను ప్రతిపాదించాలి.

(3) కంపెనీ అభివృద్ధికై ప్రవేశపెట్టిన డివిడెండ్ పన్ను రేటును పెంచాల్సిన అవసరం లేదు.

(4) కార్పోరేట్ పన్నులను రద్దు చేయవచ్చును.

(5) సహకార సంఘాలపై విధించే పన్ను కంపెనీలపై విధించే పన్నుకంటే 10% తక్కువగా ఉండాలి.

(6) వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపు 7,500 గా నిర్ణయించాలి.

(7) కానుక పన్ను విషయంలో ప్రస్తుత చట్టాన్ని కొనసాగిస్తూనే ఒక సంవత్సరంలో వ్యక్తి పొందిన కానుకల మొత్తం విలువపై పన్ను విధించాలి.

**రాజా జె.చెల్లయ్య కమిటి సిఫార్సులు:** డాక్టర్ రాజా జె.చెల్లయ్య అధ్యక్షతన 1991లో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. దీని ముఖ్య ఉద్దేశ్యం పన్ను విధానాన్ని సులువుగా నమ్మకమైనదిగా, పురోగామిత్వాన్ని సంతరించుకునేదిగా చేయడానికి అవసరమైన సిఫార్సులు చేశారు. ఈ సిఫార్సులలో క్రింద పేర్కొన్నవి ముఖ్యమైనవి.

(1) పన్నుల ద్వారా రాబడిని పెంచేందుకు ప్రత్యక్ష పరోక్ష పన్నుల ఆధారాన్ని విస్తరించాలి.

(2) పన్ను విధానం సులువుతరం, నిష్పాక్షికంగా ఉండేటట్లు చూడటం, తద్వారా ప్రజలు పన్ను విధానాన్ని అంగీకరించేందుకు కృషి చేయడం.

(3) వ్యక్తిగత, కార్పొరేటు ఆదాయ పన్ను రేటును తగ్గించాలి.

(4) దేశీయ పొదుపు ప్రోత్సహించేందుకు వడ్డీపై పన్నును తొలగించాలి.

(5) దాదాపు అన్ని దిగుమతి వస్తువులపై సుంకాలను తొలగించాలి.

(6) కస్టమ్స్ సుంకాలను 50 శాతం తగ్గించాలి.

(7) మోడ్ వేట్ (Modified Value Added Tax) ను టెక్స్‌టైల్స్ మరియు పెట్రోలియం ఉత్పత్తులకు విస్తరించాలి.

(8) విదేశీ పెట్టుబడిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకర్షించేందుకు అనుగుణమైన మార్పులను పన్ను విధానంలో ప్రవేశ పెట్టాలి.

**పన్ను సంస్కరణలపై కేల్కర్ తుది నివేదిక:** పన్నుల వ్యవస్థ సంస్కరణలపై ఏర్పాటైన విజయ్ కేల్కర్ కమిటి తన తుది నివేదికను కేంద్రానికి సమర్పించింది. ఆదాయపన్ను మినహాయింపుల రద్దు వంటి వివాదాస్పద అంశాలపై కమిటీ తన పాత వైఖరికే కట్టుబడింది. అయితే పెన్షనర్లు, గృహనిర్మాణ ఋణాలపై రాయితీల విషయంలో మాత్రం దయచూపింది. ఇది వరకు ప్రతిపాదనకు రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత రావడంతో కేల్కర్ కమిటీ తన వైఖరిని కొంత వరకు సడలించుకుంది. తుది నివేదికలో కొన్ని మార్పులు చేసింది. సంప్రదింపుల పత్రాలలో తాను చేసిన ప్రతిపాదనలపై ప్రజల నుంచి రాజకీయ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పటికీ కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని వాటివల్ల భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందని కేల్కర్ అభిప్రాయపడ్డాడు. తన సిఫార్సుల వల్ల పన్ను, జి.డి.పి./నిష్పత్తి పెరుగుతున్నది అని కేల్కర్ వాదన. ఈ ప్రతిపాదనలు మధ్యతరగతి వారికి వ్యతిరేకంగా ఉన్నాయన్న వాదనను కేల్కర్ తోసిపుచ్చారు అన్ని వర్గాలకు చెందిన వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకే లాభం చేకూరుతుందని ఆయన వివరించారు. ఆర్థిక మంత్రి సలహాదారు కూడా ఆయన విజయ కేల్కర్ తన తుది నివేదికను 2002 డిశంబరు 27న ఆర్థిక మంత్రి జశ్వంత్‌సింగ్‌కు అందజేశారు. పన్నుల వ్యవస్థను సరళీకరించడానికి 2002 జూన్‌లో కేల్కర్ సారథ్యంలో కమిటీ వేసింది.

**వ్యక్తిగత ఆదాయపన్ను:**

- ఆదాయపన్ను పరిమితిని ఒక లక్షకు పెంచాలి. వ్యక్తిగత ఆదాయపన్ను వ్యవస్థలో రెండే రెండు స్లాబులుండాలి. లక్ష నుండి 4 లక్షల మధ్య ఆదాయంపై 20%, అంతకంటే ఎక్కువ ఆదాయంపై 30% పన్ను వేయాలి.
- వేతన ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్‌ను పూర్తిగా తొలగించాలి. 9,600 పరిమితికి లోబడి ప్రయాణ భత్యంపై పన్ను

మినహాయింపు కొనసాగించాలి. సర్‌ఛార్జిని తొలగించాలి.

- వృద్ధులకు, వితంతువులకు అదనపు పన్ను రాయితీలు కల్పించాలి. వీరికి లక్షన్నర ఆదాయపు పన్ను పరిమితి ఉండాలి.
- మెడికల్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం 3 వేల రూపాయల వరకు ఉన్న వారికి 20% రాయితీ.
- విద్యా సంబంధిత అంశాలకయ్యే చెల్లింపుల్లో 4 వేల రూపాయల వరకు 20% రిబేటు.
- చిన్న మొత్తాలపై ఇస్తున్న పన్ను మినహాయింపులు తొలగించాలి.
- వ్యవసాయంపై పన్ను వేసే విషయాన్ని రాష్ట్రాలకే వదిలివేయాలి. అయితే వ్యవసాయేతరుల వ్యవసాయ ఆదాయంపై పన్ను వేసి తీరాలి,

కార్పొరేట్ టాక్స్:

- మూడేళ్ళలో దేశీయ కంపెనీలపై కార్పొరేట్ పన్ను ప్రస్తుత 36.75% నుంచి 30 శాతానికి, విదేశీ కంపెనీలపై 40-35 శాతానికి తగ్గింపు.
- కనీస ప్రత్యామ్నాయ పన్ను ఎత్తివేత.
- దేశీయ కంపెనీల నుండి పొందే డివిడెండ్లకు పూర్తి మినహాయింపు.
- ఎగుమతి రాయితీలు, ప్రోత్సాహకాలు రద్దు చేయాలి.
- మ్యూచివల్ ఫండ్స్‌గా మారిన స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్స్‌పై 20% పన్ను విధించాలి.

పరోక్ష పన్నులు - ఎక్సైజ్ సుంకాలు:

- సెంట్రల్ వాల్యూ యాడెడ్ టాక్స్ రేటు 4%.
- ప్రాసెసింగ్ చేసిన ఆహారపదార్థాలు, అగ్గిపెట్టెలపై 6% పన్ను.
- జౌళి ఉత్పత్తులు, ఫైబర్, యార్న్ మొదలగు వాటిపై 16% సార్వజనీక పన్ను.
- VAT ద్వారా నష్టపోయిన రాష్ట్రాలకు నష్ట పరిహారం చెల్లింపు.

కస్టమ్స్ సుంకాలు:

| సిఫారసు చేసిన శాతం | 2004-05 | 2006-07 |
|---|---|---|
| ముడిపదార్థాలు | 10% | 5% |
| ఇంటర్మీడియట్ వస్తువులు | 10% | 8% |
| ఫినిష్డ్ వస్తువులు | 20% | 10% |
| కన్స్యూమర్ డ్యూరబుల్స్ | 20% | 20% |

- ప్రాణాధార ఔషధాలు, పరికరాలు, రక్షణ, భద్రత సంబంధ వస్తువులు, రిజర్వు బ్యాంక్ దిగుమతి చేసుకునే వస్తువులపై పూర్తిగా సుంకం తొలగింపు.
- రకరకాల సుంకాలకు స్వస్తి
- 2003-04 నుండి పెట్రోలియం ఉత్పత్తులు, ముడిచమురుపై విధించిన సుంకంలో తగ్గింపు.

| | 2003-04 | 2004-05 |
|---|---|---|
| ముడిచమురు | 8% | 5% |
| పెట్రోలియం ఉత్పత్తులు | 15% | 10% |

- ప్రత్యేకించిన వ్యవసాయ ఉత్పత్తులపై 150% వరకు కస్టమ్స్ డ్యూటీ.
- మోటారు వాహనాలపై సుంకం - 60 - 50 శాతానికి తగ్గింపు.
- దిగుమతి చేసుకునే సెకండ్ హ్యాండ్ కార్లపై ప్రస్తుత సుంకం కొనసాగింపు. వ్యాట్ అమల్లోకి వచ్చాక ప్రస్తుతం దిగుమతులపై 4% అదనంగా పడుతోన్న స్పెషల్ అడిషనల్ టాక్స్ (SAD) తొలగిపోయింది. ఇది 2003 ఏప్రిల్ నుండి అమల్లోకి వస్తుంది.

## 7.28. సారాంశము:

భారతదేశం స్వాతంత్ర్యానంతరం ఒక హేతుబద్ధమైన పన్నుల వ్యవస్థను నిర్మాణం చేసుకున్నది. ఈ వ్యవస్థలో పన్నుల విధింపు, వసూలు వినియోగం ముఖ్యమైనవి. పన్నుల వ్యవస్థ మూడు జాబితాలుగా ఉంది. పన్నుల వ్యవస్థ కొన్ని లక్ష్యాలను ఏర్పరుచుకున్నది. భారతదేశంలో ప్రధానంగా మూడు రకాలుగా పన్నులు విధించబడుతున్నాయి. అవి (1) ఆదాయాలపై పన్ను (2) ఆస్తి, మూలధనంపై పన్ను (3) వస్తుసేవలపై పన్ను. కేంద్ర ఆదాయ వనరులలో ముఖ్యమైనవి కేంద్ర ఎక్సైజ్ సుంకాలు, ఎగుమతి దిగుమతి సుంకాలు, ఆదాయ పన్ను, కార్పొరేషన్ టాక్సు, సంపద పన్ను మొదలైనవి. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులలో ముఖ్యమైనవి రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు, స్టాంపు డ్యూటీ, భూమిశిస్తు, వినోదపు పన్ను, నీటి తీరువా, మోటారు వాహనాలపై పన్ను మొదలైనవి. స్థానిక ఆదాయ వనరులలో ముఖ్యమైనవి వృత్తి పన్ను, ఆక్ట్రాయ్ పన్ను, ఆస్తి పన్ను మొదలైనవి.

దేశంలో ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్ష పన్నులకే ప్రాధాన్యత ఎక్కువగా ఉంది. అయితే పరోక్ష పన్నులు ఆదాయ సంపదల మధ్య వ్యత్యాసాన్ని పెంచుతున్నాయి. పరోక్ష పన్నులపై ఎక్కువ ఆధారపడటం వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. బహుమతిపై వార్షికాదాయం 10కోట్ల రూపాయలకు మించి రాకపోతున్నందుకు ప్రభుత్వం దీనిని 1998-99లో రద్దు చేసారు. మరణ సుంకాలు - వారసత్వపు సుంకాల ద్వారా కూడా రాబడి తక్కువగా ఉన్నందున ప్రభుత్వం దీనిని 1985లో రద్దు చేసింది. కేంద్ర ఎక్సైజ్ సుంకం విలువను బట్టి విలువ నిమిత్తం లేకుండా రెండు విధాలుగా విధిస్తారు. ఇటీవల కాలంలో దిగుమతి సుంకాలు తగ్గించినప్పటికీ దేశంలో కస్టమ్స్ సుంకం మూడు ముఖ్య ఆదాయ వనరుగా ఉంది.

భారత రాజ్యాంగం రాష్ట్రాలకు కొన్ని పన్నులను విధించి వసూలు చేసుకొని అనుభవించే అవకాశాన్నిచ్చింది. ఆ ఆదాయ మార్గాలు, భూమిశిస్తు, వ్యవసాయ ఆదాయంపై పన్ను, మద్యపానంపై మత్తు పదార్థాలపై పన్ను, వార్తాపత్రికలకు మినహా వస్తువులపై అమ్మకాల కొనుగోలుపై పన్నులు, విద్యుత్‌చ్ఛక్తి అమ్మకం వినియోగంపై పన్ను, విలాస వస్తువుల వినోదాలపై పన్ను, అమ్మకం పన్ను స్థానంలో కేంద్రం ఇటీవల విలువ ఆధారిత పన్నును ప్రవేశపెట్టింది.

స్థానిక సంస్థలకు వచ్చే ఆదాయ వనరులను ప్రధానంగా నాలుగు భాగాలుగా విభజించవచ్చును. (1) ఈ సంస్థలు విధించే పన్నులు (2) రాష్ట్ర ప్రభుత్వ పన్నులలో వాటాలు (3) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లు (4) పన్నేతర ఆదాయాలు.

పన్నుల గురించి కేంద్ర ప్రభుత్వం వివిధ కమిటీలను నియమించింది. అందులో ముఖ్యమైనవి (1) కె.ఎన్. రాజ్ కమిటీ (2) కె.ఎన్. వాంఛూ కమిటీ (3) ఎల్.కె. ఝా కమిటీ (4) భూతలింగం కమిటీ (5) రాజా.జె.చెల్లయ్య కమిటీ (6) విజయ కేల్కర్ కమిటీ.

## 7.29. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1. భారతదేశంలో పన్నుల వ్యవస్థ వివిధ లక్ష్యాలను కలిగి ఉన్నది.
2. కేంద్ర ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకొంటున్నది.
3. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ మార్గాల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకొంటున్నాయి.
4. మన దేశంలో స్థానిక సంస్థలు ద్రవ్య వనరులను వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకొంటున్నాయి.
5. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం పన్నుల వ్యవస్థలో వివిధ మార్పులు జరిగాయి.
6. భారతదేశంలో పన్నుల తీరును పరిశీలించడానికి వివిధ కమిటీలు నియమించబడినాయి.

## 7.30. కఠిన పదాలు:

1. కార్పొరేషన్ పన్ను: జాయింట్ స్టాక్ కంపెనీల ఆదాయంపై విధించే పన్నును కార్పొరేషన్ పన్ను అందురు.
2. మూలధన పన్ను: అసాధారణ ఆదాయాలపై విధించే పన్నును మూలధన పన్ను అంటారు.
3. బహుమతి పన్ను: వ్యక్తులు హిందూ అవిభక్త కుటుంబాలు, సంస్థలు ఇచ్చే బహుమతులపై విధించే పన్నును బహుమతి పన్ను అంటారు. దీనిని మన దేశంలో 1958వ సంవత్సరంలో విధించడమైనది.
4. కస్టమ్స్ సుంకాలు: ఎగుమతి, దిగుమతులపై విధించే పన్నులను కస్టమ్స్ సుంకాలు అని అందురు.
5. విలువ ఆధారిత పన్ను: వస్తువు యొక్క విలువ పెరిగిన ప్రతి దశలోనూ ఆ పెరిగిన విలువపై విధించే పన్నును విలువ ఆధారిత పన్ను అని అందురు.
6. టో[illegible] మొదల[illegible]ప్పుడు వాటి నిర్మాణపు ఖర్చును లబ్దిదారుల నుం[illegible] పన్ను టోల్ [illegible]

## 7.31. నమూన ప్రశ్నలు:

I. వ్యాసరూ[illegible] ప్రశ్నలు:

1. భార[illegible]దేశంలో పన్నుల వ్యవస్థ నిర్మాణం గురించి చర్చించి, లక్ష్యాలను స్వరూప స్వభావములను వివరింపుము.
2. భార[illegible]దేశంలో కేంద్ర ప్రభుత్వ ఆదాయవనరులను వివరింపుము.
3. భార[illegible]దేశంలో రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వనరులను వివరింపుము.
4. భా[illegible]దేశంలో స్థానిక సంస్థల [illegible]దాయ మార్గాలను [illegible]ంపుము.
5. భారతదేశంలో ప్రత్యక్ష - పరోక్ష పన్నుల పోకడలను ప[illegible]శీలింపుము.

II. సంక్షిప్త ప్రశ్నలు:

1. ప్రత్యక్ష పన్నులను గూర్చి వ్రాయుము.
2. ప[illegible]క్ష పన్నులను గూర్చి వ్రాయుము.
3. వ్యష్టి ఆదాయపు పన్ను
4. కార్పొరేషన్ పన్ను
5. మూలధన పన్ను
6. సంపద పన్ను

7. బహుమతి పన్ను
8. వ్యయంపై పన్ను
9. కేంద్ర ఎక్సైజ్ సుంకాలు
10. కస్టమ్స్ సుంకాలు
11. వ్యవసాయంపై పన్ను
12. అమ్మకం పన్ను
13. విలువ ఆధారిత పన్ను
14. రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు
15. వినోదపు పన్ను
16. గ్రాంట్లు
17. కె.ఎన్.వాంఛూ కమిటీ
18. కేల్కార్ కమిటీ

## 7.32. చదువదగిన గ్రంథాలు:


1. Public Economics and Public Finance : Andley, Sundaram
2. B.P. Tyagi : Public Finance
3. ద్రవ్యం - విత్తం : తెలుగు అకాడమీ
4. ప్రభుత్వ అర్థశాస్త్రం : బి.ఏ., తెలుగు అకాడమీ
5. Public Finance for M.A. Students : Telugu Academy


- డా॥ ఎ.రాజశేఖర్

పాఠం : 8

# ప్రభుత్వ వ్యయం - వర్గీకరణ - నియమాలు

## 8.0. లక్ష్యం:

ఈ పాఠం చదివాక విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- ప్రభుత్వ వ్యయ వర్గీకరణలో డాల్టన్, శ్రీమతి హిక్స్, ఏజన్సీ, కోహెన్‌ప్లేన్, నికల్సన్, జె.ఎస్.మిల్., షిరాస్ వర్గీకరణ
- గ్రాంట్లు, కొనుగోలు ధరలు, ఎ.సి. పిగూ వర్గీకరణ, జె.కె. మెహతా వర్గీకరణ
- ప్రభుత్వ వ్యయ సూత్రాలు, ప్రభుత్వ వ్యయ నియమాలు
- ఇతర ఆర్థిక వేత్తల నియమాలు.

## విషయసూచిక


8.1. పరిచయము

8.2. ప్రభుత్వ వ్యయం-వర్గీకరణ
డాల్టన్ వర్గీకరణ
శ్రీమతి హిక్స్ విభజన
ఏజన్సీ విభజన
కోహెన్, ప్లేన్ వర్గీకరణ
నికల్సన్ వర్గీకరణ
జె.ఎస్.మిల్. వర్గీకరణ
షిరాస్ వర్గీకరణ
రొచ్చర్స్, డాల్టన్ వర్గీకరణ
గ్రాంట్లు
కొనుగోలు ధరలు
ఎ.సి. పిగూ వర్గీకరణ
జె.కె. మెహతా వర్గీకరణ

8.3. ఆర్థిక వర్గీకరణ

8.4. ప్రభుత్వ వ్యయ సూత్రాలు

8.5. ప్రభుత్వ వ్యయ నియమాలు
మితవ్యయ నియమం
మిగులు వ్యయ నియమం
మంజూరు నియమం
ప్రయోజన సూత్రం
దేశకార్యకలాపాల విస్తరణ సూత్రం

8.6. ఇతర ఆర్థిక వేత్తల నియమాలు
వ్యాకోచనియమం
సమాన పంపిణీ నియమం
ఉత్పాదక నియమం

8.7. సారాంశము

**8.8.** గుర్తుంచుకోవలసిన విషయాలు
**8.9.** కఠిన పదాలు
**8.10.** నమూనా ప్రశ్నలు
**8.11.** చదువదగిన గ్రంథాలు.

## 8.1. పరిచయము:

మొట్టమొదట మానవుడు తను ఒక్కడే వేటకు వెళ్ళి జంతువులను వేటాడి పొట్టనింపుకునేవాడు. కాని తర్వాత కాలంలో అనేకమంది వేటగాళ్ళు కలసి ఒక జట్టుగా ఏర్పడి కొన్ని లేళ్ళను చంపి సమానంగా పంచుకునేవారు. ఆ విధంగా సమిష్టి సమాజ జీవితం ఆవిర్భవించింది. కొందరు పనిముట్లు తయారు చేసుకొని వేట సాగిస్తే, మరికొందరు వేరే విధంగా ఆహారాన్ని సంపాదించటంలో ప్రావీణ్యం పొందేవారు. ఒకానొక దశలో సమిష్టి సమాజాల మధ్య, సమిష్టి సమాజం లోపల శ్రమ ఉత్పాదితాల మార్పిడి, కూర్పు ప్రారంభమైనది. ఇదే ఆర్థికవ్యవస్థ అయింది. మనుషుల జీవితాలకు అవసరమైన వస్తువుల ఉత్పత్తి, పంపిణీ అనుబంధిత, భౌతిక సంబంధాలు, ఉత్పత్తి సంబంధాలు వచ్చాయి.

భౌతిక వస్తువుల ఉత్పత్తి, మార్పిడి, వినిమయాలు, ప్రాతిపదిక మీద జరిగే సంబంధాలు ఆర్థిక వ్యవస్థ అవుతాయి. ఆదిమ సమాజ ఆర్థిక వ్యవస్థ సరళమైనది. ఎందుకంటే వారు వాడిన పనిముట్లు, వారి యొక్క నైపుణ్యం బాగా పరిమితమైనది. ఒక సమాజపు ఉత్పత్తి సంబంధాలు దాని ఆర్థిక వ్యవస్థను, దాని ఇతర జీవిత పార్శ్వాలను అన్వయించిన ఆర్థిక-శాస్త్రం ఇంకా పెంపొందలేదు.

క్రమానుగుణంగా మానవుడు తనంత తాను శ్రమించి తనను తాను కొన్ని వస్తువులను మార్పిడి చేసుకున్నప్పటికి సామూహికంగా ఎలా వస్తువును సంపాదించాడో అలాగే సామూహికంగా వస్తువులను వినియోగించవలసి వచ్చింది. ఉదాహరణకు రహదారి. అలాగే సామూహికంగా శత్రువును ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ రకమైన వస్తువులను 'సాంఘిక వస్తువులు' అందురు. మరి 'సాంఘిక వస్తువులను' ఎలా తయారు చేస్తారు? ప్రజలందరూ కలిసి వారివారి భాగాలను ప్రభుత్వానికి చెల్లించిన [illegible] ఉత్పత్తి చేస్తారు. అందువలన ఎటువంటి వస్తువులను తయారు చేయాలి? ఎలా పంపిణీ [illegible] మనం చర్చించబోయే ప్రభుత్వ వ్యయం అనే శీర్షిక క్రింద పరిశీలిస్తాము.

## 8.2. [illegible]

స్థూలంగా కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ప్రజల [illegible] వ్యయాన్ని ప్రభుత్వ వ్యయం అంటారు. విదేశీదాడుల నుండి ప్రజలను రక్షించటానికి గాని లేక ప్రజల ఆర్థిక, సాంఘిక సంక్షేమం పెంపొందించటానికి గాని ఖర్చు చేస్తుంది. ప్రభుత్వ వ్యయాన్ని అనేక రకాలుగా విభజింపవచ్చు. ఒక్కొక్క రకం వ్యయం ఒక్కొక్క పరిమిత ఉపయోగాన్ని నెరవేరుస్తుంది. ఒక్కొక్క ఆర్థికవేత్త ఒక్కొక్క రకమైన వ్యయాన్ని ఒక ప్రత్యేక అంశానికి ప్రాధాన్యతనిస్తూ తమ అభిప్రాయాలను తెలిపారు.

**డాల్టన్ వర్గీకరణ:**

డాల్టన్ మహాశయుని ప్రకారము ప్రభుత్వ వ్యయాన్ని క్రిందివిధంగా విభజింపవచ్చును.

1) ప్రభుత్వ నిర్వహణ బాధ్యతలు చేపట్టే అధిపతిగాను, విదేశీ రాయబారం నెరిపే సంస్థగా ఉంటుంది.

2) ప్రభుత్వ యంత్రాంగాన్ని నిర్వహించటం. ఇందులో శాసనసభ మంత్రి మండలి నిర్వహణా ఖర్చులు కలసి ఉంటాయి.

3) విదేశీదాడుల నుండి దేశాన్ని రక్షించటానికి సైనిక బలగాన్ని నిర్వహించటం, దేశంలో ఆంతరంగిక భద్రతను కాపాడటం.

4) వ్యాయసంబంధమైన పరిపాలన నిర్వహించటానికి

5) వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, రవాణా, ప్రసారాలు, పోర్టులు, ద్రవ్యం, ద్రవ్య ముద్రణ మొదలైన వాటిపై పెట్టే ఖర్చు.

6) విద్య, ప్రజారోగ్యం, సాంఘిక భద్రతా పథకాలపై చేసే వ్యయం.

7) ప్రభుత్వ ఋణ చెల్లింపులకయ్యే వ్యయం. ఇందులో వడ్డీ, అసలు చెల్లింపులు ఉంటాయి.

**శ్రీమతి హిక్స్ విభజన:**

ఆడమ్‌స్మిత్ మహాశయుడు దేశసార్వభౌమాధికారానికి అవసరమైన మూడు విధుల ఆధారంగా శ్రీమతి హిక్స్ ప్రభుత్వ వ్యయాన్ని విభజించింది. మొదటగా ఆమె రక్షణ వ్యయాన్ని గురించి ప్రస్తావించింది. ఇందులో మూలధన సామాగ్రి, ఫ్యాక్టరీలు, రక్షణ సిబ్బంది, వేతనాల చెల్లింపులు, రెండవ అంశంగా ఇందులో దేశంలోని శాంతిభద్రతలు, న్యాయం, పరిరక్షణ ఉన్నాయి. ఆర్థిక ప్రాధాన్యతలలో ప్రైవేటు సంస్థలకు సబ్సిడీల ద్వారా ప్రత్యక్ష సేవలందించటం, మూడో ప్రాధాన్యతాంశంగా ఆమె వర్గీకరించింది. చివరగా ఆధునిక కాలంలో అవసరమైన సాంఘిక వ్యయాన్ని ఆమె ప్రస్తావించారు. ఇందులో విద్య, ప్రజారోగ్యం, సాంఘిక భీమా పథకాలు ఉన్నాయి.

**ఏజెన్సీ విభజన:**

మరో విభజనను ఏజెన్సీ విభజన అంటారు. ఇది విధులననుసరించిన విభజన కంటే ప్రయోజనకరమైనదని అంటారు. దీని ప్రకారం ఒక్కొక్క ఏజెన్సీ లేక విభాగానికి ఎంత నిధులు కేటాయిస్తారో తెలుస్తుంది. దీనిలో ప్రతిశాఖకు ఎంత నిధులు కేటాయిస్తారో చూపుతారు. ఉదాహరణకు శ్రామిక శాఖ, రక్షణ శాఖ, వ్యవసాయ శాఖ మొదలైనవి.

**కోహన్, ప్లేన్ వర్గీకరణ:**

జర్మన్ శాస్త్రవేత్త కోహన్, అమెరికా శాస్త్రవేత్త ప్లేన్ ప్రభుత్వ వ్యయాలను అవి అందజేసే ప్రయోజనాలను బట్టి నాలుగు రకాలుగా విభజన చేస్తారు.

(ఎ) సమాజమంతటికి ప్రయోజనాలను కలిగించే ప్రభుత్వ వ్యయాలు. ఇవి ప్రజలకు సామాన్యమైన ప్రయోజనాన్ని ఇస్తాయి. ఉదాహరణకు రక్షణ వ్యయాలు, సాధారణ పరిపాలనా వ్యయం, విద్య.

(బి) సమాజంలో కొందరికి మాత్రమే ప్రయోజనాన్ని కలిగించే ప్రభుత్వ వ్యయాలు. ఉదాహరణకు పేదవారికి అందజేసే భృతి.

(సి) సమాజంలో కొందరికి ప్రత్యేక ప్రయోజనాన్ని, మిగిలిన వారికి సాధారణమైన ప్రయోజనాన్ని అందజేసే వ్యయాలు. ఉదాహరణకు విద్య, వైద్య సదుపాయాలు, న్యాయస్థానాల ఖర్చు మొదలగున్నవి.

(డి) సమాజంలో కేవలం ఒకే ఒక వర్గానికి ప్రయోజనం కలిగించే ప్రభుత్వ వ్యయాలు. ఉదాహరణకు తక్కువ వ్యయంతో గృహ వసతులు, కొన్ని పరిశ్రమలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు.

ఈ వర్గీకరణలో ఒక లోపం ఉంది. ప్రభుత్వ సేవలను విడగొట్టలేము.

**నికల్సన్ వర్గీకరణ:**

ప్రభుత్వ సేవల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బట్టి ప్రభుత్వ వ్యయాలను నాలుగు రకాలుగా విభజించినారు.

1) ప్రత్యక్షంగా ఆదాయం తీసుకురాని వ్యయాలు ఉదాహరణకు పేదవారికిచ్చే భృతి, యుద్ధాల మీద వ్యయాలు.

2) ప్రత్యక్షంగా ఆదాయం లేకుండా పరోక్షంగా ఆదాయాన్నిచ్చే వ్యయాలు. ఉదాహరణకు విద్య, వైద్య, ఆరోగ్య, రవాణా సదుపాయాలు.

3) పాక్షికంగా ప్రభుత్వానికి ప్రత్యక్ష ఆదాయమిచ్చే వ్యయాలు. ఉదాహరణకు ఫీజులు వసూలు చేసి, విద్య, వైద్య సదుపాయాలను కల్పించటం.

4) పూర్తి ఆదాయాన్ని లేదా లాభాలను ప్రభుత్వానికి అందజేసే వ్యయాలు. ఉదాహరణకు ప్రభుత్వ రంగములోని పరిశ్రమలు, తంతి తపాలా, రేల్వేలు.

ఆదాయాన్ని ప్రత్యేకంగా ఇచ్చే వ్యయాలు అని పరోక్షంగా ఇచ్చే వ్యయాలు అని ఖచ్చితంగా విభజన చేయుటం అశాస్త్రీయమైన వర్గీకరణ. ప్రభుత్వ వ్యయాలు ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటాయి. ప్రభుత్వ వ్యయం ముఖ్య లక్ష్యం ప్రజా సంక్షేమమే కాని ఆదాయ సముపార్జన కాదు.

**జె.యస్.మిల్. వర్గీకరణ :**

ప్రభుత్వ వ్యయాలను మిల్ రెండు రకాలుగా వర్గీకరించినాడు. (1) ఐచ్ఛికమైనవి 2) అత్యవసరమైనవి. ఐచ్ఛిక వ్యయాలు అంత ముఖ్యమైనవి కావు. అవి లేకుండా ప్రభుత్వాలు పనిచేయవచ్చు. అత్యవసర వ్యయాలు తప్పనిసరియై ఉంటాయి. ప్రభుత్వాలు తప్పకుండా వీటిని భరించవలసి ఉంటుంది.

**షిరాస్ వర్గీకరణ:**

షిర్లాస్ ప్రకారం ప్రభుత్వ వ్యయాలను ప్రాధమిక వ్యయాలని, గౌణ వ్యయాలని విభజించటం జరిగింది. ప్రాధమిక వ్యయాలు ప్రభుత్వానికి అత్యంత అవసరమైనవి. అవి రక్షణ, శాంతిభద్రతల మీద వ్యయాలు. గౌణ వ్యయాలకు ఉదాహరణగా విద్య, సాంఘిక భీమా, ప్రజారోగ్యం, ప్రభుత్వ సంస్థల మీద వ్యయం. ఇవి అంత ప్రధానమైనవి కావు.

**రోష్చర్స్, డాల్టన్ వర్గీకరణ:**

ప్రభుత్వ వ్యయాన్ని మూడు తరగతులుగా వర్గీకరించారు.

(1) అవసరమైన వ్యయం (2) ఉపయోగకరమైన వ్యయం (3) అధికమైన లేక అలంకారప్రాయమైన వ్యయం.

ప్రభుత్వ వ్యయాన్ని డాల్టన్ రెండు రకాలుగా వర్గీకరించాడు.

(1) గ్రాంట్లు (2) కొనుగోలు ధరలు

**గ్రాంట్లు:** ప్రభుత్వం నుండి ఆదాయాన్ని లేక ద్రవ్యాన్ని పొందిన వ్యక్తి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా ఏమి బదులు ఇవ్వకపోతే ఆ వ్యయం గ్రాంటు అవుతుంది. ఉదాహరణకు వృద్ధాప్య పెన్షన్లు, సాంఘిక భద్రత మీద వ్యయం, ఉచిత విద్య, వైద్య సదుపాయాలు, పేదలకు ఆర్థిక సహాయం మొదలైనవి.

**కొనుగోలు ధరలు:** ప్రభుత్వం నుండి ద్రవ్యాన్ని పొందిన వ్యక్తి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా వస్తువుల రూపంలోనో లేదా సేవల రూపంలోనో బదులు ఇస్తే కొనుగోలు ధర అవుతుంది. ఉదాహరణకు ప్రభుత్వోద్యోగుల జీతాలు, విద్యా సదుపాయాల మీద వ్యయాలు, ప్రభుత్వ పరిశ్రమలు.

గ్రాంట్లను ప్రత్యక్ష గ్రాంట్లు, పరోక్ష గ్రాంట్లుగా విభజన చేస్తారు. గ్రాంట్లు పొందిన వారే వాటి లాభాన్ని పూర్తిగా పొందితే అది ప్రత్యక్ష గ్రాంటు అవుతుంది. ఉదాహరణకు వృద్ధాప్య పింఛను. గ్రాంటువలన మరొకరికి పూర్తిగా గాని, పాక్షికంగా గాని చేరితే అది పరోక్ష గ్రాంటు అవుతుంది. ఉదాహరణకు పరిశ్రముకు ఇచ్చిన సబ్సిడీ వలన ఆ వస్తువు ధరను తగ్గించటం వలన వినియోగదారులు లాభం పొందుతారు.

**ఎ.సి. పిగూ వర్గీకరణ:**

ప్రభుత్వ వ్యయాలను ఎ.సి.పిగూ రెండు రకాలుగా వర్గీకరించినాడు. (1) బదిలీ వ్యయాలు (2) బదిలీ కాని వ్యయాలు లేక వాస్తవిక వ్యయాలు.

ద్రవ్యాదాయ వ్యయాలను లేదా వస్తుసేవలపై హక్కులను ప్రజల నుండి ప్రభుత్వానికి, ప్రభుత్వం నుండి ప్రజలకు బదిలీ చేసే వ్యయాలను బదిలీ వ్యయాలు అంటారు. ఇక్కడ ప్రభుత్వం నుండి ప్రజలకు ద్రవ్యం చేరుతూ ఉంటుంది. ప్రజల నుండి తిరిగి ప్రభుత్వానికి చేరదు. ఉదాహరణకు ప్రభుత్వ రుణాలపై వడ్డీలు, పెన్షన్‌లు, నిరుద్యోగ భృతి ఈ వర్గానికి చెందుతాయి. ఈ వ్యయాలు ఏ విధమైన ఆదాయాన్ని గాని, ఉత్పత్తిని గాని సృష్టించవు. ఇవి ఆదాయ పంపిణీపై ప్రభావం చూపుతాయి.

చేసిన వ్యయానికి వస్తుసేవలు పొందటం కాని పూర్తిగా వినియోగించటం కాని జరిగినట్లయితే ఆ వ్యయాలు బదిలీ కాని వ్యయాలు అంటారు. వీటినే వాస్తవిక వ్యయాలని పిగూ పేర్కొంటాడు. దేశరక్షణ సిబ్బందిపై వ్యయం, సివిల్ సిబ్బందిపై వ్యయం, విద్య, న్యాయశాఖలపై వ్యయాలు బదిలీకాని వ్యయాలుగా పేర్కొనవచ్చు.

**జె.కె. మెహతా వర్గీకరణ:**

మెహతా గారి అభిప్రాయం ప్రకారం ప్రభుత్వ వ్యయాన్ని రెండు విధాలుగా వర్గీకరించినారు.

(1) స్థిర వ్యయం (2) చర వ్యయం

ప్రభుత్వ వ్యయం ద్వారా లభించే సేవలను వాటిని ఉపయోగించుకొను ప్రజల సంఖ్యను బట్టి మార్పు లేకుండా చేసే మొత్తం వ్యయాన్ని స్థిర వ్యయం అని భావించాడు. ఉదాహరణకు రక్షణపై వ్యయం.

ప్రభుత్వ వ్యయం ద్వారా లభించే సేవలను ఉపయోగించుకునే ప్రజల సంఖ్యను బట్టి మార్పు చెందే వ్యయాన్ని చర వ్యయమని చెప్పాడు ఉదాహరణకు తంతితపాల సేవలపై వ్యయం.

## 8.3. ఆర్థిక వర్గీకరణ:

ప్రభుత్వ వ్యయాల వర్గీకరణ సులువుగా, అర్థవంతంగా, ఆర్థిక విశ్లేషణకు తోడ్పడేదిగా ఉంటే అది శాస్త్రీయ పద్ధతిగాను, అందరికీ తెలియపరచేదిగా ఉంటుంది. ఇటువంటి ఆర్థిక ప్రయోజనం కలిగించే వర్గీకరణ చేయటాన్ని ఆర్థిక వర్గీకరణ అంటారు. ఈ దృష్టితోనే ప్రభుత్వ వ్యయాలను ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలలో రెవిన్యూ పద్దుల క్రింద వ్యయాలుగాను, కాపిటల్ పద్దుల క్రింద వ్యయాలు గాను విభజన చేసారు. ప్రభుత్వ సాధారణ పరిపాలనలో జరిగే వ్యయాలన్నీ రెవిన్యూ ఖాతా వ్యయాల క్రిందకి వస్తాయి. కాపిటల్ క్రింద మూలధన స్వభావానికి చెందిన వ్యయాలన్నీ వస్తాయి. ఈ వర్గీకరణ ప్రభుత్వ కార్యకలాపాల ప్రభావం ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందో తెలియచేస్తుంది.

ప్రభుత్వ వ్యయ వర్గీకరణ ప్రధానంగా కొన్ని సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది.

## 8.4. ప్రభుత్వ వ్యయ సూత్రాలు (Canon of Public Expenditure):

పన్నుల సూత్రాల వలె ప్రజలు ప్రభుత్వ వ్యయ నియమాలను ప్రతిపాదించారు. ఇందువలన ప్రభుత్వ వ్యయ విధానాలు అమలుకావటానికి అవకాశం ఏర్పడుచున్నది. ఇందులో కొన్ని సూత్రాలు పరిపాలనా సౌలభ్యత, జాగ్రత్తల కొరకు మరికొన్ని ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ, నిర్దేశించుకున్న వైవిధ్య లక్ష్యాలను చదువుకోవటానికి సహాయం అందించటానికి ఉపయోగపడతాయి. క్రింద పేర్కొన్న ప్రభుత్వ వ్యయ నియమాలు విశాల దృక్పథంతో వివరించక, వివరణాత్మకమైన సూచనలు కావాలంటే ప్రతి ఒక్క అంశంలో విడిగా విశ్లేషించాల్సి ఉంది. వీటిలో ప్రధానంగా (1) ఆర్థిక నియమము (2) మిగులు సూత్రము (3) మంజూరు నియమము (4) ప్రయోజన సూత్రము (5) దేశకార్యకలాపాల విస్తరణ సూత్రము.

## 8.5. ప్రభుత్వ వ్యయ నియమాలు:

మిత వ్యయ నియమము:

అవసరాలతో పోలిస్తే వనరులు ఎప్పుడూ పరిమితంగానే ఉంటాయి. అందుచేత వనరులను వృధా చేయరాదు. ప్రభుత్వం వ్యయం చేసే క్రమంలో తప్పనిసరిగా అవసరమైన దాని కంటే మించి వనరులను ఉపయోగించకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వ నిధులు వృధా వ్యయం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వ వ్యయాన్ని అంచనా వేయటంలో శాస్త్రీయ దృక్పధాన్ని పాటించటంలో మరింత జాగ్రత్త వహించాలి. సాధారణంగా ప్రభుత్వ వ్యయానికి ప్రణాళిక రూపొందించటంలో, దానికి అనుమతి సంపాదించటంలో, అమలు పరచటంలో జరిగే జాప్యం ఫలితంగా వృధా జరగటానికి అవకాశం ఉంది. ప్రణాళికను రూపొందించటంలోనూ, అమలు పరచటంలోనూ జరిగే లోపాల ఫలితంగా మరియు కాలయాపన ఫలితంగా కొన్ని ప్రయోజనాలను కోల్పోవటం జరుగుతుంది. ఈ కాలయాపన కారణంగా ధరలు పెరిగి ఖర్చులు పెరిగిపోతాయి. అందువలన వ్యయ నియంత్రణ పద్ధతులు పాటించాలి.

ప్రభుత్వ వ్యయం చేసే సందర్భంలో వనరులు వ్యర్థం కాకుండా చూడటమే కాక ఆ వ్యయం ఫలితంగా ప్రజలకు కలిగే సామాజిక ప్రయోజనాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. అలాంటి సందర్భాలలో అధిక వ్యయం చేయటానికి కూడా సిద్ధపడాలి. ఉత్పాదక శక్తిని అధికం చేసే ప్రజల ఆదాయాలను పెంచుటకు మిత వ్యయమని షిరాస్ అభిప్రాయం.

మిగులు వ్యయ నియమము:

ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఆదాయం కంటే తక్కువగా ఉండాలని, మిగులు ఆదాయం ఏర్పాటు చేసుకోవాలని ఈ నియమం చెప్తుంది. ప్రభుత్వాలు ఆదాయానికి మించిన వ్యయాలు చేయకూడదు. ప్రతి వ్యక్తి తన ఆదాయానికి తగినట్టు ఎట్లా ఖర్చు చేయాలో అదేవిధంగా ప్రభుత్వాలు కూడా తన ఖర్చుకు తగిన ఆదాయం సేకరించాలని షిరాస్ అభిప్రాయం. అయితే ఆధునిక అర్థశాస్త్రవేత్తలు ఈ సూత్రాన్ని సమర్థించలేదు. ఆర్థిక వ్యవస్థలోని పరిస్థితులు ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండవు. ఒక్కొక్కసారి ఆర్థిక మాంద్యల ఏర్పడవచ్చు. ప్రైవేటు పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టటానికి ముందుకురారు. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వాలు ఎక్కువగా పెట్టుబడులు చేసి వ్యయాలను పెంచవలసి ఉంటుంది. అప్పుడు మిగులు నియమం సమర్థనీయం కాదు. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వం లోటు బడ్జెట్ అనుసరిస్తుంది. అలాగే ద్రవ్యోల్బణ పరిస్థితులలో మిగులు బడ్జెట్ విధానాన్ని అనుసరిస్తుంది. ఈ విధానం వల్ల ద్రవ్యోల్బణ పరిస్థితిని అదుపులో ఉంచవచ్చును. ఈ కారణాల వల్ల ఆధునిక అర్థశాస్త్రవేత్త మిగులు వ్యయ నియమానికి ఒక క్రొత్త అర్థాన్ని ఇచ్చారు. ప్రభుత్వ వ్యయాలు రూపొందించుకున్నప్పుడు ప్రభుత్వ వ్యయం కన్నా ప్రయోజనం అధికంగా ఉండటమే మిగులు నియమమని వీరి అభిప్రాయం.

మంజూరు నియమం:

ప్రభుత్వ అధికారులు చేసే ప్రతి వ్యయం ప్రభుత్వ ఆమోదం పొంది ఉండాలి. సరైన ఆమోదం లేనిదే ఏ వ్యయం చేయరాదు. ఈ నియమం వలన ప్రభుత్వ వనరులు దుర్వినియోగం కావు. ఈ విధంగా చేయటం వలన గరిష్ట ప్రయోజనానికి దోహదం చేయని వ్యయాన్ని నివారించవచ్చు. అంతేకాక ప్రాంతాలకు, కొన్ని పనుల కోసం ఎక్కువ ఖర్చు చేసి మిగతా వాటిని నిర్లక్ష్యం చేయకుండా ఉండటానికి కూడా ఈ నియమం అవసరం. వ్యయంపై యాజమాన్య నిర్ణయాధికారం ఒక ఉన్నత అధికార వ్యవస్థకు (పార్లమెంటు) అప్పగించటం ద్వారా అన్ని ప్రాంతాలకు, అన్ని వర్గాలకు న్యాయం జరిగేటట్లు వ్యయాన్ని పంచటానికి వీలు ఉంటుంది. ఒక్కొక్క అంశానికి కొంత మొత్తాన్ని కేటాయించిన తరువాత ఆ ద్రవ్యాన్ని ఖర్చు చేయటానికి తక్కువ స్థాయిలోని అధికారులకు అప్పగించవచ్చు.

ప్రయోజన సూత్రము:

ప్రభుత్వాలు నిధులను వ్యయం చేస్తున్నప్పుడు సామాజిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవాలి. ప్రభుత్వ వ్యయాల ద్వారా గరిష్ట ప్రయోజనం సమాజానికి అందేటట్లు చూడాలి. ప్రభుత్వ వ్యయాలను ఒక పద్ధతిలో రూపొందించుకోవాలి. అవి ఏ ఒక్కరికి గాని లేదా కొందరికి గాని ప్రయోజనకరంగా ఉండకూడదు. సమాజం అంతా ఉపయోగం పొందేటట్లు ప్రభుత్వాలు వాటి వ్యయ విధానాన్ని రూపొందించుకోవాలి. వినియోగదారుడు ఉపాంత ప్రయోజనం ఎక్కువగా ఉన్న వస్తువుపై ఎక్కువ వ్యయం చేస్తాడు. ఏ వస్తువుకైతే ఉపాంత ప్రయోజనం తక్కువగా ఉందో దాని వినియోగిన్ని తగ్గించి వేస్తాడు. ఇలా చేయటం వలన తాను వ్యయం చేస్తున్న అన్ని వస్తువుల నుండి వచ్చే ఉపాంత ప్రయోజనం ఒకే విధంగా ఉండి వినియోగదారుడు అధిక ప్రయోజనాన్ని పొందుతాడు. ప్రభుత్వాలు కూడా ఇదే విధానాన్ని అనుసరించాలి. ఏ కార్యక్రమాలు అధిక ప్రయోజనం ఇస్తాయో వాటిపై ఎక్కువ వ్యయం చేయాలి. సాంఘిక ప్రయోజనం వేటి మీదనయితే స్వల్పంగా ఉంటుందో వాటి మీద వ్యయాలు తగ్గించాలి. ఈ విధంగా చేయటం వలన వివిధ రంగాలలోని ఉపాంత, సాంఘిక ప్రయోజనం సమానమై సామాజిక శ్రేయస్సు గరిష్ట స్థాయిని చేరుకుంటుంది. వివిధ రంగాలకు వనరులు కేటాయించినపుడు తప్పని సరిగా గరిష్ట సామాజిక సూత్రాన్ని అనుసరించాలి.

దేశ కార్యకలాపాల విస్తరణ సూత్రం.

భారత దేశం వంటి అభివృద్ధి [illegible] కం, సాంఘిక, ఆర్థిక అసమానతలు తగ్గకపోతే దేశపురోగతి దెబ్బతింటుం. [illegible] ఉత్పత్తి తగ్గుదల, నిరుద్యోగిత పెరగడం వంటి సమస్యలు తీవ్రమౌతాయి. ఇలాంటి స్థితిలో పెట్టుబడి ద్వారా ధనిక వర్గాలు వ్యవస్థను కొల్లగొట్టడానికి దోహదపడతాయి. ఇలాంటి స్థితిలో ప్రభుత్వం స్వాతంత్ర్యాన్ని, దేశ అభివృద్ధిని వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యయం చేయాల్సి ఉంటుంది.

## 8.6. ఇతర ఆర్థికవేత్తల నియమాలు:

ఆర్థికవేత్తలు మరికొన్ని ప్రభుత్వ వ్యయ నియమాలను సూచించారు. వాటిని దిగువ పేర్కొన్న విధంగా క్లుప్తంగా వివరి[illegible]

1) వ్యాకోచత్వ నియమం: వ్యవస్థలో వస్తున్న అవసరాలను బట్టి వ్యయాన్ని పెంచడానికి, తగ్గించడానికి అవసరమైన సంకోచ వ్యాకోచాలకు వ్యయ విధానంలో అవకాశం ఉండాలి. ఉదాహరణకు సాధారణ పరిస్థితిలో కంటే యుద్ధ సమయంలో ప్రభుత్వ వ్యయాన్ని పెంచవలసి యుంటుంది. అవసరాన్ని బట్టి వనరులను ఒక రంగం నుండి మరొక రంగానికి తరలించడానికి అవసరమైన సరళత్వం ప్రభుత్వ వ్యయ విధానంలో ఉండాలి.

2) సమాన పంపిణీ నియమం: ప్రభుత్వం చేసే వ్యయం ప్రజల మధ్య ఆదాయ అసమానతలను తగ్గించేవిగా ఉండాలి. ఇందుకోసం సాంఘిక సంక్షేమం, సామాజిక భద్రత వంటి అంశాలపై వ్యయం ఎక్కువగా ఉండాలి. ఈ నియమం అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలకు కూడా ప్రయోజనకరం.

3) ఉత్పాదకతా నియమం: ప్రభుత్వం అనుత్పాదక కార్యక్రమాలపై వ్యయం చేయరాదు. సాధ్యమైనంత గరిష్ట స్థాయిలో ఉత్పత్తిని పెంచే దిశగా ప్రభుత్వ వ్యయం జరగాలి.

## 8.7. సారాంశము:

కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ప్రజల కోసం చేసే వ్యయాన్ని ప్రభుత్వ వ్యయం అంటారు. విదేశీదాడుల నుండి ప్రజలను రక్షించడానికి గాని లేక ప్రజల ఆర్థిక, సాంఘిక సంక్షేమం పెంపొందించడానికి గాని ఖర్చు చేస్తుంది. ఒక్కొక్క ఆర్థికవేత్త ఒక్కొక్క రకమైన వ్యయాన్ని ఒక ప్రత్యేక అంశానికి ప్రాధాన్యతనిస్తూ తమ అభిప్రాయాలను తెలిపారు. వారిలో డాల్టన్, శ్రీమతి హిక్స్ ముఖ్యులు. ప్రతి శాఖకు ఎంతమేర నిధులు కేటాయిస్తారో చూపేదాన్ని ఏజన్సీ విభజన అంటారు. జర్మనీ శాస్త్రవేత్త కోహెన్, అమెరికా శాస్త్రవేత్త ప్లేన్ ప్రభుత్వ వ్యయాలను నాలుగు రకాలుగా విభజించారు. నికల్సన్ ఈ వ్యయాలను నాలుగు రకాలుగా, జె.ఎస్.మిల్ ఐచ్ఛికమైనవి గాను, అత్యవసరమైనవిగాను విభజించారు. షిరాస్ వీటిని ప్రాథమిక, గౌణ వ్యయాలని విభజించారు. ప్రభుత్వం నుండి ఆదాయం లేక ద్రవ్యాన్ని పొందిన వ్యక్తి తిరిగి ఏమి ఇవ్వక పోతే వాటిని గ్రాంట్లు అంటారు. ప్రభుత్వం నుండి ద్రవ్యాన్ని పొందిన వ్యక్తి ప్రభుత్వానికి వస్తువుల లేదా సేవల రూపంలో బదులు ఇస్తే అది కొనుగోలు ధర అవుతుంది.

ఎ.సి.పిగూ ప్రభుత్వ వ్యయాలను బదిలీ వ్యయాలు, బదిలీ కాని వ్యయాలుగా వర్గీకరించాడు. జె.కె. మెహతా స్థిర,చర వ్యయంగా వర్గీకరించాడు. పన్నుల సూత్రాల వలె ప్రజలు ప్రభుత్వ వ్యయ నియమాలను ప్రతిపాదించారు. ప్రభుత్వ వ్యయనియమాలు నాలుగు రకాలుగా ఉన్నాయి. అవి (1) మిత వ్యయ నియమం (2) మిగులు వ్యయ నియమం (3) మంజూరు నియమం (4) ప్రయోజన సూత్రము. పెట్టుబడి ద్వారా ధనిక వర్గాలు వ్యవస్థను కొల్లగొట్టకుండా ఉండాలంటే ప్రభుత్వం స్వాతంత్ర్యాన్ని దేశ అభివృద్ధిని వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యయం చేయాలి. దీనినే దేశ కార్యకలాపాల విస్తరణ సూత్రం అంటారు. ఇతర ఆర్థికవేత్తల నియమాలను వ్యాకోచ నియమం, సమాన పంపిణీ నియమం, ఉత్పాదకతా నియమాలుగా విభజింపవచ్చును.

## 8.8. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1) ప్రభుత్వ వ్యయాన్ని వివిధ ఆర్థిక శాస్త్రవేత్తలు వివిధ రకాలుగా వర్గీకరించారు.

2) ప్రభుత్వం వ్యయం చేసేటప్పుడు కొన్ని సూత్రాలను పాటించాలి. వీటినే ప్రభుత్వ వ్యయ నియమాలు అని అందురు.

3) ప్రభుత్వ వ్యయ నియమాలలో కొన్ని మార్పులు జరుగుతున్నాయి.

## 8.9. కఠిన పదాలు:

1) గ్రాంట్లు: ప్రభుత్వం నుండి ఆదాయాన్ని లేదా ద్రవ్యాన్ని పొందిన వ్యక్తి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా ఏమి బదులు ఇవ్వకపోతే ఆ వ్యయం గ్రాంటు అవుతుంది.

2) మిగులు వ్యయ నియమము: ప్రభుత్వ వ్యయము, ప్రభుత్వ ఆదాయము కంటే తక్కువగా ఉండాలని, మిగులు ఆదాయం ఏర్పాటు చేసుకోవాలని ఈ నియమము చెపుతుంది.

3) మిత వ్యయ నియమము: ఈ నియమం ప్రకారం ప్రభుత్వ వ్యయంలో దుబారా ఉండకూడదు.

## 8.10. నమూనా ప్రశ్నలు:

I. వ్యాసరూప ప్రశ్నలు:

1) ప్రభుత్వ వ్యయం అనగానేమి? ప్రభుత్వ వ్యయ వర్గీకరణపై వివిధ ఆర్థికవేత్తల భావనలను వివరింపుము?

2) ప్రభుత్వ వ్యయ నియమాలను తెలుపుము?

3) ఇతర ఆర్థికవేత్తల నియమాలను వివరింపుము?

II. సంక్షిప్త ప్రశ్నలు:

1) డాల్టన్ ప్రభుత్వ వ్యయ వర్గీకరణ.

2) ఎ.సి. పిగూ ప్రభుత్వ వ్యయ వర్గీకరణ.

3) ప్రభుత్వ వ్యయ సూత్రాలు.

4) ఆర్థిక వర్గీకరణ.

## 8.11. చదువదగిన గ్రంథాలు:


1) B.P. Thyagi : Public Finance
2) H.L.Bhatia : Public Finance
3) Hugh Dalton : Public Finance
4) తెలుగు అకాడమీ : ప్రభుత్వ అర్థశాస్త్రము.


- డా॥ ఎ.రాజశేఖర్

పాఠం : 9

# ప్రభుత్వ వ్యయ సిద్ధాంతాలు

## 9.0. లక్ష్యం:

పెరుగుచున్న ప్రభుత్వ కార్యకాలాపాల వలన ప్రభుత్వ వ్యయం కూడా అన్ని దేశాలలోను క్రమేపి పెరుగుచున్న ప్రభుత్వ వ్యయ పద్ధతి, వనరుల కేటాయింపులు ప్రయోజనాన్ని గరిష్టం చేయడానికి ప్రయత్నించాలి. ఈ పాఠం ద్వా మనము ప్రభుత్వ వ్యయం ఏవిధంగా ఉండాలి అనేది తెలుసుకుంటాము.

## విషయసూచిక


- 9.1. ఉపోద్ఘాతము
- 9.2. వాగ్నార్ సిద్ధాంతము
- 9.3. సోషల్ బ్యాలెన్స్ థీరీ
- 9.4. స్వచ్ఛంద వినిమయ సిద్ధాంతము
- 9.5. పిగూ-డాల్టన్‌ల సిద్ధాంతము
- 9.6. సారాంశము
- 9.7. గుర్తుంచుకోవలసిన విషయాలు
- 9.8. కఠిన పదాలు
- 9.9. నమూనా ప్రశ్నలు
- 9.10. చదువదగిన గ్రంథాలు.


## 9.1. ఉపోద్ఘాతము:


ప్ర[illegible]యం ద్వా[illegible] సృష్టి అయ్యే వస్తుసేవలు ప్రయోజనాలను అందచేస్తాయి. ప్రభుత్వ వ్యయ పద్ధతి వనరులకేటాయింపులు, ప్రయోజనాన్ని గరిష్టం చేయడానికి ప్రయత్నించాలి. ప్రభుత్వ వ్యయ పరిమాణం ఎంత ఉండాలి పబ్లిక్, ప్రైవేటు రంగాల మధ్య ఏవిధంగా ఉండవలె? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం కొ[illegible] సిద్ధా[illegible]ను పరిశీలించవ[illegible]

## 9.2. వాగ్నార్ సిద్ధాంతము:

ప్రభు[illegible] అన్ని దేశాలలోను ప్ర[illegible]త్సరము పెరుగుచూ ఉం[illegible] ఉంటుంది. దీనికి కారణం [illegible]ర్యకలాపాల [illegible]ువ కావడమే అనేది వాగ్నార్ అభిప్రాయం. 19వ శతాబ్దపు చివరి రోజులలో వాగ్నా[illegible] [illegible] శాస్త్రవేత్త దీనిని ఒక సూత్రరూపంలో తెలిపినాడు. దీనినే "ప్రభుత్వ కార్యకలాపాల పెరుగుదల సూత్రవ[illegible]' (Law of mineasing static activities) అని అనవచ్చు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలో వివిధ కాలాలల[illegible] కేంద్ర, స్థానిక ప్రభుత్వ కార్యకలాపాలు క్రమంగా పెరుగుచున్నాయి.

ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ప్రభుత్వ రంగ వృద్ధికి సంబంధమున్నదని వాగ్నార్ అభిప్రాయము. దేశము పారిశ్రామిక వంతమవుచున్న కొద్ది ప్రభుత్వ రంగము సాపేక్షంగా విస్తరిస్తుంది. దీనికి ప్రధాన కారణం సాంఘిక ప్రగతి. అందువలన పారిశ్రామికమవుతున్న ఆర్థిక వ్యవస్థలలో ప్రభుత్వ రంగము విస్తరించటానికి సాంఘిక ప్రగతి ప్రధాన కారణమని దీనివలన (1) ప్రభుత్వ నిధులు పెరుగుతాయని (2) ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల మొత్తం పరిమాణం, సాపేక్ష పరిమాణం కూడా పెరుగుతాయని వాగ్నార్ పరికల్పన. ఈ పరికల్పనను పరీక్షించడానికి వాగ్నార్ ప్రభుత్వ నిధులను రెండు రకాలుగా విభజించినాడు. (ఎ) శాంతిభద్రతలను నెలకొల్పడం (బి) ఆర్థిక వస్తువులను ఉత్పత్తి చేయడం; దీనివల్ల ప్రభుత్వ జోక్యం అవసరం; అందువలన ప్రభుత్వ వ్యయ పెరుగుదల జరుగుతుంది.

ఇతని అభిప్రాయంలో ప్రభుత్వ రంగ సాపేక్ష విస్తరణను క్రింది రేఖా పటం ద్వారా వివరించవచ్చును.




పటము: ప్రభుత్వ రంగ సాపేక్ష విస్తరణ

$A_1$ రేఖ ప్రభుత్వ రంగ విస్తరణ స్థిరనిష్పత్తిలో పెరగడాన్ని సూచిస్తుంది. A2 రేఖ సాపేక్ష విస్తరణను చూపిస్తుంది. ప్రభుత్వ రంగ విస్తరణ స్థిర నిష్పత్తిలో పెరిగితే P తలసరి ఆదాయం వద్ద పబ్లిక్ రంగ ఉత్పత్తి Rగా ఉండవలయును. కాని వాస్తవంగా P తలసరి ఆదాయం వద్ద పబ్లిక్ రంగ ఉత్పత్తి R1గా ఉన్నది. RR1 సాపేక్ష విస్తరణ.

వాగ్నార్ పరికల్పన దేశాల పారిశ్రామికాభివృద్ధికి సంబంధించినది. ఆర్థికాభివృద్ధి దశలలో పరిశ్రమలకు సంభందించి మూడింటిని గుర్తించవచ్చు. అవి.


(1) పారిశ్రామికీకరణకు ముందు దశ

(2) పారిశ్రామికీకరణ జరుగుతున్న దశ

(3) పారిశ్రామికీకరణ అనంతర దశ

పారిశ్రామికీకరణకు ముందు, పారిశ్రామికీకరణకు తరువాత దశలలో తలసరి ఆదాయంలోని పెరుగుదలకు, ప్రభుత్వ రంగ వస్తుసేవలకు మధ్య ఉండే వ్యాకోచత్వం ఒకటి కన్నా తక్కువగా ఉంటుంది. అంటే తలసరి ఆదాయం పెరిగిన శాతం కన్నా ప్రభుత్వ రంగ విస్తరణ శాతం తక్కువగా ఉంటుంది. కారణం ప్రజల జీవన ప్రమాణం తక్కువగా ఉంటుంది. ప్రభుత్వ వస్తుసేవలకు ఎక్కువ డిమాండ్ ఉండదు.

పారిశ్రామీకీకరణ జరుగుతున్న దశలో తలసరి ఆదాయము, ప్రభుత్వ రంగ విస్తరణకు మధ్య వ్యాకోచత్వం ఒకటికన్నా ఎక్కువగా ఉంటుంది. అంటే తలసరి ఆదాయం పెరుగుదల కన్నా ప్రభుత్వ రంగ విస్తరణ ఎక్కువగా ఉంటుంది. కారణం ప్రభుత్వ వస్తు సేవలకు డిమాండ్ ఎక్కువగా ఉండటం దీనినే క్రింది రేఖాపటంలో చూడవచ్చు.




పటము: ప్రభుత్వ రంగ విస్తరణ - తలసరి ఆదాయాల మధ్య సంబంధం

ఈ పటంలో A బిందువు వరకు వ్యాకోచత్వం ఒకటి కన్నా తక్కువ. A నుండి B వరకు వ్యాకోచత్వం ఒకటి కన్నా ఎక్కువ. A బిందువు వరకు పారిశ్రామికీకరణకు ముందుదశ; A నుండి B వరకు పారిశ్రామికీకరణ జరుగుతున్న దశ.


వాగ్నార్ సూత్రము గ్రేట్ బ్రిటన్‌లో ప్రభుత్వ వ్యయానికి ఎంతవరకు అన్వయిస్తుందో పీకాక్, వైజ్‌మన్‌లు పరిశీలించారు. ఈ పరిశీలన ఫలితంగా వారు కొన్ని విషయాలను స్పష్టపరిచినారు. వాగ్నార్ సూత్రం ప్రకారం ప్రభుత్వ వ్యయం పెరగడానికి మూడు కారణాలను పీకాక్, వైజ్‌మన్‌లు తెలిపినారు. అవి

(ఎ) తొలగింపు ఫలితం

(బి) విమర్శనా ఫలితం

(సి) కేంద్రీకరణ ఫలితం

**(ఎ) తొలగింపు ఫలితం:** దీని ప్రకారం యుద్ధం లాంటి అత్యవసర సమయాలలో ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది. యుద్ధం తరువాత సమయంలో ఈ వ్యయం యుద్ధానికి పూర్వమున్న స్థాయికి రాదు. దీనినే వారు తొలగింపు ఫలితం అనవచ్చు. యుద్ధకాలంలో ప్రజలు ఎక్కువ పన్నులు భరించడానికి సిద్ధపడతారు. యుద్ధం తరువాత దీనిని ఆసరాగా చేసుకొని ప్రభుత్వ సేవలను పెంచడం జరుగుతుంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని ఏదో ఒకరకంగా ఖర్చు చేయడానికి ప్రయత్నం జరుగుతుంది. అందువల్ల ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది. దీనిని క్రింది రేఖాపటంలో చూడవచ్చు.




**పటము: తొలగింపు ఫలితాలు**

A బిందువు అత్యవసర పరిస్థితి ఏర్పడక ముందున్న ప్రభుత్వ వ్యయాన్ని సూచిస్తుంది. AB బిందువుల మధ్య భేదము అత్యవసర పరిస్థితిలో ప్రభుత్వం వ్యయం పెరుగుదలను తెలియజేస్తుంది. C బిందువు అత్యవసర పరిస్థితి తరువాత ప్రభుత్వ వ్యయాన్ని సూచిస్తుంది. కాని A బిందువు కంటే C బిందువు ఎక్కువ స్థాయిలో ఉన్నది. అట్లాగే E బిందువు C బిందువు కన్నా ఎక్కువ స్థాయిలో ఉన్నది.

**(బి) విమర్శనా ఫలితం:** యుద్ధం వంటి అత్యవసర పరిస్థితులలో ఇదివరకు అంతగా పట్టించుకోని కొన్ని సమస్యలు ప్రభుత్వ దృష్టికి వస్తాయి. వీటిని పరిష్కరించేటందుకు మార్గాలను వెదకవలసి వస్తుంది. దీనిని వీరు విమర్శనా ఫలితం అన్నారు.

**(సి) కేంద్రీకరణ ఫలితము:** ఆర్థికాభివృద్ధితో పాటు ప్రభుత్వ రంగములో కేంద్ర ప్రభుత్వం వాటా రానురాను పెరగడం దీనినే కేంద్రీకరణ ఫలితం అనవచ్చు.

వాగ్నార్ సూత్రంపై విమర్శ:


1) వాగ్నార్ సూత్రంలో ప్రభుత్వ కార్యకలాపాలు అవిచ్ఛిన్నంగా పెరుగుతున్నాయనే సూచన గోచరిస్తుంది. కాని వాస్తవంగా అలా జరుగలేదు.

2) డాల్టన్ అభిప్రాయంలో ఆధునిక ప్రభుత్వాల సామర్థ్యం పెరగడం వలన, ప్రైవేటురంగం కన్నా ప్రభుత్వ రంగం కొన్ని పనులను ఎక్కువ సామర్థ్యంతో నిర్వహిస్తుంది. అందుచేత ప్రభుత్వ రంగమే మేలని భావించి ప్రజలు ఎక్కువ వ్యవహారాలను ప్రభుత్వానికి అప్పచెపుతున్నారు. అందువలన ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది.

3) ప్రజల అభిరుచులు మారడం జరిగినది. ప్రతి పని ప్రభుత్వమే చేయాలన్న అభిప్రాయంలో ప్రజలున్నారు. గనుక ప్రభుత్వ వ్యయం పెరిగినది.

## 9.3. సాంఘిక, సమతూక సిద్ధాంతము: (సోషల్ బ్యాలెన్స్ థీరీ)

ప్రైవేటు, ప్రభుత్వ రంగాల మధ్య వనరులకు సంబంధించిన సాంఘిక సమతూక సిద్ధాంతాన్ని గాల్‌బ్రెత్ అనే ఆర్థికవేత్త ప్రతిపాదించాడు. ప్రైవేటుగా ఉత్పత్తి అయ్యే వస్తువులకు, ప్రభుత్వ రంగము ఉత్పత్తి చేసే వస్తువులకు మధ్య సరి అయిన సంబంధం ఉండవలెనని, అట్లాంటి సరియైన సంబంధాన్నే సోషల్ బ్యాలెన్స్ అనవచ్చునని గాల్‌బ్రెత్ అభిప్రాయము. ప్రైవేటు రంగంలో వస్తువుల ఉత్పత్తి పెరిగినంత మాత్రం చేత పూర్తి ప్రయోజనం పొందలేము. వాటికి సంబంధించిన ఇంకా కొన్ని వస్తుసేవలను ప్రభుత్వ రంగము ఉత్పత్తి చేసినపుడే పూర్తి ప్రయోజనం పొందడానికి అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ప్రభుత్వ రంగంలో 60 శాతం ప్రైవేటు రంగంలో 40 శాతం వనరులు కేటాయించవలెనని ప్రజలు కోరుతుంటే అదేవిధంగా జరిగితేనే గరిష్ట ప్రయోజనం చేకూరుతుంది. దీనినే సాంఘిక సమతూక సిద్ధాంతము అనవచ్చు. ఉదాహరణకు కార్ల ఉత్పత్తి పెరిగినప్పుడు రోడ్ల నిర్మాణం కూడా జరగవలె. సరియైన రోడ్లు లేనప్పుడు మోటారు కార్ల ప్రయోజనం అల్పంగా ఉంటుంది. అదేవిధంగా టెలివిజన్ సౌకర్యాలు పెరగడంతోపాటు విద్యాసౌకర్యాలు కూడా పెరగాలి. కాబట్టి ప్రైవేటు రంగ ఉత్పత్తితో పాటు అవసరమైన ప్రభుత్వ రంగ ఉత్పత్తి పెరగాలి. అలాకాక పోతే సాంఘిక అసమతూకం ఏర్పడుతుంది. దీనిని క్రింది రేఖాపటంలో చూడవచ్చు.




పటం: సాంఘిక సమతూక సిద్ధాంతము

OX అక్షంపై ప్రభుత్వ రంగం, OY అక్షంపై ప్రైవేటు రంగాన్ని తీసుకోవడం జరిగినది. ప్రజల అభిమతం 60 శాతం ప్రభుత్వ రంగంలోను, 40 శాతం ప్రైవేటు రంగంలోను వనరుల కేటాయింపు జరగవలెనని ఉంటే A బిందువు సాంఘిక సమతూకాన్ని సూచిస్తుంది. B,C బిందువులు సాంఘిక అసమతూకాన్ని సూచిస్తాయి. అభివృద్ధి చెందిన దేశాలలో వనరుల కేటాయింపు ప్రభుత్వ సేవలకు తక్కువగాను, ప్రైవేటుగా ఉత్పత్తి అయ్యే వస్తుసేవలకు ఎక్కువగాను జరుగుచున్నదని గాల్‌బ్రెత్ అభిప్రాయం. దీనివలన సమాజానికి అనారోగ్యము, అసౌఖ్యము కలుగుచున్నది.

ఒక సమాజం ఉత్పత్తి చేసే వివిధ వస్తువుల మధ్య సమతూకం ఉండటం ఎంత అవసరమో, సమాజం వివిధ వస్తువులను వినియోగించడంలో కూడా అట్లే సమతూకం ఉండవలె. ఒక వస్తువు వాడకం పెరిగినపుడు, ఇతర వస్తువుల వాడకం కూడా పెరుగుతుంది. ఈ రెండు వస్తువుల మధ్య సరి అయిన సంబంధం ఉండటాన్ని సాంఘిక సమతూకం అనవచ్చు. వనరులను సమతూక బిందువు సూచించిన విధంగా కేటాయించినపుడే సంఘానికి గరిష్ట ప్రయోజనముంటుంది.

ఈ సిద్ధాంతం మిశ్రమ ఆర్థికవ్యవస్థలో వనరుల కేటాయింపు ఏ రకంగా ఉండాలో స్థూలంగా తెలియజేస్తుంది.

## 9.4. స్వచ్ఛంద వినిమయ సిద్ధాంతము:

ఈ సిద్ధాంతము ప్రకారము, ప్రభుత్వ రంగానికి వనరులను కేటాయించడం అనేది మార్కెట్ విధానంలో ధరలను బట్టి కేటాయించవలెనని తెలియజేస్తుంది. అంటే ఒక వ్యక్తి ఏ విధంగా మార్కెట్‌లో వివిధ వస్తువులకు ధర చెల్లిస్తున్నాడో, అదేవిధంగా ప్రభుత్వరంగ ఉత్పత్తులకు కూడా పన్నులను చెల్లించుకుంటున్నాడు. కాబట్టి ప్రభుత్వ రంగా వస్తుసేవలను కొనేటప్పుడు ప్రతివ్యక్తి రెండు సూత్రాలను పాటిస్తాడు అవి.

(1) ప్రభుత్వ రంగ వస్తుసేవలు కొన్నందువలన వచ్చే ఉపాంత ప్రయోజనాన్ని పన్నులచెల్లింపు వల్ల వచ్చే ఉపాంత భారంతో సమానమయ్యేటట్లు చూస్తాడు.

(2) ప్రభుత్వ రంగ వస్తువులు, ప్రైవేటు రంగ వస్తువులు కొన్నందున వచ్చే ఉపాంత ప్రయోజనం సమానంగా ఉండేటట్లు చూస్తాడు.

స్వచ్ఛంద వినిమయ సిద్ధాంతాన్ని అనేకమంది రచయితలు ప్రతిపాదించారు. కాని సిద్ధాంతానికి [illegible] ఇచ్చిన వ్యక్తి స్వీడన్‌కు చెందిన ఏరిక్‌విందాన్.

**ఎరిక్‌విందాన్ వివరణ:**

ఇతని అభిప్రాయంలో పన్నులు విధించేటప్పుడు ముఖ్యంగా గమనించవలసిన విషయాలు రెండు. అవి (1) పన్నుల ద్వారా ఆదాయం, పంపిణీలో న్యాయాన్ని కలుగజేయటం (2) పంపిణీని మార్చకుండా, వివిధ ప్రభుత్వ సేవలకు కావలసిన ద్రవ్యాన్ని సమకూర్చటం.

ప్రభుత్వ సేవలకు కావలసిన ద్రవ్యాన్ని సమకూర్చటమనేది. అత్యంత ముఖ్యమైన సమస్య. దీనిని వివిధ వర్గాల ప్రజల నుండి రాబట్టటం అనేది జరగాలి. ప్రభుత్వ రంగం సమకూర్చే వస్తుసేవల వలన ప్రజలందరి ప్రయోజనం చేకూరుతుంది. ఈ వస్తుసేవలను సమకూర్చటానికి ప్రభుత్వం కొంత వ్యయం చేయవలసి ఉంటుంది. ఆ వ్యయాన్ని ప్రజలందరూ పన్నుల రూపంలో చెల్లించవలెను. వస్తువులను తయారు చేయటానికి కావలసిన వ్యయం కన్నా, ప్రజలు చెల్లించదలచుకున్న పన్నులు ఎక్కువగా ఉంటే ప్రభుత్వ వస్తుసేవల ఉత్పత్తి పెరుగుతుంది. ఉత్పత్తి వ్యయానికన్నా పన్నుల మొత్తం తక్కువగా ఉంటే ఉత్పత్తి తగ్గుతుంది. ఈ రెండు సమానంగా ఉంటే ప్రభుత్వ ఉత్పత్తికి సమతూకం ఏర్పడుతుంది. ఉదాహరణకు X,Y అనేవి సమిష్టిగా తయారైన వస్తువులనుకొని వీటిలో A అనేవాడు Xను, B అనేవాడు Yని కొంటున్నాడు అనుకోండి, అప్పుడు ఈ రెండు వస్తువుల ఉత్పత్తిలో కొద్దిభాగం మాత్రమే చెల్లించటానికి ఇష్టపడితేB మొత్తం ఖర్చులో ఎక్కువ భాగాన్ని భరించవలసి [illegible] పరిస్థితి సాంఘిక వస్తువుల విషయంలో కూడా ఉంటుందని విందాల్ వాదన. వీరిద్దరు చెల్లించే మొత్తం (పన్ను) [illegible]నప్పుడు "సాం[illegible] వస్తువు" ఉత్పత్తి [illegible] తౌల్య స్థితిని చేరుతుంది.

ఈ [illegible] ప్రయోజన సిద్ధాంతాన్ని, పన్నుల చెల్లింపు సామర్థ్య సిద్ధాంతాన్ని రెండింటిని సమన్వయయం చేస్తున్నాడు విండీల్. ఈ సిద్ధాంతం కొన్ని విమర్శలకు లోనైంది.

**విమర్శలు:**

1) వ్యక్తులు పన్ను చెల్లింపులో తమ నిజ అభీష్టాలను తెలియచేస్తారని ఊహించటం సరియైనది కాదు. [illegible] ప్రభుత్వం విధించే నిర్బంధ విధింపు.

2) ఒకే ప్రయోజనానికి కొందరు తమ సామర్థ్యాన్ని బట్టి ఎక్కువ చెల్లిస్తారని, మరి కొందరు తక్కువ చెల్లిస్తారని ఊహించడం పొరపాటు. పైగా ఇది ప్ర[illegible]లకు [illegible]ద్ధం.


## 9.5. పిగూ-డాల్టన్ సిద్ధాంతము

వీరి అభిప్రాయంలో ప్రభుత్వ వ్యయ పరిమితిని నిర్ణయించటంలో ఉపాంత సిద్ధాంతము ఉపయోగపడుతుందని చెప్పారు. దీనిని క్రింది విధంగా చెప్పవచ్చు. (ఎ) వ్యయాన్ని వివిధ రంగాలకు కేటాయించడంలో అనుసరించవలసిన సూత్రము (బి) మొత్తం వ్యయ పరిమాణాన్ని నిర్ణయించుటకు సూత్రము.

(ఎ) వ్యయాన్ని వివిధ రంగాలకు కేటాయించటము. ప్రభుత్వ వ్యయాన్ని వివిధ రంగాలకు కేటాయించినప్పుడు ఉపాంత ప్రయోజన సూత్రాన్ని వర్తింపచేయవలె. వివిధ రంగాలలో వ్యయం వలన వచ్చే ఉపాంత ప్రయోజనాన్ని పోల్చవలె. ఏ రంగములో ఉపాంత ప్రయోజనం ఎక్కువగా ఉంటుందో ఆ రంగానికి కేటాయించవలె. ఇలా అన్ని రంగాలలో ఉపాంత ప్రయోజనం సమానమయ్యేటట్లుగా వ్యయాన్ని పంపిణీ చేయాలి. అప్పుడే గరిష్ట సాంఘిక ప్రయోజనము చేకూరుతుంది.

(బి) వ్యయపరిమాణాన్ని పెంచవలెనా లేదా అనేవిషయం నిర్ణయించేటప్పుడు ఉపాంత వ్యయ ప్రయోజనము పన్నులవలన కలిగే ఉపాంతభారము ఈరెండింటిని పోల్చాలి. ఈ రెండూ సమానమయ్యే దగ్గర ప్రభుత్వ వ్యయ పరిమాణాన్ని నిర్ణయించాలి.

ఈ సూత్రము యొక్క అర్థం ఏమనగా ప్రైవేటు రంగములోని వస్తువుల ఉపాంత ప్రయోజనం, ప్రభుత్వ రంగములోని వస్తువుల ఉపాంత ప్రయోజనం సమానంగా ఉండాలి. అప్పుడే గరిష్ట సాంఘిక ప్రయోజనం చేకూరుతుంది. దీనిని క్రింది రేఖాపటంలో చూడవచ్చు.




పటం: పిగూ - డాల్టన్ సిద్ధాంతము

పైన చూపిన రేఖాపటంలో రెండు (x,y) రేఖాపటాలున్నాయి. x రేఖాపటం ప్రైవేటు రంగములో ఉపాంత ప్రయోజనాన్ని y రేఖాపటం ప్రభుత్వ రంగములో ఉపాంత ప్రయోజనాన్ని తెలియచేసాయి.

పై రేఖాపటంలో OR ప్రైవేటు రంగంలోను, OR1 ప్రభుత్వరంగంలోను వ్యయమైనప్పుడు ఉపాంత ప్రయోజనం (OM) రెండు రంగాలలోను సమానంగా ఉన్నది. అది ప్రైవేటు ప్రభుత్వ రంగాలకు ఉండవలసిన పరిమితి. ప్రైవేటు రంగములో ఉన్న వ్యయం OR నుండి OSకు పెంచితే ఉపాంత ప్రయోజనము AS; ప్రభుత్వ రంగ వ్యయాన్ని OR1 నుండి OS1కు పెంచితే ఉపాంత ప్రయోజనం BS1; గాని AS>BS1. అందువలన వ్యయాన్ని ప్రభుత్వ రంగము నుండి ప్రైవేటు రంగానికి బదిలీ చేయడం వలన ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. కాబట్టి ప్రైవేటు రంగ వ్యయం OR ప్రభుత్వ రంగములో OR1 ఉండటం వలన గరిష్ట ప్రయోజనం చేకూరుతుంది.

**ఈ సిద్ధాంతంలోని సుగుణాలు:**

1) ఈ సిద్ధాంతము, పన్నులను, ప్రభుత్వ వ్యయాన్ని ఒకే పర్యాయం చర్చిస్తుంది. అందువల్ల దీనిలో సౌష్టవం ఉన్నదనవచ్చు.

2) ప్రభుత్వ రంగంలోను, ప్రైవేటు రంగములోను వనరుల కేటాయింపు ఎలా ఉండవలెనో తెల్పుతుంది.

**లోపాలు:**

1) ఈ సిద్ధాంతం ప్రకారం, ప్రభుత్వ వ్యయ ప్రయోజనాన్ని, పన్నుల భారాన్ని కొలవడానికి తగిన సాధనాలు లేవు. అవి మానసిక భావనలు.

2) ప్రయోజనాన్ని వివిధ వ్యక్తుల మధ్య పోల్చలేము.

## 9.6. సారాంశము:

ప్రతి దేశంలో ప్రభుత్వ వ్యయము పెరుగుతూ ఉన్నది. ప్రభుత్వ కార్యకలాపాల పెరుగుదల మూలంగానే ప్రభుత్వ వ్యయం పెరుగుతూ ఉన్నది. సమాజంలో ఉత్పత్తి చేసే వివిధ వస్తువుల మధ్య సమతూకం ఉండటం ఎంత అవసరమో, వస్తువులను వినియోగించటంలో కూడా అదేవిధంగా సమతూకం ఉండాలి.

## 9.7. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1) వాగ్నర్ అనే ఆర్థికశాస్త్రవేత్త ప్రకారం ప్రభుత్వ కార్యకలాపాల పెరుగుదల మూలంగానే ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది.

2) వాగ్నర్ సూత్రము ఇంగ్లాండ్‌లో ప్రభుత్వ వ్యయానికి ఎంతవరకు అన్వయిస్తుందో పీకాక్ మరియు వైజ్‌మన్‌లు పరిశీలించారు.

3) ప్రైవేటు, ప్రభుత్వ రంగాల మధ్య వనరులకు సంబంధించిన సాంఘిక సమతౌల్య సిద్ధాంతాన్ని గాల్‌బ్రెత్ అనే ఆర్థికవేత్త ప్రతిపాదించారు.

4) స్వచ్ఛంద వినిమయ సిద్ధాంత ప్రకారం ప్రభుత్వ రంగానికి వనరులను కేటాయించటం అనేది మార్కెట్ విధానంలో ధరలను బట్టి కేటాయించవలెనని తెలియజేయును.

5) పిగూ-డాల్టన్‌ల సిద్ధాంతము ప్రకారం ప్రభుత్వ వ్యయ పరిమితిని నిర్ణయించటంలో ఉపాంత వ్యయ సిద్ధాంతము ఉపయోగపడును.

## 9.8. కఠిన పదాలు:

1) **తొలగింపు ఫలితము:** యుద్ధములు మొదలగు అత్యవసర సమయాలలో ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది. యుద్ధం తరువాత ఈ వ్యయం యుద్ధానికి పూర్వం ఉన్న స్థాయి రాదు. దీనినే తొలగింపు ఫలితం అందురు.

2) **విమర్శనా ఫలితము:** యుద్ధము వంటి అత్యవసర పరిస్థితులలో ఇదివరకు అంతగా పట్టించుకోని సమస్యలు ప్రభుత్వ దృష్టికి వస్తాయి. వీటిని పరిష్కరించేటందుకు మార్గాలను వెతకవలసి వచ్చును. దీనినే విమర్శనా ఫలితము అని అందురు.

3) **కేంద్రీకరణ ఫలితము:** ఆర్థికాభివృద్ధితో పాటు ప్రభుత్వ రంగములో కేంద్రప్రభుత్వం వాటా క్రమంగా పెరుగును. దీనినే కేంద్రీకరణ ఫలితము అని అందురు.

## 9.9. నమూనా ప్రశ్నలు:

I. వ్యాసరూప ప్రశ్నలు:

1) వాగ్నర్ ప్రభుత్వ కార్యకలాపాల పెరుగుదల సూత్రాన్ని విమర్శనాత్మకంగా పరిశీలింపుము.

2) సాంఘిక సమతూక సిద్ధాంతాన్ని వివరింపుము.

II. సంక్షిప్త ప్రశ్నలు:

1) స్వచ్ఛంద వినిమయ సిద్ధాంతాన్ని గూర్చి వ్రాయుము.

2) ప్రభుత్వ వ్యయానికి సంబంధించి పిగూ-డాల్టన్‌ల సిద్ధాంతంను గూర్చి వ్రాయుము?

## 9.10. చదువదగిన గ్రంథాలు:


1) The Economics of Public Finance - P.E. Taylor

2) Principles of Public Finance - Hugh Dalton.

3) Public Finance - R.K.Lekhi

4) Public Finance - B.P.Tyagi

5) ప్రభుత్వ అర్థశాస్త్రము - తెలుగు అకాడమీ.


- డా॥ యం.రాజశేఖర బాబు

పాఠం : 10

# ప్రభుత్వ వ్యయ ప్రభావాలు

## 10.0.లక్ష్యం:

అన్ని దేశాలలోను ప్రభుత్వ వ్యయం రానురాను పెరుగుచున్నది. ఈ పెరుగుతున్న ప్రభుత్వ వ్యయం, ప్రత్యక్షంగాను పరోక్షంగాను ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం, సాంఘిక న్యాయాన్ని చేకూర్చటం, అనగా ఆర్థిక వనరుల ఉపయోగాన్ని ప్రభావితం చేసి, ఉత్పత్తి పెరిగేటట్లు చెయ్యడం, సమాజంలో ఉన్న అసమానతలను తగ్గించడం. ప్రభుత్వం ఈ లక్ష్యాలను ఏ విధంగా చెయ్యగలదో ఈ పాఠంలో మనం తెలుసుకోవచ్చు.

## విషయసూచిక


10.1. పరిచయము

10.2. ఉత్పత్తిపై ప్రభావము

10.3. పంపిణీపై ప్రభావము

10.4. సారాంశము

10.5. గుర్తుంచుకోవలసిన విషయాలు

10.6. కఠిన పదాలు

10.7. నమూనా ప్రశ్నలు

10.8. చదువదగిన గ్రంథాలు.


## 10.1. పరిచయము:

ఈ అధ్యాయంలో ప్రభుత్వ వ్యయం ఏయే అంశాలపై ప్రభావం చూపుతుందో మనం తెలుసుకోవచ్చు. ఈ ప్రభుత్వ వ్యయం ఆర్థిక వనరుల ఉపయోగాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది రెండు విధాలుగా ఉండవచ్చు. (1) నిరుపయోగంగా ఉన్న ఆర్థిక వనరులు ప్రభుత్వ వ్యయం వలన ఉపయోగంలోకి రావచ్చు (2) ప్రభుత్వ వ్యయం వలన ఆర్థిక వనరులు మామూలుగా ఉపయోగించే మార్గాల నుండి ఇతర మార్గాలకు మళ్ళిస్తారు.

సాధారణంగా ప్రభుత్వ వ్యయ ప్రభావాన్ని రెండు రకాలుగా చూడవచ్చు.

(1) ఉత్పత్తిపై ప్రభావము.

(2) పంపిణీపై ప్రభావము.

వీటిని క్రింది భాగంలో విధంగా చూడవచ్చు.

## 10.2. ఉత్పత్తిపై ప్రభావము:

ప్రభుత్వ వ్యయం ఉత్పత్తిని ఏవిధంగా ప్రభావితం చేస్తుందో తెలుసుకునేందుకు ఈ క్రింది అంశాలను గమనించాలని డాల్టన్ పేర్కొన్నాడు. ప్రభుత్వ వ్యయం పని, పొదుపు, పెట్టుబడుల ద్వారా మొత్తం ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వ వ్యయం వీటిని పెంచగలిగితే ఉత్పత్తి పెరుగుతుంది. తగ్గించితే ఉత్పత్తి తగ్గుతుంది. ప్రభుత్వ వ్యయం శ్రామికుల సామర్థ్యాన్ని పొదుపు సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అంతేగాక వనరుల వినియోగాన్ని కూడా మారుస్తుంది. కాబట్టి ప్రభుత్వ వ్యయం ఉత్పత్తిని ఏవిధంగా ప్రభావితం చేస్తుందో మూడు రకాలుగా విశ్లేషణ చేయవచ్చు. అవి.

(1) పనిచేయగల సామర్థ్యం, పొదుపు చేయగల శక్తి, పెట్టుబడి పెట్టగలిగే శక్తి.

(2) పనిచేయాలని, పొదుపు చేయాలని, పెట్టుబడి పెట్టాలనే ఆసక్తి.

(3) వివిధ ఉపయోగాల మధ్య, వివిధ ప్రాంతాల మధ్య వనరుల తరలింపు.

**1) పనిచెయ్యగల సామర్థ్యం, పొదుపు చెయ్యగల శక్తి, పెట్టుబడి పెట్టగల శక్తి:** ప్రభుత్వ వ్యయం పట్ల ఉత్పత్తిలో కలిగే మార్పులు తెలుసుకునేందుకు మొదట ఆ ఖర్చు వల్ల పనిచేసే శక్తి ఎట్లా మారుతుందో తెలుసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చే కొన్ని గ్రాంట్లు పని చెయ్యగల సామర్థ్యాన్ని పొదుపు చెయ్యగల శక్తిని పెంచుతాయి. తక్కువ ఆదాయం గల వారికిచ్చే ప్రభుత్వ ద్రవ్య గ్రాంట్లు పనిచేయగల సామర్థ్యాన్ని పొదుపు చేయగల శక్తిని పెంచుతాయి. ఈ గ్రాంట్లు ద్రవ్య రూపంలోనే గాక వస్తుసేవల రూపంలో అందచేస్తే మంచిది. ఉదాహరణకు ఉచిత విద్యా సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, గృహవసతులు మొదలగున్నవి శ్రామిక సామర్థ్యాన్ని పెంచుతాయి. అంతేగాక ఈ సేవలు ఉచితంగా అందించినందున వారి ఆదాయం పెరిగినట్లే. కాబట్టి పొదుపు చెయ్యగల శక్తి కూడా పెరుగుతుంది.

కొన్ని గ్రాంట్లు వాటిని తీసుకున్న వారికన్నా వారి సంతతి సామర్థ్యాన్ని పెంచుతాయి. ఉదాహరణకు చనిపోయిన సైనికుల కుటుంబాలకిచ్చే ద్రవ్య సహాయం.

పెట్టుబడి పెట్టినవారికి పెట్టుబడి పెట్టేందుకు నిధులను సమకూర్చడం ద్వారా ప్రభుత్వ వ్యయం పెట్టుబడి పెట్టే సామర్థ్యాన్ని పెంచుతుంది.

**2) పని చేయవలెనని, పొదుపు చేయవలెనని, పెట్టుబడి పెట్టవలెననే ఆసక్తి:**

పనిచేయవలెననే ఆసక్తి, పొదుపు చేయవలెననే ఆసక్తి, పెట్టుబడి పెట్టవలెననే ఆసక్తి ప్రభుత్వం గ్రాంటును ఇచ్చే విధానాన్ని బట్టి; ప్రభుత్వ వ్యయ స్వభావాన్ని బట్టి, గ్రాంటును పొందే మనస్తత్వాన్ని బట్టి ఉంటుంది. దీనిని క్రింది ఉదాహరణలతో వివరించవచ్చు.

**(ఎ) పెన్షన్లు, ఋణాలపై ప్రభుత్వం చెల్లించే వడ్డీ:**

పెన్షన్లు, ఋణాల రూపంలో వచ్చే ఆదాయానికి వీటిపై ప్రభుత్వం చెల్లించే వడ్డీ, పని చేయవలెనని ఆసక్తిని గాని, పొదుపు, పెట్టుబడి పెట్టాలనే ఆసక్తిని గాని, పెంచలేదు. వీటిని ప్రభుత్వం నిర్ణీత గడువులో చెల్లిస్తుంది. గనుక, వారిపై ఈ విధమైన ఆదాయం ఏ విధమైన ప్రభావము చూపదు.

**(బి) నిరుద్యోగ భృతి, అనారోగ్యంగా ఉన్నప్పుడు ఇచ్చే గ్రాంట్లు:**

ఈ విధమైన సహాయం పట్ల పనిచేయవలెననే ఆసక్తి తగ్గదు. పైగా ఆసక్తి పెరుగుతుంది. నిరుద్యోగం అనారోగ్యం వంటి క్లిష్ట పరిస్థితులలో, ప్రభుత్వం ఆదుకుంటుందనే నమ్మకం వల్ల శ్రామికులకు పనిచేయవలెనని ఆసక్తి పెరుగుతుంది.

**(సి) వ్యక్తి ఆదాయాన్ని బట్టి, పొదుపును బట్టి ఇచ్చే గ్రాంట్లు:**

వ్యక్తి యొక్క ఆదాయం పెరిగే కొలది, పొదుపు పెరిగే కొలది గ్రాంట్లు పెరుగుతాయని భావిస్తే, ఆ గ్రాంట్లు వల్ల వ్యక్తి పొదుపు చేయవలెననే కోరిక, పనిచేయవలెనే కోరిక పెరుగుతుంది.

**వివిధ ఉపయోగాల మధ్య వివిధ ప్రాంతాల మధ్య వనరుల తరలింపు:**

ప్రభుత్వం వివిధ ఉపయోగాల మధ్య, వివిధ ప్రాంతాల మధ్య వనరులను కేటాయించడంలో మార్పులు తెలుస్తుంది. ఈ వనరుల తరలింపు ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. కొన్ని సందర్భాలలో ఉత్పత్తి పెరగవచ్చు దీనిని క్రింది ఉదాహరణల ద్వారా వివరించవచ్చును.

(1) కొంత మంది ప్రైవేటు వ్యక్తులు ప్రస్తుత అవసరాలకు ప్రాధాన్యమిస్తారు. భవిష్యత్ అవసరాలకు తగినంత ప్రాముఖ్యమివ్వడం జరుగదు. పెట్టుబడి పెట్టేవారు ఎప్పుడో తక్షణ ఫలితాలను దృష్టిలో ఉంచుకుంటారు గాని, దీర్ఘకాలంలో వచ్చే లాభాలను అంతగా గమనించరు. కాబట్టి ప్రభుత్వం జోక్యం కల్పించుకొని ఆర్థిక అవసరాలను భావి అవసరాలకు తరలించే విధంగా ద్రవ్యాన్ని ఖర్చు పెట్టవలె. ఈ విధంగా చేస్తే ఉత్పత్తి పెరుగుతుందని భావించవచ్చు. ఉదాహరణకు విద్యపై ఖర్చు.

(2) ప్రైవేటు వ్యక్తులు వస్తు రూపంలో ఉండే మూలధనానికి ప్రాధాన్య మిస్తారు. మానవ రూపంలో ఉండే ఉత్పత్తి సాధనాన్ని మెరుగు పరచుటకు పెట్టుబడి పెట్టరు. అనగా మానవ ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచడానికి మానవ విజ్ఞానాన్ని పెంపొందించడానికి పెద్దగా శ్రద్ధ వహించరు. వస్తురూపంలో ఉండే మూలధనానికి, మానవ రూపంలో ఉన్న మూలధనానికి మధ్య సమతూకం ఉండేటట్లు చేయడానికి కూడా ప్రభుత్వం పూనుకుంటే భవిష్యత్‌లో ఉత్పత్తి పెరుగుతుంది.

ఉత్పత్తి దృష్ట్యా ఏవిధమైన ప్రభుత్వ వ్యయం వల్ల, అదే ద్రవ్యము ప్రజల దగ్గర ఉన్నప్పటి కంటే ఉత్పత్తి శక్తి ఎక్కువగా పెరుగుతుందో అట్లాంటి వ్యయం సాంఘికంగా అభిలషణీయం. ఈ తరగతికి చెందిన ప్రభుత్వ వ్యయానికి కొన్ని ఉదాహరణలివ్వబడ్డాయి.

**(ఏ) ప్రభుత్వ ఋణాలను తిరిగి చెల్లించడం:**

ప్రభుత్వ ఋణ తీర్మానానికి చేసే ఖర్చు, ఋణాన్ని తీర్చడానికి చెల్లించిన ద్రవ్యము మొత్తం సామాన్యంగా తిరిగి పెట్టుబడి పెట్టడం జరుగుతుంది. అటువంటప్పుడు ఉద్యోగితాస్థాయి ద్వారా ఉత్పత్తిస్థాయి పెరుగుతుంది.

**(బి) రవాణా సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు:**

రవాణా సౌకర్యాలు, అభివృద్ధి చేసే కార్యక్రమాలు ముఖ్యంగా, నీటిపారుదల వసతులు, అడవుల పెంపకం మొదలగు వాటి వలన తక్షణమే ఫలితాలు పెద్దగా లేకపోయినప్పటికిని దీర్ఘకాలంలో ఎంతో సత్ఫలితాలు (లాభాలు) ఉంటాయి. వీటిలో పెట్టుబడి పెట్టడానికి ప్రైవేటు రంగం అంతగా ముందుకురాదు. అందువలన వీటిని ప్రభుత్వమే చేపట్టవలసి ఉంటుంది. ప్రభుత్వం భవిష్యత్ మార్చగలదు. వీటిలో ప్రభుత్వం చేసే వ్యయం వల్ల ఉత్పత్తిని అధికం చేస్తుంది.

**(సి) పరిశోధనలను ప్రోత్సహించడం:**

పరిశోధనలను, నూతన ఉత్పత్తి పద్ధతులలో కనుగొనడానికి ప్రోత్సాహం చేసే వ్యయం వలన విజ్ఞానం పెరుగుతుంది. సాంకేతిక పరిజ్ఞానము పెరుగుతుంది. తద్వారా ఉత్పత్తి పెరుగుతుంది. కాని ఈ రకమైన పరిశోధనలకు అయ్యే వ్యయం చాలా ఎక్కువగా ఉంటుంది. గనుక వీటిపై ప్రభుత్వం మాత్రమే ఖర్చు పెట్టగలదు. ప్రైవేటు రంగానికి సాధ్యం కాదు.

**(డి) విద్య, శిక్షణలపై చేసే వ్యయం:**

! విద్య శిక్షణ కోసం చేసే వ్యయం వల్ల భవిష్యత్‌లో ఉత్పత్తి పెంచే అవకాశం ఉంది. ప్రభుత్వ జోక్యం లేకపోతే సామాన్యంగా విద్యపై తగినంత ఖర్చు జరుగుతుందనే నమ్మకం లేదు. విద్యా సౌకర్యాలను అధికం చేసినట్లయితే వివేకవంతులయిన కార్మికులు తగినంతమంది లభ్యమవడం, వివిధ వృత్తులకు కావలసిన కార్మికులు లభించడం జరుగుచున్నది. వీరివలన అధిక ఉత్పత్తి జరుగుతుంది.

**(ఇ) ప్రజలకు మార్కెట్ సమాచారము అందించడం కోసము వ్యయము:**

ఉత్పత్తిదారులకు వినియోగదారులకు సరియైన సమాచారము లేనందువల్ల ప్రజలు తప్పటడుగులు వేయవచ్చు. అయితే వీరికి ప్రభుత్వము సరియైన సమాచారము అందించుట ద్వారా ఈ తప్పులను సరిచేయవచ్చు. ఆధునిక ప్రభుత్వాలు ఎంతో ఎక్కువ మొత్తాన్ని సాంఘిక ఇతర సమాచారాన్ని ప్రజలకు అందజేసేందుకు ఖర్చు చేస్తున్నారు.

ఉదాహరణకు పంటల అంచనాలు, వాతావరణ సూచనలు మొదలగున్నవి. దీనివలన ఉత్పత్తి కార్యకలాపాలను సరిగా నిర్వహించే వీలుంది.

**(యఫ్) ఆరోగ్య సౌకర్యాలపై వ్యయం:**

ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి చేసే ప్రభుత్వ వ్యయం వలన ప్రజల నాణ్యత, శ్రామిక సామర్థ్యం పెరుగుతుంది. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనేది అందరికి తెలిసినదే ఆరోగ్యాన్ని పెంపొందించినందువలన వచ్చే లాభాలను రూపాయలలో కొలిచి చెప్పే వీలులేదు.

**(జి) సాంఘిక భద్రతా పథకాలపై వ్యయం:**

సాంఘిక భద్రతా పథకాలకు సహాయం చేసేందుకు ప్రభుత్వం పెట్టే ఖర్చులవలన సామర్థ్యం పెరిగి ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నది. తనకు పుట్టినప్పటి నుండి మరణించే వరకు ఉండే అనేక కష్ట సమయాలలో ఆదుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నదనే ధీమా ఉన్నప్పుడు ప్రతి శ్రామికుడు, ఉత్సాహంతో పనిచేసి ఉత్పత్తిని అధికం చెయ్యడానికి నడుం బిగిస్తాడనటంలో సందేహం లేదు. ఉదాహరణకు నిరుద్యోగ భృతి, పెన్షన్లు.

పై ఉదాహరణలను బట్టి అనేక అంశాలపై ప్రభుత్వ వ్యయం పెంచటం ద్వారా ఉత్పత్తిని అధికం చేసే అవకాశం ఉన్నదని స్పష్టమవుతుంది. కాని ఉత్పత్తిని ఈ విధంగా పెంచడంలో కొన్ని పరిమితులు ఉన్నాయి. కాని అనేక దేశాలలో ఈ వ్యయం పరిమితిని దాటలేదని చెప్పవచ్చు.

**ప్రభుత్వ వ్యయం ద్వారా ఆర్థిక వనరులను కొన్ని ప్రాంతాలకు తరలించటం:**

ప్రభుత్వ వ్యయం ద్వారా ఆర్థిక వనరులను వివిధ ప్రాంతాలకు తరలించవచ్చును. ఇట్లు చేయటం వలన ఉత్పత్తి పెరుగుతుంది. కొన్ని ప్రాంతాలలో తగిన సదుపాయాలు లేనందున పరిశ్రమలను స్థాపించలేకపోవచ్చు. అట్లాంటి పరిస్థితులలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్ల వలన అవసరమైన సదుపాయాలను స్థానిక సంస్థలకు కలుగ చేయటానికి వీలవుతుంది. పరిశ్రమలు స్థాపించే అవకాశం ఏర్పడుతుంది. ఉదాహరణకు వెనుకబడిన ప్రాంతాలలో ఆయుధ కర్మాగారాలను మందుగుండు సామానుల కర్మాగారాలను స్థాపించవచ్చు. అంతేగాక ఆ ప్రాంతాలలో స్థాపించే పరిశ్రమలకు ఆర్థిక సహాయాన్ని చేయవచ్చు. వీటివలన ఉద్యోగావకాశాలు పెరగడం, దాని మూలంగా ఆదాయాలు పెరగడం జరుగుతుంది. దీనిద్వారా ఆ ప్రాంతం యొక్క మొత్తం స్వరూపమే మారిపోతుంది. సాంఘికంగా ఎంతో మార్పు వస్తుంది దానితో పాటు ఉత్పత్తిలో కూడా చెప్పుకో తగ్గ మార్పు వస్తుంది.

**రక్షణ వ్యయం-ఉత్పత్తి:**

రక్షణ వ్యయం వలన వనరులు ప్రత్యక్ష ఉత్పాదక మార్గాల నుండి అనుత్పాదక మార్గాలకు తరలించడం జరుగుతుందని, అందువలన రక్షణ వ్యయం ఉత్పత్తిని పెంచటానికి ఉపయోగపడదని కొందరు ఆర్థికవేత్తల అభిప్రాయం. కాని రక్షణ వ్యయం ఆర్థికవ్యవస్థలో ఉన్న వ్యక్తుల సంపదను కాపాడటమే కాకుండా, ఉత్పత్తి, ఇతర ఆర్థిక కార్యకలాపాలను నిరాటంకంగా కొనసాగించడానికి కావలసిన వాతావరణాన్ని కల్పిస్తుంది. అయినంతమాత్రాన ఈ వ్యయం అవసరానికంటే ఎక్కువ ఉండరాదు. ఈ వ్యయాన్ని నిర్ణయించేటప్పుడు ఈ వ్యయం వల్ల కలిగే లాభాన్ని, దాని వల్ల ఉత్పత్తికి కలిగే నష్టాన్ని పోల్చి రక్షణ వ్యయాన్ని నిర్ణయించవలెను.

ఇంతవరకు ఉత్పత్తిపైన ప్రభుత్వ వ్యయ ప్రభావం ఎలా ఉంటుందో వివరంగా చర్చించటం జరిగింది. దీనివలన వచ్చిన నిర్ణయాలను ఈ విధంగా వివరించవచ్చు. ప్రభుత్వ వ్యయం ఒక్కదానిని తీసుకుంటే వ్యయం వల్ల ఉత్పత్తి పెరుగుతుందనడంలో సందేహంలేదు. సహజంగా ప్రభుత్వ వ్యయం ఉత్పత్తిని మూడు రకాలుగా ప్రభావితం చేస్తుంది. మొదటగా పనిచేయగల

శక్తిని రెండవదిగా పనిచేయడానికుండే కోరికను, మూడవదిగా ఆర్థిక వనరులను వివిధ ఉపయోగాలకు, వివిధ ప్రాంతాలకు ఎట్లా కేటాయిస్తారనేది ప్రభుత్వ వ్యయం వల్ల ప్రభావితమౌతుంది.

## 10.3. పంపిణీపై ప్రభుత్వ వ్యయ ప్రభావము:

ప్రతి దేశంలోను ఆదాయ పంపిణీలో వ్యత్యాసాలున్నాయనే చెప్పవచ్చు. ఈ అసమానతలకు ప్రధాన కారణం దేశంలో ప్రైవేటు ఆస్తులుండటమే. ఈ అసమానతలు సహజ సిద్ధమైనవి కావు. ఇవి దేశంలో ఉన్న పరిస్థితులను బట్టి ఏర్పడినవి. ఉదాహరణకు మనదేశంలో ప్రజలు సుమారు 50% మంది 10 శాతం ఆదాయాన్ని అనుభవిస్తుంటే తరువాత 50% మంది మిగిలిన ఆదాయాన్ని అనుభవిస్తున్నారు. ప్రభుత్వ చట్టాల మూలంగా ఏర్పడిన ఈ అసమానతలను ప్రభుత్వమే తగ్గించటానికి ఏర్పాట్లు చేయాలి. గనుక వాగ్నార్ అభిప్రాయంలో ప్రభుత్వ కోశవిధానాన్ని అసమానతలను తగ్గించటానికి ఉపయోగించవలెనని ఇతని వాదన.

అయితే ప్రస్తుతం ఉన్న ఆదాయ పంపిణీ సక్రమమైనదేనని అందువలన దానిని మార్చనవసరంలేదని చెప్పేవారు అనేకమంది ఉన్నారు. కారణం ప్రతి వ్యక్తికి సమానావకాశాలు ఇచ్చినప్పటికి వ్యక్తులు చేసిన నిర్ణయాల వలన అసమానతలు ఏర్పడతాయి. ఎవరైతే ఎక్కువ పనిచేస్తారో వారికి ఎక్కువ ఆదాయం లభిస్తుంది. ఎవరైతే తక్కువ పనిచేస్తారో వారికి తక్కువ ఆదాయం లభిస్తుంది.

సాధారణంగా ప్రభుత్వ ఆదాయ పంపిణీని మార్చవలెనని అభిప్రాయపడితే ఇది మూడు రకాలైన పద్ధతుల ద్వారా చెయ్యవచ్చు.

(1) వివిధ వ్యక్తుల ఆధీనంలో ఉన్న ఉత్పత్తి కారకాల పరిమాణాలను మార్చవచ్చు.

(2) దేశంలో ఉన్న వ్యక్తులందరిని సమానమైన విద్యావకాశాలను కల్పించవచ్చు.

(3) వివిధ వనరులకు చెల్లించే ధరలను మార్పు చేయడం ద్వారా కూడా అసమానతలను తగ్గించవచ్చు.

**ఆదాయ పంపిణీపై ప్రభుత్వ వ్యయ ఫలితాలు:**

దేశంలో ఉన్న వ్యక్తులకు లభించిన ఆదాయాలను పెంచటం ద్వారాగాని, తగ్గించటం ద్వారా గాని అసమానతలను తగ్గించవచ్చు. అధిక ఆదాయాలు వచ్చే వారిపై అధిక మొత్తములో పన్ను, అల్పాదాయం వచ్చే వారిపై తక్కువ మొత్తంలో పన్ను వేయడం ద్వారా వీరికి లభించే ఆదాయాలలో మార్పు చేయవచ్చు. దీనికి 'డాల్టన్' ప్రభుత్వ గ్రాంట్లను ఉపయోగించవచ్చు అని చెప్పినాడు. ఇతని అభిప్రాయంలో గ్రాంట్లను మూడు రకాలుగా విభజించవచ్చు.

(ఎ) అనుపాతపు గ్రాంట్లు

(బి) పురోగామి గ్రాంట్లు

(సి) తిరోగామి గ్రాంట్లు.

**(ఎ)** అనుపాతపు గ్రాంట్లు: ఆదాయంతో సంబంధం లేకుండా విడుదల చేసే గ్రాంట్లను అనుపాతపు గ్రాంట్లు అనవచ్చు. దీనివలన ఆదాయ పంపిణీ అదేవిధంగా ఉంటుంది. ఏవిధమైన మార్పులు రావు.

**(బి)** పురోగామి గ్రాంట్లు: పురోగామి గ్రాంట్ల విధానం వలన అసమానతలు తగ్గుతాయి. తక్కువ ఆదాయం గలవారిని ఎక్కువ గ్రాంట్లు, ఎక్కువ ఆదాయం గల వారికి తక్కువ గ్రాంట్లు ఇవ్వడాన్ని పురోగామి గ్రాంట్లు అనవచ్చు. ఉదాహరణకు పెన్షన్ల వలన ఆదాయ అసమానతలు తగ్గుతాయి.

(సి) తిరోగామి గ్రాంట్లు: ఎక్కువ ఆదాయం గలవారికి ఎక్కువ అనుపాతంలో గ్రాంటు. తక్కువ ఆదాయం గల వారికి తక్కువ పరిమాణంలో గ్రాంట్లు ఇస్తే అది తిరోగామి గ్రాంట్లు ... సమానతలు పెరుగుతాయి.

కాబట్టి ... అసమానతలు తగ్గించడానికి ప్రభుత్వం ప్రగోగామి ... విధానం అవలంబించాలి. తక్కువ ఆదాయం గలవారికి ఎక్కువ గ్రాంటునివ్వాలి. ఈ విధంగా చేయడానికి ... ఒక జాతీయ కనీసస్థాయిని నిర్ణయించాలి. ఆ స్థాయికి పైన ఉన్నవారికి గ్రాంట్లను ఇవ్వకుండా క్రింద ఉన్నవారికి గ్రాంట్లను మంజూరు చెయ్యడం జరిగితే అసమానతలను తగ్గించవచ్చు. అసమానతలను తగ్గించే ప్రభుత్వ వ్యయానికి క్రింది ఉదాహరణలను చెప్పవచ్చు.

(1) పేద ప్రజలు వాడే వస్తువులకు చౌకధరలు ప్రకటించటం. సబ్సిడీ

(2) ఆహారపదార్థాలపై ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు

(3) ప్రభుత్వం కల్పించే ఉచిత విద్యా సౌకర్యాలు.

ప్రభుత్వ విధానం వలన అసమానతలు తగ్గించవలెనని ప్రయత్నించినప్పుడు ఉత్పత్తి తగ్గవచ్చు. వ్యక్తిగత ఆస్థిని కేంద్రీకరణ చెయవలసిరావచ్చు. అయితే ఈ సందర్భములో అసమానతలు తగ్గించడం మాత్రమే ప్రభుత్వ వ్యయ విధాన లక్ష్యం కాదు. ప్రభుత్వ వ్యయ విధానానికి ఈ క్రింది లక్ష్యాలు అవసరం.

(1) ప్రజల వాస్తవిక ఆదాయాలు గరిష్టం చెయ్యడం, వస్తుసేవల ఉత్పత్తిని వీలైనంత ఎక్కువ చెయ్యడం.

(2) సాంఘిక న్యాయాన్ని చేకూర్చేందుకు అర్హతలను బట్టి ఆదాయాలను నిర్ణయించడం.

(3) ఆర్థిక అసమానతలు తగ్గించి సాంఘిక సంక్షేమాన్ని పెంపొందించాలి.

పైన చెప్పిన మూడు లక్ష్యాలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. ఉదాహరణకు ఉత్పత్తిని పెంచాలంటే ఆర్థిక అసమానతలు తగ్గకపోవచ్చు. అసమానతలు తగ్గించే గ్రాంట్లు ఉత్పత్తిని తగ్గించవచ్చు. కాబట్టి ప్రభుత్వ వ్యయ విధానం ఈ మూడు లక్ష్యాలను సమన్వయ పరచేదిగా ఉండాలి.

## 10.4. సారాంశము:

ప్రభుత్వ వ్యయము ఉత్పత్తి, పంపిణీలపై ప్రభావాన్ని కలిగించును. ప్రభుత్వ వ్యయం వలన వస్తూత్పత్తిపై అనుకూల ప్రభావాన్ని కలగచేయవచ్చును. ప్రభుత్వ వ్యయం వలన ఆర్థిక వనరులను కొన్ని ప్రాంతాలకు తరలించడం జరుగుతుంది. ప్రభుత్వ వ్యయం ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించవచ్చును. ఈ విధంగా ప్రభుత్వ వ్యయం ద్వారా వస్తూత్పత్తిని, ఆదాయ పంపిణీని ప్రభావితం చేసి తద్వారా అనుకూల ఫలితాలను సాధించవచ్చును.

## 10.5. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1) సాధారణంగా ప్రభుత్వ వ్యయ ప్రభావాన్ని రెండు విధాలుగా పరిశీలించవచ్చును. (1) ఉత్పత్తిపై ప్రభావం (2) పంపిణీపై ప్రభావం.

2) ప్రభుత్వ వ్యయం పని, పొదుపు, పెట్టుబడుల ద్వారా ఉత్పత్తిని ప్రభావితం చేయ్యును.

3) ప్రభుత్వ వ్యయం ద్వారా ఆర్థిక వనరులను కొన్ని ప్రాంతాలకు తరలించవచ్చును.

4) ప్రభుత్వ వ్యయం ద్వారా ఆదాయ పంపిణీలో గల అసమానతలను తొలగించవచ్చును.

## 10.6. కఠిన పదాలు:

1) అనుపాతపు గ్రాంట్లు: ఆదాయంతో సంబంధం లేకుండా మంజూరు చేసే గ్రాంటులను అనుపాతపు గ్రాంట్లు అని అందురు. ఈ గ్రాంట్ల వలన ఆదాయ పంపిణీ అదేవిధంగా ఉండి ఎటువంటి మార్పులు రావు.

**2) పురోగామి గ్రాంట్లు:** తక్కువ ఆదాయం గల వారికి ఎక్కువ గ్రాంట్లను, ఎక్కువ ఆదాయం గల వారికి తక్కువ గ్రాంట్లను మంజూరు చేయడాన్ని పురోగామి గ్రాంట్లు అందురు. వీటివలన ఆదాయ అసమానతలు తగ్గును.

**3) తిరోగామి గ్రాంట్లు:** ఎక్కువ ఆదాయం గలవారికి ఎక్కువ అనుపాతంలో గ్రాంట్లను, తక్కువ ఆదాయం గల వారికి తక్కువ అనుపాతంలో గ్రాంట్లను మంజూరు చేసిన వీటిని తిరోగామి గ్రాంట్లు అని అందురు. తిరోగామి గ్రాంటుల వలన ఆదాయ అసమానతలు పెరుగుతాయి.

## 10.7. నమూనా ప్రశ్నలు:

I. వ్యాసరూప ప్రశ్నలు:

1) ఉత్పత్తిపై ప్రభుత్వ వ్యయ ప్రభావాన్ని గురించి వ్రాయుము?

2) పంపిణీపై ప్రభుత్వ వ్యయ ప్రభావాన్ని గురించి వివరింపుము?

II. సంక్షిప్త ప్రశ్నలు:

1) గ్రాంటులు-ఆదాయపంపిణి.

2) ప్రభుత్వ వ్యయ విధాన లక్ష్యాలు.

## 10.8. చదువదగిన గ్రంథాలు:

1) The Economics of Public Finance - P.E. Taylor
2) Principles of Public Finance - Hugh Dalton.
3) Public Finance - R.K.Lekhi
4) Public Finance - B.P.Tyagi
5) ప్రభుత్వ అర్ధశాస్త్రము - తెలుగు అకాడమీ.

- డా॥ యం.రాజశేఖర బాబు

పాఠం : 11

# భారతదేశంలో ప్రభుత్వ వ్యయం

## 11.0. లక్ష్యం:

ఈ అధ్యాయంలో మనము ప్రభుత్వవ్యయం పెరుగుదల అనగానేమి? పెరుగుదలకు కారణాలను తెలుసుకోవడం జరుగుతుంది. అంతేకాక, మనదేశంలో ప్రభుత్వవ్యయం యొక్క దీమ ఏ విధంగా ఉన్నది అనేవాటిపై చర్చించడం జరిగినది. దీనివలన మనదేశంలో ప్రభుత్వవ్యయంయొక్క పెరుగుదలకు కారణాలను మనం తెలుసుకోవచ్చు.

## విషయసూచిక


11.1. పరిచయము

11.2. ప్రభుత్వవ్యయం పెరుగుదలకు కారణాలు.

11.3. మనదేశంలో ప్రభుత్వవ్యయం పెరుగుదల.

11.4. ప్రభుత్వవ్యయం పరిశీలన కమిటీలు.

11.5. సారాంశము

11.6. గుర్తుంచుకోవలసిన విషయాలు.

11.7. కఠిన పదాలు.

11.8. నమూనా ప్రశ్నలు.

11.9. చదువదగిన గ్రంథాలు.


## 11.1. పరిచయము:

ప్రభుత్వ విధాన పరమైన లక్ష్యాలను సాధించడానికి ఉపయోగించే ముఖ్యసాధనాలలో ప్రభుత్వవ్యయం ఒకటి. ప్రభుత్వవ్యయం వల్ల దేశంలో ఉన్న ఆదాయ, ఉద్యోగితా స్థాయిలు ఎక్కువగా పెరిగేటట్లు చూడవలసిన భాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. అంతేగాక ప్రభుత్వవ్యయం ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. గత సంవత్సరంలో ప్రభుత్వం చేసిన వ్యయంకంటే ఈ సంవత్సరం ప్రభుత్వం చేసిన వ్యయం ఎక్కువ. ఈ మార్పునే ప్రభుత్వవ్యయంలో పెరుగుదలగా చెప్పవచ్చు. ప్రభుత్వవ్యయం పెరుగుదలకు క్రింది కారణాలను విశదీకరించవచ్చు.

## 11.2. ప్రభుత్వవ్యయం పెరుగుదలకు గల కారణాలు:

సాధారణంగా ప్రతి దేశంలోను ప్రభుత్వవ్యయం పెరుగుతూనే ఉంది. దీనికి సంబంధించి వాగ్నార్ వివరణను, ఇతర సూత్రాలను మనము పరిశీలించడం జరిగినది గానీ సహజంగా ప్రభుత్వవ్యయం పెరగడానికి ఈ క్రింది కారణాలను చెప్పవచ్చు.

(ఎ) జనాభా పెరుగుదల: ప్రతి దేశంలోనూ జనాభ పెరుగుతుంది. ప్రతి సంవత్సరం జనాభా గత సంవత్సరం కంటే ఎక్కువ ఉండటం జరుగుతుంది. దీనివలన ప్రజల అవసరాలు పెరుగుతాయి. అందువలన ప్రభుత్వం వారి అవసరాల కోసం వెచ్చించవలసిన వ్యయం పెరుగుతుంది. అందువలన ప్రభుత్వవ్యయం పెరుగుతుంది.

(బి) ప్రభుత్వ కార్యకలాపాల పెరుగుదల: వాగ్నార్ చెప్పిన విధముగా పెరిగిన జనాభాకు అనుగుణంగా గానీ లేక ఇతర కారణాలవలన గానీ ప్రభుత్వం చేయవలసిన కార్యకలాపాలు పెరుగుతాయి. విద్య, ప్రజారోగ్యం, అవస్థాపనా సౌకర్యాలు, గృహనిర్మాణం మొదలగువాటి కోసం ప్రభుత్వం వెచ్చించాల్సిన వ్యయం పెరుగుతుంది. అందువలన ప్రభుత్వవ్యయం పెరుగుతుంది.

**(సి) పారిశ్రామిక అభివృద్ధి:** ఏ దేశంయొక్క ఆర్థికాభివృద్ధియైనా ఆ దేశం యొక్క పారిశ్రామికరంగం మీద ఆధారపడుతుంది గనుక ఆర్థికాభివృద్ధిని పెంచడానికి ప్రభుత్వం పటిష్టమైన పారిశ్రామికీకరణను చేపడుతుంది. అందువల్ల పరిశ్రమల నిర్మాణానికయ్యే వ్యయం పెరుగుతుంది గనుక ప్రభుత్వవ్యయం పెరుగుతుంది.

**(డి) వ్యవసాయరంగం యొక్క అభివృద్ధి :** వెనుకబడిన దేశాలయొక్క అభివృద్ధి ముఖ్యంగా ఆ దేశంలోని వ్యవసాయరంగం యొక్క అభివృద్ధి పై ఆధారపడుతుంది. వ్యవసాయరంగం అభివృద్ధి చెందితేనే ఆ దేశంలోని పారిశ్రామికరంగం యొక్క అభివృద్ధి, ఇతర దేశాలలో వ్యాపారం మొ॥నవి ఆధారపడతాయి. వ్యవసాయరంగ అభివృద్ధికి కావలసిన నీటిపారుదల వసతులు, ఎరువుల కర్మాగారాల అభివృద్ధికి అధికవ్యయం చేయవలసివస్తుంది. అందువలన ప్రభుత్వవ్యయం పెరుగుతుంది.

**(ఇ) రక్షణ వ్యయంలో పెరుగుదల :** ఏ దేశంలోనైనా ప్రభుత్వవ్యయం పెరగడానికిగల ముఖ్యకారణం ఆ దేశంలో రక్షణ వ్యయం పెరగడమే. ఏ దేశమైనా తన రక్షణ వ్యయాన్ని పెంచినట్లయితే మిగతా దేశాలు తప్పనిసరిగా తమ దేశాన్ని రక్షించుకోవడంకోసం తమ రక్షణ వ్యయాన్ని పెంచవలసి ఉంటుంది. రక్షణ పరికరాలను అధికంగా ఉత్పత్తి చేయాలి. రక్షణ పరికరాలను ఉత్పత్తి చేయడానికి అధిక వ్యయం అవుతుంది గనుక ప్రభుత్వం తను చేసే వ్యయాన్ని పెంచవలసి ఉంటుంది.

**(యఫ్) పట్టణీకరణ :** ప్రస్తుత కాలంలో పట్టణాల సంఖ్య లేక పట్టణీకరణ అధికంగా జరుగుతుంది. ఎక్కువమంది పల్లెప్రాంతవాసులు పట్టణాలలో ఉండటానికి ఇష్టపడుతున్నారు. కారణం పల్లెలలో నిరుద్యోగం అధికంగా ఉండటం, ఇతర సమస్యలు తలెత్తడం, పట్టణాలలో దొరికే సౌకర్యాల కోసం ఎక్కువశాతం గ్రామవాసులు పట్టణాలలో ఉండటానికి ఇష్టపడుతున్నారు. కనుక ప్రభుత్వం వీరికి అవసరమయ్యే వసతులు, త్రాగునీటి సౌకర్యం, విద్య, వైద్య సౌకర్యాలు, పోలీసురక్షణ, మురుగునీటి పారుదల, రోడ్లు, రవాణా సౌకర్యాలను కల్పించవలసి ఉంటుంది. అందువలన వీటికోసం బడ్జెట్‌లో ఎక్కువ కేటాయించవలసి ఉంటుంది గనుక ప్రభుత్వవ్యయం పెరుగుతుంది.

**(జి) ప్రభుత్వం పట్ల ప్రజల తీరు మారడం :** ఆధునిక ప్రభుత్వాలు సంక్షేమ ప్రభుత్వాలుగా ఉండాలనేది ప్రస్తుత ప్రజలయొక్క ఉద్దేశం. గతంలో ప్రభుత్వాలు, పోలీసు రాజ్యాలుగా ఉండేవి. కానీ ఇప్పుడు ప్రజలు తమకు ఏ విధమైన సమస్యలొచ్చినా దానిని ప్రభుత్వం తీర్చాలనేది వీరి కోరిక. కరువుకాటకాలొచ్చినా, అధిక తుఫాను ఏర్పడినా, పేదప్రజల సమస్యలనైనా ప్రభుత్వం తీర్చాలనేది ప్రజల అభిప్రాయం. అందువలన వీటి పరిష్కారం కోసం ప్రభుత్వం ఎక్కువ ఖర్చు పెట్టాల్సివస్తుంది.

**(హెచ్) ఆర్థికాభివృద్ధి :** ప్రతి దేశంలోనూ ప్రభుత్వవ్యయం విపరీతంగా పెరుగుతుంది. మరీ ముఖ్యంగా వెనుకబడిన దేశాలలో ఈ పెరుగుదల మరీ అధికంగా ఉన్నది. కారణం ఈ వెనుకబడిన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి పరచాలనుకోవడం లేక అభివృద్ధి చెందించాలనుకోవడం. అనగా అవస్థాపనా సౌకర్యాలను కలుగజేయడం. ఉదాహరణకు- రోడ్లు, రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలను స్థాపించడం, వ్యవసాయ రంగానికి కావలసిన అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడం. కనుక వీటిని అభివృద్ధి పరచాలంటే ప్రభుత్వం ఎక్కువ ఖర్చు పెట్టవలసి ఉంటుంది గనుక ప్రభుత్వవ్యయం పెరుగుతుంది.

పై కారణాల వల్ల సాధారణంగా ప్రభుత్వవ్యయం ప్రతి దేశంలోను పెరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలు ఎక్కువ అభివృద్ధిపై దృష్టి సారించడం వల్ల ప్రభుత్వవ్యయం పెరుగుతుంది.

## 11.3. మనదేశంలో ప్రభుత్వవ్యయం పెరుగుదల :

ఇటీవల మనదేశంలో ప్రభుత్వవ్యయం త్వరితగతిన పెరుగుచున్నది. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలలో ప్రముఖ పాత్రను నిర్వహించవలసి ఉన్నందువలన ప్రభుత్వవ్యయం పెరగక తప్పదు. అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినపుడు పాలనా నిర్వహణ పై ఖర్చు కూడా పెరుగుతుంది. మనదేశంలో రెండు రకాలైన ప్రభుత్వవ్యయాలను చూడవచ్చు.

1. కేంద్రప్రభుత్వవ్యయం

2. రాష్ట్రప్రభుత్వవ్యయం

ప్రపంచంలోని అన్ని దేశాలు ప్రభుత్వవ్యయాన్ని రెండు వర్గాలుగా విభజించటం జరుగుతుంది. పరిపాలనా యంత్రాంగం పైనా, రక్షణ పైనా, రైల్వేలు, పోస్టు, టెలిగ్రాఫ్‌ల పైనా మొదలగు వాణిజ్య సంస్థలపైనా, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే గ్రాంట్లు, అయ్యే కరెంటు వ్యయం రెవిన్యూ పద్దులో వ్యయంగా పరిగణిస్తారు. మూలధనంలో పెరుగుదల, మూలధనంలో బదిలీలు మూలధన వ్యయం క్రింద పరిగణిస్తారు. దీనినే క్రింది విధంగా చూడవచ్చు.

రెవిన్యూ పద్దు:

1. అభివృద్ధి వ్యయం

A. సాంఘికసేవలు.

B. ఆర్థికసేవలు.

C. సాధారణసేవలు.

D. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు గ్రాంట్లు.

2. అభివృద్ధేతర వ్యయం: పన్నుల వసూలు, వడ్డీలు, రక్షణ మొ॥వి

3. మొత్తం వ్యయం: (1+2).

మూలధనపు పద్దు:

1. అభివృద్ధి వ్యయం.

2. అభివృద్ధేతర వ్యయం.

3. ఋణాలు, అడ్వాన్సులు.

4. మొత్తం వ్యయం=(1+2+3)

## 11.4. ప్రభుత్వ వ్యయం పరిశీలన కమిటీలు:

ప్రభుత్వవ్యయాన్ని ఇష్టమొచ్చిన రీతిలో ఖర్చు పెట్టకూడదు. ప్రభుత్వవ్యయ నియంత్రణ జరగాలి. అనగా ప్రభుత్వ లక్ష్యాలను వీలైనంత తక్కువ వ్యయంలో సాధించేటట్లు వ్యయాన్ని నిర్దేశించడం, పరిమితం చేయటం. ప్రభుత్వం చేసిన వ్యయాన్ని పరిశీలించడానికి ప్రభుత్వవ్యయ నియంత్రణ మూడు దశలలో జరుగుచున్నది.

A. పాలనా నిర్వహణ నియంత్రణ

B. ఆడిట్ నియంత్రణ

C. పార్లమెంట్ నియంత్రణ

ప్రభుత్వం వ్యయం చేసిన తరువాత ఈ వ్యయాన్ని పరిశీలించడానికి పార్లమెంట్ సభ్యులతోకూడిన కొన్ని కమిటీలను రూపొందించడం జరుగుతుంది. వీటిని

1. పబ్లిక్ ఎకౌంట్స్ కమిటి.

2. ఎస్టిమేట్స్ కమిటి.

**1) పబ్లిక్ ఎకౌంట్స్ కమిటి :** ఇది పార్లమెంట్ సభ్యులతో ఏర్పడిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన కమిటి. దీనిలో 22 మంది సభ్యులుంటారు. దీని అధ్యక్షుని స్పీకర్ నియమిస్తాడు. దీని విధులు:

A. ఖర్చు పెట్టబడిన ద్రవ్యానికి చట్టరీత్యా ఆ పనికి ఆమోదించినది లేనిది పరిశీలించడం.

B. వ్యయాన్ని ఖర్చు పెట్టడానికి అధికారమున్నదా లేదా, సరిగా ఖర్చు జరిగింది లేనిది చూడటం.

C. మిలిటరీ అకౌంట్స్ కమిటీ వారి నివేదికలను పరిశీలించడం.

ఈ కమిటి చూడవలసిన ముఖ్య అంశములలో వ్యయం క్రమబద్ధంగా చేయబడినదీ లేనిదీ, వ్యయం చేయడం అవసరమా లేదా, వ్యయంలో దుబారా లేకుండా చేయడం మొదలగునవి. అంతేగాక విత్త సంబంధ విషయాలలో ఉత్తమమైన నైతిక ప్రమాణాలను నిలబెట్టుటకు ఈ కమిటీ ప్రయత్నిస్తుంది.

**2. ఎస్టిమేట్సు కమిటి :** ఇది విత్త వ్యవహారాలను పరిశీలించే పార్లమెంటరీ సంఘాలలో రెండవది. దీనిలో 80 మంది సభ్యులుంటారు. ఈ సభ్యులందరినీ లోక్‌సభ ఎన్నుకుంటుంది. ఈ సంఘం విధులు:

A. వ్యయంలో తగ్గింపు, వ్యవస్థాపనను మెరుగుపరచడం, పరిపాలనా సంస్కరణల గురించి సభకు నివేదించడం.

B. బడ్జెట్ అంచనాలలో పరిమితులకు లోబడి ఖర్చు జరిగినదీ లేనిదీ పరీక్షించడం.

C. పరిపాలనా నిర్వహణలో మిత వ్యయం జరిగేటట్లు చూడటం.

ఈ సంఘం యొక్క ముఖ్యవిధి వివిధ శాఖలు నిర్వహించే పనులు పరిశీలించడం. కొన్ని మంత్రిత్వశాఖలను కొన్ని విషయాల పరిశీలనకు ఎన్నుకుంటుంది. ఈ సంఘం నుంచి వచ్చిన సమాధానాలను బట్టి ప్రశ్నావళిని తయారుచేసి, వాటిని ఆయా మంత్రిత్వ శాఖలకు సమాధానాల కొరకు పంపించడం జరుగుతుంది. వచ్చిన వాటిని నివేదికరూపంలో తయారు చేసి పార్లమెంట్‌కు పంపుతారు.

## 11.5. సారాంశము:

ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో ప్రభుత్వవ్యయం పెరుగుతూ ఉంది. ప్రభుత్వవ్యయం పెరుగుదల వల్ల అనేక ప్రయోజనాలు ఏర్పడుతున్నాయి. వివిధ కారణాల వల్ల ప్రభుత్వవ్యయం అన్ని దేశాలలో పెరుగుతూ ఉంది. మన భారతదేశంలో కూడా ప్రభుత్వవ్యయం పెరుగుతూ ఉంది. ప్రభుత్వ వ్యయాన్ని పరిశీలించడానికి వివిధ కమిటీలు నియమించడం జరుగుతుంది. ప్రభుత్వవ్యయాన్ని నియంత్రించడానికి పబ్లిక్ ఎకౌంట్స్ కమిటి, ఎస్టిమేట్స్ కమిటి మొదలగు కమిటీలు నియమించడం జరిగింది.

## 11.6. గుర్తుంచుకోవలసిన విషయాలు :

1. ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రభుత్వవ్యయం పెరుగుతూ ఉంది.
2. ప్రభుత్వవ్యయం దేశంలోగల ఆదాయ, ఉద్యోగితా స్థాయిలను ప్రభావితం చేసి పెంచడానికి దోహదం చేయును.
3. వివిధ కారణాల వలన ప్రభుత్వవ్యయం పెరుగుతూ ఉంది.
4. భారతదేశంలో ప్రభుత్వవ్యయం కేంద్ర ప్రభుత్వవ్యయం, రాష్ట్ర ప్రభుత్వవ్యయం అను రెండు రకాలుగా పరిశీలించవచ్చు.
5. ప్రభుత్వవ్యయాన్ని పరిశీలించడానికి, నియంత్రించడానికి వివిధ కమిటీలు మనదేశంలో ఉన్నాయి.

## 11.7. కఠిన పదాలు :

1. పట్టణీకరణ : దేశంలో పట్టణాల సంఖ్య పెరిగి పట్టణాలు అభివృద్ధి చెందడాన్నే పట్టణీకరణ అని అందురు.

2. పబ్లిక్ ఎకౌంట్స్ కమిటి : ఈ కమిటీలో 22 మంది సభ్యులుంటారు. పార్లమెంట్ సభ్యులతో నియమింపబడి, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన కమిటీ ఈ కమిటీ.

3. ఎస్టిమేట్స్ కమిటి : ఇది విత్త వ్యవహారాలను పరిశీలించే కమిటి. ఇందులో కూడా పార్లమెంట్ సభ్యులు ఉందురు. ఇందులో సుమారుగా 80 మంది సభ్యులుందురు. వీరిని లోక్‌సభ సభ్యులు ఎన్నుకొందురు.

## 11.8. నమూనా ప్రశ్నలు :

వ్యాసరూప ప్రశ్నలు.

1. ప్రభుత్వవ్యయం పెరుగుదలకు గల కారణాలను తెలుపుము?

2. ప్రభుత్వవ్యయం పరిశీలనా కమిటీలను గూర్చి వివరింపుము?

సంక్షిప్త ప్రశ్నలు.

1. భారతదేశంలో ప్రభుత్వవ్యయం పెరుగుదలను గూర్చి తెలుపుము?

2. పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ విధులను తెలుపుము?

3. ఎస్టిమేట్స్ కమిటి విధులను తెలుపుము?

## 11.9. చదువదగిన గ్రంథాలు:


1. Public Finance - R.K.Lekhi
2. Public Finance - B.P.Tyagi
3. The Economics of Public Finance - P.E.Taylor
4. ప్రభుత్వ అర్థశాస్త్రం - తెలుగు అకాడమి.


- డా॥ యం. రాజశేఖర బాబు

పాఠం : 12

# ప్రభుత్వ ఋణము

## 12.0. లక్ష్యం:

ప్రభుత్వ వ్యయానికి, పన్నుల ద్వారా సేకరించిన ఆర్థిక వనరులు చాలనప్పుడు, ప్రభుత్వము ఋణాల ద్వారా వనరులను సమీకరించవచ్చు. ప్రభుత్వ ఋణము ద్వారా ప్రజల నుండి ప్రభుత్వానికి ఆర్థికవనరులు బదిలీ అవుతాయి. కాబట్టి పన్నులకు ప్రభుత్వ ఋణానికి ఏమంత తేడా కనిపించదు.

## విషయసూచిక


12.1. నిర్వచనము

12.2. ప్రభుత్వ ఋణము-వర్గీకరణ

12.3. ఋణపెరుగదల-కారణాలు

12.4. ప్రభుత్వ ఋణము-భారమా?

12.5. ప్రభుత్వ ఋణము-ప్రభావము

12.6. ప్రభుత్వ ఋణ విమోచనా పద్ధతులు

12.7. సారాంశము

12.8. గుర్తుంచుకోవలసిన విషయాలు

12.9. ముఖ్యపదాలు

12.10. నమూనా ప్రశ్నలు

12.11. చదువదగిన గ్రంథాలు.


## 12.1. నిర్వచనము:

ప్రభుత్వ ఋణము అనగా ప్రభుత్వం చేసే ఋణము. ప్రభుత్వానికి ఆదాయం చాలనప్పుడు, ప్రజల వద్దనుండి అప్పులు చేస్తుంది. దీనినే ప్రభుత్వ ఋణమని చెప్పవచ్చు. ఋణాల ద్వారా ప్రజలదగ్గర నుండి వనరులను సమీకరించుకొనడం ఆధునిక ప్రభుత్వాలకు సాధారణమైపోయింది. ప్రభుత్వం ఋణం ద్వారా వచ్చిన ద్రవ్య వనరులను సాంఘిక ఉపయోగాలకు వ్యయం చేస్తుంది. ప్రభుత్వం దేశంలో ఉన్న వ్యక్తుల నుండి, సంస్థల నుండి ఇతర దేశాల నుండి కూడా ఋణాన్ని సేకరించవచ్చు. దీనినే ప్రభుత్వ ఋణం అని పిలవవచ్చు.

## 12.2. ప్రభుత్వ ఋణము-వర్గీకరణ:

పన్నుల ద్వారా సేకరించే ఆదాయం, ప్రభుత్వానికి ఖర్చు పెట్టడానికి సరిపోనపుడు అవసరమైన వ్యయాన్ని ప్రభుత్వం ఋణం ద్వారానే సేకరించడం జరుగుతుంది. ఆధునిక కాలంలో ముఖ్యంగా ఈ పద్ధతి సర్వసామాన్యమైపోయింది. ప్రభుత్వ ఋణాలను వివిధ రకాలుగా వర్గీకరించవచ్చును.

(ఎ) స్వబుద్ధి పూర్వక (స్వేచ్ఛా ఋణం) ఋణం-నిర్బంధ ఋణము.

(బి) ఉత్పాదక ఋణము-అనుత్పాదక ఋణము.

(సి) నిధీకృత ఋణము-అనిధీకృత ఋణము.

(డి) స్వదేశీ ఋణము - విదేశీ ఋణము.

**(ఎ) స్వబుద్ధి పూర్వక ఋణము-నిర్బంధ ఋణము:**

ప్రజలు బుద్ధి పూర్వకంగా ప్రభుత్వం నుండి ఎటువంటి వత్తిడి లేకుండా ఇచ్చే ఋణాలు స్వేచ్ఛా పూర్వక ఋణాలు. సాధారణంగా ప్రభుత్వానికిచ్చే ఋణాలు బుద్ధిపూర్వకమైనవిగా ఉంటాయి.

కాని నిర్బంధ ఋణములో ప్రభుత్వం ఋణమివ్వమని ప్రజలను నిర్బంధిస్తుంది. నిర్బంద ఋణ విధానంలో ఋణ నిబంధనలు నిరంకుశంగా నిర్ణయిస్తారు. స్వబుద్ధి పూర్వక విధానం ద్వారా ఋణసేకరణ జరుగునపుడు నిర్బంద ఋణం ద్వారా ఋణసేకరణ చేస్తారు. ఈ విధమైన ఋణ పద్ధతి జరిగినప్పటికి, తీసుకున్న ఋణాన్ని తరువాత ప్రజలకు చెల్లించడం జరుగుతుంది కాబట్టి ఈ విధానం పట్ల ప్రజలకు వ్యతిరేఖత ఉండదు.

**(బి) ఉత్పాదక ఋణము-అనుత్పాదక ఋణము:**

ప్రభుత్వ ఋణ ప్రయోజనం లేదా ఉద్దేశ్యాన్ని బట్టి తీసుకున్న ఋణాన్ని ఉత్పాదక లేక అనుత్పాదక ఋణమని విభజించవచ్చు. వసూలు చేసిన ఋణాన్ని ఆదాయాన్ని ఇచ్చే విధంగా పెట్టుబడి పెట్టిన, ఉత్పాదక ఋణంగా చెప్పవచ్చు. ఉదాహరణకు నీటిపారుదల, రైల్వేలు, పరిశ్రమలు వాటిపై పెట్టుబడికి ఋణము సేకరిస్తే దానిని ఉత్పాదక ఋణం అని చెప్పవచ్చు.

ఆ విధంగా కాక విద్య, ప్రజారోగ్యము మొదలగు సాంఘిక సంక్షేమ కార్యక్రమములలో వ్యయం చేయడానికి చేసిన ప్రభుత్వ ఋణాన్ని అనుత్పాదక ఋణమంటారు. అయితే ఈ విధమైన వ్యయం (పెట్టుబడి) ప్రత్యక్షంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని ఆర్జించకపోయినా పరోక్షంగా అనేక లాభాలను చేకూరుస్తాయి. అయినప్పటికి వాటిని అనుత్పాదక ఋణాలు అంటారు.

**(సి) నిధీకృత ఋణము - అనిధీకృత ఋణము:**

ఋణాల కాలపరిమితిని బట్టి నిధీకృత ఋణం, అనిధీకృత ఋణం అని రెండు రకాలుగా విభజించవచ్చు. నిధీకృత ఋణం దీర్ఘకాలిక ఋణం. అనిధీకృత ఋణం స్వల్పకాలిక ఋణము. ఒక సంవత్సరము దాటి 5 సం॥ల లోపు ఋణాన్ని స్వల్పకాలిక ఋణం అని అంటారు. స్వల్పకాలిక ఋణాన్ని ప్రభుత్వము తాత్కాలిక అవసరాలను తీర్చుకోవడం కోసం చేస్తుంది. ఉదాహరణకు ట్రెజరీ బిల్లులు, పోస్టాఫీసు సేవింగ్సు డిపాజిట్లు మొదలగున్నవి నిధీకృతం కాని ఋణాలు.

దీర్ఘకాలిక ఋణాలను ప్రభుత్వము ఎక్కువ శాతము అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చుపెడుతుంది.

**(డి) స్వదేశీ ఋణము-విదేశీ ఋణము:**

ఋణము చేసే స్థలాన్ని బట్టి ప్రభుత్వ ఋణాన్ని స్వదేశీ ఋణమని, విదేశీ ఋణమని విభజించవచ్చు. ఇతర దేశాలలోని వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాల వద్ద చేసే ఋణాన్ని విదేశీ ఋణమని పిలుస్తాము. విదేశీ ఋణాన్ని చెల్లించేటప్పుడు, ఎక్కువ శాతము ఆ దేశ కరెన్సీలోనే చెల్లించాల్సి ఉంటుంది. మనదేశంలో చేసిన ఋణం చాలని పరిస్థితిలోను, ఎక్కువ మొత్తంలో ఋణం కావలసినపుడు విదేశాలలో ఋణం చేయవలసి వస్తుంది. వెనుకబడిన దేశాలు, ఆర్థికాభివృద్ధి కోసం ఈ రకమైన ఋణాలను చేస్తాయి.

స్వదేశీ ఋణమనగా స్వదేశంలో చేసిన ఋణమని అర్థము. మనదేశంలోని వ్యక్తుల నుండి, సంస్థల నుండి సేకరించే ఋణాలను స్వదేశీ ఋణాలు అని పిలుస్తాము.

పై వర్గీకరణను బట్టి హిక్స్ ప్రభుత్వ ఋణాలను మూడు విధాలుగా విభజించినాడు.

(1) డెడ్ వెయిట్ లేదా నిరుపయోగ ఋణాలు.

(2) నిశ్చేష్టిత ఋణము.

(3) చేష్టిత ఋణము.

(1) డెడ్ వెయిట్ లేదా నిరుపయోగ ఋణము:

హిక్స్ ప్రకారం ఇవి ఉత్పాదకత లేని, ఆదాయం రాని వ్యయం కోసం చేసే ఋణాలు. భవిష్యత్తులో ఎటువంటి ప్రయోజనం కాని, ధనాదాయాన్ని కల్పించ లేనటువంటి, సమాజ ఉత్పాదకతా శక్తిని ఎక్కువ చేయలేనటువంటి ప్రభుత్వ ఋణాన్ని డెడ్ వెయిట్ లేదా నిరుపయోగ ఋణంగా చెప్పవచ్చు. ఉదాహరణకు యుద్ధం కోసం ప్రభుత్వం చేసే ఋణము. ఇవి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఉత్పాదకతను గాని, ఆదాయాన్ని గాని ఇవ్వవు. ఇటువంటి ఋణాలు భారాన్ని పెంచుతాయి.

(2) నిశ్చేష్టిత ఋణము:

కొన్ని రకాలైన వ్యయాల కోసం చేసే ఋణాల వలన ప్రత్యక్ష ఆదాయం కాని, ఉత్పాదకత గాని ఉండదు. కాని ఈ ఋణాల సేకరణ చేసి, ఋణాన్ని ఖర్చు పెట్టడం వలన సాంఘిక సంక్షేమం పెరుగుతుంది. ఉదాహరణకు విద్య, ప్రజారోగ్యం, పబ్లిక్ పార్కుల నిర్మాణం ఈ వ్యయాల వల్ల పరోక్షంగా లాభం ఎక్కువ. ఇవి ప్రజాశ్రేయస్సు దృష్ట్యా అవసరమైనవి.

(3) చేష్టిత ఋణము:

ఈ రకమైన ఋణము ద్వారా సేకరించిన మొత్తాన్ని వ్యయం చేయడం వలన ప్రభుత్వము ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని లాభాన్ని పొందుతుంది. చేష్టిత ఋణమంటే, తమంతట తామే స్వయంగా ఋణాన్ని తిరిగి చెల్లించగల ప్రాజెక్టులపై చేసే ఋణము. ఈ విధమైన ప్రాజెక్టుల కోసం చేసే ఋణానికి ఉత్పాదక శక్తి ఎక్కువ.

## 12.3. ఋణ పెరుగుదల కారణాలు:

ప్రభుత్వ ఋణాల ద్వారా వనరులను సేకరించటం ఆధునిక కాలంలో సర్వసాధారణమైనది. ఆర్థికాభివృద్ధి కోసం భారీ ఋణాలు, స్వదేశంలో నుండే కాక, ఇతర దేశాల నుండి స్వీకరించడం ప్రభుత్వ విత్తానికి ముఖ్య లక్షణమై పోయినద్ది, అయినప్పటికి ఋణం చేయడం అంత మంచిది కాదు. ఋణం చేయడం వలన తిరిగి చెల్లించవలసిన బాధ్యతతో పాటు వడ్డీ లేకుండా చెల్లించవలసి ఉంటుంది. ఈ చెల్లించవలసిన వడ్డీకోసం అధికంగా పన్నులు వేయాల్సి ఉంటుంది. ప్రజలపై భారం పెరుగుతుంది. అందువలన అవసరమైనప్పుడు మాత్రమే ఋణాలను చేయడం ఆధునిక ప్రభుత్వాలకు మంచిది. ఈ కాలంలో ఋణాల పెరుగుదలకు క్రింది కారణాలను చెప్పవచ్చు.

1) యుద్ధాలు - అత్యవసర పరిస్థితులు:

యుద్ధానికి భారీ ఎత్తున వనరులు కావలసి వస్తాయి. పన్నుల రాబడి వలనే యుద్ధవ్యయాన్ని భరించడం సాధ్యంకాదు. ఒకవేళ పన్నులను పెంచినా వసూలు చేసుకునేందుకు సమయం పడుతుంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం యుద్ధకాల వ్యయాన్ని భరించడానికి ఋణం ద్వారా ద్రవ్య వనరులను సమీకరించడాన్ని చాలా దేశాలు ఒక సాధనంగా ఉపయోగించినాయి. యుద్ధకాలంలో దేశంలోని వనరులు ఎక్కువ శాతం యుద్ధానికి కావలసిన వ్యయానికి సమకూర్చడం జరుగుతుంది. ప్రజల వినియోగాన్ని అదుపులో ఉంచడం జరుగుతుంది. కనుక ఇటువంటి పరిస్థితులలో ఋణం చేయడం వలన ఋణభారాన్ని కొంత ముందుతరం వారికి కూడా బదిలీ చేసే అవకాశం ఉంది.

యుద్ధం మాత్రమే గాక, అత్యవసర పరిస్థితులు అయిన, భూకంపాలు, వరదలు, అనావృష్టి మొదలగు సందర్భాలలో కూడా ప్రభుత్వం ఋణము చేయవలసి వస్తుంది.

**2) తాత్కాలిక లోటును భర్తీ చేయడానికి:**

అప్పుడప్పుడు బడ్జెట్‌లో కొంత లోటు ఏర్పడుతుంది. ఆ లోటును తాత్కాలికంగా భర్తీ చేయడానికి ఋణం చేయాల్సి ఉంటుంది. మనం చేసే వ్యయానికి, మనకు లభించే రాబడికి మధ్య కొంత కాలవ్యవధి తేడా ఉండవచ్చు లేక పెంచిన పన్నులను సమకూర్చుకోవడానికి కొంత సమయం పట్టవచ్చు. అందువలన తాత్కాలిక ఋణం చేయవలసి రావచ్చు. అంతేగాక కొన్ని ప్రత్యేక పరిస్థితుల వలన అధిక వ్యయం చేయవలసి రావచ్చు. అందువలన ఈ లోటును భర్తీ చేయడానికి ఋణం చేయవలసిరావచ్చు.

**3) ఆర్థికాభివృద్ధిని సాధించడానికి:**

ప్రభుత్వ వ్యయము పన్నుల ద్వారా వచ్చే రెవిన్యూ కంటే ఎక్కువయినపుడు ప్రభుత్వం ఋణం చేయవలసి వస్తుంది. అటువంటిది ముఖ్యంగా ఒక దేశం ఆర్థికాభివృద్ధిని సాధించవలసి వచ్చినప్పుడు ఎన్నో రకాలైన ప్రాజెక్టులను, పరిశ్రమలను, ఇతర కార్యక్రమాలను ప్రారంభించవలసి ఉంటుంది. దీనికయ్యే ప్రభుత్వ వ్యయం చాలా ఎక్కువగా ఉంటుంది. పన్నుల ద్వారా సేకరించే ఆదాయం ప్రభుత్వం చేయవలసిన వ్యయానికంటే చాలా ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు పరిశ్రమల స్థాపన, రైల్వేలు, విద్యుచ్ఛక్తి మొదలగు కార్యకలాపాలు, మూలధన ఆస్తులను సృష్టించి ప్రత్యక్ష ఆదాయాన్ని కూడా ఇస్తాయి. అందువలన ఇవిలేనిదే ఆర్థికాభివృద్ధి సాధ్యంకాదు. వీటి నిర్మాణం కోసం ప్రభుత్వము ఋణము చేయవలసి వస్తుంది. ఈ విధమైన ఋణం (పెట్టుబడి) అటు ఆర్థిక వ్యవస్థకు, ఇటు సంఘానికి, భావితరానికి కూడా ఎంతో ప్రయోజనకారిగా ఉంటుంది. ప్రాజెక్టుల వలన ప్రయోజనం పొందే వారు ఋణభారాన్ని పన్నుల రూపంలో చెల్లిస్తారు.

**4) పాత ఋణాలను చెల్లించడానికి:**

ప్రభుత్వము ఇంతకు ముందు కొన్ని ఋణాలను చేసి ఉండవచ్చు. ఈ ఋణాల యొక్క కాలపరిమితి పూర్తి అయిపోయి ఉండవచ్చు. అందువలన వీటిని తీర్చడానికి, దాని స్థానంలో క్రొత్త ఋణాలను చేయవలసిరావచ్చు. అంతేగాక పాతకాలంలో చేసిన ఋణాలకు హెచ్చు వడ్డీ చెల్లించవలసిరావచ్చు. గనుక తక్కువ వడ్డీకి ఋణం తీసుకు వచ్చి పాత ఋణాలను తీర్చివేయవచ్చు. వీటి నిమిత్తం క్రొత్త ఋణాలను చేయవలసి రావచ్చు.

**5) సంఘానికి లాభదాయకమైన పెట్టుబడి:**

కొన్ని సాంఘిక అవసరాలు అనగా విద్య, వైద్య సౌకర్యాలు, పార్కులు మొదలగు సంఘ సంక్షేమానికి అవసరమైన సేవలు, ఆదాయ ఉత్పాదకాలు కావు. అయినా ఇటువంటి వ్యయాలు ఆర్థికవ్యవస్థ యొక్క అభివృద్ధికి దోహదపడునట్లు చేస్తాయి. అంతేగాక ఆర్థికమాంద్య సందర్భాలలో ఈ విధమైన పెట్టుబడి, వ్యవస్థకు పురోగమన దశలోనికి నడిపించే అవకాశముంది గనుక, ఈ రకమైన వ్యయాల కోసం ఋణాలు చెయ్యడం జరుగుతుంది.

## 12.4. ప్రభుత్వ ఋణము-భారమా?:

ప్రభుత్వ ఋణము అనగా ప్రభుత్వము ప్రజల వద్ద నుండి, సంస్థల నుండి, ఇతర దేశాల నుండి సేకరించిన మొత్తము. ఋణము చేసినప్పుడు ఋణము చేసిన అసలు, దానికయ్యే వడ్డీని చెల్లించేటప్పుడు దాని భారము తెలుస్తుంది.

ప్రభుత్వ ఋణము వలన భారము కలిగినప్పటికి అనేకమైన ప్రయోజనాలు ఉన్నాయి.

(ఎ) వెనుకబడిన దేశాలలో ఆర్థికాభివృద్ధిని సాధించడానికి కావలసిన ప్రాజెక్టులు, అవస్థాపనా పెట్టుబడులు, పరిశ్రమలు మొదలగు వాటికి కావలసిన వనరులుగా ప్రభుత్వ ఋణాన్ని ఉపయోగించుకొన్నప్పుడు ఆర్థికాభివృద్ధి కలుగుతుంది.

(బి) సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి ప్రభుత్వ ఋణ విధానాన్ని ఉపయోగించడం ద్వారా అనగా ఆదాయాన్ని పెంచే పెట్టుబడులలో ఈ ఋణాన్ని ఉపయోగిస్తే సార్థకమైన డిమాండ్ పెరిగి ఉద్యోగిత పెరుగుతుంది.

(సి) ఆర్థిక మాంద్య పరిస్థితులలో ప్రైవేటు వ్యక్తులు పెట్టుబడులు పెట్టడానికి ముందుకురారు. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వం ఋణము చేసిన మొత్తాన్ని అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చు పెట్టినప్పుడు ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.

**ప్రభుత్వ ఋణభారము:**

ప్రభుత్వ ఋణం వడ్డీతో సహా తిరిగి చెల్లించేటప్పుడు ఉత్పత్తి, పంపిణీలలో అనేక మార్పులు జరుగవచ్చు. ఆ మార్పులను ఋణభారం అంటాము. ఈ ఋణభారాన్ని (ఎ) ప్రత్యక్ష ద్రవ్య భారమని (బి) ప్రత్యక్ష వాస్తవ భారమని విభజించవచ్చు.

**(ఎ) ప్రత్యక్ష ద్రవ్య భారము:**

ప్రభుత్వ ఋణ కార్యకలాపాల వల్ల ద్రవ్య బదిలీలు జరుగుతాయి. పన్నుల వలన వచ్చిన ద్రవ్య ఆదాయాన్ని ప్రభుత్వ ఋణాన్నిచ్చిన వారికి అసలు, వడ్డీ రూపంలో చెల్లిస్తుంది. పన్నులు చెల్లించిన వారికి ద్రవ్య ఆదాయం తగ్గుతుంది. వడ్డీ పుచ్చుకొన్ని వారికి ఆదాయం పెరుగుతుంది. స్వదేశీ ఋణం అయితే ఒక వర్గం నుండి వేరొక వర్గానికి నిధులు బదిలీ అవ్వటం వల్ల ప్రత్యక్ష ద్రవ్య భారం ఉండదు. విదేశీ ఋణాలలో ప్రత్యక్ష ద్రవ్యభారం అధికంగా ఉంటుంది. కారణం ఇతర దేశస్థులకు నిధులు బదిలీ అవ్వడం వల.

**(బి) ప్రత్యక్ష వాస్తవ భారము:**

ప్రభుత్వ ఋణాన్ని తిరిగి చెల్లించటం వలన ఆర్థికవ్యవస్థలో ప్రజల సంక్షేమం తగ్గవచ్చు. ఈ ఆర్థిక సంక్షేమంపై ప్రభావాన్ని ప్రత్యక్ష వాస్తవ భారమని చెప్పవచ్చు. దీనిని క్రింది విధంగా చూడవచ్చు.

1) ఆదాయ పంపిణీలో మార్పులు కలిగినట్లయితే వాస్తవ భారము ఏర్పడుతుంది. పన్నులు చెల్లించే వారు పేదవారై, వడ్డీని తీసుకొనేవారు సంపన్నులైతే ఆర్థిక అసమానతలు పెరుగుతాయి. ఆ విధంగా కాక, పన్నులు చెల్లించేవారు ధనికులై యుండి, వడ్డీని తీసుకునేవారు పేదవారై ఉంటే పంపిణీలో అసమానత తగ్గుతుంది. కాని సాధారణంగా పన్నులు చెల్లించేవారు పేదవారై యుండుట వలన ప్రభుత్వ ఋణం ప్రత్యక్ష వాస్తవ భారాన్ని కలుగు జేస్తుంది.

2) బ్యాంకులు పరపతిని సృష్టించడం ద్వారా ప్రభుత్వ ఋణపత్రాన్ని కొంటే ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ద్రవ్యోల్బణం ఆదాయ అసమానతలను పెంచుతుంది.

3) అల్పాదాయ వర్గాల ఆదాయం పెంచడానికి ఋణంద్వారా వసూలు చేసిన నిధులను ప్రభుత్వం ఉపయోగించితే ఆదాయ పంపిణీపై కలిగే దుష్ఫలితాలు కొంతవరకు తగ్గుతాయి.

**ప్రభుత్వ ఋణభారం, ముందుతరం వారికి బదిలి:**

ప్రభుత్వ ఋణ భారాన్ని గురించి చర్చించేటప్పుడు ఋణభారాన్ని ముందు తరం వారికి బదిలీ చేయ్యడానికి వీలవుతుందా అని తెలుసుకోనడం చాలా ముఖ్యం. దీనిగురించి అనేక రకములైన భిన్నాభిప్రాయాలున్నాయి.

(1) సాంప్రదాయవాదుల అభిప్రాయంలో ప్రభుత్వ వ్యయాన్ని పన్నుల ద్వారా సేకరించినట్లయితే ప్రస్తుత తరం వారు భారాన్ని వహిస్తారని, ఋణం ద్వారా సేకరించినట్లయితే భావితరం వారు భారాన్ని వహిస్తారని అభిప్రాయం ఒకటి ఉంది.

(2) ప్రభుత్వ ఋణాల చెల్లింపుకు భావితరం వారు పన్నులు చెల్లించవలసిన మాట వాస్తవమే. అయినా వారు ప్రభుత్వ ఋణ పత్రాలకు కూడా వారసులవుతారు. ప్రస్తుత తరంవారికి కొన్ని ఋణపత్రాలు భావితరం వారికి వారసత్వంగా సంక్రమిస్తాయి. కాబట్టి పన్ను చెల్లింపుతో పాటు ఋణపత్రాలపై వడ్డీ కూడా భావితరం వారు పొందుతారు. కాబట్టి ఋణాల ద్వారా భావితరం వారికి భారం చేయవచ్చుననేది అపోహ అని కొందరి అభిప్రాయం.

(3) బుకానన్ అభిప్రాయంలో ఒక ప్రాజెక్టు నిర్మించడానికి కావలసిన వనరుల ఋణం ద్వారా సేకరించినప్పుడు ఋణభారాన్ని ముందుతరంవారికి బదిలీ చేయడానికి వీలవుతుందని వెల్లడించినాడు. ప్రభుత్వ వ్యయం కోసం ఋణం చేసినప్పుడు మొదటి తరం వారికి ఎటువంటి భారం కలుగదు. ప్రభుత్వం తమవద్ద హెచ్చు ద్రవ్యరూపంలో ఉన్న నిధులకు బదులుగా తక్కువ ద్రవ్యత్వం గల ప్రభుత్వ ఋణ పత్రాలను కొంటారు. ఈ మారకం తమ ఇష్ట ప్రకాం జరిగింది కాబట్టి ఋణపత్రదారులు తమకు ఎటువంటి నష్టం వాటిల్లినట్లు భావించరు. కాని ముందుతరంలో ఋణాన్ని తిరిగి చెల్లించేటప్పుడు పన్నులు చెల్లించేవారి వద్దనుండి ఋణపత్రాలు సొంతదారులకు ద్రవ్యం బదిలీ అవుతుంది. అప్పుడు పన్నులు చెల్లించేవారు నష్టపడినట్లు భావిస్తారు. పన్నులు నిర్భందంగా చెల్లించాలి కాబట్టి వారు నష్టపడటం స్పష్టంగా కనబడుతుంది. భావితరం వారు పన్నులు చెల్లించుతారు కాబట్టి వారికి భారాన్ని బదిలీ చెయ్యడానికి వీలుంటుంది అని చెప్పవచ్చు.

కాబట్టి ఋణభారం భావితరంవారికి బదిలీ అవుతుందనే విషయమై ఏకాభిప్రాయం లేదు.

## 2.5. ప్రభుత్వ ఋణము-ప్రభావము:

ప్రభుత్వ వ్యయానికి కావలసిన ద్రవ్య వనరులను పన్నుల ద్వారా కాక ఋణం ద్వారా సేకరించినట్లయితే కలిగే ఆర్థిక ప్రభావాలు పన్నుల ప్రభావాల కంటే వేరుగా ఉంటాయి. ప్రభుత్వ ఋణం వల్ల కలిగే ఫలితాలను రెండు రకాలుగా విభజింపవచ్చు.

(ఎ) ఉత్పత్తిపై ప్రభావము

(బి) వినియోగంపై ప్రభావము.

**(ఎ) ఉత్పత్తిపై ప్రభావము:** ప్రభుత్వం చేసిన ఋణము వల్ల ఉత్పత్తిపై వచ్చే ప్రభావాన్ని చర్చించడం చాలా క్లిష్టమైన సమస్య. అసలు, వడ్డీ చెల్లింపుల కారణంగా, స్వదేశీ, విదేశీ ఋణాలు రెండు భారాన్ని కలుగుజేస్తాయి.

(1) వడ్డీ చెల్లించడానికి ప్రజలపై అదనపుపన్నులు విధించవలసి ఉంటుంది. అధిక పన్నుల వలన పనిచేసే శక్తి, పొదుపుచేసే శక్తి తగ్గవచ్చు. అదేవిధంగా పనిచేయాలనే కోరిక, పొదుపుచేయాలనే కోరిక తగ్గవచ్చు.

(2) వడ్డీ చెల్లింపులు ఎక్కువగా ఉంటే సాంఘిక ప్రయోజనాలు చేకూరే వ్యయాన్ని ప్రభుత్వం తగ్గించవచ్చు. అందువల్ల ప్రజల ఉత్పాదక శక్తి తగ్గవచ్చు.

(3) ఋణ చెల్లింపును ప్రభుత్వం అధిక పన్నులు విధిస్తుందనే భయం పెట్టుబడిలో అనిశ్చితకు దారితీయవచ్చు.

(4) ప్రభుత్వం ఋణ నిరాకరణ చేస్తుందనే భయం కూడా కలిగి దీర్ఘకాలిక పెట్టుబడి తగ్గవచ్చు.

అయితే ప్రభుత్వ ఋణం ఎప్పుడు ఉత్పత్తిపై వ్యతిరేక ప్రభావాన్ని కలుగజేస్తుందని చెప్పలేము.

(1) ప్రభుత్వం తీసుకొన్న ఋణాలను, పారిశ్రామిక పరిశోధనలకు, రవాణా సౌకర్యాలు పెంచుటకు, పరిశ్రమలకు కావలసిన ముడిపదార్థాలు ఉత్పత్తి చేయుటకు ఖర్చు చేస్తే ఉత్పత్తి పెరుగుతుంది.

(2) కొన్ని సందర్భాలలో ప్రభుత్వ ఋణపత్రాలను కొనుటకు ప్రజలు తమ వినియోగ వ్యయాన్ని తగ్గించి పొదుపు చేయవచ్చు.

(3) ప్రభుత్వ ఋణాలను ఉత్పాదకమైన మార్గాలలో ఉపయోగిస్తే జాతీయ ఆదాయస్థాయి, ఆర్థిక సంక్షేమం పెరగవచ్చు. కాబట్టి ప్రభుత్వ ఋణం వలన ఉత్పత్తి, పెట్టుబడులపై ప్రభావాన్ని పరిశీలించేటప్పుడు ఋణసేకరణ పద్ధతి, స్వభావము, వ్యయము దృష్టిలో పెట్టుకొని నిర్ణయించవలెను.

**(బి) వినియోగంపై ఋణ ప్రభావము:**

ప్రభుత్వ ఋణానికి వినియోగంపై ప్రభావమున్నది. ఋణపత్రాలున్నవారు ఈ పత్రాలను తమ సంపదగా భావిస్తారు. ప్రభుత్వ వ్యయానికి కావలసిన వనరులను పన్నుల ద్వారా సేకరించినట్లయితే వీరికి ఈ సంపద ఉండేది కాదు. ఋణపత్రదారులు ఈ పత్రాలను భావికాలంలో క్లెయిమ్స్‌గా భావిస్తారు. కాబట్టి వారు తమ ప్రస్తుత ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వినియోగానికి వ్యయం చేస్తారు. దీనికి కారణము వీరికి తరువాత ఋణ పత్రాలను అమ్మి తమ అదనపు వ్యయానికి పూర్తి చేయవచ్చుననే అభిప్రాయం. అందువలన ప్రభుత్వ ఋణపత్రదారులు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వినియోగంపై పెట్టే అవకాశం ఎక్కువ.

విదేశీ ఋణం చెల్లించినప్పుడు ద్రవ్యం ఇతరదేశాలకు బదిలీ అవడం వలన ప్రత్యక్ష ద్రవ్య భారాన్ని కలుగచేస్తుంది.

## 12.6. ప్రభుత్వ ఋణ విమోచనా పద్ధతులు:

ఋణ విముక్తి లేదా ఋణ విమోచనమంటే ప్రభుత్వం ఋణాన్ని తిరిగి చెల్లించటం. ఋణ విమోచనం వలన ప్రభుత్వ పరిమితి పెరగటమే కాక, ఋణ పరిపాలనా వ్యయం తగ్గుతుంది. సాధారణంగా ఋణ విమోచనకు ప్రభుత్వం క్రింది పద్ధతులను అవలంబిస్తుంది.

**(1) ఋణ నిరాకరణ:**

ఈ పద్ధతి ప్రకారము ఋణ నిరాకరణ చెయ్యవచ్చు. ఋణ విమోచనకు అతి సులభమార్గం ఋణ నిరాకరణ. ఈ పద్ధతిలో చెల్లించవలసిన వడ్డీ అసలు మొత్తము చెల్లించకుండా చెయ్యవచ్చు. కాని ఋణనిరాకరణ ఋణ విమోచన కానేరదు. సాధారణంగా ఎటువంటి ప్రభుత్వమైన ఋణ నిరాకరణ చెయ్యదు. కారణం ఇది నైతిక చర్యకాదు. ఎందువలనంటే ఈ చర్యవల్ల ప్రభుత్వానికి ఋణం ఇచ్చినవారు మాత్రమే ఆర్థికంగా దెబ్బతింటారు. కాని ఇతరులకు ఏమాత్రం నష్టం వాటిల్లదు. విదేశీ ఋణాలను నిరాకరించడం వలన యుద్ధాలు వస్తాయి. ఆర్థికంగా దేశం ఎంతో దెబ్బతింటుంది. ఈ ఋణనిరాకరణ అనేక అనర్థాలకు దారితీస్తుంది. ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతుంది.

**(2) ఋణ చెల్లింపు:**

ఋణాన్ని చెల్లించడమే సరియైన పద్ధతి. ఈ పద్ధతి ద్వారా ఋణం రెండురకాలుగా చెల్లించవచ్చు.

(ఎ) మిగులు నుండి చెల్లింపు (బి) పరివర్తనము.

**(ఎ) మిగులు నుండి చెల్లింపు:**

ఈ పద్ధతి ప్రకారం బడ్జెట్‌లో మిగులును కలుగుజేసి ఋణం తిరిగి చెల్లించడానికి ఉపయోగించవచ్చు. ఇది పూర్వకాలపు పద్ధతి. ప్రస్తుతం ఈ పద్ధతి చాలా కష్టము కారణం. ఇప్పుడు మిగులు అన్నది సాధారణ విషయము. అందువల్ల ఈ పద్ధతి ప్రకారము ఋణ చెల్లింపు కష్టము.

**(బి) పరివర్తనము:**

ప్రభుత్వము తన ఋణాన్ని నూతన ఋణంగా పరివర్తనము చేసి చెల్లించవచ్చు లేదా మార్కెట్ క్రొత్త ఋణం చేసి పాత ఋణాన్ని చెల్లించవచ్చు. అయితే ఇది ఋణ విమోచన విధానం కాదు. ఈ పద్ధతిలో పాత ఋణబాధ్యతను తొలగించుకోవడానికి ప్రభుత్వము క్రొత్త ఋణము చేస్తుంది. కానీ ఈ పద్ధతిలో తక్కువ వడ్డీకి ఋణం తీసుకొని ఎక్కువ వడ్డీ గల ఋణాలను తీర్చేయవచ్చు.

ఋణ పరివర్తన అరుదుగా జరుగుతుంది. కాని వడ్డీ రేట్లలో పెద్ద మార్పులుండవు. కొన్ని సందర్భాలలో స్వల్పకాలిక ఋణాలను, దీర్ఘకాలిక ఋణాలుగా మార్చడం ద్వారా కూడా పాత ఋణాలను తీర్చవచ్చు.

**(3) ఋణ విమోచనా నిధి:**

చాలా మంది ఆర్థికవేత్తలు ఋణ విమోచనా నిధి పద్ధతి ద్వారా ఋణాన్ని తిరిగి చెల్లించడం మంచి పద్ధతిగా భావించారు. ప్రతి సంవత్సరము ప్రభుత్వము తన బడ్జెట్ నుండి కొంత మొత్తాన్ని ఋణ విమోచనకు గాను కేటాయిస్తుంది. ఈ మొత్తం కొంతకాలానికి చక్రవడ్డీ రూపంగా ఒకే నిధిగా ఏర్పడుతుంది. ప్రభుత్వం తాను చేసిన ఋణం గడువు అయ్యే సమయానికి, ఋణ విమోచనా నిధి ఆ ఋణానికి సమానమవుతుంది. ఋణ విమోచనకు గాను ప్రభుత్వం విధించే పన్నులభారాన్ని ఈ నిధి ఏర్పడే కాలం వరకూ విస్తరింపచేయడం వలన పన్నుల భారము కేంద్రీకృతముగాదు. ఉదాహరణకు ఒక రోడ్డు నిర్మించడానికి ప్రభుత్వం 20 కోట్ల రూపాయలు ఋణం చేసిందని అనుకుందాము. అప్పుడు ప్రభుత్వం పెట్రోలుపై పన్ను విధించిందని అనుకుందాము. ఈ పన్ను ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని ఒక నిధి రూపంగా జమకడతారు. ప్రతి సంవత్సరము ఈ పన్నుల వల్ల వచ్చే ఆదాయాన్ని ఋణ విమోచనా నిధికి జమకట్టడం వల్ల కొంతకాలానికి ఆ మొత్తం ప్రభుత్వం ఋణం నిర్మించడానికి చేసిన ఋణానికి సమానమవుతుంది. అందువల్ల ఈ నిధిని ఋణవిమోచనా నిధి అంటారు.

**(4) మూలధనపు పన్ను:**

ఋణాన్ని తిరిగి చెల్లించడానికి ప్రభుత్వం ప్రజల వద్ద ఉన్న మూలధనంపై పన్ను విధిస్తుంది. దీనినే ప్రత్యేక విధింపు అని కూడా అంటారు. ఈ పద్ధతి ద్వారా ఋణ విముక్తి కలిగించడమే ఋణ విమోచనా నిధి పద్ధతి కంటే మెరుగని కొందరి అభిప్రాయం. ఇటువంటి ప్రత్యేక పన్నుల వలన ప్రభుత్వ ఋణాన్నంతా ఒకసారి తిరిగి చెల్లించవచ్చు. ఈ పద్ధతిలో ఋణం తీర్చడానికి గాను ప్రజలపై ఒకేసారి పన్ను విధిస్తారు. ఇతర పన్నులతో పాటు ప్రతిసారి విధించరాదు. ఈ పన్ను ఆస్తులు గలవారిపై మాత్రమే పడుతుంది. ఈ విధానం ద్వారా ప్రజలు, ప్రభుత్వం కూడా ఒకేసారి ఋణవిముక్తి పొందుతారు.

**మూలధనం పన్నువలన లాభాలు:**

(1) యుద్ధ సమయాలలో ధనికుల సంపాదనలు పెచ్చు పెరిగిపోతాయి. కాని వారివలన యుద్ధ ప్రయత్నానికి లభించే సహాయం తక్కువ. దీనికి పరిహారంగా ప్రభుత్వం వారిపై మూలధనపు పన్ను విధించటం సమంజసమైనది.

(2) ఋణ విమోచనానికి సరిపడు మొత్తాన్ని ఒకేసారి సేకరించవచ్చు.

(3) సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించడానికి ఈ పన్ను ఉపయోగించవచ్చు.

(4) ఈ పద్ధతి ద్వారా ఋణ విమోచన చేయడం వలన ఋణవిమోచనకు అధికంగా పన్ను విధించనవసరము లేదు.

(5) ఋణ విముక్తికై చెల్లించే వ్యయాన్ని సాంఘిక ప్రయోజనాలను తరలించవచ్చు.

(6) ప్రభుత్వ ఋణాలలో ఎక్కువ భాగం యుద్ధఋణాలు. ఇటువంటి డెడ్ వెయిట్ ఋణాన్ని ఒక్కసారే తీర్చివేయటం మంచిది.

ఈ మూలధనం పన్ను వల్ల క్రింద నష్టాలు ఏర్పడతాయి:

(1) హెచ్చు స్థాయిలో పన్ను విధించడం వల్ల పొదుపు చేయాలనే కోరిక, శక్తి తగ్గుతాయి.

(2) మూలధనంపై పన్ను విధించడం వలన ప్రైవేటు రంగాలలో మూలధన సంచయనం జరగవచ్చు.

(3) విదేశాలకు మూలధనం తరలించబడుతుంది.

(4) మూలధనం విలువను అంచనావేయటం సులభం కాదు.

పై కారణాల వలన మూలధన పన్నును కొంతమంది ఆర్థికవేత్తలు వ్యతిరేకించారు. ఇటువంటి పన్ను విధింపు వలన ఆర్థిక వ్యవస్థపై విపరీత పరిణామాలు రావచ్చు.

ప్రభుత్వ ఋణ విమోచనకు పైన వివరించిన పద్ధతులలో లాభాలు ఉన్నాయి, నష్టాలు ఉన్నాయి. ఋణ విమోచన నిధి ఏర్పరచడం అన్నిటికన్నా మంచి పద్ధతిగా పలువురు భావిస్తారు. ప్రతి సంవత్సరము కొంత ఋణాన్ని తిరిగి చెల్లించడం అభిలషణీయమైన విధానం.

## 12.7. సారాంశము:

ప్రభుత్వం చేసే ఋణాలను ప్రభుత్వ ఋణం అని అందురు. ప్రభుత్వ ఋణాన్ని వివిధ రకాలుగా వర్గీకరించడం జరుగుతుంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో అనేక కారణాల వల్ల ప్రభుత్వ ఋణం పెరుగుతుంది. ప్రభుత్వ ఋణం ఎంత భారాన్ని కలుగజేస్తుంది ఇది ముందు తరాల వారికి బదిలీ అవుతుందా అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ప్రభుత్వ ఋణం ఉత్పత్తిపై, వినియోగంపై ప్రభావాన్ని కలుగజేయును. వివిధ పద్ధతుల ద్వారా ఋణభారాన్ని తొలగించుకోవచ్చు.

## 12.8. గుర్తుంచుకోవలసిన విషయాలు:

(1) ప్రభుత్వం చేసే వివిధ రకాల ఋణాలను ప్రభుత్వ ఋణం అని అందురు.

(2) ప్రభుత్వ ఋణాన్ని వివిధ రకాలుగా వర్గీకరించడం జరిగింది.

(3) వివిధ కారాణాల వల్ల ప్రభుత్వ ఋణం పెరుగుతూ ఉంది.

(4) ప్రభుత్వ ఋణం వల్ల కొంత భారం ఏర్పడుతుంది.

(5) ప్రభుత్వ ఋణభారం ముందుతరాల వారికి బదిలీ చేయవచ్చును అనే విషయంలో భిన్నాభిప్రాయాలు కలవు.

(6) ప్రభుత్వ ఋణం ఉత్పత్తిపై, వినియోగంపై ప్రభావాన్ని కలుగజేయును.

(7) ప్రభుత్వ ఋణ విమోచనానికి వివిధ పద్ధతులు కలవు.

## 12.9. కఠిన పదాలు:

(1) **నిధీకృత ఋణము:** ప్రభుత్వం తీసుకున్న దీర్ఘకాలిక ఋణాన్ని నిధీకృత ఋణంగా చెప్పవచ్చు.

(2) **నిరుపయోగ ఋణము లేదా డెడ్ వెయిట్ ఋణం:** భవిష్యత్తులో ఎటువంటి ప్రయోజనం లేని ధన ఆదాయాన్ని కల్పించలేనటువంటి సమాజ ఉత్పాదకశక్తిని ఎక్కువ చేయలేనటువంటి ప్రభుత్వ ఋణాన్ని డెడ్ వెయిట్ లేదా నిరుపయోగ ఋణంగా చెప్పవచ్చు.

(3) **చేష్టిత ఋణము:** ఈ రకమైన ఋణము ద్వారా సేకరించిన మొత్తాన్ని వ్యయం చేయడం వలన ప్రభుత్వం ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని లాభాన్ని పొందుతుంది. చేష్టిత ఋణం అంటే తమంతట తామే స్వయంగా ఋణాన్ని తిరిగి చెల్లించగల ప్రాజెక్టులపై చేసే ఋణము.

(4) పరివర్తనం: పాతఋణాలను చెల్లించడానికి క్రొత్త ఋణాలను తీసుకునె పద్ధతినె పరివర్తనమందురు. దీనివలన ఋణభారము తీరదు.

(5) మూలధన పన్ను: ప్రభుత్వము అమలు పరచే విధానం వలన ప్రజల స్థిరాస్థి విలువ పెరిగినపుడు వారి వద్దనుండి ఒక్కసారి మాత్రమే వసూలు చేసే దానిని మూలధనపు పన్ను అని అందురు.

## 12.10. నమూనా ప్రశ్నలు:

I. వ్యాసరూప ప్రశ్నలు:

(1) ప్రభుత్వ ఋణ వర్గీకరణను గూర్చి వ్రాయుము?

(2) ప్రభుత్వ ఋణము పెరుగుదలకు గల కారణాలను వివరింపుము?

(3) ప్రభుత్వ ఋణ ప్రభావాలను గూర్చి తెలుపుము?

(4) ప్రభుత్వ ఋణ విమోచనా పద్ధతులను గూర్చి వివరింపుము?

II. సంక్షిప్త ప్రశ్నలు:

(1) ప్రభుత్వ ఋణభారం ముందు తరాల వారికి బదిలీ చేయవచ్చా?

(2) ఉత్పత్తిపై ప్రభుత్వ ఋణ ప్రభావం గూర్చి వ్రాయుము?

(3) వినియోగంపై ప్రభుత్వ ఋణ ప్రభావం గూర్చి వ్రాయుము?

(4) మూలధనపు పన్నును గూర్చి వ్రాయుము?

## 12.11. చదువదగిన గ్రంథాలు:


1) Public Finance - U.K.Hicks.

2) Public Economics - A. Sundaram

3) The Management of Public Dept. in Developing Countries, Finance and Development - Levin Johnathan

4) Public Finance - B.P.Tyagi

5) ప్రభుత్వ అర్థశాస్త్రము - తెలుగు అకాడమి.


- డా॥ యం. రాజశేఖర బాబు

# కోశ విధానం

## 13.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశంలో మీరు ముఖ్యంగా కోశవిధానం, బడ్జెట్, లోటు ద్రవ్యవిధానం గూర్చి పరిశీలించడమైంది. ఈ భాగం పూర్తయ్యేసరికి మీరు క్రింది అంశాలను గురించి అవగాహన చేసుకుంటారు. (1) కోశవిధానలక్ష్యాలు. (2) భారతదేశ కోశవిధానం.(3) బడ్జెట్ విధానం. (4) లోటు ద్రవ్యవిధానం - లక్ష్యాలు మరియు సమస్యలు.

## విషయసూచిక

13.1. పరిచయము
13.2. కోశవిధాన లక్ష్యాలు
13.3. భారతదేశ కోశవిధానం
13.4. బడ్జెట్
13.5. లోటు ద్రవ్య విధానం
13.6. లోటు ద్రవ్యలక్ష్యాలు (లేదా) ప్రాముఖ్యం
13.7. లోటు ద్రవ్యం - సమస్యలు
13.8. సారాంశము
13.9. గుర్తుంచుకోవలసిన విషయాలు
13.10. కఠిన పదాలు
13.11. నమూనా ప్రశ్నలు
13.12. చదువదగిన గ్రంథాలు

## 13.1. విషయ పరిచయము:

ప్రపంచంలోని వివిధ ఆర్థికవ్యవస్థలు అనేక లక్ష్యాలను సాధించటానికి కొన్ని ఆర్థిక విధానాలను అనుసరిస్తాయి. అటువంటి విధానాలలో 'కోశవిధానం' ఒకటి. 1930 సంవత్సరం వరకు కోశవిధానం యొక్క ప్రాముఖ్యం అంతగా ఉండేదికాదు. 1930 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంధ్యాన్ని నివారించటంలో ద్రవ్యవిధానం శక్తివంతంగా పనిచేయలేకపోయింది. ఆస్థితిలో ఆర్థికమాంద్యాన్ని నివారించడానికి ద్రవ్యవిధానం కంటే కోశవిధానం ఎంతో ఉపయోగపడునని వివిధ ఆర్థికవేత్తల అభిప్రాయం. కీన్సు అను ఆర్థికశాస్త్రవేత్త తన గ్రంధమైన "General Theory of Employment, Interest and Money"లో ఆర్థికమాంద్యం వలన ఆర్థికవ్యవస్థలో ఏర్పడిన ఒడుదుడుకులను సరిదిద్దడానికి ద్రవ్యవిధానం కంటే కోశవిధానం ఎక్కువ ఉపయోగపడునని అభిప్రాయపడెను.

కోశవిధానానికి సంబంధించి వివిధ ఆర్థికవేత్తలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ప్రభుత్వవ్యయం, పన్నులు, రుణ విధానాలద్వారా ఆర్థికవ్యవస్థలోని ఉత్పత్తి, ఉద్యోగిత, ధరలు, ఆదాయస్థాయిలను ప్రభావితం చేయు విధానాన్నే కోశవిధానమని కీన్సు అభిప్రాయం.

ఆర్థర్ స్మితీస్ (Aurthur Smithies) ప్రకారం "ప్రభుత్వం తమ ఆదాయ, వ్యయ కార్యక్రమాలను జాతీయ ఆదాయం, ఉత్పత్తి, ఉద్యోగితలపై కోరదగిన ఫలితాలు ఉండేటట్లు, కోరదగని ఫలితాలు లేకుండా రూపొందించుకొనే విధానమే కోశవిధానం''.

ప్రభుత్వ విత్తంలోని వివిధ విభాగాలు తమ విధులను నిర్వర్తించుచూ ఆర్థికవిధాన లక్ష్యాలను సాధించటానికి ఉపయోగపడునట్లుగా చూసుట కోశవిధాన ధ్యేయమని శ్రీమతి యు.కె.హిక్స్ వివరించెను.

పన్నుల విధింపు కేవలం రాబడిని పొందడానికే అనే సాంప్రదాయ ఆర్థికవేత్తల అభిప్రాయాన్ని కీన్సు అనుచరులైన హెన్సన్, లెర్నర్‌లు వ్యతిరేకించారు. సాంప్రదాయవాదుల భావాల ఫలితంగా ఆర్థికవ్యవస్థలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం మొదలగు హానికర ప్రభావాలు ఏర్పడుటవల్ల కోశవిధానంలో అనేక మార్పులు వచ్చి ప్రభుత్వవ్యయం, పన్నుల విధానాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించి ఆదాయం, ధరలు, ఉద్యోగితా స్థాయిలలో ఉపయోగకరమైన మార్పులకు దోహదపడాలనే భావం సర్వత్రా వ్యాపించింది. ప్రభుత్వ జోక్యం లేని ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక ఒడుదుడుకులు ఏర్పడి వివిధ సమస్యలు ఏర్పడునని అటువంటి ఆర్థికవ్యవస్థను చైతన్యవంతం చేయడానికి, ద్రవ్యవిధానంకంటే కోశవిధానం పటిష్టవంతమైనదని కీన్సు అభిప్రాయం. కోశవిధానానికి కీన్సు అధిక ప్రాముఖ్యాన్ని ఇవ్వగా తరువాత ఎ.పి.లెర్నర్ ఈభావాన్ని విస్తృతంగా అభివృద్ధి పరిచాడు.

ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, ఉద్యోగిత, ధరలస్థాయి మొదలగు వాటిని ప్రభావితం చేయడానికి ప్రభుత్వం అనుసరించే వ్యయవిధానం, పన్నులవిధానం, రుణవిధానాల సముదాయమే కోశవిధానము. విశాలదృష్టితో చూసిన ప్రభుత్వనూతన విధానాలు ఆర్థిక వ్యవస్థపై ఎటువంటి ప్రభావాలను చూపిస్తాయో కోశవిధానం వివరిస్తుంది. మొత్తంమీద కోశవిధాన సాధనాలను మూడు విధాలుగా విభజించవచ్చు. 1. ప్రభుత్వ వ్యయవిధానం 2. పన్నులవిధానం 3. ప్రభుత్వ రుణవిధానం

## 3.2. కోశవిధాన లక్ష్యాలు:

కోశవిధాన లక్ష్యాలను ఈ క్రింది విధంగా పరిశీలించవచ్చు

1. సంపూర్ణ ఉద్యోగితను సాధించుట.
2. ఆర్థికాభివృద్ధిని సాధించుట.
3. ధరల స్థిరత్వాన్ని సాధించుట.
4. ఆదాయ అసమానతలను తగ్గించుట.
5. సాంఘిక అవసరాలకు అనుగుణంగా పెట్టుబడి జరుగుట.

**1. సంపూర్ణ ఉద్యోగితను సాధించుట:-** కోశవిధాన సాధనాల ద్వారా సంపూర్ణ ఉద్యోగితా స్థాయిని సాధించవచ్చు. ప్రభుత్వ వ్యయం సమిష్టి డిమాండ్‌ను పెంచి సంపూర్ణ ఉద్యోగితాస్థాయిని సాధించడానికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వ వ్యయం ముఖ్యంగా రెండు విధాలుగా ఉండవచ్చు 1. పంప్ ప్రైమింగ్ 2. పరిపూరక వ్యయం. పంప్ ప్రైమింగ్ విధానమందు ప్రభుత్వ వ్యయం కొంచెంగా పెరుగుట వల్ల ప్రైవేటు రంగ వ్యయం ఎక్కువగా పెరుగుతుంది. ఇందులో లోటు బడ్జెట్ ఉండదు. పరిపూరక వ్యయ విధానమందు ప్రైవేటు రంగవ్యయంలో తగ్గుదలను పూరించేదిగా అధిక పరిమాణంలో ప్రభుత్వరంగ వ్యయం జరుగును. ఈ విధానంలో లోటు బడ్జెట్ అనుసరించబడుతుంది. ప్రభుత్వ వ్యయం పెంచడం వల్ల సమిష్టి డిమాండ్ పెరిగి సంపూర్ణ ఉద్యోగితాస్థాయిని సాధించవచ్చు.

ప్రభుత్వ వ్యయ విధానానికి బదులుగా పన్నుల విధానంలో మార్పులను చేసి తద్వారా సమిష్టి డిమాండ్‌ను పెంచి సంపూర్ణ ఉద్యోగితను సాధించవచ్చునని కొందరి అభిప్రాయం. ఆర్థికమాంద్య పరిస్థితులలో పన్నుల భారాన్ని తగ్గించటం ద్వారా వినియోగ వ్యయాన్ని పెంచవచ్చు. అందువల్ల మొత్తం డిమాండ్ పెరిగి సంపూర్ణ ఉద్యోగితను సాధించవచ్చు. వినియోగప్రవృత్తి తక్కువగా ఉన్న ధనవంతులపై పురోగామి పన్నులను విధించి, ఆ విధంగా వచ్చిన ఆదాయాన్ని పేదప్రజల కోసం వ్యయం చేసినా వీరి వినియోగ ప్రవృత్తి పెరుగుతుంది. ఇందువల్ల సార్థక డిమాండ్ పెరుగుతుంది. కనుక సంపూర్ణ ఉద్యోగితాస్థాయిని సాధించడానికి వీలవుతుంది.

సంపూర్ణ ఉద్యోగితాస్థాయిని పెంచడానికి ప్రభుత్వ రుణవిధానం కూడా తోడ్పడును. ప్రభుత్వ వ్యయాన్ని ఎక్కువగా పెంచటం వల్ల లోటు బడ్జెట్ ఏర్పడుతుంది. ఈ బడ్జెట్ లోటును పూరించడానికి ప్రభుత్వం రుణం చేయును. ప్రభుత్వం ఎక్కువగా ధనవంతుల ద్వారా రుణాలను సేకరించాలి. ఇందువల్ల ప్రజల వినియోగ ప్రవృత్తి తగ్గదు. ప్రభుత్వ రుణవిధానం ఉత్పత్తి, జాతీయ ఆదాయం, ఉద్యోగితాస్థాయిని పెంచేదిగా ఉండాలి.

ఈ విధంగా కోశవిధానం ద్వారా సమిష్టి డిమాండ్, జాతీయ ఆదాయం, ధరలస్థాయిలలో మార్పులను తీసుకువచ్చి తద్వారా సంపూర్ణ ఉద్యోగితను సాధించవచ్చు. ద్రవ్యోల్బణ లేదా ప్రతి ద్రవ్యోల్బణ రహిత సంపూర్ణ ఉద్యోగితా స్థాయిని సాధించడానికి కోశవిధానం తోడ్పడుతుంది. ప్రభుత్వవ్యయంలో మార్పులను తీసుకువచ్చుటద్వారా, పన్నుల విధానంలో మార్పులను తెచ్చుటద్వారా, బడ్జెట్‌లో మార్పులను తేవడం ద్వారా సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి కోశవిధానం ఉపయోగపడుతుంది.

**2. ఆర్థికాభివృద్ధిని సాధించుట:-** కోశవిధానం ద్వారా పొదుపు, పెట్టుబడులు, ఉత్పత్తి మొదలగు వాటిని పెంచుట ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు. ప్రభుత్వవ్యయం, పన్నుల విధానం, రుణ విధానాల ద్వారా ఆర్థికాభివృద్ధిని ఏవిధంగా సాధించవచ్చో పరిశీలించవచ్చు. ప్రభుత్వం సాంఘిక వ్యవస్థా మూలధన వ్యయాన్ని పెంచిన ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. రవాణా, వార్తా సౌకర్యాలు, విద్యుశ్చక్తి, నీటి పారుదల, విద్య, ప్రజా ఆరోగ్యము మొదలైన సౌకర్యాలపై ప్రభుత్వం వ్యయం చేసినా ఉత్పత్తి పెరిగి ఆర్థికాభివృద్ధి జరుగును. అంతే కాకుండా అనేక ప్రత్యక్ష ఉత్పాదక కార్యకలాపాలపై ప్రభుత్వం వ్యయం చేస్తే వివిధ రంగాలలో ఉత్పత్తి పెరిగి ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.

ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వవ్యయం కంటే పన్నుల విధానం ఎక్కువగా పనిచేయునని ఒక అభిప్రాయం కలదు. పన్నుల విధానం ఆర్థికాభివృద్ధికి రెండు విధాలుగా ఉపయోగపడును. (ఎ) పన్నుల ద్వారా ప్రభుత్వ వ్యయానికి కావలసిన సమీకరించుకోవచ్చు.

(బి) పన్నుల విధానం ద్రవ్యోల్బణ రహిత ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడును. ద్రవ్యోల్బణ సమయంలో పన్నుల రేటును ఎక్కువగా నిర్ణయించుట, ప్రతి ద్రవ్యోల్బణ సమయంలో పన్నుల రేటును తగ్గించుట ద్వారా స్థిరత్వంతోకూడిన ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు. పన్నుల విధానం ద్వారా ప్రైవేటు పెట్టుబడులను కూడా పెంచి ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు. పన్నుల ద్వారా ప్రభుత్వం ఆదాయ వనరులను సమీకరించి వివిధ ఉత్పత్తి కార్యకలాపాలలో పెట్టుబడులను పెంచి తద్వారా ఉత్పత్తి పరిమాణాన్ని పెంచి ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు.

పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ప్రభుత్వ వ్యయం కంటే తక్కువగా ఉన్నపుడు ఆ తేడాను రుణాలు ద్వారా భర్తీ చేయవచ్చు. కాని ప్రభుత్వం రుణాలను సేకరించడం కారణంగా ప్రైవేటు రంగానికి అవసరమైన పెట్టుబడి తగ్గకుండా ఉండాలి. ప్రభుత్వ రుణవిధానం సాధ్యమయినంతవరకు మూలధన మార్కెట్‌ను అభివృద్ధి చేసి ద్రవ్య సంస్థలను ఎక్కువగా విస్తరింపచేయుటకు అనుకూలంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పొదుపు మొత్తాలను సమీకరించి ఆ మొత్తాన్ని పెట్టుబడిగా ఉపయోగించుట ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించాలి.

ఉర్సులా హిక్స్ తన గ్రంథమయిన 'Publice Finance'లో కోశవిధానం ఆర్థికాభివృద్ధికి నాలుగు విధాలుగా ఉపయోగపడును.

(ఎ) రెవెన్యూ సర్దుబాట్లు ద్వారా కావలసిన ద్రవ్య వనరులను సమీకరించి, ద్రవ్యోల్బణరహిత ఆర్థిక స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించడం.

(బి) రుణ విధానం ద్వారా మూలధన సంచయానాన్ని కల్పించి, రుణనిర్వహణను సక్రమంగా చేయడం.

(సి) ప్రభుత్వ వ్యయవిధానం ద్వారా ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని ప్రైవేటు రంగానికి సహాయపడి అభివృద్ధికి తోడ్పడటం.

(డి) పరిమితంగా ఉన్న వనరులను అభిలషనీయంగా ఉపయోగించుటకు వివిధ ప్రణాళికా సమస్యలను పరిష్కరించడం.

ఆర్థికాభివృద్ధిని సాధించడానికి కోశవిధానం అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. కీన్స్ అభిప్రాయప్రకారం కోశవిధానం స్వల్పకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించుటకు ఉపయోగపడుతుందేగాని దీర్ఘకాలిక సమస్య అయిన ఆర్థికాభివృద్ధికి తోడ్పడదు. కోశవిధానం సార్థక డిమాండ్‌ను పెంచడానికి ఉపయోగపడునేగాని, ఉత్పాదక శక్తిని పెంచడానికి ఉపయోగపడదని ఒక అభిప్రాయముంది. ఏమైనప్పటికీ ప్రభుత్వం అనుసరించే కోశవిధానం ధరలలో ఒడుదుడుకులను తగ్గించే సాధనంగా ఉపయోగపడినప్పుడే ఆర్థికాభివృద్ధి జరిగి ఆర్థిక సుస్థిరత ఏర్పడును.

3. ధరల స్థిరత్వాన్ని సాధించుట:- కోశవిధాన సాధనాలయిన వ్యయ విధానము, పన్నుల విధానం, రుణ విధానం ద్వారా ధరల స్థిరత్వాన్ని సాధించవచ్చు. ఈ సాధనాల ద్వారా ద్రవ్యోల్బణాన్ని, ప్రతిద్రవ్యోల్బణాన్ని అరికట్టి ధరలను అదుపు చేయవచ్చు. ద్రవ్యోల్బణం ఏర్పడినప్పుడు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి ద్రవ్యసప్లయిని, కొనుగోలు శక్తిని, డిమాండ్‌ను తగ్గించి ధరలను తగ్గించవచ్చు. ప్రతిద్రవ్యోల్బణం ఏర్పడినపుడు ప్రభుత్వ వ్యయాన్ని పెంచుట ద్వారా ద్రవ్యసప్లయిని, ఆదాయాన్ని, కొనుగోలు శక్తిని, డిమాండ్‌ను పెంచి ధరలను పెంచవచ్చు.

ప్రభుత్వం విధించే పన్నులను మార్చుటద్వారా కూడా ధరల స్థిరత్వాన్ని సాధించవచ్చు. ద్రవ్యోల్బణం ఏర్పడినప్పుడు ప్రభుత్వం ముఖ్యంగా ప్రత్యక్ష పన్నులను ఎక్కువగా విధించుట వల్ల ప్రజల వ్యయార్హ ఆదాయం తగ్గి, వస్తువులకు డిమాండ్ తగ్గి ధరలు తగ్గుతాయి. ఆర్థిక మాంద్యం ఏర్పడినపుడు ప్రభుత్వం పన్నుల భారాన్ని తగ్గించాలి.

ప్రభుత్వం ప్రజలనుండి రుణాలను సేకరించుట ద్వారా ద్రవ్యసప్లయిని అదుపుచేసి ద్రవ్యోల్బణాన్ని నివారించవచ్చు. కనుక ప్రభుత్వం అనుసరించే రుణ విధానంలో మార్పులను ప్రవేశపెట్టుట ద్వారా కూడా ధరల స్థిరత్వాన్ని సాధించవచ్చు. ద్రవ్యోల్బణ కాలంలో ప్రభుత్వం స్వచ్ఛందంగా గాని, నిర్బంధంగా గాని రుణాలను సేకరించి ఆర్థిక వ్యవస్థలోని ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించాలి. దీనివల్ల నిర్బంధ పొదుపు ఏర్పడును. ఆర్థికమాంద్యం ఏర్పడినపుడు ప్రభుత్వం వివిధ కార్యకలాపములపై వ్యయం చేయుట వల్ల ప్రభుత్వ బడ్జెట్‌లో ఏర్పడిన లోటును పూరించుటకు ప్రభుత్వరుణం ఉపయోగపడుతుంది. అందువల్ల ప్రజల ఆదాయం, కొనుగోలు శక్తి, డిమాండ్, ధరలు పెరిగి ప్రతిద్రవ్యోల్బణం నివారించబడును. ఈ విధంగా కోశవిధానం ఆర్థిక సుస్థిరతను సాధించడానికి ఉపయోగపడుతుంది.

4. ఆదాయ అసమానతలను తగ్గించుట:- కోశవిధానం ద్వారా ప్రభుత్వం ఆదాయ పంపిణీలో గల అసమానతలను తగ్గించవచ్చు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆదాయ అసమానతలు తీవ్రంగా ఉంటాయి. ఈ వ్యత్యాసాలు ఆర్థికాభివృద్ధి తొలిదశలో మరీ ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వ వ్యయం, పన్నుల విధానం, రుణ విధానాల ద్వారా ఈ వ్యత్యాసాలను తొలగించవచ్చు. ప్రభుత్వ వ్యయాన్ని పేదప్రజల ఆదాయాలను పెంచటానికి ఉపయోగించటం ద్వారా ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. పేదప్రజలకు సబ్సిడీలను మంజూరు చేయుట ద్వారా ఈ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం అనుసరించే పన్నుల విధానం ద్వారా ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ముఖ్యంగా పురోగామి పన్నుల ద్వారా ఈ అసమానతలను తగ్గించడానికి ఎక్కువగా వీలవుతుంది. ప్రభుత్వం ధనవంతులపై అధిక పన్నులను, పేదవారిపై తక్కువ పన్నులను విధించుట ద్వారా ఆదాయ పంపిణీలోగల అసమానతలను తగ్గించవచ్చు. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్నుల వ్యవస్థ అసంఘటితంగా ఉండటంవల్ల, పన్నుఎగవేత ఎక్కువగా జరగటం వల్ల, పరోక్ష పన్నులు ఎక్కువ ప్రాముఖ్యం కలిగి ఉండి ఇవి తిరోగామి స్వభావం కలిగి ఉండటం వల్ల ఆదాయ పునఃపంపిణీలో కోశవిధానం ప్రాముఖ్యం అనేక పరిమితులకు లోబడి ఉన్నది. ఆదాయ సంపదలలో అసమానతలను తొలగించడానికి ఆదాయ సంపదలను పునఃపంపిణీ చేయడానికి పన్నుల విధానం ఉపయోగపడాలని పన్నుల పరిశీలనా సంఘం వారి అభిప్రాయం. ప్రభుత్వ రుణవిధానం అల్పఆదాయ వర్గాల వారి అభివృద్ధికి ఉపయోగించినా ఆదాయ అసమానతలు తగ్గుతాయి.

**5. సాంఘిక అవసరాలకు అనుగుణంగా పెట్టుబడి జరుగుట:** సాంఘిక అవసరాలకు కావలసిన విత్తవనరులను కోశవిధాన సాధనాల ద్వారా సేకరించవచ్చు. గరిష్ఠ సాంఘిక ప్రయోజనం ఉండే విధంగా కోశవిధాన కార్యకలాపాలు ఉండాలి. ఉత్పాదక కార్యక్రమాలపై ఎక్కువగా పెట్టుబడులు జరగాలి. అనుత్పాదక కార్యకలాపాలపై ఎక్కువగా పెట్టుబడులు పెట్టకూడదు. సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన రంగాలలోనికి పెట్టుబడిని ఆకర్షించడానికి పన్నులలో రాయితీలు, సబ్సిడీలు మొదలైన వాటిని ప్రైవేటు వ్యక్తులకు కల్పించాలి. ప్రభుత్వ వ్యయం ద్వారానే అవస్థాపనా కార్యక్రమాలలో పెట్టుబడులు జరుగుతాయి. ప్రజాసంక్షేమాన్ని పెంచడానికి ముఖ్యమైన కర్యకలాపాలను ప్రభుత్వమే చేపట్టాలి. ప్రభుత్వం ముందుకువచ్చి సాంఘిక అవసరాలకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టాలి. సరియైన పన్నుల విధానంతోబాటు ప్రభుత్వ రుణ విధానం, లోటు ద్రవ్య విధానాల ద్వారా కావలసిన పెట్టుబడిని కోశవిధాన సాధనాల ద్వారా సమకూర్చుకోవచ్చు.

## 13.3. భారతదేశ కోశవిధానం:

స్వాతంత్ర్యానికి ముందు మన దేశానికి సంబంధించి ఒక సమగ్రమైన, నిర్దిష్టమయిన కోశవిధానం లేదు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీషువారు మన దేశాన్ని ఒక వలసరాజ్యంగా తయారుచేశారు. స్వాతంత్ర్యానంతరం దేశాన్ని క్రమబద్ధంగా అభివృద్ధి పరచాలని ప్రణాళికాబద్ధమయిన ఆర్థికవ్యవస్థను తయారుచేసి, దానికనుగుణంగా ఆర్థిక విధానాలను రూపొందించడమైంది. దీనికనుగుణంగానే ఒక సమగ్రమైన కోశవిధానాన్ని రూపొందించడమైంది.

అభివృద్ధి చెందిన దేశాలలో గల కోశవిధానానికి, భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్న కోశవిధానానికి తేడా ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాలలో పొదుపు పెట్టుబడులు అధికంగా ఉండి సంతులిత బడ్జెట్ ఉంటుంది. కాని మన దేశం లాంటి దేశాలలో ఆదాయం, పొదుపు, పెట్టుబడులు తక్కువగా ఉంటాయి. ఈ దేశాలలో వినియోగ ప్రవృత్తి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ దేశాలలో ప్రభుత్వం అనుసరించవలసిన కోశవిధానం వేరేవిధంగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వినియోగ వ్యయాన్ని క్రమబద్ధం చేసి పెట్టుబడిని పెంచాలి. ఆర్థికాభివృద్ధిని సాధించడానికి పన్నులద్వారా, ప్రభుత్వ రుణసేకరణ ద్వారా ద్రవ్య వనరులను సమీకరించుకోవాలి.

భారతదేశంలో కోశవిధానం ఈ క్రింది లక్ష్యాలను కలిగిఉంది:-

1. పొదుపును పెంచి, మూలధన సంచయాన్ని పెంచుట.
2. ఆదాయ, సంపదలలో గల అసమానతలను తొలగించుట.
3. ద్రవ్యోల్బణాన్ని తగ్గించుట.
4. ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుట.
5. త్వరిత ఆర్థికాభివృద్ధిని సాధించుట.

పై లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వం కోశవిధాన సాధనాలైన పన్నుల విధానం, వ్యయ విధానం, రుణ విధానాలను ఉపయోగించుకుంటుంది.

**1. పన్నుల విధానం:** ఆర్థికాభివృద్ధిని సాధించడానికి మరియు ఇతర లక్ష్యాలను సాధించడానికి పన్నుల విధానం ఒక ముఖ్య సాధనంగా ఉపయోగపడుతుంది. మనదేశంలో పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం క్రమంగా పెరుగుతుంది. స్థూలజాతీయ ఆదాయంలో పన్నుల నిష్పత్తి 1950-51 సం॥లో సుమారుగా 6 శాతం కాగా ప్రస్తుతం ఇది 25 శాతం వరకు ఉన్నది. ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కంటే పరోక్ష పన్నుల ద్వారా వచ్చే ఆదాయం మనదేశంలో ఎక్కువగా ఉంది. మనదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండునూ ఎక్కువుగా పరోక్ష పన్నులపై ఆధారపడుతున్నాయి. రాబడిని సంపాదించడానికేగాక ఆదాయ అసమానతలను తగ్గించడానికి, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి కూడా పన్నుల

విధానం ఉపయోగపడును. కాని మహలనోబిస్ కమిటీ అభిప్రాయం ప్రకారం మన పన్నుల విధానం ఆర్థిక అసమానతలను నిర్మూలించడానికి అంతగా ఉపయోగపడటం లేదు. పరోక్ష పన్నులపై ఎక్కువగా ఆధారపడుట, పన్ను ఎగవేత ఎక్కువగా ఉండుట మొదలైన కారణాలవల్ల మన పన్నుల విధానం ఆదాయ పునఃపంపిణీకి అంతగా ఉపయోగపడుటలేదు. ధరల స్థిరత్వాన్ని సాధించడానికి పన్నుల విధానాన్ని ఉపయోగించవచ్చు. ద్రవ్యోల్బణాన్ని నివారించడానికి సమిష్టి డిమాండ్‌ను తగ్గించాలి.

2. ప్రభుత్వ వ్యయం: మనదేశంలో పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైనప్పటి నుండీ ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరుగుతూ ఉంది. ప్రభుత్వం చేసే మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం ఎక్కువగా ఉన్నా ఆర్థికాభివృద్ధి త్వరితగతిన జరుగుతుంది. ఆర్థిక, సాంఘిక సేవలపై చేసే వ్యయం అభివృద్ధికి ఉపయోగపడే వ్యయమని, రక్షణ, రుణ సేవలపై చేసే వ్యయం అభివృద్ధికి తోడ్పడని వ్యయమని భావించవచ్చు. మనదేశంలో రక్షణవ్యయం, అసలు రుణాలు, వడ్డీ చెల్లింపులు మొదలగు వాటి రూపంలో ప్రభుత్వ వ్యయం పెరుగుతూ ఉంది. అందువల్ల ప్రభుత్వ వ్యయం మనదేశంలో ఆర్థికాభివృద్ధి రేటును అంతగా పెంచడానికి తోడ్పడుటలేదని చెప్పవచ్చు. అంతేకాకుండా మనదేశంలో ప్రభుత్వ వ్యయ విధానం ఆదాయ అసమానతలను తగ్గించడానికి కూడా అంతగా తోడ్పడుట లేదు. ప్రభుత్వ వ్యయం వల్ల ద్రవ్యోల్బణం ఏర్పడి పేదవారి వాస్తవిక ఆదాయం తగ్గి ఆర్థిక వ్యత్యాసాలు పెరిగాయి. మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం సుమారుగా 57 శాతం ఉంది. 1950-51 లో ప్రభుత్వ వ్యయం రూ. 983 కోట్లు ఉండగా ఇది 2003-2004 నాటికి రూ. 9,14,830 కోట్లుకు పెరిగింది.

3. ప్రభుత్వ రుణం: ప్రభుత్వ రుణం మనదేశంలో విపరీతంగా పెరుగుతుంది. 1950-51 సం॥లో మొత్తం ప్రభుత్వ రుణం రూ. 2,054 కోట్లు ఉండగా ఇది 2001-2002 నాటికి రూ. 13,44,268 కోట్లుకు పెరిగింది. ప్రభుత్వ ఋణం, పొదుపు, పెట్టుబడి, వనరుల కేటాయింపు పై ప్రభావం కలిగి ఉంటుంది. ప్రభుత్వం-ఋణాల ద్వారా సేకరించిన వనరులను ఉత్పాదక కార్యకలాపములపై వినియోగించిన వివిధ రంగాలలో ఉత్పాదక శక్తి పెరిగి ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. మనదేశంలో ప్రభుత్వ సెక్యూరిటీలు ఎక్కువగా ధనవంతుల దగ్గర ఉండుటచే ప్రభుత్వ రుణ విధానం ఆదాయ అసమానతలను తగ్గించడానికి ఎక్కువగా దోహదం చేయడం లేదు. అంతేకాకుండా మన ప్రభుత్వ రుణాలలో ఎక్కువగా స్వల్పకాలిక రుణాలు ఉండుటవల్ల ఆదాయ పునఃపంపిణీపై రుణవిధానం ఆశించినంతగా ప్రభావం చూపడం లేదు.

మనదేశ కోశవిధానం మొత్తం మీద ఆశించిన లక్ష్యాలను సాధించలేకపోయిందనే విమర్శ ఉంది. ప్రభుత్వ మొత్తం వ్యయంలో అనుత్పాదక వ్యయం ఎక్కువగా ఉండటం వల్ల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉపయోగ పడటం లేదు. ప్రభుత్వ ప్రణాళికా వ్యయం కూడా ఎక్కువగా పెరగటం లేదు. ప్రభుత్వ రుణాలపై చేసే వ్యయం, రక్షణ వ్యయం, పరిపాలనా వ్యయం మొదలగు వ్యయం ఎక్కువగా పెరగటం వల్ల ప్రభుత్వానికి పన్నుల ద్వారా ఆదాయం పెరిగినప్పటికి ప్రభుత్వ రంగంలో పొదుపు పెద్దగా పెరగటం లేదని చెప్పవచ్చు. ప్రభుత్వ వ్యయం వల్ల ద్రవ్యోల్బణం ఏర్పడింది. పేదవారి వాస్తవిక ఆదాయం తగ్గింది. పేదప్రజల నుండి ఆదాయం ధనవంతులకు బదిలీ అయింది. పరోక్ష పన్నులు ఎక్కువ ప్రాముఖ్యాన్ని కలిగి ఉండటం వల్ల ఈ పన్నుల భారం ఎక్కువగా పేదవారిపై ఉన్నది. అధిక ఫలన కాలమున్న పరిశ్రమలు, ప్రాజెక్టులపై ప్రభుత్వం వ్యయం చేయుటవల్ల వస్తూత్పత్తి వెంటనే పెరగక, ప్రజల ఆదాయం పెరిగింది. దీనివల్ల కూడా స్వల్ప కాలంలో ధరలు పెరిగాయి. మనదేశంలో ప్రభుత్వానికి వచ్చే పన్నుల ఆదాయంలో పరోక్ష పన్నులు ఎక్కువ ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రభుత్వ పన్నుల రాబడిలో పరోక్ష పన్నులు సుమారుగా 80 శాతం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండునూ పరోక్ష పన్నులపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. మనదేశంలో 1951-52 సం॥లో పన్నుల ద్వారా ప్రభుత్వ రాబడి రూ. 460 కోట్లు ఉండగా ఇది 2002-2003 నాటికి రూ. 4,18,000 కోట్లుకు పెరిగింది. ఎక్సైజుసుంకాలు, దిగుమతి సుంకాలు, అమ్మకం పన్ను మొదలైనవి మనదేశంలో ప్రభుత్వ పన్నుల ఆదాయ మార్గాలలో ఎక్కువ ప్రాముఖ్యాన్ని వహిస్తున్నాయి. ఆదాయ అసమానతలను తగ్గించడానికి పన్నుల విధానం అంతగా దోహదం చేయడం లేదు. ప్రభుత్వరుణం కొంతమేరకు ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడిననూ ఆదాయ అసమానతలను తగ్గించడానికి ఇది అంతగా ఉపయోగపడలేదు.

భారతదేశంలో కోశవిధానం ఆశించిన లక్ష్యాలను సాధించడానికి దీనిని ప్రణాళికా బద్ధంగా రూపొందించాలి. కోశవిధాన సాధనాలైన ప్రభుత్వ వ్యయ విధానం, పన్నుల విధానం, రుణ విధానాల మధ్య సమన్వయం ఉండాలి. అంతే కాకుండా ఒక దీర్ఘకాలిక కోశవిధానాన్ని రూపొందించుకోవాలి. స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించడానికి కోశవిధానాన్ని సక్రమంగా రూపొందించుకొని అమలుపరచాలి.

## 13.4. బడ్జెట్:

ప్రాచీన కాలంలో బడ్జెట్ అనే పదానికి పరిమిత అర్థం మాత్రమే ఉండేది. కాని ఆధునిక కాలంలో బడ్జెట్ అనే పదానికి విస్తృతమైన అర్థం ఉంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు లక్ష్యం నిర్ణయించి, ఆ లక్ష్య సాధనకు ద్రవ్య విధులకు సంబంధించి ప్రణాళికను బడ్జెట్ అని అంటారు. ఆధునిక యుగంలో ప్రభుత్వాలు వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. వీటి నిర్వహణకు కొంత వ్యయాన్ని చేయవలసి వస్తుంది. ఇందుకు ప్రభుత్వం పన్నులు మరియు ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొనును. రాబోయే సంవత్సరంలో అవలంబించే విధానాలను, ఉద్దేశాలను వివరించి ప్రభుత్వం దానికి సంబంధించిన ద్రవ్య ప్రణాళికను నిర్ణయించును. దీనినే బడ్జెట్ అని అంటారు. ఈ బడ్జెట్‌లో గడచిన సంవత్సరానికి సంబంధించిన ఎస్టిమేట్లు, రాబోయే సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయ అంచనాలు ఉంటాయి.

బడ్జెట్ రెండు రకాలుగా ఉంటుంది. 1. రెవెన్యూ బడ్జెట్. 2. మూలధన లేదా కాపిటల్ బడ్జెట్. రెవెన్యూ బడ్జెట్‌ను తిరిగి రెండు భాగాలుగా విభజించవచ్చు. (a) రెవెన్యూ రాబడి అనగా పన్నులు ప్రభుత్వరంగ సంస్థల ద్వారా వచ్చే లాభాలు మొదలైనవి. (b) రెవెన్యూ వ్యయం అనగా వడ్డీ చెల్లింపులు, రక్షణవ్యయం, ముఖ్యమయిన సబ్సిడీలు, పోలీసు, పరిపాలనా వ్యయం మొదలైనవి.

మూలధన బడ్జెట్‌ను కూడా తిరిగి రెండు భాగాలుగా విభజింపవచ్చు. (a) మూలధన వసూళ్లు అనగా వాపసయిన రుణాలు, నికర పొదుపు వసూళ్లు మరియు ఇతర మూలధన రాబడులు. (b) మూలధన వ్యయం అనగా ప్రభుత్వ రంగ సంస్థలకు, రాష్ట్రాలకు ఇచ్చే రుణాలు, విదేశీ ప్రభుత్వాలకు ఇచ్చే రుణాలు మొదలైనవి.

ప్రభుత్వ బడ్జెట్ ముఖ్యంగా మూడు విభాగాలు ఉండును. (ఎ) ఏకీకృత నిధి లేదా సంచితనిధి (Consolidated Fund), (బి) ఆగంతుక నిధి (Contingency Fund), (సి) ప్రభుత్వ ఖాతా (Public Account).

**(ఎ) ఏకీకృత నిధి లేదా సంచితనిధి:** పన్నుల ద్వారా రాబడి, రుణాలు మరియు ఇతర ప్రభుత్వ రాబడులు ఈ నిధిలో జమ చేయబడతాయి. పార్లమెంట్ లేదా శాసనసభల ఆమోదం లేనిదే ఈ నిధినుండి ప్రభుత్వం వ్యయం చేయరాదు. సుప్రీమ్‌కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతాలు, కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ వేతనాలు మాత్రమే చట్టసభల ఆమోదం లేకుండా ఈ నిధి నుండి చెల్లించవచ్చు.

**(బి) ఆగంతుక నిధి:** అత్యవసర ఖర్చులు, జాప్యం చేయటానికి వీలులేని చెల్లింపులు ఈ నిధినుండి వ్యయం చేయబడును, దేశాధ్యక్షుని నియంత్రణలో ఈ నిధి ఉంటుంది. ఈ నిధి వ్యయానికి పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభల ఆమోదం అవసరం లేదు. ఈ నిధి ఏర్పాటుకు మాత్రం చట్టసభల ఆమోదం అవసరం. ముఖ్యంగా ఊహించని వ్యయాలకు మాత్రమే ఈ నిధిని ఉపయోగిస్తారు.

**(సి) ప్రభుత్వ ఖాతా:** చిన్నమొత్తాల పొదుపు, ప్రావిడెంట్ ఫండ్ మొదలగు వాటినుండి వచ్చే రాబడులు ఈ ఖాతాలో జమకడతారు. ఈ నిధి నుండి చెల్లింపులకు పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభల ఆమోదం అవసరం లేదు.

**బడ్జెట్ ప్రాధాన్యత:** ప్రభుత్వం వివిధ ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి కోశవిధానాన్ని ఉపయోగించును. కోశవిధానం అమలు పరుచుసాధనమే బడ్జెట్. మస్‌గ్రేవ్ (Musgrave) అనే ఆర్థికవేత్త బడ్జెట్ ప్రాముఖ్యాన్ని ముఖ్యంగా మూడు విధాలుగా పేర్కొన్నాడు.

**1. వనరుల కేటాయింపు (Allocation of resources) :** అభివృద్ధి చెందుతున్న దేశాలలో వనరులు కొరతగా ఉండును. కొరతగా ఉన్న ఈ వనరులను ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య పంపిణీ చేసే విధిని బడ్జెట్ నిర్వహించాలి. సామాజిక ప్రయోజనం, ప్రజాప్రయోజనం గల కొన్ని వస్తువుల ఉత్పత్తి, పంపిణీ మార్కెట్ యంత్రాంగానికి పూర్తిగా విడిచిపెట్టరాదు. ప్రైవేటు రంగం కొన్ని వస్తువుల ఉత్పత్తిలో సమర్థవంతంగా పనిచేయదు. అటువంటి వస్తువులను ప్రభుత్వరంగమే ఉత్పత్తి చేయాలి. ఇటువంటి వస్తువులనే పబ్లిక్ వస్తువులు అని అంటారు. అంతేకాకుండా కొన్ని వస్తువులు అవిభాజ్యంగా ఉంటాయి. రోడ్లు, పార్కులు, గ్రంధాలయాలు, వీధిదీపాలు మొదలైన వస్తువులను వ్యక్తిగతంగా విభజించడానికి వీలులేదు. అందువల్ల వీటి ధరనిర్ణయం కష్టం. కనుక ఇటువంటి వస్తువుల ఉత్పత్తి, పంపిణీ ప్రభుత్వమే చేయాలి. మస్‌గ్రేవ్ అభిప్రాయ ప్రకారం సాంఘిక వస్తువుల తయారీ మార్కెట్ యంత్రాంగానికి వదలడానికి వీలులేదు. అంతేగాకుండా ప్రభుత్వం వినియోగదార్లు తమ ఆదాయం సక్రమంగా వెచ్చించేటట్లు బడ్జెట్ నియంత్రణ చేయాలి. ప్రజా ఆరోగ్యానికి హానికరమయిన వస్తువులు అనగా మద్యపానం, సిగరెట్లు మొదలగు వాటిపై అధికంగా పన్నులను విధించటం ద్వారా ఈ వస్తువుల వినియోగాన్ని ప్రభుత్వం క్రమబద్ధీకరించవచ్చు. ఏ వస్తువుల ఉత్పత్తి, పంపిణీ ప్రభుత్వ రంగం ద్వారా జరగాలి, ఏవి మార్కెట్ యంత్రాంగం ద్వారా జరగాలో నిర్ణయించి ఆర్థిక వనరుల కేటాయింపు సక్రమంగా జరగాలి. బడ్జెట్ విధానం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య వనరుల పంపిణీ సక్రమంగా జరగాలి. మొత్తంమీద వనరుల కేటాయింపు గరిష్ఠ సాంఘిక ప్రయోజనం పొందేటట్లు జరగాలి.

**2. ఆదాయ, సంపద పంపిణీలో సర్దుబాట్లు (Adjustment in the distribution of income and wealth):** సాధారణంగా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలలో ఆదాయ, సంపదలలో అసమానతలు ఎక్కువగా ఉంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ప్రైవేటు ఆస్తిహక్కు, వారసత్వం, సామర్థ్యంలో తేడాలు, విద్యావకాశాలలో తేడాలు, పన్నుల ఎగవేత మొదలైన అనేక కారణాల వల్ల ఈ వ్యవస్థలలో ఆర్థిక అసమానతలు ఏర్పడతాయి. పన్నుల విధానం, ప్రభుత్వ వ్యయ విధానాల ద్వారా అంటే సరియైన బడ్జెట్ విధానం ద్వారా ప్రభుత్వ ఆదాయ, సంపద పంపిణీలో సర్దుబాటు చేసుకొని అసమానతలను తగ్గించవచ్చు.

**3. ఆర్థిక సుస్థిరత (Economic stability) :** ప్రభుత్వ నియంత్రణ ఎక్కువగా లేని మార్కెట్ యంత్రాంగానికి ఆర్థిక వ్యవస్థ పనితీరును వదలి వేసినట్లయితే ఉద్యోగితా స్థాయి, ధరల స్థాయిలలో ఒడుదుడుకులు ఏర్పడతాయి. ఉద్యోగితా స్థాయిని పెంచడం, ధరల స్థాయిని స్థిరీకరించడం బడ్జెట్ విధానం యొక్క లక్ష్యంగా ఉండాలి.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో కొన్ని ప్రత్యేకమైన సమస్యలుంటాయి. పేదరికం అధికస్థాయిలో ఉండుట, నిరుద్యోగం ఎక్కువగా ఉండుట, గ్రామీణ ప్రాంతాలు వెనుకబడుట మొదలగు సమస్యలు ఈ దేశాలలో ఎక్కువగా ఉంటాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఒక సమగ్రమైన, నిర్దిష్టమైన బడ్జెట్ విధానాన్ని రూపొందించాలి.

## 13.5. లోటు ద్రవ్య విధానం (Deficit financing):

ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు లక్ష్యం నిర్ణయించి. ఆ లక్ష్యసాధనకు ద్రవ్యవిధులకు సంబంధించిన ప్రణాళికను బడ్జెట్ అని అంటారు. సూక్ష్మంగా చెప్పాలంటే ప్రభుత్వ ఆదాయ, వ్యయాలను తెలిపే పట్టికను బడ్జెట్ అని అంటారు. ప్రభుత్వం అనుసరించే బడ్జెట్‌ను మూడు విధాలుగా వర్గీకరించవచ్చు. 1. మిగులు బడ్జెట్, 2. సంతులిత బడ్జెట్, 3. లోటు బడ్జెట్. ప్రభుత్వ వ్యయంకంటే ఆదాయం ఎక్కువగా ఉన్నదానిని మిగులు బడ్జెట్ అని అంటారు. ప్రభుత్వ వ్యయం, ఆదాయం సమానంగా ఉంటే సంతులిత బడ్జెట్ అని అంటారు. ప్రభుత్వ ఆదాయంకంటే ప్రభుత్వ వ్యయం అధికంగా ఉంటే లోటు బడ్జెట్ అని అంటారు. ప్రభుత్వం తాను నిర్వహించే వివిధ కార్యకలాపాలకు పన్నుల ద్వారా లేదా రుణాల ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా సేకరిస్తుంది. ప్రభుత్వం తాను చేసే వ్యయానికి ఈ ద్రవ్యవనరులు చాలనపుడు బడ్జెట్‌లో లోటు ఏర్పడుతుంది. ఈ లోటును పూరించడానికి ప్రభుత్వం అనుసరించే విధానాన్నే లోటుద్రవ్య విధానమని అంటారు.

భారత ప్రణాళికా సంఘం వారి అభిప్రాయ ప్రకారం, బడ్జెట్‌లో రెవెన్యూ ఖాతాపైగాని, మూలధన ఖాతాలోగాని లోటు ద్వారా స్థూల జాతీయ వ్యయానికి అదనపు వ్యయాన్ని ప్రత్యక్షంగా కల్పించడాన్ని లోటు ద్రవ్య విధానమంటారు. ప్రభుత్వ నగదు నిల్వలను ఖర్చు చేయుట ద్వారాగాని, కేంద్ర బ్యాంకు నుండి రుణాలను తీసుకొనిగాని లోటు బడ్జెట్‌ను భర్తీ చేయడాన్ని లోటు ద్రవ్య విధానమని ప్రణాళికా సంఘం వారి అభిప్రాయం. ప్రభుత్వ బడ్జెట్ కార్యకలాపాల వల్ల ఆర్థిక వ్యవస్థలో కొనుగోలు శక్తి నికర పెరుగుదలను లోటు ద్రవ్య విధానమని కొందరి అభిప్రాయం.

లోటు ద్రవ్య వర్గీకరణ ముఖ్యంగా నాలుగు రకాలుగా ఉంటుంది. 1. బడ్జెట్ లోటు, 2. రెవెన్యూ లోటు, 3. కోశ లోటు, 4. ప్రాథమిక లోటు. మొత్తం ప్రభుత్వ వ్యయం నుండి మొత్తం ప్రభుత్వ రాబడులు మినహాయించగా వచ్చేది బడ్జెట్ లోటు. మొత్తం రెవెన్యూ వ్యయం నుండి మొత్తం రెవెన్యూ ఆదాయం మినహాయించగా వచ్చేది రెవెన్యూ లోటు. బడ్జెట్ లోటుకు ప్రభుత్వ రుణాలు మొదలైన వాటిని కలపగా వచ్చేది కోశ లోటు. కోశ లోటు నుండి వడ్డీ చెల్లింపులు మినహాయించగా వచ్చేది ప్రాథమిక లోటు.

అభివృద్ధి చెందిన దేశాలలో గల లోటు ద్రవ్యానికి, అభివృద్ధి చెందుతున్న దేశాలలో గల లోటు ద్రవ్య విధానానికి తేడా ఉంది. అభివృద్ధి చెందిన దేశాలలో ఉద్దేశపూర్వకంగా కల్పించబడిన బడ్జెట్‌లో గల లోటును పూరించడాన్ని లోటు ద్రవ్య విధానమని అంటారు. ఈ దేశాలలో బ్యాంకుల ద్వారా అదనపు పరపతిని కల్పించటాన్ని లోటు ద్రవ్య విధానమని అంటారు. దీనివల్ల ముఖ్యంగా ప్రజల సగటు వ్యయం, సార్థక డిమాండ్ పెరిగి ఆర్థిక మాంద్యం నివారించబడుతుంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వం కేంద్రబ్యాంకు నుండి రుణాలను తీసుకొనుట ద్వారాగాని లేదా అదనంగా కరెన్సీని జారీ చేయుట ద్వారాగాని బడ్జెట్ లోటును పూరించడాన్ని లోటు ద్రవ్య విధానమంటారు. కనుక భారతదేశంలో బడ్జెట్‌లో రెవెన్యూఖాతాపై గాని లేదా మూలధన ఖాతాలోగాని బడ్జెట్‌లో లోటు ద్వారా స్థూల జాతీయ వ్యయానికి అదనపు వ్యయాన్ని ప్రత్యక్షంగా కల్పించటాన్ని లోటు ద్రవ్య విధానం అంటారు. బడ్జెట్ లోటును ప్రభుత్వం కేంద్ర బ్యాంకు వద్దనున్న తన ద్రవ్య నిల్వలను ఉపయోగించిగాని, లేదా రిజర్వుబ్యాంకు నుండి రుణాలు చేసిగాని పూరించును. దీని వల్ల దేశంలో అదనపు ద్రవ్య సప్లయి పెరుగుతుంది. దీనినే లోటు ద్రవ్యవిధానమని అంటారు.

**భారతదేశంలో లోటుద్రవ్యం:** భారతదేశంలో వివిధ పంచవర్ష ప్రణాళికలలో లోటుద్రవ్య పరిమాణం ఏవిధంగా ఉందో ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

| ప్రణా. | లోటుద్రవ్యం (కోట్ల రూ॥లలో) |
|---|---|
| మొదటి ప్రణాళిక | 232 |
| రెండవ ప్రణాళిక | 948 |
| మూడవ ప్రణాళిక | 1,133 |
| నాల్గవ ప్రణాళిక | 3,750 |
| అయిదవ ప్రణాళిక | 2,787 |
| ఆరవ ప్రణాళిక | 5,000 |
| ఏడవ ప్రణాళిక | 14,000 |
| ఎనిమిదవ ప్రణాళిక | 29,262 |
| తొమ్మిదో ప్రణాళిక | 1,63,752 |
| పదో ప్రణాళిక | 6,385 (అంచనా) |

పై పట్టిక ప్రకారం మనదేశంలో వివిధ ప్రణాళికలలో లోటుద్రవ్యం క్రమంగా పెరుగుతూ ఉన్నదని తెలుస్తుంది. ముఖ్యంగా తొమ్మిదో ప్రణాళికలో ఈ లోటు మరీ ఎక్కువగా ఉంది. 5వ 'పే కమీషన్' వారి సిఫార్సులకు అనుగుణంగా తొమ్మిదో ప్రణాళికలో లోటు ద్రవ్య పరిమాణం విపరీతంగా పెరిగింది. ఈ లోటును పదో ప్రణాళికలో తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**లోటు ద్రవ్య విధాన సాధనాలు:** లోటుబడ్జెట్‌ను ముఖ్యంగా నాలుగు సాధనాల ద్వారా పూరించవచ్చు.

1. కేంద్రబ్యాంకు ( రిజర్వుబ్యాంకు ) నుండి రుణాలను తీసుకోవడం.
2. వాణిజ్య బ్యాంకుల నుండి రుణాలను సేకరించుట.
3. కేంద్రబ్యాంకు నుండి ప్రభుత్వ నిల్వలను ఉపయోగించడం.
4. ప్రభుత్వం అదనంగా కరెన్సీని జారీ చేయడం.

## 13.6. లోటు ద్రవ్య లక్ష్యాలు (లేదా) ప్రాముఖ్యం :

లోటు ద్రవ్య విధానాన్ని కురిదార, లెవీస్ మొదలైన ఆర్థికవేత్తలు సమర్థించారు.

**1. లోటు ద్రవ్యం - ఆర్థిక మాంద్య నివారణ:** ఒక ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య పరిస్థితులను ఎదుర్కొనేటపుడు లోటుద్రవ్యం ద్వారా ఆ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించవచ్చు. ఆర్థికమాంద్యం ఏర్పడినప్పుడు సమిష్టి డిమాండ్ తక్కువగా ఉంటుంది. ప్రైవేటు రంగంలో కూడా పెట్టుబడి వ్యయం మరీ తక్కువగా ఉండును. ప్రభుత్వ వ్యయం కొంచెంగా పెంచటం ద్వారా ప్రైవేటు రంగంలో పెట్టుబడి వ్యయం ఎక్కువగా పెంచవచ్చు. దీనినే పంప్ ప్రైమింగ్ అని అంటారు. అందువల్ల లోటు ద్రవ్య విధానం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా సార్థక డిమాండ్‌ను పెంచి ఆర్థికమాంద్యాన్ని నివారించవచ్చు. ఆర్థికమాంద్యంలో ప్రైవేటు పెట్టుబడిలో ఏర్పడిన లోటును పూరించడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. దీనినే పరిపూరక వ్యయ విధానమని అంటారు. కొన్ని సమయాలలో ఆర్థిక వ్యవస్థలో దీర్ఘకాలిక స్తబ్దత ఏర్పడినపుడు దానిని నివారించడానికి చిరకాల లోటువ్యయ పద్ధతిని (Secular deficit method) అవలంబించడం జరుగుతుంది. ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన ఆర్థిక మాంద్యాన్ని నివారించడానికి లోటు ద్రవ్య విధానం ఎంతో ఉపయోగపడునని కీన్సు అభిప్రాయం. లోటు ద్రవ్య విధానం వల్ల ప్రజల ఆదాయం, కొనుగోలు శక్తి, సమిష్టి డిమాండ్ పెరిగి ఆర్థికమాంద్యం నివారించవచ్చు.

**2. లోటుద్రవ్యం - ఆర్థికాభివృద్ధి:** అభివృద్ధి చెందుతున్న దేశాలలో ముఖ్య లక్ష్యం సత్వర ఆర్థికాభివృద్ధిని సాధించుట. అనేకమంది ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం ఈ దేశాలలో త్వరిత ఆర్థికాభివృద్ధి సాధించడానికి లోటు ద్రవ్య విధానం ఒక ముఖ్య సాధనంగా ఉపయోగపడును. అనేక అభివృద్ధి పథకాలను అమలు పరచడానికి లోటు ద్రవ్యవిధానం ఈ దేశాలలో ఉపయోగపడుతుంది. ఆర్థికాభివృద్ధికి లోటుద్రవ్య విధానం ఉపయోగపడే విషయంలో రెండు అభిప్రాయాలు ఉన్నాయి. 1. ఆర్థికాభివృద్ధిని సాధించడానికి లోటు ద్రవ్యాన్ని నిరంతరం ఉపయోగించాలని కొందరి అభిప్రాయం. 2. మరికొంతమంది అభిప్రాయ ప్రకారం ఆర్థికాభివృద్ధిని సాధించడానికి లోటు ద్రవ్యాన్ని తాత్కాలికంగా మాత్రమే ఉపయోగించాలి. మొత్తం మీద లోటు ద్రవ్య విధానాన్ని ప్రవేశపెట్టుట వల్ల వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఇందువల్ల ప్రజల వాస్తవిక ఆదాయం పెరుగుతుంది. దీనివల్ల పొదుపు రేటు, మూలధన కల్పనరేటు పెరిగి వివిధ అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టుటకు కావలసిన పెట్టుబడులు ఏర్పడును. ఈ విధంగా లోటుద్రవ్య విధానం వివిధ ప్రణాళికల అమలుకు కావలసిన పెట్టుబడులను సమీకరించుటలో కీలక ప్రాముఖ్యాన్ని వహించును. కాబట్టి ఆర్థికాభివృద్ధి సాధించుటలో లోటు ద్రవ్యం ఎంతో ఉపయోగపడును.

**3. లోటు ద్రవ్యం - యుద్ధకాలం :** యుద్ధ సమయంలో ప్రభుత్వానికి అదనంగా ఆదాయం అవసరమవుతుంది. పన్నుల

ద్వారా లేదా రుణాల ద్వారా సేకరించిన ద్రవ్యవనరులు చాలనప్పుడు యుద్ధ అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం లోటు ద్రవ్యవిధానాన్ని అవలంబించును. ప్రభుత్వం లోటు ద్రవ్య విధానం ద్వారా సులభంగా, త్వరగా యుద్ధానికి కావలసిన ద్రవ్య వనరులను సమీకరించుకోవచ్చు. కాని దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యసప్లయి, ద్రవ్యఆదాయం పెరిగి ధరల పెరుగుదలకు దారితీయవచ్చు. ఆర్థిక మాంద్యంలో అవలంబించే లోటు ద్రవ్య విధానానికి, యుద్ధ కాలంలో అవలంబించే లోటు ద్రవ్య విధానానికి తేడా ఉంది. సాధారణంగా ఆర్థికమాంద్యంలో సార్థక డిమాండ్‌ను పెంచడానికి లోటు ద్రవ్య విధానాన్ని ఉపయోగిస్తారు కాని యుద్ధ సమయంలో లోటు ద్రవ్య విధానం సార్థక డిమాండ్‌ను అదుపులో ఉంచడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని కొంత వరకు నివారించవచ్చు. యుద్ధ సమయాలలో సాధ్యమైనంతవరకు లోటుద్రవ్యాన్ని తగు జాగ్రత్తగా ఉపయోగించాలి.

**4. లోటు ద్రవ్యం - ఉద్యోగితా స్థాయి :** ఉద్యోగితా స్థాయిని పెంచడానికి లోటు ద్రవ్య విధానం ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. కీన్సు అను ఆర్థిక శాస్త్రవేత్త ప్రకారం ఉద్యోగితా స్థాయి సార్థక డిమాండ్‌పై ఆధారపడును. సార్థక డిమాండ్ ముఖ్యంగా సమిష్టి డిమాండ్‌పై ఆధారపడుతుంది. సమిష్టి డిమాండ్ తిరిగి వినియోగవ్యయం పెట్టుబడివ్యయంపై ఆధారపడును. కాబట్టి మొత్తం వ్యయాన్ని పెంచినా సమిష్టి డిమాండ్, సార్థక డిమాండ్ పెరిగి ఉద్యోగితా స్థాయి పెరుగుతుంది. కీన్సు అభిప్రాయ ప్రకారం ప్రభుత్వం లోటు ద్రవ్య విధానాన్ని అనుసరించటం వల్ల ప్రభుత్వం వ్యయం పెరిగి ద్వారా ప్రజల ఆదాయం కొనుగోలుశక్తి పెరిగి సమిష్టి డిమాండ్ పెరుగును. దీనివల్ల సార్థక డిమాండ్ పెరిగి ఉద్యోగితా స్థాయి పెరుగుతుంది.

వెనుకబడిన దేశాలలో లోటు ద్రవ్య విధానం ఉద్యోగితా స్థాయిని పెంచే విషయంలో కొంత అనుమానం లేకపోలేదు. ఈ దేశాలలో వనరుల కొరత, తక్కువ మూలధనకల్పన, నిర్వహణ సామర్థ్యం తక్కువ, తగినంత సాంకేతిక పరిజ్ఞానం లేకపోవుట, సాంఘిక వ్యవస్థా మూలధనం తగినంతగా అభివృద్ధి చెందకపోవుట, మార్కెట్ అసంపూర్ణతలు ఉండుట మొదలగు పరిస్థితులు ఉండును. అందువల్ల ఈ పరిస్థితులలో వెనుకబడిన దేశాలలో లోటు ద్రవ్య విధానం వల్ల ఉద్యోగితా స్థాయి పెరగకపోవచ్చని కొంతమంది ఆర్థికవేత్తల అభిప్రాయం.

**5. లోటు ద్రవ్యం - వనరుల సమీకరణ :** అభివృద్ధి చెందుతున్న దేశాలు వివిధ అభివృద్ధి పథకాలను అమలుపరుచుటకు కావలసిన వనరులను సమీకరించుకొనుటలో వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ దేశాలలో కొన్ని ఉత్పాదక వనరులను పూర్తిగా, సక్రమంగా ఉపయోగించుకొనుట లేదు. లోటు ద్రవ్య విధానాన్ని అనుసరించుట ద్వారా అనుపయుక్తంగా ఉన్న మిగులు వనరులను పూర్తిగా, సక్రమంగా ఉపయోగించుకోవచ్చు. వనరుల వినియోగం వల్ల వస్తూత్పత్తి పెరిగి ఉద్యోగితా స్థాయి పెరుగుతుంది. లోటు ద్రవ్యం వల్ల ధరలు పెరిగి నిర్బంధ పొదుపు ఏర్పడవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజలు చేసే స్వచ్ఛంద పొదుపు పెట్టుబడులకు సరిపోదు గనుక లోటు ద్రవ్య విధానాన్ని అనుసరించి, ధరలను పెంచుట ద్వారా నిర్బంధ పొదుపు ఏర్పడి తద్వారా ప్రణాళికలను అమలు పరచడానికి కావలసిన పెట్టుబడి వనరులను సమీకరించుకోవచ్చు. ఆర్థికమాంద్య పరిస్థితులు ఉన్నపుడు మిగులు శ్రామికులు, ఇతర అనుపయుక్తంగా ఉన్న వనరులను లోటు ద్రవ్య విధానం ద్వారా ఆదాయ, ఉద్యోగితా స్థాయిలను పెంచడానికి తరలించవచ్చని కీన్సు అభిప్రాయం. ద్రవ్య వనరులను సమీకరించటంలో లోటు ద్రవ్య విధానం ఎంతో ఉపయోగపడుతుంది

## 13.7. లోటు ద్రవ్యం - సమస్యలు :

ఆర్థిక వ్యవస్థలో లోటు ద్రవ్య విధానాన్ని ప్రవేశపెట్టుట వల్ల కొన్ని సమస్యలు కూడా ఏర్పడతాయి. లోటు ద్రవ్య విధానాన్ని కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తలు తీవ్రంగా విమర్శించారు. మిల్టన్ ఫ్రీడ్‌మన్, మార్టిన్ బెయిలీ, రాబర్ట్ ముండాల్ మొదలైన వారు లోటు ద్రవ్య విధానాన్ని విమర్శించారు. లోటు ద్రవ్య విధానం వల్ల ఈ క్రింది సమస్యలు ఏర్పడతాయి.

**1. ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది:** లోటు ద్రవ్య విధానం వల్ల వస్తువుల ధరలు పెరుగుతాయి. లోటు ద్రవ్యం వల్ల ద్రవ్య సప్లయి మొత్తం పెరుగుతుంది. దీనివల్ల ప్రజల ఆదాయం, కొనుగోలు శక్తి పెరిగి వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది.

దీనివల్ల ధరలు పెరుగుతాయి. వెనుకబడిన దేశాలలో వనరుల కొరతవల్ల వస్తువుల సప్లయి పెరగదు. లోటు ద్రవ్య విధానం వల్ల వస్తువుల సప్లయికంటే డిమాండ్ అధికంగా ఉండును. దీనివల్ల వస్తువుల ధరలు పెరుగుతాయి. వస్తువుల సప్లయికి, డిమాండ్‌కు అసమతౌల్యం ఏర్పడటం వల్ల ద్రవ్యోల్బణం ఏర్పడును.

**2. నిర్బంధపు పొదుపు:** లోటు ద్రవ్య విధానం వల్ల ధరలు పెరుగుతాయి. అందువల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గి వస్తు వినియోగం తగ్గిపోతుంది. వస్తువుల ధరలు అధికంగా ఉండటం వల్ల ప్రజలు ఆ వస్తువులను కొనుగోలు చేయడానికి ఇష్టపడరు. అంతేగాకుండా ప్రజల కొనుగోలు శక్తి కూడా తక్కువగా ఉంటుంది. దీనివల్ల ప్రజలలో నిర్బంధపు పొదుపు ఏర్పడుతుంది. ప్రజలు ఇచ్ఛాపూర్వకంగా పొదుపు చేయరు. ధరలు పెరుగుట వల్ల వస్తువులను కొనుగోలు చేయలేక తమ ఆదాయంలో కొంతభాగం నిర్బంధంగా పొదుపు చేస్తారు. ఇది కేవలం నిశ్చిత ఆదాయ వర్గాలలో, పేద ప్రజలలో మాత్రమే జరుగును. ధనవంతుల విషయంలో ఇలా జరుగకపోవచ్చు. ముఖ్యంగా ధనవంతులు ధరలు పెరిగిననూ తమ మిగులు ఆదాయాల నుంచి వస్తువులను కొనుగోలు చేస్తారు. అందువల్ల ధనవంతుల విషయంలో ధరలు పెరిగిననూ వినియోగం తగ్గదు.

**3. ఆర్థిక సంక్షోభం :** ఆర్థిక వ్యవస్థలో లోటు (ద్రవ్య పరిమాణం) నిరంతరం పెరుగుతూ ఉన్నట్లయినా అతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడి ఆర్థిక సంక్షోభానికి దారితీయును. లోటు ద్రవ్య విధానం వల్ల వస్తువుల ధరలు పెరుగుట వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. దీనివల్ల తిరిగి ధరలు విపరీతంగా పెరుగుతాయి. ఈ అతి ద్రవ్యోల్బణం వల్ల ప్రజల వాస్తవిక ఆదాయాలు తగ్గిపోతాయి. అందువల్ల ప్రజల ఆర్థిక శ్రేయస్సు తగ్గి ఆర్థిక వ్యవస్థలో అనేక సమస్యలు ఏర్పడి ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుంది.

**4. ఆదాయ అసమానతలు :** లోటు ద్రవ్య విధానం వల్ల ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక అసమానతలు కూడా ఏర్పడతాయి. లోటు ద్రవ్య విధానం వల్ల ధరలు పెరిగి, పెట్టుబడిదారులకు లాభాలు పెరుగుతాయి. దీనివల్ల వీరి ఆదాయాలు పెరుగుతాయి. కాని ధరలు పెరుగుట వల్ల అల్పాదాయ వర్గాల వారి వాస్తవిక ఆదాయాలు తగ్గుతాయి. అందువల్ల ఆదాయ పంపిణీలో అసమానతలు పెరుగుతాయి. లోటు ద్రవ్య విధానం ధనవంతులకు మాత్రమే లాభసాటిగా ఉండునుగాని పేదప్రజలకు లాభసాటిగా ఉండదు.

**5. అభిలషణీయమైన పెట్టుబడి జరుగకపోవచ్చు:** లోటు ద్రవ్య విధానం వల్ల ధరల పెరుగుదల ఎక్కువగా ఉండును. దీనివల్ల పెట్టుబడులు ప్రణాళికా ప్రాధాన్యతలకు అనుగుణంగా జరుగదు. వస్తువులకు కృత్రిమంగా కొరతను కలిగించటానికి ప్రయత్నించడమగును. అంచనా వ్యాపారం జరుగును. అంతేకాకుండా విదేశీ బ్యాంకులలో ద్రవ్యాన్ని దాచుకొనుటకు ప్రయత్నించడమగును. మొత్తం మీద దేశీయ పెట్టుబడి ఆశించినంతగా జరుగకపోవచ్చు

## 13.8. సారాంశము :

లోటు ద్రవ్య విధానం వల్ల కొన్ని ప్రయోజనాలు, కొన్ని సమస్యలు ఏర్పడతాయి. మొత్తం మీద లోటు ద్రవ్య విధానం ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ఒక ముఖ్య సాధనంగా ఉపయోగపడును. లోటు ద్రవ్య విధానం వల్ల మొత్తం ద్రవ్యసప్లయి పెరిగి వివిధ ఉత్పత్తి కారకాలకు డిమాండ్ పెరుగును. దీనివల్ల దేశంలో ఉన్న వివిధ ఉత్పత్తి కారకాలను పూర్తిగా, సక్రమంగా ఉపయోగించుకోవచ్చు. లోటు ద్రవ్య విధానం ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలను చైతన్యవంతం చేసి వివిధ అభివృద్ధి పథకాలను చేపట్టవచ్చు. దీనివల్ల వివిధ రంగాలు అభివద్ధి చెంది, ఉత్పత్తి పెరిగి ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు. అయినప్పటికి లోటు ద్రవ్యాన్ని అనుసరించేటపుడు దీనివల్ల ఏర్పడే ఫలితాలను సమగ్రంగా, జాగ్రత్తగా గమనించాలి. అతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మొత్తం మీద లోటు ద్రవ్య విధానం వల్ల పొందే ప్రయోజనాలు, ఏర్పడే సమస్యలు దానిని ఉపయోగించే విధానంపై ఆధారపడి ఉన్నది. లోటు ద్రవ్య విధానాన్ని ఒక పరిమిత మోతాదులో ఉపయోగించినచో మంచిది. మాజీ ఆర్థికమంత్రి టి.టి.కృష్ణమాచారి చెప్పినట్లు లోటు ద్రవ్య విధానాన్ని మందువలె చిన్న

మోతాదులో తీసుకోవలెగాని, అది ఆహారం కాదు (Deficit finance is a medicine to be taken in small doses. It is not the food that could sustain the system). లోటు ద్రవ్యం అదుపులో ఉన్నట్లయినా దీనివల్ల మంచి ఫలితాలను పొందవచ్చు, కాని అదుపు తప్పినా అనేక చెడు ఫలితాలు ఏర్పడతాయి (Deficit Finance,like fire, is a good servant but a bad master). లోటు ద్రవ్య విధానం కొంతవరకు ద్రవ్యోల్బణానికి దారితీసినప్పటికి, ఇది ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ఒక ముఖ్యసాధనంగా ఉపయోగపడును.

## 13.9. గుర్తుంచుకోవలసిన విషయాలు :

1. ప్రభుత్వ వ్యయం, పన్నులు, రుణ విధానాల ద్వారా ఆర్థిక వ్యవస్థలోని ఉత్పత్తి, ఉద్యోగిత, ధరలు, ఆదాయ స్థాయిలను ప్రభావితం చేయు విధానాన్నే కోశవిధానమందురు.

2. సంపూర్ణ ఉద్యోగితను సాధించుట, ఆర్థికాభివృద్ధిని సాధించుట, ధరల స్థిరత్వాన్ని సాధించుట, ఆదాయ అసమానతలను తగ్గించుట, సాంఘిక అవసరాలకు అనుగుణంగా పెట్టుబడి జరుగుట కోశవిధాన లక్ష్యాలు.

3. భారతదేశంలో పన్నుల విధానం, ప్రభుత్వ వ్యయ విధానం, ప్రభుత్వ రుణ విధానం ద్వారా వివిధ లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వం ప్రయత్నించుచున్నది.

4. బడ్జెట్ వివిధ రకాలుగా ఉండి కొన్ని లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించును.

5. బడ్జెట్ లోటును పూరించడానికి ప్రభుత్వం అనుసరించే విధానాన్నే లోటు ద్రవ్య విధానమందురు.

6. ఆర్థిక మాంద్య నివారణ, ఆర్థికాభివృద్ధిని సాధించుట, యుద్ధకాలంలో అనుసరించుట, ఉద్యోగితా స్థాయిని పెంచుట, వనరుల సమీకరణ మొదలైన లక్ష్యాలను లోటు ద్రవ్య విధానం కలిగి ఉంది.

7. లోటు ద్రవ్య విధానం వల్ల కొన్ని సమస్యలు కూడా ఏర్పడును.

## 13.10. కఠిన పదాలు :

1. కోశవిధానం : ప్రభుత్వ వ్యయం, పన్నులు, రుణ విధానాల ద్వారా ఆర్థిక వ్యవస్థలోని ఉత్పత్తి, ఉద్యోగిత, ధరలు, ఆదాయస్థాయిలను ప్రభావితం చేయు విధానాన్ని కోశవిధానమందురు.

2. పంప్ ప్రైమింగ్ : ప్రభుత్వవ్యయం కొంచెంగా పెరుగుట వల్ల ప్రైవేటురంగ వ్యయం ఎక్కువగా పెరుగుటనే పంప్ ప్రైమింగ్ అని అందురు.

3. పరిపూరక వ్యయం : ప్రైవేటురంగ వ్యయంలో తగ్గుదలను పూరించేదిగా అధిక పరిమాణంలో ప్రభుత్వరంగ వ్యయం జరుగుటనే పరిపూరక వ్యయమందురు.

4. సంపూర్ణ ఉద్యోగిత : ఇవ్వబడిన వేతనం దగ్గర ఉద్యోగం చేయుటని ఇష్టపడే వ్యక్తులందరికీ ఉద్యోగిత కల్పించబడిన దానిని సంపూర్ణ ఉద్యోగిత అని అంటారు.

5. బడ్జెట్ : ఒక నిర్ణీత కాలానికి సంబంధించి ప్రభుత్వ ఆదాయ, వ్యయాలను తెలిపే పట్టికను బడ్జెట్ అని అంటారు.

6. మిగులు బడ్జెట్ : ప్రభుత్వ ఆదాయం కంటే వ్యయం తక్కువగా ఉన్న దానిని మిగులు బడ్జెట్ అని అంటారు.

7. సంతులిత బడ్జెట్ : ప్రభుత్వ ఆదాయం, వ్యయం సమానంగా ఉన్న దానిని సంతులిత బడ్జెట్ అని అంటారు.

8. లోటు బడ్జెట్ : ప్రభుత్వ ఆదాయంకంటే వ్యయం ఎక్కువగా ఉన్నదానిని లోటు బడ్జెట్ అని అంటారు.

9. ఏకీకృతనిధి లేదా సంచితనిధి : పన్నుల ద్వారా రాబడి, రుణాలు మరియు ఇతర ప్రభుత్వ రాబడులు ఈ నిధిలో జమ చేయబడతాయి.

10. ఆగంతుకనిధి : అత్యవసర ఖర్చులు, జాప్యం చేయటానికి వీలులేని చెల్లింపులు ఈ నిధినుంచి వ్యయం చేయబడును.

11. ప్రభుత్వఖాతా : చిన్న మొత్తాల పొదుపు, ప్రావిడెంట్ ఫండ్ మొదలగు వాటినుండి వచ్చే రాబడులు ఈ ఖాతాలో జమకడతారు.

12. లోటుద్రవ్యం : బడ్జెట్ లోటును పూరించడానికి ప్రభుత్వం అనుసరించే విధానాన్నే లోటుద్రవ్య విధానమందురు.

## 13.11. నమూనాప్రశ్నలు :

I. వ్యాసరూప ప్రశ్నలు.

1. కోశవిధాన లక్ష్యాలను వివరింపుము?
2. బడ్జెట్ అనగానేమి? దీని ప్రాధాన్యతను తెలుపుము?
3. లోటు ద్రవ్య విధానమనగానేమి? దీని ప్రాముఖ్యాన్ని వివరింపుము?

II. సంక్షిప్త ప్రశ్నలు.

1. కోశవిధాన సాధనాలను గూర్చి వ్రాయుము?
2. భారతదేశ కోశవిధాన లక్ష్యాలను తెలుపుము?
3. బడ్జెట్‌లోగల విభాగాలను తెలుపుము?
4. లోటుద్రవ్య విధాన సమస్యలను గూర్చి వ్రాయుము?

## 13.12. చదువదగిన గ్రంథాలు:


1. Public Finance in U.D.C - R.N.Tripathi
2. Public Finance - R.K.Lekhi
3. The Theory of public Finance - R.A.Musgrave.
4. పబ్లిక్ అర్థశాస్త్రం - తెలుగు అకాడమి.


- డా॥ డి. కైలాసరావు

పాఠం:14

# ఫెడరల్ విత్త విధానం

## 14.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశంలో మీరు ముఖ్యంగా ఫెడరల్ విత్త విధాన సూత్రాలు, సమస్యలు మరియు సంతులితం చేసే సాధనాలను పరిశీలించడమైంది. ఈ భాగం పూర్తయ్యేసరికి మీరు క్రింది అంశాలను గురించి అవగాహన చేసుకుంటారు.

- ఫెడరల్ విత్త విధాన సూత్రాలు.
- ఫెడరల్ విత్త విధాన సమస్యలు.
- ఫెడరల్ విత్త విధానంలో సంతులితం చేసే సాధనాలు.

## విషయసూచిక


14.1. విషయపరిచయము.

14.2. ఫెడరల్ విత్త విధాన సూత్రాలు.

14.3. ఫెడరల్ విత్త విధానం - సమస్యలు.

14.4. ఫెడరల్ విత్త విధానం - సంతులితం చేసే సాధనాలు.

14.5. సారాంశము

14.6. గుర్తుంచుకోవలసిన విషయాలు.

14.7. కఠిన పదాలు.

14.8. నమూనా ప్రశ్నలు.

14.9. చదువదగిన గ్రంధాలు.


## 14.1. విషయపరిచయము:

ఫెడరల్ రాజ్యాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉంటాయి. ఈ రెండు ప్రభుత్వాల మధ్య అధికార విభజన జరుగుతుంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, స్విట్జర్‌లాండ్, పాకిస్తాన్, నైజీరియా, మలయా మొదలగు దేశాలతోబాటు భారతదేశం కూడా ఫెడరల్ రాజ్యాలలో ముఖ్యమైనది. ఫెడరల్ దేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజనతోబాటు విత్త వనరుల కేటాయింపు జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య విత్త వనరుల కేటాయింపుకు సంబంధించి అనుసరించవలసిన విధానాన్నే ఫెడరల్ విత్త విధానమంటారు. ఫెడరల్ వ్యవస్థలో అధికారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజింపబడి ఉంటాయి. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కావలసిన విత్త వనరులు కూడా విభజింపబడి కేటాయించబడాలి. వివిధ విధుల కేటాయింపుతోబాటు విత్త వనరుల కేటాయింపుకూడా జరగాలి. దీనికి సంబంధించి అనుసరించవలసిన విధానాన్నే ఫెడరల్ విత్త విధానమందురు.

## 14.2. ఫెడరల్ విత్త విధాన సూత్రాలు (Principles of Fedaral Finance):

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల కేటాయింపునకు సంబంధించిన కొన్ని సూత్రాలను పరిశీలించెదము.

**1. స్వాతంత్ర్యం మరియు బాధ్యత (Independance and responsibility):**

విత్త వనరుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధులను సరియైన విధంగా నిర్వహించడానికి పూర్తి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ఉండాలి. వివిధ పన్నులను విధించడంలోను, వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని వ్యయం చేయుటలోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తిగా స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలి. ఈ విధంగా లేనియెడల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజకీయ స్వయం ప్రతిపత్తి లోపిస్తుంది.

విత్త వనరుల సూత్రాలలో స్వాతంత్ర్యం మరియు బాధ్యతను పాటించుట కష్టం. ఈ సూత్రాన్ని అమలు పరచుట కొన్ని ఇబ్బందులు కలుగుతాయి. ఇందుకు కొన్ని కారణాలు ఉన్నాయి. దేశంలో అన్ని రాష్ట్రాలు సాధారణంగా ఒకే విధంగా అభివృద్ధి చెంది ఉండవు. ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రం ఎక్కువ విత్త వనరులను సమకూర్చుకొని తమ విధులను, కార్యకలాపాలను సమర్ధవంతంగా నిర్వహించగలవు. వివిధ కార్యకలాపాలను నిర్వహించుటకు గల ద్రవ్య వనరులు ఈ రాష్ట్రాలలో ఎక్కువగా ఉండును. వెనుకబడిన రాష్ట్రాలు మాత్రం తమకు కావలసిన విత్త వనరులను అవసరమైన మేరకు సమృద్ధిగా సమకూర్చుకొనలేవు. అందువల్ల ఈ వెనుకబడిన రాష్ట్రాలు తమ విధులను , కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించుకోలేవు. కాబట్టి వెనుకబడిన ఫెడరల్ రాజ్యాలలో స్వాతంత్ర్యం మరియు బాధ్యత అనే సూత్రాన్ని పాటించడం కష్టం. వెనుకబడిన రాష్ట్రాలకు అవసరాలు ఎక్కువగాను, ఆదాయం తక్కువగా ఉండటం వల్ల అవి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేవు. అందువల్ల పన్నులను విధించే స్వయం ప్రతిపత్తి కేంద్ర ప్రభుత్వానికి, వ్యయం చేసే స్వయం ప్రతిపత్తి రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించడం సముచితంగా ఉండునని కొంతమంది అభిప్రాయము. అవసరమైనపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర అవగాహనతో వాటి విధులను సక్రమంగా నిర్వహించడానికి, వాటికి కావలసిన వనరులను సమకూర్చుకోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్వయం ప్రతిపత్తి ఉండాలని భావించడమవుతుంది.

**2. పర్యాప్తమైన విత్త వనరులు మరియు వ్యాకోచత్వం (Financial Adequacy and Elasticity):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కార్యకలాపాలను నిర్వహించడానికి సరిపోయే విధంగా విత్త వనరులు ఉండాలి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మీదగాని, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం మీదగాని విత్త వనరుల విషయంలో ఆధారపడకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధులను సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన విత్త వనరులను సమకూర్చుకోగలిగితే దానిని పర్యాప్తమైన విత్త వనరులని అంటారు. విత్త వనరులను సమకూర్చుకొనే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విషయంలో కొరత సమస్యను ఎదుర్కొనరాదు. రాష్ట్ర ప్రభుత్వాలు తమకు అవసరమైన విత్త వనరులకోసం కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడరాదు. ఆ విధంగా ఆధారపడినచో ఫెడరల్ విత్త సూత్రానికి ఆటంకం కలుగుతుంది.

పర్యాప్తమైన విత్త వనరుల సూత్రంతోబాటు వ్యాకోచత్వ సూత్రాన్ని కూడా పాటించాలి. అనగా విత్త వనరుల విషయంలో వ్యాకోచత్వం ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కేటాయించిన విత్త వనరులను మారుతున్న బాధ్యతలు, అవసరాలకు అనుగుణంగా పెంచుకోగలిగినా దానిని వ్యాకోచత్వంగా చెప్పవచ్చు. అందువల్ల ప్రభుత్వ అవసరాలనుబట్టి రాబడిని పెంచుకోగలిగి ఉండాలి. ఈ విధంగా లేనియెడల ప్రభుత్వాలు ఆర్థిక, రక్షణ మొదలైన విషయాలలో సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది.

**3. పరిపాలనలో మితవ్యయం (Economy in Administration) :**

ప్రభుత్వం పన్నుల నిర్మాణం, వసూలు మొదలైన వాటిలో గల లోపాలను తగ్గించాలి. ఫెడరల్ విత్త విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు విధించే అధికారం ఇవ్వడమైంది. ఈ అధికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండునూ సమర్ధవంతంగా నిర్వహించాలి. పన్నులను విధించటంలోను, విధించిన పన్నులను సమర్ధవంతంగా వసూలు చేయడంలోను మితవ్యయం ఉండాలి. విస్తృత జాతీయ ప్రాతిపదికగల పన్నులను కేంద్ర ప్రభుత్వం, స్థానిక ప్రాతిపదికగల పన్నులు రాష్ట్రాలు విధించిన మితవ్యయం ఉండి పరిపాలనా సౌలభ్యం ఏర్పడుతుంది. ఉదాహరణకు ఆదాయపు పన్ను, ఎగుమతి, దిగుమతి, సుంకాలు, మరణ సుంకాలు మొదలైన పన్నులను కేంద్ర ప్రభుత్వం సమర్ధవంతంగా వసూలుచేసి నిర్వహించగలుగుతుంది. భూమిశిస్తు, మోటారు వాహనాలపై పన్ను, ఆస్తి పన్ను మొదలైన పన్నులను రాష్ట్ర ప్రభుత్వాలు సమర్ధవంతంగా నిర్వహించి విధించగలవు.

ఫెడరల్ విత్త విధానానికి సంబంధించి అదార్కర్ అనే ఆర్థిక శాస్త్రవేత్త పైమూడు సూత్రాలను తన గ్రంథమైన

Principles and Problems of Federal Finance ' లో ప్రతిపాదించాడు. ఈ సూత్రాలతోబాటు కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తలు మరికొన్ని సూత్రాలను ప్రతిపాదించారు

**4. సమాన పన్నుల భారం (Equity in Taxation):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలపై పన్నులు విధించే అధికారం కలదు. ఈ విధంగా పన్నులు విధించేటపుడు పన్నులభారం అన్ని రాష్ట్రాలలోను సమానంగా ఉండాలి. అనగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో ఉపాంత పన్నుల భారం, వెనుకబడిన రాష్ట్రాలలో ఉపాంత పన్నుల భారం సమానంగా ఉండాలి. అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో సగటు ప్రజల ఆదాయం ఎక్కువగా ఉండును కాబట్టి ఈ రాష్ట్రాలలో ప్రజలకు పన్ను చెల్లించే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. వెనుకబడిన రాష్ట్రాలలో ప్రజల ఆదాయం తక్కువగా ఉండును కాబట్టి ఈ రాష్ట్రాలలో ప్రజలకు పన్ను చెల్లించే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. అందువల్ల ప్రజలు పన్నులను చెల్లించేటపుడు వివిధ రాష్ట్రాలలో ఉపాంత పన్నుల భారం సమానంగా ఉండేటట్లు చూడాలి. కనుక అన్ని రాష్ట్రాలలోను పన్నులు చెల్లించుట వల్ల ఏర్పడే ఉపాంత త్యాగం సమానంగా ఉండేటట్లు చూడాలి.

**5. సమన్వయం మరియు ఏకీకరణ (Coordination and Integration):**

ఫెడరల్ విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ఎంతో అవసరం. దేశ ఆర్థిక సమతౌల్యం, ఆర్థిక సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల, వ్యయ విధానాలకు సమన్వయం, ఏకీకరణ స్వభావం ఉండాలి. ఫెడరల్ విత్త విధానం సమర్థవంతంగా పని చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలంటే సమన్వయం మరియు ఏకీకరణ సూత్రాన్ని తప్పని సరిగా పాటించాలి. జాతీయ ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ప్రతి రాష్ట్రం కొన్ని విధులను నిర్వహించాలి. అంతే కాకుండా మారుతున్న పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు వనరుల పునఃకేటాయింపు, పంపిణీ జరగాలి. అవసరాలనుబట్టి విత్త విధానాన్ని రూపొందించాలి.

**6. జవాబుదారుగా వ్యవహరించడం (Accountability):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ శాసన సభలకు పూర్తి జవాబుదారుగా ఉండాలి. ఫెడరల్ వ్యవస్థలో ఆదాయాన్ని సమకూర్చడంలోను, సమకూర్చుకున్న ఆదాయాన్ని వ్యయం చేయడంలోను శాసనసభల ఆమోదాన్ని తప్పక పాటించాలి. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ శాసనసభలకు జవాబుదారుగా వ్యవహరించడం వల్ల ప్రజా ధనాన్ని ఎటువంటి దుబారా జరుగకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించవచ్చు. ఫెడరల్ రాజ్యాలలో ప్రతి ప్రభుత్వం ప్రజలపై సాధ్యమైనంత వరకు తక్కువ పన్నుల భారాన్ని ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

## 14.3. ఫెడరల్ విత్త విధానం - సమస్యలు :

**1. వనరుల సమీకరణలో వ్యత్యాసాలు:**

విత్త వనరులను సమకూర్చుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమానత్వం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక విధులను నిర్వహించును. ఈ విధులను నిర్వహించుటకు కావల్సిన ద్రవ్య వనరులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చుకోవాలి. కానీ విత్త వనరులని సమకూర్చుకోవటంలో సమానత్వం లేదని చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వానికి అందుబాటులో ఉండే విత్త వనరులతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వాలకు అందుబాటులో ఉన్న విత్త వనరులు తక్కువగా ఉండును. కనుక రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నాయి.

**2. బాధ్యతలలో తేడాలు:**

ఫెడరల్ రాజ్యాలలో కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ వనరులు సమకూర్చుకొనే అవకాశం ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వాలకు వనరులు సమకూర్చుకొనే విషయంలో కొన్ని సమస్యలు ఏర్పడును. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ మార్గాల ద్వారా వనరులను కొంత మేరకు సమకూర్చుకుంటున్నప్పటికి ఇవి నిర్వహించే విధులు, బాధ్యతలు ఎక్కువగా ఉండును. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే బాధ్యతలలో వ్యత్యాసాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువుగా బాధ్యతలు నిర్వహించుచున్నప్పటికి వాటికి అనుగుణంగా ద్రవ్యవనరులను సమకూర్చుకోలేకపోతున్నాయి.

**3. ప్రాంతీయ అసమానతలు:**

ప్రాంతీయ అసమానతల వలన విత్తవనరుల విషయంలో సమతౌల్యము సాధించలేక పోవడమగుచున్నది. ఫెడరల్ రాజ్యాలలో అన్ని రాష్ట్రాలు ఒకే విధంగా అభివృద్ధి చెంది ఉండవు. కొన్ని రాష్ట్రాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది ఉండగా, మరికొన్ని రాష్ట్రాలు వెనుకబడి ఉండును. కొన్ని రాష్ట్రాలు వ్యవసాయకంగా అభివృద్ధి చెంది ఉండగా, మరికొన్ని రాష్ట్రాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ఉండును. కొన్ని రాష్ట్రాలు ఏ రంగంలోనూ అభివృద్ధి చెంది ఉండవు. ఈ ప్రాంతీయ అసమానతల వల్లే ఫెడరల్ విత్త విధానంలో సమస్యలు ఏర్పడునని ఆచార్య కె.వి.యస్.శాస్త్రి అభిప్రాయం. ప్రాంతీయ అసమానతల వలన విత్త వనరుల విషయంలో అసమతౌల్యం ఏర్పడును.

**4. కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు:**

ఫెడరల్ రాజ్యాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన జరుగును. రాష్ట్ర ప్రభుత్వాలకు స్వతంత్ర ప్రతిపత్తిని సమకూర్చడానికి కొన్ని అధికారాలను ప్రత్యేకంగా ఇచ్చినప్పటికీ కొన్ని సమయాలలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలపైన కొన్ని అధికారాలను చెలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం నియంత్రణ చేయుచుండును. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వాల స్వయం ప్రతిపత్తి తగ్గిపోయే ప్రమాదం ఉన్నది. భారతదేశం వంటి ఫెడరల్ రాజ్యాలలో కేంద్ర ప్రభుత్వం కొన్ని కారణాలను చూపి రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయవచ్చును. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం ఎక్కువ అధికారాలను కల్గి ఉండుట వల్ల ఫెడరల్ విత్త విధానంలో కొన్ని సమస్యలు ఏర్పడతాయి.

## 14.4. ఫెడరల్ విత్త విధానం - సంతులితం చేసే సాధనాలు:

సాధారణంగా ఫెడరల్ రాజ్యాలలో కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ ద్రవ్య వనరులు అందుబాటులో ఉండి రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ బాధ్యతలను నిర్వహించవలసి ఉండును. రాష్ట్రాలకు తక్కువుగా వనరులు అందుబాటులో ఉండును. ప్రాంతీయ అసమానతల వలన విత్త వనరులలో అసమానతలు ఏర్పడును. ఈ విత్త వనరులలో ఉండే అసమానతలను తొలగించడానికి కొన్ని పద్ధతులను అవలంభించటమగును. ఫెడరల్ విత్త విధానంలో అసమానతలను తొలగించి సంతులితం చేసే పద్ధతులను ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

**1. పన్నుల రాబడి పంపిణీ (Distribution of Tax Revenues):**

సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు మరియు ఇతర సాధనాల ద్వారా సమకూరే ఆదాయం తక్కువగా ఉంటుంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు ద్రవ్యవనరులు బదిలీ చేయవలసిన అవసరం ఉండును. తనకు వచ్చిన ఆదాయ వనరులలో కేంద్ర ప్రభుత్వం కొంత భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిణీ చేయడాన్ని పన్నుల రాబడి పంపిణీ అంటారు. విత్త వనరుల బదిలీలు అనేక విధాలుగా జరగవచ్చు. ఇందులో పన్నుల రాబడి పంపిణీ పద్ధతి ఒక సాధారణమైన పద్ధతి. ఈ పద్ధతి ప్రకారం కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని ముందుగా నిర్ణయించిన పద్ధతి ప్రకారం రాష్ట్రాలకు కేటాయించడం జరుగుతుంది. ఈ

విధంగా జరిగేటప్పుడు కొన్ని సమస్యలు ఏర్పడవచ్చు. ఏ పన్నులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరగాలి, కేంద్ర ప్రభుత్వానికి వచ్చే పన్ను రాబడిలో ఎంత భాగాన్ని రాష్ట్రాలకు కేటాయించాలి, రాష్ట్రాలకు కేటాయించిన పన్ను రాబడిని వివిధ రాష్ట్రాల మధ్య ఏ విధంగా పంపిణీ చేయాలి మొదలైన అంశాలలో కొన్ని సమస్యలు తలఎత్తవచ్చు. సాధారణంగా ఫెడరల్ రాజ్యాలలో ఆదాయపు పన్ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగును. కానీ మన దేశంలో ఆదాయపు పన్ను, ఎక్సైజు పన్ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగుతున్నది. ముఖ్యంగా రాజ్యాంగంలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా లేదా ఆర్థిక సంఘం నిర్ణయించిన విధంగా పన్నుల రాబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగును.

పన్నుల రాబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరగటం వలన కొన్ని ప్రయోజనాలు ఏర్పడతాయి.

(ఎ) రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వయం ప్రతిపత్తిని కాపాడుకొంటు తమకు కావల్సిన వనరులను పొందవచ్చు.

(బి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కావల్సిన విత్త వనరులలో సమతౌల్యాన్ని సాధించవచ్చు.

(సి) ఈ పద్ధతిలో పరిపాలనకు సంబంధించిన సమస్యలు ఎక్కువుగా ఉండవు. ఇది చాలా సులభమైన పద్ధతి.

(డి) ఈ పద్ధతి ద్వారా జాతీయ ఆదాయం సమానంగా పంపిణీ అయ్యే అవకాశం ఉంటుంది.

పై విధంగా పన్నుల రాబడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ చేయటం వలన కొన్ని లాభాలు ఉన్నప్పటికీ ఈ పద్ధతి ద్వారా రాష్ట్రాలకు వచ్చే వాటా నిర్దిష్టంగా ఉండదు.

**2. అనుబంధ పన్నులు (Supplementary Levies):**

ఈ పద్ధతి ప్రకారం ముఖ్యమైన పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించును. రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై అనుబంధ పన్నులను విధిస్తాయి. కొన్ని సందర్భాలలో ముఖ్యమైన పన్నులను రాష్ట్ర ప్రభుత్వాలు విధించి వాటిపై అనుబంధ పన్నులను కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. కాని సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ముఖ్యమైన పన్నులను, రాష్ట్ర ప్రభుత్వాలు అనుబంధ పన్నులను విధించడం జరుగుతుంది. అనుబంధ పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాలకే చెందును. అనుబంధ పన్నుల పద్ధతిని అనుసరించేటపుడు ప్రభుత్వం పన్నుల రేటును జాగ్రత్తగా నిర్ణయించి, ఈ పన్ను రేటు ప్రజలకు ఎక్కువగా భారాన్ని కలిగించకూడదు. ఇందుకోసం ప్రభుత్వం సరియైన జాగ్రత్తను తీసుకొని అనుబంధ పన్నులను విధించాలి. అనుబంధ పన్నులను విధించేటపుడు సాధ్యమైనంత వరకు పన్నురేటును పరిమితం చేయాలి. లేకపోతే పన్నుల భారం పెరిగిపోతుంది.

**3. గ్రాంట్లు (Grants):**

విత్త వనరుల విషయంలో వివిధ రాష్ట్రాల మధ్య అసమానతలను తొలగించడానికి గ్రాంటులను ఉపయోగించడం అగును. సాధారణంగా రాష్ట్ర అవసరాలను బట్టి కేంద్ర ప్రభుత్వం గ్రాంటులను మంజూరు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంటులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

(ఎ) సహాయక గ్రాంట్లు (Grants - In aid) లేదా ప్రత్యేక గ్రాంట్లు (Special Grants).

(బి) మాచింగ్ గ్రాంట్లు (Matching Grants).

ఏదైనా ఒక ప్రత్యేకమైన పనికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంటులను మంజూరు చేసిన అటువంటి గ్రాంటులను సహాయక గ్రాంట్లు లేదా ప్రత్యేక గ్రాంట్లు అని అంటారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు ద్రవ్యపరమైన సమస్యలను ఎదుర్కొనేటపుడు లేదా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేటపుడు కేంద్ర ప్రభుత్వం

రాష్ట్రాలకు ఈ ప్రత్యేక గ్రాంటులను మంజూరు చేయును. దీనివల్ల రాష్ట్రాల మధ్య విత్త వనరులలో వ్యత్యాసాలు తొలగిపోతాయి. రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం కంటే వ్యయము ఎక్కువగా ఉన్నపుడు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో లోటు ఏర్పడుతుంది. ఈ లోటును పూరించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మంజూరు చేసే గ్రాంట్లను మాచింగ్ గ్రాంట్లు అంటారు.

ఫెడరల్ రాజ్యాలలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంటులను మంజూరు చేసేటపుడు కొన్ని అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

(ఎ) వివిధ రాష్ట్రాలు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించేందుకు అవకాశం కల్పించేటట్లుగా గ్రాంటులను మంజూరు చేయాలి.

(బి) రాష్ట్రాల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా గ్రాంటులను రాష్ట్రాలకు మంజూరు చేయాలి.

(సి) రాష్ట్రాలు తమ స్వశక్తిపై ఆధారపడేటట్లు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకి గ్రాంటులను మంజూరు చేయాలి.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంటులను స్వయం ప్రతిపత్తి ఉన్న ఒక కమీషన్ ద్వారా మంజూరు చేయాలి. రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం గ్రాంటులను మంజూరు చేసేటపుడు కొన్ని ముఖ్యమైన సూత్రాలను పాటించాలి. రాష్ట్రలోగల ప్రజల తలసరి ఆదాయం, తలసరి వ్యయము, తలసరి పన్నులు మొదలగు వాటిని పరిగణనలోనికి తీసుకొని కేంద్రం, రాష్ట్రాలకు గ్రాంటులను మంజూరు చేయాలి.

**4. రుణాలు :** రాష్ట్ర ప్రభుత్వాలు తాము ఎదుర్కొంటున్న విత్త వనరుల సమస్యను తొలగించడానికి రుణాలను సేకరించవచ్చు. రాష్ట్రాలు ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నుండి రుణాలను పొందును. సాధారణంగా రాష్ట్రాలు నీటి పారుదల సౌకర్యాలు, వ్యవసాయ అభివృద్ధి, సామాజిక సేవా పథకాల అమలు మరియు ఇతర కార్యకలాపాలకు రుణాలను చేస్తాయి. రాష్ట్రాలు ఎక్కువగా అంతర్గత ఆధారాల నుండే రుణాలను చేస్తాయికాని బహిర్గత ఆధారాల నుండి ఎక్కువగా రుణాలను చేయవు. కొన్ని సమయాలలో రాష్ట్ర ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వము యొక్క అనుమతి లేకుండానే దేశంలోని ఇతర రాష్ట్రాల నుండి రుణాలను చేయవచ్చు. ఈ విధంగా ఫెడరల్ విత్త విధానంలో గల సమస్యలను తొలగించి విత్త వనరులను సంతులితం చేయటానికి రాష్ట్ర ప్రభుత్వాలు చేసే రుణాలు కూడా ఉపయోగపడతాయి.

**5. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త వనరులను సంతులితం చేసే సాధనాలు:** భారతదేశంలో విత్త వనరుల పంపిణీలో సమతౌల్యంను సాధించటానికి, పన్నుల పంపిణీని ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగించడం అగుతున్నది. మనదేశంలో కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి ఆ రాబడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండునూ పంచుకుంటాయి. ఉదాహరణకు మనదేశంలో ఆదాయం పన్ను, ఎక్సైజ్ సుంకము మొదలైన పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి వచ్చిన రాబడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంచుకోవడం జరుగుతుంది. కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకు అందచేయును. ఉదా:- ఎస్టేటు సుంకాలు, వార్తా పత్రికల క్రయ విక్రయాలపై పన్ను మొదలగు వాటిని కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసిన రాబడిని రాష్ట్రాలకు బదిలీ చేయబడును. కొన్ని పన్నులను రాష్ట్ర ప్రభుత్వాలే విధించి వసూలు చేసుకుని వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తిగా పొందును. ఉదాహరణకు అమ్మకపు పన్ను, భూమి శిస్తు, మోటారు వాహనాలపై పన్ను మొదలగు వాటిని రాష్ట్ర ప్రభుత్వాలే విధించి, వసూలు చేసుకుని ఆ రాబడిని తాము పూర్తిగా పొందును.

భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల పంపిణీని పరిశీలించినచో కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరులు ఎక్కువగా ఉన్నట్లు, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు తక్కువగా ఉన్నట్టు తెలుస్తుంది. అందువలనే పన్నుల

ద్వారా వచ్చే రాబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ చేయబడుతుంది. దీనివలన విత్త వనరుల సమతౌల్యాన్ని సాధించడమే కాక రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి లభించును. అంతేకాకుండా రాష్ట్ర బడ్జెట్‌లో స్థిరత్వం ఏర్పడును. మనదేశంలో కేంద్రం నుండి రాష్ట్రాలకు పన్నుల రాబడి పంపిణీ, గ్రాంట్లు, రుణాల ద్వారా వనరుల బదిలీ జరుగుతున్నది. మొదటి పంచవర్ష ప్రణాళికలో పన్నుల రాబడి రాష్ట్రాలకు జరిగే పంపిణీ 340 కోట్ల రూపాయలు కాగా, గ్రాంట్లు ద్వారా 290 కోట్ల రూపాయలు, ఋణాల ద్వారా 800 కోట్ల రూపాయలు ద్రవ్య వనరులను సమకూర్చుకున్నాయి. 8వ పంచవర్ష ప్రణాళికలో పన్నుల వాటా 98,890 కోట్ల రూపాయలను, గ్రాంట్లు ద్వారా 90,720 కోట్ల రూపాయలను, ఋణాల ద్వారా 54,650 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వాలు విత్త వనరులను సమకూర్చుకున్నాయి. ఈ సమాచారాన్నిబట్టి భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కావలసిన విత్త వనరుల కోసం ఎక్కువగా కేంద్ర ప్రభుత్వం పై ఆధారపడుచున్నట్లు తెలుస్తుంది.

## 14.5. సారాంశము:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల కేటాయింపుకు సంబంధించి కొన్ని సూత్రాలను పాటించాలి. ఈ రెండు ప్రభుత్వాలు తమ విధులను సక్రమంగా నిర్వహించే విధంగా విత్త వనరులను సమీకరించుకోవాలి. కాని ఇందులో కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయి. దేశంలో వివిధ రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెంది ఉండవు.ప్రాంతీయ అసయానతలవల్ల ఫెడరల్ విత్త విధానంలో ముఖ్యంగా కొన్ని సమస్యలు ఏర్పడును. ఈ సమస్యల పరిష్కారానికి కొన్ని చర్యలు తీసుకోవాలి. ఫెడరల్ విత్త విధానం సక్రమంగా ఉండటానికి, ప్రాంతీయ అసమానతలు తొలగించడానికి రాజ్యాంగ ప్రకారం లేదా ఫైనాన్స్ కమీషన్ సూచనల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల పంపిణీ జరగాలి.

## 14.6. గుర్తుంచుకోవలసిన విషయాలు:

1. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య విత్త వనరుల కేటాయింపుకు సంబంధించి అనుసరించవలసిన విధానాన్నే ఫెడరల్ విత్త విధానమందురు.

2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల కేటాయింపుకు సంబంధించి కొన్ని సూత్రాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం మరియు బాధ్యత, పర్యాప్తమైన విత్త వనరులు మరియు వ్యాకోచము, పరిపాలనలో మితవ్యయం, సమాన పన్నుల భారము, సమన్వయము మరియు ఏకీకరణ, జవాబుదారుగా వ్యవహరించుట మొదలైన సూత్రాలు పాటించాలి.

3. ఫెడరల్ విత్త విధానంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. వనరుల పంపిణీలో వ్యత్యాసాలు, బాధ్యతలలో తేడాలు, ప్రాంతీయ అసమానతలు, కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు మొదలైన సమస్యలు ఉన్నాయి.

4. ఫెడరల్ విత్త విధానంలో గల సమస్యలను పరిష్కరించి సంతులితం చేసే సాధనాలు కొన్ని ఉన్నాయి. సన్నుల రాబడి పంపిణీ, అనుబంధ పన్నులను విధించడం, గ్రాంట్లు మంజూరు చేయుట, రాష్ట్రాలకు రుణాలను మంజూరు చేయుట మొదలైన విధానాల ద్వారా ఫెడరల్ విత్త విధానంలో సంతులితాన్ని సాధించవచ్చు.

5. భారతదేశంలో విత్త వనరుల పంపిణీలో సమతౌల్యాన్ని సాధించడానికి పన్నుల పంపిణీని ఒక ముఖ్యసాధనగా ఉపయోగించడం జరుగుతుంది.

6. భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కావలసిన విత్త వనరుల కోసం ఎక్కువగా కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడుతున్నట్లు తెలుస్తుంది.

## 14.7. కఠిన పదాలు:

1. ఫెడరల్ విత్త విధానం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య విత్త వనరుల కేటాయింపుకు సంబంధించి అనుసరించవలసిన విధానాన్నే ఫెడరల్ విత్త విధానమందురు.

2. విత్త వనరుల వ్యాకోచం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కేటాయించిన వనరులను మారుతున్న బాధ్యతలు, అవసరాలకు అనుగుణంగా పెంచుకోగలిగినా దానిని విత్త వనరుల వ్యాకోచం అని అంటారు.

3. పన్నుల రాబడి పంపిణీ : కేంద్ర ప్రభుత్వం తనకు వచ్చిన ఆదాయవనరులలో కొంత భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిణీ చేయడాన్ని పన్నుల రాబడి అని అంటారు.

4. సహాయక గ్రాంటులు : ఒక ప్రత్యేకమైన పనికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మంజూరు చేసే గ్రాంట్లను సహాయక గ్రాంటులు అని అంటారు. ఈ సహాయక గ్రాంటులనే ప్రత్యేక గ్రాంటులు అని కూడా అంటారు.

5. మాచింగ్ గ్రాంటులు : రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉన్నపుడు బడ్జెట్‌లో ఏర్పడిన లోటును పూరించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మంజూరు చేసే గ్రాంటులను మాచింగ్ గ్రాంటులంటారు.

## 14.8. నమూనా ప్రశ్నలు :

వ్యాసరూప ప్రశ్నలు.

1. ఫెడరల్ విత్త విధాన సూత్రాలను వివరించి, ఇందు ఏర్పడే సమస్యలను తెలుపుము?
2. ఫెడరల్ విత్త విధానంలో ఏర్పడే సమస్యలను తొలగించి సంతులితం చేసే సాధనాలను పేర్కొనుము?

సంక్షిప్త ప్రశ్నలు.

1. ఫెడరల్ విత్త సూత్రాలు తెలుపుము?
2. ఫెడరల్ విత్త విధాన సమస్యలను వివరించుము?
3. ఫెడరల్ విత్త విధానంలో సంతులితం చేసే సాధనాలను తెలుపుము?
4. అనుబంధ పన్నుల గూర్చి తెలుపుము?
5. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మంజూరు చేసే గ్రాంటులను గూర్చి వ్రాయుము?
6. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త వనరులను సంతులితం చేసే సాధనాలను గూర్చి వ్రాయుము?

## 14.9. చదువదగిన గ్రంథాలు :


1. The Theory of Public Finance - R.A.Musgrave
2. Public Finance - R.K.Lekhi
3. Public Finance - B.P.Tyagi
4. The principles and Problems of Fedaral Finance - B.P.Adarkar
5. పబ్లిక్ అర్థశాస్త్రం - తెలుగు అకాడమి.


- డా॥ డి. కైలాసరావు

పాఠం : 15

# కేంద్ర,రాష్ట్ర విత్త సంబంధాలు

## 15.0.లక్ష్యం:

ఈ పాఠ్యాంశంలో ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త సంబంధాలు, సమస్యలు, ఫైనాన్స్ కమీషన్‌ల సిఫార్సులు పరిశీలించడమైంది. ఈ భాగం పూర్తయ్యేసరికి విద్యార్థులు ఈ క్రింది అంశాలను గురించి అవగాహన చేసుకుంటారు.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల పంపిణీ.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త వనరుల విషయంలో సమస్యలు.
- ఫైనాన్స్ కమీషన్‌ల పాత్ర.
- ఫైనాన్స్ కమీషన్‌ల సిఫార్సులు.

## విషయసూచిక


15.1. పరిచయము
15.2. విత్త వనరుల పంపిణీ.
15.3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త సంబంధాలు - సమస్యలు.
15.4. ఫైనాన్స్ కమీషన్.
15.5. పదకొండవ ఆర్థిక సంఘం సిఫార్సులు.
15.6. పన్నెండో ఫైనాన్స్ కమీషన్.
15.7. సారాంశం.
15.8. గుర్తుంచుకోవలసిన విషయాలు.
15.9. కఠిన పదాలు.
15.10. నమూనా ప్రశ్నలు.
15.11. చదువదగిన గ్రంథాలు.


## 15.1. పరిచయము:

భారతదేశం ఒక సమాఖ్యరాజ్యం. స్వాతంత్ర్యానికి ముందు 1935వ సంవత్సరంలో భారతప్రభుత్వ చట్ట ప్రకారం మన దేశంలో ఫెడరల్ వ్యవస్థను ప్రవేశ పెట్టడమైనది. తరువాత ఈ చట్టాన్ని ఆధారంగా చేసుకొని భారతరాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. మనదేశంలో పటిష్టమైన కేంద్ర ప్రభుత్వాన్ని, అధికారాలతో కూడిన రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడినాయి. భారతరాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ విధులకు సంబంధించి కేంద్రజాబితా, రాష్ట్రజాబితా మరియు ఉమ్మడిజాబితా అను మూడు జాబితాలను ఏర్పరచడమైనది. కేంద్రజాబితాలో కేంద్రప్రభుత్వ విధులు, అధికారాలు స్పష్టంగా తెలుపబడినాయి. రాష్ట్రజాబితాలో రాష్ట్రప్రభుత్వ విధులు, అధికారాలు వివరించబడ్డాయి. ఉమ్మడి జాబితాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికి సంబంధించిన అధికారాలు తెలుపబడినాయి. మనదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల పంపిణీకి సంబంధించిన అంశాలను రాజ్యాంగంలో నిర్దిష్టంగా నిర్ణయించటం జరిగింది.

## 15.2. విత్తవనరుల పంపిణీ:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పన్నుల రాబడి పంపిణీ ఈ క్రింది విధంగా జరుగుతున్నది.

1. కేంద్ర ప్రభుత్వం కొన్ని పన్నులను విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని తానే పొందును.

2. కొన్ని పన్నులను రాష్ట్ర ప్రభుత్వాలు విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే ఖర్చు చేయును.

3. కేంద్ర ప్రభుత్వం కొన్ని పన్నులను విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని రాష్ట్రాలకు అందజేయును.

4. కేంద్ర ప్రభుత్వం కొన్ని పన్నులను విధించగా, వాటిని రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసుకొని ఆ ఆదాయాన్ని తామే పొందును.

5. కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకొనును.

1. కేంద్ర ప్రభుత్వ ఆదాయవనరులు:

కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసుకొని ఆ ఆదాయాన్ని తానే పొందును. ఈ పన్నులు ఏమనగా-

1. వ్యవసాయేతర ఆదాయపు పన్ను.
2. కస్టమ్స్ సుంకాలు.
3. మత్తు పానీయాలు, నల్లమందు మొదలైన మత్తుపదార్థాలు మినహా దేశంలో ఉత్పత్తి అయ్యే పొగాకు మొదలగు ఇతర వస్తువులపై విధించే ఎక్సైజ్ సుంకాలు.
4. కార్పోరేట్ పన్నులు.
5. వ్యవసాయ భూమి మినహాయించి ఇతర మూలధనపు ఆదాయపన్ను.
6. వ్యవసాయ భూమి మినహాయించి ఎస్టేట్ డ్యూటీ.
7. వారసత్వ పన్ను.
8. రైల్వేలు, విమానాలు, సముద్రంపై ప్రయాణించే ప్రయాణికులు, సరుకులపై పన్ను.
9. స్టాక్ ఎక్ఛేంజి వ్యవహారాలపై పన్ను (స్టాంప్ డ్యూటీ మినహా).
10. హుండీలు, ప్రామిసరీ నోటులు, ఇన్సూరెన్స్ పాలసీలు, రవాణా బిల్లులు, షేర్‌లు మొదలగు వాటిపై పన్నులు.
11. వార్తా పత్రికల అమ్మకాలు, కొనుగోలు, వాటిలోని ప్రకటనలపై పన్నులు.
12. వివిధ రాష్ట్రాల మధ్య వ్యాపారంలోనికి ప్రవేశించే వస్తువుల అమ్మకాలు, కొనుగోలు పైన పన్నులు.

కేంద్ర ప్రభుత్వం పైన చెప్పబడిన పన్నుల ద్వారానే కాకుండా కొన్ని ఇతర మార్గాల ద్వారా కూడా ఆదాయాన్ని సమకూర్చుకొంటున్నవి. కేంద్ర ప్రభుత్వ ఇతర ఆదాయ మార్గాలు - 1. రైల్వేలు, 2. తంతి మరియు తపాలా, 3. విమానాలు, 4. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ద్వారా వచ్చే లాభాలు, 5. కేంద్రం వసూలు చేసే ఫీజులు, 6. కేంద్ర ప్రభుత్వం చేసే స్వదేశీ మరియు విదేశీ రుణాలు, 7. రిజర్వు బ్యాంకు లాభాలు, 8. కరెన్సీ, నాణాలు, విదేశీమారకము, 9. లాటరీలు మొదలైనవి.

2. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయవనరులు : రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పన్నులను విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని తామే పొందును. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ క్రింది పన్నుల ద్వారా ఆదాయాన్ని పొందును.

1. భూమిశిస్తు.
2. అమ్మకపు పన్ను.
3. వ్యవసాయ ఆదాయంపై పన్ను.
4. వ్యవసాయ భూమి వారసత్వంపై పన్ను.

5. వ్యవసాయ భూమిపై ఎస్టేట్ డ్యూటీ.

6. భూములు, భవనాలపై పన్నులు.

7. గనుల హక్కులపై పన్ను.

8. రాష్ట్రంలోనికి వినియోగం లేదా అమ్మకము నిమిత్తం ప్రవేశించే వస్తువులపై పన్ను.

9. మోటారు వాహనాలపై పన్ను.

10. రిజిస్ట్రేషన్ ఫీజు.

11. వినోదపు పన్ను.

12. రోడ్లపైన, నదీ ప్రవాహాలపైన ప్రయాణించే ప్రయాణికులు, వస్తువులపైన పన్ను మొదలగునవి.

రాష్ట్ర ప్రభుత్వాలు పై విధించిన పన్నుల ద్వారానే కాకుండా నీటిపారుదల, పరిపాలనా నిర్వహణ, రాష్ట్ర ప్రభుత్వరంగ పరిశ్రమల లాభాలు, వైద్య సౌకర్యాలు మొదలైన వాటి ద్వారా కూడా ఆదాయాన్ని పొందును.

**3. కేంద్రము విధించి, వసూలు చేసి ఆదాయాన్ని రాష్ట్రాలకు ఇచ్చే పన్నులు :** కొన్ని పన్నులను కేంద్రం విధించి, వసూలు చేసి తద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాలకు అందజేయును. ఇటువంటి పన్నులలో ముఖ్యమైనవి.

1. వ్యవసాయ భూమి మినహా ఇతర ఆస్తుల వారసత్వంపై విధించిన పన్ను.

2. వ్యవసాయేతర ఆస్తిపై విధించే ఎస్టేట్ డ్యూటీ.

3. విమానాలు, ఓడలు, రైల్వేలలో ప్రయాణించే ప్రయాణికులు, వస్తువుల రవాణాపై పన్ను.

4. రైల్వే ఛార్జీపై పన్ను.

5. స్టాంప్‌డ్యూటీ మినహా స్టాక్ ఎక్స్ఛేంజ్ వ్యవహారాలపై విధించిన పన్ను.

6. వార్తాపత్రికలలో ప్రకటనలపై పన్ను. మొదలైనవి.

**4. కేంద్రం విధించగా, రాష్ట్రాలు వసూలు చేసుకొనే పన్నులు :** కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించగా, వాటిని రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసుకొని ఆ ఆదాయాన్ని తామే పొందును. మందులు, టాయిలెట్ సామాగ్రిపై విధించే ఎక్సైజ్ సుంకాలు మొదలైన వాటిని కేంద్ర ప్రభుత్వం విధించును. కాని ఈ పన్నులను రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసుకొని తద్వారా వచ్చే ఆదాయాన్ని తామే పొందును.

**5. కేంద్రం విధించి, వసూలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకొనే పన్నులు :** కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించును. ఈ పన్నులను కేంద్ర ప్రభుత్వమే వసూలు చేయును. ఈ పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆర్థికసంఘం సిఫార్సులను అనుసరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగును. ఉదాహరణకు : వ్యవసాయేతర ఆదాయంపై విధించే ఆదాయపు పన్ను, కేంద్ర ఎక్సైజ్ సుంకాలు మొదలైన వాటిని కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకొనును.

**6. ఋణాలు :** మనదేశంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైనప్పుడు రుణాల ద్వారా ద్రవ్యాన్ని సేకరించవచ్చును. రాష్ట్ర ప్రభుత్వాలు మనదేశంలో కేంద్ర ప్రభుత్వం నుండి కానీ దేశ ప్రజల నుండి కానీ రుణాలను సేకరించవచ్చు. సాధారణంగా రాష్ట్రాలు విదేశీ రుణాలను సేకరించడానికి అవకాశం లేదు. విదేశీ రుణాలను కేంద్ర ప్రభుత్వం మాత్రమే సేకరించే అవకాశం ఉన్నది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వానికి రుణపడి ఉన్నా అదనంగా

రాష్ట్రాలు రుణసేకరణకు పూనుకున్నచో ముందుగా కేంద్ర ప్రభుత్వం యొక్క అనుమతిని రాష్ట్రాలు పొందాలి. మొత్తంమీద రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పడే రుణ పరిమాణం క్రమంగా పెరుగుతున్నది. ఈ రుణాలలో కొన్ని వడ్డీ లేని రుణాలు, మరికొన్ని స్వల్పవడ్డీ కల రుణాలు ఉన్నాయి.

**7. గ్రాంట్లు :** మనదేశంలో ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చే పన్నులు కేంద్ర ప్రభుత్వ జాబితాలో ఉండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు విత్త వనరులకై కేంద్ర ప్రభుత్వంపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు అనేక విధులను నిర్వహిస్తున్నాయి. ఈ విధులను సక్రమంగా నిర్వహించడానికి రాష్ట్రాలకు తగినంత ద్రవ్య వనరులు ఉండాలి. కానీ రాష్ట్రాలకు అవసరమైన ద్రవ్య వనరులు లేనందున కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంటులను మంజూరు చేస్తున్నది. ఈ గ్రాంటులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

(ఎ) ప్రణాళికా సంబంధమైన గ్రాంట్లు.

(బి) శాసనాత్మక గ్రాంట్లు లేదా ఇతర గ్రాంట్లు.

ప్రణాళికలకు సంబంధించిన గ్రాంట్లను ప్రణాళికా సంఘం నిర్ణయిస్తుంది. ప్రణాళికాబద్ధం కాని గ్రాంట్లు బదిలీ ఫైనాన్స్ కమీషన్ ద్వారా జరుగును. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మంజూరు చేసే గ్రాంట్లు నిబంధనలతో కూడినవిగా ఉండవచ్చు లేదా నిబంధనలు లేనివిగా ఉండవచ్చు. గ్రాంటులను మంజూరు చేసేటప్పుడు రాష్ట్రాల వాస్తవిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవడం మంచిది. గ్రాంటుల వలన రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ లోటును కొంతవరకు భర్తీ చేసుకోగలుగుతున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన రాష్ట్రాలకు అధిక మొత్తంలో గ్రాంటులను ఇవ్వడం వల్ల రాష్ట్రాల మధ్య సంతులిత ఆర్థికాభివృద్ధిని సాధించడానికి అవకాశం కలుగుతుంది.

## 15.3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త సంబంధాలు - సమస్యలు

భారత రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల పంపిణీకి సంబంధించి కొన్ని నిర్దిష్టమైన సూత్రాలను ప్రతిపాదించడమైనది. అంతేకాకుండా ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులకు అనుగుణంగా విత్త వనరుల పంపిణీ జరుగును. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల విషయంలో సరియైన అవగాహన, సహకారం, సత్సంబంధాలు ఉన్నప్పుడే ఫెడరల్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. ఫైనాన్స్ కమీషన్ సిఫార్సు చేసే చట్టబద్ధమైన గ్రాంటులనే కాక కేంద్ర ప్రభుత్వం ఇతర గ్రాంటులను కూడా రాష్ట్రాలకు అందజేయును. అంతేకాక కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు దీర్ఘకాలిక మరియు మధ్యకాలిక రుణాలను అందజేయును. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త వనరుల సంబంధాలను గురించి ఈ క్రింది సమస్యలు ఏర్పడుతున్నవని అభిప్రాయం కలదు.

**1. రాష్ట్ర పన్నులు అవ్యాకోచమైనవి :** మనదేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే బాధ్యతలు చాలా ఎక్కువగా ఉన్నాయి. మనదేశంలో పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించినప్పటినుండి రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు పెరుగుతూ ఉన్నాయి. కాని రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించిన పన్నులు అవ్యాకోచమైనవి. ఉదాహరణకు: రాష్ట్ర ప్రభుత్వాలకు విధించే భూమిశిస్తు అవ్యాకోచమైనది. కేంద్ర ప్రభుత్వానికి కేటాయించిన విత్త వనరులు విస్తృతప్రాతిపదిక కల్గి ఉండి ఎక్కువ వ్యాకోచత్వాన్ని కల్గి ఉన్నవి. కానీ రాష్ట్రాల బాధ్యతలు ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిని కేటాయించిన పన్నుల ద్వారా రాబడి తక్కువగా ఉన్నది. రాష్ట్రాలకు కేటాయించిన పన్నులు అవ్యాకోచ స్వభావాన్ని కల్గి ఉన్నాయి.

**2. కేంద్రంపై రాష్ట్రాలు ఎక్కువగా ఆధారపడుట :** మనదేశంలో రాష్ట్ర ప్రభుత్వం పొందే విత్త వనరులు ఆ ప్రభుత్వం నిర్వహించే విధులకు సరిపోయే విధంగా ఉండటం లేదు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు, రుణాలపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తున్నది. ఇందువలన కొన్ని చెడు ఫలితాలు ఏర్పడుటకు అవకాశం ఉన్నది.

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి దెబ్బతినే ప్రమాదం ఉంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారాహితంగా ప్రవర్తించే అవకాశం ఉంటుంది. రాష్ట్రాలకు ఎక్కువ ద్రవ్య వనరులను సమకూర్చుకొనేందుకు తగిన ప్రోత్సాహం లభించక పోవచ్చు.

**3. పన్ను వసూళ్ళలో కేంద్రం అశ్రద్ధ :** రాష్ట్రాలకు వాటా ఇచ్చే పన్నుల వసూళ్ళలో కేంద్ర ప్రభుత్వం తగు శ్రద్ధ చూపటం లేదు. రాజ్యాంగంలోని 269 నిబంధన ప్రకారం రాష్ట్రాలకు వాటా ఇవ్వవలసిన పన్నులన్నింటిని కేంద్ర ప్రభుత్వం విధించుట లేదు. రాష్ట్రాలకు పంపిణీ అయ్యే ఎక్సైజ్ సుంకం మొదలగు వాటిని పెంచుటకు కేంద్ర ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపటం లేదు. అంతేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నుల మధ్య సమన్వయం ఉండుట లేదు.

**4. వివిధ రాష్ట్రాల మధ్య అసమానతలు :** దేశంలోకల వివిధ రాష్ట్రాలు ఒకే విధంగా అభివృద్ధిని సాధించలేదు. రాష్ట్రాల మధ్య ఆర్థిక అసమానతలు ఎక్కువుగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలు పారిశ్రామికంగా వెనుకబడి ఉన్నాయి. ఈ రాష్ట్రాలకు కేంద్ర వనరులను కేటాయించడంలో ప్రాధాన్యతను ఇవ్వటం లేదు. రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయి.

**5. రాష్ట్ర ప్రభుత్వాల విత్త వనరుల సమీకరణ సక్రమంగా జరుగుట లేదు :** రాష్ట్ర ప్రభుత్వాలు విత్త వనరులను సమీకరించుటలో తగినంత శ్రద్ధ చూపటం లేదు. ఎక్కువుగా రాష్ట్ర ప్రభుత్వాలు విత్త వనరుల కోసం ఓవర్ డ్రాఫ్ట్లపై ఆధారపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికా సంఘం సూచించిన నూతన పన్నులను విధించుట లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వు బ్యాంకు నుండి ఓవర్ డ్రాఫ్ట్లను తీసుకొనుట వలన ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. దీనివలన రాష్ట్రాలలో విత్త క్రమశిక్షణ (Financial Discipline) ఉండుట లేదు.

**6. వనరుల బదిలీ విషయంలో చట్టబద్ధత లేదు:** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కొన్ని గ్రాంట్లను మరియు కొన్ని రుణాలను ఇస్తుంది. ప్రణాళికా సంఘం యొక్క సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంట్లను ఇస్తుంది. మనదేశంలో ఫైనాన్స్ కమీషన్ పాత్ర తగ్గిపోతున్నది. ఫైనాన్స్ కమీషన్ నిర్ణయించబడిన కేంద్ర వనరుల బదిలీ చట్టబద్ధమైన బదిలీగా ఉండును. కాని ఫైనాన్స్ కమీషన్ ప్రాధాన్యత క్రమంగా తగ్గిపోతున్నది. దీనివలన వనరుల బదిలీలో సమన్వయం లోపిస్తుంది. అందువల్ల ఫైనాన్స్ కమీషన్కు స్వతంత్ర ప్రతిపత్తి కలిగించి వనరుల బదిలీ ఫైనాన్స్ కమీషన్ ద్వారానే జరగాలి.

**7. కొన్ని వస్తువులపై అమ్మకపు పన్ను :** పంచదార, వస్త్రాలు, పొగాకు మొదలగు వస్తువులపై అమ్మకపు పన్నును విధించే అధికారం రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి 1956వ సంవత్సరంలో ఇచ్చినారు. దీనికి బదులుగా కేంద్ర ప్రభుత్వం ఈ వస్తువులపై ఎక్సైజ్ సుంకాలను విధించి తద్వారా వచ్చే రాబడిని రాష్ట్రాలకు ఇచ్చుటకు అంగీకారం కుదిరినది. కానీ ఈ వస్తువులపై పన్ను రేటు పెంచుటకు కేంద్ర ప్రభుత్వం ఎక్కువుగా ఇష్టపడుట లేదు. దీనివల్ల ఈ వస్తువులపై రాష్ట్ర ప్రభుత్వాలు కోల్పోయిన అమ్మకపు పన్నుకు బదులుగా తగినంత ఆదాయాన్ని ఎక్సైజ్ సుంకము ద్వారా పొందుట లేదు.

**8. ప్రత్యేక వస్తువుగా కేంద్ర ప్రభుత్వ ప్రకటన :** కేంద్ర ప్రభుత్వము పార్లమెంట్లో ఒక చట్టం చేయుట ద్వారా ఏదైనా ఒక వస్తువును ప్రత్యేక ప్రాధాన్యత కల వస్తువుగా ప్రకటించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం అటువంటి వస్తువులపై 4 శాతం కన్నా ఎక్కువ అమ్మకపు పన్నును విధించకూడదు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాల రాబడి తగ్గిపోయి స్వతంత్రతకు భంగం ఏర్పడుతున్నది.

**9. కేంద్రం, రాష్ట్రాలతో సంప్రదించుట లేదు :** కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి తద్వారా వచ్చే రాబడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకొనును. కేంద్ర ప్రభుత్వం కొన్ని సమయాలలో ఇటువంటి పన్నులను తగ్గించవచ్చు లేదా రద్దు చేయవచ్చును. ఇటువంటి చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకొనేటప్పుడు రాష్ట్రాలతో సంప్రదించుట లేదు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వు బ్యాంకు నుండి తీసుకొనే ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం పరిమితం చేస్తున్నది.

10. ద్రవ్యాన్ని ముద్రించే అధికారం కేవలం కేంద్రానికే ఉంది : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో లోటు ఏర్పడినప్పుడు ఆ లోటును పూరించడానికి కేంద్ర ప్రభుత్వం కరెన్సీని ముద్రించవచ్చు. అందువల్ల ద్రవ్యవనరులను సమీకరించడంలో కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అవకాశాలు ఉండును. కానీ ఈ అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వాలకి లేదు. రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీకి సరియైన ప్రాతిపదిక లేదు.

11. కేంద్ర అజమాయిషీ ఎక్కువుగా ఉండుట : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేసే వనరులను పుమారుగా 75 శాతం వనరులు కేంద్ర ప్రభుత్వ విచక్షణపై ఆధారపడి ఉండును. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు వనరులను కేటాయించేటప్పుడు వెనుకబడిన ప్రాంతాలకు తగినంత ప్రాధాన్యాన్ని ఇవ్వటం లేదు. కొన్ని సమయాలలో వనరుల బదిలీలో రాజకీయ ఒత్తిడులు ఎక్కువగుచున్నాయి.

12. సరియైన శ్రద్ధ చూపకపోవుట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త సంబంధాలలో ఏర్పడిన అసమానతలను తొలగించటానికి కేంద్ర ప్రభుత్వం కానీ ప్రణాళికా సంఘం కానీ తగిన శ్రద్ధ చూపటం లేదు. వివిధ అభివృద్ధి ప్రణాళికలను అమలు పరచడంలో రాష్ట్రాల యొక్క బాధ్యతలు విపరీతంగా పెరిగాయి. కాని వీటికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయవనరులు పెరుగుట లేదు. కనుక రాష్ట్ర ప్రభుత్వాలు విత్త వనరుల విషయంలో కేంద్రంపై ఆధారపడవలసి వస్తున్నది. కానీ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలకు అందించే ద్రవ్య సహాయంలో తగిన శ్రద్ధ తీసుకొనుటలేదు.

## 15.4. ఫైనాన్స్ కమీషన్:

భారతదేశం ఒక ఫెడరల్ వ్యవస్థ. మన రాజ్యాంగం ప్రకారం కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి తద్వారా వచ్చిన రాబడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకొనును. ఆదాయపు పన్ను, ఎక్సైజ్ సుంకాలు మొదలగు వాటిని కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి వచ్చిన ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపకం జరుగుతుంది. ఈ విధంగా వచ్చిన రాబడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏ నిష్పత్తిలో పంపకం జరగాలి, రాష్ట్రాలకు ఇచ్చే వాటా వివిధ రాష్ట్రాల మధ్య ఏ విధంగా పంపిణీ జరగాలి అనే విషయంలో కొన్ని సమస్యలు ఏర్పడును. అంతేకాక కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు వివిధ రకాల గ్రాంటులను మంజూరు చేయును. ఈ గ్రాంటుల మంజూరు విషయంలో ఎటువంటి నియమాలను పాటించవలెనో అనే విషయంలో కూడా సమస్య ఏర్పడును. ఇటువంటి సమస్యలను పరిష్కరించటానికి ఒక ఫైనాన్స్ కమీషన్ నియమించుట మంచిది. అందుకే భారత రాజ్యాంగంలోని 280 నిబంధన ప్రకారం భారత రాష్ట్రపతికి 5 సంవత్సరాలకొకసారి లేదా అంతకు ముందుగా కానీ ఫైనాన్స్ కమీషన్‌ను నియమించే అధికారం ఉన్నది. ఈ ఫైనాన్స్ కమీషన్‌లో ఒక అధ్యక్షుడు, 4గురు సభ్యులు ఉందురు.

ఫైనాన్స్ కమీషన్ విధులు : ఆర్థిక సంఘం కొన్ని విధులను నిర్వహించును.

1. కొన్ని పన్నుల ద్వారా వచ్చిన రాబడిని కేంద్ర, రాష్ట్రాల మధ్య ఏ విధంగా పంపిణీ జరగాలి, రాష్ట్రాలకు వచ్చే వాటాను వివిధ రాష్ట్రాల మధ్య ఏ విధంగా పంపిణీ జరగాలి అనే విషయాలకు సంబంధించిన నియమాలను ఫైనాన్స్ కమీషన్ రూపొందించును.

2. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంటులను మంజూరు చేసేటప్పుడు ఎటువంటి నియమాలను పాటించవలెనో ఫైనాన్స్ కమీషన్ సూచించును.

3. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో కొన్ని ఒడంబడికలు చేసుకొనెను. ఈ ఒడంబడికలను కొనసాగించవలెనా లేదా మార్పు చేయవలెనా అనే అంశానికి సంబంధించి ఆర్థిక సంఘం సూచనలు చేయును.

4. రాష్ట్రపతి విత్త సంబంధమైన ఏ విషయాన్ని అయినా పరిశీలించమని కోరిన ఫైనాన్స్ కమీషన్ ఆ అంశాన్ని పరిశీలించును. సాధారణంగా ఫైనాన్స్ కమీషన్ రాష్ట్రపతికి క్రింది అంశాల గురించి సిఫార్స్ చేయును.

(ఎ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ చేయవలసిన పన్నుల రాబడిలో పంపిణీ చేయవలసిన శాతాలను నిర్ణయించుట.

(బి) వివిధ రాష్ట్రాలకు కేటాయించిన భాగంలో ఏఏ రాష్ట్రాలకు ఎంతెంత వాటా చెల్లించవలెనో నిర్ణయించుట.

(సి) కేంద్రం, రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంటులకు సంబంధించిన సూత్రాలను రూపొందించుట.

(డి) రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే ప్రత్యేక గ్రాంటులను నిర్ణయించుట.

(ఇ) కొండ ప్రాంతాల అభివృద్ధికి గాను ఇచ్చే గ్రాంటులను నిర్ణయించుట.

మనదేశంలో ఇంతవరకు 12 ఫైనాన్స్ కమీషన్‌లను నియమించుటమైనది. మొట్టమొదట 1951వ సంవత్సరంలో కె.సి.నియోగి (K.C.Neoghi) ఆధ్వర్యంలో మొదటి ఫైనాన్స్ కమీషన్‌ను నియమించటమైనది. తరువాత 1956లో కె.సంతానం (K.Santhanam) ఆధ్వర్యంలో రెండవ ఫైనాన్స్ కమీషన్‌ను, ఎ.కె.ఛాంద్ (A.K.Chand) ఆధ్వర్యంలో 1960లో మూడవ ఫైనాన్స్ కమీషన్‌ను, 1964లో పి.వి.రాజమన్నార్ (P.V.Rajamannar) అధ్యక్షతన నాల్గవ ఫైనాన్స్ కమీషన్‌ను, మహావీర్ త్యాగి (Mahavir Thyagi) అధ్యక్షతన 1968లో ఐదవ ఫైనాన్స్ కమీషన్‌ను, 1972లో కాసు బ్రహ్మానందరెడ్డి (Kasu Brahmananda Reddy) ఆధ్వర్యంలో ఆరవ ఫైనాన్స్ కమీషన్‌ను, 1977లో జె.యమ్. షెలాత్ (J.M.Shelat) ఆధ్వర్యంలో ఏడవ ఫైనాన్స్ కమీషన్‌ను, 1982లో వై.బి.చవాన్ (Y.B.Chavan) అధ్యక్షతన ఎనిమిదవ ఫైనాన్స్ కమీషన్‌ను, 1987లో సాల్వే (Salve) అధ్యక్షతన తొమ్మిదవ ఫైనాన్స్ కమీషన్‌ను, 1992లో కె.సి.పంత్ (K.C.Panth) అధ్యక్షతన పదవ ఫైనాన్స్ కమీషన్‌ను, 1997లో ఎ.యమ్.ఖుస్రూ (A.M.Khusru) అధ్యక్షతన పదకొండవ ఫైనాన్స్ కమీషన్‌ను, 2002వ సంవత్సరంలో రంగరాజన్ (Ranga Rajan) అధ్యక్షతన పన్నెండవ ఫైనాన్స్ కమీషన్‌ను నియమించుట జరిగింది. వివిధ ఫైనాన్స్ కమీషన్‌లు చేసిన సిఫార్స్‌లను పరిశీలిద్దాం.

**1. ఆదాయపు పన్ను రాబడి పంపిణీ :** భారత రాజ్యాంగంలోని 270 నిబంధన ప్రకారం వ్యవసాయ ఆదాయం పన్ను మినహాయించి ఇతర ఆదాయంపన్ను ద్వారా వచ్చిన రాబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగును. ఆదాయపు పన్నును కేంద్ర ప్రభుత్వం విధించి. వసూలు చేసి వచ్చిన రాబడిని ఫైనాన్స్ కమీషన్‌ల యొక్క సిఫార్స్‌ల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగును.-ఈ విషయాన్ని ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చును.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదాయపన్ను పంపిణీ**

| ఫైనాన్స్ కమీషన్ | రాష్ట్ర ప్రభుత్వాల వాటా(%) | పంపిణీ ప్రాతిపదిక | |
|---|---|---|---|
| | | జనాభా (%) | పన్ను వసూలు (%) |
| మొదటి ఫైనాన్స్ కమీషన్ | 55.0 | 80 | 20 |
| రెండవ ఫైనాన్స్ కమీషన్ | 60.0 | 90 | 10 |
| మూడవ ఫైనాన్స్ కమీషన్ | 66.0 | 80 | 20 |
| నాల్గవ ఫైనాన్స్ కమీషన్ | 75.0 | 80 | 20 |
| ఐదవ ఫైనాన్స్ కమీషన్ | 75.0 | 90 | 10 |
| ఆరవ ఫైనాన్స్ కమీషన్ | 80.0 | 90 | 10 |
| ఏడవ ఫైనాన్స్ కమీషన్ | 85.0 | 90 | 10 |
| ఎనిమిదవ ఫైనాన్స్ కమీషన్ | 85.0 | 90 | 10 |
| తొమ్మిదవ ఫైనాన్స్ కమీషన్ | 85.0 | 90 | 10 |
| పదో ఫైనాన్స్ కమీషన్ | 77.5 | 90 | 10 |

పై పట్టికను బట్టి మనదేశంలో ఆదాయపు పన్ను ద్వారా వచ్చే రాబడిలో రాష్ట్రాల వాటా ఎక్కువగా ఉన్నదని, ఇది స్వల్పంగా, క్రమంగా పెరుగుతున్నదని తెలుస్తున్నది. రాష్ట్రాల వాటాలో ఎక్కువగా జనాభా ప్రాతిపదికగా ద్రవ్య వనరుల పంపిణీ జరుగుతున్నది.

**2. ఎక్సైజ్ సుంకం పంపిణీ :** ఆదాయపు పన్ను విధంగానే కేంద్ర ఎక్సైజు సుంకాల ద్వారా వచ్చే ఆదాయంకూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తప్పనిసరిగా ఆదాయపు పన్ను ద్వారా వచ్చే రాబడి పంపిణీ జరగాలి. కేంద్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా వచ్చే రాబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ మన రాజ్యాంగం పార్లమెంట్ అనుమతికి వొదిలేసింది. క్రింది పట్టిక ద్వారా మనదేశంలో వివిధ ఫైనాన్స్ కమీషన్‌ల సిఫార్సులను అనుసరించి ఎక్సైజ్ సుంకము ద్వారా వచ్చే రాబడి ఏ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరిగింది తెలుసుకోవచ్చు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎక్సైజ్ సుంకాల పంపిణీ.

| | | పంపిణీ ప్రాతిపదిక | |
|---|---|---|---|
| ఫైనాన్స్ కమీషన్ | రాష్ట్ర ప్రభుత్వాల వాటా | జనాభా | వెనుకబడిన ఇతరాంశాలు. |
| మొదటి ఫైనాన్స్ కమీషన్ | 40% | 40% | 60% |
| రెండవ ఫైనాన్స్ కమీషన్ | 25% | 90% | 10% |
| మూడవ ఫైనాన్స్ కమీషన్ | 20% | 100% | --- |
| నాల్గవ ఫైనాన్స్ కమీషన్ | 20% | 80% | 20% |
| ఐదవ ఫైనాన్స్ కమీషన్ | 20% | 80% | 20% |
| ఆరవ ఫైనాన్స్ కమీషన్ | 20% | 75% | 25% |
| ఏడవ ఫైనాన్స్ కమీషన్ | 40% | 75% | 25% |
| ఏనిమిదవ ఫైనాన్స్ కమీషన్ | 45% | 75% | 25% |
| తొమ్మిదవ ఫైనాన్స్ కమీషన్ | 45% | 25% | 75% |
| పదో ఫైనాన్స్ కమీషన్ | 47.5% | 20% | 80% |

కేంద్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా వచ్చే రాబడిలో ఎక్కువ భాగం కేంద్ర ప్రభుత్వం, తక్కువ భాగం రాష్ట్ర ప్రభుత్వాలు పొందుతున్నాయి. రాష్ట్రాల మధ్య ఈ సుంకం ద్వారా వచ్చే రాబడి పంపిణీలో జనాభా ప్రాతిపదికగా మరియు వెనుకబడిన అంశాల ప్రాతిపదికగా పంపిణీ జరుగుతుంది. కానీ పంపిణీ ప్రాతిపదికలో మార్పులు ఎక్కువగా వస్తున్నాయి.

**3. ఎస్టేట్ డ్యూటీ:** మనదేశంలో వ్యవసాయ ఆస్తిని మినహాయించి ఇతర ఆస్తులపై ఎస్టేట్ డ్యూటీని 1953వ సం॥లో విధించటం ప్రారంభించారు. ఎస్టేట్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం విధించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని రాష్ట్రాలకు కేటాయించటం జరుగును. సాధారణంగా ఎస్టేట్ డ్యూటీ ద్వారా వచ్చే ఆదాయంలో 1 శాతాన్ని కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించి మిగిలిన ఆదాయాన్ని రాష్ట్రాలకు కేటాయిస్తారు. తరువాత కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించిన వాటాలో కొంచెంగా మార్పు వచ్చినది. మనదేశంలో నియమించబడిన వివిధ ఫైనాన్స్ కమీషన్‌లు ఎస్టేట్ డ్యూటీ ద్వారా వచ్చే ఆదాయంలో కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించిన వాటాను స్వల్పంగా మార్పు చేస్తూ ఉన్నాయి.

**4. అదనపు ఎక్సైజు సుంకాల రాబడి, పంపిణీ:** రాష్ట్ర ప్రభుత్వాలు మిల్లు వస్త్రాలు, పొగాకు, పంచదార వస్తువులపై విధిస్తున్న అమ్మకపు పన్నుకు ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం మనదేశంలో అదనపు ఎక్సైజు సుంకాలను 1957వ సంవత్సరం నుండి విధిస్తున్నది. ఈ సుంకాల ద్వారా వచ్చే రాబడిని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడం జరుగుతుంది. అమ్మకపు పన్నుకు ప్రత్యామ్నాయంగా ఈ అదనపు ఎక్సైజు సుంకాలను విధించడం వలన వచ్చే రాబడిలో అన్ని రాష్ట్రాలలోనూ ఈ

వస్తువుల వినియోగం ప్రాతిపదికపైన రాష్ట్రాల వాటాను నిర్ణయించటం జరుగుతుంది. కానీ వివిధ రాష్ట్రాలలో వినియోగానికి సంబంధించిన సమాచారం అంతగా అందుబాటులో ఉండటం లేదు. అందువలనే రాష్ట్రాల జాతీయోత్పత్తిని బట్టి ఆయా రాష్ట్రాల వాటా నిర్ణయించాలని ఇటీవల కాలంలో ఫైనాన్స్ కమీషన్ సూచించినది.

5. గ్రాంటులు : దేశంలో కల వివిధ రాష్ట్రాలు అనేకమైన ముఖ్య విధులను నిర్వహించి వివిధ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు చేపట్టడానికి తమ ఆదాయ వనరులు సరిపోవటం లేదు. రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో ఏర్పడిన లోటును పూరించడానికి పన్నుల రాబడి పంపిణీ, కేంద్ర గ్రాంట్ల మంజూరు మొదలగు వాటి ద్వారా జరుగుతున్నది. 1951 వ సంవత్సరం నుండి మనదేశంలో కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు బదిలీ అయ్యే వనరులలో గ్రాంట్లు అతి ముఖ్యమైనవి. వివిధ రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి పరుచుట గ్రాంటుల మంజూరు ముఖ్య ఉద్దేశ్యం. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ విధంగా మంజూరు చేసే గ్రాంటులను రెండు విధాలుగా విభజించవచ్చు.

1. నిబంధనలతోకూడిన గ్రాంటులు (Conditional Grants).

2. నిబంధనలు లేని గ్రాంటులు (Unconditional Grants).

భారత రాజ్యాంగం లోని 275వ నిబంధన ప్రకారం ఫైనాన్స్ కమీషన్‌లు ప్రతి పంచవర్ష ప్రణాళికా కాలానికి గ్రాంట్లు నిర్ణయించును. అమెరికా, కెనడా మొదలైన దేశాలలో నిబంధనలతో కూడిన గ్రాంట్లు ఎక్కువుగా ఉన్నాయి. ఈ గ్రాంటుల వలన రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోయే ప్రమాదం ఉన్నదని కొందరి అభిప్రాయం. కానీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంట్లను ఇచ్చేటప్పుడు కొన్ని నిబంధనలను విధించడం వల్ల వనరుల ఉపయోగం సక్రమంగా జరుగుతున్నదని మరికొందరి అభిప్రాయం. ఏమైనప్పటికీ కేంద్రం నుండి రాష్ట్రాలకు గ్రాంట్లను మంజూరు చేసేటప్పుడు సరియైన ప్రాతిపదికను నిర్ణయించాలి.

మనదేశంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఫైనాన్స్ కమీషన్‌ల యొక్క సిఫార్స్‌లను అనుసరించి వివిధ గ్రాంట్లను ఎంతెంత మంజూరు చేయుటం జరిగింది. ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

కేంద్రం నుండి రాష్ట్రాలకు మంజూరయ్యే గ్రాంట్లు.

| ఫైనాన్స్ కమీషన్ | నిబంధనలతో కూడిన గ్రాంట్లు | నిబంధనలు లేని గ్రాంట్లు |
|---|---|---|
| కోట్ల రూపాయలలో | కోట్ల రూపాయలలో | |
| మొదటి ఫైనాన్స్ కమీషన్ | 20 | 9 |
| రెండో ఫైనాన్స్ కమీషన్ | 198 | --- |
| మూడో ఫైనాన్స్ కమీషన్ | 210 | 3 |
| నాల్గవ ఫైనాన్స్ కమీషన్ | 609 | --- |
| ఐదవ ఫైనాన్స్ కమీషన్ | 658 | --- |
| ఆరవ ఫైనాన్స్ కమీషన్ | 2510 | --- |
| ఏడవ ఫైనాన్స్ కమీషన్ | 1173 | --- |
| ఎనిమిదో ఫైనాన్స్ కమీషన్ | 2200 | --- |
| తొమ్మిదో ఫైనాన్స్ కమీషన్ | 15017 | 3137 |
| పదో ఫైనాన్స్ కమీషన్ | 1217 | 7500 |

మనదేశంలో ఎక్కువుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిబంధనలతో కూడిన గ్రాంటులనే మంజూరు చేస్తున్నది. కానీ ఇటీవల నిబంధనలు లేని గ్రాంటులను ఫైనాన్స్ కమీషన్‌ల సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మంజూరు చేస్తున్నది. ఫైనాన్స్ కమీషన్ సిఫార్స్ చేసే గ్రాంటులు చట్టబద్ధమైన గ్రాంటులు. ఈ గ్రాంటులనే కాక ప్రణాళికా సంఘం రాష్ట్రాలకు ప్రణాళికలకు సంబంధించిన గ్రాంటులను కూడా సిఫార్స్ చేయును. కానీ ఈ గ్రాంటులకు చట్టబద్ధత లేదు. మొత్తంమీద గ్రాంటులకోసం రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం పై ఆధారపడుటవలన రాష్ట్ర ప్రభుత్వాల స్వయం ప్రతిపత్తికి భంగం ఏర్పడే ప్రమాదం ఉంది.

6. రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ రుణాలు: మనదేశంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చే ద్రవ్య పరిమాణం క్రమంగా పెరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం నుండి రుణాలను పొందుతున్నాయి. కేంద్రం నుండి రాష్ట్రాలు పొందే రుణాలలో కొన్ని వడ్డీలేని రుణాలు, మరికొన్ని స్వల్పకాల వడ్డీగల రుణాలు ఉన్నాయి. సాధారణంగా కేంద్రం రాష్ట్రాలకు మంజూరు చేసే రుణాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. దీర్ఘకాలిక రుణాలు.

2. మధ్యకాలిక రుణాలు.

నాలుగో ఫైనాన్స్ కమీషన్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రుణ విషయాలను పరిశీలించడానికి ఒక సంస్థను నియమించాలి. ఐదవ ఫైనాన్స్ కమీషన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు లోటు ద్రవ్య విధానాన్ని అవలంభించక కోశ ద్రవ్య విధానాన్ని అవలంభించాలని సూచించడమైనది. ఈ ఫైనాన్స్ కమీషన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల నుండి పొందే ఓవర్ డ్రాఫ్ట్‌లను మానుకోవాలి. ఏడవ ఫైనాన్స్ కమీషన్ ప్రకారం 1979 - 84 కాలంలో కేంద్రానికి తిరిగి చెల్లించవలసిన రుణ పరిమాణంలో 2,156 కోట్ల రూపాయలు రాష్ట్రాలకు మినహాయింపు ఇవ్వాలని సూచించడమైనది. మనదేశంలో 1995 మార్చి నాటికి రాష్ట్రాలు పొందే మొత్తం రుణ పరిమాణం 2,09,159 కోట్ల రూపాయిలు. ఈ మొత్తం రుణాలలో 62 శాతం కేంద్ర ప్రభుత్వం నుండి పొందే రుణము. ఈ రుణ భారాన్ని మాఫీ చేయవలెనని రాష్ట్రాలు కోరుతున్నప్పటికీ కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొని కొంత రుణ పరిమాణాన్ని మాత్రమే మాఫీ చేయడమైనది. 1995 - 2000 సంవత్సరాలలో రాష్ట్రాల మొత్తం రుణంలో 700ల కోట్ల రూపాయిలను పదవ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమీషన్) ఋణఉపసమనమునకు సిఫార్స్ చేసినది.

## 5.5. పదకొండవ ఆర్థిక సంఘం సిఫార్సులు:

భారత రాజ్యాంగంలోని 280వ నిబంధన ప్రకారం భారత రాష్ట్రపతి 1997వ సంవత్సరంలో మాంటెక్ అహ్లువాలియా ఆధ్యక్షతన పదకొండవ ఆర్థిక సంఘాన్ని నియమించటం జరిగింది. ఈ ఆర్థిక సంఘం సిఫార్సులు 2000 - 2005 సంవత్సరాలకు వర్తిస్తాయి. పదకొండవ ఆర్థిక సంఘం చేసే కొన్ని ముఖ్య సిఫార్సులను పరిశీలించెదము.

1. పన్నుల రాబడి పంపిణీ : పదకొండవ ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులనుబట్టి కేంద్ర పన్నుల రాబడిలో 28 శాతం రాష్ట్ర ప్రభుత్వాల వాటాగా సూచించడమైనది. తరువాత ఈ వాటాను 29.5 శాతానికి పెంచాలని సూచించడమైనది. ఈ కమీషన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పన్నుల రాబడిని పంపిణీ చేసేటప్పుడు ముఖ్యంగా సమానత్వం మరియు సామర్థ్యం అనే రెండు సూత్రాలను ప్రాతిపదికగా తీసుకోవాలని సూచించడమైనది.

పదకొండవ ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులను బట్టి అత్యధిక వాటా పొందే రాష్ట్రము ఉత్తరప్రదేశ్. ఈ రాష్ట్రం పొందే వాటా 19.79 శాతం, బీహార్ రాష్ట్రం వాటా 14.59 శాతం, మధ్య ప్రదేశ్ 8.83 శాతం, పశ్చిమ బెంగాల్ 8.12 శాతం పొందడమైనది. 2000 - 2005 కాలానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పన్నుల రాబడిలో రాష్ట్ర ప్రభుత్వాల వాటా 3,76,318 కోట్ల రూపాయలుగా పదకొండవ ఫైనాన్స్ కమీషన్ నిర్ణయించినది.

**2. గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ :** భారత రాజ్యాంగంలోని 275వ నిబంధన ప్రకారం 2000 - 2005 సంవత్సరాలలో రాష్ట్రాలకు ప్రణాళికేతర రెవిన్యూ ఖాతాలోని లోటును భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంట్-ఇన్-ఎయిడ్ మంజూరు చేయాలని సూచించడమైనది. అనేక రాష్ట్రాలు తమ ప్రణాళికేతర రెవిన్యూ ఖాతాలో లోటును ఎదుర్కొంటున్నాయి. అటువంటి రాష్ట్రాలకు సుమారుగా 35,350 కోట్ల రూపాయిలు కేంద్రం గ్రాంటును మంజూరు చేయడమైనది. ఇటువంటి గ్రాంటులను పొందే రాష్ట్రాలలో ఎక్కువగా జమ్ము, కాశ్మీర్ 11,211 కోట్ల రూపాయలను, హిమాచల్ ప్రదేశ్ 4,549 కోట్ల రూపాయిలను, నాగాలాండ్ 3,536 కోట్ల రూపాయిలను, పశ్చిమ బెంగాల్ 3,246 కోట్ల రూపాయిలను, త్రిపురా 2,414 కోట్ల రూపాయిలను పొందడమైనది. ఈ గ్రాంటులు మొదట 15 రాష్ట్రాలకు అందజేయడమైనది. కానీ చివర ఐదు సంవత్సరాలలో అనగా 2004 - 2005 సంవత్సరాలలో కేవలం 9 రాష్ట్రాలు మాత్రమే ఈ గ్రాంటులను పొందటమైనది.

కొన్ని రాష్ట్రాలు ప్రత్యేకమైన సమస్యలను ఎదుర్కొంటున్నప్పుడు ఆ రాష్ట్రాల పురోభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రాంటులను మంజూరు చేయాలి. పదకొండవ ఫైనాన్స్ కమీషన్ ప్రకారం కొన్ని ప్రత్యేక కార్యకలాపాలకు అనగా జిల్లా పరిపాలనా, పోలీస్ వ్యవస్థ నిర్వహణ, అగ్నిమాపక సేవలు, న్యాయ నిర్వహణ, విత్త పరిపాలనా, ప్రాథమిక విద్యా మొదలగు వాటికి గ్రాంటులను మంజూరు చేయాలని సిఫార్సు చేయడమైనది. పదకొండవ ఫైనాన్స్ కమీషన్ పై కార్యకలాపాల కోసం సుమారుగా 4,972 కోట్ల రూపాయిలు మంజూరు చేసినది.

**3. విపత్తు సహాయ నిధి :** ఇదివరలో రాష్ట్రాలలో ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి ఒక ప్రత్యేకమైన నిధిని అనగా ప్రకృతి వైపరీత్యాల జాతీయ నిధి (N.F.C.R)ను ఏర్పాటు చేయడమైనది. పదకొండవ ఫైనాన్స్ కమీషన్ ప్రకారం N.F.C.R కు బదులు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ వైపరీత్యాల కేంద్రాన్ని (N.C.C.M) స్థాపించాలని సిఫార్సు చేయడం అయినది. ప్రకృతి వైపరీత్యాల నిధి నుండి (C.R.F) సాధారణంగా తుఫానులు, దుర్భిక్ష పరిస్థితులు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు మొదలగునవి ఏర్పడినప్పుడు ద్రవ్య సహాయం అందజేయబడును.

**4. స్థానిక సంస్థలు :** మనదేశంలో గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలు అతి ముఖ్యమైన స్థానిక సంస్థలు. ప్రతి రాష్ట్రం ఈ స్థానిక సంస్థల అభివృద్ధికి, వాటి విధుల సక్రమ నిర్వహణకు, తగిన శాసనాలను చేయాలి. స్థానిక సంస్థలు తమ విధులను సక్రమంగా నిర్వహించడానికి తగిన నిధులను కేటాయించాలి. ఈ విషయానికి సంబంధించి మొదటిసారిగా పదకొండవ ఫైనాన్స్ కమీషన్ కొన్ని సూచనలు చేసింది. పదకొండవ ఫైనాన్స్ కమీషన్ ప్రకారం స్థానిక సంస్థలకు గ్రాంటులను మంజూరు చేసేటప్పుడు ఈ క్రింది అంశాలను ప్రాతిపదికగా తీసుకొని మంజూరు చేయాలని ప్రతిపాదించడమైనది.

**(ఎ).** 40 శాతం జనాభా ప్రాతిపదికగా.

**(బి).** 20 శాతం వికేంద్రీకరణ ప్రాతిపదికగా.

**(సి).** 20 శాతం తలసరి ఆదాయం ప్రాతిపదికగా.

**(డి).** 10 శాతం రాబడి సామర్థ్యం ప్రాతిపదికగా.

**(ఇ).** 10 శాతం భౌగోళిక ప్రాతిపదికగా.

పదకొండవ ఫైనాన్స్ కమీషన్ పంచాయితీలకు 1600 కోట్ల రూపాయిలు, మున్సిపాలిటీలకు 400 కోట్ల రూపాయిలు గ్రాంటును 2000 - 2005 సంవత్సరాలకు మంజూరు చేయాలని సిఫార్సు చేసినది.

**5. ఋణ విముక్తి :** మనదేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఋణ భారంతో బాధపడుతున్నాయి. పదకొండవ ఫైనాన్స్ కమీషన్ వారి అంచనా ప్రకారం 2000వ సంవత్సరం మార్చి చివరినాటికి రాష్ట్ర ప్రభుత్వాల ఋణ భారం 4,73,674 కోట్ల రూపాయిలు ఉన్నది. ఈ ఋణ భారంలో సుమారుగా 50 శాతం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఋణాలు ఉన్నాయి. ఈ ఋణ

భారాన్ని తగ్గించడానికి ఫైనాన్స్ కమీషన్‌లు కొన్ని సూచనలు చేశాయి. పదకొండవ ఫైనాన్స్ కమీషన్ ప్రకారం రాష్ట్రాల రుణ భారం తగ్గించుటకు కొరకు సంబంధమైన అభివృద్ధి చర్యలను తీసుకోవాలని సూచించడమైనది.

## 15.6. పన్నెండో ఫైనాన్స్ కమీషన్:

భారత రాష్ట్రపతి రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం 2005 - 2010 కాలానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త వనరుల పంపిణీకై రంగరాజన్ అధ్యక్షతన పన్నెండవ ఫైనాన్స్ కమీషన్‌ను నియమించడమైనది. ఈ కమీషన్ చేసిన సిఫార్సులను కేంద్ర ఆర్థిక మంత్రి 2005 బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంట్‌కు సమర్పించడమైనది. పన్నెండవ ఫైనాన్స్ కమీషన్ చేసిన సిఫార్సులలో కొన్నింటిని పరిశీలిద్దాం.

1. ఈ కమీషన్ ప్రకారం 2005 - 2010 కాలంలో ద్రవ్య సంస్కరణల పథకానికి బదులు రుణ సహాయ పథకాన్ని అమలు చేయాలి.

2. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు మొత్తం బదిలీలు కేంద్ర రాబడి వసూళ్ళలో 38 శాతానికి మించకూడదు.

3. ప్రణాళికేతర రాబడి లోటు విద్యా ఆరోగ్య రంగాలు రోడ్లు మొదలగు వాటి నిర్వహణకు 1,42,639 కోట్ల రూపాయిలు గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ను రాష్ట్రాలకు మంజూరు చేయాలని సిఫార్సు చేసింది.

4. రాజ్యాంగంలోని 275(1) నిబంధన క్రింద ఏటా అంచనా వేసిన లోటు మొత్తానికి సమానంగా గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ను మంజూరు చేయాలి.

5. ప్రతి సంవత్సరం కనీసం 20 కోట్ల రూపాయిల చొప్పున అస్సాం, జార్ఖండ్, మధ్య ప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్ మొదలగు రాష్ట్రాలకు విద్యాభివృద్ధికి గ్రాంటులను మంజూరు చేయాలి. మొత్తం విద్యకు 10,171 కోట్ల రూపాయిలు సహాయం అందచేయాలి.

6. స్థానిక సంస్థల అభివృద్ధికి సుమారుగా 25,000 కోట్ల రూపాయిలు ద్రవ్య సహాయాన్ని అందచేయాలి.

7. ఆరోగ్య అభివృద్ధికి రాష్ట్రాలకు 5,887 కోట్ల రూపాయిల గ్రాంటును అందించాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది.

8. విపత్తు సహాయక నిధి పరిమాణాన్ని 21,333 కోట్ల రూపాయిలుగా నిర్ణయించడమైనది,

9. అడవుల నిర్వహణకు 1000 కోట్ల రూపాయిలు మంజూరు చేయాలని పన్నెండవ ఫైనాన్స్ కమీషన్ సూచించింది.

10. వివిధ రాష్ట్రాల విశిష్ట అవసరాలకు 7,100 కోట్ల రూపాయిలు మంజూరు చేయాలని ఈ కమీషన్ సూచించడమైనది.

## 15.7. సారాంశము:

మనదేశంలో ఇదివరలో కేంద్ర రాబడి వనరుల పంపకం ఎక్కువగా జనాభా ప్రాతిపదికగా జరిగేది. కానీ ఇటీవల కాలంలో రాష్ట్రాల పనితీరు మరియు ఇతర అంశాలు ప్రాతిపదికలు అవుతున్నాయి. ప్రస్తుతం సమానత్వం, సామర్థ్యం మధ్య సమతూకము ఉండాలని ఫైనాన్స్ కమీషన్ అభిప్రాయ పడుతున్నది. మనదేశంలో ఫైనాన్స్ కమీషన్ సిఫార్సుల అమలు అంతగా ఆశాజనకంగా లేదని తెలుస్తుంది. ఫైనాన్స్ కమీషన్ ఒక బలమైన శక్తిగా ఉండి స్వతంత్రంగా తన కార్యకలాపాలను నిర్ణయించి ప్రభుత్వ జోక్యం అంతగా లేనప్పుడే ఫైనాన్స్ కమీషన్ తన విధులను సక్రమంగా నిర్వహించగలదు.

## 15.8. గుర్తుంచుకోవలసిన విషయాలు :

1. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పన్నుల రాబడి పంపిణీ జరుగుతుంది.
2. కేంద్ర ప్రభుత్వం కొన్ని పన్నులను విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని తానే పొందును.
3. కొన్ని పన్నులను రాష్ట్ర ప్రభుత్వాలు విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే ఖర్చు చేయును.
4. కేంద్ర ప్రభుత్వం కొన్ని పన్నులను విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని రాష్ట్రాలకు అందజేయును.
5. కేంద్ర ప్రభుత్వం కొన్ని పన్నులను విధించగా వాటిని రాష్ట్రప్రభుత్వాలు వసూలు చేసుకొని ఆ ఆదాయాన్ని తామే పొందును.
6. కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి ఆ ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి.
7. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అవసరమైనపుడు రుణాలను అందజేయును.
8. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంటులను కూడా మంజూరు చేయును.
9. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త సంబంధాల విషయంలో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి.
10. మనదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్త వనరుల పంపిణీకి సంబంధించి ఎటువంటి నియమాలను పాటించవలెనో అనే విషయాలను సూచించడానికి ఫైనాన్స్ కమీషన్‌ను ప్రతి ఐదు సంవత్సరాలకు లేదా అంతకు ముందుగా రాష్ట్రపతి నియమించును.
11. ఇంతవరకు మనదేశంలో 12 ఫైనాన్స్ కమీషన్‌లను నియమించడమైంది.

## 15.9. కఠిన పదాలు:

1. ప్రణాళికా సంబంధమైన గ్రాంటులు: ప్రణాళికా సంఘం నిర్ణయం ప్రకారం మంజూరు చేసే గ్రాంటులను ప్రణాళికా సంబంధమైన గ్రాంటులు అని అంటారు.

2. ఎస్టేట్ డ్యూటీ: ఒక వ్యక్తి మరణానంతరం ఆ వ్యక్తికి సంబంధించిన స్థిరాస్తి ఒక పరిమితికి మించి ఉన్నపుడు, ఆ ఆస్తి వారసులకు చెందినపుడు ఆ ఆస్తిపై ప్రభుత్వం విధించే పన్నును ఎస్టేట్ డ్యూటీ అని అంటారు.

3. విపత్తు సహాయ నిధి: దేశంలోని ఏదైనా రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు వాటిని ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం ఒక నిధిని ఏర్పాటు చేసింది. ఆ నిధినే విపత్తు సహాయ నిధి అని అంటారు.

## 15.10. నమూనా ప్రశ్నలు :

I. వ్యాసరూప ప్రశ్నలు.

1. కేంద్ర, రాష్ట్రాల మధ్య విత్త వనరుల సంబంధాన్ని గూర్చి వ్రాయుము?

2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త సంబంధాలననుసరించి గల సమస్యలను వివరించి, సంతులితం చేసే సాధనాలను గూర్చి వ్రాయుము?

3. మనదేశంలో ఫైనాన్స్ కమీషన్ యొక్క పాత్రను వివరించి వివిధ ఫైనాన్స్ కమీషన్‌ల సూచనలను గూర్చి వ్రాయుము?

II. సంక్షిప్త ప్రశ్నలు.

1. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పన్నుల రాబడి పంపిణీగూర్చి వ్రాయుము?

2. ఫైనాన్స్ కమీషన్ పాత్రను గూర్చి తెలుపుము?

3. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మంజూరు చేసే గ్రాంటులను గూర్చి వివరింపుము?

4. పదకొండవ ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులను గూర్చి తెలుపుము?

5. పన్నెండో ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులను గూర్చి తెలుపుము?

## 15.11. చదువదగిన గ్రంథాలు:


| | | |
|---|---|---|
| 1. | The Theory of Public Finance | R.A.Musgrave. |
| 2. | Public Finance | R.K.Lekhi. |
| 3. | The Principles and Problems of Federal Finance | B.P.Adarkar. |
| 4. | పబ్లిక్ అర్థశాస్త్రం | తెలుగు అకాడమి. |


- డా॥ డి. కైలాసరావు

పాఠం : 16

# ప్రభుత్వ రంగం

## 16.0. లక్ష్యం:

ఈ పాఠ్యాంశంలో మీరు ముఖ్యంగా ప్రభుత్వరంగ ప్రాముఖ్యత, వ్యవస్థీకరణ పద్ధతులు, ప్రభుత్వరంగ సంస్థల ధర నిర్ణయం, సమస్యలు గురించి పరిశీలించడమైంది. ఈ భాగం పూర్తయ్యేసరికి మీరు ఈ క్రింది అంశాలను గురించి అవగాహన చేసుకుంటారు.

- ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థీకరణ పద్ధతులు.
- ప్రభుత్వరంగ ప్రాముఖ్యత.
- ప్రభుత్వరంగ సంస్థల ధరల విధానం పద్ధతులు.
- ప్రభుత్వరంగ సమస్యలు.
- సరళీకృత ఆర్థిక విధానంలో ప్రభుత్వరంగ పాత్ర.

## విషయసూచిక


16.1 పరిచయం.
16.2. ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థీకరణ పద్ధతులు.
16.3. ప్రభుత్వరంగం - అవశ్యకత లేదా ప్రాముఖ్యం.
16.4. ప్రభుత్వరంగ సంస్థల ధరల విధానం.
16.5. భారతదేశంలో ప్రభుత్వ సంస్థల ధరనిర్ణయ పద్ధతులు.
16.6. ప్రభుత్వరంగ సమస్యలు.
16.7. సరళీకృత ఆర్థిక విధానంలో ప్రభుత్వరంగ పాత్ర.
16.8. సారాంశము
16.9. గుర్తుంచుకోవలసిన విషయాలు.
16.10. కఠిన పదాలు.
16.11. నమూనా ప్రశ్నలు.
16.12. చదువదగిన గ్రంథాలు.


## 16.1. పరిచయము:

ప్రభుత్వమే వివిధ రంగాలలో పెట్టుబడి పెట్టి నిర్వహించే సంస్థలను ప్రభుత్వరంగ సంస్థ అంటారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వరంగం ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తుంది. ప్రణాళికా బద్ధమైన ఆర్థికాభివృద్ధికి, ప్రాంతీయ సమానాభివృద్ధికి, సామ్యవాదరీతి సమాజస్థాపనకు, వనరుల సక్రమ వినియోగానికి ప్రభుత్వరంగం ఎంతో ఉపయోగపడును. దేశ పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వరంగం వెన్నుముక వంటిది. ఆర్థికాభివృద్ధిలో ఉద్యమకారులు, సాంకేతిక నిపుణులు, శాస్త్రజ్ఞులు, వినియోగదారుల వలె ప్రభుత్వరంగం కూడా ప్రాముఖ్యాన్ని వహిస్తుంది.

సాంప్రదాయక ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రభుత్వరంగానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆర్థిక వ్యవస్థ పనితీరులో ప్రభుత్వరంగ జోక్యం ఎక్కువగా ఉండరాదని వీరి అభిప్రాయం. ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వజోక్యం వల్ల వనరులు దుర్వినియోగం జరగడమే కాకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయం ఉన్నది. తరువాత 20వ శతాబ్దంలో ముఖ్యంగా కీన్స్ రాసిన 'సాధారణ సిద్ధాంతం' ప్రచారంలోనికి వచ్చిన తరువాత ప్రభుత్వ కార్యకలాపాల తీరులో అనేక మార్పులు వచ్చాయి. ప్రస్తుత రాజ్యాలు శ్రేయో రాజ్యాలు. శ్రేయోరాజ్య స్థాపనలో ప్రభుత్వరంగ ప్రాధాన్యత

పెరిగినది. ఆర్థికాభివృద్ధికి అవసరమైన శక్తులను ప్రేరేపించడానికి ప్రభుత్వమే కొన్ని పరిశ్రమలను స్థాపించవలసిన అవసరం ఏర్పడింది. కొన్ని నిర్దిష్టమైన ఆర్థిక మరియు సాంఘిక లక్ష్యాలను సాధించుటలో ప్రణాళికల యొక్క ప్రాధాన్యత పెరిగింది. ఇటువంటి ప్రణాళికలను రూపొందించి వాటిని సక్రమంగా అమలుపరిచే విషయంలో ప్రభుత్వరంగ ప్రాధాన్యత పెరిగింది. మనదేశంలో ప్రవేశపెట్టబడిన వివిధ పారిశ్రామిక విధాన తీర్మానాలలో ప్రభుత్వరంగ ప్రాముఖ్యాన్ని పెంచటమైనది.

## 5.2. ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థీకరణ పద్ధతులు:

ప్రభుత్వరంగ సంస్థలు విజయవంతంగాను, లాభదాయకంగానూ పనిచేయడానికి వీటిని సమర్థవంతంగా నిర్వహించాలి. అంతేకాకుండా ప్రభుత్వరంగ సంస్థలు నిజాయితీగా పనిచేస్తున్నాయి అనే నమ్మకాన్ని ప్రజలలో కల్పించాలి. మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు ముఖ్యంగా మూడు పద్ధతులలో నిర్వహించడం జరుగుచున్నది.

1. డిపార్ట్‌మెంటల్ సంస్థలు (Departmental undertakings): డిపార్ట్‌మెంటల్ సంస్థలను ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తాయి. ఈ సంస్థల నిర్వహణకు కావలసిన ద్రవ్య వనరులను ప్రభుత్వమే సమకూర్చును. ఈ సంస్థల ద్వారా వచ్చే రాబడి ప్రత్యక్షంగా ప్రభుత్వానికే చెందును. రైల్వేలు, తంతి-తపాలా మొదలైనవి డిపార్ట్‌మెంటల్ సంస్థలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ పద్ధతిలో ప్రభుత్వ సంస్థల నిర్వహణ బాధ్యత ఆయా మంత్రిత్వశాఖలకు చెందిన మంత్రులపై ఉంటుంది. సాధారణంగా ప్రభుత్వ నియంత్రణ ఎక్కువ అవసరమైన సంస్థలను మాత్రమే డిపార్ట్‌మెంటల్ సంస్థల క్రిందకు వస్తాయి. ఈ ప్రభుత్వరంగ సంస్థలకు పార్లమెంట్‌కు బాధ్యత వహిస్తు ఉంటాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు వర్తించు బడ్జెట్, లెక్కలు, ఆడిట్ నియంత్రణ ఈ సంస్థలకు కూడా వర్తిస్తాయి.

డిపార్ట్‌మెంటల్ సంస్థలు వలన కొన్ని ప్రయోజనాలు ఏర్పడతాయి.

(ఎ) డిపార్ట్‌మెంటల్ సంస్థలకు ద్రవ్యవనరులు కన్‌సాలిడేటెడ్ (Consolidated Fund) నుండి కేటాయించబడతాయి. కనుక ఈ వనరుల వినియోగం గరిష్ట స్థాయిలో జరుగుతుంది.

(బి) డిపార్ట్‌మెంటల్ సంస్థలు పార్లమెంట్‌కు బాధ్యత కల్గి ఉన్నందున ప్రజల పట్ల ఎక్కువ బాధ్యత కల్గి ఉంటాయి.

(సి) డిపార్ట్‌మెంటల్ సంస్థలపై క్రమబద్ధ నియంత్రణ ఉంటుంది కనుక వీటి నియంత్రణ సక్రమంగా ఉంటుంది.

(డి) దేశరక్షణ మొదలైన కార్యకలాపాలను ప్రభుత్వ శాఖలు నిర్వహించుట వలన వీటిని రహస్యంగా ఉంచి పరిరక్షించబడును.

(ఇ) సుస్థిరమైన ప్రభుత్వం, సామర్థత మరియు నిజాయితీ గల ప్రభుత్వ అధికారులు డిపార్ట్‌మెంటల్ సంస్థలు నిర్వహించుట వలన ఈ సంస్థల పనితీరు విజయవంతంగా ఉండును.

డిపార్ట్‌మెంటల్ సంస్థలను నిర్వహించుట వలన పై విధంగా కొన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికి ఈ పద్ధతిలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి.

(ఎ) ప్రభుత్వం లేదా మంత్రులు మారినప్పుడల్లా డిపార్ట్‌మెంటల్ సంస్థల నిర్వహణలో మార్పులు రావచ్చును. దీనివల్ల ఈ సంస్థల నిర్వహణలో అనిశ్చితి ఏర్పడుతుంది.

(బి) అధిక నిబంధనలు, నియమాలు పాటించడం వలన ఈ సంస్థ నిర్వహణలో సామర్థ్యం తగ్గి జాప్యం ఏర్పడవచ్చు.

(సి) పార్లమెంట్ నియంత్రణ ఎక్కువగా ఉండుట వలన క్రియాస్వేచ్ఛను వ్యాపార దక్షతను పరిమితం చేయబడును.

(డి) ఈ సంస్థల నిర్వహణ విధానంలో సరళత లోపిస్తుంది.

(ఇ) పార్లమెంట్‌లో విమర్శలు ఎదుర్కోవలసి వస్తుందనే భయంతో ప్రభుత్వాధికారులు సంస్థల నిర్వహణలో చొరవ తీసుకోరు.

పై విధంగా డిపార్ట్‌మెంటల్ సంస్థలలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ కొన్ని పరిశ్రమల నిర్వహణను తప్పనిసరిగా ఇవే చేపట్టాలి. ఉదాహరణకు దేశరక్షణకు సంబంధించిన పరిశ్రమలను డిపార్ట్‌మెంటల్ సంస్థలే నిర్వహించాలి.

**2. పబ్లిక్ కార్పోరేషన్‌లు (Public Corporations):** ప్రత్యేకమైన చట్టం ద్వారా ప్రభుత్వ యాజమాన్యం క్రింద పబ్లిక్ కార్పోరేషన్‌లు ఏర్పడతాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం డైరక్టర్‌ల బోర్డును నియమిస్తుంది. ఇండియన్ ఎయిర్‌లైన్స్ కార్పోరేషన్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ మొదలగునవి పబ్లిక్ కార్పోరేషన్‌కు ఉదాహరణలు. ఈ కార్పోరేషన్‌లు తమ పేరుతో ఆస్తులు కొనుగోలు చేయవచ్చు లేదా విక్రయించవచ్చు. ప్రభుత్వ అనుమతితో కార్పోరేషన్‌లు ఋణాలను చేయవచ్చు. ఈ కార్పోరేషన్‌లు సంబంధిత మంత్రుల నియంత్రణకు లోబడి ఉంటాయి.

పబ్లిక్ కార్పోరేషన్‌ల నిర్వహణ విధానంలో కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి.

(ఎ) కార్పోరేషన్‌ల నిర్వహణలో అనవసర ప్రభుత్వ జోక్యం ఉండదు. దీనివలన ఈ సంస్థలు నిజమైన వ్యాపార సంస్థలుగా పనిచేసే అవకాశం ఉంటుంది.

(బి) పబ్లిక్ కార్పోరేషన్‌ల ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక వ్యవహారాలలో నైపుణ్యం గల సిబ్బందిని నియమించుటకు వీలుండటం వలన సంస్థల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుంది.

(సి) ఈ కార్పోరేషన్‌ల పని తీరులో రాజకీయపరమైన ఒత్తిడులు ఉండవు.

(డి) పబ్లిక్ కార్పోరేషన్‌ల కార్యకలాపాల నిర్వహణ స్వతంత్రంగా జరుగును.

(ఇ) ప్రభుత్వ విధానాలతో వచ్చిన మార్పులు ఈ కార్పోరేషన్‌ల పనితీరుపై ప్రభావం చేయవు.

పబ్లిక్ కార్పోరేషన్‌ల నిర్వహణలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి.

(ఎ) ప్రభుత్వ శాఖల నిర్వహణలో ఉండే అలసత్వము మరియు కాలవిలంబనము పబ్లిక్ కార్పోరేషన్‌లలో కూడా ఉండును.

(బి) ఈ కార్పోరేషన్‌లు వ్యాపార సంస్థలనే విషయాన్ని మరచిపోయి ఇతర ప్రభుత్వ శాఖలవలె ప్రవర్తించవచ్చు.

(సి) పబ్లిక్ కార్పోరేషన్ సిద్ధాంతంలో వ్యక్తిగత శ్రద్ధ లోపించును.

(డి) వివిధ నిర్ణయాలను తీసుకోవడంలో జాప్యం ఎక్కువగా ఉండవచ్చు.

(ఇ) ఈ కార్పోరేషన్‌ల లాభాలు ప్రభుత్వ ఆదాయంలో కలిసిపోవడంవల్ల వీటి అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడవచ్చు.

పై విధంగా పబ్లిక్ కార్పోరేషన్‌ల నిర్వహణలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ డిపార్ట్‌మెంటల్ సంస్థల కంటే పబ్లిక్ కార్పోరేషన్‌ల నిర్వహణ మెరుగయినదిగా భావించడం జరుగుతుంది.

**3. ప్రభుత్వ కంపెనీలు (Government Companies):** ప్రభుత్వ కంపెనీలలో ప్రభుత్వం ఏకైక వాటాదారుగా కానీ లేదా ఆధిక్యత కల వాటాదారులుగా కానీ ఉండవచ్చు. కంపెనీల చట్టం ప్రకారం ప్రభుత్వ సంస్థలు జాయింట్ స్టాక్ కంపెనీలను స్థాపించవచ్చు. ఈ విధానంలో సంస్థలను నెలకొల్పటం చాలా సులభం. ఇందుకు ప్రత్యేకమైన చట్టాలు అవసరం లేదు. ఈ కంపెనీల నిర్వహణకు బోర్డు ఆఫ్ డైరక్టర్స్ ఉండును. మనదేశంలో ఎక్కువగా ప్రభుత్వ రంగ సంస్థలు కంపెనీల రూపంలో ఏర్పాటు అయినాయి. మూలధనంలో 51 శాతానికి తగ్గకుండా ప్రభుత్వ పరమై ఉన్న కంపెనీలను ప్రభుత్వ కంపెనీలు అంటారు. హిందుస్థాన్ మిషన్ టూల్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మొదలగునవి ప్రభుత్వ కంపెనీలకు ఉదాహరణలు.

ప్రభుత్వ సంస్థలు కంపెనీల రూపంలో నిర్వహించుట వలన అనేక ప్రయోజనాలు ఏర్పడును.

1. ప్రభుత్వ కంపెనీలలో పరిస్థితులను బట్టి సంస్థలను నిర్వహించవచ్చును. కంపెనీల నిర్వహణలో సరళత ఎక్కువగా ఉండును.

2. ప్రభుత్వ కంపెనీల నిర్వహణలో ప్రభుత్వ జోక్యం ఎక్కువగా ఉండదు. అందువల్ల ఈ సంస్థలు స్వతంత్రంగా నిర్వహించబడతాయి.

3. సంస్థలను వాణిజ్య సరళిలో నిర్వహించదలచినప్పుడు ప్రభుత్వ కంపెనీల ద్వారా ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించుట మంచిది.

4. ఈ విధానంలో ప్రవేటు రంగం నుండి కూడా పెట్టుబడి వనరులను సమకూర్చుకోవచ్చును.

5. ప్రభుత్వ కంపెనీలలో విదేశీ భాగస్వామ్యానికి అవకాశం ఉంటుంది.

ప్రభుత్వరంగ సంస్థలను కంపెనీల ద్వారా నిర్వహించటంలో కొన్ని లోపాలు ఏర్పడును.

1. ప్రభుత్వ కంపెనీల రూపంలో ప్రభుత్వ సంస్థలను స్థాపించి ప్రభుత్వం తమ బాధ్యతలను తప్పించుకొనవచ్చు.

2. ప్రభుత్వ కంపెనీలు చట్టరీత్యా స్వాతంత్రము కలిగి ఉన్నప్పటికీ అది కేవలం నామమాత్రంగానే ఉండును. వీటిని నిర్వహించే బోర్డుసభ్యులు ప్రభుత్వ ఒత్తిడులకు గురికావచ్చు.

3. ప్రభుత్వ కంపెనీలు కూడా మంత్రులు లేదా ఇతర అధికారుల ద్వారా డిపార్ట్మెంటల్ సంస్థల వలె నిర్వహించబడతాయి.

## 3. ప్రభుత్వరంగం - అవశ్యకత లేదా ప్రాముఖ్యము:

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వరంగం కీలక స్థానాన్ని ఆక్రమించును. ఈ దేశాలలో త్వరిత ఆర్థికాభివృద్ధి సాధనకు ప్రభుత్వం ఒక ఉద్యమకారునిగా వివిధ కార్యకలాపాలను చేపట్టాలి. వివిధ అంశాలలో ప్రభుత్వరంగ ప్రాముఖ్యాము ఏ విధంగా ఉండునో పరిశీలించెదము.

**1. ప్రజలకు సేవలను అందించుట:** ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని మెరుగుపరచడానికి, త్వరిత ఆర్థికాభివృద్ధిని సాధించడానికి అనేక కార్యక్రమాలను చేపట్టును. దేశంలో శాంతి భద్రతలను కాపాడుట ప్రభుత్వ ప్రాధమిక విధి. దేశ అభివృద్ధికి అవసరమైన అవస్థాపనా సౌకర్యాలను ప్రభుత్వరంగం కల్పించును. రవాణా, వార్తా సౌకర్యాలు, విద్యా, వైద్య సౌకర్యాలు, నీటి పారుదల సౌకర్యాలు, విద్యుచ్ఛక్తి సౌకర్యాలు మొదలగు వాటిని అవస్థాపనా సౌకర్యాలు అని అందురు. దేశం వివిధ రంగాలలో సర్వతోముఖాభివృద్ధికి ఈ సాంఘిక, ఆర్థిక వ్యవస్థామూలధనం ఎంతో అవసరం. సాధారణంగా ప్రవేటురంగ సంస్థలు వీటిని స్థాపించుటకు ముందుకురావు. అందువల్ల ప్రజలకు సేవలను అందించటానికి, దేశ ఆర్థికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వరంగమే వీటిని సృష్టించాలి. కనుక పబ్లిక్‌రంగ సంస్థలను నిర్మించటంలో ప్రభుత్వరంగ ప్రాముఖ్యం ఎంతో ఉంది.

**2. ఆర్థిక అసమానతలను తగ్గించుట:** వెనుకబడిన దేశాలలో వివిధ కారణాల వలన ఆర్థిక అసమానతలను ఎక్కువగా ఉంటాయి. ప్రజల నైపుణ్యాంలో తేడాలు, ఆర్థిక స్తోమత కేంద్రీకరణ, విద్యా, శిక్షణలో తేడాలు మొదలైన కారణాలవల్ల ఆర్థిక అసమానతలు ఏర్పడతాయి. ఆర్థిక స్తోమత కేంద్రీకరణ వలన పొదుపు శాతం పెరిగి కొంత మేరకు ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడును కానీ సాంఘికన్యాయం దృష్ట్యా ఆర్థిక అసమానతలను తగ్గించవలసిన అవసరం ఎంతో ఉంది. ఆర్థికాభివృద్ధి, ఆర్థిక అసమానతల నిర్మూలన మధ్య ఉన్న వైరుధ్యాన్ని సరియైన ఆర్థిక విధానాలను రూపొందించుట ద్వారా ప్రభుత్వం తగిన చర్యలను చేపట్టాలి. ప్రభుత్వం సరియైన పన్నుల విధానం, వ్యయ విధానాన్ని అనుసరించాలి. భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశాలలో ఆర్థిక అసమానతలను తొలగించుట ప్రభుత్వరంగం యొక్క ముఖ్య లక్ష్యము.

**3. భారీ పరిశ్రమల స్థాపన:** ప్రభుత్వరంగము దేశ ఆర్థికాభివృద్ధికి కావాల్సిన భారీ పరిశ్రమలను స్థాపించును. భారీ పరిశ్రమలు స్థాపించటానికి అధిక పరిమాణంలో మూలధనం కావలెను. అంతేకాకుండా ఈ పరిశ్రమలలో ఫలన కాలం ఎక్కువుగా ఉంటుంది. అందువల్ల ప్రవేటురంగ సంస్థలు భారీ పరిశ్రమల స్థాపనకు ముందుకు రావు. అధిక వస్తుత్పత్తికి, దేశ ఆర్థికాభివృద్ధికి ఈ సంస్థల స్థాపన ఎంతో ఉపయోగపడును. అందువల్ల ప్రభుత్వరంగమే భారీ పరిశ్రమల స్థాపనకు, అభివృద్ధికి పూనుకోవాలి.

**4. సామ్యవాదరీతి సమాజస్థాపన:** భారత పార్లమెంట్‌లో 1954వ సంవత్సరంలో మనదేశంలో సామ్యవాదరీతి సమాజాన్ని స్థాపించాలని ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేయడమైంది. ఇటువంటి సమాజంలో ప్రజలకు ఆర్థికంగా, సాంఘికంగా న్యాయం చేకూరుతుంది. ఆదాయ సంపదలో కల అసమానతలను తగ్గించడానికి తగిన చర్యలను తీసుకోవటంలో ప్రభుత్వ ప్రాముఖ్యం ఎక్కువుగా ఉండును. ఈ విషయంగా ప్రభుత్వరంగంలో జరిగే పెట్టుబడులు ప్రధాన పాత్ర వహిస్తాయి. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ వలన వచ్చే లాభాలు తిరిగి ప్రజాసంక్షేమానికే ఉపయోగించడం జరుగును. ప్రభుత్వరంగ సంస్థల ద్వారా తయారైన వస్తువులకు ధరలు పేదప్రజలకు అనుకూలంగా విధించవచ్చు. అంతేకాకుండా వివిధ ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసాలను తగ్గించడానికి సరియైన వేతన విధానాన్ని ప్రభుత్వరంగము రూపొందించవచ్చు. మొత్తం ప్రజాసంక్షేమాన్ని పెంచుటలో ప్రభుత్వరంగ ప్రాముఖ్యము ఎక్కువుగా ఉన్నది.

**5. వనరుల సక్రమ వినియోగం:** ప్రభుత్వరంగం ఉత్పాదక వనరులను సక్రమంగా, ప్రజాసంక్షేమానికి అనుగుణంగా ఉపయోగించడానికి చాలా అవసరం. ఆర్థికవనరుల కేటాయింపు కేవలం మార్కెట్ ధరల ద్వారా కాకుండా ప్రణాళికాబద్ధంగా జరగాలి. ఈ విధంగా జరిగిన వస్తుత్పత్తి గరిష్టంగా ఏర్పడి, ఆదాయపంపిణీలో అసమానతలను తగ్గించడానికి వీలుఅవుతుంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఒక వైపు నిత్యావసర వస్తువుల ఉత్పత్తిని ప్రోత్సహించి మరొకవైపు విలాస వస్తువుల ఉత్పత్తి అదుపు చేయాలి. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వరంగ ప్రాధాన్యత ఎక్కువుగా ఉన్నది.

**6. ప్రాంతీయ సమానాభివృద్ధి:** భారతదేశం వంటి ఫెడరల్ దేశాలలో ప్రాంతీయ సమానాభివృద్ధిని సాధించుట ఎంతో అవసరం. ఇందుకు ప్రభుత్వరంగాన్ని విస్తరించాలి. మనదేశంలో ప్రాంతీయ అసమానతలు ఎక్కువుగా ఉన్నాయి. ఉదాహరణకు మనదేశంలో పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్ మొదలగు ప్రాంతాలు అభివృద్ధి చెంది ఉండగా బీహార్. ఒరిస్సా, నాగాలాండ్ [illegible]లగు ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి. సాధారణంగా ప్రవేటురంగ సంస్థలు వెనుకబడిన ప్రాంతాలలో తమ సంస్థలను స్థాపి[illegible] ఇష్టపడవు. ఇందువల్ల ప్రాంతీయ అసమానతలు పెరుగుతాయి. కనుక వెనుకబడిన ప్రాంతాలలో వివిధ అభివృద్ధి [illegible]కలాలను చేపట్టి, ప్రాంతీయ సమానాభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వరంగాన్ని తప్పనిసరిగా విస్తరించాలి

**7. సంపూర్ణ ఉద్యోగితను సాధించుట:** సంపూర్ణ ఉద్యోగితను సాధించుట వెనుకబడిన దేశాల ఆర్థికాభివృద్ధి లక్ష్యాలలో ఒకటి. ఈ దేశాల [illegible]ాభివృద్ధి తక్కువుగా ఉండి ఉద్యోగావకాశాలు తక్కువుగా ఉండును. అందువల్ల ఈ దేశాలలో ఉద్యోగఅవకాశాలను కల్పించి నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి సరియైన ఆర్థికాభివృద్ధి వ్యూహాన్ని రూపొందించుకోవాలి. మూలధనం కొరతగా ఉండి, శ్రామిక సప్లయి ఎక్కువుగా ఉన్నప్పుడు శ్రమసాంద్రత పద్ధతులను ప్రోత్సహించుట మంచిది. ఈ పరిస్థితిలో కుటీర, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించటం చాలా అవసరం. ఇందుకు ప్రభుత్వరంగ కృషి ఎంతో ఉపగయోపడును. ప్రభుత్వం వివిధ ప్రణాళికలను ప్రవేశపెట్టి అనేకమందికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలి.

**8. ద్రవ్య సప్లయిని అదుపులో ఉంచుట:** దేశంలో స్థిరత్వంతోకూడిన ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వం ద్రవ్య సప్లయిని అదుపులో ఉంచాలి. ద్రవ్య సప్లయి అనగా కేవలం కరెన్సీ మాత్రమే కాకుండా వాణిజ్యబ్యాంకులు సృష్టించే పరపతి మరియు ఇతర పరపతి సాధనాలను కూడా ద్రవ్యసప్లయిగా భావించాలి. ద్రవ్యసప్లయిని నియంత్రణ చేయడానికి ప్రభుత్వం తగిన ద్రవ్యవిధానాన్ని రూపొందించాలి. ప్రభుత్వం అనుసరించే కొన్ని విధానాల వలన ద్రవ్యోల్బన పరిస్థితులు ఏర్పడవచ్చు. కనుక ప్రభుత్వం సరియైన ద్రవ్యవిధానం, కోశవిధానం ద్వారా ద్రవ్యసప్లయిని అదుపు చేసి స్థిరత్వంతోకూడిన ఆర్థికాభివృద్ధిని సాధించడానికి తగిన ప్రయత్నం చేయాలి.

**9. వనరుల సమీకరణ:** దేశం వివిధ రంగాలలో అభివృద్ధిని సాధించడానికి కావల్సిన వనరులను సమకూర్చుకొనుటలో ప్రభుత్వరంగ ప్రాముఖ్యం ఎక్కువగా ఉన్నది. ప్రభుత్వం లోటు బడ్జెట్ ద్వారా, విదేశీ సహాయం ద్వారా, ప్రజల నుండి ద్రవ్యాన్ని సేకరించుట ద్వారా, కావాల్సిన ఆర్థిక వనరులను సమీకరించుకోవచ్చు. అంతేకాకుండా ప్రభుత్వరంగ సంస్థల ద్వారా వచ్చే లాభాలను తిరిగి పెట్టుబడిగా ఉపయోగించవచ్చు. దేశంలో వివిధ ఉత్పాదక కార్యకలాపాలకు కావాల్సిన ద్రవ్య వనరులను సమీకరించుటలో ప్రభుత్వరంగం కీలకపాత్ర వహించును.

**10. ఉత్పాదకతను పెంచుట:** దేశంలో వివిధ రంగాలలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుటలో కూడా ప్రభుత్వరంగ ప్రాధాన్యత ఎక్కువగా ఉంది. వ్యవసాయం, పరిశ్రమలు మొదలైన రంగాలలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుటకు ప్రభుత్వం ఎక్కువగా కృషి చేయాలి. వ్యవసాయరంగంలో సంస్థాపూరకమైన, సాంకేతిక పరమైన మార్పులను ప్రవేశపెట్టుటకు ప్రభుత్వం వివిధ చర్యలను చేపట్టాలి. మధ్యవర్తులను తొలగించడం, కౌలు సంస్కరణలు ప్రవేశపెట్టుట, కమతాల గరిష్ట పరిమాణాన్ని నిర్ణయించుట, కమతాల సమీకరణను ప్రోత్సహించుట సహకార వ్యవసాయాన్ని అమలుపరుచుట మొదలైన భూసంస్కరణల పద్ధతులను అమలు పరచడంలో ప్రభుత్వరంగ ప్రాముఖ్యం ఎక్కువగా ఉన్నది. అంతేకాకుండా పారిశ్రామికీకరణ త్వరితగతిన జరుగుటలో కూడా ప్రభుత్వరంగ ప్రాముఖ్యం ఎక్కువగా ఉంది.

**11. ప్రజల దృక్పదాలలో మార్పు:** దేశ ఆర్థికాభివృద్ధి ప్రజల దృక్పదాలపై కూడా ఆధారపడి ఉంది. మానవవనరుల అభివృద్ధి సక్రమంగా జరిగిననాడు దేశ ఆర్థికాభివృద్ధి త్వరితగతిన జరుగును. సాధారణంగా వెనుకబడిన దేశాలలో ప్రజల దృక్పదం ఆర్థికాభివృద్ధికి అవరోధకంగా ఉండును; శ్రామికులలో గమనశీలత లేకపోవుట, కుల మతాల ప్రాముఖ్యము, కుటుంబ నియంత్రణను అలక్ష్యం చేయుట, శ్రమించాలనే భావం లేకుండుట, మూఢ నమ్మకాలకు ప్రాముఖ్యం ఇచ్చుట మొదలైన అంశాలు వెనుకబడిన దేశాలలో ఆర్థికాభివృద్ధిని తగ్గించును. ప్రభుత్వరంగం ప్రజల దృక్పదంలో మార్పును తీసుకువచ్చి ఆర్థికాభివృద్ధిని సాధించటానికి ఉపయోగపడును.

**12. పెట్టుబడి నియంత్రణ:** దేశంలో వివిధ రంగాలలో జరిగే పెట్టుబడులను నియంత్రణ చేయాలి. ప్రభుత్వరంగం కొన్ని రంగాలలో పెట్టుబడిని ప్రోత్సహించాలి, మరికొన్ని రంగాలలో పెట్టుబడిని నిరుత్సాహ పరచాలి. ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వరంగమే ముందుకు వచ్చి ప్రత్యక్షంగా కొన్ని ఉత్పాదకరంగాలలో పెట్టుబడి పెట్టాలి. వెనుకబడిన దేశాలలో ప్రజల తలసరి ఆదాయం తక్కువగా ఉండి, జీవన ప్రమాణం తక్కువగా ఉండును. ఈ దేశాలలో ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచి ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరచటానికి తగిన పెట్టుబడులను ప్రభుత్వం పెట్టాలి. ఇందుకోసం ప్రభుత్వరంగం స్వదేశీ నుండే కాకుండా విదేశాల నుండి కూడా కావాల్సిన పెట్టుబడులను సమీకరించాలి.

**13. ఎగుమతుల విస్తరణ - దిగుమతుల ప్రత్యామ్నాయము:** ఎగుమతులను ప్రోత్సహించి, దిగుమతుల ప్రత్యామ్నాయాన్ని ప్రవేశపెట్టే విషయంలో కూడా ప్రభుత్వరంగ ప్రాముఖ్యం ఎక్కువగా ఉంది. ఉదాహరణకు మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థలగు హిందుస్థాన్ మిషన్ టూల్స్, హిందుస్థాన్ స్టీల్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ మొదలగు వాటి ద్వారా భారతదేశ ఎగుమతులు పెరుగుతున్నాయి. దిగుమతుల ప్రత్యామ్నాయాన్ని ప్రవేశపెట్టే విషయంలో కూడా ప్రభుత్వరంగ ప్రాముఖ్యం ఎక్కువగా ఉంది. ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమీషన్ మొదలైన ప్రభుత్వరంగ సంస్థలు దిగుమతుల ప్రత్యామ్నాయంలో ప్రాముఖ్యాన్ని వహిస్తున్నాయి. దేశం స్వయం సమృద్ధిని సాధించడానికి ఎగుమతుల విస్తరణ, దిగుమతుల ప్రత్యామ్నాయం ఎంతో అవసరం. ఈ విషయంలో ప్రభుత్వరంగ కృషి ఎంతో ఉంది.

**14. ఇతర ప్రయోజనాలు:** ప్రభుత్వరంగ విస్తరణ వలన అనేక ఇతర ప్రయోజనాలను కూడా పొందవచ్చు. విదేశీమారక ద్రవ్యాన్ని పరిరక్షించుట, విదేశీ చెల్లింపుల శేషంలో లోటును తొలగించుట, ఎగుమతి, దిగుమతులను నియంత్రణ చేయుట,

పారిశ్రామికీకరణలో కీలక స్థానాలను భర్తీ చేయుట మొదలగు అంశాలలో కూడా ప్రభుత్వరంగ ప్రాముఖ్యం ఎక్కువగా ఉన్నది. దేశ భద్రతా, రక్షణ దృష్ట్యా కొన్ని ఉత్పత్తి కార్యకలాపాలను పూర్తిగా ప్రభుత్వరంగమే నిర్వహించాలి. ఇటువంటి వాటికి సంబంధించిన సమాచారాన్ని రహస్యంగా ఉంచాలి. దేశ రక్షణ పరికరాలు, యుద్ధసామాగ్రిని తయారు చేసే పరిశ్రమలు ప్రభుత్వరంగ ఆధ్వర్యంలోనే ఉండాలి. ప్రభుత్వరంగ విస్తరణ వలన దేశం అనేక రంగాలలో అభివృద్ధి చెందుతుంది.

## 16.4. ప్రభుత్వరంగ సంస్థల ధరల విధానం:

ప్రభుత్వరంగ సంస్థలలో ధరల విధానానికి అత్యధిక ప్రాముఖ్యం ఉన్నది. ప్రజలకు అవసరమైన అనేక వస్తుసేవలను ప్రభుత్వం ఉత్పత్తి చేయును. అందువల్ల ప్రభుత్వరంగం ధరలను నిర్ణయించేటప్పుడు కేవలం లాభాలను మాత్రమే దృష్టిలో ఉంచుకోకుండా కొన్ని ఆర్థికేతర అంశాలను కూడా పరిగణలోనికి తీసుకోవాలి. కొన్ని సార్లు ఈ కారణంగా ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలను పొందవలసి ఉంటుంది. గరిష్ఠ సాంఘిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ... ధరలను నిర్ణయించాలి.

ప్రభుత్వ సంస్థలు ధరలను నిర్ణయించేటప్పుడు ఈ క్రింది లక్ష్యాలను దృష్టిలో ఉంచుకోవాలి.

1. కొరతగా ఉన్న వనరులను హేతుబద్ధంగా కేటాయించడానికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ధరలవిధానం ఉండాలి.
2. వనరులను అభిలషణీయంగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వ ధరల విధానం తోడ్పడాలి.
3. ప్రభుత్వం అనుసరించే ధరల విధానం త్వరిత ఆర్థికాభివృద్ధిని సాధించ... ఉపయోగపడే విధంగా ఉండాలి.
4. మార్కెట్ పరిస్థితులనుబట్టి, అవసరాలు మరియు అవకాశాలనుబట్టి ప్రభుత్వ ధరల విధానం మారుతూ ఉండాలి.
5. ప్రజలకు ఉపయోగపడే వస్తుసే... విషయంలో ప్రతిఫల రేటుకంటే వస్తూత్పత్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.
6. ప్రభుత్వ సంస్థలు అనుసరించే ధరల విధానం వలన మూలధనకల్పనకు అవసరమైన మిగులును సమకూర్చుకోగలగాలి

డాల్టన్ సూత్రాలు: ప్రభుత్వ సంస్థల ధర నిర్ణయ పద్ధతులకు డాల్టన్ మూడు సూత్రాలను వివరించాడు.

1. **సాధారణ పన్ను విధింపు సూత్రం:** కొన్ని వస్తు సేవలను ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందజేయును. దీనికయ్యే ఖర్చును ప్రభుత్వం పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం నుండి భరిస్తుంది. ప్రభుత్వం అందించే సేవల వలన ప్రజలందరూ ప్రయోజనం పొందవచ్చు లేదా కొంతమంది మాత్రమే ప్రయోజనం పొందవచ్చు. అయినప్పటికీ ప్రభుత్వం కొన్ని వస్తుసేవలను ప్రజలకు అందించడానికి అయ్యే వ్యయాన్ని పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం నుండి భరించడమగుతుంది.

2. **సేవా వ్యయ సూత్రము:** ప్రభుత్వం అందించే సేవలకు అయ్యే ఖర్చును రాబట్టడానికి వాటికి ధరలను నిర్ణయించవచ్చు. ఈ విధానంలో ప్రభుత్వ సేవల వలన ప్రయోజనం పొందే వారి నుండే ధరలను ప్రభుత్వం వసూలు చేస్తుంది. ఉదాహరణకు- వీధి దీపాల నుండి ప్రయోజనం పొందే గృహాలను గుర్తించి ఆ గృహ యజమాని నుండి పన్నులు వసూలు చేయవచ్చు.

3. **స్వేచ్ఛా ధర నిర్ణయ సూత్రము:** ప్రభుత్వం అందించే వస్తుసేవలను ప్రజలు కొనవచ్చు లేదా కొనకపోవచ్చు. ఈ వస్తువుల కొనుగోలు విషయంలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. ప్రభుత్వం కల్పించే వస్తుసేవల వల్ల ప్రజాశ్రేయస్సు పెరిగితే అటువంటి వస్తుసేవల ఉపయోగాన్ని ప్రోత్సహించి ధరను సగటు ఉత్పత్తి వ్యయం కంటే తక్కువగా నిర్ణయించవచ్చు ధరను నిర్ణయించడంలో ప్రభుత్వం డిమాండ్ వ్యాకోచాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. ప్రజలకు హానిని కలిగించే వస్తువులకు ఎక్కువ ధరను నిర్ణయించాలి. ఇటువంటి వస్తువులకు ప్రభుత్వం ఎక్కువ ధరలను నిర్ణయించి వాటి వినియోగాన్ని క్రమబద్ధం చేయాలి. ఇతర వస్తువుల విషయంలో ధర ఉపాంత వ్యయానికి సమానంగా ఉండాలని కొంతమంది అభిప్రా... ం.

## 16.5. భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థల ధర నిర్ణయ పద్ధతులు:

మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు ధర నిర్ణయ విషయంలో వివిధ పద్ధతులను అనుసరిస్తున్నాయి.

**1. లాభంగానీ, నష్టంగానీ లేని ధరలు:** ప్రభుత్వరంగ సంస్థలు కొన్ని లాభంగానీ లేదా నష్టంగానీ లేని విధంగా ధరలను నిర్ణయిస్తున్నాయి. ఉదాహరణకు- మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థ అయిన హిందుస్థాన్ యాంటీబయాటిక్స్ ధర నిర్ణయంలో ఇటువంటి సూత్రాన్నే పాటిస్తుంది.

**2. ఉత్పత్తి వ్యయం కంటే ఎక్కువగా ఉండే ధరలు:** ఈ విధానంలో ప్రభుత్వరంగ సంస్థలు తమ ఉత్పత్తులకు ధరలను తగ్గించడానికి ప్రయత్నించడం జరగదు. ఉత్పత్తి వ్యయం కంటే ధరలు ఎక్కువగా ఉన్నచో లాభాలు ఎక్కువగా వస్తాయనే అభిప్రాయంతో ఎక్కువ ధరలను విధించే అవకాశం ఉన్నది. ఉదాహరణకు- మనదేశంలో ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఈ పద్ధతిని అనుసరిస్తుంది.

**3. దిగుమతి వస్తువుల ధరలకు సమానమైన ధరలు:** ఈ విధానంలో ప్రభుత్వరంగ సంస్థలు దిగుమతి చేసుకొన్న వస్తువుల ధరలకు సమానమైన ధరలను నిర్ణయించవచ్చు. మనదేశంలో భారత్ భారీ విద్యుత్ పరికరాల సంస్థ, భారీ ఇంజనీరింగ్ సంస్థలు ఈ ధరల విధానాన్ని అనుసరిస్తున్నాయి.

**4. లాభం ప్రాతిపదికగా ధరలు:** ప్రభుత్వరంగ సంస్థలు కొంత శాతం లాభాలను పొందాలని ముందుగా నిర్ణయించుకొని దానికనుగుణంగా ధరలను నిర్ణయించవచ్చు. మనదేశంలో కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు లాభాలను సంపాదించాలనే లక్ష్యంతో పని చేస్తున్నాయి. కానీ ప్రభుత్వం ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి తద్వారా లాభాలను సంపాదించడం కోసం ప్రయత్నం చేస్తే బాగుంటుంది.

**5. తక్కువ ధరల విధానం:** కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరలను నిర్ణయిస్తున్నాయి. ఉదాహరణకు- మనదేశంలో హిందుస్థాన్ యాంటీ బయాటిక్స్ సంస్థ ప్రాణరక్షణకు అవసరమైన మందులకు ఉత్పత్తివ్యయం కంటే తక్కువ ధరలను నిర్ణయిస్తున్నది.

భారతప్రభుత్వం ఇటీవల ప్రభుత్వసంస్థల ధరల విధానానికి సంబంధించి సూచిస్తు మార్గదర్శిక సూత్రాలను ప్రతిపాదించింది.

1. ప్రభుత్వరంగ సంస్థలు తమ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకొని, లాభాలను పొంది తమ విస్తరణకు అవసరమైన వనరులను సమీకరించుకోగలగాలి.

2. మార్కెట్‌లో ఇతర ఉత్పత్తిదారులతో పోటీ ఉన్నప్పుడు సప్లయి, డిమాండ్‌లను బట్టి ధరలను నిర్ణయించాలి. మార్కెట్ ధరలను బట్టి వాటి ఉత్పాదకత మరియు లాభం నిర్ణయించబడుతుంది.

3. ప్రభుత్వ ఏకస్వామ్య సంస్థలు తమ వస్తువుల ధరలు దిగుమతి చేసుకొనే వస్తువుల ధరల స్థాయిలో నిర్ణయించాలి.

ప్రభుత్వరంగ సంస్థలు తగిన పరిమాణంలో లాభాలను సంపాదించే విధంగా తమ ధరల విధానాన్ని రూపొందించుకోవాలి. లాభాన్ని పొందగల సామర్థ్యం ప్రభుత్వ సంస్థలకు ఉన్నప్పుడే అదనంగా పెట్టుబడి వనరులను సమకూర్చుకోవచ్చు. ఈ విధంగా లేనియెడల ప్రభుత్వరంగ సంస్థల విస్తరణ ప్రశ్నార్థకంగా మారుతుంది. అంతే కాకుండా ప్రజలకు అవసరమైన సాంఘిక వ్యవస్థ మూలధన వ్యయాన్ని సమకూర్చాలంటే ప్రభుత్వరంగ సంస్థలు తగినంతగా లాభాలను సంపాదించవలసిన అవశ్యకత ఉంది. నిర్వహణ సామర్థ్యం దృష్ట్యా కూడా ప్రభుత్వరంగ సంస్థలు లాభాలను సంపాదించవలసిన అవసరం ఉంది. కానీ కేవలం లాభాలను సంపాదించాలనే దృష్టితోనే ప్రభుత్వరంగ సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహించకూడదు. కొన్ని సందర్భాలలో ప్రజాసంక్షేమం కోసం లాభాలు రాకపోయినను కొన్ని సంక్షేమ కార్యకలాపాలను తక్కువ ధరలకే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం తగిన చర్యలను తీసుకోవాలి.

## 16.6. ప్రభుత్వరంగ సమస్యలు:

ఇటీవల కాలంలో కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు అనేక సమస్యలను ఎదుర్కొంటు నష్టాలను పొందుతున్నాయి ఇందుకు వివిధ కారణాలను పేర్కొనవచ్చు.

**1. నిర్వహణ సామర్థ్యం తక్కువ :** వివిధ ప్రభుత్వరంగ సంస్థల నష్టాలకు ముఖ్యకారణం నిర్వహణ సామర్థ్యం తక్కువగా ఉండుట. బాధ్యత లోపించుట, అధిక పని ఒత్తిడి మొదలగు కారణాల వలన ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ సామర్థ్యం తక్కువగా ఉన్నది. దీనివలన వివిధ ప్రభుత్వరంగ సంస్థలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

**2. సరియైన ధరల విధానం లేకపోవుట :** ప్రభుత్వరంగ సంస్థలు సరియైన ధరల విధానాన్ని అనుసరించకపోవుట వలన కూడ కొన్ని ఒడుదుడుకులు ఏర్పడుతున్నాయి. కొన్ని సమయాలలో ప్రజాసంక్షేమం దృష్ట్యా అతి తక్కువ ధరలను, ప్రభుత్వ యాజమాన్య సంస్థలలో ఒక్కొక్కసారి అధిక ధరలను, వేరొకసారి ' లాభములు వద్దు - నష్టములు వద్దు ' అనే విధానాన్ని అనుసరించుట జరుగుతున్నది. ధర నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన విధానాన్ని అనుసరించకపోవుట వలన ప్రభుత్వరంగ సంస్థలు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

**3. ఉత్పాదక శక్తిని పూర్తిగా ఉపయోగించుట లేదు :** మనదేశంలో అనేక ప్రభుత్వరంగ సంస్థలలో స్థాపిత ఉత్పాదక శక్తిని పూర్తిగా, సక్రమంగా వినియోగించుట లేదు. సరియైన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవుట వలన, శ్రామిక అశాంతి మొదలగు కారణాల వలన ఉత్పాదక శక్తిని పూర్తిగా ఉపయోగించుట లేదు. ఉదాహరణకు- మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థలగు హిందుస్థాన్ మిషన్ టూల్స్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ మొదలగునవి తమ స్థాపిత ఉత్పాదక శక్తిలో కేవలం 35 శాతం మాత్రమే ఉపయోగించుకోవడం జరుగుతున్నది. దీనివలన అధిక పెట్టుబడి, విదేశీ సహాయం వృథా అగుచున్నాయి.

**4. విరుద్ధ లక్ష్యాలు :** ప్రభుత్వరంగ సంస్థలు పరస్పరమైన విరుద్ధ లక్ష్యాలను కలిగి ఉన్నాయి. ఉదాహరణకు- ప్రభుత్వరంగం ఒక వైపున త్వరిత పారిశ్రామికీకరణ సాధించాలని లక్ష్యం కలిగి ఉండగా, మరొకవైపు ప్రాంతీయ సమానాభివృద్ధిని సాధించాలనే మరొక లక్ష్యాన్ని కలిగి ఉన్నది. కానీ సాధారణంగా ఈ రెండు లక్ష్యాలు విరుద్ధ స్వభావం కల లక్ష్యాలు. అందువల్ల ఈ లక్ష్యాలను ఒకేసారి సాధించుట కష్టము.

**5. దీర్ఘ ఫలన కాలము :** ప్రభుత్వరంగ సంస్థలలో ఫలన కాలము ఎక్కువగా ఉండుట వలన కూడా వస్తూత్పత్తి త్వరితగతిన జరుగుటలేదు. పెట్టుబడికి, తద్వారా జరిగే వస్తూత్పత్తికి మధ్య కాలవిలంబనాన్ని ఫలన కాలం అంటారు. ఈ ఫలన కాలం ఎక్కువగా ఉండుట వలన పెట్టుబడి నిలిచిపోవును. భారీ యంత్రాలు, ఇనుము-ఉక్కు, ఎరువులు, పెట్రోలు మొదలగు భారీ ఉత్పత్తి కార్యకలాపాలలో దీర్ఘఫలన కాలం ఉండును. దీనివలన వస్తూత్పత్తి త్వరితగతిన జరగదు. అందువలన ఒక్కొక్కసారి ప్రభుత్వరంగ సంస్థలకు నష్టాలు కూడా ఏర్పడవచ్చు.

**6. నిర్ణయాల జాప్యము :** భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలలో ఉత్పత్తి కార్యకలాపాలు మరియు ఇతర విషయాలలో నిర్ణయాలను తీసుకోవడంలో విపరీతమైన జాప్యం ఏర్పడుతుంది. హర్ష్‌మన్ అను ఆర్థిక శాస్త్రవేత్త ప్రకారం ఆర్థికాభివృద్ధిలో విధాన నిర్ణయాల యొక్క ప్రాముఖ్యం ఎక్కువగా ఉండును. వివిధ అంశాలకు సంబంధించిన విధాన నిర్ణయాలను తీసుకోవడంలో జాప్యం ఎక్కువగా ఉండుట వలన వివిధ ఉత్పత్తి కార్యకలాపాలలో జరిగే పెట్టుబడులు సక్రమంగా వినియోగించుకొనుట లేదు.

**7. శ్రామిక అశాంతి :** ఇటీవల కాలంలో ప్రభుత్వరంగ సంస్థలకు నష్టాలు ఏర్పడడానికి ముఖ్యకారణం శ్రామిక అశాంతి అని పేర్కొనవచ్చు. యాజమాన్యానికి, శ్రామికులకు సరియైన అవగాహన లేకపోవుట వలన తరచుగా సమ్మెలు, లాకౌట్‌లు ఏర్పడుతున్నాయి. ఇటువంటి శ్రామిక అశాంతి వలన వస్తూత్పత్తి కుంటుపడుతుంది. అందువల్లే వివిధ ప్రభుత్వరంగ సంస్థలకు నష్టాలు ఏర్పడుచున్నాయి.

**8. అధిక వ్యవస్థాపనా వ్యయము :** ప్రభుత్వరంగంలో వ్యవస్థాపనా వ్యయాన్ని ఎక్కువగా పెట్టవలసి వచ్చుచున్నది. కార్మికులకు, ఇతర ఉద్యోగస్తులకు విద్యా, గృహవసతి, ఆరోగ్యం మొదలగు సంక్షేమ కార్యకలాపాలకు ఎక్కువగా వ్యయం చేయవలసి వస్తున్నది. దీనివలన పెట్టుబడిపై వచ్చే ప్రతిఫలాలు చాలా తక్కువగా ఉన్నవి.

**9. స్థల నిర్ణయంలో లోపాలు :** కొన్ని ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించేటప్పుడు స్థల నిర్ణయంలో సరియైన నిర్ణయాలను తీసుకోవటం లేదు. ప్రభుత్వరంగ సంస్థల స్థల నిర్ణయంలో అందుబాటులో ఉన్న వనరులు, అనుకూల పరిస్థితులు, ఉత్పత్తి వ్యయాలు మొదలగు వాటిని పరిశీలించకుండా స్థాపించడం జరుగుతున్నది. రాజకీయ ఒత్తిడులు, ప్రముఖ వ్యక్తుల జోక్యం ఉండటం వలన ప్రభుత్వరంగ సంస్థల స్థల నిర్ణయంలో లోపాలు ఏర్పడుతున్నాయి. ఇందువలన విత్త వనరుల దుబారా జరుగుతున్నది. కొన్ని ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడులు ఆర్థిక ప్రాతిపదికపై జరుగుట లేదు.

ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించడంలో ఈ సంస్థల ప్రాధాన్యత ఎక్కువగా ఉన్నది. మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థల పని తీరును మెరుగు పరచడానికి సూచనలను అందజేయటానికి ప్రభుత్వం అర్జున్‌సేన్ గుప్తా కమిటీని నియమించింది. ప్రభుత్వరంగ సంస్థల పనితీరును మెరుగు పరచడానికి ఈ కమిటీ కొన్ని సూచనలను చేసింది.

1. ప్రభుత్వరంగ సంస్థలపై ఎక్కువగా నియంత్రణ ఉండకుండా కొంత అధికార వికేంద్రీకరణకు ప్రభుత్వరంగ సంస్థలలో హోల్డింగ్ కంపెనీ పద్ధతిని ప్రవేశపెట్టాలి.
2. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణలో శ్రామికులకు భాగస్వామ్యాన్ని కల్పించాలి.
3. వివిధ ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడి ప్రతిపాదనలను పరిశీలించటానికి వివిధ సంస్థలు కాక ఒకే అధికారసంస్థ ఉండాలి.
4. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రాథమిక వేతనంతోపాటు ఉత్పాదక ఆదాయ వేతనాలు ఉండాలి.
5. ప్రభుత్వరంగ సంస్థల స్థాపిత ఉత్పాదక సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవటానికి తగిన చర్యలను చేపట్టాలి.
6 ప్రభుత్వరంగ సంస్థలలో ఉత్పాదకతను, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచటానికి తగిన ప్రోత్సాహాన్ని కల్పించాలి.
7. విదేశాల నుండి సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకొనేటప్పుడు దానిని దేశీయమైనవిగా మార్చాలి.
8. ప్రభుత్వరంగ సంస్థలలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, వీటి తీరును పరిశీలించటానికి అవసరమైన సిబ్బందిని నియమించాలి.
9. ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలలో సాధ్యమైనంత వరకు రాజకీయ జోక్యం ఉండకూడదు.
10. ప్రభుత్వరంగ సంస్థల ఆర్థిక పరిపుష్టికి సరియైన ధరల విధానాన్ని రూపొందించాలి.

## 16.7. సరళీకృత ఆర్థిక విధానంలో ప్రభుత్వరంగ పాత్ర:

కేంద్ర ప్రభుత్వం 1991వ సంవత్సరంలో సరళీకృత ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆర్థిక వ్యవస్థ పనితీరును ముఖ్యంగా మార్కెట్ శక్తులకు వదిలివేయుట జరుగుతున్నది. వివిధ పరిశ్రమలు మరియు ఉత్పత్తి కార్యకలాపాలపై ఉన్న వివిధ కంట్రోళ్ళను సరళించటం జరుగుతున్నది. పారిశ్రామిక లైసెన్స్ విధానానికి ప్రభుత్వం ప్రాముఖ్యం తగ్గిస్తున్నది. విదేశీ సంస్థల పెట్టుబడులను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ ఉన్నది.

నూతన పారిశ్రామిక విధాన తీర్మానం, 1991 మనదేశ ప్రభుత్వరంగ ప్రాధాన్యాన్ని గమనించి దీని విస్తరణను తగ్గించటం జరిగింది. ప్రభుత్వారంగానికి ఇదివరలో కేటాయించిన 17 అతి కీలక పరిశ్రమలను 1991 పారిశ్రామిక విధాన

తీర్మానంలో ఈ సంఖ్యను తగ్గించడం జరిగింది. కేవలం అతిముఖ్యమైన పరిశ్రమలను మాత్రమే ప్రభుత్వరంగానికి కేటాయించటం అయినది. ప్రభుత్వరంగంలో పెట్టుబడుల ఉపసంహారణ మొదలైయ్యింది. ప్రభుత్వరంగంలో పెట్టుబడుల ఉపసంహారణకి సంబంధించి 1991లో కృష్ణమూర్తి కమిటీని, 1992లో రంగరాజన్ కమిటీని నియమించడం జరిగింది. ఈ కమిటీలు ప్రభుత్వరగగంలో పెట్టుబడుల ఉపసంహారణకే ప్రాముఖ్యాన్ని ఇచ్చాయి. 1991-92లో ప్రభుత్వరంగంలో పెట్టుబడుల ఉపసంహారణ 3,038 కోట్ల రూపాయిల వరకు జరిగింది. 2002-2003 సంవత్సరంలో ప్రభుత్వరంగంలో పెట్టుబడుల ఉపసంహారణ 3,342 కోట్ల రూపాయిల మేరకు మాత్రమే జరిగింది.

## 16.8. సారాంశము:

గడచిన 5 శతాబ్దాల కాలంలో ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ ఆర్థికవ్యవస్థను పటిష్టవంతంగా చేయడంలో ప్రభుత్వరంగ ప్రాధాన్యత ఎంతో ఉంది. మనదేశంలో మౌలిక, భారీ పరిశ్రమల స్థాపన, అవస్థాపనా నిర్మాణము, పారిశ్రామికాభివృద్ధిని సాధించుట మొదలగు వాటికి ప్రభుత్వరంగం గట్టి పునాది వేసింది. కేవలం ఆర్థిక లక్ష్యాలను సాధించటం కోసమే కాకుండా, సామాజిక ప్రయోజనాలను సాధించటంలో కూడా ప్రభుత్వరంగ సంస్థల పాత్ర కీలకమైనది. దేశ ఆర్థికవ్యవస్థ ఆధునిక రంగంవైపు పురోగమించటానికి అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చడంలో ప్రభుత్వరంగం కీలకపాత్ర వహిస్తున్నది. మనదేశ ప్రభుత్వరంగంలో ఇనుము-ఉక్కు, రైల్వేలు, యంత్రపరికరాలు, భారీ ఇంజనీరింగ్, ఎరువులు, నౌకా నిర్మాణం మొదలగు సంస్థలు అతి ముఖ్యమైన ప్రభుత్వరంగ సంస్థలుగా పరిగణింపబడుతున్నాయి. ప్రభుత్వరంగంలో వివిధ సమస్యలు ఉండటంవల్ల ఇవి సమర్థవంతంగా పనిచేయలేకపోవుచున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచి దీనిని ఉన్నత స్థాయిలో అభివృద్ధి పరచినప్పడే ఈ సంస్థలు ఎదుర్కొనే సమస్యలు పరిష్కారమై సమర్థవంతంగా పనిచేయడానికి వీలు కలుగుతుంది. వివిధ ప్రభుత్వరంగ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచాలి. ప్రభుత్వరంగ సంస్థలలో నష్టాలను తగ్గించటానికి తగిన చర్యలను తీసుకోవాలి.

## 16.9. గుర్తుంచుకోవలసిన విషయాలు :

1. సాంప్రదాయ ఆర్థికవేత్తలు ప్రభుత్వరంగ ప్రాముఖ్యాన్ని అంతగా గుర్తించలేదు.
2. మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు ముఖ్యంగా మూడు పద్ధతులలో నిర్వహించడం జరుగుతుంది.
   1. డిపార్ట్‌మెంటల్ సంస్థలు.
   2. పబ్లిక్ కార్పోరేషన్‌లు.
   3. ప్రభుత్వ కంపెనీలు.
3. ప్రభుత్వరంగం ద్వారా అనేక ప్రయోజనాలు ఏర్పడుతున్నాయి.
4. ప్రభుత్వరంగ సంస్థలు ధరలను నిర్ణయించేటప్పుడు వివిధ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకోవాలి.
5. డాల్టన్ ప్రభుత్వ సంస్థల ధర నిర్ణయ పద్ధతులకు మూడు సూత్రాలను వివరించాడు.
6. మనదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు ధర నిర్ణయ విషయంలో వివిధ పద్ధతులను అనుసరిస్తున్నాయి.
7. ప్రభుత్వరంగ సంస్థలు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నాయి.
8. ప్రభుత్వరంగ సంస్థల పనితీరును మెరుగు పరచడానికి అర్జున్‌సేన్ గుప్తా కమిటీ కొన్ని సూచనలు చేసింది.
9. సరళీకృత ఆర్థిక విధానంలో ప్రభుత్వరంగ పాత్రలో కొంత మార్పు వచ్చింది.

## 16.10. కఠిన పదాలు :

1. డిపార్ట్‌మెంటల్ సంస్థలు : వీటిని ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తాయి. ఈ సంస్థల నిర్వహణకు కావలసిన ద్రవ్య వనరులను ప్రభుత్వమే సమకూర్చి వచ్చే రాబడిని ప్రభుత్వమే ప్రత్యక్షంగా పొందును.

2. పబ్లిక్ కార్పొరేషన్‌లు : ప్రత్యేకమైన చట్టం ద్వారా పబ్లిక్ కార్పొరేషన్‌లు ప్రభుత్వ యాజమాన్యం క్రింద ఏర్పడతాయి. వీని నిర్వహణకు ప్రభుత్వం డైరెక్టర్ల బోర్డ్‌ను నియమిస్తుంది.

3. ప్రభుత్వ కంపెనీలు : కంపెనీల చట్టం ప్రకారం ప్రభుత్వ కంపెనీలు ఏర్పడతాయి. ఈ కంపెనీలలో ప్రభుత్వం ఏకైక వాటాదారుగా కానీ లేదా ఆధిక్యతగల వాటాదారుగా కానీ ఉండవచ్చు.

4. ఫలనా కాలం : వస్తూత్పత్తికి ఉపయోగించే ముందుగా జరిగే పెట్టుబడికి, తద్వారా జరిగే ఉత్పత్తికి గల కాల విలంబనాన్ని ఫలన కాలం అని అంటారు.

5. సంపూర్ణ ఉద్యోగిత : నిర్ణయించబడిన వేతనం దగ్గర సామర్థ్యం, పనిచేయాలనే కోరిక గల శ్రామికులందరికీ పని కల్పించబడినా దానిని సంపూర్ణ ఉద్యోగిత అని అంటారు.

6. దిగుమతుల ప్రత్యామ్నాయం : ఏ వస్తువులనైతే ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకుంటామో అటువంటి వస్తువులను దిగుమతి చేసుకోవటం మానేసి అటువంటి వస్తువులను వాటికి ప్రత్యామ్నాయంగా దేశంలోనే తయారు చేసుకున్న దానిని దిగుమతుల ప్రత్యామ్నాయం అని అంటారు.

## 16.11. నమూనా ప్రశ్నలు:

వ్యాసరూప ప్రశ్నలు.

1. భారతదేశం ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ ప్రాముఖ్యాన్ని వివరించుము?
2. ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థీకరణ మరియు నిర్వహణ పద్ధతులను పరిశీలింపుము?
3. ప్రభుత్వరంగ సంస్థల ధర నిర్ణయానికి సంబంధించిన వివిధ పద్ధతులను తెలిపి, మనదేశంలో అనుసరించే పద్ధతులను గూర్చి వ్రాయుము?
4. ప్రభుత్వరంగ సంస్థలు ఎదుర్కొనే సమస్యలను తెలుపుము?

సంక్షిప్త ప్రశ్నలు.

1. డిపార్ట్‌మెంటల్ సంస్థలను గూర్చి వ్రాయుము?
2. పబ్లిక్ కార్పొరేషన్‌ల ప్రాముఖ్యం, లోపాలను వివరింపుము?
3. ప్రభుత్వ కంపెనీల గూర్చి వివరింపుము?
4. డాల్టన్ ప్రతిపాదించిన ప్రభుత్వ సంస్థల ధర నిర్ణయ పద్ధతులను వివరించుము?
5. సరళీకృత ఆర్థిక విధానంలో ప్రభుత్వరంగ పాత్రను వివరించుము?

## 16.12. చదువదగిన గ్రంథాలు:


1. Public Enterprises and Economic Development - A.H.Hansen.
2. The Structure of Public Enterprises in India - V.V.Ramanadham.
3. The Public Sector in India - R.K.Hozari & A.N.Oza
4. Public Finance - R.K.Lekhi
5. పబ్లిక్ అర్థశాస్త్రం - తెలుగు అకాడమి.


- డా॥ డి.కైలాసరావు

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము.

**తెలియపరచవలసిన చిరునామా :**

డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్ - 522 510.

| Course | Year | Paper No. & Title |
|---|---|---|
| B.A. | 3rd Year | Paper - III<br>Public Economics |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)